# Pratyēka telaṅgāṇōdyama kavitvaṁ - maulika bhāvanalu

(A Thesis submitted to the University of Hyderabad in partial fulfilment of the Degree of Doctor of Philosophy)


**Researcher**

D.UDAY BHANU

**11HTPH12**

**Department of Telugu**

School of Humanities

University of Hyderabad

Hyderabad-500046

TELANGANA, INDIA


OCTOBER - 2017

# ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం – మౌలిక భావనలు

(పిహెచ్.డి. పట్టాకోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం)


పరిశోధన

**డి.ఉదయ్ భాను**

**11HTPH12**

పర్యవేక్షణ

**ఆచార్య జి.అరుణ కుమారి**

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు – 500046

తెలంగాణ, భారతదేశం.



అక్టోబర్ – 2017

# DECLARATION

I, **D.Uday Bhanu** hereby declare that this Thesis entitled "Pratyeka Telangaanodyama Kavitvam - Moulika Bhaavanalu" Submitted by me under the guidance and supervision of **Prof. G. Arunakumari** is a bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that my thesis can be deposited in Shodganga/ INFLIBNET

Date: **D.UDAY BHANU**

Place: Hyderabad Regd. No.11HTPH12

CERTIFICATE

This is to certify the Thesis entitled **"Pratyeka Telangaanodyama Kavitvam - Moulika Bhaavanalu"** submitted by **Mr.D.Uday Bhanu** bearing **Regd. No.11HTPH12** in partial fulfilment of the requirements for the award of Doctor of Philosophy in the School of Humanities, Department of Telugu is a bonafide work carried out by him under my supervision and guidance.

The thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.

**A. Published in the following publications:**

Parts of this thesis have been: (NOT EXACT PARTS. Issues discussed in the following papers have been presented elaborately in the chapter-2 and chapter-4 of the thesis.)

1. **"Telangana vasthadaa? Raadaa?"**(ISSN 2349 - 2376), 2nd Chapter. Pg.NO.16-18, January 2012. "Nadusthunna Telangaana Maasa Patrika" Edited by Dr. Kaseem, C. Quarter No. R-9, Osmania Quarters, OU, Hyderabad. Telangana. India.
2. **"Gorugaalam samaranaadam 'volleda' "**(ISSN 2349 - 2376), 4th Chapter. Pg.NO.48-53, February 2012. "Nadusthunna Telangaana Maasa Patrika" Edited by Dr. Kaseem, C. Quarter No. R-9, Osmania Quarters, OU, Hyderabad. Telangana. India.

And

**B. Presented in the following conferences:**

(Issues presented in the following papers have been discussed elaborately in the chapter-4 of the thesis.)

1.**"Telangaanapai Aadhipatya Bhaavajaalam : Kavitva Prathiphalanam"** (National), 4th Chapter. By Council for Social Devolopment - Southern Regional Centre, Hyderabad On 30th-31st August, 2012.

2.**"Telangaana Praanteeya Kavitvam - Prapancheekarana Vyatirekata"** (International National), Directed by Dr. Silar Mohammed, M. Department of Telugu, Osmania College(Autonomous), Kurnool, collaboration with Southern Regional Languages Centre, CIIL, Mysore. On 25th-26th October 2014.

Further, the Student has passed the following courses towards fulfillment of coursework requirement for Ph.D./was exempted from doing coursework (recommended by Doctoral Committee) on the basis of the following courses passed during his M. Phil program and the M.Phil degree was awarded.

| Course Code | Name | Credits | Pass/Fail |
|---|---|---|---|
| 1. HT701 | Research Methodology and Basics in Logic | 5.00 | PASS (A) |
| 2. HT702 | History of Telugu Research | 4.00 | PASS (A+) |
| 3. HT703 | Studies in Specialized Area | 3.00 | PASS (A+) |
| 4. HT704 | Broad Field | 4.00 | PASS (A) |
| 5. HT780 | Dissertation | 16.00 | PASS (A) |

**Prof. G. ARUNAKUMARI**
Research Supervisor

**Prof. T. RAMAKRISHNA**
Head, Dept. of Telugu

**Prof.PANCHANAN MOHANTY**
Dean, School of Humanities

# విషయ సూచిక

కృతజ్ఞతలు I – I
ప్రవేశిక II – XI

అధ్యాయం–1

**ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ – సామాజికాంశాలు** 1 - 67

**1.1.** నీరు

**1.2.** వ్యవసాయం

**1.3.** భూమి

**1.4.** విద్య

**1.5.** ఉద్యోగాలు

**1.6.** రాజకీయాలు

**1.7.** పరిశ్రమలు

**1.8.** ఖనిజ వనరులు

**1.9.** గిరిజనులు

**1.10.** బడ్జెట్ కేటాయింపులు

**1.11.** కళా, సాహిత్య, సాంస్కృతిక రంగాలు

**1.12.** భాష

**1.13.** చరిత్ర

**1.14.** హక్కులు

అధ్యాయం – 2

**ప్రత్యేక తెలంగాణ ఉద్యమం – ప్రజా చైతన్యం** 68 - 125

**2.1.** ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు ముందు వెనుక

**2.2.** తొలిదశ

2.3. మలిదశ పూర్వార్ధం

2.4. మలిదశ ఉత్తరార్ధం

అధ్యాయం – 3

**సమాజం – కవిత్వం – సంబంధం** 126 - 139

అధ్యాయం –4

**ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం – మౌలిక భావనలు** 140 - 411

4.1. నీళ్లు

4.2. వ్యవసాయం

4.3. భూమి

4.4. విద్యుత్తు

4.5. ప్రపంచీకరణ

4.6. వలసలు

4.7. విద్య

4.8. వైద్యం

4.9. పరిశ్రమలు

4.10. ఉద్యోగాలు

4.11. భాష

4.12. సాహిత్యం

4.13. కళలు

4.14. సంస్కృతి

4.15. ఆదివాసులు

4.16. ఖనిజ వనరులు

4.17. హైదరాబాద్

4.18. చరిత్ర

**4.19. నిధుల కేటాయింపు**

**4.20. ఒప్పందాలు, జీవోలు, కమిటీలు, కమీషన్‌లు - ఉల్లంఘనలు**

**4.21. పాలకవర్గ రాజకీయాలు**

**4.22. నిర్బంధం - రాజ్యహింస**

**4.23. హక్కులు**

**4.24. అస్తిత్వం - ఆత్మగౌరవం**

**4.25. ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష**

**4.26. ఉద్యమ గమనం**

**4.27. ఎలిజీలు**

**పరిశోధన ఫలితాలు** 412 - 430

**ఉపసంహారం** 431 - 433

**అనుబంధాలు**

**అనుబంధం - 1**

**ఛాయా చిత్రాలు** 434 - 448

1. తొలిదశ ఉద్యమ చిత్రాలు
2. మలిదశ పూర్వార్ధ ఉద్యమ చిత్రాలు
3. మలిదశ ఉత్తరార్ధ ఉద్యమ చిత్రాలు

**అనుబంధం - 2**

**ఇంటర్వ్యూలు** 449 - 491

1. సంగిశెట్టి శ్రీనివాస్
2. డా॥ సి.కాశీం
3. డా॥ పి.వరవరరావు

| | |
|---|---|
| ఉపయుక్త గ్రంథసూచి | 492 - 511 |
| ప్రచురిత పరిశోధన వ్యాసం - 1 | 512 - 517 |
| ప్రచురిత పరిశోధన వ్యాసం - 2 | 518 - 525 |
| పరిశోధన పత్ర సమర్పణ ధృవీకరణ పత్రం - 1 | 526 - 526 |
| పరిశోధన పత్ర సమర్పణ ధృవీకరణ పత్రం - 2 | 527 - 527 |

# కృతజ్ఞతలు

ఈ పరిశోధనలో నాకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన, నామీద ప్రభావం వేసిన పరిచయ ప్రపంచ ప్రజలకు వినమ్రంగా కృతజ్ఞతలు.

# ప్రవేశిక

మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉన్న తెలుగు ప్రజలు, తమిళుల నుండి తమకు సకల రంగాల్లో వివక్ష ఎదురవుతున్నదని, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని నాలుగున్నర దశాబ్దాలు, వివిధ స్థాయుల్లో పోరాటం చేశారు. ఫలితంగా 1953 అక్టోబర్ 1న 'ఆంధ్ర రాష్ట్రం' ఏర్పడింది. మరోవైపు నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పాలనలో ఉన్న హైదరాబాద్ రాష్ట్రం (ఇవాళ్టి తెలంగాణ రాష్ట్రం) 1948 సెప్టెంబర్ 17 పోలీసు చర్య (ఆపరేషన్ పోలో) జరిగిన తర్వాత భారత యూనియన్‌లో భాగం అయ్యింది. 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక భారత పాలకులు పాలనారంగంలో సరికొత్త మార్పులకు శ్రీకారం చుట్టారు. అందులో రాష్ట్రాల పునర్విభజన ఒకటి. ఆంగ్లేయ పాలకులు తమ పరిపాలనా సౌలభ్యం కోసం మొత్తం భారతదేశాన్ని ప్రావిన్సీలు, ప్రెసిడెన్సీలుగా విభజించి ఉన్నారు. ఈ నేపథ్యంలో భారతపాలకవర్గాలు నూతన రాష్ట్రాల ఏర్పాటు కోసం సలహాలూ, సూచనలూ, మార్గదర్శకాలను ఇవ్వమని మొదటి రాష్ట్రాల పునర్విభజన కమీషన్ నియమించింది. పోలీసు చర్య జరిగిన తర్వాత, మొదటి సాధారణ ఎన్నికలు జరిగిన 1952 మధ్య కాలంలో సీమాంధ్ర ఉద్యోగులు తెలంగాణ ఉద్యోగాల్ని మొత్తం కొల్లగొట్టిన అనుభవంలో ఉన్న తెలంగాణ ప్రజలు మొదటి ఎస్సార్సీ ముందు తాము విడిరాష్ట్రంగానే ఉంటామని తెలియజేశారు. కమీషన్ కూడా అదే నివేదిక ఇచ్చింది. కానీ సీమాంధ్ర నాయకులు చేసిన లాబీ కారణంగా, తెలంగాణలోని కొద్దిమంది కాంగ్రెస్ నాయకుల కారణంగా తెలంగాణ ప్రజల భయాందోళనలు పోగొట్టడానికి 'పెద్దమనుషుల ఒప్పందం' చేసుకుని 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించింది. కొత్త రాష్ట్ర ఆవిర్భావ దినం నుండే తెలంగాణ ప్రాంతానికి అన్యాయం జరగడం మొదలైంది (ఉపముఖ్యమంత్రి పదవిని తొలగించడం). పెద్దమనుషుల ఒప్పందంలో చేసుకున్న ఏ నియమమూ ఆచరణలోకి రాకుండా పోయింది. సకల రంగాల్లో తెలంగాణ ప్రాంతం వివక్షకూ, అవమానాలకూ గురైంది. దీని పర్యవసానంగా పన్నెండేళ్ల తర్వాత తెలంగాణ ప్రాంతంలో తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం పురుడుపోసుకున్నది.

తెలుగు నేలమీద 20వ శతాబ్ది ద్వితీయ భాగంలో అస్తిత్వవాద ఉద్యమాలు రూపుదిద్దుకున్నాయి. ప్రాంతీయ, దళిత, స్త్రీ, బీసీ, మైనార్టీ ఉద్యమాలు, వాటి సాహిత్యాలతో తెలుగు సమాజంలోని స్థిరీకరణలో ఉన్న అభిప్రాయాలు, ఆలోచనా చట్రాలు మొత్తం మారిపోయాయి. అస్తిత్వ వాద ఉద్యమాలు ప్రపంచవ్యాప్తంగా అప్పటికే మొదలై ఉన్నప్పటికీ, తెలుగు నేలమీద ఆ ఒరవడి మొదలైంది ప్రత్యేక తెలంగాణ ఉద్యమంతోనే అని చెప్పాలి.

మొట్టమొదట ఖమ్మం జిల్లాలో ఒక చిరు ఉద్యోగి ప్రారంభించిన తెలంగాణ ఉద్యమం, 1990లలో వచ్చిన ప్రపంచీకరణ పర్యవసానాల దుష్పరిణామాల నేపథ్యంలో సైద్ధాంతిక రూపం తీసుకుని, తర్వాత జనసామాన్యంలోకి వెళ్లింది. తెలంగాణ ప్రజలందర్నీ వర్తమానంలో తాము ఎదుర్కొంటున్న సమస్యల గురించి, వాటి మూలాల గురించి, భవిష్యత్తు గురించి ఆలోచించేలా చేసింది. ఫలితంగా అనేక మంది ప్రాణత్యాగాల స్ఫూర్తిని అందుకుంటూ తెలంగాణ సమాజం ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షను ఉద్యమంగా మలిచి, విస్తరింపజేసింది.

సామాజిక సంచలనాలు సాహిత్యంలో కవిసమయాలుగా మారతాయి. తెలంగాణలోనూ అదే జరిగింది. ఏ ప్రజాస్వామిక ఉద్యమం విజయవంతం కావాలన్నా దానికి రెండు సాధనాలు అత్యంత కీలకంగా పనిచేస్తాయి. వాటిలో ఒకటి భౌతిక ఉద్యమం అయితే, రెండవది బౌద్ధిక ఉద్యమం. ఆ క్రమంలోనే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం విస్తరించేకొద్దీ తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను బలపరుస్తూ, విస్తరిస్తూ, మరింత చైతన్యం చేస్తూ విరివిగా సాహిత్యం రావడం మొదలైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతం ఏయే రంగాల్లో వివక్షకు గురైంది, ఎట్లా గురైంది, పరిష్కార మార్గాలేమిటి, తెలంగాణ ప్రజల బాధ్యతలేమిటి, తమను తాము ఎట్లా విముక్తం చేసుకోవాలి అన్న అంశాలతో మొదట పాట, తర్వాత కవిత్వం విరివిగా వచ్చాయి. ఆ తర్వాత కథ, నవల, నాటకం ప్రత్యక్షంగా కొంత, పరోక్షంగా మరికొంత తెలంగాణ ఉద్యమ నేపథ్యాన్ని, అవసరాన్ని ప్రతిఫలించాయి.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి మొదటి నుండి కూడా విద్యార్థులే వెన్నెముకగా ఉంటూ వచ్చారు. ప్రత్యేక తెలంగాణ సాహిత్యం, తెలుగు సాహిత్యంలో నూతన ప్రకంపనలు సృష్టించడం మొదలైన తర్వాత తెలంగాణలోని విశ్వవిద్యాలయ విద్యార్థులు తమ సాహిత్య పరిశోధనలకు పూనుకున్నారు. ఆ క్రమంలోనే తెలంగాణ సాహిత్య చరిత్రను, సామాజిక మూలాలను వెలికితీయడం ప్రారంభించారు. ఈ పరిశోధనా క్రమం విశ్వవిద్యాలయాలకు వెలుపల మొదట ప్రారంభం అయినప్పటికీ, పరిశోధకులు తెలంగాణ సాహిత్య పరిశోధనాంశాలను చేపట్టిన తర్వాత మరింత నిర్ధిష్టతను సంతరించుకున్నది. తెలంగాణలోని తెలుగు శాఖలున్న అన్ని విశ్వవిద్యాలయాల్లో తెలంగాణ సాహిత్యం మీద పరిశోధనలు ఊపందుకున్నాయి.

ఈ క్రమంలో 2008లో నేను హైదరాబాదు విశ్వవిద్యాలయంలో స్నాతకోత్తర విద్యలో చేరాను. సరిగ్గా నేను రెండవ సంవత్సరంలో ఉన్నప్పుడు తెలంగాణ ఉద్యమంలో గుణాత్మక మార్పు వచ్చింది. 1996 నుండే ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములైన నా తల్లిదండ్రుల పెంపకం కారణంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం పట్ల అభిమానం పెంచుకున్న నేను విశ్వవిద్యాలయంలో చేరాక మొదలైన తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొన్నాను. ఈ క్రమంలో తెలంగాణ సాహిత్యాన్ని అధ్యయనం చేయడం మొదలు పెట్టాను. స్వయంగా కవినైన నేను తెలంగాణ కవిత్వం మీద ఇష్టం పెంచుకుని ప్రత్యేకంగా కవిత్వం మీద దృష్టి కేంద్రీకరించాను. ఆ క్రమంలోనే ఎం.ఫిల్.లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కవిత్వం మీద పరిశోధన చేశాను.

ఎం.ఫిల్.లో 'తెలంగాణ కవిత్వం – మౌలిక భావనలు' అనే పరిశోధనాంశాన్ని ఎంచుకుని 2000 నుండి 2010 మధ్య పది సంవత్సరాల కాలంలో వచ్చిన ప్రత్యేక తెలంగాణ కవిత్వం మీద పరిశోధన చేశాను. ఆ క్రమాన్ని కొనసాగించడం కోసమే పీహెచ్.డీ.లో చేరాక 'ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం – మౌలిక భావనలు' అనే పరిశోధనాంశాన్ని ఎంచుకున్నాను. 1968 నుండి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 జూన్ 2 వ తారీఖు మధ్య కాలంలో తెలంగాణ సమాజంలో వెలువడిన కవితా సంపుటులు,

సంకలనాలను పరిశోధనకు స్వీకరించాను. వివిధ పత్రికల్లో, అంతర్జాలంలో, వేరువేరు తలాల్లో వెలువడిన కవిత్వాన్ని వదిలేసి, కేవలం సంపుటులు, సంకలనాలుగా వెలువడిన కవిత్వాన్ని మాత్రమే నా పరిశోధనలో భాగం చేసుకున్నాను. ఇది పరిశోధనా విస్తృతిని దృష్ట్యా చేసింది తప్పితే మరొకటి కాదు. పైగా నేను ఎంపిక చేసుకున్నది కేవలం వచన కవిత్వం మాత్రమే. ఇది నా పరిశోధన పరిధి.

నా పరిశోధనాంశం 'ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం – మౌలిక భావనలు'. 'ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం' అన్న మాటను విస్తృతార్థంలో స్వీకరించాను. ప్రత్యక్షంగా తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడాన్ని ప్రతిపాదించే కవిత్వం మాత్రమే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతం ఎన్ని రకాల వివక్షకు గురైంది, ఎట్లా వివక్షకు గురైంది, దాని మూలంగా ఏర్పడిన పర్యవసానాలేమిటి, వర్తమాన తెలంగాణ సమాజం ఎట్లా ఉన్నది, ఆ సమాజంలోని సమస్యలకు మూలాలు ఎక్కడ ఉన్నాయి, వాటి పరిష్కార మార్గాలేమిటి మొదలైన అంశాలను వ్యక్తం చేసే కవిత్వం కూడా ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వమే అవుతుందని నా భావన. అందుకే పైన వివరించిన అన్ని అంశాలను వ్యక్తం చేసిన కవితలను నా పరిశోధనలోకి తీసుకున్నాను. 'మౌలిక భావనలు' అన్న మాటలో మూడు విభాగాలు ఉన్నాయి. 'మూల' అనే ధాతువుకు 'ఇక' అనే ప్రత్యయం చేరడం కారణంగా 'మౌలిక' అనే పదం ఏర్పడింది. 'భావనల' అంటే ఆలోచనా చిత్రాల సారం. 'మౌలిక భావనలు' అంటే ఒక విషయానికి సంబంధించిన మూల లేద కేంద్ర భావనలు. 'ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం – మౌలిక భావనలు' అనే శీర్షికకు, ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలోని మూల లేదా కేంద్రక భావనలు అని అర్థం. ఇదీ నా పరిశోధనా శీర్షిక సారాంశం.

సమాజం అంటే మానవ సంబంధాల సమూహం అని తాత్వికార్థం. సాహిత్యం సామాజిక చైతన్య నిష్పన్న రూపం. అంటే ఒక సమాజంలోని మనుషులు తమ జీవిత గమనంలో తెలుసుకున్న, అర్థం చేసుకున్న, అనుభవాల జ్ఞానం కళాత్మకంగా వెలువడిన రూపమే సాహిత్యం. తెలంగాణ సమాజం వెనుకబాటుకు గురికావడం, దానికి మూల

కారణాల్ని అన్వేషించడం, దాని నుండి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటే పరిష్కార మార్గం అని నిర్ధారణకు రావడం తెలంగాణ సమాజ చైతన్యం. అది కవిత్వంలో ఎట్లా ప్రతిఫలించిందో చెప్పడమే ఈ పరిశోధన లక్ష్యం. పైగా భావోద్రేకాల వేగం దృష్ట్యా, నిడివి వలనా కవిత్వం మిగతా సాహిత్య ప్రక్రియలకన్నా ముందు వెలువడుతుంది. నవలవలె కాకున్నా అనేక జీవిత పార్శ్వాలను సూక్ష్మస్థాయిలో పట్టుకుని కళాత్మకంగా వివరిస్తుంది. తెలంగాణ కవులు తెలంగాణ సమాజాన్ని ఎట్లా అర్థం చేసుకున్నారు, తమ చారిత్రక మూలాలకు సంబంధించి వారికి కలిగిన జ్ఞానమేమిటి, దానిని వాళ్లు ఎట్లా తర్కించారు, ఎట్లా వర్ణించారు అన్నది ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కవిత్వంలో నిక్షిప్తం అయ్యింది. కనుక ఈ పరిశోధన చేయడం కారణంగా తెలంగాణ ప్రజల ఆకాంక్షల్లోని ఆత్మను వెలికితీయడం, దానిని సాధారణీకరించడం, సూత్రాలుగా రూపొందించి ప్రతిపాదనలుగా నిలబెట్టడం చేయవచ్చు. ఇదీ ఈ పరిశోధన ప్రయోజనం.

పరిశోధనాంశాన్ని స్వీకరించిన తర్వాత గతంలో ఇదే పరిశోధనాంశం మీద ఏవైనా విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు జరిగాయా అని తెలుసుకునే ప్రయత్నం చేశాను. తెలంగాణా కవుల కవిత్వం మీద, కథల మీద, నవలల మీద, పాటల మీద వివిధ విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు జరిగాయి. కానీ నేను పరిశోధనాంశాన్ని విశ్వవిద్యాలయంలో అధికారికంగా నమోదు చేసుకునే సమయానికి ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం మీద ఏ విశ్వవిద్యాలయంలో పరిశోధన జరగలేదని తెలుసుకున్నాను. విశ్వవిద్యాలయాలకు వెలుపల ఈ అంశం మీద కొంతమేర ప్రయత్నాలు జరిగాయి. ప్రత్యేక తెలంగాణోద్యమ కవితా సంకలనాలూ, సంపుటులకు రాసిన ముందుమాటల్లో ప్రాథమిక స్థాయిలో ఈ కృషి కనిపిస్తుంది. అట్లే డా॥సి.కాశీం రాసిన 'తెలంగాణ సాహిత్యం', గుడిపాటి రాసిన 'అభివ్యక్తి', బన్న ఐలయ్య రాసిన 'తెలంగాణ సాహిత్య సాంస్కృతిక చైతన్యం', రాచపాళెం చంద్రశేఖరరెడ్డి రాసిన 'కవుల తెలంగాణం', సుంకిరెడ్డి నారాయణరెడ్డి రాసిన 'ఆధునిక తెలంగాణ సాహిత్య చరిత్ర', కాసుల ప్రతాపరెడ్డి రాసిన 'కొలుపు', విప్లవ రచయితల సంఘం ప్రచురించిన 'ప్రజా తెలంగాణ', ఆచార్య రవ్వా శ్రీహరి సంపాదకత్వం వహించిన 'తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర', నందిని

సిధారెడ్డి రాసిన 'ఇగురం', నడుస్తున్న తెలంగాణ మాస పత్రికలో ప్రచురితమైన వ్యాసాలు మొదలైన వాటిల్లో ఈ ప్రయత్నం కొంతమేర కనిపిస్తుంది. కానీ పూర్తిస్థాయిలో, ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలోని భిన్నమైన పార్శ్వాలను పరిశోధించే పని విశ్వవిద్యాలయ స్థాయిలో జరిగింది మాత్రం లేదు.

పరిశోధనాంశాన్ని స్వీరించిన తర్వాత తెలంగాణలోని పదిజిల్లాలను పర్యటించాను. 1969 ఉద్యమంలో పాల్గొన్న కవుల దగ్గరి నుండి 2009 ఉద్యమంలో పాల్గొన్న కవులదాకా చాలామందిని కలిశాను. వారు వెలువరించిన కవితా సంపుటులును, సంపాదకత్వం వహించిన సంకలనాలను సేకరించాను. వారి దగ్గర ఉన్న ఇతర తెలంగాణ కవులు కవిత్వాన్ని కూడా సేకరించాను. మొత్తంగా 1968 తర్వాతి కాలంలో వెలువడిన తెలంగాణ కవులందరి కవితా సంకలనాలూ, సంపుటులను సేకరించాను. ఇదే క్రమంలో తెలంగాణలోని ప్రముఖ పుస్తక కేంద్రాలకు వెళ్లి, తెలంగాణ చరిత్ర, రాజకీయార్థిక రంగం, సంస్కృతి, భాష, కళలు, సాహిత్యం, విమర్శ మొదలైన రంగాలలో వెలువడిన సాహిత్యాన్ని కూడా సేకరించాను. అస్తిత్వవాద తాత్త్వికతను అర్థం చేసుకోవడం కోసం సిద్ధాంత గ్రంథాల్ని కూడా సేకరించాను. వివిధ విశ్వవిద్యాలయాలకు వెళ్లి తెలంగాణ సాహిత్యం మీద వెలువడిన అనేక పరిశోధన గ్రంథాల్ని జిరాక్స్ కాపీలు తీసుకున్నాను. ఇది నేను పరిశోధనా సామగ్రిని సేకరించిన పద్ధతి.

సేకరించిన సమాచారంలో మొదట సైద్ధాంతిక అవగాహన కలిగించే గ్రంథాల్ని అధ్యయనం చేశాను. తర్వాత తెలంగాణ చరిత్రను, రాజకీయార్థిక శాస్త్రాన్ని, కళలను, సంస్కృతినీ, భాషను, సాహిత్యాన్ని, విమర్శను అధ్యయనం చేశాను. స్థూలంగా తెలంగాణలోని విభిన్నమైన సామాజిక రంగాల చరిత్రపట్ల ఒక అవగాహనకు వచ్చాను. ఆ తరువాత తెలంగాణ కవితా సంకలనాలను, సంపుటులను ఆమూలాగ్రం చదివాను. ఆయా సంకలనాలూ, సంపుటులకు ఉన్న ముందు మాటల్ని సామాజిక పరిణామ క్రమం నుండి అర్థం చేసుకున్నాను. ఆ తరువాత పరిశోధ గ్రంథం రాయడానికి ఒక ప్రణాళిక రూపొందించుకున్నాను. పరిశోధనా గ్రంథంలో మొదట ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణను

బలవంతంగా విలీనం చేసిన క్రమాన్నీ, ఆ తర్వాత తెలంగాణలో ఏర్పడిన సామాజిక పరిస్థితుల్ని చెప్పి, ఆ తర్వాత ప్రత్యేక తెలంగాణ ఉద్యమ చరిత్రను వివరించి, తర్వాత సమాజం సాహిత్యంగా, కవిత్వంగా పరిణామం చెందే క్రమాన్ని వివరించి, ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కవిత్వాన్ని వివరించాలనుకున్నాను.

ఈ పరిశోధనా గ్రంథంలో మొత్తం నాలుగు అధ్యాయాలు ఉన్నాయి. ఆయా అధ్యాయాల్లో ఉన్న సారాంశం క్రమానుగతంగా ఇట్లా ఉన్నది.

మొదటి అధ్యాయం 'ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ – సామాజికాంశాలు'. ఇందులో రెండు విభిన్నమైన చారిత్రక నేపథ్యం కలిగిన రెండు తెలుగు ప్రాంతాలను కలిపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఎట్లా ఏర్పరిచారు, ఆ క్రమంలో చేసుకున్న ఒప్పందాలేమిటి, వెనుకబడిన తెలంగాణకు ఇచ్చిన రక్షణలేమిటి, ఆచరణ క్రమంలో కాలానుగతంగా అవి ఎట్లా నీటిమీది రాతలుగా మారుతూ వచ్చాయో వివరించాను. అదే సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భాగమైన తర్వాత తెలంగాణలోని వివిధ సామాజిక రంగాల్లో ఎట్లా వివక్ష కొనసాగింది, ఎటువంటి ఆధిపత్య భావనలు అమలయ్యాయి, ఏయే రకమైన వివక్షలు చోటుచేసుకున్నాయి, వాటి పర్యవసానంగా తెలంగాణలో ఎటువంటి పరిస్థితులు ఏర్పడ్డాయి అనేది విడివిడిగా చర్చించాను.

రెండవ అధ్యాయం 'ప్రత్యేక తెలంగాణ ఉద్యమం – ప్రజా చైతన్యం'. ఇందులో ప్రత్యేక తెలంగాణ ఉద్యమ చరిత్రను పొందుపర్చాను. ఏ ఉద్యమమైనా సామాజిక స్థాయిని కలిగి ఉంటుంది కనుక, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోని కీలకమైన ఘట్టాలను, అవి సమాజం మీద వేసిన ప్రభావాన్ని, వ్యక్తులను, సంస్థలను, సంఘాలను, పోరాట క్రమాన్ని కాలక్రమంలో నిక్షిప్తం చేశాను. 1968 సంవత్సరాంతం నుండి 2014లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడేదాక నడిచిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సంక్షిప్త చరిత్రను ఈ అధ్యాయంలో పొందుపర్చాను.

మూడవ అధ్యాయం 'సమాజం – కవిత్వం – సంబంధం'. ఇందులో సమాజ సాహిత్య సంబంధాలను చారిత్రకంగా వివరిస్తూ, సమాజం కవిత్వంగా పరిణామం చెందే క్రమాన్ని చెప్తూ, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ప్రత్యేక తెలంగాణ కవిత్వంగా ప్రతిఫలించిన విధానాన్ని శాస్త్రీయంగా విశ్లేషించాను.

నాలుగవ అధ్యాయం 'ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం – మౌలిక భావనలు'. ఈ అధ్యాయంలో ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలోని మౌలిక భావనల్ని వివరిస్తూ, వాటికి కవితా భాగాల్ని ఉదహరిస్తూ పోయాను. ఒక్కొక్క మౌలిక భావనలోని భిన్నమైన పార్శ్వాలను వ్యక్తం చేసే ఉప భావనలకు విడివిడిగా కవితల్ని ఉదహరించాను. ఉదాహరణకు ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో తెలంగాణకు నీటి విషయంలో జరిగిన అన్యాయంలో అనేక ఉపాంగాలు ఉన్నాయి. నదుల నీటి వాటా విషయంలో జరిగిన అన్యాయం, ప్రాజెక్టులు కట్టడంలో చేసిన అన్యాయం, కట్టకుండా వదిలేయడంలో చేసిన అన్యాయం, నిజాం కాలంలో నిర్మించబడిన చెరువుల్ని పూడిక తీయకుండా వదిలేయడం కారణంగా జరిగిన అన్యాయం, భూగర్భ జలాలను తగ్గించిన సీమాంధ్ర వ్యాపారవేత్తల ఇసుక మాఫియా చేసిన అన్యాయం మొదలైనవి తెలంగాణకు నీళ్ల విషయంలో జరిగిన అన్యాయాలు. స్థూలంగా నీళ్ల విషయంలో అన్యాయం జరిగినా పైన తెలిపినవన్నీ వివిధ ఉపాంగాలు. కనుక నీటి సమస్య ఒక మౌలిక భావనగా చెప్తూనే, వాటిలోని వివిధ ఉపాంగాలను వివరించే కవితా భాగాల్ని కూడా ఉదహరించాను. ఇట్లా అన్ని మౌలిక భావనలకు ఉన్న భిన్నమైన పార్శ్వాలను వ్యక్తం చేసే ఉపాంగాలకు కవితల్ని ఉదహరించాను.

'పరిశోధన ఫలితాలు' అనే విభాగంలో, ఈ పరిశోధన ద్వారా వెలికితీసిన నూతన అంశాలను పొందుపరిచాను.

ఉపసంహారంలో పరిశోధన సారాన్ని సంగ్రహంగా తెలియజేశాను. నాలుగు అధ్యాయాల సారాన్ని క్లుప్తంగా వివరించాను. భవిష్యత్తులో ప్రత్యేక తెలంగాణోద్యమ

కవిత్వం మీద చేయదగిన పరిశోధనలను అంశాలవారీగా విడివిడిగా సూచించాను.

తెలంగాణ ఉద్యమంలో కీలక ఘట్టాలకు సంబంధించిన, ఉద్యమ నాయకులకు సంబంధిచిన, ఉద్యమంలో ప్రాణాలను అర్పించిన వ్యక్తులకు సంబంధించిన ఛాయాచిత్రాలను మొదటి అనుబంధంగా చేర్చాను. వీటిని పరిచయస్తుల దగ్గరి నుండి సేకరించాను కాబట్టి, ఆధారాలను పేర్కొనలేదు.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక భాగస్వాములవుతూ, నాయకత్వం వహిస్తూ, ప్రజారాశుల్ని చైతన్యం చేసి ఉద్యమంలోకి కదిలిస్తూ, కవిత్వం రాస్తూ, తెలంగాణ సాహిత్య చరిత్ర నిర్మాణంలో విశేషమైన కృషి చేస్తూ ఉన్న ప్రముఖమైన వ్యక్తుల ముఖాముఖి సమావేశాల (ఇంటర్వ్యూ) పూర్తి పాఠాలను రెండవ అనుబంధంగా చేర్చాను. వారి ఇంటర్వ్యూలు చేయడం కోసం తయారు చేసుకున్న ప్రశ్నావళిని కూడా ఇందులో జతపరిచాను. అయితే ఇక్కడ గమనించవల్సిన విషయం ఒకటి ఉన్నది. ఇంటర్వ్యూల్లో, ఇంటర్వ్యూ ఇచ్చిన వ్యక్తుల వ్యక్తీకరణ పద్ధతిని, క్రమాన్ని, భాషను ఏమాత్రం మార్చకుండా ఉన్నది ఉన్నట్లు చేర్చాను. ఇలా చేయడానికి, వారి ఉద్దేశాలను ఏమాత్రం దెబ్బతినకుండా చూడటం, సహజంగానే ఉంచాలనే లక్ష్యం ఉన్నది.

ఉపయుక్త గ్రంథసూచిలో పరిశోధనకు ప్రత్యక్షంగా (పరిశోధనలో ఉటంకించిన) ఉపకరించిన గ్రంథాల, పరోక్షంగా (పరిశోధన చేయడానికి అవగాహన అందించిన) సహాయపడిన గ్రంథాల వివరాలను అకారాది క్రమంలో చేర్చాను. ఈ ఉపయుక్త గ్రంథసూచిలో కొన్ని సమస్యలు ఉన్నాయి. కొన్ని పుస్తకాలలో ప్రచురణ కాలం, రచయితలు / కవుల పేర్లు, ప్రచురణ సంస్థల / సంఘాల పేర్లు, సంపాదకుల పేర్లు లేవు. వాటికి సంబంధించిన వివరాలు ఉన్నంతలో రాయడం జరిగింది. పరిశోధనా గ్రంథంలోని అధ్యాయాల్లో ఉటంకించిన కవితా పంక్తులకు కూడా ఇదే వర్తిస్తుంది.

పరిశోధనా గ్రంథం చివర్లో, ప్రచురితరమైన రెండు పరిశోధనా వ్యాసాల జిరాక్స్

ప్రతులను జతచేశాను. అదే విధంగా రెండు జాతీయ సదస్సుల్లో పత్ర సమర్పణ చేసినందుకుగానూ పొందిన సర్టిఫికేట్ల జిరాక్స్ ప్రతులను జతచేశాను.

ఈ పరిశోధనలో 'సంపా' అని ప్రయోగించిన చోటల్లా 'సంపాదకుడు / సంపాదకురాలు' అని అర్థం చేసుకోవాలి.

ఈ పరిశోధనలో ఉటంకించిన కవితలు, పేరాల్లో అక్కడక్కడా భాషాదోషాలున్నట్లు కనిపిస్తున్నాయి. కవులు, రచయితలు వాడుక భాషా వినియోగానికి ఇచ్చిన ప్రాధాన్యతను గుర్తించి వాటిని మార్చకుండా, యధాతథంగా ఉటంకించాను. అయితే, స్వయంగా కవులు, రచయితలు ఉద్దేశించని లేఖన దోషాలను మాత్రం సవరించాను. ఇంటర్వ్యూలలో కూడా ఇదే పద్ధతిని అనుసరించాను. వారు వినియోగించిన భాషను యధాతథంగా పరిశోధనలో చేర్చాను.

ఈ పరిశోధనలో 'అమెరికన్ సైకలాజికల్ అసోసియేషన్'(American Psychological Style sheet) శైలిని అనుసరించాను.

ఈ పరిశోధనలో ఉటంకిచిన సాహిత్య విమర్శకుల, సాహిత్య చరిత్రకారుల, రాజకీయవేత్తల, తత్వవేత్తల, కవుల / కవయిత్రుల, రచయితల / రచయిత్రుల పేర్లను, సర్వనామాలను ఏకవచనంలో సంబోధించడం జరిగింది. అది ఒక పరిశోధకుడి దృక్పథం నుండి చేసిన పని మాత్రమే తప్పితే వారి పట్ల ఎటువటి తృణీకార భావన లేదని గమనించాలి.

**అధ్యాయం - 1**

# ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ - సామాజికాంశాలు

1953 అక్టోబర్ 1న మద్రాసు రాష్ట్రం నుండి విడిపోయి ఏర్పడిన ఆంధ్రరాష్ట్రం, నిజాం ఏలుబడిలో ఉంటూ 1948లో పోలీస్ చర్య జరిగిన తర్వాత భారత యూనియన్‌లో కలిసిన తెలంగాణ రాష్ట్రమూ కలిసి 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడింది. ఈ ఏర్పాటు అన్యాయాల పునాది మీద జరిగినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. వాస్తవానికి హైదరాబాద్ రాష్ట్రం (తెలంగాణ), ఆంధ్ర ప్రాంతాలు చారిత్రకంగా ఏనాడూ కలిసి లేవు. కానీ కేవలం భాషా ప్రాతిపదికన ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు జరిగింది. రెండు రాష్ట్రాల ప్రజల జీవన విధానం, చరిత్ర, ఆలోచనా సరళి, రాజకీయాలు, సామాజిక, ఆర్థిక, సాంఘిక పరిస్థితులు ఏవీ పట్టించుకోకుండా ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు కావడంవల్ల మానసికంగా తెలుగువాళ్లమైన మనందరం ఒక్కటే అనే భావన ప్రజల్లో కలుగలేదు. దీనికి సుదీర్ఘమైన నేపథ్యం కూడా ఉన్నది. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల కలయిక చరిత్రను స్థూలంగానైనా అవలోకనం చేయాల్సి ఉన్నది.

ఆంగ్లేయ పాలనలో ఉన్న భారత దేశం, వారి పరిపాలనా సౌలభ్యంకోసం 564 సంస్థానాల మినహాయింపుతో ప్రావిన్సీ, ప్రెసిడెన్సీలుగా విభజితమైంది. 564 సంస్థానాల్లో నిజాం పాలిత హైదరాబాద్ రాష్ట్రం కూడా ఒకటి. అది హైదరాబాదు నగరంతోపాటు తెలుగు మాట్లాడే ఎనిమిది తెలంగాణ జిల్లాలు, ఐదు మరాట్వాడా జిల్లాలు, మూడు కన్నడ జిల్లాలు– మొత్తం పదహారు జిల్లాలతో కూడిన విశాల సంస్థానం. నిజాం రాజుల పాలనలో నిరంకుశ పాలన, జాగీర్దారీ, భూస్వామ్య వ్యవస్థ, కేవలం 3–5 శాతం మాత్రమే అక్షరాస్యత, గ్రామీణ ప్రజానీకంపై రజాకార్ల దురాగతాలు ఇవన్నీ ప్రజా జీవితాన్ని విచ్ఛిన్నం చేశాయి. కనీసం తెలుగువాళ్లు తెలుగులో మాట్లాడే పరిస్థితిగానీ, తెలుగు సంస్కృతిలో జీవించే అవకాశంగానీ ఆనాడు లేవు. దీంతో అణచివేతల నడుమ తెలంగాణ ప్రాంత ప్రజలు పోరాటాన్ని ఎంచుకున్నారు. "నిజాం పాలనలో తెలుగు భాషా సంస్కృతులకు

గౌరవం కల్పించడం కోసం 1920లలో ప్రారంభమైన ఉద్యమం అవగాహనలోనూ, ప్రజా భాగస్వామ్యంలోనూ విస్తృతమవుతూ వచ్చి 1940ల నాటికి ప్రజా చైతన్యానికి ఇరుసు భూమి సమస్య అని గుర్తించింది. అప్పటి నుంచి 'భూమి, భుక్తి, విముక్తి' అనేది నినాదమైంది" (వేణుగోపాల్, ఎన్. 2009 : 117). మూల కారణాన్ని కనుగొన్న ఆనాటి రైతాంగం విముక్తిని సాధించడంకోసం సాయుధ పోరాట మార్గాన్ని ఎంచుకున్నది. మూడు వేల గ్రామాల్లో పదిలక్షల ఎకరాల భూమి దున్నేవారి హస్తగతమైంది. క్రమక్రమంగా ఈ పోరాటం మొత్తం భారత దేశాన్ని విముక్తి చేసే దిశగా సాగింది. భూస్వాములు, జాగీర్దార్లు గ్రామాలను విడిచి పట్టణాలకు పారిపోయారు. వారంతా కాంగ్రెస్‌కు సంబంధించిన నాయకులే. వాళ్లంతా నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్ ముందు, నెహ్రూ ముందు తమ గోడును వెళ్లబోసుకున్నారు. మరోవైపు అంతర్జాతీయంగా చైనాలో చాంగ్‌కైషేక్ నడుపుతున్న కొమింగ్‌టాంగ్ ప్రభుత్వ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా, మావో సేటుంగ్ నాయకత్వంలో ఎర్రసైన్యం యెనాన్ నుంచి బీజింగ్‌వైపు చైనా విముక్తి దిశగా సాగుతున్నది. ఈ పరిణామాలను గమనించిన నెహ్రూ ప్రభుత్వం, సరిగ్గా భారతదేశంలోని తెలంగాణ రైతాంగ ఉద్యమాన్ని కూడా పరిశీలించి, పరిస్థితి ప్రజాసైన్యం చేతుల్లోకి వెళుతున్నదని, భవిష్యత్తులో ప్రజాప్రభుత్వం ఏర్పడబోతున్నదని గ్రహించి, వెంటనే పోరాటాన్ని అణగదొక్కాలనుకున్నది. 1948 సెప్టెంబర్ 13న హైదరాబాదు సంస్థానంలో జె.ఎన్.చౌదరి నాయకత్వంలో సైన్యాన్ని దించింది. ఐదు రోజుల్లో మిలటరీ బలగాలు సైనిక చర్యను పూర్తి చేశాయి. దీనికే ఆపరేషన్‌పోలో అని పేరు. అట్లా ప్రపంచ దృష్టినే ఆకర్షించిన రైతాంగ సాయుధ పోరాటం అణచివేతకు గురై, ప్రజల ఆశలు నీరుగారిపోయాయి. వేలాదిమంది అమాయక ప్రజలు, పోరాట యోధులు ప్రాణాలు కోల్పోయారు. దాదాపు రెండువేలమంది ముస్లింలు రజాకార్ల పేర ఊచకోతకోయబడ్డారు. అయినా కమ్యూనిస్టు పార్టీ సారథ్యంలో నడుస్తున్న రైతాంగ పోరాటం వెంటనే తన పోరాటాన్ని విరమించలేదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వ అణచివేత తీవ్రతను గమనించిన కొద్దిమంది కమ్యూనిస్టు పార్టీ నాయకులు, పార్టీలో అంతర్గతంగా, పోరాటాన్ని విరమిద్దామనే వాదన మొదలు పెట్టారు. వారి కోరిక వెంటనే నెరవేరకపోయినా, 1951కల్లా ఈ వాదన చేస్తున్న వారే మెజార్టీ అవ్వటం కారణంగా అదే సంవత్సరం పోరాటాన్ని తాము పోరాటాన్ని

విరమిస్తున్నట్లు, ఎన్నికల్లో పోటీ చేయబోతున్నట్లు పార్టీ ప్రకటించింది. ఈ చర్య ద్వారా ఒకరకంగా కమ్యూనిస్టు పార్టీ కూడా తెలంగాణ ప్రజలకు మోసం చేసిందనే చెప్పాలి.

భారత ప్రభుత్వం, ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ రెండూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి విద్రోహం చేసిన తర్వాత 1952 వరకు హైదరాబాద్ రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు జరగలేదు. 1948 నుంచి 1952 వరకు ఈ ప్రాంతాన్ని సివిల్ అడ్మినిస్ట్రేటర్స్ పాలించారు. ఈ నాలుగు సంవత్సరాలలో వేలాదిమంది ఉద్యోగులు ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుండి హైదరాబాద్ రాష్ట్రంలోకి వచ్చి ఉద్యోగాలు పొందారు. తెలుగేతర పాలకులు ఆంధ్రా ప్రాంతపు ఉద్యోగులను ఇక్కడి ఉద్యోగాల్లో చేరే అవకాశాలను కల్పించారు. 1919లో ఒకమారు, 1930లో మరొకమారు మీర్ ఉస్మాన్ అలీఖాన్ ముల్కీ నిబంధనలకోసం ఒక ఫర్మానా జారీ చేసి స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని ముందే హెచ్చరించి ఉన్నాడు కూడా. “ఈ ఫర్మానా ప్రకారం హైదరాబాదు రాష్ట్రంలో జన్మించినవారు మాత్రమే ముల్కీలు. వీరేగాక ఇంకా ఎవరైనా గత 15 సంవత్సరాలనుండి వరుసగా హైద్రాబాదు రాష్ట్రంలో నివసిస్తూ తిరిగి వెనక్కి వెళ్లే ఆలోచన లేనివారు కూడా ముల్కీలేనని చెప్పారు”(శోభాగాంధి. 2010 : 9). అప్పట్నుంచి హైద్రాబాద్ రాష్ట్రంలో ముల్కీ నిబంధనలు అమలవుతుండేవి. ఈ ముల్కీ నిబంధనలను తుంగలో తొక్కుతూ, తప్పుడు ముల్కీ సర్టిఫికెట్లు సృష్టించుకుని ఇక్కడి ఉద్యోగాల్లో తప్పుడు మార్గాల ద్వారా చేరారు. దాంతో తెలంగాణ ప్రజల్లో నిరుద్యోగం పెరిగింది. పైగా తాము తప్పుడు పద్ధతిలో వచ్చామన్నది మరిచి స్థానిక ఉద్యోగులపై అధికారం చెలాయించడం మొదలు పెట్టారు. తాము హైద్రాబాద్ రాష్ట్ర ప్రజల్ని ఉద్ధరించడానికి వచ్చిన సంస్కర్తల్లా ప్రవర్తించారు. ఇంకా వారు ఇక్కడికి అదనంగా తెచ్చింది లంచగొండితనం. అంతకుముందులేని, కేవలం ఆంధ్రోద్యోగుల వెంటవచ్చిన వ్యవస్థ అది. ఒకవైపు ఈ నిరుద్యోగం, ఇంకోవైపు ఆంధ్రోద్యోగుల పెత్తనం, లంచగొండితనం కూడా ఇక్కడి ప్రజలను ఆగ్రహానికి గురిచేశాయి. “ఆంధ్రా ప్రాంతం నుండి ‘మిడుతల దండులా’ వచ్చిన వారికి వ్యతిరేకంగా ‘గైర్‌ముల్కీ గో బ్యాక్ ఉద్యమం’ ప్రారంభమైంది” (శోభాగాంధి. 2010 : 14). మొత్తంగా చూసినప్పుడు తెలంగాణ ప్రజలకు ఆంధ్రా వాళ్లంటే ఒక ఏహ్యాభావం ఏర్పడింది.

మరోవైపు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో సకల రంగాల్లో వివక్షను ఎదుర్కొన్న ఆంధ్ర ప్రజలు తెలుగు ప్రజలం విడిగా ఉంటామని ఆంధ్రరాష్ట్రంకోసం ఉద్యమించారు. "భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ముందు, కోస్తాంధ్రగా పేరుపడిన మద్రాసు ప్రెసిడెన్సీ సీడెడ్ జిల్లాలు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం 1950లో వినతి చేశారు. ఉద్యోగాల్లో, పారిశ్రామిక రంగంలో తమిళుల ఆధిపత్యాన్ని, ఆంధ్ర ప్రాంతం పట్ల ప్రదర్శిస్తున్న వివక్షను కారణాలుగా చూపి ఈ జిల్లాలు ప్రత్యేక రాష్ట్రం కావాలని డిమాండ్ చేశాయి" (లోకేందర్ రెడ్డి, ఎ. 2004 : 13). పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం నిరాహార దీక్ష చేపట్టాడు. అప్పటి ప్రధానమంత్రి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటును అంగీకరించాడు. కానీ మద్రాసు రాజధానిగా కలిగిన ఆంధ్ర రాష్ట్రం కావాలని దీక్షను కొనసాగించిన పొట్టి శ్రీరాములు మధ్యలోనే ప్రాణాలు కోల్పోయాడు. (మలిదశ ఉత్తరార్ధ ప్రత్యేక తెలంగాణోద్యమ సమయంలో సమైక్యాంధ్ర వాదులు, పొట్టిశ్రీరాములు తెలుగు జాతి ఐక్యతకోసం ప్రాణాలు అర్పించాడని మాట్లాడారు. కానీ వాస్తవమిది). 1953 అక్టోబర్1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం అవతరించింది. ఇక్కడ గుర్తించాల్సిన విశేషం ఏమిటంటే ఆంధ్రరాష్ట్రానికి కేంద్రంగా ఉన్న విజయవాడను కాదని కర్నూలును రాజధానిగా చేయడం వెనుక కూడా ఒక ఉద్దేశం ఉన్నది. శ్రీబాగ్ ఒడంబడికను ఉల్లంఘించిన ఆంధ్రులకు రాయలసీమ నుంచి ప్రతిఘటన ఎదురు కావచ్చన్న ఉద్దేశంతోనూ, ఎలాగూ తాత్కాలికమే కదా అనే భరోసాతోనూ కర్నూలును రాజధాని చేశారు. కానీ కర్నూలులో ప్రభుత్వ నిర్వహణకు భవనాలు లేనందువల్ల డేరాల్లోనే సమావేశాలు నిర్వహించవల్సి వచ్చేది.

ఆంధ్రరాష్ట్రం ఏర్పడగానే అక్కడి రాజకీయ నాయకత్వం, సంపన్న వర్గాలు ఆంధ్రరాష్ట్రాన్ని హైద్రాబాద్‌తో కలిపి విశాలాంధ్రప్రదేశ్‌ను ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను ముందుకు తెచ్చారు. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడటం, తర్వాత ఆంధ్రుల కొత్త డిమాండ్– వీటితో దేశవ్యాప్తంగా ప్రత్యేకరాష్ట్ర ఉద్యమాలు తలెత్తాయి. తెలుగు నేలమీద ఉన్న ప్రత్యేక పరిస్థితి మినహాయించి దేశవ్యాప్తంగా ఈ ఉద్యమాలు తలెత్తడానికి ఉన్న ప్రధాన కారణం ఏమిటంటే ఒక ప్రజాసమూహపు సంస్కృతి, చరిత్ర, రాజకీయాలు మొదలైనవాటితో సంబంధం లేకుండా ఆంగ్లేయ పాలకులు కేవలం తమ పాలనా

సౌలభ్యం దృష్ట్యానే ఏర్పాటు చేసిన ప్రావిన్సీ, ప్రెసిడెన్సీల విధానం ప్రజల మధ్య అసమ అభివృద్ధికి దారితీసింది. దాంతో 1953 సంవత్సరాంతంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల పునర్విభజన కమీషన్ వేసి, దేశవ్యాప్తంగా ఉన్న పరిస్థితులను అధ్యయనం చేసి, రాష్ట్రాల పునర్నిర్మాణానికి అవసరమైన ప్రాతిపదికలను, అభిప్రాయాలను తెలియజేయమని కోరింది. దీన్నే మొదటి ఎస్సార్సీ అంటారు. కమీషన్ హైద్రాబాద్ రాష్ట్రంలోనూ, ఆంధ్రరాష్ట్రంలోనూ పర్యటించి అనేక అభిప్రాయాలను క్రోడీకరించింది. కమిషన్ ముందు హైదరాబాద్ ప్రజలు తమను ప్రత్యేక రాష్ట్రంగానే ఉంచాలని కోరగా, కోస్తాంధ్ర సంపన్నవర్గాలు మాత్రం ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేయాలనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఇందుకు అంతర్గతంగా బలమైన కారణాలు ఉన్నాయి. “విశాలాంధ్ర నినాదాన్ని ప్రధానంగా బలపర్చింది కోస్తాంధ్ర సంపన్నవర్గాలు. ఈ డిమాండును లేవనెత్తడానికి భాషాపరమైన సెంటిమెంట్లు ఉన్నాయి. లేవని కాదు. కాని వాటితోపాటు దిగువ పేర్కొన్న నాలుగు కారణాలు విశాలాంధ్ర నినాదం తలెత్తడానికి దారితీసాయి.

1.అప్పటికి ఆంధ్ర రాష్ట్రంలో రెవెన్యూ తక్కువగా ఉండేది. మద్యపాన నిషేదం వలన, భూమిశిస్తు తప్ప వేరే రెవెన్యూ మార్గాలు లేక తగినంత ఆదాయం సమకూర్చుకోలేక పోయింది. బడ్జెట్ లోటు ఉండేది. తెలంగాణకు ఆదాయ వనరులు ఎక్కువ. మిగులు నిధులు ఉండేవి. ఆంధ్రలో తలసరి రెవెన్యూ ఆదాయం 17 రూపాయలు. కోస్తాంధ్ర అభివృద్ధికి తెలంగాణ మిగులు నిధులు ఉపయోగించుకోవచ్చునన్న ఆలోచనతోనే విశాలాంధ్ర నినాదాన్ని లేవనెత్తారు.

2. కోస్తాంధ్రకు జలవనరులను అందిస్తున్న కృష్ణా, గోదావరి నదీ జలాలపై ఆధిక్యతను సాధించాలంటే తెలంగాణను కలుపుకొని ఉమ్మడి రాష్ట్రం ఏర్పాటు చేయక తప్పదని గ్రహించారు.

3. అప్పటికి ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని నగరం లేదు. రాజధాని నగరం విషయమై తీవ్రమైన తగాదాలు తలెత్తాయి. వాటిని పరిష్కరించుకోవడానికి తెలంగాణను ఆంధ్రలో

కలుపుకొని హైదరాబాదును రాజధానిగా మార్చుకోవాలనుకున్నారు.

4. కోస్తాంధ్ర వికాసానికిగాను కావలసిన బొగ్గు, ఖనిజ సంపద ఉమ్మడి రాష్ట్రంలోనే సాధ్యమని గ్రహించి విశాలాంధ్ర నినాదాన్నిచ్చారు" (కోదండరామ్, యమ్. 2008 : 14).

మరోవైపు తెలంగాణ ప్రజలు ఈ ఉద్దేశాలను ముందుగానే పసిగట్టి ఫజల్ అలీ కమీషన్ ముందు తమ భయాలను వెలిబుచ్చారు. వాస్తవానికి కోస్తాంధ్రుల స్వభావం హైదరాబాద్ రాష్ట్ర ప్రజలకు చాలా ముందు కాలం నుంచే అనుభవంలో ఉన్నది. దానికి ఉదాహరణ నిజాం రాజు ఆలోచనావిధానం. "ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ ప్రతిరోజు నమాజ్ చదివిన తరువాత దేవునితో 'అల్లా! మద్రాసీలను ఎల్లప్పుడు సుభిక్షంగా ఉంచుము' అని ప్రార్థించేవాడట. ఆ రోజుల్లో హైద్రాబాదు రాష్ట్రం వారికి 'మద్రాసీ' అంటే అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉండే తెలుగువారని అర్థం. నిజాం ప్రార్థనలోని అంతరార్థం ఆయన ఆంతరంగికులకు కూడ అర్థం అయ్యేది కాదు. 'ఇదేమిటి, మా ప్రభువు తమ రాజ్యంలోని ప్రజల క్షేమం కొరకు కాక పరాయి రాష్ట్రంలోని ప్రజల సంక్షేమం గురించి ప్రార్థిస్తాడు' అని బాధపడేవారట. కొన్నాళ్ల తర్వాత కొందరు ధైర్యం తెచ్చుకొని తమ మనోభావాన్ని నిజాం నవాబుకు విన్నవించుకున్నారట. అప్పుడు నిజాం నవాబు 'పిచ్చినాయనలారా! మద్రాసీలు సుభిక్షంగా లేకపోతే వారిక్కడికి వచ్చి మీ నోళు కొట్టే ప్రమాదం ఉంటుంది. కనుక మీ క్షేమం కోరే నేనీ ప్రార్థన చేస్తున్నాను అని వివరించాడట" (జయశంకర్, కొత్తపల్లి. 2010 : 1). కనుక విలీనానికి హైదరాబాద్ రాష్ట్ర ప్రజలు సుముఖత వ్యక్తం చేయలేదు. తాము విడిగానే ఉండదలచామని చెప్పారు.

ఇరు పక్షాల వాదనలను విన్న తర్వాత "తలసరి రెవెన్యూ ఆంధ్ర రాష్ట్రంలో తొమ్మిది రూపాయల ఆరు అణాలు ఉండగా, తెలంగాణలో పదిహేడు రూపాయలుగా ఉందని, ప్రభుత్వానికి సాలీనా తెలంగాణ నుంచి ఐదుకోట్ల రూపాయల అదనపు ఆదాయం వస్తున్నదని, రాయలసీమ నుంచి, కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి భూస్వాములు వచ్చి

తెలంగాణలో భూములు కొనేస్తారని, పేద తెలంగాణ రైతులు ఇప్పుడు చేతికందే డబ్బులతో మురిసిపోవచ్చునని, కాని దీర్ఘకాలంలో కలిగే నష్టాన్ని గుర్తించడంలేదని, విద్యా విషయకంగా అభివృద్ధి చెందిన కోస్తాంధ్రవాసులు తెలంగాణను ముంచెత్తి ఉద్యోగ అవకాశాలన్నింటినీ తన్నుకుపోవచ్చుననీ కమిషన్ తనకు అందిన అనుమానాలన్నింటినీ నమోదు చేసింది. తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ఉంచాలని కొందరు నాయకులు చేసిన వాదనలో ఆమోదించవలసిన అంశాలు ఉన్నాయని, కనుక తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ఉంచడమే మంచిదని, లేదా 1961 ఎన్నికలలో వెలువడే ప్రజాభిప్రాయాన్ని బట్టి విలీనం గురించి నిర్ణయం తీసుకోవచ్చునని కమిషన్ 1955 సెప్టెంబర్ 30న సమర్పించిన నివేదికలో సూచించింది(వేణుగోపాల్, ఎన్. 2009 : 37). కానీ ఈ నివేదిక అభిప్రాయాల్ని పెడచెవిన పెట్టిన నెహ్రూ ప్రభుత్వం 1956, నవంబర్ 1న ఇరుప్రాంతాలకు చెందిన పార్లమెంటరీ రాజకీయాల్లో కీలక స్థానాల్లో ఉన్న పెద్దమనుషులతో ఒక ఒప్పందాన్ని చేసుకుని ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటు చేసింది. నివేదిక అభిప్రాయాలు పట్టించుకోనప్పుడు ఆ కమిటీ వేసి, దానికి కోట్ల రూపాయల ప్రజాధనం వెచ్చించాల్సిన అవసరమే లేదు. పెద్దమనుషుల ఒప్పందంలోని నిబంధనలు ఇవి:

"1. రాష్ట్ర ప్రభుత్వపు ముఖ్య, సాధారణ పరిపాలనా విభాగాలపై అయ్యే ఖర్చు తగు నిష్పత్తిలో రెండు ప్రాంతాలు భరించాలి. తెలంగాణ ప్రాంతం నుండి వచ్చే మిగులు ఆదాయాన్ని ఆ ప్రాంతపు అభివృద్ధికే కేటాయించాలి. ఈ నిబంధనను ఐదేళ్ల తర్వాత సమీక్షించి తెలంగాణ శాసన సభ్యులు కోరిన పక్షంలో మరలా ఐదేళ్లపాటు వర్తింపజేయాలి.

2. తెలంగాణలో మద్యపాన నిషేదాన్ని అసెంబ్లీలోని తెలంగాణ శాసన సభ్యులు కోరిన విధంగా అమలు చేయాలి.

3. తెలంగాణలో ప్రస్తుతం అమలులో ఉన్న విద్యా సౌకర్యాలన్నీ తెలంగాణ విద్యార్థులందరికి వర్తింపజేసి మరింతగా అభివృద్ధి చేయాలి. తెలంగాణలోని సాంకేతిక విద్యాసంస్థల్లో ప్రవేశం తెలంగాణ విద్యార్థులకే పరిమితం చేయాలి. లేకపోతే రాష్ట్రం మొత్తంమీద 1/3

వంతు సీట్లను తెలంగాణ విద్యార్థులకు ప్రత్యేకంగా కేటాయించాలి. అయితే ఈ రెండింటిలో తెలంగాణ వారికి ఏది ప్రయోజనకరమైతే దానినే ఎంచుకోవచ్చు.

4. విశాలాంధ్రను ఏర్పాటు చేసినప్పుడు ఎక్కువైన ఉద్యోగుల్ని తీసివేయాల్సి వచ్చినప్పుడు ఆయా ప్రాంతాలకు తగిన నిష్పత్తిలోనే జరగాలి.

5. ఉద్యోగ నియామకాల్లో మాత్రం ఆయా ప్రాంతాల జనాభాను ప్రాతిపదికగా తీసుకోవాలి.

6. తెలంగాణలోని సాధారణ పరిపాలన, న్యాయవిభాగాల్లో ఉర్దూ భాషకున్న ప్రస్తుత స్థానాన్ని మరో అయిదేళ్లపాటు కొనసాగించాలి. అయిదు సంవత్సరాల తర్వాత ప్రాంతీయ మండలి పరిస్థితిని సమీక్షిస్తుంది. ఉద్యోగ నియామకాలకు తెలుగు భాషా పరిజ్ఞానం తప్పనిసరి అనే నిబంధనను పెట్టకూడదు. ఉద్యోగంలో చేరిన రెండేళ్లకు ఉద్యోగులకై నిర్వహించే తెలుగు పరీక్షలో తప్పక ఉత్తీర్ణులు కావాలి.

7. తెలంగాణ ప్రాంతంలోని ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరేందుకు 12 సంవత్సరాలు స్థానికుడై ఉండాలనే నిబంధనవంటి కొన్ని నియమాల్ని కూడా రూపొందించాలి.

8. తెలంగాణ ప్రాంతంలోని వ్యావసాయిక భూముల అమ్మకం ప్రాంతీయ మండలి అధికార పరిధిలో ఉండాలి.

9. తెలంగాణ ప్రాంతపు బహుముఖాభివృద్ధికై ఒక ప్రాంతీయ మండలిని ఏర్పాటు చేయాలి.

10. ప్రాంతీయ మండలిలో 20 మంది సభ్యులుండాలి. వీరిలో 9 మంది అసెంబ్లీ సభ్యులై ఉండాలి. వీరిని జిల్లాకు ఒక్కరు చొప్పున ఆయా జిల్లాల సభ్యులు ఎన్నుకుంటారు. మరల 6 మంది సభ్యుల్ని అసెంబ్లీ నుండిగాని, పార్లమెంటు నుండిగానీ తెలంగాణ అసెంబ్లీ సభ్యులు ఎన్నుకుంటారు. మరో 5 మంది సభ్యులు బయటివారై ఉంటారు.

వీరిని తెలంగాణవారే ఎన్నుకుంటారు.

11. ప్రాంతీయ మండలి ఈ క్రింది విషయాల్లో నిర్ణయాధికారాన్ని కల్గి ఒక చట్టబద్ధమైన సంస్థగా రూపొందాలి.

(ఎ) తెలంగాణ ప్రాంతానికి సంబంధించినంతవరకు పై విషయాలతోపాటు సాధారణ ప్రణాళిక, అభివృద్ధి విషయాలు, ఉద్యోగ నియామకాలపై అదుపును కలిగి ఉంటుంది.

(బి) ఈ ఒప్పందాన్ని ముందుగానే సవరించితే తప్ప పదేళ్ల తర్వాత సమీక్షించాలి.

12. క్యాబినెట్ మంత్రుల నియామకం 60-40 నిష్పత్తిలో జరగాలి. తెలంగాణకు చెందిన మంత్రుల్లో ఒకరు ముస్లిం అయి ఉండాలి.

13. ముఖ్యమంత్రి ఆంధ్రప్రాంతం వాడయితే , ఉప ముఖ్యమంత్రి తెలంగాణ ప్రాంతానికి చెందినవాడై ఉండాలి. ఒకవేళ ముఖ్యమంత్రి తెలంగాణ ప్రాంతానికి చెందిన వ్యక్తి అయితే ఉపముఖ్యమంత్రి ఆంధ్ర ప్రాంతానికి చెందినవాడై ఉండాలి. హోంశాఖ, ఆర్థిక శాఖ, రెవెన్యూ శాఖ, ప్రణాళిక మరియు అభివృద్ధి శాఖ, వాణిజ్యము మరియు పరిశ్రమల శాఖ, వీటిలో ఏదేని రెండు శాఖలు తెలంగాణ వారికి అప్పగించాలి.

14. తెలంగాణకు 1962 వరకు ప్రత్యేక కాంగ్రెసు కమిటీ కావాలని హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడు కోరాడు. ఇందుకు ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటి అధ్యక్షుడు కూడా తన ఆమోదాన్ని తెలిపాడు" (శోభాగాంధి. 2010 : 31,32,33). (ఈ అంశాలను పూర్తిగా ఇక్కడ పొందుపర్చడానికి కారణం భవిష్యత్తులో వీటి ఉల్లంఘన కారణంగానే నిరసనలు, ఉద్యమాలు వెల్లువెత్తాయి).

పెద్దమనుషుల ఒప్పందం జరిగే కాలంలోనే తెలంగాణలోని చాలా మంది

ప్రజాస్వామిక వాదులు, కాళోజి వంటి కవులు విశాలాంధ్రనే కోరుకున్నారు. కారణం అంతకు ముందు రైతాంగ సాయుధపోరాటంలో మహత్తరమైన పాత్రను పోషించిన కమ్యూనిస్టు పార్టీ, విశాలాంధ్రలోనే ప్రజారాజ్యాన్ని స్థాపించడం సాధ్యం అనడం. అట్లే అంతకు ముందటి నిజాం నిరంకుశ పాలనలో తమ ఉనికిని కోల్పోయినతనం కూడా తెలంగాణ వారికి తెలుగు ప్రజల ఐక్యతే మేలనిపించింది. కానీ బ్రిటీష్ పరిపాలిత ఆంధ్రులకు మంచి అక్షరాస్యత, ఆర్థిక సంపన్నత, రాజకీయానుభవం ఉన్నవనీ, వాటివల్ల భవిష్యత్తులో తెలంగాణాపై ఆధిపత్యం చెలాయిస్తారన్న భావన ఉన్నది, కానీ అది పూర్వ భావన కంటే బలమైంది కాలేకపోయింది.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తొలిరోజునుంచే పెద్దమనుషుల ఒప్పందంలోని అంశాలు ఉల్లంఘించబడ్డాయి. "ఈ ఒప్పందంలో చేర్చిన 'రక్షణ'లు మౌలిక సమస్య అయిన తెలంగాణ వెనుకబడినతనాన్ని పరిష్కరించలేవనిగానీ, ఒప్పందంలోని అంశాలకున్న చట్టబద్ధత, రాజ్యాంగబద్ధత గురించికాని, ఆచరణాత్మకత గురించికాని ప్రశ్నించేవారే లేరు"(దాగ్మార్ బెర్న్‌స్టార్ఫ్, హ్యూగ్ గ్రే. 2007 : 108). దాంతో ఆంధ్ర ప్రాంత పెద్దలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. పెద్దమనుషుల ఒప్పందం క్రమంగా ఉల్లంఘనలకు గురౌతూ వచ్చింది. పెద్ద మనుషుల ఒప్పందంలోని నిబంధనలు స్పష్టంగానే ఉన్నాయి. ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ, ఆర్థిక, పంచాయితీ వంటి శాఖల్లో దామాషా పంపకాల ప్రస్తావన సరిగ్గానే ఉన్నది. తెలంగాణ ప్రాంతీయ కమిటీ కూడా ఉన్నది. తెలంగాణలో, ఆదివాసీ ప్రాంతాలలో వలెనే భూముల క్రయవిక్రయాలు జరుగకూడదనే నియమాలూ ఉన్నాయి. కాని భూముల కొనుగోలు మాత్రమే కాదు, వంచనాపూర్వక దురాక్రమణలు జరుగుతూనే పోయాయి. ఉప ముఖ్యమంత్రి పదవి ఆరోవేలు అయిపోయి తొలగించబడింది. తెలంగాణ ప్రాంతీయ కమిటీలు డమ్మీలయ్యాయి.

ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు ముందు తెలంగాణ ప్రజలు ఫజల్ అలీ కమిషన్ ముందు వెలిబుచ్చిన భయాందోళనల్లో ఏదీ నిజం కాకుండా పోలేదు. పెద్దమనుషుల ఒప్పందంలో ఏ నిబంధనా సరిగ్గా అమలు కాలేదు. మొత్తం ఆంధ్రప్రదేశ్ భూభాగంలో 11.48 లక్షల

చదరపు కిలోమీటర్లు అంటే 42 శాతం తెలంగాణ విస్తరించి ఉంది. మొత్తం రాష్ట్ర జనాభాలో తెలంగాణ జనాభా 39 శాతం ఉన్నది. విస్తారమైన సహజ సంపదలతో 40 శాతంకంటే ఎక్కువ ఆదాయ వనరులను కలిగి ఉన్నది. అయినా తెలంగాణాకు దక్కాల్సిన రాజకీయ అధికారం దక్కలేదు. రెండు జీవనదులు పారుతున్నా తాగు, సాగునీటి పంపకంలో తీవ్రమైన అన్యాయం జరిగింది. రెవెన్యూ ఆదాయంలో తెలంగాణకు దక్కాల్సిన వాటా దక్కలేదు. బడ్జెట్ కేటాయింపులలో తెలంగాణ, సీమాంధ్రలకు గణనీయమైన వ్యత్యాసాలున్నాయి. ఈ పరిస్థితులు ఇట్లా ఉంటే మరోవైపు కళా, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో తెలంగాణ వివక్షకు, విస్మరణకు, అవమానాలకు గురైంది. మొత్తంగా సీమాంధ్ర పెట్టుబడిదారుల పాలనలో తెలంగాణ ఉనికే ప్రశ్నార్థకమైంది. అయితే ఈ స్థితిని కూడా శాస్త్రీయంగా అర్థం చేసుకోవల్సి ఉన్నది. "తెలంగాణ విషయంలో ప్రాంతీయ అసమానత అనిగాని, వెనుకబాటుతనం అనిగాని, అభివృద్ధి రాహిత్యం అనిగాని, నిధులు–నియామకాలలో వివక్ష అని గాని, తెలంగాణకు అన్యాయం చేసిన, ద్రోహం చేసిన నాయకులు అనిగాని చర్చించడం చాల అవసరమే. పూర్తిగా సరైనదే గాని అలా మాత్రమే చర్చిస్తే అసలు సమస్య అర్థం కాదు. ఎందుకంటే అదే మొత్తం సమస్య కాదు. అది విశాల చరిత్రలో ఒక భాగాన్ని మాత్రమే స్పృశించినట్టు అవుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచీ తెలంగాణ ప్రాంతానికి నిధుల కేటాయింపులలోనూ, అభివృద్ధి పథకాలలోనూ, నీటి పారుదల పథకాలు చేపట్టి ఎక్కువ భూమికి సాగునీటి సౌకర్యం కల్పించడంలోనూ, స్థానికులకు విద్యా, ఉద్యోగావకాశాలు కల్పించడంలోనూ, ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక సంస్థలలో నిర్ణయాధికారాన్ని కల్పించడంలోనూ తెలంగాణ పట్ల, తెలంగాణ వాసులపట్ల అన్యాయం, వివక్ష అమలయ్యాయి" (వేణుగోపాల్, ఎన్. 2009 : 34). కనుక తెలంగాణ, ఆంధ్ర ప్రాంత సాధారణ ప్రజానీకపు అభీష్టానికి వ్యతిరేకంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతానికి వివిధ రంగాలలో జరిగిన అన్యాయాలను, వాటి మూలంగా ఆ సమాజంలో నెలకొని ఉన్న పరిస్థితులను చర్చించడం అవసరం. వీటి పునాదిగానే ఉద్యమమూ, కవిత్వమూ నిర్మాణమయ్యాయి. కనుక ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా మారిన తర్వాత తెలంగాణ సమాజంలోని వివిధ రంగాల్లో సంభవించిన పరిణామాలు స్థూలంగా ఇవీ:

## 1.1. నీళ్లు

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత తెలంగాణ జల వనరులు అన్యాక్రాంతం అయ్యాయి. అందుకే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కావాలని ప్రజలు అడగడానికి ఉన్న కారణాల్లో నీటి సమస్య అన్నింటికంటే కీలకమైనది అయ్యింది. ప్రపంచంలో ఎక్కడైనా నీరు లేనిదే మనిషి లేడు. ప్రకృతి ఉనికి నీటిలోనే ఉన్నది. మానవుడేకాదు, సమస్త జంతు, వృక్ష జాలమూ నీటి వల్లనే మనగలుగుతున్నది. మానవ సమాజ వికాసం నదీలోయ నాగరికత నుంచే ప్రారంభమైనట్లు మనకు చరిత్ర చెప్తుంది. ప్రాచీన నాగరికతలైన ఈజిప్షియన్ నాగరికత నైలూ నది ఆధారంగా, మొసొపొటోనియా నాగరికత టైగరిస్, యూప్రటిస్ నదుల ఆధారంగా, సింధూ నాగరికత సింధూ నది ఆధారంగా, చైనా నాగరికత హొయాంగ్ నది ఆధారంగా అభివృద్ధి చెందినవే. దీన్ని బట్టి మానవ మనుగడకు, వికాసానికి, అభివృద్ధికీ– జలవనరులకు ఉన్న సహజమైన సంబంధాన్ని అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ ప్రాంతానికి విలువైన నీటి వనరులే ఉన్నాయి. కానీ వాటి వాటా విషయంలో అంతర్గత వలసవాదం కారణంగా అన్యాయం జరిగి అభివృద్ధికి నోచుకోలేకపోయింది.

కోస్తాంధ్రకు జలవనరులను అందిస్తున్న కృష్ణా, గోదావరీ నదీ జలాలపై అధికృతను సాధించాలంటే హైదరాబాద్ రాష్ట్రాన్ని కలుపుకొని ఉమ్మడి రాష్ట్రం ఏర్పాటు చేయక తప్పదనే ఉద్దేశంతోనే కోస్తాంధ్రులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయించుకున్నారు. “తెలంగాణమునకు మహా జీవనదులైన కృష్ణా గోదావరులు రెండు భుజాలు. తుంగభద్ర, మంజీరా, మానేరు, ముచుకుంద, మున్నేరు, దుందుభి నదులు తెలంగాణపు సశ్యశోభితానికి దోహదం కలిగించే అనువైన చెలికత్తెలు. రాష్ట్రమంతట బావులు, చెరువులు జలాశయాలు విరివిగా వుంటాయి. మానవ నిర్మిత తటాకాలకు కొదువ లేదు. అన్నీ వ్యవసాయానుకూలమైన జలాశయాలే. పాకాల జలాశయం వీటన్నిటికీ మకుటం. రామప్ప చెరువు, లక్నారం చెరువు, కోమటి చెరువులు చూచి ఆశ్చర్యపడని వ్యక్తి యింతవరకు లేడు” (శర్మ, బి.ఎన్. 2010 : 10). కానీ కోస్తాంధ్ర పాలక వర్గాలు ఈ రెండు భుజాలు విరగ్గొట్టి, చెలికత్తెలను అపహరించుకు వెళ్లాయి. మనిషికి భుజాలు ఎంతటి ముఖ్యమైన

అంగాలో మానవ మనుగడకు నీరూ అంతే ముఖ్యమైన వనరు. అది సాగునీరు కావచ్చు లేదంటే తాగునీరు కావచ్చు. ఈ రెండింటి విషయంలో తెలంగాణాకు అన్యాయమే జరిగిందని చెప్పాలి.

"దక్షిణ భారతదేశంలో అతిపెద్ద నదులైన కృష్ణా, గోదావరి నదుల మధ్య దక్కన్ పీఠభూమిలో తెలంగాణ ప్రాంతం ఉన్నది. ఈ రెండు నదులకు అనేకమైన ఉపనదులు, వాగులు వంకలు మొత్తం తెలంగాణ ప్రాంతాన్ని ఆవరించి ఉన్నాయి. దక్కన్ పీఠభూమి గనుక ఎత్తుపల్లాలు ఇక్కడి భౌగోళిక వాస్తవికత. ఈ ఎత్తుపల్లాలు ఇప్పటి పాలకులకు భౌగోళిక అననుకూలతగానే కన్పించాయి. కాని ఈ భౌగోళిక స్థితిగతులనే తెలంగాణ ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకొని పాలించిన రాజవంశాలు అనుకూలతగా మార్చుకొని అపారంగా ఉన్న జలవనరులను సాగుకు మళ్లించగలిగాయి. కాకతీయుల నుండి అసఫ్‌జాహీలదాకా తెలంగాణ అంతటా వేలాది చెరువులు నిర్మాణం అయినాయి. చెరువుల చుట్టూ ఒక గొప్పదైన సంస్కృతి నిర్మాణం జరిగింది. అందుబాటులో ఉన్న గణాంకాల ఆధారంగా 20 వ శతాబ్దం ఆరంభానికి ముందే తెలంగాణలో 21 వేల చెరువులున్నాయని అవి 8 లక్షల 80వేల ఎకరాలకి సాగునీటి సౌకర్యాన్ని కల్పించాయని అర్థమవుతున్నది. 1956లో ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడేనాటికి 11 లక్షల హెక్టార్ల భూమి చెరువుల కింద సాగవుతూ ఉండేది. ఇపుడు 5 లక్షల హెక్టార్లకు పడిపోయింది"(శ్రీధరరావు, దేశ్‌పాండే. 2008 : 127). వాస్తవానికి మొత్తం భారత దేశంలోనే అతి ఎక్కువ చెరువులు ఉన్న రాష్ట్రం హైదరాబాద్ రాష్ట్రం. నిజాం రాజు ఎంత నిరంకుశుడైనా తన రెవెన్యూను బలపరుచుకోవడం కోసం చెరువుల నిర్మాణం చేపట్టి పంటలు పండేలా చూశాడు. ఈ చెరువుల గొప్పదనం, అన్నీ గొలుసుకట్టు చెరువులే కావడం.

'వెనుకబాటు' అన్నది ప్రకృతి సహజమైన విషయం కాదు. అదొక రాజకీయాంశం. దళిత సాహిత్యంలో 'అంటరానివాళ్లు', 'అంటుకోనివాళ్లు' అన్న చర్చ జరిగినప్పుడు ఒక కొత్త విషయం వెలుగు చూసింది. నిప్పును అంటుకుంటే కాలుతుంది, విద్యుత్తును ముట్టుకుంటే షాక్ తగులుతుంది. ఇలాంటివి అంటరానివి. కానీ దళితులను అంటుకోవడం

వల్ల ఏమీ జరగదు. కానీ బ్రాహ్మణీయ వ్యవస్థ దళితులను అంటరానివారు అన్నది. డా॥బి.ఆర్.అంబేద్కర్ తాత్త్విక జ్ఞానం ప్రజల్లో వ్యాపించిన తర్వాత దళితవాదం బలంగా ముందుకు వచ్చింది. అయితే దళిత రాజకీయాలు మాట్లాడుతున్నవాళ్లంతా సరైన అవగాహన లేకుండా దళితుల్ని 'అంటరానివాళ్లు' అనే అంటున్నారు. కానీ కొద్దికాలం పోయేసరికి దళితులు అంటరానివారు కారు, 'అంటుకోనివారు' అని కొత్త భావన వెలుగుచూసింది. ఈ నేపథ్యంలో 'వెనుకబాటుతనం' అన్న భావనను సరిగ్గా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ప్రాకృతికంగా ఉన్న అననుకూలతలను మనిషి తనకు అనుకూలంగా మార్చుకుంటాడు. అయితే ఇది సామాజిక స్థాయిలో ఉన్నప్పుడు ఆ సమాజాన్ని పాలిస్తున్న వాళ్ల బాధ్యతగా ఉంటుంది. తెలంగాణ సందర్భంలో తీసుకున్నప్పుడు అనేక రాజవంశాలు ఆ బాధ్యతను సరిగ్గా నిర్వహించినట్టు తెలుస్తుంది. ఎప్పుడైతే ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు అయిందో తెలంగాణలో ఉన్న ఈ ప్రాకృతిక అననుకూలతలను అనుకూలంగా మలచడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం ప్రదర్శించాయి. దాని కారణంగా వెనుకబాటుతనం అన్నది వ్యవస్థీకృతం అయ్యింది. నిజానికి తెలంగాణ వెనుకబడిన ప్రాంతం కాదు. వెనుకబడేయబడిన ప్రాంతం అని 1956 నుండి జరిగిన పరిణామాలన్నీ రుజువులు చూపిస్తున్నాయి. ఎందుకంటే భౌగోళికంగా తెలంగాణలో దక్షిణ భాగంలో కృష్ణానది, ఉత్తర భాగంలో గోదావరి నది– రెండు మహా జీవనదులు ఉన్నాయి. వీటితోపాటు గోదావరికి ఉపనదులుగా పెనుగంగ, మానేరు, ప్రాణహిత, మంజీరా, కిన్నెరసాని, పెద్దవాగు, కడెం, తాలిపేరు ఉన్నాయి. అట్లే కృష్ణా నదికి మూసీ, భీమా, డిండి, పాలేరు, వైరా, హెూలియా మొదలైన ఉపనదులతో పాటుగా అనేక వాగులూ, వంకలూ ఉన్నాయి. ఈ జలవనరులను వినియోగంలోకి తెచ్చేందుకు నిజాం రాజు అలీ నవాజ్ జంగ్ అనే ఇంజనీర్ సహాయంతో అనేక ప్రాజెక్టులు తలపెట్టాడు. "1920 నాటికే పోచారం(మెదక్), డిండి(నల్లగొండ), పాలేరు(ఖమ్మం), వైరా(ఖమ్మం), ఎగువ మానేరు( కరీంనగర్), సదర్‌మాట్(ఆదిలాబాద్), ఫతేనహర్, మహబూబ్ నహర్(మెదక్), స్వర్ణ(ఆదిలాబాద్) మొదలైన మధ్య తరహా ప్రాజెక్టులు నిర్మించారు. ఆ తర్వాత సమగ్ర అభివృద్ధి పథకంలో భాగంగా భారీ ప్రాజెక్టుల నిర్మాణం మొదలైంది. నిజాం సాగర్, కడెం, సరళా సాగర్, అలీ నవార్ జంగ్ ఇచ్చిన కానుకలే" (శ్రీధరరావు, దేశ్‌పాండే.

2008 : 128). ఇట్లా నిజాం కాలంలో నిర్మించిన ప్రాజెక్టులే ప్రస్తుతం తెలంగాణలో కొన్ని ప్రాంతాలైనా మనుగడ సాగించడానికి ఉపయోగిస్తున్నాయి. 1948లో నిజాం భారత యూనియన్‌కు లొంగిపోవడం, 1956లో ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడటం వీటి తర్వాత అసలు కథ మొదలైంది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడే నాటికి హైదరాబాద్ ప్రభుత్వం నిర్మించతలపెట్టి నిర్మాణ దశలో ఉన్న ప్రాజెక్టులను కొత్త రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఖచ్చితంగా పూర్తి చేయాలని రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం భారత పార్లమెంటును నిర్దేశించింది. కానీ అవి అసలు నిర్మాణం కాకుండా ఆగిపోవడమో, లేదంటే ముందుగా ఉద్దేశించిన నీటి నిలువ సామర్థ్యం తగ్గించడమో, కాకపోతే అసంపూర్ణ నిర్మాణం చేయడమో జరిగింది. భాషా ప్రాతిపదికన కొత్త రాష్ట్రాలు ఏర్పడ్డ తర్వాత ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రల మధ్య ప్రవహించే కృష్ణానది నికర జలాల పంపిణీ కొరకు కేంద్ర ప్రభుత్వం బచావత్ ఆధ్వర్యంలో ఒక ట్రిబ్యునల్ వేసింది. ఆ ట్రిబ్యునల్ 1973లో కృష్ణా నదిలో ఆంధ్రప్రదేశ్ వాటా 811 టి.ఎం.సిలుగా నిర్ణయించింది. "ఈ రాష్ట్రానికి బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 811 టి.యం.సిల నికర జలాలలో అధికశాతం తెలంగాణ ప్రాంతానికి చెందాలి. కాని పాలకవర్గాలు చూపిన వివక్ష వలన ఈ ప్రాంతానికి కేవలం 277.86 టి.యం.సిల, అంటే 34.26 శాతం, కేటాయింపు జరిగింది. ఇక మిగతా నీటిలో 388.44 టి.యం.సిల కేటాయింపు కోస్తా ఆంధ్రకు, 144.70 టి.యం.సిల కేటాయింపు రాయలసీమకు జరిగింది. ఈ విధంగా 13.11 శాతం పరీవాహక ప్రాంతం ఉన్న కోస్తా ఆంధ్రకు 47.90 శాతం, 18.30 శాతం పరీవాహక ప్రాంతం ఉన్న రాయలసీమకు 17.84 శాతం నీరందింది. పోనీ కేటాయించిన ఆ కొద్ది నీరైనా తెలంగాణాకు దక్కిందా అంటే అదీ లేదు. వాస్తవ వినియోగానికి వచ్చే వరకు ఈ ప్రాంతానికి అతి కష్టంగా 120 టి.యం.సిల నీరే అందుతున్నది. అంటే "ఈ రాష్ట్రానికి కేటాయించబడిన 811 టి.యం.సిలలో అతికష్టంగా 15 శాతం నీరు మాత్రమే తెలంగాణకు లభ్యమవుతున్నది. కోస్తా ఆంధ్రకు మాత్రం కేటాయించిన నీటికంటే చాలా అధికంగా లభిస్తున్నది" (జయశంకర్, కొత్తపల్లి. 2015 : 23). కృష్ణా నదిపై విజయవాడలో నిర్మించిన ప్రకాశం బ్యారేజికి వాస్తవంగా 181.20 టి.యం.సిల నీటిని కేటాయించారు. కానీ అదనంగా 150 టి.యం.సిల నీరు ఆ బ్యారేజీకి అందుతున్నది. కొత్త రాష్ట్రం ఏర్పాటు చేసేకంటే

ముందే నిజాం చేత నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టు నందికొండ. దీన్నే ఇప్పుడు నాగార్జున సాగర్ అని వ్యవహరిస్తున్నారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ ప్రాజెక్టు సామర్థ్యం 161 టి.యం.సిలు. కానీ ఆంధ్రప్రదేశ్ అవతరించాక ప్రాజెక్టు ముఖచిత్రమే మారిపోయింది. ముందు నిర్ణయించిన స్థలాన్ని, పేరును మార్చారు. ఇప్పుడు నాగార్జున సాగర్ నిర్మించిన ప్రాంతానికి 19 కిలోమీటర్లు ఎగువన ఏలేశ్వరం దగ్గర నందికొండ ప్రాజెక్టు కట్టాలని అప్పట్లో అనుకున్నారు. పెద్దమనుషుల ఒప్పందం ప్రకారం నాగార్జున సాగర్ ఎడమ కాలువ ద్వారా తెలంగాణకు 132 టి.యం.సిలు, కుడి కాలువ ద్వారా ఆంధ్రకు 132 టి.యం.సిల నీటిని అందించాలనే నిర్ణయం జరిగింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కాలువ నిర్మాణంలో అవకతవకలు జరిపి తెలంగాణకు అందవల్సిన 132 టి.యం.సిల నీటిని 106.2 టి.యం.సిలకు కుదించివేసారు. మొత్తం నీటిలో 230 టి.యం.సిల నీరు తెలంగాణ, రాయలసీమలకు, 580 టి.యం.సిల నీరు కోస్తాంధ్రకు నేడు అందుతున్నది. ఇంకా శ్రీశైలం ప్రాజెక్టు విషయంలో, జూరాల ప్రాజెక్టు విషయంలో, రాజోలిబండ మళ్లింపు పథకం విషయంలో తెలంగాణకు అన్యాయమే జరిగింది.

గోదావరి నదీజలాలలో తెలంగాణకు దక్కాల్సిన వాటా విషయం మరీ దారుణం. మొత్తం ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న గోదావరి నది పరీవాహక ప్రాంతం 79 శాతం తెలంగాణలో, 21 కోస్తా ఆంధ్రలో ఉన్నది. సేద్యానికి అనుకూలంగా ఉన్న భూమి తెలంగాణకు 70 శాతం ఉన్నది. బచావత్ ట్రిబ్యునల్ ఆంధ్రప్రదేశ్‌కు గోదావరి జలాలలో 1480 టి.యం.సిల నీటి వాటా ఉన్నదని చెప్పింది. దీంట్లో నదీ పరీవాహక ప్రాంతాన్ని ప్రాతిపదికగా తీసుకుంటే 79 శాతం, సాగుయోగ్యమైన భూమిని ప్రాతిపదికగా తీసుకుంటే 70 శాతం తెలంగాణకు దక్కాలి. “రాష్ట్రాల పునర్విభజన చట్టాన్ని ఆధారంగా తీసుకున్నా లేదా కృష్ణా నదిలో తెలంగాణా ప్రాంతానికి జరిగిన నష్టాన్ని పూరించాలన్నా, కనీసం 1000 టి.యం.సిల నీరైనా కావాలి”(జయశంకర్, కొత్తపల్లి. 2015 : 28,29).

నిజాం పరిపాలనా కాలంలోనే గోదావరి నది నుండి తెలంగాణాలోని ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, నల్గొండలకు 20లక్షల ఎకరాలకు పైగా సాగునీరు

అందించేందుకు 330 టి.యం.సిల సామర్థ్యంతో పోచంపాడు ప్రాజెక్టు(శ్రీరాం సాగర్)ను నిర్మించతలపెట్టారు. కానీ ఆంధ్రప్రదేశ్ అవతరించాక చాలా కాలం దీని నిర్మాణ పనులను విస్మరించారు. చివరికి 1969 ఉద్యమం ప్రభావంతో కదలిక వచ్చి నిర్మాణ కార్యక్రమాలు మొదలుపెట్టారు. కానీ ముందు నిర్ణయించిన 330 టి.యం.సిల నీటికి బదులు 145 టి.యం.సిలకు నీటి నిల్వను కుదించారు. అదీగాక ఆ ప్రాజెక్టులో ఇసుక మేటల వలన ఇంకా 20టి.యం.సిల సామర్థ్యం తగ్గిపోయింది. ఇంతకంటే విషాదమేమిటంటే, ఈ ప్రాజెక్టు పనులు ఇప్పటికింకా పూర్తి కానేలేదు, అయ్యే అవకాశం కూడా కన్పించడం లేదు.

శ్రీరాం సాగర్ నీటి నిలువ సామర్థ్యం కుదింపుకు గురైన కారణంగా వరదల కాలంలో నీరు వృధా కాకూడదనే ఉద్దేశంతో కరీంనగర్, వరంగల్, నల్గొండలకు ఆ నీటిని మళ్లించాలనే ఉద్దేశంతో శ్రీరాం సాగర్ వరద కాలువను నిర్మించ తలపెట్టారు. కానీ అదీ అమలుకు నోచుకోలేదు.

1931లో అప్పటి నిజాం ప్రభుత్వం 58 టి.యం.సిల నీటి సామర్థ్యంతో నిజాం సాగర్ ప్రాజెక్టును నిర్మించారు. కానీ అందులోకి ఇసుకమేటలు చేరి నీటి నిలువ సామర్థ్యం తగ్గకుండా ఉండడానికి చేపట్టాల్సిన కార్యక్రమాలేవీ చేపట్టకపోడంతో దాని సామర్థ్యం సగానికి పడిపోయింది. “నిజాం సాగర్‌లో తగ్గిన నీటి నిలువ సామర్థ్యాన్ని పాక్షికంగానైనా పునరుద్ధరించి, మెదక్ జిల్లాకు కొంత సాగునీరు, జంటనగరాలకు కొంత తాగునీటిని అందించే ఉద్దేశంతో 1980లో మంజీరా నదిపై నిజాం సాగర్ పైభాగాన సింగూరు ప్రాజెక్టు నిర్మాణం జరిగింది. తీరా సింగూరు నిర్మాణం జరిగిన తర్వాత దానిని కేవలం జంటనగరాల అవసరాలను తీర్చడానికే పరిమితం చేసినారు”(జయశంకర్, కొత్తపల్లి. 2015 : 31). జంట నగరాల అవసరాలు అంటే అందులో సింహభాగం కోస్తాంధ్ర సంపన్న వర్గాలు నివసించే జూబ్లీ హిల్స్, బంజారహిల్స్‌లకు సింహభాగం, మిగిలిన ప్రాంతాలకు పరిమిత భాగం అని అంతరార్థం. ఇక ఇచ్చం పల్లి ప్రాజెక్టు అచ్చం శ్రీశైలం ప్రాజెక్టు వంటిదే. గోదావరి నదిపై నిర్మించ తలపెట్టిన ఇచ్చంపల్లి ప్రాజెక్టు విషయంలో

కూడా తెలంగాణకు అన్యాయమే జరిగింది. ఎత్తిపోతల పథకం నిర్మిస్తామని చెప్పిన దేవాదుల కావచ్చు, కరీంనగర్‌లో నిర్మిస్తామని చెప్పిన ఎల్లంపల్లి ఆనకట్ట కావచ్చు, దుమ్ముగూడెం, సింగారెడ్డి పల్లె విద్యుత్ ఉత్పాదక ప్రాజెక్టులు కావచ్చు ఏవీ నిర్మాణానికి నోచుకోలేదు.

ఇవి మాత్రమే కాక నిజాం కాలంలో నిర్మించి లక్షలాది ఎకరాలకు నీరందించిన వేలాది చెరువులు పూడిక పనులు జరుపక అంతర్థానం అయిపోయాయి. స్వచ్ఛమైన నీటితో ప్రవహించాల్సిన మూసీ, మంచినీటి సరస్సు అయిన హుస్సేన్ సాగర్ కోస్తాంధ్ర పెట్టుబడిదారుల పరిశ్రమలు, హోటళ్ల వలన కలుషితం అయిపోయాయి.

ఇట్లా గలగల పారే నదులు, వాగులు, వంకలతో ఉన్న తెలంగాణ, దుర్భిక్షాన్ని ఎదుర్కోవడానికి కోస్తాంధ్ర పాలకుల నిర్లక్ష్యం మాత్రమే కారణంగా ఉన్న విషయం స్పష్టంగా కనబడుతుంది. "తెలంగాణలో విస్తారమైన జలవనరులు ఉన్నప్పటికీ ఈ ప్రాంతం తీవ్రమైన వివక్షకు అన్యాయానికి గురి అయ్యిందన్న వాస్తవాన్ని గుర్తు చేసుకున్నప్పుడల్లా సమైక్యాంధ్ర పాలకులకన్నా అసఫ్‌జాహీలు, కుతుబ్ షాహీలు అంతకుముందు కాకతీయులే నయమనిపిస్తుంది"(శ్రీధరరావు, దేశ్‌పాండే. 2008 : 127,128) అనే అభిప్రాయంలో తెలంగాణ ప్రజల బాధాతప్త హృదయమే కనిపిస్తుంది.

## 1.2. వ్యవసాయం

ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక తెలంగాణ ప్రాంతంలోని వ్యవసాయం అన్ని రకాలుగా నష్టపోయింది. తెలంగాణ భౌగోళిక విస్తీర్ణం 1,14,77,300 చదరపు హెక్టార్లు కాగా ఆంధ్ర భూవిస్తీర్ణం 1,59,62, 689 చదరపు హెక్టార్లు. ఆహార ధాన్యాల పంటల సాగు తెలంగాణలో 33,39,280 హెక్టార్లలో, ఆంధ్రలో 43,34,644 హెక్టార్లలో జరుగుతున్నది. ఇందులో వరిసాగు తెలంగాణలో 15,47,985 హెక్టార్లలో అవుతుండగా, ఆంధ్రలో 26,94,741 హెక్టార్లలో అవుతున్నది. నీటి పారుదల సౌకర్యాల కల్పనలో అసమానతవల్ల

వరిసాగులో ఈ అసమానత కనిపిస్తున్నది. ఆంధ్ర ప్రాంతంలో వివిధ నీటి పారుదల ప్రాజెక్టులను నిర్మించి కెనాల్ సిస్టమ్ ద్వారా సాగునీరు పెద్ద ఎత్తున అందించడానికి చర్యలు తీసుకున్నారు. కానీ తెలంగాణ ప్రాంతంలో అటువంటి చర్యలు ఏమీ చేపట్టలేదు. మొత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహారధాన్యాల దిగుబడిలో, ఆంధ్రప్రాంతంలో 95,64,435 టన్నులు ఉండగా తెలంగాణలో అది 64,63,337 టన్నులు మాత్రమే ఉన్నది. మెట్ట పంటల్లో తెలంగాణలో పప్పు దినుసుల దిగుబడి రాష్ట్రంలోని మొత్తం దిగుబడిలో 40 శాతం ఉంది. తెలంగాణలో వరిధాన్యం దిగుబడికి రెండింతల దిగుబడి ఆంధ్రప్రాంతంలో ఉన్నది. ఈ మొత్తం గణాంకాలు చెప్పేదేమంటే తెలంగాణనుండి ప్రవహించే నదుల నీటిని తెలంగాణకు వినియోగించుకునే అవకాశం లేకుండా చేయడం వల్ల వ్యవసాయంలో వెనుకబాటుతనం ఆవరించింది.

మానవ పరిణామ చరిత్రలో మనిషి వేటాడే దశనుంచి తానే ఆహారాన్ని ఉత్పత్తి చేసుకునే దశకు మారడం ఒక గుణాత్మక మార్పు. అప్పటినుంచే తన జీవితంలో పెనుమార్పులు చోటు చేసుకోవడం కనిపిస్తుంది. ఆ తర్వాతి కాలంలో కొన్ని దేశాలు వ్యవసాయాధారిత దేశాలుగా, కొన్ని దేశాలు పారిశ్రామిక దేశాలుగా, రకరకాలుగా పరిణమించాయి. భారత దేశం ప్రధానంగా వ్యావసాయిక దేశం. అందునా ఆంధ్రప్రదేశ్, మరీముఖ్యంగా తెలంగాణ ప్రాంతం ప్రధాన వృత్తి వ్యవసాయమే. దక్షిణ భారత దేశంలోనే రెండు మహా జీవనదులైన కృష్ణా, గోదావరుల పరీవాహక ప్రాంతమయిన ఆంధ్రప్రదేశ్, దానిలోని తెలంగాణ వ్యవసాయరంగం అత్యంత అభివృద్ధి చెందివుండాలి. కాని కేవలం కోస్తాంధ్రలో మాత్రమే వ్యవసాయం సంపన్నంగా ఉండి మిగతా ప్రాంతాలు వెనుకబడిపోయాయి. ఇది యాదృచ్ఛికంగా జరిగింది కాదు. కోస్తాంధ్ర పాలక వర్గాల వివక్షాపూరితమైన విధానాలే దీనికి కారణం.

"దక్షిణ భారతదేశంలోని అతి పెద్ద నదులైన గోదావరి, కృష్ణ, వాటి అసంఖ్యాక ఉపనదులు ఈ ప్రాంతంలోని ప్రతి జిల్లా నుండి ప్రవహిస్తవి. ప్రకృతి ప్రసాదించిన ఈ అపార సంపదతో ప్రతి గ్రామాన్ని సస్యశ్యామలం చేయవచ్చు. వీటికి తోడు కాకతీయుల

కాలం నుండి నిజాం పాలన అంతమయ్యే వరకు ఈ ప్రాంతంలో కల్పించిన కుంటలు, చెరువుల వ్యవస్థ దేశంలోనే ఒక ప్రత్యేకతను సంతరించుకున్నది. ఈ ప్రాంతంలో సేద్యానికి యోగ్యంగా ఉన్న భూములు చాలా సారవంతమైనవి. నిజాం పాలన అంతమయిన తర్వాత అప్పటి హైదరాబాద్ రాష్ట్రంలో బూర్గుల రామకృష్ణారావు నేతృత్వంలోని ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూసంస్కరణల చట్టం ఆనాటికే ఒక విప్లవాత్మక సంస్కరణ. ఆ సంస్కరణ ఫలితాలను తెలంగాణ రైతాంగం పూర్తిగా చవిచూడకముందే ఈ ప్రాంతాన్ని ఆంధ్రలో కలిపివేయడం జరిగింది. దానితో తెలంగాణా ప్రాంతంలో వ్యవసాయం కుంటుబడటం మొదలయింది. కొత్త నీటిపారుదల సౌకర్యాల కల్పనలో అన్యాయం, అప్పటికే ఉన్న చిన్న నీటి పారుదల సౌకర్యాలను కాపాడే విషయంలో నిర్లక్ష్యం, పరపతి సౌకర్యాల వితరణలో వివక్ష వంటి కారణాల చేత ఈ ప్రాంతపు వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిపోయింది"(జయశంకర్, కొత్తపల్లి. 2015 : 39, 40). అందుకే ఇవాళ ఆసియా ఖండంలోని పలు ప్రధాన నిర్మాణాల్లో తెలంగాణ వలస కూలీలు కనబడతారు. వ్యవసాయ కూలీలు పాడుకునే 'ఎద్దు ఉంటే భూమి లేక, భూమి ఉంటే ఎద్దు లేక, ఎద్దు భూమి రెండు ఉంటే సాగునీటి వసతి లేక' అనే పాటకు నేపథ్యం ఈ పరిస్థితే అని చెప్పవచ్చు.

మరోవైపు కృష్ణా గోదావరి ఆనకట్టల కింద బ్రిటీషాంధ్ర పాలనలో మద్రాసు ప్రావిన్సులో వ్యవసాయంలో అదనపు లాభాలు పొందనేర్చి రాజకీయార్థిక, వ్యాపార, పత్రికారంగంలో రాటుదేలిన అగ్రవర్ణ, అగ్రవర్గ సంపన్నులు 1956 నుండి పరిపాలనా రంగంలోనూ, నీటి పట్టున ఉన్న భూముల మీదా తమ అధికారాన్ని చేజిక్కించుకున్నారు. అప్పట్నుంచి తెలంగాణ తరిపొలాలలో చాలాభాగం పరాధీనమైపోయాయి.

తెలంగాణ ప్రాంతంలోని వ్యవసాయ రంగంలో వచ్చిన ఈ మార్పు కారణంగా చోటుచేసుకున్న అత్యంత అవాంఛనీయ పరిస్థితి ఆత్మహత్యల పర్వం. నేలను నమ్ముకుని బ్రతికే రైతు, పంటలు పండక, వర్షాలను నమ్ముకుని అప్పులు తీసుకుని పెట్టిన పెట్టుబడులకు దిగుబడులు రాక, తీసుకున్న అప్పులు తీర్చలేక అనివార్యమైన స్థితిలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. 1956 నాటి నుండి నేటిదాకా భారతదేశంలోని

మొత్తం వ్యవసాయ రంగంలోనివారు ఆత్మహత్యలు అతి ఎక్కువగా చేసుకున్నది తెలంగాణ ప్రాంతంలోనే. వందలాదిమంది పత్తి రైతుల ఆత్మహత్యలు ప్రపంచాన్నే కుదిపేసినా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాలకులుగా ఉన్న కోస్తాంధ్ర నాయకుల హృదయాలను మాత్రం కదిలించలేకపోయాయి. 1997 సంవత్సరంలో ఒక్క వరంగల్ జిల్లాలోనే 200 మందికిపైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. కానీ ప్రభుత్వం ఆత్మహత్యల నివారణకు శాశ్వతమైన చర్యలు తీసుకోలేదు. ఫలితంగా 1998లో కూడా మళ్లీ ఆత్మహత్యలు పునరావృతమయ్యాయి. ఆనాటి ప్రభుత్వం పత్తి రైతుల దయనీయ స్థితిపై మొసలికన్నీరు కార్చి, మొక్కుబడి చర్యలు తీసుకున్నదే తప్ప శాశ్వత పరిష్కారాలు ఆలోచించలేదు. ఈ ఒక్క సంవత్సరమే మొత్తం తెలంగాణ జిల్లాల్లో కలిపి 300 మందికిపైగా ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తున్నది. ఆత్మహత్యల విషయాన్ని ఏనాడూ పట్టించుకోకుండా ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రం నష్టపరిహారాల్లాంటి తాత్కాలిక ఉపశమనాలు ఇవ్వడం ప్రతి సంవత్సరం కనబడింది. దీనంతటికీ కారణం తెలంగాణ ప్రాంతాన్ని పాలించింది సీమాంధ్ర పాలకులు.

### 1.3. భూమి

పెద్దమనుషుల ఒప్పందంలోని అత్యంత ముఖ్యమైన అంశం “తెలంగాణ ప్రాంతంలోని వ్యావసాయిక భూముల అమ్మకం ప్రాంతీయ మండలి అధికార పరిధిలో ఉండాలి”(శోభాగాంది. 2010 : 32). దీనిని పెద్దమనుషుల ఒప్పందంలో ప్రధానంగా చేర్చడానికి కారణం 1948 తర్వాత ఇక్కడి తరి భూములను చౌకగా కొన్న ఆంధ్రులు ఇక్కడి ప్రజలను నిర్వాసితుల్ని చేశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కేవలం అంతర్గత వలసవాదానికి మాత్రమే కాకుండా అంతర్జాతీయ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నడుస్తున్నది అని చెప్పడానికి కారణం బహుళజాతి కంపెనీలు, సంస్థలు ఇక్కడి వనరులను కొల్లగొట్టడానికి స్థానిక పాలకవర్గాలను తొత్తులుగా వాడుకోవడమే. దేశవ్యాప్తంగా వచ్చిన ప్రత్యేక ఆర్థిక మండలాలకు కేవలం వినియోగంలోలేని భూములనే ఇస్తున్నామని పైకి చెబుతూ నిజానికి లక్షలాది ఎకరాల సాగుయోగ్యమైన భూమిని స్వయానా ప్రభుత్వాలే

సేకరించి అప్పజెప్పాయి. దీనికి తెలంగాణ మినహాయింపు కాదు. అసలే అంతర్గత వలసవాదంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలంగాణ, మళ్లీ సామ్రాజ్యవాదంలో భాగంగా వచ్చిన ప్రత్యేక ఆర్థిక మండలాలతో మరింత సంక్షోభంలోకి నెట్టబడింది. 1990వ దశకంలో ప్రారంభమైన సరళీకరణ, దానికి కొనసాగింపుగా వచ్చిన ప్రపంచీకరణలు తెలంగాణ ప్రజలను పీల్చిపిప్పి చేయడానికి ఆయా కోస్తాంధ్ర ధనికవర్గాలే ప్రత్యక్ష, పరోక్ష పాత్ర పోషించాయి. ఒకవేళ ఏమాత్రమైనా భూములు ఉన్నాయంటే అవి నీటి వసతిలేక బీళ్లుగానే మిగిలిపోయాయి. 1956న ఆంధ్రప్రదేశ్ అవతరించిన తర్వాత తెలంగాణాలోని భూమి సాగు సగానికి సగం పడిపోయింది. వేలాది ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయి. ఇందులో మరీ విషాదమేమిటంటే రాష్ట్రంలో సగటున కుటుంబానికి గజం భూమి కూడా లేని దళితుల భూములే ఎక్కువ అన్యాక్రాంతం కావడం. ఇది పాలకవర్గాలకున్న బ్రాహ్మణీయ భావజాల స్వభావాన్ని తెలియజేస్తుంది. ఒకవేళ తెలంగాణను ఆంధ్రతో కలిపితే, కోస్తాంధ్రులు తెలంగాణ ప్రాంతాన్ని ముంచెత్తి, దోచుకొని కోస్తాంధ్రకు ఒక వలస ప్రాంతంగా మార్చివేస్తారనేది ఆ ప్రాంతపు ప్రజల అసలు భయం అని ఏనాడో అభిప్రాయపడిన మొదటి ఎస్సార్సీ ఊహలు నిజమయ్యాయి.

కోస్తా సంపన్నవర్గాలు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారం తెలంగాణ భూముల్ని మింగేసింది. తెలంగాణ మొత్తం క్యాన్సర్ వ్యాధిలా రియల్ ఎస్టేట్ వ్యాపారం ముదిరిపోయింది. ఈ వ్యాధి ప్రభావంతో తెలంగాణ ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. నిరవధికంగా తెలంగాణ ప్రజలు భూముల్ని కోల్పోయారు. చౌకరేట్లకు నయానా, భయానా భూముల్ని అమ్ముకుని తిరిగి తమ పిల్లలకు ఇళ్ల స్థలాలు కూడా కొనలేని దయనీయ స్థితి నెలకొన్నది. రియల్ ఎస్టేట్ వ్యాపారం వల్ల భూమి ధర పెరగడంతో సామాన్యులు విలవిలలాడుతూ ఇల్లు కట్టుకోవాలన్న కోరికను కూడా చంపుకున్నారు. రాష్ట్రంలో చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్ద ఎత్తున భూముల్ని లీజ్‌కు ఇవ్వడం, అమ్మకాలు చేయడం వంటివి జరిగాయి. హైటెక్ సిటీ, బిజినెస్ స్కూల్, ఐఐటి, ఇండస్ట్రియల్ పార్క్ వంటి పేర్లతో ప్రభుత్వం పేదల భూమిని లాక్కుని పెట్టుబడిదారులకు కట్టబెట్టింది. భూముల ధరలు పెంచింది. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లాభాల బాట

చూపించింది. మున్సిపాలిటీ కూడా భూ ఆక్రమణలను క్రమబద్ధీకరించడానికి పెనాల్టీ విధించడంతో ఈ వ్యాపారంలో కబ్జాలకు నిబంధనలు లేకుండా పోయాయి. కోస్తానుండి వచ్చిన పెత్తందార్లు రియల్ ఎస్టేట్ వ్యాపారంతో భూబకాసురుల అవతారం ఎత్తారు. భూములు చేజారిపోయి తెలంగాణ ప్రజలు మరింత పరాయీకరణ చెందారు. ప్రధానంగా దక్షిణ తెలంగాణలోని హైదరాబాద్‌లోనూ, దాని చుట్టూ వంద కిలోమీటర్ల పరిధిలోని రంగారెడ్డి, మెదక్, నల్గొండ, మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాల్లోనూ వలసలకు శాశ్వత ఏర్పాట్లు జరిగాయి. ఖమ్మం జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉన్నది. కోస్తా పెత్తందార్లు ఉన్న చోట 'హిల్స్' నిర్మాణాలు ఎక్కువైపోయాయి. తెలంగాణ వాసులు ఉన్నచోట గుట్టలుగా పిలువబడుతున్నాయి. భూ ఆక్రమణదారులు హైదరాబాద్‌లోని బతుకమ్మకుంట, ఎన్టీఆర్ నగర్, అడ్డగుట్ట, జమ్మిగడ్డ మొదలైన బస్తీలను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ఖాళీ చేయిస్తే, వారికి పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం పూర్తి స్థాయిలో సహకరించింది. దేశంలో అన్ని పట్టణాలకంటే అతి తక్కువ రేటుకు లభించే హైదరాబాద్ భూములన్నీ కబ్జాలకు గురయ్యాయి. గూండాలు, ముఠా నాయకులు భూ కబ్జాదారులుగా మారారు. వీరు క్రమంగా భూమి పంచాయితీలకు తీర్పులు చెప్పే పెద్ద మనుషులయ్యారు. మరో విషయం చెప్పాలంటే ఈ వ్యాపారం అడ్డుపెట్టుకొని రాజకీయ అవతారం కూడా ఎత్తారు. కొందరు సినిమా రంగానికి అప్పులు కూడా ఇచ్చారు. ఇన్ని రకాల పరిణామాలకు దారితీసిన రియల్ ఎస్టేట్ వ్యాపారం తెలంగాణా ఆర్థిక వ్యవస్థలో పెనుమార్పులు తీసుకువచ్చింది. వలసవాదులకు, వారి మిత్రులకు సంపదను పెంచి, స్థానికులైన తెలంగాణ వాసులకు మురికి వాడలను మిగిల్చింది. దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానులకన్నా హైదరాబాద్‌లోనే ప్రభుత్వ ఆధీనంలోని భూమి ఎవరికీ అంతుబట్టనంత ఉంది. పోలీస్ చర్య తర్వాత నిజాం ప్రభుత్వం హైదరాబాద్ రాష్ట్రాన్ని వదిలిపెట్టినప్పుడు లక్షల ఎకరాల భూమి ప్రభుత్వ ఖాతాలో చేరింది. రైతువారి భూములు, జాగిర్దారి భూములు, నిజాం ప్రభుత్వ సొంత భూములైన సర్ఫెఖాస్ భూముల లెక్కలు ఇప్పుడు ప్రభుత్వం వద్ద లేవు. కొన్నిచోట్ల నిజాం భూములు కబ్జా తగాదాల్లో చిక్కుకొని ఉన్నాయి. ప్రభుత్వంతోపాటు ప్రైవేట్ రంగాలకు కూడా భూములు స్వాధీనం చేసుకొని పారిశ్రామిక వాడలు, ఫామ్ హౌజ్‌లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయబడ్డాయి. పైగా రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు

స్టాంపు డ్యూటీ చెల్లించడంలో కూడా మినహాయింపు ఇవ్వడంతో భూమి లెక్కలు రికార్డులకు అందడం లేదు. దేశంలోని అన్ని పట్టణాలకంటే తక్కువ రేట్లు ఉన్నాయి కాబట్టి ఇక్కడ వలసలకు అవకాశం కలిగింది. కరువుకు గురైన తెలంగాణ ప్రజలు పశువులను వధశాలలకు అమ్ముకున్నట్లు, నీరు అందని భూములను, కరెంటు లేని భూములను, ఇంటి అవసరాలకోసం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయించారు. కోస్తాంధ్రులు మాత్రం, తీసుకున్న భూమి అవసరాలు మార్చివేసి వేల సంఖ్యలో ఎన్‌క్లేవ్‌లను, అపార్ట్‌మెంట్‌లను, ఫామ్ హౌజ్‌లను నిర్మిస్తున్నారు. ఇట్లా మొత్తంగా తెలంగాణ భూమి పరాయీకరించబడింది.

## 1.4. విద్యుత్తు

ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ఉత్పత్తి నీరు, బొగ్గు ద్వారా జరిగింది. ఈ ఉత్పత్తికి కావల్సిన బొగ్గు మొత్తం తెలంగాణ నుండే సమకూరింది. కానీ ఆ బొగ్గు నుండి ఉత్పత్తి అయిన కరెంటు మాత్రం తెలంగాణకు సక్రమంగా అందలేదు. తెలంగాణలో చాలా గ్రామాలకు సరైన విద్యుత్ సదుపాయాలే లేవు. నీటిద్వారా ఉత్పత్తి అయ్యే కరెంటు కోసం కృష్ణా జలాల్ని వాడారు. అయితే ఈ జల విద్యుత్ కేంద్రాలను కూడా ఆంధ్రా ప్రయోజనాల కోసమే నెలకొల్పారు. శ్రీశైలం, నాగార్జున సాగర్‌ల కుడివైపు విద్యుత్ కేంద్రాలను నెలకొల్పి తద్వారా రీసైకిల్ అయ్యే నీటిని కృష్ణా, గుంటూరు జిల్లాల ఆయకట్టుకు మళ్లించేందుకు వీలు కల్పించారు. దీనిద్వారా విద్యుత్‌తో పాటు నీళ్లు కూడా ఆంధ్రాకు తరలించారు సీమాంధ్ర పాలకులు.

వ్యవసాయానికి నిరంతరాయంగా 9 గంటలు విద్యుత్ సరఫరా చేస్తామని సీమాంధ్ర ప్రభుత్వాలు ప్రతిసారీ హామీలు ఇచ్చాయి. కానీ ఆచరణలో కేవలం 3,4 గంటలు కూడా కరెంట్ సరఫరా కాలేదు. తెలంగాణ ప్రాంత వ్యవసాయం ప్రధానంగా బావులు, బోరు బావుల మీద ఆధారపడి జరిగింది. విద్యుత్ సరఫరాలో అంతరాయంవల్ల, లోవోల్టేజీ వల్ల మోటార్లు కాలిపోయాయి. వీటి మరమ్మత్తులకు, వాటిని మార్చడానికి పెద్దమొత్తంలోనే

ఖర్చు చేయాల్సి వచ్చింది. కరెంట్ సరఫరా సరిగ్గా లేక, ఈ అదనపు ఖర్చును భరించలేక తెలంగాణ రైతులు తీవ్రమైన ఇబ్బందులపాలయ్యారు. స్థూలంగా విద్యుత్ రంగంలో తెలంగాణకు తీరని అన్యాయం జరిగింది. ముడిసరుకులు, ఇన్‌పుట్స్ తెలంగాణలోనే ఎక్కువగా ఉన్నప్పటికీ విద్యుత్‌లో తెలంగాణకు దక్కవల్సిన వాటాను ఇవ్వడంలో సీమాంధ్ర ప్రభుత్వాలు మొండి చెయ్యి చూపాయని చెప్పవచ్చు.

## 1.5. వలసలు

మానవజాతి చరిత్రలో ప్రజలు వలస పోవడం కొత్తేమీ కాదు. వలసలు పోవడానికి రెండు కారణాలు ప్రధానంగా కనిపిస్తాయి. ఒకటి బతుకుదెరువు కోసం దేశాలు పట్టిపోవడం, రెండోది వనరులు కొల్లగొట్టడం కోసం దేశాలు వెతుక్కుంటూ వెళ్లడం. 18, 19 శతాబ్దాలలో ఆధిపత్య యూరోపియన్ దేశాలు ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికాలో వలసలు ఏర్పాటు చేసుకొని, ఆయా దేశాల వనరులను కొల్లగొట్టుకుపోయిన చరిత్ర ఉన్నది. ఇలాంటివన్నీ రెండో కోవలోకి వస్తాయి. కానీ మొదటి కోవలోకి వచ్చే వలసలు తెలంగాణ ప్రాంతంలో చోటు చేసుకుంటున్నవి. విస్తారమైన వనరులున్నా అవి ఉపయోగంలోకి రాక, దశాబ్దాలుగా ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా, ప్రకృతి కెన్నెర్ర జేయడంతో తెలంగాణ ప్రాంతం వెనుకబడేయబడినతనంలోంచి బయటపడలేకపోయింది. రోజురోజుకు తరిగిపోతున్న జీవనాధారాలు ప్రజలను అనివార్యంగా వలస పోవడానికి పురిగొల్పాయి. ఉత్తర తెలంగాణ జిల్లాల నుండి ప్రజలు బొంబాయి, భివాండి, మాలేగావ్, సూరత్ వంటి నగరాలకు, దుబాయ్, మస్కట్, సౌదీ అరేబియా వంటి గల్ఫ్ దేశాలకు బతుకుదెరువుకోసం వలస పోయారు. దక్షిణ తెలంగాణ జిల్లాల ప్రజలు, ముఖ్యంగా మహబూబ్‌నగర్ జిల్లా నుంచి కూలీలుగా ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర జిల్లాలకే కాకుండా కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా దేశదేశాలకు ఇంత కూడుకోసం వలస పోయారు. వీరంతా పాలమూరు లేబరుగా దేశవ్యాప్తంగా పేరుగాంచినవారు. ముందు పేర్కొన్న రెండు రకాల వలసలకు తెలంగాణ కేంద్రం అయ్యింది. ఇక్కడి నుండి ప్రజలు జీవనాధారం లేక బతుకుజీవుడా అంటూ దేశాలవెంట పోతుంటే, హైదరాబాదు సహా తెలంగాణ

ప్రాంతమంతా సీమాంధ్ర వలసవాదుల కబ్జాలోకి వెళ్లిపోయింది. భూమి, నీరు, అడవులు, గనులు, వ్యాపారం, ఉద్యోగాలు ఇతర సమస్త వనరులపై ప్రాంతేతరుల ఆధిపత్యం పాతుకుపోయింది. ఈ మొత్తం సారాన్ని వివరించే ఒక మాట తెలంగాణలో బాగా వ్యాప్తిలో ఉన్నది. అదేమంటే 'కోస్తా జిల్లాల్లో పెండ్లి చేసుకొని హనీమూన్ వెళ్తారు, తెలంగాణలో పెండ్లి చేసుకొని దేశం పోతారు'.

వలసల పరిస్థితి ఇలా ఉంటే వలసెళ్లిన వారి పరిస్థితి మరీ దారుణం. వలసెళ్లిన ప్రాంతంలో పని చేస్తున్నప్పుడు సంభవించే ప్రమాదాల్లో ఎంతో మంది చనిపోతారు. ఆ చనిపోయినవాళ్లను తమ ఊరికి తీసుకొచ్చుకునే బంధువులు లేనప్పుడు ఆ శవాలు అక్కడే కాష్టం చేయబడతాయి. నిజానికి అక్కడ జరిగే మరణాలన్నీ కేవలం ప్రమాదాలు కావు. అవి ప్రభుత్వ హత్యలు. ఈ విషయాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకునేవారు లేక, ప్రభుత్వాల మీద ఒత్తిడి తీసుకొచ్చి వాటి నివారణ చర్యలు తీసుకునేట్లు చేసేవారు లేక వలస కూలీల శవాలు, అనాథ శవాలుగా మారుతున్నాయి.

## 1.6. విద్య

ఆంధ్ర ప్రదేశ్‌లో తెలంగాణ విద్యారంగం పూర్తిగా అన్యాయానికి గురి అయ్యింది. ప్రభుత్వ విద్యా సంస్థలకు అవసరమైన వనరులు, సదుపాయాలను కల్పించకుండా ప్రైవేటు విద్యా సంస్థలకు విచ్చలవిడి అనుమతులు ఇవ్వడం ద్వారా ప్రభుత్వమే విద్యార్థులకు నష్టం చేస్తున్నది. ఆర్థికంగా బలంగా ఉన్న వర్గాలు ఎన్ని ఫీజులైనా చెల్లిస్తూ తమ పిల్లల్ని ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివించుకుంటున్నాయి. తెలంగాణలో మెజార్టీ ప్రజలైన పేదలు తమ పిల్లలకు చదువును కొనివ్వలేకపోయారు. కనుక వారికి ఉన్నది కేవలం ప్రభుత్వ విద్యాసంస్థలే. కానీ అవి సక్రమంగా నడిచే పరిస్థితి లేకుండా పోయింది. కోస్తాంధ్ర పాలకులు, కోస్తాంధ్ర వ్యాపారుల కార్పోరేట్ విద్యకు మద్ధతునివ్వడం, ప్రభుత్వ విద్యకు వనరులు లేకుండా చేయడంవల్ల ఈ పరిస్థితి నెలకొన్నది.

తెలంగాణ ప్రాథమిక విద్య విషయంలో చూసినప్పుడు అత్యంత అన్యాయమైన స్థితి కనిపిస్తుంది. భారత రాజ్యాంగం ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యకు హామీనిచ్చింది. 15 సంవత్సరాలలోపు పిల్లలు పనిచేయడాన్ని నిషేదించింది. అయితే వాస్తవ పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా లక్షలాదిమంది పిల్లలు బడికి దూరమవుతూ, పనికి దగ్గరవుతున్నారు. భారతదేశమూ ఇందుకు మినహాయింపు కాదు. ఒక దేశ సామాజిక ఆర్థిక ప్రగతికి ప్రాథమిక విద్య కీలకమన్న విషయం అందరికీ తెలిసిందే. ఒకవైపు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య అందించాలనే హామీ ఉన్నప్పటికీ, మరోవైపు బడి మానేసిన పిల్లల సంఖ్య మాత్రం పెరుగుతూనే పోయింది. అదే సమయంలో అందిస్తున్న విద్యావకాశాలలోనూ అసమానతలు, వివక్షలు కొనసాగాయి. సమాజంలోని ప్రధానమైన వర్గాలకు విద్య అందుబాటులోకి రాకుండా పోయింది. హామీలకు, వాస్తవ పరిస్థితులకు రోజురోజుకూ దూరం పెరిగిపోయింది.

గ్రామాల్లో 5–14 సంవత్సరాల వయస్సున్న 45 శాతం మంది పిల్లలు బడికి పోలేదు. ఇందులో 8 సంత్సరాల పైబడిన పిల్లల్లో ఎక్కువమంది ఏదో ఒక పనికి వెళ్లారు. పిల్లలను బడికి పంపించాలని తల్లిదండ్రులు అనుకున్నప్పటికీ ప్రభుత్వ విద్య వివక్షకు గురై, ప్రైవేటు విద్యలకు ఫీజులు కట్టలేక తిరిగి పనికి పంపారు. పిల్లలను బడికి పంపించడం కంటే పనికి పంపించడమే మేలు అనుకున్నారు. ఈ పిల్లల్లో కూడా ఎక్కువమంది తమకంటే చిన్నపిల్లలను చూసుకోవడం, సొంత పొలాల్లో పనులు చేయడం, గొర్రెలు, మేకలు, గేదలను మేపడం అన్న పనులు చేశారు. గ్రామంలో ఎక్కువ మంది చిన్న, సన్నకారు రైతులే కావడం, వ్యవసాయం కూడా ప్రధానంగా వర్షాధారం కావడంతో వర్షాలు సకాలంలో కురవకపోవడం, సాగునీటి సౌకర్యాలు లేకపోవడం, పంటలు పండకపోవడం అన్నది వలసలకు దారితీసింది. ఇది పిల్లల పాలిట శాపంగా మారింది. కొద్దిమంది ఎన్ని సమస్యలు ఎదురైనా తట్టుకొని పిల్లల్ని బడికి పంపినా, అక్కడ పరిస్థితులు బాగాలేక, ఏమీ నేర్చుకోలేకపోతుండడంతో, తిరిగి పనులకు పంపించారు మళ్లీ. ప్రభుత్వ పాఠశాలలను కాదని ప్రైవేట్ పాఠశాలలకు పంపించే శక్తి వారికి లేదు. ఈ పరిస్థితుల్లో బడికి దూరమవుతూ, పనులకు దగ్గరయ్యారు. ఈ మొత్తం పరిణామాల వెనుక కోస్తాంధ్ర

వ్యాపారవర్గాల కార్పొరేట్ విద్యా ప్రయోజనాలు దాగి ఉన్నాయి.

విద్యా విధానంలో ఇంటర్మీడిట్ విద్య ఎంతో కీలకమైనది. విద్యార్థి భవిష్యత్తును, ఉన్నత విద్యను నిర్దేశించే శక్తి ఇంటర్మీడియెట్‌కు ఉన్నది. విద్యార్థి తన జీవిత కలలను సాకారం చేసుకోవాలన్నా, అనుకున్న లక్ష్యాన్ని చేరాలన్నా ఉన్నత విద్య ముఖ్యమైనది. అలాంటి ఉన్నత విద్యకు పునాది వేసేది ఇంటర్మీడియెట్ విద్యనే. అంటే విద్యార్థి జీవితంలో దీని ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఇంటర్మీడియెట్ విద్య విద్యార్థి జీవిత కలలను సాకారం చేయడానికి బదులుగా, కల్లోల సాగరంలో ముంచివేసేందుకు వాహకంగా పనిచేయడం తెలంగాణలోని విషాదకరమైన వాస్తవం. ప్రాథమిక విద్య విషయంలోనే చెప్పినట్లు ఇక్కడ కూడా కోస్తాంధ్ర పాలకుల విద్యా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ వల్ల ప్రభుత్వ కళాశాలలు సరిగ్గా నడవలేదు. కొద్దిమంది అన్ని సమస్యల్ని ఎదుర్కొంటూ ప్రభుత్వ కాలేజీల్లో చదువుకున్నా వారికి అవసరమైనన్ని వసతి గృహాలు లేకుండా పోయాయి. ఉన్న చోట కూడా పరిశుభ్రతకు తీసుకోవాల్సిన చర్యల లేమి కారణంగా సంక్రమించే అంటువ్యాధులు, సరైన ఆహారం లేక వచ్చే అనారోగ్య సమస్యలు వెంటాడి చివరికి విద్య వదిలేసే పరిస్థితి దాపురించింది.

ఈ విధమైన పరిస్థితులలో కూడా కొద్దిమంది ఉన్నత విద్యను అభ్యసించేందుకు డిగ్రీ కాలేజీలలో అడుగుపెట్టారు. సమాజంలోని మేధావులను, ఆర్థికవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు, లాయర్లు, డాక్టర్లు వంటివారిని తయారుచేసేది ఉన్నత విద్యనే. ఇంత ప్రాధాన్యం కలిగిన ఉన్నత విద్యను కోస్తాంధ్ర ప్రభుత్వం 'నాన్–మెరిట్'గా అభివర్ణించింది. అందువల్ల ఈ రంగానికి సబ్సిడీలు ఇవ్వాల్సిన అవసరం లేదనేది కోస్తాంధ్ర ప్రభుత్వాల భావన. క్రమేణా ఉన్నతవిద్యకు కేటాయిస్తున్న సబ్సిడీలను తగ్గించాలని ప్రభుత్వం కంకణం కట్టుకుంది. వీటివలన సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు లెక్కకుమించి వచ్చాయి. ఉపకార వేతనాల్లో కూడా కోత ఉండేది. సంవత్సరాలతరబడి లెక్చరర్‌ల పోస్టులు భర్తీ కాలేదు. ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులు ఎక్కువగా సాంప్రదాయ కోర్సుల్లోనే చేరారు. సైన్స్, బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ లాంటి ఆధునిక కోర్సులన్నీ సెల్ఫ్–ఫైనాన్స్ కోర్సులుగానే

ప్రారంభించబడ్డాయి. అంటే ఈ కోర్సులకు అయ్యే మొత్తం ఖర్చును విద్యార్థులే భరించాలన్నమాట. ప్రభుత్వం ఒక్కపైసా ఇందుకు ఖర్చు చేయదు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోర్సులకయ్యే ట్యూషన్ ఫీజును తిరిగి చెల్లిస్తానని (ఫీజు రీ అంబర్స్‌మెంట్) పేపర్లలో ప్రకటనలిచ్చింది. కానీ, వాస్తవానికి రీ అంబర్స్‌మెంట్ రాక, చదువు పూర్తయినా సర్టిఫికేట్లు తీసుకోలేకపోయినవాళ్లు ఎందరో ఉన్నారు. ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికేట్లు ఇస్తామని యాజమాన్యాలు అనడంతో వేరే కోర్సుల్లో అవకాశం వచ్చినా చేరేందుకు సర్టిఫికేట్లు లేక ఆగిపోయినవాళ్లు ఉన్నారు. మొత్తంగా విద్యకు దూరమైపోయారు. తెలంగాణ ప్రాంతంలో డిగ్రీ పూర్తి చేసి, తమ చదువుకు తగిన ఉద్యోగం చేయనివారు కోకొల్లలుగా కనిపించారు. దీని వెనుక కోస్తాంధ్ర ప్రభుత్వం చేసిన విద్యా ప్రైవేటీకరణ ఉన్నది. విజయవాడ, గుంటూరు, నెల్లూరు ప్రాంతాల్లో ట్యుటోరియల్స్, రెసిడెన్షియల్ కాలేజీలుగా చెలామణి అయ్యే కాలేజీలు 1997 ఇంటర్ పరీక్షా పత్రాల లీకేజీ తర్వాత జూనియర్ కాలేజీలుగా మార్పు చెందాయి. ఈ కాలేజీలు విజయవాడ, గుంటూరు మరియు నెల్లూరు ప్రాంతాలకే పరిమితం కాకుండా 1996 సం॥లో హైదరాబాదు మరియు రంగారెడ్డి జిల్లాలలో విస్తరణను ప్రారంభించి క్రమక్రమంగా అన్ని జిల్లాలకు వ్యాప్తి చెందాయి.

విశ్వవిద్యాలయాల విషయానికి వస్తే పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. రాష్ట్రంలో ప్రాంతీయ పరిధిగల ఆరు విశ్వవిద్యాలయాలలో రెండు కోస్తా ఆంధ్రలో, రెండు రాయలసీమలో, రెండు తెలంగాణ ప్రాంతంలో ఉన్నాయి. కానీ తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన విశ్వవిద్యాలయంగా పరిగణింపబడే ఉస్మానియా విశ్వవిద్యాలయం చారిత్రక, భౌగోళిక కారణాల వల్లనైతేనేమి, ఆరు సూత్రాల పథకం చేసిన నష్టం వల్లనైతేనేమి తన ప్రాంతీయ ప్రతిపత్తిని కోల్పోయింది. ఇవే కాకుండా రాష్ట్రవ్యాప్త పరిధిగల ఏడు విశ్వవిద్యాలయాలు, విశ్వవిద్యాలయ ప్రతిపత్తిగల రెండు సంస్థలు ఉన్నాయి. వాటిలో ఒక్కటి కూడా తెలంగాణ ప్రాంతంలో లేదు. ఆరోగ్య శాస్త్రాల విశ్వవిద్యాలయం కోస్తాంధ్రలో, మహిళా విశ్వవిద్యాలయం, ద్రవిడ భాషల విశ్వవిద్యాలయం, శ్రీ వెంకటేశ్వర వైద్య శాస్త్రాల సంస్థ(నిమ్స్) రాయలసీమలో ఉండగా, వ్యవసాయ, సాంకేతిక, సార్వత్రిక, తెలుగు విశ్వవిద్యాలయాలతోపాటు నిజాం వైద్య శాస్త్రాల సంస్థ(నిమ్స్) హైదరాబాద్‌లో

ఉన్నాయి. వీటికి తోడు కేంద్ర ప్రభుత్వం, యుజిసి ఆధ్వర్యంలో నడిచే నాలుగు సంస్థలు, స్వయం పోషకంగా ఉన్న మరో రెండు సంస్థలు కూడా ఉన్నాయి. వీటిలో సంస్కృత విశ్వవిద్యాలయం, సత్యసాయి ఉన్నత విద్యా సంస్థ రాయలసీమలో ఉండగా, కేంద్రీయ విశ్వవిద్యాలయం, ఉర్దూ విశ్వవిద్యాలయం, ఇంగ్లీషు, విదేశీ భాషల అధ్యయన సంస్థ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అంతర్జాతీయ సంస్థ రాజధానిలో ఉన్నాయి. వ్యవసాయ, సాంకేతిక విశ్వవిద్యాలయాలకు కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో విశ్వవిద్యాలయ శాఖలు కూడా ఉన్నాయి. కానీ తెలంగాణ ప్రాంతం అటువంటి అవకాశాలకు నోచుకోవడం లేదు. ఈ సందర్భంలోనే గమనించవల్సిన విషయం మరొకటి ఉన్నది. సాంకేతిక విశ్వవిద్యాలయాన్ని మొదట వరంగల్‌లో స్థాపించి, తర్వాత రాజధానికి తరలించడం జరిగింది. రాష్ట్రవ్యాప్త పరిధిగల విశ్వవిద్యాలయాలు, రాష్ట్ర రాజధానిలో ఉంటేనే బాగుంటుంది అనే నెపంతో ఆ తరలింపు జరిగింది. ఆ పని చేసింది ఆనాటి ఆంధ్రా కాంగ్రెస్ ప్రభుత్వం. తర్వాత సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని ముందు నల్గొండలో స్థాపించి రెండు నెలల్లోనే రాజధానికి తరలించారు. ఈ తరలింపుకు చెప్పింది కూడా పాత కారణమే. ఈ తరలింపు చేసింది కూడా మళ్లీ ఆంధ్రా తెలుగు దేశం ప్రభుత్వమే (అప్పుడు ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నాడు). అదే ప్రభుత్వానికి రాష్ట్రవ్యాప్త పరిధిగల ఆరోగ్యశాస్త్రాల విశ్వవిద్యాలయాన్ని కోస్తాంధ్రలో స్థాపించినప్పుడుగానీ, మహిళా విశ్వవిద్యాలయాన్ని రాయలసీమలో స్థాపించినప్పుడుగానీ ఇవి రాజధానిలోనే ఉంటే బాగుంటుంది అన్న విషయం జ్ఞాపకం రాలేదు. అలా అనడం కంటే తెలంగాణ పట్ల వివక్ష చూపించారు అనడం సరైనదవుతుంది. ఎన్టీఆర్ తర్వాత వచ్చిన చంద్రబాబు నాయుడు కూడా రాష్ట్రవ్యాప్త పరిధిగల ద్రవిడ భాషల విశ్వవిద్యాలయాన్ని రాయలసీమలో(కుప్పం) స్థాపించాడు. రాష్ట్రవ్యాప్త పరిధిగల విశ్వవిద్యాలయాలు తెలంగాణలో ఉంటే అభ్యంతరకరంకానీ, కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఉంటే సమర్థనీయం అనే కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాలకు తెలంగాణ పట్ల ఎంతటి వివక్ష ఉన్నదో అర్థం అవుతుంది.

ఎవరైనా ఒక మనిషి రూపుదిద్దుకోవడానికి అతను జీవిస్తున్న సమాజం, ఆర్థిక, సాంస్కృతిక పునాదులే దోహదం చేస్తాయన్నది ఏ సమాజానికైనా వర్తించే సత్యం. అట్లే

“ఒక ప్రాంతపు సమగ్ర అభివృద్ధి చాలావరకు ఆ ప్రాంతం విద్యారంగంలో సాధించిన ప్రగతిపై ఆధారపడి ఉంటుంది. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ తిరిగి విద్యాభివృద్ధిని మరింత వేగవంతం చేస్తుంది. విద్యారంగంలో తెలంగాణా ప్రాంతం రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకంటే వెనుకబడి పోవటంతో ఇతర అన్ని రంగాల్లో కూడ వెనుకబడిపోయింది” (కొత్తపల్లి జయశంకర్, తెలంగాణ రాష్ట్రం ఒక డిమాండ్, పుట.47). ఎప్పుడైనా ఒక ప్రాంతపు విద్యాభివృద్ధిని అంచనా కట్టేటప్పుడు ఆ ప్రాంత జనాభాను ప్రధాన పునాదిగా పెట్టుకొని చూడడం అవసరం. రాష్ట్ర జనాభాలో తెలంగాణాది 40.68, కోస్తాంధ్రది 41.58 శాతం, రాయలసీమది 17.73 శాతం. ఇలా విడివిడిగా ఒక ప్రాంత జనాభాను దృష్టిలో ఉంచుకొని ఆ ప్రాంతానికి విద్యావసతులు నెలకొల్పకపోతే ప్రాంతీయ అసమానతలు తలెత్తే అవకాశం ఉంటుంది. తెలంగాణాలో జరిగిందదే. “విద్యాభివృద్ధికి ముఖ్యమైన కొలమానం అక్షరాస్యత రేటు”(జయశంకర్, కొత్తపల్లి. 2015 : 48). 2009 వరకు ఉన్న లెక్కల ప్రకారం రాష్ట్ర అక్షరాస్యత రేటు 61.11(సగటున). అదే విడివిడిగా ప్రాంతాలవారీగా చూసినప్పుడు తెలంగాణలో 58.77 శాతం, కోస్తాంధ్రలో 63.58 శాతం, రాయలసీమలో 60.53 శాతం ఉన్నది. దీనినిబట్టి వెనుకబడిన రాయలసీమ కంటే ఇంకా వెనకబడేయబడ్డది తెలంగాణ అని అర్థమవుతుంది. దీనికి కారణం తెలంగాణలో విద్యారంగానికి కేటాయించే నిధుల శాతం తక్కువ కావడమే. 2009 వరకు ప్రాథమిక విద్యలో తెలంగాణకు 32 శాతం కంటే ఎక్కువ ఖర్చు పెట్టినట్లు రికార్డులు చెప్తున్నాయి. ఇదే పరిస్థితి అట ఇటుగా ప్రాథమికోన్నత విద్యలోనూ, జూనియర్, డిగ్రీ కళాశాలల విషయంలోనూ ఉన్నది. ఆఖరికి విశ్వవిద్యాలయాల స్థాపనలో కూడా వివక్ష చూపారు.

1948కి ముందు ఉన్నటువంటి నిరంకుశ భూస్వామ్య పాలనలో ప్రజల బాధ్యత ప్రభుత్వానిది కాకపోవచ్చు గాని 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరించాక విద్యారంగంలో వెనుకబడిన తెలంగాణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవలసింది. కానీ ఆ పని జరగలేదు. అసలే నిరంకుశ పాలనలో ఉండిన తెలంగాణ విద్యా విషయకంగా చాలా వెనకబాటులో ఉన్నదనేది, బ్రిటిష్ పరిపాలిత ఆంధ్రులు ముందున్నారనేది అందరూ

అంగీకరిస్తున్న వాస్తవమే. కానీ సుమారు ఆరు దశాబ్దాల సమైక్య రాష్ట్రంలో తెలంగాణలో విద్యాభివృద్ధి పెద్దగా లేదనే చెప్పాలి. ప్రభుత్వం తనకు తానుగా ఏర్పర్చుకున్న మార్గదర్శక సూత్రాలను తానే ఉల్లంఘించింది.

ఈ పరిస్థితి ఇలా ఉంటే దీనికి తోడు విద్యావ్యాపారానికి ప్రభుత్వం పథకాలు రచించింది. నిజానికి తెలంగాణలో ఉన్నంత కాకపోయినప్పటికీ అన్ని ప్రాంతాలలో ఈ అవాంఛిత మార్కెట్ సంస్కృతి వ్యాపించింది. ప్రధానంగా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రకటించిన విజన్–2020లో చాలా స్పష్టంగా విద్యను వ్యాపార ఉపయోగ వస్తువుగా పరిగణించడం కనిపిస్తుంది. దాని అమలు తద్భిన్నంగా ఉండదు. ప్రధానంగా ఉన్నత విద్యలో ప్రైవేటీకరణ జరపడం సామ్రాజ్యవాద శక్తుల మార్కెట్ అవసరం. దానికి స్థానికంగా ఉండే పాలక వర్గాలు ఎవరైనా వారి నుండి మద్ధతు ఉండనే ఉంటుంది. "ప్రైవేటు విద్యారంగంలో పెట్టుబడిదారులకు లాభాలు ఆర్జించి పెట్టడం మాత్రమే కాదు, విద్యారంగ ప్రైవేటీకరణవల్ల ఏలిన వారికి కూడా రెండు ప్రధానమైన రాజకీయ ప్రయోజనాలున్నాయి. మొదటిది, విద్యారంగ ప్రైవేటీకరణ వల్ల, విద్యారంగంలో దళితులకు, ఆదివాసులకు, వెనుకబడిన కులాలకు రిజర్వేషన్ పాటించవలసిన ప్రభుత్వ బాధ్యత నుంచి తప్పించుకోవచ్చు. అంటే, ఇవాళ సమాజంలో కొనసాగుతున్న అసమానతల అగాథం మరింతగా పెరిగి కొన్న వర్గాలు ఉన్నతవిద్యకు దూరమయ్యే స్థితిని ఇంకా బలంగా కొనసాగించవచ్చు"(వేణుగోపాల్, ఎన్. 1999 : 40).

ఇట్లా ప్రభుత్వాలు విపరీతంగా కార్పోరేట్ విద్యావ్యవస్థకు మద్ధతునివ్వడం, ప్రభుత్వ పాఠశాలలకు, కళాశాలలకు మొండిచెయ్యి చూపడం వల్ల బతకడమే గగనమవుతున్న వర్గాలకు చదువుకునే, వికాసం పొందే అవకాశం దక్కకుండా పోయింది. మొత్తంమీద ఒక ప్రాంత అభివృద్ధి కుంటుపడింది. శ్రీచైతన్య, నారాయణ అనే రెండు ఆంధ్ర కార్పొరేట్ విద్యాసంస్థలు మొత్తం విద్యారంగాన్ని నియంత్రించే స్థితి ఆవరించింది.

## 1.7. వైద్యం

తెలంగాణలో వైద్య రంగంలో జరిగిన అన్యాయానికి సంబంధించి ఆదివాసుల విభాగంలో కొంత చర్చించడం జరిగింది. ఆదిలాబాద్ జిల్లాలో 1998 సంవత్సరంలో రెండువేలమందికి పైగా ఆదివాసులు కలరా, మలేరియా వ్యాధికి బలయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వీరంతా జీర్ణకోశ సంబంధమైన వ్యాధులతో, అతిసార వ్యాధితో చనిపోయారని ప్రకటించింది. ఫలానా వ్యాధి కాదు, మరొక వ్యాధి అని పేరు మార్చి చెప్పినంత మాత్రాన జరిగిన నష్టంలో మార్పేమీ ఉండదు, తమ బాధ్యత నుండి వైదొలగడం తప్ప. వాస్తవానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మందులు లేవన్న విషయం తెలంగాణ ఐక్యవేదిక బృందం వెలుగులోకి తీసుకువచ్చింది. కలరా, మలేరియాలే కాదు ప్రభుత్వం చెప్పిన జీర్ణకోశ వ్యాధులే కాదు, సాధారణ జ్వరానికి కూడా అక్కడ మందులు లేకుండాపోయాయి. ఆదివాసీ గ్రామాల్లో నీరు మాత్రమే కాక కనీస రోడ్డు సదుపాయాలు కూడా ఉండవు. రెండువేలమంది ఆదివాసీలు మరణించడంతో కంగారుపడ్డ ప్రభుత్వం ఆ ప్రాంతాలకు వైర్‌లెస్‌లు, అంబులెన్స్‌లు పంపింది. ప్రజాధనాన్ని వృధా చేయడం తప్ప మరొకటి కాదు. రోడ్లు లేని గ్రామాలకు అంబులెన్సులు పంపి ఏం ప్రయోజనం? దీంతో గ్రామాల్లో ఏం జరుగుతున్నదో వైర్‌లెస్ సెట్ల ద్వారా డాక్టర్లకు తెలియజేసే మార్గాలు కూడా మూసుకుపోయాయి. ఒకవైపు ప్రజలు ప్రాణాలు కోల్పోతుంటే ప్రభుత్వం ఇటువంటి జిమ్మిక్కులతో కాలయాపన చేస్తూ ఏదో చేస్తున్నట్టుగా నమ్మించజూసింది. తెలంగాణ ప్రజల ఆరోగ్యం పట్ల సీమాంధ్ర ప్రభుత్వాలకు ఎంత శ్రద్ధ ఉందో, చిత్తశుద్ధి ఉందో ఈ నిర్వాకం ఒక ఉదాహరణగా కనిపిస్తుంది. వాస్తవానికి తెలంగాణ ఆంధ్రప్రదేశ్‌లో కలవకముందు నిజాం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య సంరక్షణ పథకం ప్రమాణాల రీత్యా ఎంతో ఉన్నతమైనది, విలువైనది కూడా. ప్రపంచంలో సోషలిస్టు ప్రభుత్వాలు ఏర్పడి ఉచిత ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు పురుడు పోసుకోవడానికి ముందే హైదరాబాద్ రాష్ట్రంలో ఆఖరి నిజాం రాజు అటువంటి వ్యవస్థకు అంకురార్పణ చేశాడు. ఉస్మానియా ఆసుపత్రి ఆ వ్యవస్థకు కేంద్రబిందువు. అన్ని రకాల వ్యాధుల నుంచి ప్రజలకు ఉచితంగా ఆరోగ్య రక్షణ కల్పించడంలో ఆనాడు ఉస్మానియా ఆస్పత్రి చిరస్మరణీయమైన సేవలు

అందించింది. రోగులందరికీ ఉచితంగా మందులు అందించడంతోపాటు ఆస్పత్రిలో చేరే రోగులకు ఉచితంగా ఆహారం కూడా సరఫరా చేసేది. ఈ విషయంలో ఎటువంటి వివక్షకు తావు లేదు. మహిళల ప్రత్యేక అవసరాలను తీర్చే విక్టోరియా ప్రసూతి ఆస్పత్రి కూడా ఉచితంగా సేవలందించింది. ప్రత్యామ్నాయ పద్ధతుల్లో వ్యాధులకు చికిత్స చేసే యునాని ఆస్పత్రి కూడా తనవంతుగా ఉచితంగానే సేవలందించింది. ఈ పరిస్థితి కేవలం ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాలేదు. జిల్లా స్థాయిలోనూ ఈ ఉచిత వైద్య సేవలు కొనసాగాయి. ఆస్పత్రుల్లో ఉచిత సదుపాయాల కల్పనతో పాటు సామర్థ్యం ఉన్నవాళ్లకు అద్దె చెల్లించి ప్రత్యేక గదులు తీసుకునే అవకాశం కూడా ఉండేది. రాస్ క్వారంటైన్ ఆస్పత్రి ఏర్పాటు ఈ క్రమంలో సాధించిన మరో గొప్ప విజయం. కలరా, మశూచి, ప్లేగు, మలేరియా వంటి అంటువ్యాధుల బారినపడ్డ రోగుల పట్ల ఇది ప్రత్యేక శ్రద్ధ వహించేది. పోలీసు చర్య తర్వాత నీలోఫర్ చిన్నపిల్లల ఆస్పత్రి, క్యాన్సర్ ఆస్పత్రి, ఆయుర్వేద ఆస్పత్రి, నిజాం ఆర్థోపెడిక్ ఇనిస్ట్యూట్, గాంధీ ఆస్పత్రి నిజాం హైదరాబాద్ నిధులతో ప్రారంభమయ్యాయి. సరోజినీదేవి కంటి ఆస్పత్రి, ఇఎన్‌టి ఆస్పత్రి, మరో రెండు ప్రత్యేక ఆస్పత్రులు కూడా ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక ఈ పరిస్థితుల్లో పెను మార్పులు చోటుచేసుకున్నాయి. స్థానికంగా ప్రతిభా పాటవాలకు కొరత లేనప్పటికీ, ఆంధ్రా ప్రాంతం నుంచి డాక్టర్లను, ఇతర అధికారులను ప్రభుత్వం పెద్ద ఎత్తున ఇక్కడకు దిగుమతి చేసింది. స్థానికులకు అన్యాయం జరగడం మాట అటుంచి, ఈ ఆంధ్రా దిగుమతులతో ప్రజా ఆరోగ్య రంగంలో వ్యాపార ధోరణులు, అవినీతి ప్రవేశించింది. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో ఈ పరిస్థితులు మరింత దిగజారాయి.

ఉచిత ఆరోగ్య పరిరక్షణ వ్యవస్థలో ముఖ్య భాగమైన ఉస్మానియా ఆస్పత్రి ముందుగా ప్రభుత్వ గొడ్డలిపెట్టుకు గురైంది. సిబ్బంది జీతాలు చెల్లించే నిమిత్తం మాత్రమే ప్రభుత్వం నిధులను పరిమితం చేసింది. ఉచితంగా మందులు అందకపోవడంతో ప్రజలు వాటిని బయటి నుండి కొనుగోలు చేయవల్సిన దుస్థితి ఏర్పడింది. దీనికి సాక్ష్యంగా నేటి గాంధీ ఆస్పత్రిని అందరూ గమనించవచ్చు. మందుల షాపుల దోపిడీ మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నది. రోగులపట్ల డాక్టర్లకు ఏమాత్రం శ్రద్ధ లేకుండా పోయింది.

ఆస్పత్రుల సిబ్బంది లంచగొండితనం పరాకాష్ఠకు చేరింది. లంచాలు ఇవ్వలేని రోగుల బంధువులపై చేయి చేసుకునే వరకు పరిస్థితి విషమించింది. గాంధీ ఆస్పత్రితో సహా అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు ఈ 'వ్యాధి' వ్యాపించింది. పలు స్వచ్ఛంద సంస్థల నుంచి పెద్ద ఎత్తున పసిపిల్లలను స్వాధీనం చేసుకున్న సందర్భంగా నీలోఫర్ ఆస్పత్రి ఎంత అసమర్థంగా పనిచేసిందో, దాని నిర్లక్ష్యానికి ఎంతమంది పసికందుల ప్రాణాలు హరించుకుపోయాయో చరిత్రలో రికార్డు అయి ఉన్నది. పిల్లల పరిరక్షణకు నిధుల కొరత రానివ్వమంటూ సీమాంధ్ర ప్రభుత్వ ఆరోగ్య శాఖలు ఎన్ని ప్రకటనలు చేసినా ప్రయోజనం లేకపోయింది. తగిన మందులు, సౌకర్యాలు లేకనే పిల్లలు చనిపోయారు. క్యాన్సర్ ఆస్పత్రి ప్రైవేటీకరణ సీమాంధ్ర ప్రభుత్వం తీసుకున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలకు పరాకాష్ఠ. దీంతో పేద, మధ్య తరగతి ప్రజానీకం అత్యంత ఖరీదయిన మందులను కొనవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ భారాన్ని మోయడం వారికి అసాధ్యం కూడా. దీనికి ఉదాహరణగా నేటి కార్పొరేట్ క్యాన్సర్ ఆసుపత్రులైన అపోలో, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రులను చెప్పవచ్చు. ఈ మొత్తం పరిణామాలకు కారణం కోస్తా ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ తిష్టవేసి వైద్యవ్యాపారం మొదలుపెట్టిన పెట్టుబడిదారులే. ఈ వర్గ ప్రయోజనాలను కాపాడటం కోసమే తెలంగాణలో ప్రజా ఆరోగ్య వ్యవస్థల్ని నిర్వీర్యం చేశారన్న వాస్తవం అందరూ అర్థం చేసుకోగలిగే స్థాయిలోనే ఉన్నది. హైదరాబాద్ అంతటా పుట్టగొడుగుల్లా వ్యాపించిన కార్పొరేట్ ఫైవ్‌స్టార్ ఆసుపత్రుల్ని చూస్తే వైద్యం ఎంత ఖరీదుగా మారిందో, దాని వెనుక ఉన్న యాజమాన్యాల ప్రాంతీయాధిపత్య పెట్టుబడిదారీ స్వభావం ఎలాంటిదో అర్థం అవుతుంది. పేదజనం స్టార్ ఆస్పత్రులకు వెళ్లలేరు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పనిచేయవు. ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రం తెలివిగా ఒక వెసులుబాటు కల్పించారు. ఆరోగ్యశ్రీవంటి ఉచిత వైద్య సదుపాయాలవంటివి కార్పొరేటు ఆసుపత్రుల్లో కల్పించి ప్రజాధనాన్ని వైద్యరంగంలోని పెట్టుబడిదారులకు మళ్లించారు. నిజానికి ఆరోగ్యశ్రీ వంటి పథకాల ద్వారా కార్పొరేటు ఆసుపత్రులకు ప్రభుత్వాలు చెల్లిస్తున్న డబ్బులతో స్వయంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అత్యాధునిక వైద్య పరికరాలు కొని, వాటి సేవల్ని ప్రజలకు ఉచితంగా అందించవచ్చు. కానీ కార్పొరేట్ ఆసుపత్రులనే ప్రోత్సహించదల్చుకున్న సీమాంధ్ర ప్రభుత్వాలు ఆ పని చేయవు, చేయలేదు. దాంతో అసంఘటిత రంగాలకు

చెందిన పేద, మధ్యతరగతి ప్రజలు ఆర్థిక సహాయం కోసం ధార్మిక సంస్థలను ఆశ్రయించక తప్పడం లేదు. తెలంగాణలో ఉచిత వైద్య సంరక్షణ వ్యవస్థను నిస్సిగ్గుగా నిర్వీర్యం చేసిన సీమాంధ్ర ప్రభుత్వమే తన ఉద్యోగుల వైద్య ఖర్చులను ఫైవ్‌స్టార్ ఆస్పత్రులకు తిరిగి చెల్లించడానికి ముందుకు రావడం ఒక కుట్ర. తెల్ల రేషన్ కార్డులు ఉన్నవారికి ప్రభుత్వం ఉచిత వైద్యాన్ని అందిస్తుంది అన్నది కూడా ఈ కుట్రలో భాగంగానే గుర్తించాలి.

ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్యుల నియామకం మొదలైన విషయాలను సంఖ్యాపరంగా చూసినా కూడా ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ వైద్యరంగం ఎంత అన్యాయానికి గురైందో అర్థం అవుతుంది. 2001 లెక్కల ప్రకారం అలోపతి వైద్య సౌకర్యాలు ఇలా ఉన్నాయి. మొత్తం సీమాంధ్రలో జనరల్ ఆస్పత్రులు 193, ప్రత్యేక ఆస్పత్రులు 21, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 867, డిస్పెన్సరీలు 203, వైద్యుల సంఖ్య 5716. అదే తెలంగాణలో చూసుకుంటే జనరల్ ఆస్పత్రులు 146, ప్రత్యేక ఆస్పత్రులు 19, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 519, డిస్పెన్సరీలు 109, వైద్యుల సంఖ్య 4104. సరిగ్గా ఈ పరిస్థితే ఆయుర్వేదం, యునాని, హోమియోపతి వైద్యంలో కూడా కనిపిస్తుంది.

## 1.8. ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం లేవదీసిన వర్గాల్లో మొట్టమొదటి వరుసలో ఉండేది తెలంగాణ నిరుద్యోగులు. 1948 – 1952 మధ్య కాలంలో ఏం జరిగిందో ఇంతకుముందే వివరించాను. నిజానికి ఏదైనా ఒక ప్రాంతంలోని ఉద్యోగాలు స్థానికులకే దక్కాలన్నది చాల ప్రజాస్వామిక ఆకాంక్ష. కానీ ఆ ప్రజాస్వామిక భావనను తుంగలోతొక్కారు. 1952లో పతాక స్థాయిలో నడిచిన నాన్‌ముల్కీ గోబ్యాక్ ఉద్యమానికిగానీ, 1969 ప్రత్యేత తెలంగాణ ఉద్యమం ప్రారంభం కావడానికిగానీ కారణం తెలంగాణలోని ఉద్యోగాలను సీమాంధ్రులు కొల్లగొట్టడమే. ఇంకా చెప్పాల్సివస్తే తెలంగాణకు జరిగిన అన్యాయాల్లో ప్రధానంగా ఉద్యోగరంగాన్నే చెప్పాల్సి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిననాటినుండి పాలకులు అమలు జరుపుతున్న విధానాల పర్యవసానమే

తెలంగాణలో నిరుద్యోగం. 1956 తర్వాత తెలంగాణ యువత ఉపాధి అవకాశాలు బాగా తగ్గిపోవడం, తెలుగువారికోసం ప్రత్యేక రిక్రూట్‌మెంట్లు నిర్వహించి ఆంధ్రాప్రాంతం నుంచి వేలాదిమందిని పిలిపించి ఉద్యోగాలివ్వడంతో ప్రభుత్వం ముల్కి నిబంధనలను కాలరాసింది. ప్రభుత్వం 1969 నాటికే దాదాపు ఇరవై రెండు వేల మంది తెలంగాణేతరులను ఉద్యోగాల్లోకి తీసుకొని తెలంగాణ నిరుద్యోగుల నోట్లో మట్టికొట్టింది. హైదరాబాద్‌లో సచివాలయం ఏర్పాటుచేసి సిబ్బంది క్రమబద్ధీకరణ పేరుతో కోస్తా ప్రాంతంలో పనిచేస్తున్నవారిని, రాయలసీమ ఉద్యోగులనే కాకుండా కొత్తవారిని కూడా కలిపి మరో 50 వేల మందిని కోస్తాంధ్ర ప్రభుత్వమే స్వయంగా తెలంగాణకు తరలించింది. స్థానిక ఉద్యోగులకు ప్రమోషన్లు నిరాకరించి, తెలంగాణ నిరుద్యోగులకు తెలుగు రాదనే సాకుతో దాదాపు లక్ష ప్రభుత్వ ఉద్యోగాలను ప్రభుత్వం కోస్తా, రాయలసీమవాళ్లతో నింపింది. అలాగే కొత్తగా ఏర్పాటైన వివిధ కార్పొరేషన్లు, ప్రభుత్వరంగ సంస్థల్లో ముల్కీ నిబంధనలతో నిమిత్తం లేకుండా వేలాది ఉద్యోగాలు తెలంగాణేతరులతో భర్తీ చేసి తెలంగాణ ఉద్యోగుల్లో, నిరుద్యోగుల్లో పేరుకుపోయిన నిస్పృహకు ఆజ్యం పోసింది. అందుకే తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం రూపుదిద్దుకుంది. ఆ ఉద్యమం రాజకీయ నాయకుల చేతుల్లోపడి నీరుగారిన తర్వాతికాలం నుండి తెలంగాణ యువతకు ఉరితాడు బిగిసింది. ఉద్యమం ద్వారా జరిగిన ఒప్పందాలు అమలుకు నోచుకోలేదు. అక్రమంగా నియమించిన తెలంగాణేతరులను వెంటనే వెనక్కి పంపిస్తామని, అర్హులైన తెలంగాణ నిరుద్యోగులతో ఆ ఖాళీలు నింపుతామని, అర్హులు తెలంగాణలో లేకపోతే చదువుకుని ఆయా అర్హతలు పొందినవారు దొరికేంతవరకు ఆ ఖాళీలను అలాగే ఉంచుతామని ప్రభుత్వం 1969లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా పైనుండి 4 సంవత్సరాలు తెలంగాణలో చదివిన ప్రతి వ్యక్తి స్థానికుడే అనే విధంగా నిబంధనలు వచ్చాయి. నాన్–గెజిటెడ్ ఉద్యోగాలకు మినహా మరే ఇతర ఉద్యోగానికి కూడా స్థానిక నిబంధనలు వర్తించవు. అలాగే కార్పొరేషన్లు, బోర్డులు, ఇతర ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగాలకు తీరుతెన్ను లేకుండా పోయింది. పర్యవసానంగా ఉపాధిరంగం పూర్తిగా కోస్తాంధ్ర అధికారులు, ఉద్యోగుల చేతుల్లోకి వెళ్లింది. 1983లో ప్రభుత్వం ఇచ్చిన లెక్కల ప్రకారమే రాష్ట్రంలోని గెజిటెడ్ అధికారుల్లో 15 వేల 278 మంది కోస్తాంధ్రకు చెందినవారు కాగా

కేవలం 7 వేల 717 మంది మాత్రమే తెలంగాణ వాళ్లు ఉన్నారు. ఎన్‌జీవోలలో 2 లక్షల 24 వేలమంది ఆంధ్రప్రాంతంవారు కాగా కేవలం లక్షా 9 వేలమంది మాత్రమే తెలంగాణావాళ్లున్నారు. ఈ పరిస్థితి 1980 తరువాత, అంటే తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరీ అధ్వాన్నంగా తయారయ్యింది. తెలంగాణ ప్రాంతంలో ఏర్పాటైన విశ్వవిద్యాలయాలు, ఇతర సంస్థల్లో ఉద్యోగుల నియామకం పూర్తిగా ఏకపక్షంగా జరిగింది. తెలుగు యూనివర్శిటీ, డా.బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ, జెఎన్‌టీయూలలో తెలంగాణ ప్రాంతంవారి ప్రాతినిధ్యం నామమాత్రంగానే ఉన్నది. న్యాయ, వైద్య రంగాల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తుంది. లక్షలాదిమంది తెలంగాణ యువకులు తెలంగాణ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజిల్లో నిరుద్యోగులుగా నమోదు చేసుకొని ఉద్యోగాలు రాక వేసారిపోయారు. 1998 లెక్కల నాటికి మొత్తం రాష్ట్రంలో ఉన్న 30 లక్షలమంది చదువుకున్న నిరుద్యోగుల్లో ఒక్క తెలంగాణ నుండే 14 లక్షలమంది వివిధ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజిల్లో తమ పేర్లు నమోదు చేసుకోవడం అన్నది పరిస్థితిలోని తీవ్రతను సూచిస్తుంది.

మరోవైపు పారిశ్రామిక రంగంలో కూడా కోస్తాంధ్ర పాలకులు తెలంగాణ నిరుద్యోగులకు, ఉద్యోగులకు– ఇరువురికీ అన్యాయం చేశారు. తెలంగాణలో 1956కు పూర్వం వివిధ ప్యాక్టరీలు సమర్థవంతంగా పనిచేస్తుండేవి. అప్పటికి పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో హైదరాబాద్ కూడా ఒకటి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఉన్న విస్తారమైన బొగ్గు నిల్వలు, జల వనరులు అనేక ఫ్యాక్టరీల స్థాపనకు కారణమయ్యాయి. ముఖ్యంగా హైదరాబాద్‌లోని ఆల్విన్, వరంగల్‌లోని ఆజంజాహి స్పిన్నింగ్ మిల్, అంతర్గాం స్పిన్నింగ్ మిల్, సిర్పూర్ సర్‌సిల్క్ వంటి అనేక పరిశ్రమలు అనేకమందికి ఉపాధి కల్పిస్తుండేవి. ఉమ్మడి రాష్ట్రం ఏర్పడ్డాక ప్రభుత్వం కొత్త పరిశ్రమలు నెలకొల్పకపోగా ఉన్న పరిశ్రమల్ని మూసివేసి వేలాదిమందిని నిరుద్యోగంలోకి నెట్టివేసింది. ఒక్క ఆల్విన్ మూతపడడం వల్లనే 15 వేలమంది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఒకవైపు తెలంగాణ కార్మికుల పరిశ్రమలు మూసివేస్తూ మరోవైపు కొత్తగా మెదక్, రంగారెడ్డి, హైదరాబాద్, నల్గొండ జిల్లాల్లో లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూమిని ఆంధ్రా వలస పారిశ్రామికవేత్తలకు ధారాదత్తం చేశారు. ఈ పరిస్థితి 1980 తర్వాత, అంటే తెలుగుదేశం

అధికారంలోకి వచ్చిన తర్వాత విపరీతంగా పెరిగిపోయింది. ఈ పారిశ్రామికవేత్తలు తెలంగాణ వనరులైన నీరు, విద్యుత్ వంటివి సబ్సిడీలతో తీసుకుంటూ తెలంగాణ ప్రాంతవాసులకు ఉద్యోగాలు నిరాకరించారు. తెలంగాణ ప్రాంతంలో ఉన్న పదివేల చిన్న, మధ్యతరగతి పరిశ్రమల్లో ఆరువేల పరిశ్రమలు కోస్తాంధ్ర పెట్టుబడిదార్లవికాగా, అందులో కేవలం 1250 మాత్రమే తెలంగాణ యజమానుల చేతుల్లో ఉన్నాయి. మిగిలినవాటిలో రెండువేలు ఇతర రాష్ట్రాలవారు, మరో 750 రాయలసీమ పారిశ్రామికవేత్తలు నడిపిస్తున్నారు. ఈ పరిశ్రమల్లో కార్మికుల నియామకం పరిశీలిస్తే మొత్తం 4 లక్షల 13 వేల మంది కార్మికుల్లో 95 వేల మంది అంటే కేవలం 22 శాతం మంది మాత్రమే తెలంగాణవాళ్లు. తెలంగాణవాళ్లు పనిచేయరనో, సమ్మెలు చేస్తారనో, సంఘాలు పెడతారనో వాళ్లను నిరాకరించారు. ప్రభుత్వం కార్మికుల నియామకం విషయంలో ఎటువంటి నిబంధనలు రూపొందించకపోవడంతో తెలంగాణలో ఉన్న పరిశ్రమల్లోనే స్థానికులకు అవకాశాలు లేకుండా పోయాయి. ఇవేకాకుండా దినసరి కూలీల్లో 67 శాతం కోస్తాంధ్రవాళ్లు కాగా, కేవలం 17.4 శాతం మాత్రమే తెలంగాణ వాళ్లు ఉన్నారు. అలాగని తెలంగాణలో నిరుద్యోగులు లేరనో, ఉద్యోగాలు చేయడానికి తెలంగాణ వాళ్లు ఇష్టపడడం లేదనోకాదు. కేవలం అవకాశాలు దొరకకపోవడం, యాజమాన్యాలు ఈ ప్రాంతంవారిని ఉద్యోగాల్లోకి తీసుకోవడానికి నిరాకరించడంవల్లనే ఈ పరిస్థితి ఏర్పడింది. ఒక్క రంగారెడ్డి జిల్లా పరిస్థితి పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా అర్థం అవుతుంది. ఈ జిల్లాలోని వివిధ పరిశ్రమల్లో దాదాపు లక్షా అరవై వేలమంది తెలంగాణేతరులు పనిచేస్తున్నట్లు అంచనా. అలాగని రంగారెడ్డి జిల్లాలో స్థానికులెవరూ నిరుద్యోగులు లేరని అర్థం కాదు. రంగారెడ్డి జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌లో దాదాపు రెండు లక్షల మంది నిరుద్యోగులు రిజిస్టర్ చేయించుకుని ఉద్యోగాలకోసం ఎదురు చూశారు. ఇటు ప్రభుత్వ ఉద్యోగాలు లేకపోవడం, అటు ప్రైవేట్ సంస్థలు అవకాశాలు ఇవ్వకపోవడం వల్ల తెలంగాణలో విపరీతమైన నిరుద్యోగ సమస్య వ్యాపించింది.

“పెద్దమనుషుల ఒప్పందంలో విలీనం వల్ల జరిగే ఉద్యోగుల తొలగింపులు ప్రాంతీయ జనాభా నిష్పత్తి ప్రకారం జరగాలని నాలుగో అంశం, జరుగుతున్న

నియామకాలు ప్రాంతీయ జనాభా నిష్పత్తి ప్రకారం జరగాలని ఐదో అంశం నిర్దేశించాయి. ఏడో అంశం ఇంకా స్పష్టంగా తెలంగాణ ప్రాంతీయుల ఉద్యోగ నియామకాలలో నిర్ణీత నిష్పత్తిని పాటించేందుకుగాను 12 సంవత్సరాల నివాసం వంటి సూత్రాలను రూపొందించాలని నిర్దేశించింది. అంటే ప్రాంతీయులకే ఉద్యోగాలు అనే పునాది మీదనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది (వేణుగోపాల్, ఎన్. 2009 : 226). కానీ అనేక ఒప్పందాల లాగానే ఈ ఒప్పందాన్ని కూడా ఉల్లంఘించారు. దాంతో అనేకమార్లు నిరసనలు వెల్లువెత్తడం, సమస్యను ఉపశమింపజేయడంకోసం తాత్కాలికంగా ఏవో జీవోలు తెచ్చినట్లు ప్రకటించడం, వెనువెంటనే ఉల్లంఘించడం ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణలో సాధారణ విషయం.

పెద్దమనుషుల ఒప్పందం(1956) కావచ్చు, స్థానిక ఉద్యోగుల నిబంధనలు(1959) కావచ్చు, జీవో 39 (1969) కావచ్చు, ముల్కీ నిబంధనలను, ప్రాంతీయ మండలిని బలిగొన్న ఆరు సూత్రాల పథకం(1973) కావచ్చు, రాష్ట్రపతి ఉత్తర్వులు(1975) కావచ్చు, జీవో 610(1985) కావచ్చు, గిర్గ్లాని కమిషన్(2001) కావచ్చు, శాసన సభా సంఘం(2002) కావచ్చు, మంత్రివర్గ ఉపసంఘం(2004) కావచ్చు, జీవో 72 (2006) కావచ్చు, జీవో 116 (2006) కావచ్చు, శాసన సభా ఉపసంఘం (2006) కావచ్చు, జీవో 399 (2007) కావచ్చు, ఇవేవీ తెలంగాణ ఉద్యోగాలను తెలంగాణ వారికి దక్కించలేకపోయాయి, పైగా ఆంధ్రా ఉద్యోగులను తెలంగాణ ఉద్యోగాల్లో స్థిరీకరించాయి.

## 1.9. పరిశ్రమలు

ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు తెలంగాణ పరిశ్రమలకు ప్రాణాంతకమయ్యింది. వాస్తవానికి "ఆంధ్రప్రదేశ్ ఏర్పడక ముందు ఆనాటి ఆంధ్ర రాష్ట్రంలో పరిశ్రమలేవీ లేవు. కాని తెలంగాణలో చెప్పుకోదగిన పారిశ్రామికాభివృద్ధి అప్పటికే జరిగింది"(జయశంకర్, కొత్తపల్లి. 2015 : 75). తెలంగాణను నిజాం పరిపాలించే కాలంలోనే పరిశ్రమల స్థాపన జరిగినట్లు ఆధారాలున్నాయి. కానీ ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక నూతన పరిశ్రమలేవీ స్థాపించలేదు సరికదా

ఉన్నవాటిని మూతపడేట్లు చేశారు. ఆనాటికి ఆసియా ఖండంలోనే పెద్ద మిల్లు అయిన వరంగల్ ఆజంజాహి బట్టల మిల్లును నిజాం 1931లో స్థాపించాడు. అందులో వేలాదిమంది స్థానిక ఉద్యోగులకు ఉపాధి లభించింది. కానీ ఆంధ్రవలసపాలన మొదలయిన తర్వాత మిల్లు మూసివేయబడ్డది. అట్లే 1937లో నిజామాబాద్ బోధన్‌లో స్థాపించిన నిజామ్స్ చక్కెర ఫ్యాక్టరీ కూడా ఆజంజాహివలెనే చాలా పెద్ద పరిశ్రమ. దీనిని కూడా ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఆంధ్రప్రాంత పెట్టుబడిదారులకు అమ్మేశారు. "నిజాం నవాబుల కాలంలో 1873 నుండి 1947 వరకు స్థాపన జరిగి, ఆంధ్రప్రదేశ్‌కు వారసత్వంలో లభించి, తరువాత క్రమక్రమంగా మూసివేయబడిన పరిశ్రమలలో ముఖ్యమైనవి: ఫిరంగు ఫ్యాక్టరీ, సోడా ఫ్యాక్టరీ, ఐరన్ ఫ్యాక్టరీ, దక్కన్ బటన్ ఫ్యాక్టరీ, దక్కన్ గ్లాస్ ఫ్యాక్టరీ, డి.బి.ఆర్.మిల్స్, అంతర్గాం స్పిన్నింగ్ మిల్స్, సిర్పూర్ సర్‌సిల్క్‌మిల్స్, అదే విధంగా 1942లో స్థాపించిన హైదరాబాద్ ఆల్విన్ & మెటల్స్‌ను అమ్మివేశారు. 1871లో స్థాపించిన అతి ప్రాచీనమైన సింగరేణి గనులను కూడ అదను చూసి అమ్మివేసే ప్రయత్నాలు జరుగుతున్నవి"(జయశంకర్, కొత్తపల్లి. 2015 : 76). వీటితో పాటు తెలంగాణ ప్రాంతీయ కమిటీ ఏర్పాటు చేసిన 12 పాలశీతలీకరణ కేంద్రాలను ఎన్.టీ.రామారావు తాను అధికారంలోకి రాగానే మూసివేయడం కేవలం కోస్తాంధ్ర పాడిపరిశ్రమలకు అడ్డును తొలగించుకోవడానికే అన్నది చరిత్ర చెప్తున్న వాస్తవం. అలాగే కేంద్ర ప్రభుత్వం స్థాపించిన రామగుండం ఎరువుల కంపెనీ కూడా మూతబడింది. దీనికి కారణాలుగా ప్రభుత్వం చూపుతున్నది బొగ్గు దొరకకపోవడమే అని. కానీ ఈ ఫ్యాక్టరీ ఉన్నది సింగరేణి బొగ్గుగనుల్లో. దాదాపు వందల కిలోమీటర్లు ప్రయాణం చేసి ఆంధ్రకు తరలిపోయే బొగ్గు, సింగరేణిలోనే ఉన్న రామగుండానికి అందడం లేదు అనడం, అందుకే అది మూత పడిందని చెప్పడం కోస్తాంధ్ర పాలకుల అసమ పాలనా విధానాలకు మచ్చుతునక. ఇక హైదరాబాద్ చుట్టుపక్కల స్థాపించిన ప్రైవేటు పరిశ్రమలను అభివృద్ధి చిహ్నాలుగా చూపుతున్నప్పటికీ, నిజానికి కాలుష్యం బారిన పడడం తప్ప, వాటివల్ల తెలంగాణ జిల్లాల ప్రజలకు ఒరుగుతున్నదేమీ లేదు.

## 1.10. పాలన

ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేసిన దగ్గరి నుంచి దాదాపు ప్రభుత్వాలను నడిపినవారిలో ఎనభై శాతం కోస్తాంధ్ర, రాయలసీమవారే. ఆంధ్రప్రదేశ్ అవతరించినప్పటి నుండి 24 మంది ముఖ్యమంత్రులు పాలించారు. వీరిలో తెలంగాణకు చెందిన వారు కేవలం నలుగురు మాత్రమే. వీరి పరిపాలనా కాలం కూడా బహుస్వల్పం(ఆరు సంవత్సరాలు). ఆంధ్రప్రాంతానికి చెందిన వారు 27 సంవత్సరాలు పాలించారు. రాయలసీమ నాలుగు జిల్లాల నుంచి ఐదుగురు దాదాపు 23 సంవత్సరాలు పాలించారు. కోస్తాంధ్రేతరులు ఇంతమంది పాలించినా వీరి వెనుక కనిపించని శక్తులుగా ఉన్నవారు మాత్రం కోస్తాంధ్ర పెట్టుబడిదారీ వర్గాలే అనేది సుస్పష్టం. అయితే వీరిలో ఎవరైనా తెలంగాణాకు ఏమైన న్యాయం చేశారా అంటే అదీ లేదు. ప్రపంచబ్యాంకు నిర్దేశించిన, బహుళజాతి కంపెనీలు రూపొందించిన అభివృద్ధి నమూనాను ప్రతిక్షేపించినవారే తప్ప ప్రజాసంక్షేమం గురించి ఆలోచించినవారే లేరు. తెలంగాణ ప్రజల జీవితాలపట్ల, అందులోని సమస్యలపట్ల కోస్తాంధ్ర పాలకులకు పట్టనేలేదు. లక్షలాదిమంది నిరుద్యోగులు, వలసలు వెళ్లేవారు, వేలల్లో ఆత్మహత్యలు చేసుకుంటున్నవాళ్లు కోస్తాంధ్ర రాయలసీమ ప్రభుత్వాలకు ఏమాత్రం కనిపించలేదు. మొత్తంగా తెలంగాణ ప్రజా సంక్షేమం అన్నది వాళ్లకు పట్టకుండా పోయింది.

ఈ సందర్భంగా ఒక సందేహం తలెత్తే అవకాశం కూడా ఉన్నది. తెలంగాణ ప్రాంతంలో ఉన్న ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు స్థానిక ప్రజల చేతనే ఎన్నుకోబతారు కదా, వారైనా తమ ప్రజలకు మేలు చేయొచ్చుకదా అన్నది దాని సారం. నిజానికి సారంలో తెలంగాణలోని ఏకస్వామ్య(ఆటోక్రాటిక్) ప్రభుత్వాల కారణంగా ఏ ఎమ్మెల్యే, మంత్రి, ఎంపీ అయినా సీమాంధ్ర ప్రభుత్వ నాయకత్వం చేతికింది వారే కనుక, వారికీ పాలకవర్గ స్వభావం ఉంటుంది కనుక తెలంగాణ ప్రజలకు చేసింది ఏమీ లేదు. తమ నాయకత్వం ఇచ్చే ఆజ్ఞల ప్రకారమే తెలంగాణ ప్రజా ప్రతినిధులు పనిచేయవల్సిన ఒక అనివార్య పరిస్థితిని సీమాంధ్ర రాజకీయ నాయకులు కల్పించారు.

## 1.11. ఆదివాసులు

ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 33 గిరిజన తెగలున్నాయి. వీరి జనాభా మొత్తం రాష్ట్ర జనాభాలో 6.32 శాతం. అంటే 42 లక్షలు. ఇందులో ప్రధాన తెగలు గోండులు, కోయలు, కొండరెడ్లు, సవరలు తదితర ఆదివాసీ తెగలు. 1977 తర్వాత మైదాన ప్రాంతంలో ఉండే లంబాడీలను గిరిజన తెగగా గుర్తించారు. నేడు సంఖ్యాపరంగా లంబాడీలు గిరిజనుల్లో అధికజనాభా కలిగిన తెగగా చెప్పొచ్చు. ఆదివాసుల్లో అత్యధికంగా నిర్లక్ష్యానికి గురైనవారు చెంచులు. వీళ్లు ఎక్కువగా మహబూబ్‌నగర్ అంచున ఉన్న నల్లమల అటవీ ప్రాంతంలో ఉంటారు. మిగతా అన్ని తెగల్లో వీరే పేదవారు. వీరిని ఆంధ్రా పాలకుల అండతో ప్రవేశించిన డీబేర్ ముత్యాల కంపెనీ నిర్దాక్షిణ్యంగా నిర్వాసితుల్ని చేసింది. బ్రిటీష్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైత్వారీ పద్ధతి కారణంగా గోండు, కోయ, లంబాడాలు ప్రధానంగా స్థిర వ్యవసాయ తెగలుగా మారారు. మిగతా తెగలన్నీ వేటకు, అటవీ ఉత్పత్తుల సేకరణకు ప్రధాన జీవనాధారంగా బ్రతుకునీడ్చేవాళ్లు. లంబాడా, ఎరుకల వంటి తెగలు ఎక్కువగా మైదాన ప్రాంతాల్లోనే జీవిస్తున్నారు. అయితే తెలంగాణ ఆదివాసులు నివసిస్తున్న ప్రాంతం సకల సంపదలకు నెలవుగా ఉండడంతో దోపిడీకి ఆవాసంగా మారింది. కోస్తా వలసలకు, పెట్టుబడులకు ఖమ్మం ముఖద్వారం అని చెప్పొచ్చు. ఇక్కడ మట్టి మొదలుకొని బొగ్గు దాకా అన్నీ విలువైన ముడిసరుకే. ఇక్కడ మట్టే బంగారాన్ని సృష్టిస్తుంది. మానుకోట నుండి ఇల్లందుకు మధ్య రహదారి పొడుగునా ఇరువైపుల ఉన్న పెంకు పరిశ్రమలు దీనికి ఉదాహరణగా చెప్పొచ్చు. ఈ పరిశ్రమల యజమానులు అధికంగా కోస్తా జిల్లాలకు చెందినవాళ్లు. గిరిజనుల శ్రమతోనే ఈ పెంకుల ఉత్పత్తి సాగుతున్నది. అయినా వాళ్లకు శ్రమకు తగిన వేతనాలుండవు. విపరీతంగా శ్రమదోపిడీ జరుగుతున్నది. వ్యాపారలాభం కోస్తా జిల్లాలకు తరులుతున్నది. గిరిజన గ్రామాల్లో ఎక్కడా అభివృద్ధి అనేదే కనిపించదు. పాఠశాలలు, వైద్య సదుపాయాలు ఉండవు. విచిత్రమేమిటంటే వీరి సమస్యల్ని ఏ రాజకీయ పార్టీలు కూడా పట్టించుకోలేదు. దయనీయమైన రీతిలో ఈ ప్రాంత సంపద పరాయిప్రాంతం వారికి సంపదగా మారి పెట్టుబడిగా ఎదుగుతున్నది. సమకూరిన సంపద స్థానికంగా ఉత్పాదక రంగంలో వెచ్చించబడదు.

ఖమ్మం నుండి మొదలుకొని ఆదిలాబాద్ వరకు విస్తరించిన బొగ్గుబావుల్లో, కాగితపు పరిశ్రమల్లో, సిమెంట్ ఫ్యాక్టరీల్లో ఆదివాసులకు ఉద్యోగ అవకాశాలే లేవు. కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లందు, బయ్యారం, భద్రాచలం పేపర్‌బోర్డు, స్పాంజ్ ఊరన్ కంపెనీ, మణుగూరు భారజల ఉత్పత్తి పరిశ్రమ, సారపాక ప్రాంతంలో రవాణా రంగం నుంచి మొదలుకొని అన్ని వ్యాపార రంగాలలో కోస్తాంధ్ర వలసవాదుల ప్రాబల్యం కనిపిస్తుంది. నిజానికి దేశ చరిత్రలో 'సింగరేణి' తొట్టతొలిగా కనుగొన్న బొగ్గగని నిక్షేపాల గ్రామం. అది ఆనాడు ఆదివాసుల నివాసం. ఈనాడు ఊరు పేరుగా మారింది. జాతికి సంపదనిచ్చిన జాతులు, తెగలు అభివృద్ధి వాటాలో అడుగు భాగానికి వెళ్లిపోయాయి.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం తెలంగాణ ఆదివాసుల పాలిట దు:ఖదాయిని అయ్యింది. దాదాపు ఒక్క జిల్లాలోనే ఏడు మండలాల్లో 110 నుండి 160 గ్రామాల దాకా ముంపుకు గురవుతున్నాయి. ఇందులో లక్షా ఇరవై వేలమంది సర్వం కోల్పోతున్నారు. వీరిలో ఆదివాసులు, ఇతర పీడిత కులాలే ఎక్కువగా ఉన్నారు.

వైద్యం విషయంలో కూడా తెలంగాణ ఆదివాసులకు మొండిచెయ్యే చూపారు. తెలంగాణలోని ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని గోదావరి నదీ పరీవాహక ప్రాంతం అడవుల్లోని గిరిజన గూడాల్లో అంటువ్యాధులు ప్రబలి ఎంతోమంది చనిపోయినా వలసాంధ్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదు. తమ జన్మభూమిపైనే తాము రెండవశ్రేణి పౌరులుగా పరిగణించబడుతున్నామనే భావన తెలంగాణ మైదాన ప్రాంతంలోని ప్రజల్లో ఉంటే, సమాజం, ప్రభుత్వాలు తమను శత్రువులుగా చూస్తున్నాయనే అభిప్రాయం గిరిజనుల్లో ఉన్నది. పౌరుల ఆరోగ్యాన్ని సంరక్షించే బాధ్యత ప్రభుత్వానిదే అని భారత రాజ్యాంగం నిర్దేశిస్తున్నది. కానీ వలసవాద ప్రభుత్వాలకు తెలంగాణ మైదాన ప్రాంత ప్రజల, అటవీ ప్రాంత ప్రజల ఆరోగ్యం గురించి ఏమాత్రం పట్టింపులేకుండా పోయింది. 1999లో ఆదిలాబాద్ ఏజెన్సీలో కలరా మహమ్మారి విజృంభించి రెండువేలకు పైగా గిరిజనుల్ని పొట్టనపెట్టుకున్న విషయం ఆనాడు వార్త దినపత్రిక, తెలంగాణ ఐక్యవేదిక నిజనిర్ధారణ కమిటీల రిపోర్టులు వెల్లడించేదాక ప్రభుత్వాలు అసలు పట్టించుకోనేలేదు.

ఆ తర్వాత కూడా చాలా అమానవీయంగా మరణించినవారి సంఖ్య కేవలం 398 మాత్రమేనని, వీరు కూడా అతిసార వలన చనిపోయారని, కలరా వల్ల కాదని ప్రభుత్వం ప్రకటించడం కోస్తాంధ్ర పాలకుల స్వభావాన్ని తెలియజేస్తుంది. ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వైద్య సౌకర్యాలు లేకనే గిరిజనులు మరణించారని స్వయంగా ప్రకటించినా, మరణించినవాళ్లకు మాత్రం నష్టపరిహారం మాత్రం చెల్లించలేదు. అదే ఆంధ్ర జిల్లాల్లో వరదలు వచ్చినప్పుడు, కొబ్బరిచెట్లు విరిగిపడినప్పుడు ఈ ప్రభుత్వమే నష్టపరిహారాలను హుటాహుటిన అందజేశారు. ఆంధ్ర వలస పాలకుల దృష్టిలో కోస్తాంధ్ర కొబ్బరిచెట్లకు ఉన్న విలువ తెలంగాణ గిరిజనులకు లేదు. “గిరిజనులకు వైద్య సౌకర్యాలందించే విషయంలో కూడా తెలుగుదేశం ప్రభుత్వం ఆంధ్ర – తెలంగాణా ప్రాంతాల మధ్య వివక్షత చూపుతున్నదనడానికి మంచి ఉదాహరణ – ప్రపంచబ్యాంకు, ఐఫాడ్ సంస్థలు గిరిజనుల వైద్య సౌకర్యాల కల్పనకోసం ఇచ్చిన 14.06 కోట్ల రూపాయల నిధులను తూర్పుగోదావరి, శ్రీకాకుళం, విజయనగరం మరియు విశాఖపట్నం జిల్లాల్లో మాత్రమే ఖర్చు చేయడానికి ట్రైబల్ హెల్త్ ప్రాజెక్టును రూపొందించి అమలు చేస్తున్నది. రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ, గిరిజన జనాభాల్లో సగానికిపైగా కనిపిస్తున్నది తెలంగాణలోనే. ప్రతి సంవత్సరం అత్యధిక సంఖ్యలో మరణిస్తున్నదీ ఈ ప్రాంత గిరిజనులే! అయినా తెలంగాణలోని ఒక్క జిల్లాలో కూడా ప్రభుత్వం ట్రైబల్ హెల్త్ ప్రాజెక్ట్‌ను అమలు చేయకపోవడం వివక్షత కాదా?”(సింహాద్రి, యస్. 2001. 147).

గిరిజనులకు ఉండే దుర్భర దారిద్ర్యం నుండి కాపాడకపోవడమే వారి మరణాలకు ప్రధాన కారణం. ఏ కుటుంబానికి చాలినంత సారవంతమైన భూమి లేదు. భూమి ఉన్న దగ్గర సాగునీటి వసతి లేదు. వాగులు, నదులు పొంగిపొర్లే అడవుల్లో వ్యవసాయం చేయకుండా గిరిజనులను రిజర్వు ఫారెస్టు చట్టాలు అడ్డుకుంటున్నాయి. కొమురంభీం, రాంజీ గోండు వంటి గిరిజన పోరాట యోధుల త్యాగాల ఫలితంగా, హైమన్‌డార్ఫ్ వంటి విదేశీ నృశాస్త్రజ్ఞుల కృషి వల్ల, నక్సలైట్ ఉద్యమం వలన గిరిజన రైతాంగానికి లభించిన వేలాది ఎకరాల భూములను ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నాటినుండి వలసవాదులు కబ్జా చేశారు. 1/70 వంటి రెగ్యులేషన్లు, చట్టాలు ఎన్ని చేసినా వాటి అమలు కోసం

ప్రభుత్వం ఆసక్తి, శ్రద్ధ చూపనందున చాలా చోట్ల గిరిజనులకు భూములు దక్కకుండా పోయాయి. తమ స్వంత భూముల్లోనే కూలీలుగా శ్రమించాల్సిన దుస్థితి ఏర్పడింది.

చరిత్ర నిర్మాణానికి అనూచానంగా వస్తున్న సంప్రదాయాలూ, నమ్మకాలూ మొదలైనవి కూడా కీలకమైన ఆకరాలే అంటాడు ప్రఖ్యాత చరిత్రకారడు డి.డి.కోశాంబి. మానవ నాగరికతకు మూలాలుగా మిగిలి ఉన్నది కొండా కోనల్లో జీవిస్తూ ఆచారాలను, నమ్మకాలను, సంప్రదాయాలను తర్వాతి తరాలకు సాంస్కృతిక ప్రసరణం చేస్తున్నది గిరిజనులే. కానీ తెలంగాణాలో వారి ఉనికే ప్రశ్నార్థకమైన సన్నివేశం కనబడుతున్నది. ఇంతకు ముందే చెప్పినట్లు నల్లమల అడవుల్లో పాగా వేసిన డీబేర్ కంపెనీ వల్ల నిర్వాసితులవుతున్నవారి సంఖ్య చెప్పలేనంత ఉంది. ఒకవేళ పునరావాసం కల్పించినప్పటికీ ఈ నాగరిక సమాజంతో జీవించడానికి అలవాటు పడే వాతావరణం ఎప్పుడు నెలకొంటుంది అన్నది సీమాంధ్ర పాలకవర్గాలు గిరిజనులకు సమాధానం చెప్పకుండా వదిలేసిన ప్రశ్న. మరోవైపు కేవలం రెండు జిల్లాల సంపన్న వర్గాల ప్రయోజనార్థం నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు కింద వేలాది గిరిజన గూడాలు, గ్రామాలు ముంపుకు గురౌతున్నాయి. అక్కడ కూడా దాదాపుగా ఇదే పరిస్థితి. ఒక ప్రాంతంలో వందల సంవత్సరాలుగా జీవిస్తున్న ప్రజా సమూహాల్ని ఖాళీ చేయిస్తున్నప్పుడు, ఆ పని స్వయానా ప్రభుత్వాలే చేస్తున్నప్పుడు వారికి కావల్సిన పునరావాసాలు ఏర్పాటు చేయడం, నష్ట పరిహారాలను చెల్లించడం, నూతన ఉద్యోగావకాశాలు కల్పించడం ఖచ్చితంగా ప్రభుత్వ బాధ్యతలే అవుతాయి. కానీ ఇన్నేళ్ల పరిపాలనలో ఏనాడూ వలసాంధ్ర ప్రభుత్వం తెలంగాణ గిరిజనుల సంక్షేమాన్ని పట్టించుకున్నది లేదు. పైగా వారు వందల సంవత్సరాలుగా జీవిస్తూ వస్తున్న అడవుల్లోంచి వారిని గెంటివేసి, ఖనిజాల వేట ప్రారంభించింది. వారి భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసింది. మానవ చరిత్రకు ఆకరంగా మిగిలిన గిరిజనుల జీవితాలను నాశనం చేయడం కారణంగా చరిత్రకు కూడా నష్టం చేసింది. మొత్తంగా చూసినప్పుడు బ్రిటీష్ పాలకులతో మొదలైన ఆదివాసీల దోపిడి వలసాంధ్ర ప్రభుత్వాల పాలనలో మరింత దుర్మార్గంగా, అన్యాయంగా, చట్టవ్యతిరేకంగా కొనసాగింది.

## 1.12. ఖనిజ వనరులు

తెలంగాణ ప్రాంతానికి ప్రకృతిసిద్ధంగా సంపద్వంతమైన ఖనిజ వనరులు ఉన్నాయి. కానీ అవి సామ్రాజ్యవాద శక్తులకు సహకరించడం ద్వారా స్థానిక పాలకవర్గాల సహాయంతో దోచుకోబడుతున్నవి. తెలంగాణాలో కనిపిస్తున్న ప్రత్యేక ఆర్థిక మండలాల్లో చాలావరకు సహజవనరుల దోపిడీ కొరకు వచ్చినవే. అట్లా దోపిడీకి గురౌతున్న వనరుల్లో మొదట బొగ్గు గనుల్ని గురించి చెప్పుకోవాలి. బొగ్గు గనులంటేనే గుర్తుకొచ్చేది గోదావరి ఖనిలో ఉన్న సింగరేణి. "సింగరేణి అంటే ఒక్క గోదావరి ఖని మాత్రమే కాదు. సింగరేణి అనేది ఒక సంస్థ, వ్యవస్థ. ఈ రాష్ట్రాన్ని దేదీప్యమానంగా వెలిగించిన ఖనిజ సంపద పుట్టింది ఖమ్మం జిల్లాలో. ఖమ్మం జిల్లా గోదావరి లోయలోని ఇల్లందు – దుంటుపల్లి గ్రామ పరిసరాల్లోవున్న సింగరేణి అనే కుగ్రామంలో 1841 ప్రాంతంలో తొలిసారిగా బొగ్గు బయటపడింది" (చక్రపాణి, గంటా. 2009 : 12). నిజాం పరిపాలనా కాలంలో ప్రభువుల అనుమతి తీసుకున్న ఈస్టిండియా కంపెనీ తొలిసారిగా అక్కడ బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని గుర్తించింది. కానీ అది వ్యాపారానికి సరిపోయే స్థాయిలో లేదని పట్టించుకోకుండా వదిలేసింది. తర్వాత 1872లో 'జియొలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా'లో పనిచేస్తున్న డా॥విలియం కింగ్ అనే భూగర్భ పరిశోధకుడు మొత్తం గోదావరి లోయ అంతటా విస్తరించి ఉన్న బొగ్గు గనులను గుర్తించాడు. అప్పటికే వ్యాపారం కోసం అని వచ్చి పాలనాధికారాలను చేజిక్కించుకున్న ఆంగ్లేయ పాలకులు అపారమైన బొగ్గు గనుల్ని చూసి నివ్వెరపోయారు. విలియం కింగ్‌తోపాటు ఇంకా ఇద్దరు శాస్త్రవేత్తలను పెట్టి దేశవ్యాప్తంగా, గోదావరిలో గనుల పరిశోధన చేసిన తర్వాత 1886లో బొగ్గు గనులను తవ్వడం మొదలు పెట్టారు. "1886లో బొగ్గు తవ్వకం మొదలు పెట్టిన హైదరాబాద్(దక్కన్) కంపెనీ లిమిటెడ్ అనే బ్రిటీష్ కంపెనీ, హైదరాబాద్ 1900 నాటికి ఈ ప్రాంతంలోని గనుల నుంచి 469,291 టన్నుల బొగ్గును వెలికి తీసి దక్షిణ భారత దేశంలో రైల్వేల విస్తరణకు హైదరాబాద్ కంపెనీల చట్టం ప్రకారం హైదరాబాద్(దక్కన్) కంపెనీ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ పేరుతో కొత్త కంపెనీని రిజిస్టర్ చేసి 1921లో పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మార్చింది"(చక్రపాణి, గంటా. 2009 : 13). ఈ క్రమంలో నిజాం రాజు

బొగ్గు వలన ఏర్పడుతున్న లాభాలను చూసి తన రాజ్య అవసరాలకు బొగ్గు వినియోగం తోడ్పడగలదని గుర్తించి పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా ఉన్న సింగరేణి కాలరీస్ నుంచి అధిక షేర్లు కొనుగోలు చేసి, 'హైదరాబాద్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ' పేరుతో పబ్లిక్ సెక్టార్ కంపెనీని ఏర్పాటు చేసి సింగరేణి కంపెనీని దానికి అప్పజెప్పాడు.

హైద్రాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనమై, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక సింగరేణి ప్రభుత్వ రంగ సంస్థగా పరిణమించింది. కొన్నాళ్లకు అది ఖమ్మం, కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలకు పరివ్యాప్తమయ్యింది. చివరికి గోదావరి నదీ పరీవాహక ప్రాంతం అయినందున ఆ పేరుమీద ఈ గనులకు గోదావరి ఖని అనే పేరు స్థిరపడింది. "భారత దేశపు బొగ్గు గనుల నిల్వలో సింగరేణి కంపెనీ వాటా ఆరుశాతం కాగా దేశం మొత్తం ఉత్పత్తిలో సింగరేణి బొగ్గు ఉత్పత్తి 10 శాతం వాటాను కలిగి వున్నది"(ప్రభాకర్, చిక్కుడు. 2009 : పుట. 171).

సింగరేణి కంపెనీ ద్వారా ఇంతకు ముందు చెప్పిన నాలుగు జిల్లాలలకు చెందిన కార్మికులు, దాదాపుగా లక్షమంది బతుకుతున్నారు. పరోక్షంగా 25 లక్షల మంది ప్రజలు కూడా ఈ కంపెనీ మీదనే ఆధారపడుతున్నారు. అయితే "ప్రధానంగా బొగ్గును వెలికితీయడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న కోల్‌కట్టర్, కోల్ ఫిల్లర్‌లనే కార్మిక వర్గం దళిత, ఆదివాసి, వెనుకబడిన తరగతుల నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నది. వందలాది సంవత్సరాలుగా సింగరేణి కంపెనీ మీద ఆధారపడిన ఈ బీద, బిక్కి జనం కంపెనీలోని కోస్తాంధ్ర ఉన్నతాధికార వర్గం ద్వారా పడరాని పాట్లు పడుతున్నారు"(ప్రభాకర్, చిక్కుడు. 2009 : 171). సీమాంధ్ర ప్రభుత్వం సింగరేణి బొగ్గు వెలికితీత విధానంలో అండర్‌గ్రౌండ్ నుంచి కాకుండా ఓపెన్ కాస్ట్ మైనింగ్ పద్ధతి ప్రవేశపెట్టింది. ఇది సామ్రాజ్యవాద విధానాల ఫలితమేనని చెప్పాలి. ఒకవైపు కోస్తాంధ్ర ఉన్నతాధికారుల కింద నానాపాట్లు పడుతున్న కార్మిక వర్గం నూతనంగా ప్రవేశించిన ప్రైవేటీకరణ, యాంత్రికీకరణల వల్ల మరింత నష్టపోతున్నది, జీవన భృతిని కోల్పోయింది. కంపెనీనే నమ్ముకుని బతుకుతున్న అనేకమంది కార్మికుల స్థానే యంత్రాలు ప్రవేశించి ప్రజల నోట్లో మట్టికొడుతున్నాయి. కాలక్రమంలో

బొగ్గు వెలికితీత పెరిగినప్పుడు కార్మికుల అవసరం కూడా పెరగాల్సి ఉండగా వారి స్థానంలోకి వచ్చిన యంత్రాలు మానవ శక్తిని పని నుండి తప్పిస్తున్నాయి. మరోవైపు ఓపెన్ కాస్ట్ పద్ధతి ద్వారా బొగ్గును వెలికితీస్తున్నప్పుడు జరుపుతున్న పేలుళ్ల కారణంగా సమీప గ్రామాలన్నీ కకావికలమవుతున్నాయి. ముందుగానే చెప్పినట్లు ఈ పద్ధతిని నేర్పించింది సామ్రాజ్యవాద శక్తులే. అయితే, ఈ యాంత్రికీకరణకు అనుమతులిస్తున్నది కోస్తాంధ్ర ఉన్నతాధికార వర్గంతో మిలాఖతయిన సింగరేణి యాజమాన్యం. ఈ కంపెనీలోని కాంట్రాక్టర్లలో 98 శాతం కోస్తాంధ్ర వారే కావడం గమనించదగ్గ అంశం.

నిజానికి భారత దేశంలో ప్రపంచీకరణ ప్రభావం పడక ముందు బొగ్గుగనుల దోపిడీ ఉన్నప్పటికీ కార్మికులకు మాత్రం ఉద్యోగాలకు ఇబ్బందేమీ రాలేదు. కానీ ఎప్పుడైతే గ్లోబలైజేషన్, ప్రైవేటైజేషన్ మొదలైందో అప్పట్నుంచి మనిషి స్థానంలోకి యంత్రాలు ప్రవేశించాయి. కింద సూచించిన పట్టికలో ఆ వివరాలు చూడవచ్చు.

| సంవత్సరం | కార్మికుల సంఖ్య | గనుల సంఖ్య | | ఉత్పత్తి (మి.టన్నులలో) |
|---|---|---|---|---|
| | | ఓపెన్ కాస్ట్ | అండర్ గ్రౌండ్ | |
| 1990-91 | 1,16,918 | 7 | 61 | 17.7 |
| 1995-96 | 1,13,832 | 11 | 59 | 26.77 |
| 2000-01 | 96,382 | 11 | 56 | 33.83 |
| 2005-06 | 73,342 | 12 | 46 | 36.00 |

*(ప్రభాకర్, చిక్కుడు. 2009 : 171)*

ఈ పట్టిక క్రమక్రమంగా కార్మికులను ఎలా తగ్గిస్తూ వచ్చారో, ఎలా యంత్రాలను పెంచుకుంటూ పోయారో వివరిస్తున్నది. ఇటువంటి పరిస్థితి ఒకవైపుంటే తెలంగాణలో లభిస్తున్న బొగ్గు కోస్తాంధ్రలో ఉన్న విద్యుత్ కేంద్రాలకు తరలిపోవడం మరొక ఎత్తు. ఏ ప్రాంతానికైనా స్థానిక వనరుల మీద వినియోగాధికారం ఉంటుంది. కానీ ఏలేవారు వలసవాదులు కావడం మూలాన ఇక్కడి బొగ్గు కోస్తాంధ్రలో వెలుగులను ఇస్తున్నది. తెలంగాణలో ఉత్పత్తయ్యే కరెంటును కూడా తరలించుకుపోవడం సీమాంధ్ర పాలకుల

చౌర్యకళకు మచ్చుతునక.

తెలంగాణ ఖనిజ వనరులకు సంబంధించిన మరొక ముఖ్యమైన భాగం 'బయ్యారం గనులు'. కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో అపారమైన ముడిఇనుము దొరుకుతుందని జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జియస్ఐ) నివేదికలిచ్చిన తర్వాత ముఖ్యమంత్రిగా ఉన్న రాజశేఖర్ రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం లక్షన్నర ఎకరాల్లో వ్యాపించిన బయ్యారం గనుల్ని 'రక్షణ స్టీల్స్'కి కట్టబెట్టింది. రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ని తుంగలో తొక్కింది. ఆదివాసీలను తమ నేలనుంచి, అడవినుంచి దూరం చేసే కుట్రలో భాగంగానే ఇది జరిగింది. రాజకీయావసరాల ఒత్తిడి కారణంగా ప్రజా ఉద్యమాలకు తలొగ్గి రోషయ్య ముఖ్యమంత్రి అయ్యాక రక్షణ స్టీల్స్‌కు ఇచ్చిన లీజును రద్దు చేశారు. కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం గూడూరు(వరంగల్), భీమదేవరపల్లి(కరీంనగర్), బయ్యారం(ఖమ్మం) ప్రాంతాల్లో విస్తరించిన ఇనుము గనుల నుండి ముడి ఇనుము తవ్వి విశాఖ స్టీల్ ప్లాంట్‌కి తరలించి, దాని ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి కేటాయించిన, 5350 హెక్టార్లలో లభించే ఖనిజం విలువ 16 లక్షల కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా. బయ్యారం మండలంలో 21 రెవెన్యూ గ్రామాలుంటే 99 ఆవాసిత ప్రాంతాలున్నాయి. 29 వేల హెక్టార్ల భూమిలో దాదాపు 13 వేల హెక్టార్లు అటవీ ప్రాంతం, వెయ్యి హెక్టార్లు మాత్రమే వ్యవసాయ భూమి. అంటే తవ్వుకున్నవాళ్లకు తవ్వుకున్నంత దొరుకుతుంది. బయ్యారం గనుల్లో మైనింగ్ జరిగిన తొలినాళ్లలో 1958లో ఎంఎంటీసీ ఉనికిలోకి వచ్చిన తర్వాత 'చౌదరీ మైనింగ్ కంపెనీ'పై ఏడాదికి 10,000 టన్నుల ఖనిజాన్ని మాత్రమే ఎగుమతి చేయాలని పరిమితులు విధించింది. తర్వాత ఈ పరిమితులు అసలుకే లేకుండా పోయాయి. బయ్యారం ప్రాంతంలో ఉన్న గనుల్ని రక్షణ స్టీల్‌కి ధారాదత్తం చేశాక నాలుగైదు సంవత్సరాలు మైనింగ్ జరిగింది. ఈ తవ్వకం ఏమేరకు జరిగిందో గణాంక ఆధారాలు దొరకడం లేదు. కానీ కేవలం ఒక్క బయ్యారం గ్రామం నుండే రోజుకి 100 లారీల ఖనిజం అక్రమంగా రవాణా అయ్యేదని, అది కూడా రాత్రిపూటే జరిగేదని నిజనిర్ధారణ బృందాల నివేదికలు చెప్తున్నాయి. ఒక లారీకి పదిహేడున్నర టన్నులు అంటే ఒక లారీ ఖనిజం విలువ లక్షా ఇరవై వేల రూపాయలంటే రోజుకి కోటి

రూపాయల ఖనిజం తరలిపోయింది. సంవత్సరానికి 300 కోట్ల రూపాయలు వేసుకున్నా నాలుగు సంవత్సరాల్లో 1200 కోట్ల రూపాయల సంపద కేవలం బయ్యారం గ్రామం నుంచే అక్రమ మైనింగ్ దొంగల జేబుల్లోకి పోయింది. బయ్యారం గుట్టల్లో 76,77,78 కంపార్ట్‌మెంట్లలోని 50 హెక్టార్ల గనుల్లో 850 మిలియన్ టన్నుల ఖనిజం లభిస్తుందని ఒక అంచనా. సంవత్సరానికి 4 లక్షల టన్నుల చొప్పున 20 ఏళ్లపాటు ఖనిజం తవ్వుకోవచ్చు. ఇంత విస్తారమైన సంపద నెలకొని ఉన్న బయ్యారం గనులు కోస్తాంధ్ర పాలకుల పుణ్యం వల్ల తెలంగాణకు దక్కకుండా పోతున్నాయి. ఇదిలా ఉంటే మొత్తం బయ్యారం తవ్వకాలవల్ల దాదాపు 12వేలమంది నిర్వాసితులు అవుతున్నారు. అందుకే ప్రత్యేక తెలంగాణోద్యమం 'బయ్యారం ఉక్కు – తెలంగాణ హక్కు' అని ఉద్యమించవల్సి వచ్చింది. దీనికీ 'విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు' నినాదానికి వెనుక ఉన్న ఉద్దేశాల్లో సారూప్యత కనిపిస్తుంది. స్థానికులకే స్థానిక వనరుల మీద అధికారం ఉండాలన్న ప్రజాస్వామిక డిమాండ్ అందులోని సారాంశం.

### 1.13. నిధుల కేటాయింపులు

ఆంధ్రప్రదేశ్‌లో కలిపినప్పటినుండి తెలంగాణ అభివృద్ధి పథకాల్లో కూడా వివక్షకు గురైంది. తెలంగాణ ప్రాంతం వెనుకబాటుతనాన్ని అర్థం చేసుకోవడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధిలో వచ్చిన మార్పులను పరిశీలించాలి. 1960వ దశకంలో వచ్చిన హరిత విప్లవం ప్రాంతీయ అసమానతల్ని అధికం చేసిందని చెప్పాలి. ఉన్నవాళ్లు ఉన్నవాళ్లుగా, లేనివాళ్లు మరింత లేనివాళ్లుగా మారడానికి ఇది తోడ్పడింది. హరిత విప్లవ దుష్పరిణామాలను, పేదరికాన్ని అధిగమించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశపెట్టాయి. అవి ప్రధానంగా మూడు రకాలు. ఒకటి, చిన్న, సన్నకారు రైతుల ఆస్తిపాస్తులు వృద్ధి చేయడం. ఉదాహరణకు ఎస్ఎఫ్‌డిఎ, ఐఆర్‌డిపి. రెండు, వ్యవసాయ కూలీలకు, బీద ప్రజలకు ఉపాధి అవకాశాలను పెంచడం. ఉదాహరణకు కనీస అవసరాల పథకం, ట్రైసం మొదలైనవి. మూడు, ప్రాంతీయ అసమానతల్ని తగ్గించడానికి ఏర్పాటు చేసినవి. ఉదాహరణకు డిపిఎపి, షెడ్యూల్డు ప్రాంతాల అభివృద్ధి

పథకం మొదలైనవి. తర్వాత సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం(ఐఆర్‌డిపి)ని స్వర్ణజయంతి రోజ్‌గార్ యోజనగా పేరుమార్చి నూతన పథకంగా ప్రకటించుకున్నారుగాని మార్పేమీ లేదు. గ్రామీణ ప్రాంతాలు వెనుకబడిన ప్రాంతాలుగా ఉండటానికి కారణం ఈ ప్రాంతాల్లో తలసరి ఆదాయం తక్కువగా ఉండడమే. ప్రణాళికా సంఘం నిర్వచనం ప్రకారం వెనుకబాటుతనం అంటే వెనుకబడిన ప్రాంతంలోని వనరులను సక్రమంగా వినియోగించుకోకపోవడమే. అనేక వెనుకబడిన ప్రాంతాలలో సహజ వనరులైన నీరు, అటవీ సంపద, మానవ వనరులు సక్రమంగా వినియోగింపబడవు. దీనికి కారణం సరైన సాంకేతిక నిపుణత ఈ ప్రాంతాలకు లభ్యం కాకపోవటమే. తెలంగాణ ప్రాంతంలో ఈ సమస్యలన్నీ ఉన్నాయి. దీనికి కారణం రాష్ట్రంలోని వలసాంధ్ర నాయకత్వం. నాయకత్వ వర్గాలు వనరుల వినియోగంలో అభివృద్ధి చెందిన ప్రాంతాలకే ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వడం గమనార్హం. వెనుకబడిన ప్రాంతాల్లోని అగ్రవర్ణాలకు చెందిన నాయకులు తమ ప్రాంత వెనుకబాటుతనాన్ని కొనసాగించడానికి అన్నివిధాలా ప్రయత్నించారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందితే ప్రజలు మా మాట వినరని అభివృద్ధి కాకుండా జాగ్రత్తపడ్డారు. 1970 దశకంలో నక్సలైట్ కార్యకలాపాలు తీవ్రతరం కావటానికి తెలంగాణ ప్రాంతం వెనుకబాటుతనమే కారణం. పీపుల్స్‌వార్ గ్రూప్ కార్యకలాపాలు 1990 దశకంలో తెలంగాణ ప్రాంతంలో అధికమయ్యాయి. ఈ పరిణామానికి పాలకవర్గ పార్టీలన్నీ సమానంగా బాధ్యులని చెప్పాలి. నక్సలైట్ ఉద్యమానికి తెలంగాణ ప్రాంతపు సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమస్యలే ప్రధాన కారణం. తెలంగాణలోని నిరుద్యోగం, ఆకలిచావులు, నీటిపారుదల వసతులు లేకపోవడం, పారిశ్రామికాభివృద్ధి లోపించడం, ఆస్తి పంపకాల్లో అసమానతలు, అగ్రవర్ణాల ఆధిక్యం వంటివే విప్లవోద్యమ కార్యక్రమాలు విస్తరించడానికి దోహదపడ్డాయని చెప్పాలి.

తెలంగాణలో ఉన్న దుర్భిక్షానికి అనేక ప్రధానమైన కారణాలతో పాటు ఈ ప్రాంతానికి బడ్జెట్ కేటాయింపుల్లో జరిగిన అన్యాయం కూడా ఉన్నది. “బడ్జెట్ కేటాయింపులను నిశితంగా పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నాటినుంచి 19,693 కోట్ల రూపాయలు కోస్తా ప్రాంతంలో వ్యయం చేశారు. అదే విధంగా 4005 కోట్ల

రూపాయలు తెలంగాణలో, 2206 కోట్లు రాయలసీమలో వ్యయం చేశారు. వీటిని పరిశీలిస్తే బడ్జెట్ కేటాయింపుల వ్యయంలో ఈ నలభై ఏళ్లలో తెలంగాణ ప్రాంతానికి తీరని అన్యాయమే జరిగిందనేది వాస్తవం. రాష్ట్ర రెవెన్యూలో కూడా తెలంగాణకు చెందాల్సిన 76.02 శాతం తెలంగాణకు లభించనేలేదు"(వేణుగోపాల్, ఎన్. 2009 : 12). ఆంధ్రప్రదేశ్ జనాభాలో 39 శాతం ఉన్న తెలంగాణ ప్రజానీకానికి అందాల్సినన్ని వనరులు అందకపోవడానికి, అభివృద్ధి సాధించకపోవడానికి నిధుల కేటాయింపుల్లో జరిగిన అన్యాయం కీలకమైనది.

## 1.14. భాష, సాహిత్యం, కళలు, సంస్కృతి

ఈ నాలుగింటి విషయంలో కూడా తెలంగాణకు చాలానే అన్యాయం జరిగింది. "నోమ్ చామ్స్కీ చెప్పినట్లు 'ఒక జాతిపైన గానీ, ఒక ప్రాంతంపైన గానీ, ఒక సమూహం పైనగానీ వాటి సాంస్కృతిక అస్తిత్వ మూలాలపై నిరవధికంగా దాడి జరుగుతుంటే, దానికి వ్యతిరేకంగా సరైన దృక్పథం కలిగిన పోరాటం జరగకుంటే, చారిత్రక క్రమంలో ఆ జాతిగానీ, సమూహం గానీ, ప్రాంతంగానీ వాటి స్వతంత్ర అస్తిత్వాలను కోల్పోయే ప్రమాదముంటుంది'. కనుక తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాన్ని ఈ కోణంలో కూడా పరిశీలించవల్సి ఉంది"(శ్రీనివాస్, ఎం. 2010 : 48). తెలంగాణ ప్రజల, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంత ప్రజల మధ్య మాండలికంలోనూ సంస్కృతిలోనూ వైవిధ్యం గుర్తించదగిన స్థాయిలో ఉంటుంది. తెలంగాణ ప్రజలు మాట్లాడే భాషా, సీమాంధ్ర ప్రజలు మాట్లాడే భాషా తెలుగే. లిపి కూడా ఒక్కటే. కానీ తెలంగాణ ప్రజలు తాము మాట్లాడే తెలుగు భాష సీమాంధ్ర ప్రజలు మాట్లాడే తెలుగుకంటే భిన్నమైనదిగా భావిస్తారు. భాషా శాస్త్రవేత్తలు వెల్లడించిన అభిప్రాయాల్నిబట్టి చూస్తే వాక్య నిర్మాణానికీ, క్రియా పదాల వినియోగానికీ తేడాలున్నాయి. పలుకుబడులు, జాతీయాలు, సామెతలు మొదలైనవాటిలో ప్రత్యేకతలున్నాయి. తెలంగాణకున్న మరో ప్రత్యేకత భౌగోళికమైనది. భాషా, సంస్కృతీ, సాహిత్యం, కళలను ప్రభావితం చెయ్యడంలో దీని పాత్రను నిరాకరించలేము. తెలంగాణ ప్రాంతం 1,14,800 చ.కీ.మి. విస్తీర్ణాన్ని కలిగి ఉంది.

దక్కన్ పీఠభూమిగా పిలువబడే ఈ ప్రాంతం ఎత్తైనది. గట్టినేల, దట్టమైన అడవులు, వర్షధారలతో కూడిన ప్రాంతమిది. సీమాంధ్ర పాలకుల పుణ్యమా అని ఇక్కడి వ్యవసాయం ప్రధానంగా వార్షాధారంగా మారిపోయింది. మానవజాతి నాగరికతా వికాసంలో భాషా, సంస్కృతి, సాహిత్యం, కళల విస్తరణలో వ్యవసాయాభివృద్ధి ప్రధాన చోదకశక్తిగా పనిచేసిందన్న విషయం చారిత్రక వాస్తవం. వ్యవసాయమే ప్రధాన వ్యాపకమైన మానవజాతికి వ్యవసాయ సంబంధ శ్రమలు, భౌగోళికంగా మారే రుతువులు, కాలాలు వారి నాగరికతలను, భాషా సాహిత్య సాంస్కృతిక కళా రంగాలను ప్రభావితం చేస్తాయి. అందువల్లనే మెట్ట వ్యవసాయమే ప్రధానంగా ఉండే తెలంగాణలో భాషా, సంస్కృతి, సాహిత్యం, కళలు ఇతర ప్రాంతాలకంటే భిన్నంగా ఉంటూ వస్తున్నాయి. జొన్నలు, మొక్కజొన్నలు, పత్తి, ఆముదం, పప్పుధాన్యాలు, పసుపు వంటి పంటలను తెలంగాణ ప్రాంతంలో చెరువుల కింద కుంటల కింద పండిస్తారు. భౌగోళికంగానూ, సాంస్కృతికంగానూ ఇతర తెలుగు ప్రాంతాల నుండి తెలంగాణను వేరుచేసే అంశాలు ఇవే.

అంతేకాకుండా తెలంగాణ ప్రజలు జరుపుకునే పండుగల సాంస్కృతిక మూలాలు చాలా లోతైనవి. ఈ పండుగల్లో భూమి, నీరు, అడవి, చెట్టు, రాయి, పుట్ట, గుట్టల పట్ల ఆరాధనాభావం ఎక్కువగా ఉంటుంది. మరొక ఆచారం రాత్రిపూట మొక్కలను తాకరాదు. పూలనూ, పండ్లనూ ఇచ్చే చెట్లను నరకరాదు. తెలంగాణ పండుగల్లో ప్రకృతిపట్ల ఆరాధన, ప్రేమ కనిపిస్తాయి. అందువల్లనే ఒక ప్రాంత ప్రజల సంస్కృతి అనేక అంశాలను స్పృశిస్తుందనీ, భాష, వేషం, కట్టుబాట్లు, వంట, వార్పు, ఆచార వ్యవహారాలు, మానవీయ విలువలు, మానవ సంబంధాలన్నీ సంస్కృతిలో భాగమని సురవరం ప్రతాపరెడ్డి ఆంధ్రుల సాంఘిక చరిత్రలో అన్నారు.

నాగరికతకు సంబంధించిన అన్ని దశలు తెలంగాణ ప్రాంతంలో ఉన్నాయి. రాక్షసబల్లి, ఆదిమానవుడు, తెగలు, తొలి గ్రామాలు ఇక్కడ విలసిల్లాయి. రాతియుగం, మహాయుగాల ఆనవాళ్లు పుష్కలంగా ఉన్నాయి. తెలంగాణ పండుగల్లో, ఉత్సవాల్లో,

సంస్కృతిలో జైన, బౌద్ధ, వీరశైవ వంటి మతాల ఆనవాళ్లు కనిపిస్తాయి.

ఆంధ్రప్రదేశ్‌లో చరిత్ర మీద పరిశోధన చేసిన జర్మన్ రచయిత దాగ్మార్ బెర్న్‌స్టార్ఫ్ తెలంగాణ అస్తిత్వం మీద ఒక విలువైన మాట అన్నారు. తెలంగాణ అస్తిత్వం స్పష్టంగా భాషమీదగానీ, మతం మీదగానీ ఆధారపడిన విషయం కాదని, అది చరిత్ర మీద ఆధారపడిన విషయమని ఆయన భావన. చరిత్రలో భాగంగా తెలంగాణ సమాజ నిర్మితి, సంస్కృతీ లక్షణాలతో ఎదిగాయని, అవి మిగతా తెలుగు ప్రాంతాల లక్షణాలకన్నా భిన్నమైనవని ఆయన తేల్చారు. ఆయన చెప్పిన విషయాలు తెలంగాణ అస్తిత్వం, వందలాది సంవత్సరాల స్వతంత్ర రాజకీయ ప్రతిపత్తి పునాదిగా భాషా, సాంస్కృతిక, సాహిత్య, కళా అస్థిత్వాలు అభివృద్ధి చెందాయన్న వాస్తవ విషయాల్ని రుజువుచేస్తాయి. నిజానికి దాదాపు మూడువేల ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన తెలంగాణ, అంతే వయసుతో కళలనూ, సంస్కృతినీ కలిగి ఉన్నది. అటుఇటుగా సాహిత్యం వయసు కూడా అంతే. అయితే కోస్తాంధ్ర పాలనకు ముందే వివక్షకు గురైన ఈ రంగాలు ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత గుణాత్మకంగా విస్మరణకు గురయ్యాయి.

సినిమా రంగం అతిపెద్ద మీడియా. దాని ప్రభావం సాధారణ ప్రజలమీద పడేస్థాయి తీవ్రంగా ఉంటుంది. కోస్తాంధ్ర పెట్టుబడిదారుల చేతుల్లో ఆడుతున్న తెలుగు సినిమా తెలంగాణ భాషను, యాసను, సంస్కృతిని తృణీకార భావంతో చూసింది. అనేక రంగాల్లో చేస్తున్న అన్యాయం చాలదన్నట్లు తెలంగాణ భాషను కేవలం ప్రతినాయక నాయకిలకు, హాస్యపాత్రలకు పెట్టడం ఒక ఆధిపత్య సంస్కృతికి సంకేతం. ఒక ప్రజా సమూహపు జీవన విధానం, భాష, ఆహారపు అలవాట్లు, పండుగలు, శ్రమ మొదలైనవన్నీ ఆ సమూహ సంస్కృతి అవుతాయి. ఆంధ్రప్రదేశ్ అవతరణకు ముందు నిరంకుశ నిజాం పరిపాలనలో ఉండి కనీసం తెలుగు మాట్లాడలేకపోయిన, తమదైన స్వంత జీవితాన్ని తమకిష్టం వచ్చినట్లు గడపలేకపోయిన తెలంగాణ ప్రజానీకపు సమస్యల్ని కొత్త రాష్ట్రం ఏర్పడ్డాక అయినా తీర్చాల్సిందిపోయి, పైగా కేవలం ఎగతాళికే పూనుకోవడం శోచనీయం.

మరొక మీడియా అయిన వార్తా పత్రికలు, ఛానెళ్లు, రేడియో ప్రసారాలు కూడా తెలంగాణకు చేసిన అన్యాయం అంతాయింతా కాదు. మొత్తం ఆంధ్రప్రదేశ్‌లో సర్క్యులేషన్ ఉన్న పత్రికలు ఈనాడు, ఆంధ్రజ్యోతి, సాక్షి, వార్త, ఆంధ్రభూమి వంటి పత్రికలు తెలంగాణ భాషను గౌరవించలేదు. వార్తాఛానెళ్లలో వార్తాపఠనం చేసేవాళ్లదీ, రేడియోలో వినిపించేవాళ్లదీ తెలంగాణ భాషపట్ల తిరస్కృత భావనే. ఎందుకంటే యాజమాన్యాలు సీమాంధ్ర పెట్టుబడిదారులవి. కాళోజీ మాటల్లో చెప్పాలంటే రెండున్నర జిల్లాల, రెండున్నర కులాల భాషనే ఈ మీడియాలో వాడటం మూలంగా అదే అందరి తెలుగుగా ప్రచారం చెందడం మూలంగా తెలంగాణ భాషను పట్టించుకున్న నాథుడులేడు. ఈ పట్టించుకోని తనంలో కేవలం తెలంగాణ భాషను ఒక మాండలికంగా గుర్తించడం మాత్రమే కాదు, అంతకుమించి మాది మాత్రమే తెలుగు అన్న ఆధిపత్య భావన అందులో ఇమిడి ఉంది. నిజానికి తెలంగాణ భాషను ఒక మాండలికంగా గుర్తిస్తే రెండున్నర జిల్లాల భాష కూడా మాండలికంగానే గుర్తించవల్సి వస్తుంది. అలాంటప్పుడు ఒక మాండలికాన్ని ఎన్నడూ వినియోగించని మీడియా మరొక మాండలికం వాడడంలో ఆంతర్యం ఏమిటంటే ఆ మీడియా యాజమాన్యం ఆ రెండున్నర జిల్లాల కులాలకు చెందినది కావడం. కనుక తమదే అసలు సిసలైన తెలుగు అనే ఆధిపత్య భావన మీడియాలోకి ఎక్కింది.

సమైక్య రాష్ట్రంలో తెలంగాణ సాహిత్యానికి జరిగిన నష్టం అంతా ఇంతా కాదు. నిజాం పరిపాలనా కాలం నుండే సీమాంధ్రులు, ప్రధానంగా కోస్తాంధ్ర సాహిత్యకారులు తెలంగాణ కవులపట్ల వివక్షాపూరితమైన అభిప్రాయాన్ని కలిగి ఉన్నారు. అందుకే సురవరం ప్రతాపరెడ్డి 'గోలకొండ కవుల సంచిక' వెలువరించి తెలంగాణలోని సాహిత్యకారుల సామర్థ్యాన్ని నిరూపించవల్సి వచ్చింది. సురవరం జీవించిన కాలంలో భారతి, కృష్ణా పత్రిక, ఆంధ్రపత్రిక మొదలైన పత్రికలుండేవి. అవి బ్రిటీషాంధ్ర నుండి వెలువడేవి. వాటిలో ఒక్క హైదరాబాదు రాష్ట్రీయుని వ్యాసమైనా ఉండేది కాదు. ఒక వేళ పంపినా వెనక్కు తిరిగి వచ్చేది. ఈ వివక్ష రాను రాను మరింత పెరిగింది.

కవులు, రచయితలు, విమర్శకులు, సాహిత్య చరిత్రల నిర్మాతలు సమాజం పట్ల,

సమాజ శ్రేయస్సు పట్ల బాధ్యత కల్గినవారుగా, నిష్పాక్షిక బుద్ధితో ఉండటం ఆరోగ్యకరం. కానీ కోస్తా సాహిత్య చరిత్రకారులు అనైతికంగా తెలంగాణ సాహిత్యాన్ని చరిత్రలోకి ఎక్కకుండా అడ్డుకోవడమో, అడ్డుకోలును దాటినవారిని హైజాక్ చేయడమో చేశారు. వారు ఏర్పాటు చేసుకున్న సాహిత్య విలువల చట్రంలో తెలంగాణ సాహిత్యాన్ని ఇరికించి తెలంగాణది సాహిత్యం కాదని తేల్చేశారు.

## 1.15. హక్కులు

పౌరహక్కులు ఉల్లంఘించబడిన ఏ మానవ సమాజంలోనైనా అప్రజాస్వామిక పరిపాలన కొనసాగుతున్నట్లే అర్థం చేసుకోవాలి. తెలంగాణలో ప్రజలు కనీస హక్కుల కోసం కూడా పోరాడాల్సిన పరిస్థితి కల్పించింది సీమాంధ్ర వలస పాలన.

భారత రాజ్యాంగం ప్రతి భారత పౌరునికి కొన్ని హక్కులు కల్పించింది. ఆర్టికల్ 19 ప్రకారం భావప్రకటనా స్వేచ్ఛను ఇచ్చింది. అందులో అ) భావ ప్రకటనా స్వాతంత్ర్యం, ఆ) సభలు, సమావేశాల స్వాతంత్ర్యం, ఇ) సంఘాలు, యూనియన్లు పెట్టుకునే స్వాతంత్ర్యం, ఈ) దేశంలో ఎక్కడైనా సంచరించే స్వాతంత్ర్యం, ఉ) దేశంలో ఎక్కడైనా నివసించే లేదా స్థిరపడే స్వాతంత్ర్యం, ఊ) తనకిష్టమైన జీవన భృతిని ఎన్నుకునే స్వాతంత్ర్యం అనేవి ముఖ్యాంశాలు. వీటితోపాటే ఆర్టికల్ 21 ప్రతి మనిషికీ జీవించే హక్కును ఇస్తుంది. సీమాంధ్రుల అప్రజాస్వామిక పాలనలో తెలంగాణలో ఈ హక్కులన్నీ కాలరాయబడ్డాయి. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో 'తెలంగాణ' అనే పదాన్ని ఉచ్చరించడాన్ని కూడా నిషేదించారు, ఆ పదాన్ని వాడకూడదని ఆజ్ఞలు జారీ చేశారు.

తెలంగాణ ప్రజల జీవన రంగాలను ధ్వంసం చేసిన సీమాంధ్ర వివక్షపూరిత ప్రభుత్వాలు స్థానిక ప్రజల జీవించే హక్కును కాలరాశారు. వేలాదిమంది రైతులు, చేతివృత్తులవాళ్లు జీవనోపాధి కోల్పోయి ఆత్మహత్యలు చేసుకున్నారు. తాత్త్వికంగా విశ్లేషించుకుంటే ఇవన్నీ ప్రభుత్వ హత్యలే. అంటే రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కును

తుంగలో తొక్కడమే. కాకపోతే ఇది పరోక్షంగా కనిపించే అమానవీయ కార్యక్రమం.

ప్రత్యక్షంగా కూడా తెలంగాణ ప్రజల హక్కులను కాలరాచిన సందర్భాలు కోకొల్లలు. మొదట ప్రత్యేక తెలంగాణ ఉద్యమం తొలిదశలో ఈ హత్యల పర్వం మొదలైంది. సీమాంధ్ర ప్రభుత్వం తెలంగాణ విద్యార్థులు, లాయర్లు, విద్యావేత్తలు, ఇతర రంగాల ప్రజలు ప్రత్యేక తెలంగాణ ఉద్యమం చేసినందుకు తమ పోలీసు అధికారుల సహాయంతో, ప్రైవేటు గుండాల సహాయంతో తెలంగాణ వ్యాప్తంగా 400 మందికి పైగా ఉద్యమకారుల్ని చంపేసింది. తెలంగాణ మలిదశ పూర్వార్ధ ఉద్యమంలో కూడా తెలంగాణ ఉద్యమకారుల మీద హత్యాకాండ కొనసాగింది. 1997, మార్చి 8, 9 తేదీల్లో జరిగిన చారిత్రాత్మక భువనగిరి సభలో తెలంగాణ ప్రజల కడగండ్లను కంచు కంఠంతో పాట ద్వారా దృశ్యమానం చేసిన 'తెలంగాణ కళాసమితి' నాయకురాలు, బెల్లి లలిత అనే ప్రజాగాయకురాలిని కోస్తాంధ్ర ప్రభుత్వం 17 ముక్కలుగా నరికి చంపింది. అదే తెలంగాణ కళాసమితి నాయకుడు, వరంగల్ జిల్లా తొర్రూర్ వాసి ఐలన్నను బూటకపు ఎన్‌కౌంటర్ చేసింది. 'తెలంగాణ జనసభ' నాయకుడు కనకాచారిని గండ్రగొడ్డలితో మెడ నరికి చంపి, నర్సాకోబ్రాస్ పేరిట భయానకమైన హెచ్చరిక చేస్తూ హత్యాస్థలంలోనే ఒక ఉత్తరాన్ని వదిలి వెళ్లింది. అదే విధంగా సుదర్శన్ అనే జనసభ నాయకున్నీ చంపింది. సామాజిక సిద్ధాంతవేత్త మారోజు వీరన్ననూ బూటకంగా హత్య చేసింది. తెలంగాణ స్టూడెంట్స్ ఫ్రంట్ నాయకుడు ప్రసాద్‌ను బూటకంగా హత్యచేసింది. మల్లేష్, మనోహర్ అనే పాలమూరు జిల్లా తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల్ని మాయం చేసి, ఆచూకీ దొరక్కుండా చంపేసింది.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మలిదశ ఉత్తరార్థంలో కోస్తాంధ్ర ప్రభుత్వ హత్యల పర్వం పరాకాష్ఠకు చేరింది. దాదాపు 1300 మంది విద్యార్థులు, రైతులు, ఉద్యమకారుల్ని కోస్తాంధ్ర ప్రభుత్వం అత్యంత అమానవీయంగా హత్య చేసింది. అంటే మొత్తంగానే సీమాంధ్ర ప్రభుత్వ వివక్షాపూరిత విధానాల్ని ప్రశ్నిస్తూ, తమకు జరగవల్సిన న్యాయం కోసం ఉద్యమించిన వారికి జీవించే, తమ అభిప్రాయాలు చెప్పుకునే హక్కులను

కాలరాసింది. రాజ్యాంగ వ్యతిరేక పరిపాలన సాగించింది.

## 1.16. చరిత్ర

రెండు వేల ఏళ్ల తెలుగు భాషా ప్రజల చరిత్రలో అత్యధిక భాగానికి ఇవాళ్టి తెలంగాణనే రాజకీయ కేంద్రంగా ఉండింది. పెదబంకూరు, కోటి లింగాల, కొండాపూర్, ఎలగందుల, ధూళికట్ట, కీసర, హనుమకొండ, ఓరుగల్లు, గోల్కొండ, హైదరాబాదు– ఇవాళ తెలంగాణలో ఉన్న ఈ నగరాల నుంచే తెలుగు భాషా ప్రాంతాల పాలన గత రెండువేల ఏళ్లలో కనీసం పదిహేను వందల ఏళ్లపాటు జరిగింది. ప్రస్తుతం కర్ణాటక – రాయలసీమలోని హంపి – విజయనగరం, కంపిలి, ఆనెగొంది, పెనుకొండల నుంచి ఒక రెండు శతాబ్దాలపాటు పాలన సాగింది. ఇవాళ్టి కోస్తాంధ్ర నుంచి మొత్తం తెలుగు భాషా ప్రాంతాల పాలన జరిగిన సందర్భం ఒక్కటి కూడా లేదు. ధరణికోట, రాజమహేంద్రి, వేంగి, కొండపల్లి, కొండవీడు, శ్రీకాకుళంవంటి రాజధానుల నుంచి పాలించిన వాళ్లందరూ తక్కువ ప్రాంతాన్ని పాలించినవాళ్లే. కాని తెలుగు ప్రజల చరిత్రలోనూ, దక్కన్ పీఠభూమి చరిత్రలోనూ(రచనలో) తెలంగాణకు దక్కవల్సినంత స్థానం దక్కలేదు. విస్మరణకు, వివక్షకు గురైంది. ఒక రెండువేల ఏళ్ల చరిత్రగల జాతి గురించి మాట్లాడేటప్పుడు, అందులో అధికార కేంద్రం పద్నాలుగు, పదిహేను వందల ఏళ్ల పాటు ఉన్న ప్రాంతంపట్ల ఈ వివక్ష ఉండడమేమిటి, ఎప్పుడూ అధికార కేంద్రం ఉండకపోయినా, ఒక రెండు వందల ఏళ్లపాటు ఆర్థికాధికారాన్ని మాత్రం అనుభవించినందువల్ల రాజకీయ చక్రం తిప్పగలిగిన ప్రాంతానిది పైచేయి కావడమేమిటి? ఇది ఆలోచించవల్సిన, అన్వేషించవల్సిన, పరిశోధించవల్సిన ప్రశ్న. ఈ నూటయాభై, రెండువందల ఏళ్లలోనే ఎక్కువగా చరిత్ర రచన జరిగింది కాబట్టి, అంతకు ముందరి వెయ్యి సంవత్సరాల వైభవోపేత చరిత్రను తుడిచిపెట్టడమో, విస్మరించడమో, వక్రీకరించడమో జరిగిందా అన్నది కూడా పరిశీలించాలి. దాన్ని తవ్వితీయాలి. అలాగే కళలో, భాషలో, సాహిత్యంలో, ప్రజల సృజనాత్మక శక్తిలో, ప్రజా పోరాటాల, ధిక్కారాల సంప్రదాయంలో ఎక్కడ చూసినా ఇవాళ్టి తెలంగాణ ప్రాంతానికి అసాధారణమైన చరిత్ర ఉన్నది. కాని అది సమగ్రంగా,

సముచితంగా నమోదు కాలేదు. ఈ చరిత్రకు మూలాలు, పరిణామాలు ఎక్కడ వెతకాలి? తెలుగు సంస్కృతిలోని రెండు ప్రధాన జానపదగాథలకు కథాస్థలం ఇవాళ్టి తెలంగాణ భూభాగమే అని సాహిత్య విమర్శకులు, సాహిత్య చరిత్రకారులు ముదిగంటి సుజాతారెడ్డిగారి అభిప్రాయం. ఇక ప్రజా పోరాటాల చరిత్ర తీసుకుంటే కనీసం ఐదువందల సంవత్సరాలుగా ఈ ప్రాంతం, తెలంగాణ, దక్కన్ పీఠభూమి ధిక్కారాలకు వేదికగా ఉన్నదని, ఇక్కడి రైతు కూలీలు, సామాన్య ప్రజలు అసామాన్యులుగా తమ తిరుగుబాట్లతో ఈ నేలలో గొప్ప చరిత్ర నిర్మించారని తెలంగాణ చరిత్రకారులు ఇనుకొండ తిరుమలిగారి అభిప్రాయం. ఇక్కడి ప్రజలకు రాజ్యాధికారాన్ని, ఇతరేతర ఆధిపత్యాలను ధిక్కరించిన చరిత్ర ఉంది అని ఆయన అన్నారు. దీనికి మూలాలు తవ్వితీసి ఈ అభిప్రాయాన్ని బలోపేతం చేయవల్సి ఉన్నది. అలాగే ఇప్పటివరకు జరిగిన చరిత్ర రచనలో అసమగ్రత ఉన్నది. పాత చరిత్ర పుస్తకాలు ఏవి తీసుకున్నా తెలంగాణ చరిత్రకు సంబంధించి అసమగ్రత కనిపిస్తుంది. ఏటుకూరి బలరామమూర్తి, మల్లంపల్లి సోమశేఖరశర్మ, కంభంపాటి సత్యనారాయణల వంటి గొప్ప చరిత్రకారుల రచనల్లోనైనా, కాకతీయుల చరిత్ర రాసిన పి.వి.పరబ్రహ్మ శాస్త్రిగారి రచనలోనైనా తెలంగాణ చరిత్రకు సంబంధించిన పూర్తి సమాచారం ఉండదు. పరబ్రహ్మశాస్త్రిగారి పుస్తకం ప్రారంభంలోనే, కాకతీయుల పాలనా ప్రాంతం ఇంతకాలం పరాయి పాలనలో ఉండడం వల్ల చారిత్రక ఆధారాలు దొరకడం లేదు అని రాశారు. ఇది అసత్యం, లేదా అర్థ సత్యం. ఎందుకంటే చాలా ఆధారాలు ఉన్నాయి. ఇరవయ్యో శతాబ్దం తొలి రోజులనుంచీ, ఇక్కడ చారిత్రకాధారాల కోసం పరిశోధన ప్రారంభమయింది. లక్ష్మణరాయ పరిశోధకమండలి 1920 నుంచీ ఆ పని ప్రారంభించింది. శాసనాల సేకరణ ప్రారంభించింది. ఆదిరాజు వీరభద్రరావు, మారేమండ రామారావు, శేషాద్రి రమణ కవులు, యాజ్దాని మొదలైనవారు ఎంతో కృషి చేశారు. 1935లో మొదటిసారి తెలంగాణ ఇన్‌స్క్రిప్షన్స్ అనే గ్రంథం వెలువడింది. అయినా ఈ కృషి అంతా విస్మరణకు గురయింది. తెలంగాణ చరిత్రలో ఆధారాలు దొరకకపోవడం, ఆకరాలు లేకపోవడం అనే ఒక అసమగ్రత కొనసాగుతూ ఉన్నది. అది నిజానికి ఒక నింద మాత్రమే. బట్టగాల్చి మీద వేయటంవంటి ఆకరాలు లేవనే నింద. అసలది నిజమేనా? అసలు ఆధారాలు దొరకలేదా, దొరికినవాటిని పక్కకు పెట్టారా? దొరికిన ఆధారాలను సరిగా వ్యాఖ్యానించకుండా,

సమన్వయం చేయకుండా వదిలేశారా? లోతుగా ఆలోచించవల్సి ఉన్నది. ఒక సాహిత్య ఆధారమున్నది, ఒక జానపద, మౌఖిక గాథా ఆధారమున్నది, ఒక శిలాశాసన, తామ్రశాసన ఆధారమున్నది – వీటన్నిటినీ సమన్వయం చేయకుండా వదిలేశారా? ఇటువంటి సమస్యలన్నీ పరిష్కరించవల్సి ఉన్నది. వీటన్నింటితోపాటు మరొక ముఖ్యమైన సమస్య తెలంగాణ చరిత్ర రచనలో ఉన్నది. 1956 నుంచి, ఆ మాటకొస్తే 1940ల నుంచి చాలా వక్రీకరణ జరిగింది. ఇందులో కొంత ఉద్దేశ్యపూర్వకమైనదీ, కొంత అమాయకమైనది ఉన్నది. ఇందులో కొంత సైద్ధాంతిక స్థాయి వక్రీకరణ. తమతమ భావజాలాలవల్ల, సైద్ధాంతిక దృక్పథాలవల్ల తమకు ఇష్టం లేని, తమకు నచ్చని వాస్తవాలను పక్కన పెట్టడం, నమోదు చేయకపోవడం, తప్పుగా నమోదు చేయడం జరిగింది. అట్లాగే రచయితల స్థలకాలాలు ఈ వక్రీకరణకు చాలావరకు కారణమయ్యాయి. ఒకవేళ వారు తెలంగాణ వాళ్లయి ఉంటే కూడా అటువంటి తప్పులే చేశారనుకోండి, అది వేరే విషయం. కానీ చరిత్ర రచయిత కోస్తాంధ్ర ప్రాంతం నుంచో, రాయలసీమ నుంచో వచ్చి ఉన్నట్టయితే తెలంగాణకు సంబంధించిన చారిత్రక వాస్తవాలు తప్పుల తడకగా నమోదు చేయటం జరిగింది.

వర్తమాన చరిత్రకు సంబంధించిన వక్రీకరణలు కూడా చాలానే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు సంబంధించిన చరిత్ర పట్ల, ఫజుల్ అలీ కమీషన్ ఇచ్చిన రిపోర్టుపట్ల అన్యాయమైన అవాస్తవాల్ని రాశారు. పైగా ఫజుల్ అలీ కమిషన్ కంటే ముందే ఏర్పాటైన ఎస్.కె.దర్ కమిషన్ ఇచ్చిన నివేదిక, ఆ తర్వాతి జస్టిస్ వాంఛూ కమిటీ నివేదిక ఇవన్నీ ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చరిత్ర రచనకు ఆకరాలు కావాలి. కానీ అలా తీసుకోలేదు. కేవలం ఫజుల్ అలీ కమిషన్ ఇచ్చిన నివేదికను పరిగణంలోకి తీసుకుని, దాన్ని కూడా వక్రీకరిస్తూ చరిత్ర రాయడం అన్నది తెలంగాణ ప్రజలకు ద్రోహం చేయడమే అవుతుంది.

తెలంగాణ సాహిత్యానికి కూడా తెలుగు సాహిత్య చరిత్రలో ప్రాధాన్యం ఇవ్వలేదు. ఎందుకంటే "ఈ సాహిత్య చరిత్రలు రాసినవారిలో తెలంగాణ వారెవ్వరూ లేరు. అందుకే తెలంగాణ కవులకు లభించవల్సిన స్థానం లభించలేదు. అనేకమంది కవులు మరుగున

పడినారు. విస్మరణకు గురైనారు. ఈ చరిత్రకారులకు ఈ ప్రాంతం గురించి శేషాద్రి రమణ కవులు అన్నట్లు ఉపేక్షాభావం ఉండడం వల్ల, ఈ ప్రాంతం గురించి తెలియకపోవడం వల్ల కందుకూరి, బ్రౌన్‌లాంటి వాళ్ళు కూడ గోదావరివాడు అనగానే ఆ కవిని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు తీసుకెళ్ళారు. కృష్ణాతీరం వాడు అనగానే ఆ కవిని కృష్ణా, గుంటూరు జిల్లాలకు తీసుకెళ్ళినారు. ఒక కవి ఇంటిపేరు కోస్తా జిల్లాల్లో ఎక్కడ కనపడ్డా ఆ కవిని ఆ వూరివాడిని చేసినారు. కృష్ణా, గోదావరి తీరాలు తెలంగాణలో కూడా ఉన్నయనే గుర్తింపే వారికి లేదు. ఆ ప్రాంతంలో ఉన్న వూరి పేర్లు తెలంగాణలో కూడా ఉన్నయన్న జ్ఞానమే వారికి లేదు. ముదిగంటి సుజాతారెడ్డి రాసిందొక్కటే తెలంగాణ నుంచి వచ్చిన తెలుగు సాహిత్య చరిత్ర. అందుకే ఈ గ్రంథంలో తెలంగాణ కవులకు ప్రాధాన్యం లభించింది"(నారాయణరెడ్డి, సుంకిరెడ్డి. 2009 : 7). వాస్తవానికి తెలంగాణ సమాజ చరిత్ర పొడుగునా తెలంగాణ సాహిత్యం ఉన్నది. శాతవాహన యుగం మొదలు, చాళుక్య యుగం, కాకతీయ యుగం, పద్మనాయక యుగం, కుతుబ్ షాహీల యుగం, అసఫ్‌జాహీల యుగాల కాలంతోపాటు నేటిదాకా తెలంగాణ సాహిత్యం భిన్నమైన పాయల్లో విస్తరించి ఉన్నది. కానీ సుంకిరెడ్డి గారు చెప్పినట్లు రాసినవాళ్లు తెలంగాణవాళ్లు కారు కాబట్టి ఈ తెలంగాణ సాహిత్యానికి సాహిత్య చరిత్రల్లో చోటు లేకుండా పోయింది. ఈ వాస్తవాలన్నీ తొలితరం తెలంగాణ సాహిత్య పరిశోధకులకు తెలిసి వారి వారి స్థాయుల్లో పరిశోధన నెరిపినా అది ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మొదలై అస్తిత్వ పరివేదన ప్రారంభించేదాక గుణాత్మక మార్పు తీసుకోలేదు. మళ్లీ ఉద్యమ సందర్భంలో తెలంగాణ చరిత్రకారులు పూనుకొని సీమాంధ్ర సాహిత్య చరిత్రకారులు తెలంగాణ సాహిత్యంపై కప్పిన మట్టిని తొలగించే బాధ్యతను సమర్థవంతంగా చేపట్టారు.

### 1.17. హైదరాబాదు నగరం

హైదరాబాదు నగరానికి సంబంధించిన సమస్య మలిదశ ఉత్తరార్థంలో ప్రధానంగా తెర మీదికి వచ్చింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్న సందర్భంలో 'హైదరాబాదు మాదే' అని సీమాంధ్రులు మాట్లాడటం

మొదలెట్టారు.

మద్రాసులో భాగంగా ఉన్న తెలుగు ప్రజలు, తమిళులు తమకు అన్ని రంగాల్లో తీరని అన్యాయం చేస్తున్నారని, తమకు ప్రత్యేక రాష్ట్రం కావాలని ఉద్యమించారు. పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్షకు కూర్చున్నాడు. ఆనాటి ప్రధానమంత్రి నెహ్రూ ప్రత్యేక రాష్ట్రం ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. కానీ పొట్టి శ్రీరాములు తన దీక్షను విరమించలేదు. దానికి కారణం ఆయన మద్రాసు రాజధానిగా కలిగిన తెలుగు రాష్ట్రం కావాలని అడిగాడు. దానికి నాటి ప్రభుత్వం ఒప్పుకోలేదు. ఆయన దీక్ష కొనసాగించి ప్రాణాలు కోల్పోయాడు. చరిత్రలో దీన్ని కూడా అవాస్తవంగా రికార్డు చేసి, పిల్లలకు పాఠాలుగా బోధిస్తున్నారు. తెలుగుప్రజల సమైక్యత కోసం, ప్రత్యేక ఆంధ్రకోసం, ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకోసం పొట్టి శ్రీరాములు త్యాగం చేశాడని చెప్తున్నారు. వాస్తవానికి ఆయన వీటన్నింటికంటే ముఖ్యంగా మద్రాసు కోసమే ప్రాణత్యాగం చేశాడు. సరిగ్గా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం తెలంగాణ ప్రజలు ఉద్యమిస్తున్నప్పుడు, ఆ ఉద్యమం ఫలవంతమయ్యే దశకు చేరుకున్నప్పుడు సీమాంధ్ర నాయకులు మాకు హైదరాబాద్ కావాలని కొత్త వాదనలు మొదలుపెట్టారు. దీనికి కారణంగా హైదరాబాద్‌ను మేమే నిర్మించామని, అభివృద్ధి చేశామని అవాస్తవాల్ని ప్రచారం చేశారు. వాస్తవానికి హైదరాబాద్‌లో ఏ పరిపాలనా భవనమూ ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు అయ్యాక నిర్మాణం అయింది కాదు. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు తర్వాత, మరీ ముఖ్యంగా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాక ప్రజా వ్యతిరేక విధానాలతో సైబర్ సిటీని నిర్మాణం చేశాడు. దీని ద్వారా తెలంగాణ ప్రజలకు ఒరిగిందేమీ లేదు. ఈ నిర్మాణం (ఒక రకంగా విధ్వంసం అనాలి) మినహా ఏ కట్టడమూ సీమాంధ్ర పాలకులు చేసింది లేదు. కానీ వాస్తవాలకు విరుద్ధంగా మొత్తం తెలంగాణకే గుండెకాయవంటి హైదరాబాద్‌ను మేమే అభివృద్ధి చేశామని, కనుక అందులో తమకు వాటా ఉందని కొందరు, మొత్తానికే హైదరాబాద్ మాకే కావాలని కొందరు వాదించారు. చారిత్రకంగా చూసుకున్నప్పుడు హైదరాబాద్ నగర నిర్మాణం మొదలు నేటిదాకా తెలంగాణ ప్రజల రక్త మాంసాలతోనే పట్టణం వికసించి, విస్తరించిందని అర్థం అవుతుంది. సీమాంధ్ర పెట్టుబడులను కాపాడుకోవడం

కోసమే ఈ బూటకపు వాదన చేస్తున్నారని, ఇందులో ఇసుమంతైనా నిజం లేదని చరిత్ర చెబుతోంది.

## 1.18. జీవోలు, ఒప్పందాలు, రక్షణలు, కోర్టు తీర్పులు, కమిటీలు, కమీషన్‌లు, సిఫారసులు - ఉల్లంఘనలు

హైదరాబాద్ రాష్ట్రంగా ఉన్నప్పటి నుండి తెలంగాణ రాష్ట్రం రూపొందేదాక తెలంగాణ ప్రజలను దృష్టిలో ఉంచుకుని అనేక రక్షణలు, ఒప్పందాలు, జీవోలు ప్రకటించబడ్డాయి. కానీ ఏవీ అమలుకు నోచుకోలేదు. పైగా కొన్ని వ్యతిరేకంగా కూడా పనిచేశాయి. వాటిపట్ల తెలంగాణ ఉద్యమం మౌలికమైన ప్రశ్నలను లేవనెత్తింది.

1919లో ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానికులనే నియమించాలని మొదటిసారి ఫర్మానా(జీవో) జారీ చేశాడు. ఈ ఫర్మానా ప్రకారం హైదరాబాదు రాష్ట్రంలో జన్మించినవారు మాత్రమే ముల్కీలు. వీరితోపాటు 15 సంవత్సరాలపాటు నిరవదికంగా హైదరాబాదు రాష్ట్రంలో నివసిస్తూ, తిరిగి వెనక్కి వెళ్లే ఆలోచన లేనివారు కూడా ముల్కీలే. కొద్ది కాలానికే ఈ ఫర్మానాకు ఉల్లంఘనలు ఎదురుకావడంతో, 1933లో మరొక ఫర్మానా జారీ చేస్తూ హైదరాబాదు రాష్ట్ర ఉద్యోగాల్లో స్థానికులకే అవకాశం ఇవ్వాలని హుకూం జారీ చేశాడు. 1948, సెప్టెంబర్ 17న నిజాం రాజు భారత ప్రభుత్వానికి లొంగిపోయి, హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనం కావడంతో నిజాం జారీ చేసిన ఫర్మానాను సీమాంధ్ర ఉద్యోగులు భారీ స్థాయిలో ఉల్లంఘించి హైదరాబాద్ రాష్ట్ర ఉద్యోగాల్లో చేరారు.

భారత ప్రభుత్వం, రాష్ట్రాల పునర్విభజన కోసం 1953లో ఫజుల్ అలీ నేతృత్వంలో ఒక త్రిసభ్య కమీషన్ నియమించింది. ఈ కమిషన్ హైదరాబాద్ రాష్ట్రాన్ని ఆ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నట్లు, విడిగానే ఉంచాలని సిఫారసు చేసింది. కానీ ఈ సిఫారసు కూడా ఉల్లంఘించబడింది. ఆ తర్వాత హైదరాబాదు, ఆంధ్ర రాష్ట్రాలను కలపడం

కోసం ప్రభుత్వ అధికారిక 'పెద్దమనుషుల ఒప్పందం' జరిగింది. ఆ ఒప్పందంలోని అన్ని అంశాలు ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నాటినుండే ఉల్లంఘనలకు గురయ్యాయి.

1968లో తెలంగాణ ఉద్యమం మొదలైన తర్వాత దాని ఉధృతిని గమనించిన కేంద్ర ప్రభుత్వం 22-04-1969 తేదీన జస్టిస్ భార్గవ కమిటీని నియమించింది. ఈ కమిటీలో జస్టిస్ వశిష్ట భార్గవ చైర్మన్‌గానూ, ఆచార్య ముకుత్ విహారి మాథుర్, శ్రీ హరి భూషన్ భార్ సభ్యులుగానూ, శ్రీ టి.ఎన్.కృష్ణస్వామి సెక్రెటరీగానూ ఉన్నారు. ఈ కమిటీ బాధ్యత ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తొలిరోజు నుండి అంటే, 01-11-1956 నుండి 31-03-1968 మధ్య కాలంలో తెలంగాణ మిగులు నిధుల లెక్కలు తేల్చటం. అంతేకాకుండా న్యాయబద్ధంగా తెలంగాణకు ఖర్చు చేయవల్సి ఉండి చేయని నిధుల లెక్కలు కూడా తేల్చటం. ఈ కమిటీ 1969 మే 31కల్లా భారత ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలి. తర్వాతి కాలంలో ఆ కమిటీ ఇచ్చిన రిపోర్టు వెలుగుచూడలేదు. దీని ద్వారా అర్థమైన విషయం ఈ కమిటీని కేవలం ఉద్యమాన్ని చల్లార్చడం కోసమే వేశారని. ఆ తర్వాత మళ్లీ జస్టిస్ వాంఛూ అధ్యక్షుడిగా మరో కమిటీని కేంద్ర ప్రభుత్వం నియమించింది. నాన్‌ముల్కీ సమస్య వచ్చింది కాబట్టి తెలంగాణ ప్రజలకు ప్రత్యామ్నాయ ఉద్యోగ అవకాశాలను ఎలా కల్పించగలమో సూచించమని కమిటీని కేంద్రం ఆదేశించింది. కానీ ఆ రిపోర్టు కూడా భార్గవ కమిటీలాగే బయటికి రాలేదు. ఈ కమిటీని కూడా కేవలం ఉద్యమాన్ని చల్లార్చడానికే వేసినట్లు అర్థం అవుతుంది.

1969 జనవరి 19న ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించగా ఆ సమావేశం స్థానికేతరులను వెనక్కు పంపడానికి అంగీకరించింది. దీని పునాదిగానే 1969 జనవరి 21న స్థానికేతరులను వెనక్కి పంపడానికి ప్రభుత్వం జీవో నెంబర్ 36ను జారీ చేసింది. ఆ జీవో ప్రకారం తెలంగాణ ఉద్యోగాల్లో ఉన్న 22వేల మంది స్థానికేతర ఉద్యోగులను వెనక్కి పంపించి, ఏర్పడే ఖాళీల్లో స్థానికులను నియమించాలి. కానీ ఆనాడు తెలంగాణలో పనిచేస్తుండిన ఆంధ్రా ఉద్యోగులు హైకోర్టుకు వెళ్లి జీవోకు వ్యతిరేకంగా స్టేను తెచ్చారు. దాంతో ఆ జీవో అమలుకాలేదు. ఆ తర్వాత ఆనాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ

1969 ఏప్రిల్ 11న పార్లమెంట్‌లో అష్టసూత్ర పథకాన్ని ప్రకటించింది. అది కూడా తెలంగాణ ప్రజల్ని ఏమాత్రం సంతృప్తి పరచలేకపోయింది. ఆ తర్వాత 1972 అక్టోబర్ 3న సుప్రీం కోర్టు ముల్కీ నిబంధనలు రాజ్యాంగబద్ధమైనవే అని ప్రకటించింది. సుప్రీం కోర్టు తీర్పు వెలువడగానే సీమాంధ్రలో జై ఆంధ్ర ఉద్యమం చెలరేగింది. ఈ ఉద్యమం తెలంగాణ రక్షణలను సమూలంగా రద్దు చేయాలని డిమాండు చేసింది. దాంతో నాటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధి ముల్కీ నియమాలపై 1972 నవంబర్ 27న పంచసూత్ర పథకాన్ని ప్రకటించింది. సీమాంధ్ర ప్రజల జై ఆంధ్ర ఉద్యమం లేవనెత్తిన కొత్త ప్రశ్నల వాతావరణంలో ముల్కీ నిబంధనలను అమలు చేయాలంటే కొన్ని సవరణలు తప్పవని భావించిన కేంద్రం పంచసూత్ర పథకాన్ని తీసుకువచ్చింది. జై ఆంధ్ర ఉద్యమం తీవ్రతరం కావడంతో తెలంగాణకు ఇచ్చిన ఈ రక్షణలను కూడా కేంద్రం రద్దు చేసి ఆరు సూత్రాల పథకాన్ని తీసుకువచ్చింది. ఈ పథకం మొత్తం తెలంగాణ ప్రజల ప్రయోజనాల్ని దెబ్బతీసింది. అప్పటివరకు కొద్దోగొప్పో పనిచేస్తున్న రీజనల్ కమిటీ రద్దయింది. తెలంగాణ ఆదాయాన్ని విడిగా చూపే నియమం నీరుగారిపోయింది. ముల్కీ నిబంధనల్లో చేసిన మార్పుల కారణంగా స్థానికత్వం సంపాదించడానికి కేవలం 4 సంవత్సరాల నివాసకాలం చాలని చెప్పడం వల్ల అప్పటికే ఇక్కడ ఉద్యోగాల కారణంగా స్థిరపడిన నాన్‌ముల్కీలకు లాభించింది. స్థూలంగా స్థానిక రిజర్వేషన్లు ఉల్లంఘించబడ్డాయి.

ఈ క్రమంలోనే తెలంగాణ ఉద్యోగ సంఘాలు 1983–84 మధ్య కాలంలో నాన్‌ముల్కీ ఉద్యోగ నియామకాలకు వ్యతిరేకంగా ఉద్యమం చేశారు. నాటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు జోన్‌ల రిజర్వేషన్(32వ రాజ్యాంగ సవరణ, రాష్ట్రపతి ఉత్తర్వుల కారణంగా వచ్చిందిది) నియమ నిబంధనల అమలును పరిశీలించడానికి ముగ్గురు ఐఏఎస్ అధికారులతో ఒక కమిటీ వేశాడు. ఆ కమిటీకి జయభారత్ రెడ్డి కన్వీనర్. కమల్‌నాథన్, ఉమాపతి సభ్యులు. ఈ కమిటీ 1975–84 మధ్య కాలంలో తెలగాణ ప్రాంతంలో జరిగిన ఉద్యోగ నియామకాలను పరిశీలించి, తెలంగాణలోని అన్ని జోన్‌లలో కలిపి సీమాంధ్ర ఉద్యోగులు 59 వేల మంది ఉన్నారని తేల్చింది. వాస్తవాలు వెలుగు చూసిన వెంటనే తెలంగాణ ఉద్యోగ సంఘాలు ఈ అన్యాయాన్ని అరికట్టాలని డిమాండ్

చేశాయి. దాంతో ప్రభుత్వం 1985 డిశెంబర్ 30న 610 జీవోను తీసుకువచ్చింది. దీని ప్రకారం స్థానికేతర ఉద్యోగులను వెనక్కి పంపాలి. కానీ ఈ జీవో కూడా అమలుకు నోచుకోలేదు. ఆ తర్వాత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యాక 1975 నుండి తెలంగాణ ఉద్యోగులకు జరిగిన అన్యాయాలను తేల్చేందుకు విశ్రాంత ఐఏఎస్ అధికారి గిర్గ్లానీతో ఏకసభ్య కమీషన్ వేశాడు. ఈ కమీషన్ 2001, జూన్ 26న పరిశోధన మొదలుపెట్టి 2004 సెప్టెంబర్ 30న నివేదిక సమర్పించింది. ఈ నివేదిక కూడా నిజాయితీగా తెలంగాణ నిరుద్యోగులకు, ఉద్యోగులకు అన్యాయం జరుగుతున్నదని, యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని, అన్యాయాలను అరికట్టాలని చెప్పింది. అయినా ఈ కమీషన్ సిఫారసులు అమలుకు నోచుకోలేదు. మళ్లీ 2010 ఫిబ్రవరి 3న కేంద్ర ప్రభుత్వం శ్రీకృష్ణ కమిటీని నియమించింది. ఈ కమిటీ ఏర్పాటులోనూ, నివేదికలోనూ తెలంగాణకు అన్యాయం చేసిన అంశాలే ఎక్కువగా ఉన్నాయి.

ఇట్లా మొత్తంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పాటకు ముందే మొదలైన సీమాంధ్రుల వలసాధిపత్యం, ఏర్పాటు అయ్యేటప్పుడు, అయ్యాక మరింత చట్టబద్ధంగా కొనసాగింది. ఈ క్రమంలో తెలంగాణ ప్రజలు ఉద్యమించిన ప్రతిసారి ఉపశమనాలుగా వివిధ కమిటీలు, కమీషన్లు, కోర్టు తీర్పులు, ఒప్పందాలు, రక్షణలు వంటివి వచ్చినా ఏ ఒక్కటి కూడా తెలంగాణ ప్రజల న్యాయమైన కోరికల్ని తీర్చలేకపోయాయి.

అధ్యాయం - 2

# ప్రత్యేక తెలంగాణోద్యమం - ప్రజాచైతన్యం

తెలంగాణ ప్రజలకు ఇష్టం లేకున్నా సీమాంధ్ర ప్రయోజనాలకోసం ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు జరిగింది. తెలంగాణ ప్రజలకు సీమాంధ్రుల పట్ల ఉన్న వ్యతిరేకత కేవలం ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుతో మొదలైంది కాదు. భాషా ప్రాతిపదికన ఒకే తెలుగు రాష్ట్రం ఏర్పర్చాలనే భావన భారత ప్రభుత్వానికి రాకంటే చాలా ముందునుండే తెలంగాణ ప్రజలకు సీమాంధ్రుల వ్యవహారాలపట్ల భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. చారిత్రకంగానే రెండు భిన్నమైన ప్రాంతాలుగా ఎదిగిన తెలంగాణ, సీమాంధ్రలకు కొన్ని సారూప్యతలు ఉన్నప్పటికీ చరిత్ర, రాజకీయాలు, పాలన, సంస్కృతి, కళలు, సాహిత్యం తదితర అన్ని అంశాలలో వైవిధ్యం ఉంది. 1948 నుండి సీమాంధ్రులు తెలంగాణ ప్రజల ఉద్యోగాలను కొల్లగొట్టినప్పుడు అది బాహాటంగా వ్యక్తమైంది. చారిత్రకంగా తామెప్పుడూ ఒక విడి తెలుగు ప్రాంతంగానే ఉన్నామని, సీమాంధ్ర ప్రజలు మద్రాసు రాష్ట్రంలో భాగంగా లేదా, విడిపోయి ఉన్నా పరాయివాళ్లనే భావన తెలంగాణ ప్రజలకు ఉంది. ఈ మానసిక స్థితి నుండే తెలంగాణ ప్రజలకు అన్యాయం జరిగిందని భావించినప్పుడు ఉద్యమాలు పుట్టాయి. సీమాంధ్రులు పరాయి ప్రాంతం వారు అనే తెలంగాణ ప్రజల భావనను చారిత్రక నేపథ్యం కూడా బలపరుస్తోంది.

## 2.1. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు ముందు - తర్వాత

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం 1969లో మొదలైందని చాలామంది అభిప్రాయపడుతుంటారు. ఇది పాక్షిక సత్యం మాత్రమే. ఏదేని ఒక సన్నివేశానికి గతానికి, వర్తమానానికి సంబంధించిన ఒక గతితార్కిక సంబంధం ఖచ్చితంగా ఉంటుంది. "1956 ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావానికి ముందే నాన్‌ముల్కీ ఉద్యమం(1952), రాష్ట్రాల

పునర్వ్యవస్థీకరణ కోసం ఏర్పరచిన ఫజల్ అలీ కమిషన్ ముందు సాగిన చర్చలు, కమిషన్ నిర్ణయాలు (1954–55), పెద్దమనుషుల ఒప్పందం (1956) వంటివన్నీ కోస్తాంధ్ర పాలకులు నిర్వహించబోయే ఆంధ్రప్రదేశ్‌లో తమకు అన్యాయం జరుగుతుందని తెలంగాణ ప్రజలు వ్యక్తీకరించిన భయ సందేహాలకు చిహ్నాలే" (వేణుగోపాల్, ఎన్. 2009 : 14). కనుక ప్రత్యేక తెలంగాణ ఉద్యమ చరిత్రను హైద్రాబాద్ రాష్ట్రాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసుకున్న కాలం దగ్గర్నుంచి ప్రారంభించాల్సి ఉంటుంది. అట్లా చారిత్రక మూలాలను పరిగణంలోకి తీసుకుని చూసినప్పుడే విశ్లేషణకు పరిపూర్ణత చేకూరుతుంది.

### 2.1.1. నాన్‌ముల్కీ వ్యతిరేక ఉద్యమాలు

తెలంగాణ ప్రజలు సీమాంధ్ర వలస ఉద్యోగులకు వ్యతిరేకంగా 1948 నుండి నాన్‌ముల్కీ గోబ్యాక్ ఉద్యమం నిర్వహించినట్లు చాలామంది భావిస్తున్నా, అంతకు ముందటి చరిత్రలో చాలా సార్లు నాన్‌ముల్కీలకు వ్యతిరేకంగా పోరాడారు. "దక్కన్ రాజకీయ చరిత్రలో ముల్కీ ఉద్యమాలు ముఖ్యపాత్రను నిర్వహించాయి. ఈనాటి ప్రత్యేక తెలంగాణా ఉద్యమం ఆ చరిత్రకు కొనసాగింపుగానే అర్థం చేసుకోవాలి. నేటి ఉద్యమం పునాదులు, మూలాలు మనకు ఐదువందల సంవత్సరాల క్రిందటి చరిత్రలో కనబడుతాయి" (శోభాగాంది. 2010 : 3). ఈ నేపథ్యంలో ఉద్యమ మూలాల్ని స్థూలంగానైనా అర్థం చేసుకోవాల్సి ఉంది.

తెలంగాణలో మొట్టమొదటిసారిగా బహమనీ సుల్తానుల పరిపాలనా కాలంలో ముల్కీ ఉద్యమాలు తలెత్తాయి. 1294 నుండి 1351 మధ్యకాలంలో అల్లావుద్దీన్ ఖిల్జీ, మహమ్మద్‌బిన్ తుగ్లక్ సైన్యాలతోపాటు దక్షిణాదికి వచ్చి స్థిరపడిన వారిని దక్కనీలు అనేవారు. వీళ్లు స్థానికులుగా మారి బహమనీల రాజ్యంలో పదవులు, ఉద్యోగాలు నిర్వహించారు. సరిగ్గా ఈ కాలంలోనే ఇరాక్, ఇరాన్, టర్కీ, అరేబియా దేశాల నుండి కూడా చాలామంది వలస వచ్చి దక్షిణాదిలో స్థిరపడ్డారు. వీళ్లను ఆఫాకీలు అని పిలిచేవారు.

'ఆఫాకీ' అనేమాటకు అర్థం స్థానికేతరులు. అంటే ఇక్కడ దక్కనీలు ముల్కీలుగా, ఆఫాకీలు నాన్‌ముల్కీలుగా ఉన్నారు. అయితే ఈ ఆఫాకీలు కేవలం బతుకుదెరువు కోసం వచ్చినవారిలా కాకుండా వర్తక వాణిజ్యాల్లో చేరి, విజయవంతమై ఆర్థికంగా బలపడ్డారు. ప్రభుత్వంలో భాగం అయ్యారు. దాంతో రాజ్యంలో వీరికి చాలా పట్టు ఉండేది. పైగా దక్షిణాదిలో ఉండే ఉద్యోగాల్లో ఆఫాకీలదే సింహభాగం. దక్కనీలు(ముల్కీలు) రెండవ శ్రేణి పౌరులుగా గణింపబడ్డారు. మతపరంగా కూడా దక్కనీలు సున్నీలు, ఆఫాకీలు షియాలు. దాంతో ఆఫాకీలకు, దక్కనీలకు శత్రుత్వం పుట్టింది. బహమనీ రాజుల అండతో, తమకు కలిగిన రాజకీయాధికారాలతో ఆఫాకీలు దక్కనీలను కేవలం సైన్యంలో వాడుకోవడం తప్ప ఏ ఇతర అవకాశాలనుగానీ, గౌరవాన్ని కానీ కల్పించకుండా అణచివేశారు. దీంతో ఆఫాకీలకు, దక్కనీలకు మధ్య వైరుధ్యం పెరిగి నాన్‌ముల్కీలైన ఆఫాకీలకు వ్యతిరేకంగా దక్కనీలు ఉద్యమించడంతో 1521లో బహమనీల రాజ్యం పతనమైపోయింది. ఆ తర్వాత దక్షిణాదిలో ఐదు రాజ్యాలు ఏర్పడ్డాయి. వాటిలో గోల్కొండ కుతుబ్‌షాహీ రాజ్యం కూడా ఒకటి.

తెలుగుభాషా సాహిత్యాలకు కుతుబ్ షాహీలు చాలా ప్రాధాన్యత ఇచ్చారనీ, తెలుగువాళ్లకు చాలా మేలు చేశారని వర్తమాన చరిత్రలో చాలా మంది మాట్లాడుతుంటారు. వాస్తవానికి అది ఇక్కడి ప్రజలు చేసిన నాన్‌ముల్కీ వ్యతిరేక ఉద్యమ ఫలితం. బహమనీ రాజ్యం, ముల్కీలకు ప్రాధాన్యతనివ్వకుండా కేవలం ఆఫాకీలకే అధికారాలు, అవకాశాలు కల్పించడంవల్ల పతనమైపోయిన సంగతి స్వయంగా ఆఫాకీ అయిన కుతుబ్‌షాహీ రాజ్య స్థాపకుడు కులీకుతుబ్‌షాకు బాగా తెలుసు. ఆయన నాటి రాజకీయ పరిస్థితులను బాగా అర్థం చేసుకుని, గుణపాఠాలు నేర్చుకుని తన పూర్వీకులు చేసిన తప్పులు పునరావృతం కాకుండా చూశాడు. ముల్కీలకే ప్రాధాన్యతనిస్తూ, ఉద్యోగాలు, ఇతరేతర అవకాశాలు కల్పించాడు. పైగా స్థానిక భాష అయిన తెలుగును, తెలుగు సాహిత్యాన్ని గౌరవించి, ప్రోత్సహించాడు. దాని కొనసాగింపుగానే అబుల్ హసన్ తానీషా రాజుగా ఉన్నప్పుడు మాదన్న మహామంత్రిగా, అక్కన్న పేష్కారుగా ఉన్నారు. కనుక ఈ పరిణామం నాన్‌ముల్కీ వ్యతిరేక ఉద్యమం వల్ల జరిగిందే అని గ్రహించాలి.

అసఫ్‌జాహీల కాలంలో మళ్లీ నాన్‌ముల్కీ ఉద్యమాలు తలెత్తాయి. మొదటి నిజాం దక్కన్‌కు వచ్చినప్పుడు తన వెంట తీసుకువచ్చిన ముస్లింలు, కాయస్థ హిందువులు, స్థానికులను కాదని జాగీర్లను, మంత్రి పదవులను దక్కించుకున్నారు. ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం పర్యవసానంగా మొఘల్ రాజ్యం అంతరించగానే ఢిల్లీ, లక్నో, ముర్షిదాబాద్, అవధ్ రాజ్యాల నుండి మంత్రులు, ఉద్యోగులు, కవులు, కళాకారులు, వృత్తి విద్య నైపుణ్యం ఉన్నవాళ్లు అసఫ్‌జాహీ రాజ్యానికి వచ్చి స్థిరపడ్డారు. నిజాంకు వ్యతిరేకంగా వ్యవహరించిన ప్రధాని సాలార్ జంగ్ పరిపాలనా సంస్కరణలవల్ల మరికొంత మంది కూడా వచ్చిపడ్డారు. దాంతో ఐదవ నిజాం కాలంలో చాలా బలమైన నాన్‌ముల్కీ ఉద్యమాలు జరిగాయి. కనుకనే ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1919లో ఒకమారు, 1930లో మరొకమారు ముల్కీ నిబంధనలకోసం ఒక ఫర్మానా జారీ చేసి స్థానిక ప్రజలకే ఉద్యోగాలు ఇవ్వాలని హెచ్చరించాడు. ఈ హెచ్చరికలో బహుశా ఆయనకు సాలార్‌జంగ్ మీద కోపం కూడా ఉండి ఉంటుంది. “ఈ ఫర్మానా ప్రకారం హైదరాబాదు రాష్ట్రంలో జన్మించినవారు మాత్రమే ముల్కీలు. వీరేగాక ఇంకా ఎవరైనా గత 15 సంవత్సరాలనుండి వరుసగా హైద్రాబాదు రాష్ట్రంలో నివసిస్తూ తిరగి వెనక్కి వెళ్లే ఆలోచన లేనివారు కూడా ముల్కీలేనని చెప్పారు”(శోభాగాంది. 2010 : 9). అప్పట్నుంచి హైద్రాబాద్ రాష్ట్రంలో ముల్కీ నిబంధనలు అమలవుతుండేవి. నిజాం చేసిన ఈ పనికి హైదరాబాద్ రాష్ట్రీయులంతా హర్షించారు. ఇది మాత్రమే కాకుండా 1934లో ‘నిజాం ప్రజల సంఘం(ది నిజాం సబ్జెక్ట్స్ లీగ్)’ అనే ఒక సంస్థను రాజే ఏర్పాటు చేశాడు. దీన్నే ఉర్దూలో ‘జమీయత్ రిఫాయామే నిజాం’ అన్నారు. ఈ సంస్థ ‘హైదరాబాద్ ఫర్ హైదరాబాదీస్’ అని నినదించింది. ఆనాటి హిందూ ముస్లిం మేధావులు ఈ సంఘంలో ప్రాతినిధ్యం వహించారు. కొత్వాల్ రావ్ బహద్దూర్ వెంకట్రాం రెడ్డి, మాడపాటి హన్మంతరావు, వామన్ నాయక్, కాశీనాథరావు వైద్య లాంటివారు ఇందులోని ప్రముఖులు.

భారత ప్రభుత్వం, అవిభక్త కమ్యూనిస్టు పార్టీలు ఉమ్మడిగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి విద్రోహం చేసిన తర్వాత 1952 వరకు హైదరాబాద్ రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు జరగలేదు. 1948 నుంచి 1952 వరకు ఈ ప్రాంతాన్ని సివిల్

అడ్మినిస్ట్రేటర్స్ పాలించారు. ఈ నాలుగు సంవత్సరాలలో వేలాదిమంది ఉద్యోగులు మద్రాసు రాష్ట్రం నుండి హైద్రాబాద్ రాష్ట్రంలోకి వచ్చి చొరబడ్డారు. దాంతో తెలంగాణ ప్రజలు 'గైర్ ముల్కీ గోబ్యాక్' ఉద్యమం నడిపారు.

ఈ ఉద్యమం ప్రధానంగా విద్యార్థులచే నిర్వహించబడింది. అక్కడక్కడా కొంతమంది రాజకీయ నాయకులు, కార్మికుల ప్రమేయం ఉన్నప్పటికీ హైదరాబాద్ రాష్ట్ర జిల్లాల్లోని విద్యార్థులే ఈ ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించారు. అనేకమార్లు పోలీసు కాల్పులు జరిగినా, లాఠీచార్జిలు జరిగినా, ఎన్నిరకాలుగా ఉద్యమాన్ని అణచివేసినా విద్యార్థులు ఉద్యమాన్ని వీడలేదు. దాదాపు 18మంది ఈ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయారు. వందలాదిమంది ప్రజలు పోలీసుల కాల్పులకు, లాఠీచార్జిలకు గాయపడ్డారు. 'ఇడ్లీ సాంబార్ గోబ్యాక్ ఉద్యమం', 'నాన్‌ముల్కీ గోబ్యాక్ ఉద్యమం', 'గైర్ ముల్కీ గోబ్యాక్ ఉద్యమం', 'బేముల్కీ గోబ్యాక్ ఉద్యమం' ఇలా భిన్న వ్యవహారాల్లో ఉన్న ఈ ఉద్యమం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఓ కుదుపు కుదిపింది.

### 2.1.2. 'ఆంధ్ర రాష్ట్రం' అవతరణ

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో అనేక వివక్షలు ఎదుర్కొన్న తెలుగు ప్రజల సుదీర్ఘ పోరాటం ఫలితంగా 1953 అక్టోబర్1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం అవతరించింది.

### 2.1.3. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు

మరోవైపు ఆంధ్రాలో విశాలాంధ్ర నినాదం రాజుకుంది. దీనికి కొంత పూర్వ నేపథ్యం కూడా ఉంది. 1949లో అయ్యదేవర కాళేశ్వరరావు విజయవాడలో 'విశాలాంధ్ర మహాసభ'ను స్థాపించాడు. ఆ సంస్థ ఆంధ్ర, హైదరాబాద్ రాష్ట్రాలను కలపడం కోసం ప్రజల్లో ప్రచారం చేసింది. 1951లో అఖిల భారత కాంగ్రెస్ మహాసభల్లో కూడా

అయ్యదేవరగారు విశాలాంధ్ర వాదాన్ని వినిపించినప్పుడు నెహ్రూ దాన్ని తిరస్కరించాడు. ఆనాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని నిర్వహించిన కమ్యూనిస్టు పార్టీ కూడా (కమ్యూనిస్టు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య రాసిన 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' పుస్తకంలో ఇదే విషయం ప్రతిపాదించి ఉన్నాడు) విశాలాంధ్రనే ప్రచారం చేసింది. దీని వెనుక కమ్యూనిస్టు నాయకులకు ఒక బలమైన ఉద్దేశం ఉంది. సాయుధ పోరాట విరమణ తర్వాత కమ్యూనిస్టులు ఎన్నికల్లోకి వచ్చారు. "కావున విశాలాంధ్ర ఏర్పడితే రెండు ప్రాంతాలలోని కమ్యూనిస్టుల సీట్ల ఆధిక్యంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చునన్న ఆశతో కమ్యూనిస్టులు 1952లో విశాలాంధ్రలో ప్రజారాజ్యం అన్న నినాదాన్ని బలంగా ప్రచారం చేశారు" (శోభాగాంది. 2010 : 26). ఈ కమ్యూనిస్టుల భావన హైదరాబాద్ రాష్ట్ర ప్రజలకు అంగీకార్యం కాలేకపోయిందని ఆ తర్వాత జరిగిన పరిణామాలు స్పష్టం చేశాయి. వాస్తవానికి ఆనాటి నాయకత్వం ప్రజాభీష్టానికి విరుద్ధంగా ఊహల్లో బతికిందని కూడా అర్థం అవుతుంది. "1948 నుంచి 1956 మధ్యకాలంలో విశాలాంధ్ర డిమాండ్ చేసిన తెలంగాణ నాయకులకు అది సెంటిమెంటు, హైదరాబాద్ రాజ్యం యథాతథంగా లేదా ప్రత్యేక తెలంగాణా ఏర్పడాలనేది ప్రజాభీష్టం. హైదరాబాద్ రాజ్యంలో రజాకార్ల దాడులకు తాళలేక విజయవాడ, కర్నూలు లాంటి ప్రదేశాలకు వలసవెళ్లిన తెలంగాణ నాయకులు అక్కడ ఆశ్రయమిచ్చిన నేతల ప్రభావానికి లోనయి విశాలాంధ్ర వస్తే నిజంగానే తెలుగువారందరూ ఒక్కటిగా ఉండొచ్చని నమ్మింద్రు. దాన్ని ఆచరణలో కూడా పెట్టింద్రు. ఇదివరకే చెప్పుకున్నట్లుగా దేవులపల్లి రామానుజరావు, పాగా పుల్లారెడ్డి, మీర్ అహమ్మద్ అలీఖాన్, ఎస్.ఆర్.వెంకటేశం, బొమ్మకంటి సత్యనారాయణ మొదలైన వాండ్లు అయ్యదేవర కాళేశ్వరరావు అడుగు జాడల్లో నడుస్తూ ఆయన స్థాపించిన విశాలాంధ్ర మహాసభకు తెలంగాణలో ప్రచారం కల్పించింద్రు. తెలంగాణ నాయకులు సమైక్యాంధ్ర కోరుకోవడం కేవలం సెంటిమెంటు మాత్రమే. వాదానికి, తర్కానికి నిలబడని సిద్ధాంతాలను పక్కనబెట్టి మనిద్దరి భాష తెలుగే అని తెలంగాణలో సెంటుమెంటుని రగిల్చారు. ఆ మాయలో తెలంగాణ కవులు కళాకారులు సునాయాసంగా చిక్కుకున్నారు. దాశరథి, కాళోజిలాంటి వారు కూడా విశాలాంధ్రకోసం డిమాండ్ చేసింద్రు. అయితే 1969 నాటికి వచ్చేసరికి వాస్తవాలు అనుభవంలోకి వచ్చి

చాలామంది రచయితలు ప్రత్యేక తెలంగాణకు మద్ధతుగా నిలిచింద్రు" (తెలంగాణ హిస్టరీ సొసైటి. 2006 : 88). కవులు, రచయితలు, నాయకుల పరిస్థితి ఇలా ఉంటే ప్రజల పరిస్థితి మరోలా ఉండేది. రజాకార్ల ఆకృత్యాలు భరించలేక మహారాష్ట్రకు, కర్ణాటకకు వలసెళ్లిన హైదరాబాద్ ప్రజలకు ఎటువంటి సమస్యా రాలేదుగాని, ఆంధ్ర రాష్ట్రానికి వెళ్లినవాళ్లకు మాత్రం చేదు అనుభవాలు ఎదురయ్యాయి. ఆంధ్రకు వెళ్లడానికి బయల్దేరిన తెలంగాణ ప్రజలకు రైల్లో సహ ఆంధ్ర ప్రయాణీకుల దగ్గర మొదలైన అవమానాలు అక్కడికి వెళ్లాకా కొనసాగాయి. తెలంగాణ వారికి ఇంటి అద్దెలు పెంచడం, నిత్యావసర సరుకుల ధరల్ని పెంచడం అన్నవి తెలంగాణ ప్రజల మనస్సులను గాయపరిచాయి. భాష విషయంలో కూడా తెలంగాణ ప్రజలు ఆంధ్రలో అనేక అవమానాలు ఎదుర్కొన్నారు. కనుక ప్రజల్లో ఆంధ్ర ప్రజల వ్యవహారాల మీద తీవ్రమైన వ్యతిరేకత ఏర్పడింది.

ఈ నేపథ్యంలో వివిధ రాష్ట్రాల్లో మొదలైన భాషా ప్రయుక్త రాష్ట్రాల డిమాండ్‌తో కేంద్రం 1953లో రాష్ట్రాల పునర్విభజన కమిటీని నియమించింది. అందులో సయ్యద్ ఫజుల్ అలీ (ఈయనే చైర్మన్), హెచ్.ఎన్. కుంజ్రు, కె.ఎం.ఫణిక్కర్ సభ్యులు. ఈ ఎస్సార్సీని నియమించగానే ఆంధ్రా ప్రాంతంలో విశాలాంధ్ర డిమాండ్ ఊపందుకుంది. నాన్‌ముల్కీలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన తెలంగాణ ప్రజలు ఈ పరిణామాల్ని గమనిస్తూనే ఉన్నారు. ఎస్సార్సీ, దేశంలోని అన్ని ప్రాంతాలను తిరిగి ప్రజాభిప్రాయం సేకరిస్తూ సేకరిస్తూ హైదరాబాద్, ఆంధ్రలకు కూడా వచ్చింది. విశాలాంధ్ర డిమాండ్‌కు వ్యతిరేకంగా హైదరాబాద్ ప్రజలు, ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు అనుకూలంగా ఆంధ్ర రాష్ట్ర ప్రజలు వాదనలు వినిపించారు.

కొణతం దిలీప్‌గారు తెలంగాణ చరిత్రను నిక్షిప్తం చేసిన ప్రముఖుల్లో ఒకరు. ఆయన అనేక తెలంగాణ చారిత్రక అంశాల్ని గ్రంథస్తం చేయడం మాత్రమే కాదు ప్రపంచ ప్రజలందరికీ తెలంగాణ చరిత్ర తెలియజేయాలనే ఉద్దేశ్యంతో అంతర్జాలంలో విస్తృతమైన సమాచారాన్ని పొందుపరిచారు. అంతర్జాలంలోని వర్డ్‌ప్రెస్.డామ్‌లో నిర్వహిస్తున్న 'హృదయం' బ్లాగ్‌స్పాట్‌లోని పేపర్ క్లిప్పింగ్స్ ఇవి:

అ) ప్రత్యేక తెలంగాణ ఏర్పాటే హైదరాబాద్ ప్రజల ఆకాంక్ష అని తెలిపే క్లిప్పింగులు.

## తేది: 01-11-1955



## తేది: 05-11-1955

# ముఖ్యమంత్రికి నల్ల జండాలతో స్వాగతం!

## సికింద్రాబాద్‌లో ఆంధ్రబ్యాంకు ప్రారంభోత్సవ సందర్భంలో ప్రదర్శకులపై లారీచార్జి

సికింద్రాబాద్, నవంబర్ 5

ఆంధ్ర బ్యాంకు శాఖ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రామకృష్ణారావుగారు వచ్చిన సందర్భంలో దాదాపు మూడువందలమంది ప్రజలు తెలంగాణా రాష్ట్రాన్ని బలపరుస్తూ నల్లజెండాలతో చిత్రా టాకీస్ వద్ద నేటిఉదయం ప్రదర్శనలు జరిపారు.

'విశాలాంధ్ర' ముర్దాబాద్ తెలంగాణా జిందాబాద్ అనే నినాదాలతో ఆప్రదేశమంతా మారుమ్రోగింది.

నమై ఉన్నది. ప్రదర్శకులు ఆతర్వాత విశాలాంధ్ర వ్యతిరేక తెలంగాణా అనుకూల నినాదాలతో వీధులన్నీ తిరిగారు (యు పి ఐ)

## తేది: 13-11-1955

### చందూరు విద్యార్థుల సమ్మె

చందూర్: నవంబర్ 13

ఈరోజు చందూరు జాతీయ విద్యార్థి సంఘము తరఫున తెలంగాణా ప్రత్యేక రాష్ట్రము కావాలని 350 మంది విద్యార్థులు సమ్మె చేశారు. తరువాత విద్యార్థులందరితో ఒక గొప్ప ఊరేగింపు జరిగింది. దిక్కులు పిక్కటిల్లేట్లుగా 'తెలంగాణా ప్రత్యేక రాష్ట్రం' కావాలని నినాదాలు చేయబడినవి తరువాత బహిరంగ సభలో ప్రవేశపెట్టిన తెలంగాణా రాష్ట్రము కావాలనే తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.

## తేది: 21-11-1955

### 24 వ తేదీన తెలంగాణా దినోత్సవం

### తెలంగాణ విద్యార్థి ఫ్రంట్ చర్యా సంఘం పిలుపు

హైదరాబాద్, నవం 21

తెలంగాణ విద్యార్థి ఫ్రంట్ కేంద్ర చర్యా సమితి సమావేశం నిన్న లింగంపల్లిలో జరిగి హైదరాబాద్ శాసనసభలో ఎస్.ఆర్.సి. నివేదిక చర్చ ప్రారంభం కానున్న సందర్భంలో నవంబరు 24 న తెలంగాణ దినోత్సవం జరుపవలసిందిగా విద్యార్థులకు విజ్ఞప్తి చేయబడింది.

నగరంలోను, జిల్లాలోను కూడా 24వ తేదీన తెలంగాణ దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించ వలసిందిగా విద్యార్థుల చర్యాసంఘం అన్ని విద్యాసంస్థలనూ నేడు కోరింది.

## తేది: 17-11-1955

### జోగిపేట ప్రజల వాంఛ

జోగిపేట, నవం 17

నవంబరు 17 వ తేదీ గురువారము నాడు స్థానిక దుకాణములన్నీ తెలంగాణా పట్ల సానుభూతి సూచకముగా పూర్తిగా మూసి వ్యాపారం మానుకొన్నవి. సాయంత్రం మూడు గంటలకు స్థానిక తాలూక కాంగ్రెస్ కార్యాలయమునుండి అన్ని పార్టీల ప్రజానాయకులతో బ్రహ్మాండమైన ఊరేగింపుగా "ప్రత్యేక తెలంగాణా కావాలి" "విశాలాంధ్ర అక్కరలేదు" అనే నినాదములు మిన్నుముట్ట గ్రామమునందుగల గాంధీజీ టవర్ వద్ద చేరి శ్రీ సంగమేశ్వర్ "సంగం"గారి అధ్యక్షతలో బహిరంగసభ జరుపబడి "ప్రత్యేక తెలంగాణ" ఫజాలలీ సిఫారసు ప్రకారము వెంటనే అమలు జరుపుట ప్రజలకు ప్రతి దృక్పథము నుండి లాభదాయకమని ఒక తీర్మానము శ్రీ బి లక్ష్మణ ప్రసాద్ ఆర్యగారు ప్రవేశపెట్టగా శ్రీ పట్లూరి నారాయణ, శ్రీ ఎం. రుక్నుద్దీన్ వకీలు గారలు సవిస్తరముగా వ్యాఖ్యానింపుచు హృదయపూర్వకంగా ప్రజలంతా ఆమోదింపవలసిందిగా యీ తీర్మానమును బలపరచిరి. అధ్యక్షోపన్యాసానంతరం ప్రజలు "వీర తెలంగాణ జిందాబాద్" నినాదాలతో తీర్మానమును ఒప్పుకొనిరి. శాంతియుతంగా సభ సమాప్తమయ్యెను.

## తేది: 27-11-1955

# గ్రామ గ్రామాన వెల్లడవుతున్న ప్రజావాంఛ

## ప్రత్యేక తెలంగాణాను కోరుతూ

## ఊరేగింపులు, సమావేశాలు

హైదరాబాద్, నవం 27

[ఎస్. ఆర్. సి. సిఫారసుల ప్రకారం తెలంగాణా రాష్ట్రం ఏర్పడటమే అన్ని విధాలా శ్రేయస్కరమనీ తెలంగాణపు పల్లెపల్లెల్లో ప్రజలు సమావేశాలు సభలు ఊరేగింపులు ప్రదర్శనలు జరుపుతూ ప్రగాఢంగా తమ వాంఛను వ్యక్తం చేస్తున్నారు. కుప్పతెప్పలుగా మాకు చేరుతున్న వార్తలన్నీ ఇవ్వడం సాధ్యం కానందున ముఖ్యాంశాలను ఇక్కడ అందిస్తున్నాం సం॥ గో. వ.]

కడిపికొండ గ్రామప్రజా సంస్థలు పదకొండు గ్రామ కాంగ్రెస్ హరిజన కాంగ్రెస్ కిసాన్ కాంగ్రెస్ హరిజన యువజన కాంగ్రెస్ కిసాన్ యువజన కాంగ్రెస్ పద్మశాలీ సంఘము. విశ్వబ్రాహ్మణ సంఘము, గౌడ సంఘము ముదిరాజ సంఘము వర్తక సంఘము రామాయంపేట కిసాన్ కాంగ్రెస్ కార్యవర్గములు సమష్టిగా సమావేశమై విశాలాంధ్ర వాదులు చేస్తున్న ఆందోళన శాంతి భద్రతలకు భంగం కలిగించి అశాంతిని అధికం చేస్తున్నదని తెలంగాణా రాష్ట్రము ఏర్పడవలెనని ఈ నెల 20వ తేదీన తీర్మానించినవి.

20వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు సికింద్రాబాద్ సెకండ్ పాన్ బజారులో శ్రీ. పాండురంగ గాంధీచౌకులో మీటింగు చేయబడినది.

భువనగిరి తాలూకానుండి గ్రామ పౌరులు ఫజలలీ కమీషన్ సిఫారసులనే అమలు పరచాలని సమావేశాల ద్వారా తెలుపుచున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రనిర్మాణాన్ని కోరుతూ మెమొరాండాల పంపుచున్నారు. కందుకూరు గ్రామ ప్రజలు 20 తేది రాత్రి 800 మంది సమావేశమై ఫజలలీ కమీషన్ నివేదికను అభినందిస్తూ తెలంగాణమును ప్రత్యేక రాష్ట్రముగా ఏర్పాటు చేయవలయునని ఏకగ్రీవముగా తీర్మానించినారు.

శంకరపల్లి మెదక్‌జిల్లా పంచాయతి కమిటీ తెలంగాణా రాష్ట్రాన్ని కోరుతూ తీర్మానము చేసినది. 25వ తేదీన ఎస్-ఆర్.సి. రిపోర్టును అమలు పరచాలని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రము కావలెనని కోరుతూ సమావేశము జరుపబడినది.

చేయబడిన తీర్మానం:-

"ప్రత్యేక తెలంగాణను వెంటనే నిర్మించుటకు పి.సి.సి. మరియు శాసనసభ భారత ప్రభుత్వము తగు చర్యలు తీసుకొనుటకు యీ పంచాయతి కమిటీ కోరుచున్నది.

శంకరపల్లి మిడిల్ స్కూలు మరియు మార్కెటు సాహుకారు బాల

**తేది: 28-11-1955**

## బచ్చన్నపేట ప్రజల తెలంగాణా వాంఛ

బచ్చన్నపేట, నవం 28

బచ్చన్నపేట ఉన్నత పాఠశాల విద్యార్థి సంఘము 22-11-55న సమావేశమై ప్రత్యేక తెలంగాణ వాంఛనీయమని తీర్మానించి ఇందుకు సానుభూతి సూచకంగా తమ అభిప్రాయములను వెల్లడించారు. 21 వ తేదీన 500 మంది ఉన్నత పాఠశాలవిద్యార్థులతో హర్తాళం జరుపబడినది పురవీధులలో విద్యార్థులు తెలంగాణా జిందాబాద్ అను నినాదాలు చేస్తూ తిరిగారు. ఈ ఊరేగింపులో గ్రామ ప్రజలుగూడా చేరారు తర్వాత బహిరంగసభ జరిగినది

ఆ సమావేశములో మజ్దూరు యూనియన్ సహాయ కార్యదర్శియగు యం నార్సింహారెడ్డి మరియు బచ్చన్నపేట విద్యార్థియగు జి. సాయిరెడ్డి ప్రత్యేక తెలంగాణ ఆవశ్యకతను విశాలాంధ్రవలన కలుగు నష్టములను వివరించినారు. సమావేశాంతంలో ఏకగ్రీవంగా తెలంగాణను బలపరుస్తూ తీర్మానము ఆమోదింపబడినది.

**తేది: 28-11-1955**

## ఎఫ్ వార్డు బస్తీ కాంగ్రెస్ కమిటీ

హైద్రాబాద్, నవం 28

ఖైరతాబాద్ బస్తీ కాంగ్రెస్ కమిటీ సమావేశంలో తెలంగాణా ప్రజలు 90 శాతము ప్రత్యేక రాష్ట్రాన్నే కోరుతున్నారని ప్రజా వాంఛకు విరుద్ధంగా నాయకులు వర్తింపరాదని తీర్మానింపనైనది. ప్రజా వాంఛకు ప్రత్యక్ష నిదర్శనం హైద్రాబాద్ సికింద్రాబాద్ నగరాలలో ఈ నెల 26వ తేదీన జరిగిన హర్తాళే ప్రత్యక్ష నిదర్శనమని ఇంత ప్రబలంగా విజయవంతంగా ఎన్నడూ హర్తాళం జరుగలేదని ఈ కమిటీ తెలిపినది

**తేది: 28-11-1955**

## తెలంగాణా రాష్ట్రం కావాలి

### శంకరంపేట వర్తకుల తీర్మానం

శంకరంపేట, నవం 23

మెదక్ జిల్లా అందోలు తాలూకాలోని శంకరంపేట గ్రామ వర్తకులు నేడు రాష్ట్రాల పునర్ నిర్మాణసంఘ సిఫారసులపై చర్చించి ప్రత్యేక తెలంగాణరాష్ట్ర నిర్మాణంవల్ల వారికి భవిష్యత్తులో ఆర్థికంగా నష్టమేమియు లేదని మరియు స్వయం పోషకత్వం ప్రత్యేక రాష్ట్రంలోనే సుస్థిరంగా జరుగగలదని, అత్యధిక మెజారిటీ (90) శాతము ఏకాభిప్రాయముతో ఉన్నారని 51 మంది వర్తకులు తెలంగాణరాష్ట్ర నిర్మాణాన్ని బలపరుస్తూ తీర్మానించినారు.

(https://hridayam.wordpress.com/2011/12/12/)

1954 సంవత్సరం జూన్, జులై నెలల్లో ఫజుల్ అలీ కమీషన్ హైద్రాబాదు రాష్ట్రంలో పర్యటించి ప్రజాభిప్రాయాలు సేకరించి, 1955 సంవత్సరం సెప్టెంబర్ 30న నివేదిక సమర్పించింది. ఫజుల్ అలీ కమీషన్ ముందు తమ అభిప్రాయాలు వ్యక్తం చేసిన హైద్రాబాదు ప్రజలు, కమీషన్ నివేదిక సమర్పించి, కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోక ముందే బలమైన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలు కూడా చేశారని 1955 నవంబర్ నెలలో గోలకొండ పత్రిక ప్రచురించిన ఈ వార్తా క్లిప్పింగుల ద్వారా తెలుస్తుంది.

ఈ వార్తా క్లిప్పింగుల్లో నాటి హైదరాబాదు ప్రజల, నాయకుల, రాజకీయ పార్టీల అభిప్రాయాలు చాలా స్పష్టంగా అర్థం అవుతున్నాయి. 1955 సంవత్సరం నాటి పీసీసీ అధ్యక్షుడు జె.పి.నరసింగారావుగారు స్వయంగా ప్రత్యేక తెలంగాణ ఏర్పాటే సరైనదని, పైగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పరిస్తే తెలంగాణ ప్రాంతానికి కోటిన్నర రూపాయల మిగులు బడ్జెట్ ఉండగలదని అభిప్రాయపడ్డాడు. పైగా ఇది కేవలం తన అభిప్రాయం మాత్రమే కాదని, కాంగ్రెస్ కార్యకర్తలు, డెలిగేట్లద్వారా విస్తృతస్థాయిలో చర్చలు జరిపాకనే ఈ అభిప్రాయానికి వచ్చానని ఆయన వివరించారు. ఆనాటి సీమాంధ్ర ప్రజాప్రతినిధులు చేస్తున్న వాదనల్లో ఒంటెద్దు పోకడలు ఉన్నాయని, వాటిని చూస్తే తనకు నవ్వు వస్తోందని కూడా ఆయన అన్నాడు. తెలంగాణ రాష్ట్రం స్వయం పోషకంగా ఉండగలదని ఆయన చెప్పిన అభిప్రాయాన్ని బట్టి తెలంగాణ మిగులు బడ్జెట్ ఎంత బలంగా ఉన్నదో తెలుస్తోంది.

నాటి ప్రజలు కూడా ప్రత్యేక తెలంగాణను ఎంత బలంగా కోరుకున్నారో ఈ క్లిప్పింగులు వివరిస్తున్నాయి. 'ఆంధ్ర' అన్న పదం పట్లనే తెలంగాణవారికి ఎంతటి వ్యతిరేకత ఉన్నదో తెలుస్తోంది. సింకింద్రాబాద్‌లో ఆంధ్రబ్యాంక్ ప్రారంభోత్సవానికి వచ్చిన నాటి ముఖ్యమంత్రికి తమ అభిప్రాయాన్ని తెలిపేందుకు 300మంది నల్లజెండాలతో ప్రదర్శనలు నిర్వహించడమే కాకుండా 'విశాలాంధ్ర ముర్దాబాద్ తెలంగాణ జిందాబాద్' అనే నినాదాల్ని వినిపిస్తూ సికింద్రాబాద్ వీధులన్నీ తిరగడం నాటి ప్రజావాంఛను తెలుపుతుంది. చందూరులో 350 మంది విద్యార్థులు ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించి, తర్వాత సభ జరిపి తెలంగాణకు అనుకూలంగా

ఏకగ్రీవ తీర్మాణాన్ని చేయడం నాటి విద్యార్థుల అభిప్రాయాన్ని పట్టిస్తుంది. మొత్తంగా ఈ వార్తా క్లిప్లింగుల్లో ఆనాటి హైదరాబాద్ రాష్ట్ర నాయకులు, ప్రజలు బలంగా ప్రత్యేక తెలంగాణ ఏర్పాటును కోరుకున్నారని, సీమాంధ్రులు చేస్తున్న విశాలాంధ్ర ఏర్పాటును చాలా బలంగా వ్యతిరేకించి ఉద్యమించారని అర్థం అవుతుంది. ఈ ప్రజాభిప్రయాల నేపథ్యంలోనే మొదటి ఎస్సార్సీ నివేదిక ఇచ్చింది.

**ఆ) హైదరాబాద్ రాష్ట్రాన్ని విడిగానే ఉంచాలని ఫజుల్ అలీ కమీషన్ అభిప్రాయపడిన విషయాన్ని తెలిపే వార్తా క్లిప్పింగులు.**

**తేది: 19-10-1955**



## తేది: 19-10-1955


సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతి 4 అ.

# ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 49
సంచిక 7
19.10-55

మన్మథ నామ ఆశ్వయుజ శుద్ధ పంచమి బుధవారం





# భాషారాష్ట్రాలు

భారతదేశంలో ప్రస్తుతం ఉన్న 27 రాష్ట్రాలనూ భాషలవారీగా 16 రాష్ట్రాలుగా పునర్నిర్మించాలని ఫజలాలీ కమిషన్ భారతప్రభుత్వానికి సిఫార్సు చేసింది. కమిషన్ సూచనప్రకారం నూతనరాష్ట్రాల స్వరూపం ఈ చిత్రంలో చూపబడింది.

## తేది: 19-10-1955

### భారత సమాఖ్య (కొత్త) రాష్ట్రాలు : వాటి విస్తీర్ణం - జనాభా

| రాష్ట్రాలు | విస్తీర్ణం చదరపు మైళ్ళలో | జనాభా లక్షలలో | రాష్ట్రాలు | విస్తీర్ణం చదరపు మైళ్ళలో | జనాభా లక్షలలో |
|---|---|---|---|---|---|
| 1. మద్రాసు | 50,170 | 300 | 11. ఉత్తరప్రదేశ్ | 113,410 | 632 |
| 2. కేరళ | 14,980 | 136 | 12. బీహారు | 66,520 | 385 |
| కర్ణాటక | 72,730 | 190 | 13. పశ్చిమ బెంగాలు | 34,590 | 265 |
| 4. హైదరాబాదు | 45,300 | 113 | 14. అస్సాం | 89,040 | 97 |
| 5. ఆంధ్ర | 64,950 | 209 | 15. ఒరిస్సా | 60,140 | 146 |
| 6. బొంబాయి | 151,360 | 402 | 16. జమ్మూ-కాశ్మీర్ | 92,780 | 44 |
| 7. విదర్భ | 86,880 | 76 | కేంద్ర పాలిత ప్రాంతాలు | | |
| 8. మధ్యప్రదేశ్ | 111,200 | 261 | 1. ఢిల్లీ | 578 | 17,44,072 |
| 9. రాజస్థాన్ | 132,300 | 160 | 2. మణిపూర్ | 8,628 | 577,635 |
| 10. పంజాబు | 58,140 | 172 | 3. అండమాన్ - నికోబార్ దీవులు | 3,215 | 30,917 |

5

(https://hridayam.wordpress.com/2010/01/08/history-of-telangana-statehood-movement/)

(ఇక్కడ వార్తా క్లిప్పింగులను ప్రత్యేకంగా గుర్తించి, పొందుపరచడానికి ప్రధానమైన కారణం ఈ చరిత్ర దాదాపు పూర్తిస్థాయిలో మరుగున పడిపోయింది. పత్రికలను నడుస్తున్న చరిత్ర అంటారు. కనుక ఈ విస్మృత చరిత్రను గ్రంథస్థం చేసే ఉద్దేశంతోనే వీటిని ఇక్కడ చేర్చడమైంది)

నాటి ఆంధ్ర పత్రికలో వచ్చిన ఈ వార్తల ఆధారంగా ఫజుల్ అలీ కమీషన్ ఏం చెప్పింది, దానికి ఏయే షరతులను పెట్టింది అనే విషయాలు తెలుస్తున్నాయి. వీటి ఆధారంగానే నాటి తెలంగాణ విశాల ప్రజానీకపు ఆకాంక్షల్ని అర్థం చేసుకోవచ్చు. కానీ, కొద్దిమంది మినహా మెజార్టీ తెలంగాణ కాంగ్రెస్ శాసనసభ్యులు విశాలాంధ్రకు మద్ధతునివ్వడం, ఆంధ్రాలోని కాంగ్రెస్ కూడా మద్ధతునివ్వడం కారణంగా ఇరు ప్రాంతాల పెద్దలతో ఒక పెద్దమనుషుల ఒప్పందం చేసుకుని ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా 1956

నవంబర్ 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ అవతరించింది. ఇక్కడి నుండి మళ్లీ 1968 వరకు ప్రత్యేక తెలంగాణ ఉద్యమం లేదని ఇప్పటికి చాలామంది నమ్ముతుంటారు. కానీ వాస్తవాలు దీనికి విరుద్ధంగా ఉన్నాయి. ఇంతకు ముందే ప్రస్తావించిన కొణతం దిలీప్ నిర్వహిస్తున్న వర్డ్‌ప్రెస్.కామ్‌లోని ఇతర పేపర్ క్లిప్పింగ్స్ 'ఆంధ్రప్రదేశ్' ఏర్పడగానే జరిగిన ఉద్యమాన్ని గురించిన విలువైన ఆధారాలు తెలుపుతున్నాయి.

పెద్దమనుషుల ఒప్పందంలోని షరతులు ఆంధ్రప్రదేశ్ అవతరణ దినం నుండే ఉల్లంఘనలకు గురయ్యాయి. తెలంగాణకు రావల్సిన ఉపముఖ్యమంత్రి పదవి రాలేదు. బెజవాడ గోపాలరెడ్డి మంత్రివర్గంలో ఉపముఖ్యమంత్రిగా పనిచేసిన నీలం సంజీవరెడ్డి తాను ముఖ్యమంత్రి కాగానే ఉపముఖ్యమంత్రి పదవి ఆరోవేలువంటిదని నిర్దాక్షిణ్యంగా తెలంగాణకు రావల్సిన పదవిని రాకుండా చేశాడు. తర్వాత ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన ప్రకాశం పంతులు చనిపోయినప్పుడు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపారు. కానీ హైదరాబాదు రాష్ట్రానికి చెందిన ఒక ముఖ్యమంత్రి బూర్గుల రామక్రిష్ణారావు చనిపోయినప్పుడు పట్టించుకోకుండా వదిలేశారు. మరణాలపట్ల కూడా సీమాంధ్ర ప్రభుత్వాలు వివక్ష చూపించాయనడానికి ఇదొక తార్కాణం. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు తర్వాత వలసల్లో పెరుగుదల గుణాత్మకమైన వేగం పుంజుకుంది. భూముల దురాక్రమణ పాలకుల సహకారంతో జరిగిపోయింది. వ్యాపారరంగం వలసలతో నిండిపోయింది. దీని పర్యవసానాలేమిటో మొదటి అధ్యాయంలో వివరించి ఉన్నాను.

## 2.2. తొలిదశ

తొలిదశలో తెలంగాణకు ఇచ్చిన హామీల, ఒప్పందాల, రక్షణల అమలు కోసం ఉద్యమం మొదలైనప్పటికీ, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం 1968 జులైలో ప్రారంభమైందిగానే గుర్తించవల్సి ఉంటుంది. తెలంగాణలోని వేరువేరు ప్రాంతాల్లోని ప్రజలు నిరసన సమావేశాలను ఏర్పాటు చేశారు. పెద్దమనుషుల ఒప్పందంలోని అన్ని విషయాలను తుంగలో తొక్కి తెలంగాణ ప్రజలకు అన్యాయం చేయడాన్ని నిరసిస్తూ 1968 జులై

10ని 'తెలంగాణ రక్షణల దినం' అని ప్రకటించి, పాటించారు. ఈ క్రమంలో హైద్రాబాదులో జరిగిన ఒక ఉద్యోగుల సమావేశంలో ప్రముఖ కార్మిక సంఘ నాయకుడైన మహాదేవ్ సింగ్ ప్రసంగిస్తూ తెలంగాణ ప్రజల కోరికను మన్నించనట్లయితే ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణ విడిపోవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించాడు. ఆ కాలంలోనే తెలంగాణ ఉద్యోగులు ఒక కరపత్రాన్ని ప్రచురించి తెలంగాణ గోసను, ఆంధ్ర వలస ఆధిపత్యాన్ని, దురాక్రమణను వెల్లడిచేశారు. 1952లో నాన్‌ముల్కీ గోబ్యాక్ ఉద్యమంలో క్రియాశీలకమైన పాత్ర నిర్వహించిన పాఠశాల, కళాశాలల విద్యార్థి సంఘాలు 1967లో ఆంధ్రవలస ప్రభుత్వం పెంచిన స్కూల్ ఫీజులకు వ్యతిరేకంగా తెలంగాణ అంతటా దర్నాలు చేశాయి. మరోవైపు రాజకీయంగా మర్రి చెన్నారెడ్డి కూడా విద్రోహానికి గురై వ్యక్తిగతంగా వలసాంధ్ర ప్రభుత్వానికి వ్యతిరేకిగా మారారు. తొలిదశ ఉద్యమానికి ఇది పూర్వరంగం.

"ఖమ్మం జిల్లా పాల్వంచలోని థర్మల్ పవర్ స్టేషన్‌లో 1969 జనవరి 5న నిప్పురాజుకుంది. తెలంగాణ బొగ్గు, గోదావరి జలాల సహాయంతో నిర్మించిన ఆ విద్యుత్ కేంద్రంలో పనిచేసే ఉద్యోగుల్లో మెజార్టీవర్గం మాత్రం ఆంధ్ర ప్రాంతం వారే. జనవరి పది నుండి నిరాహార దీక్షలు చేయాలని నిర్ణయం జరిగింది. ఉద్యోగులలో తెలంగాణ కానివారిని వెనుకకు పంపించాలని, తెలంగాణా రక్షణలు అమలు చేయాలని వారి డిమాండ్లు. వారు తెలంగాణా ప్రాంతీయ కమిటీ అధ్యక్షుడు చొక్కారావుకు ఒక మెమోరాండం కూడా సమర్పించారు. దినసరి వేతనం కార్మిక నాయకుడు కృష్ణ నిరాహార దీక్ష ప్రారంభించాడు. ఆ అగ్ని జిల్లా కేంద్రం ఖమ్మం పట్టణానికి వ్యాపించింది" (శోభాగాంది. 2010 : 53). కృష్ణ మొదలుపెట్టిన ఉద్యమ స్ఫూర్తిని అందుకుంటూ ఖమ్మం విద్యార్థులు కదిలివచ్చారు. రవీంద్రనాథ్ అనే డిగ్రీ చదువుతున్న విద్యార్థి గాంధీచౌక్ వద్ద నిరవధిక నిరాహార దీక్షకు కూర్చున్నాడు. ఈయన కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘమైన ఎన్ఎస్‌యూఐ నాయకుడు కూడా. రవీంద్రనాథ్ మొదలుపెట్టిన దీక్షకు క్రమక్రమంగా మద్ధతు పెరగనారంభించింది. 9 సంవత్సరాల వయసున్న అనురాధ అనే విద్యార్థిని కూడా నిరాహారదీక్షకు కూర్చుంది. ఖమ్మం మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ ప్రఖ్యాత

కవి కవిరాజమూర్తి కూడా ఈ దీక్షలో పాల్గొన్నాడు. ఈ దీక్షకు మద్ధతునిస్తూ ఖమ్మం జిల్లా అంతటా విద్యార్థులు ఊరేగింపులు చేశారు. రోడ్లమీద 'ఆంధ్ర' అనే పదం కనిపించిన బోర్డులన్నీ పీకేశారు. ఆంధ్రాబ్యాంక్ మీద దాడి చేశారు. ఈ చర్యలన్నీ ఆంధ్రుల ఆధిపత్యాల మీద వ్యతిరేకతగానే అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత 'తెలంగాణ రక్షణ సమితి' అనే సంస్థను స్థాపించి తెలంగాణకు ఇచ్చిన హామీలను, రక్షణలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోని ఉద్యోగాలు తెలంగాణవారికే ఇవ్వాలనీ, తెలంగాణేతరులను వెనక్కి పంపాలని నినదించారు. ఖమ్మంలో మొదలైన ఈ ఉద్యమం జనవరి 10 నాటికి నిజామాబాద్‌కు పాకింది. విద్యార్థి పరిషత్ అధ్యక్షుడు ఎ.ఎస్.పోశెట్టి నాయకత్వంలో విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలు బహిష్కరించి నిజామాబాద్ పట్టణంలో ఊరేగింపులు చేశారు. నాన్‌ముల్కీ గోబ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ వెళ్లి జిల్లా కలెక్టర్‌కు, ఎస్‌పీకి మెమోరాండం సమర్పించారు. ఆనాడున్న పత్రికల్లో ఎక్కువభాగం సీమాంధ్ర ప్రాంతానికి చెందినవారివి కావటం మూలంగా తెలంగాణలో జరుగుతున్న పరిణామాలను వక్రీకరించి రాయడమో, అసలు రాయకుండా ఉండడమో జరిగింది. దాంతో ఖమ్మంలో దినపత్రికల్ని తగులబెట్టే కార్యక్రమం నిర్వహించారు. విజయవాడ వెళ్లే రైళ్లను ఖమ్మంలోనే ఆపేశారు.

ఖమ్మం, నిజామాబాద్‌లో రాజుకున్న అగ్గి క్రమంగా హైదరాబాద్‌కు కూడా పాకింది. అనేక ఉద్యమాలకు నెలవైన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో హైద్రాబాద్‌లోని అన్ని విద్యార్థి సంఘాల సర్వసభ్య సమావేశం జరిగింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం నాయకుడు వెంకటరామారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పెద్దమనుషుల ఒప్పందంలోని అన్ని రక్షణలను ఎట్లా ఉల్లంఘించారో అన్నదానిమీద ఆధారాలతో కూడిన సమీక్ష జరిగింది. ఆ సర్వసభ్య సమావేశం వలసాంధ్రుల ఆధిపత్యాన్ని నిరసిస్తూ ఒక నిర్మాణాత్మకమైన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. తెలంగాణ రక్షణల అమలుకై 1969 జనవరి 15 నుండి నిరసన సమ్మెలు చేయాలని ఒక కార్యక్రమాన్ని తెలంగాణ ప్రజలకు ఇచ్చింది. మంత్రివర్గంలోని 9 మంది మంత్రులు, తెలంగాణ శాసనసభ్యులు రాజీనామాలు ఇవ్వాలనీ, తెలంగాణకు 70 కోట్ల నిధులను విడుదల చేయాలని, తెలంగాణ నిధుల

మల్లింపులపై న్యాయవిచారణ జరిపించాలని, పెద్దమనుషుల ఒప్పందాన్ని తుచ తప్పకుండా పాటించాలని, ముల్కీ నిబంధనలను అతిక్రమించినవారిని కఠినంగా శిక్షించాలని, నాన్‌ముల్కీలను వెంటనే వెనక్కు పంపాలని ఆ సర్వసభ్య సమావేశం తీర్మానాలు చేసింది. అంతేకాకుండా జిల్లాల్లో జరుగుతున్న ఉద్యమానికి పూర్తిస్థాయి మద్ధతు తెలుపుతున్నట్లు ప్రకటించింది. జనవరి 13న ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మల్లిఖార్జున్ ప్రధాన కార్యదర్శిగా 'తెలంగాణ విద్యార్థుల కార్యాచరణ సమితి' ఏర్పడింది. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కోవడం కోసం విద్యార్థులు ఎటువంటి త్యాగాలకైనా సిద్ధం కావాలని సమితి పిలుపునిచ్చింది. అయితే ఇక్కడే ఒక చారిత్రక పరిణామం జరిగింది. సమితి ఏర్పాటుతో విద్యార్థుల్లో రెండు వర్గాలు ఏర్పడ్డాయి. వెంకటరామరెడ్డి నాయకత్వంలోని గ్రూపు కేవలం తెలంగాణ రక్షణల అమలును మాత్రమే కోరుకుంది. అంటే వారు తెలుగువారు సమైక్యంగానే ఉండాలిగాని తెలంగాణకు అన్యాయం జరగొద్దు అని కోరుకున్నారు. కానీ ఈ ఒక్క గ్రూపు మినహాయించి మిగతా ఉస్మానియా విద్యార్థులు ప్రత్యేక తెలంగాణ కావాలని కోరుకున్నారు. దాంతో ఉస్మానియాలోనే సేఫ్‌గార్డ్స్, సపరేటిస్టులు అన్న రెండు గ్రూపులు ఏర్పడ్డాయి.

ఈ పరిణామాలకు సమాంతరంగా హైదరాబాద్‌లోని ప్రముఖులందరు కలిసి 'తెలంగాణ పరిరక్షణల కమిటీ'ని స్థాపించారు. దానికి స్వాతంత్ర్య సమరయోధులు కాటం లక్ష్మీనారాయణ చైర్మన్. ఈ కమిటీ, విద్యార్థులు చేస్తున్న ఉద్యమానికి పూర్తి సంఘీభావం తెలిపింది. దీంతో ముందే విద్యార్థి లోకం పిలుపునిచ్చిన జనవరి 15 తరగతుల బహిష్కరణ కార్యక్రమం విజయవంతమైంది. నిజాం కాలేజీనుండి కోఠీ వరకు పెద్ద ఊరేగింపు జరిగింది. చివరగా నిర్వహించిన సభలో మల్లిఖార్జున్, పుల్లారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పులివీరన్న, గోపాల్, మధుసూధన్‌రెడ్డి లాంటి విద్యార్థి నాయకులు తెలంగాణకు జరిగిన అన్యాయం గురించి ఉపన్యాసాలిచ్చారు. అనంతరం 9 మంది తెలంగాణ మంత్రుల దిష్టిబొమ్మల్ని దహనం చేశారు.

హైదరాబాద్‌లో ఈ పరిణామాలు జరుగుతుండగానే ఖమ్మం జిల్లాలో ఉద్యమం

ఒక గుణాత్మక మార్పు తీసుకుంది. పాల్వంచలోని విద్యుత్ కేంద్రంలో పనిచేసే తెలంగాణ ఉద్యోగులు తెలంగాణకు ఇచ్చిన రక్షణలను అమలు చేయించుకోవడం కోసం హైకోర్టుకు వెళ్లారు. కోర్టు, ముల్కీ నిబంధనలు అటానమస్ సంస్థలకు, కార్పోరేషన్లకు వర్తించవు అని ప్రజావ్యతిరేక తీర్పునిచ్చింది. అప్పటికే ఉద్యమం మొదలైన నేపథ్యంలో ఈ తీర్పు తెలంగాణ ప్రజల మనోభావాల్ని తీవ్రంగా దెబ్బతీసింది. దాంతో ఇక తెలంగాణలో మాట్లాడవల్సింది రక్షణల గురించి కాదని, ప్రత్యేక రాష్ట్రం తప్ప వేరే మార్గంలేదని, అందుకోసమే ఉద్యమించాలనే నిర్ణయం బలపడింది. దాంతో ఆంధ్రా ఉద్యోగులు నివసించే ప్రాంతాలకు నీరు, విద్యుత్ సరఫరాలు ఆగిపోయేలా చేశారు. నాన్‌ముల్కీ గోబ్యాక్ అంటూ ర్యాలీలు చేశారు. ఈ ఉద్రిక్త వాతావరణమిలా ఉంటే మరోవైపు నిరాహారదీక్షకు కూర్చున్న రవీంద్రనాథ్ ఆరోగ్య పరిస్థితి విషమించింది. దాంతో ఖమ్మంజిల్లా శాసనసభ్యుడు జలగం వెంగళరావు ముందుకొచ్చి ఈ విషయంలో ముఖ్యమంత్రి వెంటనే స్పందించాలని డిమాండ్ చేశాడు. అప్పటికే ఉద్యోగులు, విద్యార్థులు చేస్తున్న ఉద్యమానికి తెలంగాణ రాజకీయ నాయకుని మద్ధతు కూడా లభించడంతో మిగతా అన్ని తెలంగాణ జిల్లాల్లో ప్రకంపనలు మొదలయ్యాయి.

జనవరి 16న హైదరాబాద్‌లో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించి ఆంధ్రప్రదేశ్ సచివాలయాన్ని ముట్టడించి ధర్నా చేశారు. ఇన్ని పరిణామాలు జరుగుతున్నా హైదరాబాద్‌లో సపరేటిస్టులు, సేఫ్‌గార్డ్స్ ఉద్యమకారుల మధ్య వైరుధ్యాలు తలెత్తుతూనే ఉన్నాయి. (సేఫ్‌గార్డ్స్ ఉద్యమకారుల్లో విశాలాంధ్ర భావన బలంగా ఉందనీ, దానికి కారణం వారు ఎక్కువమంది అవిభక్త కమ్యూనిస్టు పార్టీ అభిమానులని ఈ పరిశోధకుడి ఊహా(ప్రతిపాదన). ఈ క్రమంలో జనవరి 18న హైదరాబాద్‌లో ఇరువర్గాలు జరిపిన ర్యాలీపై పోలీసులు లాఠీఛార్జీ చేశారు. మొత్తం తెలంగాణ ఉద్యమంలోనే మొట్టమొదటి అణచివేత చర్య ఇది. చాలామంది విద్యార్థులు తీవ్రంగా గాయపడినా ఉద్యమకారుల్లో ఆవేశాలు చల్లారలేదు.

తెలంగాణ ఉద్యోగులంతా కలిసి హైదరాబాద్‌లో ఒక సమావేశం నిర్వహించి

తెలంగాణ ఉద్యోగాల్లో అక్రమంగా చొరబడిన ఆరువేలమంది నాన్‌ముల్కీ ఉద్యోగులను వెనక్కు పంపాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. దీనికి తోడు రాష్ట్ర శాసనసభలో ఆనాడున్న ఐదు ప్రతిపక్ష పార్టీలు భారతీయ జనసంఘ్, మజ్లిస్, సంయుక్త సోషలిస్టు పార్టీ, సీపీఐ, సీపీఐ(ఎం)లు సంయుక్తంగా ఒక ప్రకటన చేస్తూ ఒకవేళ ముఖ్యమంత్రి తెలంగాణ ఉద్యమం విషయంలో చొరవతీసుకుని పరిష్కారం ఆలోచించకపోతే తాముకూడా విద్యార్థులు, ఉద్యోగులు నిర్వహిస్తున్న పోరాటంలో భాగం అవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దాంతో జనవరి 19న అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి తెలంగాణలో పనిచేస్తున్న నాన్‌ముల్కీలను వెనక్కి పంపిస్తామనీ, తెలంగాణలో ఉన్న మిగులు నిధులను తేల్చడం కోసం ఒక సీనియర్ అధికారిని నియమిస్తామని, ఉద్యమాన్ని విరమించండని ఒక ప్రకటన చేశాడు. అయినా విద్యార్థులు మాత్రం ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నమ్మేది లేదని, ఇటువంటివి చరిత్రలో చాలా చూశామని, తమకు ప్రత్యేక తెలంగాణ మాత్రమే పరిష్కారం ఇవ్వగలదని అన్నారు.

ఇవాళ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించిన శంషాబాదులో మొట్టమొదటిసారి విద్యార్థి ఉద్యమకారులపై పోలీసులు కాల్పులు జరిపారు. రైల్వేస్టేషన్ దగ్గర ధర్నా చేస్తున్న విద్యార్థుల్ని చెదరగొట్టడం కోసం జరిపిన ఈ కాల్పుల్లో పదహారు సంవత్సరాలలోపు ఐదుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి స్పందించిన హైదరాబాదు విద్యార్థులు రెండువేలమందితో జనవరి 21న శంషాబాదు కాల్పుల్ని ఖండించడం కోసం నిజాంకాలేజీలో నిరసన సభ నిర్వహించారు. ఈ సభ జరుగుతున్న సమయంలోనే కాల్పుల్లో గాయపడిన విద్యార్థి ఒకరు ఉస్మానియా ఆసుపత్రిలో చనిపోయారన్న వార్త తెలియడంతో సభలో పాల్గొన్న విద్యార్థులందూ కోపోద్రిక్తులై పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్లమీదకి వచ్చారు. ఈ సంఘటనలో పోలీసులు విచక్షణారహితంగా చేసిన లాఠీఛార్జీలో వందలాదిమంది విద్యార్థుల కాళ్లూ, చేతులూ విరిగిపోయి తీవ్రంగా గాయపడ్డారు. 34 మంది విద్యార్థి నాయకుల్ని పోలీసు కస్టడీకి తరలించారు. దీంతో ఉద్యమం మరింత తీవ్రతరమైంది.

తెలంగాణలో తీవ్రస్థాయిలో నడుస్తున్న ఉద్యమాన్ని గమనించిన కేంద్ర ప్రభుత్వం జస్టిస్ భార్గవ అధ్యక్షతన ఒక కమిటీని వేసి తెలంగాణ మిగులు నిధుల లెక్కలు తేల్చమని చెప్పింది. ఆ కమిటీ ఏమి చెప్పిందో ఇప్పటిదాకా ఎవరికీ తెలియదు. ఎందుకంటే ప్రభుత్వం దాన్ని తొక్కిపెట్టింది. ఆ తర్వాత మళ్లీ కేంద్రప్రభుత్వమే జస్టిస్ వాంఛూ అధ్యక్షతన మరో కమిటీని వేసి తెలంగాణ ప్రజలకు ప్రత్యామ్నాయ ఉద్యోగావకాశాలను సూచించమని ఆదేశించింది. ఆ రిపోర్టు కూడా వెలుగుచూడలేదు. ఈ రెండు కమిటీలను వేయడం కేవలం ఉద్యమాన్ని చల్లార్చడం కోసమే అన్నది ఆ కమిటీలు ఇచ్చిన నివేదికల్ని వెలుగుచూడకుండా చేయడంద్వారా అర్థం అవుతుంది. జనవరి 22న తెలంగాణ రక్షణల్ని అమలు చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తూ ఒక జీవోను తీసుకువచ్చింది. దాని ప్రకారం ఫిబ్రవరి 28లోగా నాన్‌ముల్కీ ఉద్యోగులను వెనక్కి పంపిస్తామని, జీవోను నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. అదే సమయంలో తెలంగాణ మిగులు నిధులను తేల్చడం కోసం కేంద్రం నుండి ఒక బృందం వస్తున్నదన్న వార్త కూడా ప్రచారం జరిగింది. దాంతో ఖమ్మంలో దీక్షకు కూర్చున్న రవీంద్రనాథ్ 17 రోజుల నిరవధిక దీక్షను విరమించాడు, తెలంగాణ రక్షణలను అమలు చేయమన్న సేఫ్‌గార్డ్స్‌ల ఉద్యమం ఆగిపోయింది.

కానీ ప్రత్యేక తెలంగాణ వాదులు మాత్రం తమ ఉద్యమాన్ని కొనసాగిస్తూనే పోయారు. వీరికి మద్దతుగా ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని బోధనేతర సిబ్బంది ఒక్కరోజు సమ్మెకు దిగింది. మరోవైపు ఉద్యమాన్ని కొనసాగిస్తున్న సదాశివపేటలో జనవరి 24న పోలీసు కాల్పుల్లో శంకర్ అనే విద్యార్థి అమరుడయ్యాడు. దాంతో ఉద్యమం తారాస్థాయికి చేరుకుంది. మరోవైపు ప్రభుత్వం నాన్‌ముల్కీలను వెనక్కి పంపిస్తామని తీసుకువచ్చిన జీవోకు వ్యతిరేకంగా ఆంధ్రా ఉద్యోగులు హైకోర్టులో రిట్ పిటీషన్ వేసి, రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులైన ఆర్టికల్ 14, 16లకు జీవో వ్యతిరేకం అని వాదించారు. ఈ క్రమంలో జనవరి 28న వరంగల్‌లో, గతంలో విశాలాంధ్రను సమర్థించిన కాళోజీ అధ్యక్షతలో 'తెలంగాణ విమోచనోద్యమ సమితి' సదస్సు జరిగింది. దాంతో కవులు, కళాకారుల్లో కూడా ప్రత్యేక తెలంగాణ భావన కంపనాలు పుట్టించింది. దానికి

తార్కాణంగా ప్రత్యేక తెలంగాణ ఉద్యమ తొలి కవిత్వం మహబూబ్‌నగర్ నుంచి వచ్చింది. ఆనాడు పద్యాలు, పాటలు, వచన కవితల్లో ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షను వినిపించడంలో కాళోజీ పాత్ర ఉందని అర్థం చేసుకోవచ్చు.

తెలంగాణ మొత్తం ఒక అగ్నిగుండంలా మారిన సన్నివేశంలో ఫిబ్రవరి 28న హైద్రాబాద్‌లో 'తెలంగాణ ప్రజా సమితి' ఆవిర్భవించింది. విద్యార్థులు, మేధావులు, లాయర్లు, జర్నలిస్టులు, నిరుద్యోగులే దీని స్థాపకులు. పైగా వీరంతా 30 ఏళ్లలోపువారే. ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా పనిచేయకపోవడం, ఈ సమితికి ఉన్న ప్రత్యేకత. కేవలం ఆనాడు నడుస్తున్న ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని బలపరచడం కోసమే ఈ సమితిని స్థాపించారు. దీని లక్ష్యం విద్యార్థి, ఉద్యోగుల ఐక్యపోరాటాన్ని నిర్మాణాత్మకంగా మలచడం. సమితి నిర్మాణమయ్యాక ఉద్యమం కొంత నిర్మాణాత్మకంగా మారింది. దాంతో భయపడిన తెలంగాణ శాసనసభ్యులు 52 మంది తెలంగాణ రక్షణలను అమలుచేయకపోతే సహాయ నిరాకరణ ఉద్యమం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ క్రమంలోనే మార్చి 29న ముల్కీ నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. తెలంగాణలోని నాన్‌ముల్కీలను వెనక్కి పంపే జీవో కూడా చెల్లదని కొట్టిపారేసింది. దాంతో విద్యార్థుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకొని, ఉస్మానియా రైల్వేస్టేషన్‌మీద దాడి చేసి నిప్పంటించారు. ప్రమాదవశాత్తు ఆ మంటల్లో చిక్కుకుని ఇద్దరు విద్యార్థులు అమరులయ్యారు. మరోవైపు ఈ తీర్పు విన్న కొండాలక్ష్మణ్ బాపూజీ అదే రోజు తన మంత్రి పదవికి రాజీనామా చేశాడు. అంతకు ముందు ఆయన చేసిన డిమాండ్‌ను ప్రభుత్వం వ్యతిరేకించడం ఒక కారణమైతే తక్షణ కారణం సుప్రీంకోర్టు తీర్పు. ఆయన, తెలంగాణకు కూడా మేఘాలయలాగా ప్రాంతీయ ప్రతిపత్తి ఇచ్చి, ప్రణాళిక, అభివృద్ధి, బడ్జెట్, ఉద్యోగాలు తెలంగాణే నిర్వహించుకునే అవకాశం ఇవ్వండి ప్రభుత్వాన్ని కోరాడు. కానీ ప్రభుత్వం దానికి ఒప్పుకోనందుకు ప్రత్యేక తెలంగాణే శరణ్యమని ఉద్యమంలో భాగమైపోయాడు. మార్చి 30న ప్రత్యేక తెలంగాణ కాంగ్రెస్ సమితిని స్థాపించాడు. ఈ సందర్భంగా బాపూజీ స్వయంగా వివరించిన విషయాలు ఆనాటి రాజకీయ పరిస్థితిని విశదీకరిస్తాయి. "ఆంధ్ర సోదరుల చేతిలో తెలంగాణాకు న్యాయం జరగడానికి కడసారి

ప్రయత్నంగా నేను 1969 ఫిబ్రవరి 24వ తేదీన ముఖ్యమంత్రికి ఒక లేఖ వ్రాశాను. 1. రక్షణల అమలు, 2. సర్వీసు విషయాలు, 3. రాయలసీమ, ఉత్తర కోస్తా జిల్లాలతో సహా రాష్ట్రంలోని వివిధ భాగాలలో ప్రాంతీయ సమమానతలు, మరియు 4. భావ సమైక్యత. వీటిగురించి పరిశీలించి సిఫార్సులు చేసే నిమిత్తం సుప్రీం కోర్టుకు చెందిన రిటైరైన ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షతన ముగ్గురు సభ్యులతో ఒక ఉన్నతాధికార సంఘాన్ని నియమించవలసిందిగా ఆ లేఖలో కోరాను. కాని ఈ సూచన కూడా త్రోసిపుచ్చబడింది. ఈలోగా విద్యార్థులతోపాటుగా యితరులు కూడా, ప్రజానీకాన్ని సమీకరించడానికై ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలోనికి ప్రవేశించారు. 1969 మార్చి 3వ తేదీన బంద్ జరుపవలసిందిగా ప్రత్యేక తెలంగాణావాదులు తెలంగాణా ప్రజలకు పిలుపునిచ్చారు. బంద్‌ను విఫలం చేయడానికి ప్రభుత్వమూ, ప్రభుత్వాన్ని బలపరిచే వారూ అన్ని ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ బంద్ చాలా జయప్రదమైంది. ప్రత్యేక తెలంగాణా వాదులు 1969 మార్చి 8,9 వ తేదీలలో హైదరాబాదులో సదస్సు జరిపారు. ఈ సదస్సును విఫలయం చేయడానికి కూడా ప్రభుత్వం ప్రయత్నాలు చేసినప్పటికీ ఇది ఎంతో విజయవంతంగా సాగింది. వేల కొలది ప్రజలు దీనికి హాజరయ్యారు. సమావేశం అర్థరాత్రి వరకూ సాగింది. ఇలా వుండగా అన్యాయాలను గురించిన అనేక యదార్థ విషయాలూ నా దృష్టికి రాసాగాయి. పరిస్థితి ఎంత అధ్వానం కాసాగిందంటే 1956లో యిచ్చిన రక్షణల అమలు సమస్య కాలానుగుణ్యం కాని పాత అంశంగా రూపొందటమే కాకుండా ఆంధ్రప్రదేశ్ విభజన జరగకుండా ఇంక సాధ్యమా అనిపించింది. అయినా, తెలంగాణా ప్రయోజనాలను పరిరక్షించడానికీ ప్రణాళికలు, అభివృద్ధి, బడ్జెటు, సర్వీసు విషయాలలో ప్రాంతీయ సంఘానికి రాజ్యాంగ బద్ధంగా అధికారాలు పొందడం ద్వారా తెలంగాణాకు ప్రాంతీయ స్వతంత్ర ప్రతిపత్తిని పొందడమే ఆంధ్రప్రదేశ్ సమైక్యతను కాపాడడానికి ఏకైక మార్గంగా నాకు కనిపించింది. కాబట్టి ముఖ్యమంత్రికి 1969 మార్చి 10వ తేదీన ఆయన నన్ను రక్షణలను బలపరుస్తూ ప్రత్యేక రాష్ట్ర వాదానికి వ్యతిరేకంగా ఒక సదస్సు ఏర్పాటు చేయ నాతో కోరినప్పుడు ప్రాంతీయ స్వతంత్ర ప్రతిపత్తిని గురించిన సూచన చేశాను. ఈ విషయంలో చొరవతీసుకొని ఆంధ్రప్రదేశ్ విభజన జరుగకుండా కాపాడవలసిందిగా ఆయనకు విజ్ఞప్తి చేశాను. మళ్ళీ 1969 మార్చి 20వ తేదీన నా ఈ

అభిప్రాయాలను గూర్చి ముఖ్యమంత్రికి వివరించాను. ఆ తరువాత రాష్ట్ర సమస్యను కేంద్ర నాయకులకు కేంద్ర ప్రభుత్వానికి నివేదించదలచి 1969 మార్చి నాలుగవ వారంలో వారిని కలిసి పైన సూచించిన విధంగా రాజ్యాంగ బద్ధమైన అధికారాలను యివ్వడానికి సమ్మతించవలసిందిగా వాదించాను. కాని నా ప్రతిపాదన వారు తెలంగాణాలో పరిస్థితి మరింత అధ్వాన్నమౌతున్నప్పటికీ గమనించలేదు"(వివేక్, తడకమళ్ళ (సంపా). 2009 : 20, 21). అనివార్యమైన పరిస్థితుల్లోనే బాపూజీ గారు తెలంగాణ ఉద్యమంలోకి వచ్చిన విషయం ఆయన మాటల ద్వారానే అర్థమవుతోంది. బాపూజీ స్ఫూర్తితో ఏప్రిల్ 3న ఎనిమిదిమంది తెలంగాణ శాసనసభ్యులు ప్రత్యేక తెలంగాణ మాత్రమే తెలంగాణ ప్రజలకు కావాలని డిమాండ్ చేయడంతో ఉద్యమం మరింత ముందుకు వెళ్లింది. ఏప్రిల్ 21న కాంగ్రెస్ నాయకుడు మర్రి చెన్నారెడ్డి ప్రత్యేక తెలంగాణ కోరుతూ ఉద్యమంలోకి వచ్చాడు. అంతకు ముందు కేవలం విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, లాయర్లు, జర్నలిస్టులు మాత్రమే చేస్తున్న ఉద్యమంలోకి రాజకీయ నాయకులు రావడమన్నది కీలకమైన అంశంగా గుర్తించాలి. మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ప్రజా సమితిలో భాగమయ్యాడు. అయితే ఈ తెలంగాణ ప్రజాసమితి, అంతకు ముందటి తెలంగాణ ప్రజాసమితి రెండూ ఒక్కటి కావు. మొదటిదానిలో రాజకీయ నాయకులపట్ల తీవ్రమైన అనుమానాలున్నాయి. కనుక చెన్నారెడ్డి ప్రతీఘాతుక తెలంగాణ ప్రజాసమితిని ఏర్పాటు చేసి తానొక పాయగా ఉద్యమాన్ని నడిపాడు. ఆయన స్థాపించిన తెలంగాణ ప్రజాసమితి మేడేను 'డిమాండ్స్ డే' గా తెలంగాణ అంతటా నిర్వహించాలని పిలుపునివ్వడం, అది విజయవంతం కావడం జరిగింది. ఆ క్రమంలో ఉద్యమకారుల నెత్తురు చిందని ప్రాంతం తెలంగాణలో లేనేలేదు. ముఖ్యంగా హైదరాబాదు, సికింద్రాబాదుల్లో పోలీసుల లాఠీఛార్జీలు, కాల్పులవల్ల చాలామంది విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. అయితే ఈ క్రమంలో విద్యార్థి నాయకుల అభిప్రాయాలు గుర్తించదగినవి. "చెన్నారెడ్డి తెలంగాణా ప్రజాసమితి బాధ్యత తీసుకోగానే శ్రీధర్ రెడ్డి నాయకత్వంలోని 30 మంది విద్యార్థులు ఒక ప్రకటన విడుదల చేస్తూ విద్యార్థుల ఉద్యమంలో రాజకీయ నాయకుల ప్రవేశాన్ని, జోక్యాన్ని తీవ్రంగా ఖండించారు. వీరు ఉద్యమాన్ని హైజాక్ చేసి తమ స్వార్థం కోసం దాన్ని నట్టేట్లో ముంచుతారని ముందే ఊహించి సుదీర్ఘ ప్రకటనలు చేశారు. జి.యం.అంజయ్య అనేక ఉదాహరణలిస్తూ 1952

గైర్ ముల్కీ గోబ్యాక్ ఉద్యమం నుండి అర్థాంతరంగా ఉపసంహరించుకున్న చరిత్ర కొండా వెంకటరంగారెడ్డి మరియు చెన్నారెడ్డి గార్లకున్నదని, అలాగే పెద్దమనుషుల ఒప్పందంపై సంతకాలు చేసి కాంగ్రేసు అధిష్టాన వర్గంతో లాలూచీ పడి విలీనానికి తలలూపారని, లొంగిపోయారని ఇక భవిష్యత్తులో మళ్లీ మరోసారి మోసగిస్తారని సరిగ్గానే జోస్యం చెప్పారు. 1952లో, 1956లో రెండుసార్లు మోసం చేసిన నాయకుడిని మరోసారి ఎలా నమ్ముతారని వందేమాతరం రామచంద్రరావు ప్రజలను సూటిగా ప్రశ్నించారు" (శోభాగాంది. 2010 : 80). ఆనాడు విద్యార్థి నాయకులకు ఉన్న భావన తర్వాతి కాలంలో నిజమైంది.

ఈ పరిస్థితి ఇలా ఉంటే మే 24న తెలంగాణ ఉద్యోగుల ఉద్యమంలో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆరోజు తెలంగాణ ఎన్‌జీవోల నాయకుడు కె.ఆర్.ఆమోస్ ఉద్యోగుల సభలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పర్చకపోతే రక్తపాతం సృష్టిస్తాం అని ప్రకటించాడు. ఒక ప్రభుత్వ ఉద్యోగి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ఆనాటికేకాదు, నేటికీ ఒక సాహసంగానే గుర్తించాలి. ఆమోస్ ప్రకటనకు బదులుగా ఆనాటి సీమాంధ్ర వలసవాద ప్రభుత్వం 26వ తేదీన తెలంగాణ ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘాల గుర్తింపును రద్దు చేసింది. శాంతి భద్రతలకు విఘాతం కల్పించే పద్ధతిలో ఉద్యోగులను రెచ్చగొడుతున్నాడని ఉద్యోగం నుండి తొలగించింది. దాంతో ఉద్యోగ సమాజానికి ప్రభుత్వానికి ప్రత్యక్ష పోరాటం మొదలైంది. మే 27న పిడి చట్టం కింద ఆమోస్‌ను అరెస్టు చేసింది. ఆయనతోపాటు సదాలక్ష్మి, రాజారామ్, గోవింద్ సింగ్‌లను కూడా అక్రమంగా నిర్భందించింది. వీరి అరెస్టుకు నిరసనగా, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో భాగంగా నిరవధిక సమ్మె చేస్తామని ఉద్యోగులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆమోస్‌ను విధుల నుండి తొలగించడంపై హైకోర్టులో ఒక రిట్ దాఖలు చేశారు. దానికి బదులుగా ప్రభుత్వం 15 మంది ఉద్యోగ నాయకులను విధుల్లోంచి సస్పెండ్ చేసింది. మరోవైపు అధికార కాంగ్రెస్ పార్టీ తెలంగాణ శాసనసభ్యుల్ని బహిష్కరించింది.

మరోవైపు ఒక్క సీపీఐ(ఎం) మినహా అన్ని వామపక్ష పార్టీలు, వాటి అనుబంధ

సంఘాలు ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని బలపరుస్తూ కార్యక్రమాల్ని చేశాయి. మే 29న హైదరాబాద్‌లో 'మార్క్సిస్టు ఫోరం(మేధావుల అధ్యయన సంస్థ)' ను ఏర్పాటు చేసి శ్రీధర్‌రెడ్డితో కలిసి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో భాగం కావాలని నిర్ణయం చేశాయి. ఈ కీలక పరిణామంలో సీపీఐ(ఎం) ప్రజలకు, ప్రజాభిప్రాయానికి భిన్నంగా, దూరంగా ఉండిపోయింది.

జూన్ మొదటివారంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని అణచివేసే క్రమంలో హైదరాబాద్, సికింద్రాబాద్‌లో విద్యార్థులు, ఇతర ఉద్యమకారుల్ని తీవ్రంగా గాయపర్చి కాల్పులు జరిపారు. అది ఏ స్థాయిలో జరిగిందంటే ప్రపంచంలోని చాలామంది ఈ విషయంపై స్పందిస్తూ ప్రపంచంలో గతంలో జరిగిన అన్ని విద్యార్థి ఉద్యమాలకంటే ఈ ఉద్యమమే పైస్థాయిలో ఉండగలదు అన్నారు. జూన్ 2 నుండి జూన్ 4 వరకు కొనసాగిన ఉద్యమ అణచివేతలో 30 మందికి పైగా చనిపోయినట్లు ప్రభుత్వ లెక్కలు చెప్తున్నాయి. కేవలం ఈ నాలుగు రోజుల్లోనే 33 గంటల నిరవధిక కర్ఫ్యూ విధించారు. 14 సార్లు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో రోడ్లమీదనే 9 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వ పోలీసులకు తోడు ఆంధ్రానుండి తీసుకొచ్చిన కిరాయి గుండాలు, రౌడీలు హైదరాబాద్‌లోని అబిడ్స్ చౌరస్తాలో ఉండే ఒక హోటల్ కేంద్రంగా తెలంగాణ ఉద్యమకారుల్ని కత్తులతో దాడి చేసి చంపారు. వాస్తవానికి జూన్ 2న తెలంగాణ ప్రజాసమితి బంద్‌కు పిలుపునిచ్చి ఉన్నది. కనుక బంద్‌లో పాల్గొన్నవాళ్లందరూ పోలీసుల తూటాలకు, ఆంధ్రా గూండాల కత్తులకు బలయ్యారు. ఈ ఉద్రిక్త వాతావరణంలో ఆనాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధి హైదరాబాద్‌కు వచ్చింది. "బుధవారం, జూన్ 4వ తేదీన ఇంటలిజెన్స్ రిపోర్టులు అందుకున్న ప్రధానమంత్రి ఇందిరాగాంధి ఒక క్షణం ఆలస్యం చేయకుండా హైద్రాబాదు నగరానికి అర్థరాత్రి వచ్చి తెల్లారేవరకు విద్యార్థి నాయకులను, తెలంగాణా ప్రజాసమితి నాయకుతలతో సహా అన్ని పార్టీలవారిని సుమారు 45 మందిని కలిసింది. అందరితో విడివిడిగా సమావేశమై వారివారి అభిప్రాయాల్ని తెలుసుకుని చర్చించింది"(శోభాగాంది. 2010 : 89). ఇదిలా ఉంటే జూన్ 5న జరిగిన పోలీస్ కాల్పుల్లో ఒక పాఠశాల విద్యార్థి మరణించాడు. ఈ సందర్భంలో కవులు, కళాకారుల తమ పాత్ర నిర్వహించడం కోసం

ముందుకు వచ్చారు. జూన్ 6న హైదరాబాద్‌లో తెలంగాణ రచయితల సదస్సు జరిపారు. కాళోజీ అధ్యక్షుడిగా ఒక కమిటీ ఏర్పడి ప్రత్యేక తెలంగాణ కొరకు పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు.

ఇట్లా తెలంగాణ వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, రాజకీయ నాయకులు, వివిధ సెక్షన్లలోని ప్రజలు సమ్మెలు, ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తూ పోయారు. మరోవైపు పోలీసుల తీవ్ర నిర్భందాలు, అరెస్టులు, అక్రమ కేసుల బనాయింపులు, తెలంగాణ నాయకుల్ని అపహరించి గుర్తు తెలియని ప్రాంతాలకు, ఇతర ప్రాంతాల జైల్లకు తరలించడాలు, కాల్పులు, లాఠీఛార్జీలు, హత్యలు కొనసాగుతూ పోయాయి. ఈ క్రమం నవంబర్ చివరి వారందాకా కొనసాగింది. నవంబర్ 26న మర్రి చెన్నారెడ్డి ఒక ప్రకటన చేస్తూ విద్యార్థులు పరీక్షలలో నిమగ్నమై ఉన్నందున, గ్రామీణులు వ్యవసాయ పనుల్లో ఉన్నందున ఉద్యమంలో స్తబ్ధత వచ్చింది అని విద్రోహపూర్వక ప్రకటన చేశాడు. నవంబర్ 27న ఢిల్లీ వెళ్లివచ్చిన ఆయన ప్రస్తుతానికి ఉద్యమాన్ని వాయిదా వేస్తున్నామని వచ్చే సంవత్సరం జనవరి ఒకటి నుండి మళ్లీ ఉద్యమాన్ని ప్రారంభిస్తామని చెప్పాడు. 1972 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకని స్వార్థ పూరితంగా ప్రజాసమితిని కాంగ్రెస్‌లో విలీనం చేశాడు. దీంతో సంవత్సర కాలంగా వీరోచితంగా నడిచిన ఉద్యమం ఆగిపోయింది.

స్థూలంగా చూసినప్పుడు ఈ ఉద్యమంలో 96 సార్లు పోలీసు కాల్పులు జరిగాయి. 360 మంది అమరులయ్యారు. 217 మంది తీవ్రంగా గాయపడ్డారు. కానీ వలసాంధ్ర ప్రభుత్వం కేవలం 57 మందే చనిపోయారని లెక్కలు తేల్చింది.

## 2.3. మలిదశ పూర్వార్థం

మలిదశ తెలంగాణ ఉద్యమం అనగానే చాలామందికి తెలంగాణ రాష్ట్ర సమితి(టీఆర్ఎస్) మొదలుపెట్టిన ఉద్యమం గుర్తుకు వస్తుంది. అది గుర్తు చేసుకున్నవాళ్ల

తప్పు కాదు. స్వార్థపూరితంగా అవాస్తవాన్ని వాస్తవంగా ప్రచారం చేసినవారి తప్పు. నిజానికి మలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమ చరిత్రను రెండు పాయలుగా చూడాలి. రెండు పాయలు, రెండు భిన్నమైన లక్ష్యాలను, పద్ధతులను ప్రవేశపెట్టినవి. కనుక సారాంశంలోనే మౌలికమైన తేడాలున్న మలిదశ తెలంగాణ ఉద్యమ రెండు పాయల్ని ఈ పరిశోధనలో విడివిడిగానే గణించడం జరుగుతున్నది. వాస్తవానికి ఎవరి చేతిలో కలం ఉంటుందో, వారి చరిత్రనే రికార్డ్ అవుతుంది. మాట్లాడగలిగే అవకాశం ఉన్నవారి చరిత్రనే ప్రచారమవుతుంది. అంతిమంగా పాలకుల చరిత్రనే పాలితుల చరిత్రగా రుద్దబడుతుంది. తెలంగాణ ఉద్యమం విషయంలో ఇది కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది. 'పెట్టుబడికి, కట్టుకథకు పుట్టిన విషపుత్రికలు ఈ పత్రికలు', టీవీ చానళ్ళు మొదలు కొందరు మేధావుల వరకు 2001 ఏప్రిల్ 27, తెలంగాణ రాష్ట్ర సమితి(టిఆర్ఎస్) పుట్టుకతోనే తెలంగాణ ఉద్యమం మొదలైనట్లు రాస్తున్నారు, మాట్లాడుతున్నారు. అది పార్లమెంటరీ పార్టీ కావటం వలన, దాని నాయకత్వానికి అగ్రకుల భూస్వామ్య స్వభావం ఉండడం వలన తెలంగాణ డిమాండ్‌కు అధిక ప్రచారం లభించిన మాట వాస్తవమే. కాని టిఆర్ఎస్‌తోనే తెలంగాణ ఉద్యమం ప్రారంభమైందని చెప్పటం అవాస్తవం. ఇలా చెప్పటమంటే పోరాట త్యాగాల చరిత్రపై మన్ను కప్పటమే. మానవ చరిత్రలో మూడువేల సంవత్సరాలలో ప్రత్యామ్నాయ చరిత్రకు స్థానం లేకుండా చేశారు. కళ్ళముందరి చరిత్రలో కూడా అదే జరుగుతుంది. కనుక పోరాట త్యాగాల చరిత్రపై పాలకులు కప్పిన మట్టిని తొలగించే ప్రయత్నమే ఈ గణన.

నిర్బంధంతో, విద్రోహాలతో, కుట్రలతో 1973లో ముగిసిన 1969 ఉద్యమం తర్వాత, మళ్లీ తెలంగాణ ఆకాంక్ష 80వ దశకంలో ముందుకొచ్చింది. అంటే పదమూడేళ్ల విరామం తరువాత. సరిగ్గా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రాజకీయాల్లోకి రావడం, అదే సమయంలో 1983లో హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్‌లో ఉప ఎన్నికలు రావడం, దాంతో తెలుగుదేశం పార్టీ స్థానిక అభ్యర్థికి కాకుండా ఆంధ్రా ప్రాంతానికి చెందిన పర్వతనేని ఉపేంద్రకు టికెట్ ఇవ్వడంతో మళ్లీ తెలంగాణ జ్వాలలు రాజుకున్నాయని చెప్పాలి. ఆనాటి ఉద్యోగనాయకుడు ఇ.వి.పద్మనాభం, జర్నలిస్టు ప్రతాప్ కిశోర్‌వంటి

తెలంగాణ వాదులు తెలుగుదేశం పార్టీకీ, ఆ పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా తీవ్రస్థాయిలో పనిచేసి బి.జె.పి. అభ్యర్థి అయిన ఆలె నరేంద్రను భారీ మెజార్టీతో గెలిపించారు. ఈ గెలుపు అందించిన ఉత్సాహంతో ఇ.వి.పద్మనాభం, ప్రతాప్ కిషోర్, మాజీ మంత్రులు బాగారెడ్డి, గోక రామస్వామి మొదలైనవాళ్లతో స్టేట్ అడ్వయిజర్ పత్రికా సంపాదకుడు సత్యనారాయణ అధ్యక్షుడిగా వైఎంసిఏ హాలులో తెలంగాణ డెమోక్రటిక్ ఫ్రంట్ ఏర్పడింది. 1984లో దేవానంద స్వామి వరంగల్‌లో తెలంగాణ పార్టీని స్థాపించి, కొంతకాలం తెలంగాణ వాదనను ప్రచారం చేశారు. అదే కాలంలో 1969 ఉద్యమకాలంలో టిఎన్‌జివోగా ఉన్న కె.ఆర్.ఆమోస్, మేచినేని కిషన్‌రావులు తెలంగాణ పోరాట సమితిని స్థాపించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ప్రచారం చేశారు. 1985లో తెలంగాణ సమస్యలపై నిర్వహించిన తెలంగాణ విద్యావంతుల సదస్సు, తెలంగాణకు జరిగిన అన్యాయాలకు సంబంధించిన అంశాల మీద విస్తృతమైన అధ్యయనానికి తెరలేపింది. ఇదే కాలంలో మళ్లీ స్టేట్ అడ్వయిజర్ పత్రికా సంపాదకుడైన సత్యనారాయణ ఆధ్యక్ష్యంలోనే 1985 ఫిబ్రవరి 27న తెలంగాణ జనసభ ఏర్పడింది. ఇవాళ తెలంగాణ సార్వస్వత పరిషత్తుగా పేరు మార్చుకున్న ఆనాటి ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్యకళాశాల ప్రాంగణంలో తెలంగాణ జనసభ మొదటి సమావేశం జరిగింది. ఆర్యసమాజ నాయకుడు వందేమాతరం రాంచందర్‌రావు ఆధ్యక్ష్యంలో జరిగిన ఈ సదస్సులో ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కార్యాచరణ రూపొందించాలని తీర్మానించారు. ఆ తర్వాత కొత్తగూడెం, వరంగల్‌లలో సభలు నిర్వహించి, ఆ తర్వాత ఒక ప్రతినిధి బృందం ఢిల్లీకి వెళ్లి, ఆనాటి ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీని, హోంమంత్రి చవాన్‌ను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. అదే సమయంలో బి.జె.పి. నాయకుడు అద్వానీని, జనతాపార్టీ నాయకుడు జార్జ్ ఫెర్నాండెజ్‌ను కూడా కలిసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత గురించి చర్చించారు.

1985లో తెలంగాణ విద్యావంతులు నిర్వహించిన సదస్సు నేపథ్యంలోంచి, 1986 జనవరిలో నాట్యకళ ప్రభాకర్, ప్రొఫెసర్ హరినాథ్, స్వరాజ్యం, డా॥రాంరెడ్డి, డా॥వినాయకరెడ్డి మొదలైనవాళ్లు కలిసి 'తెలంగాణ ఇన్ఫర్మేషన్ ట్రస్టు' స్థాపించారు.

దీనికి అనుబంధంగా 'మా తెలంగాణ' అనే పత్రికను తెచ్చింది. తెలంగాణ కోసం ఒక మహాసభను మొట్టమొదట ఈ ట్రస్టే నిర్వహించింది. 'మా తెలంగాణ' ఆవిష్కరణ సభ హైదరాబాద్‌లోని కాచిగూడ బసంత్ టాకీసులో వేయిమంది సమక్షంలో జరిగింది. ఆ తరువాత ఈ ట్రస్టు, 1989 ఎన్నికల నాటికి తెలుగుదేశం పాలన అమలు చేసిన తెలంగాణ వ్యతిరేక విధానాలను తెలియజెప్పేందుకు తెలంగాణ అంతటా పర్యటించింది. తెలంగాణ వెనుకబాటుతనానికి గల కారణాలను తెలియజేస్తూ సవివరమైన డాక్యుమెంటును రూపొందించి ప్రజల్లోకి తీసుకెళ్లింది. కాళోజీ నారాయణరావు, ఇ.వి.పద్మనాభన్, జయశంకర్‌వంటివాళ్లు చేస్తున్న కృషికి ప్రతి శనివారం తెలంగాణ ఇన్ఫర్మేషన్ ట్రస్టు నిర్వహించే సమావేశాలు వేదికలు అయ్యాయి. ఈ భావజాల వ్యాప్తి కారణంగానే 1988లో అసెంబ్లీలో తెలంగాణపైన చర్చ జరిగింది. పలువురు శాసనసభ్యులు తెలంగాణకు జరుగున్న అన్యాయాన్ని ఎత్తిచూపారు. మరోవైపు జర్నలిస్టు ప్రతాప్ కిషోర్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర అంశానికి దేశవ్యాప్త మద్ధతుకై షేర్‌ఖాన్, సయ్యద్ షాబుద్దీన్‌లతో కలిసి 1987 జూన్ 6న దేశరాజధాని ఢిల్లీకి పాదయాత్ర చేపట్టాడు. దారిపొడుగునా వందలాదిమంది నాయకుల్ని కలిసి తెలంగాణ అంశాన్ని వివరిస్తూ వెళ్లాడు. జూన్ 28న నాగ్‌పూర్ చేరుకున్న ఈ ముగ్గురు పాదయాత్రికులకు అక్కడి జర్నలిస్టు సంఘం ఆతిథ్యం ఇవ్వడంతోపాటుగా, విదర్భ ప్రత్యేక రాష్ట్ర వాదులతో సమావేశం నిర్వహించడానికి అవకాశం కల్పించింది. నాగ్‌పూర్ తర్వాత కాలినడకన వెళ్లడానికి ఆరోగ్యం సహకరించకపోవడంతో అక్కడినుండి రైల్లో ప్రయాణించి, ప్రధానమంత్రికీ, కేంద్ర మంత్రులకు తెలంగాణ ఏర్పాటుకు సంబంధించిన వినతి పత్రాలు సమర్పించి వచ్చారు. వచ్చిన తర్వాత వీళ్లే మళ్లీ 1987లో భూపతి కృష్ణమూర్తి అధ్యక్షుడిగా తెలంగాణ ప్రజా సమితిని పునరుద్ధరించారు. మరోవైపు అంతర్జాతీయంగా తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం యు.ఎస్.ఏ ఏర్పడి అనేక ప్రచార కార్యక్రమాల్ని నిర్వహించింది. విద్య, ఉద్యోగ అవకాశాల్లో తెలంగాణాకు న్యాయమైన వాటా ఇవ్వాలని, శ్రీశైలం ఎడమ కాల్వ, శ్రీరాంసాగర్‌లను వెంటనే పూర్తి చేయాలని, తెలంగాణలో విద్యా ప్రమాణాలను పెంచి, వృత్తి విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని, తెలంగాణలో ఉన్న ప్రైవేట్ పరిశ్రమలలో 50 శాతం ఉద్యోగాలను స్థానికులకు రిజర్వు చేయాలని ఈ ఫోరం ప్రచారం చేసింది.

90వ దశకంలో కోస్తాంధ్ర దోపిడీ పాలకులు ప్రపంచ బ్యాంకుకు తెలంగాణను ప్రయోగశాలగా మార్చారు. వనరుల దోపిడీని వేగవంతం చేశారు. ఒకవైపు సీమాంధ్ర పాలకులు, మరోవైపు సామ్రాజ్యవాదులు జమిలిగా తెలంగాణను దోపిడీ చేశారు. బహుళజాతి కంపెనీలకు ఉపయోగపడే ఆర్థిక విధానాలను సీమాంధ్ర పాలకులు అమలు చేశారు. సరిగ్గా ఈ కాలంలోనే తెలంగాణ ఉద్యమం వేగవంతమైన ప్రయాణంలోకి మళ్లింది.

1991లో మాజీ శాసన సభ్యుడు వెలిచాల జగపతిరావు ప్రభుత్వ అధికారిక సమాచారం ఆధారంగా సాగునీటి రంగంలో తెలంగాణకు జరిగిన అన్యాయాలను వివరిస్తూ ఒక నివేదికను తీసుకువచ్చాడు. ఆనాటి తెలంగాణ రాజకీయ నాయకులందరినీ కదిలించిన ఈ నివేదికలో మూడు ముఖ్యమైన అంశాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. అవి. 1) తెలంగాణలో ప్రవహించే కృష్ణా, గోదావరి నదుల పరీవాహక ప్రాంత ప్రాతిపదికన 1700 టిఎంసిలు, సాగు భూమి విస్తీర్ణం ఆధారంగా చూస్తే 1400 టిఎంసిల నీరు తెలంగాణకు రావాలి. కానీ తెలంగాణకు కేవలం 1170 టిఎంసిల నీటిపై మాత్రమే హక్కు ఉన్నట్లు ఆంధ్ర పాలకులు చెప్తున్నారు. 2) శ్రీరాంసాగర్, జూరాల, సింగూరు, శ్రీశైలం ఎడమగట్టు కాలువ పూర్తి అయితే తెలంగాణలోని 30 లక్షల ఎకరాల భూమికి సాగునీరు అందుతుంది. 3) 20 సంవత్సరాల క్రితం ప్రారంభించి 1991 కాలంనాటికి పూర్తిచేయని పదమూడు మధ్యతరహా ప్రాజెక్టులకు 23 టిఎంసిల నీరు వాడుకునే అవకాశం ఉన్నా కేవలం 6 టిఎంసిలు మాత్రమే ఉపయోగపడుతున్నాయి. 75కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే మిగతా 14 టిఎంసిలు వాడుకునే అవకాశం ఉన్నా, సీమాంధ్ర పాలకులు ఆ పని చేయడం లేదు. ఈ మూడు అంశాలు ఆనాటి తెలంగాణ రాజకీయ నాయకులను కదిలించాయని చెప్పాలి. ఎందుకంటే ఆనాటికి తెలుగుదేశం పార్టీలో మంత్రిగా ఉన్న కె.జానారెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ఆనాటికి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమిస్తున్న మేధావి వర్గం సహకారంతో కె.జానారెడ్డి కన్వీనర్‌గా తెలంగాణ ఫోరం ఏర్పడింది. ఈ ఫోరం తరపున ఒక ప్రతినిధి బృదం 1992 సెప్టెంబర్‌లో ఢిల్లీ వెళ్లింది. ఆనాటి ప్రధాన మంత్రి పి.వి.నరసింహారావును కలిసి వినతి పత్రం సమర్పించారు. తర్వాత అదే ప్రతినిధి

బృందం నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డిని కూడా కలిసి వినతిపత్రాన్ని ఇచ్చారు. దీంతో రాష్ట్ర అసెంబ్లీలో వరుసగా మూడురోజులు తెలంగాణ అంశం మీద చర్చ జరిగింది. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ఈ చర్చకు సమాధానం చెప్తూ, నీటిపారుదల రంగంలో తెలంగాణకు అన్యాయం జరిగిందని ఒప్పుకుంటూ, తెలంగాణకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని వాగ్ధానం చేశాడు.

మరోవైపు 1991లో ఉస్మానియా యూనివర్సిటీలో తెలంగాణ స్టూడెంట్స్ ఫ్రంట్ ఏర్పడింది. అదే సంవత్సరం మనోహర్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ 'లిబరేషన్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్' అనే విద్యార్థి సంఘం ఏర్పడింది. కాకతీయ విశ్వవిద్యాలయంలో 1992లో 'తెలంగాణ స్టూడెంట్స్ ఫ్రంట్' కాకతీయ యూనిట్ ఏర్పడింది. 1993 ఆగస్టులో ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఠాగూరు ఆడిటోరియంలో చిన్నరాష్ట్రాలపై జాతీయ సదస్సు జరిగింది. సురేంద్రమోహన్ ప్రారంభించిన ఈ సదస్సులో జస్టిస్ కొండా మాధవరెడ్డి ప్రసంగించారు. ముగింపు సమావేశంలో జార్జి ఫెర్నాండెస్ ప్రసంగించారు. విదర్భ నుండి విలాస్ బోన్‌గడే, కర్నాటక ప్రాంతం నుండి లక్ష్మణ్ దస్తి మొదలైన నాయకులతోపాటు దేశం నలుమూలల నుండి ప్రత్యేక రాష్ట్రాలకోసం ఉద్యమిస్తున్నవాళ్లు చాలామంది హాజరయ్యారు. ఉస్మానియా క్యాంపస్‌లోను, క్యాంపస్ బయట తెలంగాణ స్టూడెంట్స్ ఫ్రంట్, తెలంగాణ లిబరేషన్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్‌లు కలిసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ప్రదర్శనలు నిర్వహించాయి. ఆ కాలంలో తెలంగాణ విద్యార్థులకు అంతకుముందటికంటే 15 శాతం సీట్లు ఎక్కువగా వచ్చినట్లు చరిత్రలో రికార్డు అయ్యింది.

1996 సెప్టెంబర్‌లో నిజామాబాద్‌లోని న్యాయవాదులు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అంశం ప్రధాన ఎజెండాగా ఒక సదస్సు నిర్వహించారు. ఆ తర్వాత ప్రముఖ తెలంగాణ జర్నలిస్టు పాశం యాదగిరి ఆధ్వర్యంలో హైదరాబాదు వివేకవర్ధిని కళాశాలలో తెలంగాణపై సదస్సు నిర్వహించారు. సరిగ్గా ఇదే కాలంలో ఆనాటి సిపిఐ(ఎం.ఎల్) పీపుల్స్‌వార్ పార్టీ తెలంగాణ ఏర్పాటును సమర్ధిస్తూ ప్రకటన విడుదల చేసింది.

1996 జూన్‌లో దేశ ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టిన దేవేగౌడ అదే సంవత్సరం ఆగస్టు 15న ఎర్రకోట నుండి చేసిన ప్రసంగంలో ఉత్తరాఖండ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేశాడు. దాంతో దేశంలోని విదర్భ, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, బోడోలాండ్, గూర్ఖాలాండ్, హరితప్రదేశ్, బుందేల్‌ఖండ్ ప్రాంతీయ ఉద్యమాలతోపాటుగా తెలంగాణలో కూడా ఉద్యమం ఊపందుకుంది.

1996 నవంబర్ 1న హైదరాబాద్‌లోని ప్రకాశం హాల్‌లో కె.ప్రభాకర్ రెడ్డి ఆధ్యక్ష్యంలో తెలంగాణ సంఘర్షణ సమితి ఒక సదస్సు నిర్వహించింది.

మరోవైపు విప్లవ పార్టీ అయిన సిపిఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్ తెలంగాణలో అమలులో ఉన్న ఆర్థిక దోపిడీ విధానాలకు భిన్నమైన ప్రత్యామ్నాయ ఆర్థిక అభివృద్ధి విధానాన్ని రూపొందించి, స్వావలంబన దిశగా తెలంగాణను నడిపించాలని భావించింది. పరిమిత సంఖ్యలోనైనా కొన్ని గ్రామాలలో దీనిని అమలు చేసి చూపించింది. విప్లవ పార్టీ అమలు చేసిన స్వయం సమృద్ధి, ఆర్థిక విధానాలు సజీవంగా ఉండాలంటే సామ్రాజ్యవాదుల, సీమాంధ్ర పాలకుల దోపిడీ అంతం కావాలని తెలంగాణ ప్రజలు భావించారు. కనుకనే 1995 నుంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర డిమాండ్‌ను ఎజెండా మీదికి తెచ్చారు. మేధావులు, కవులు, కళాకారులు, ఉపాధ్యాయులు ప్రజల భాగస్వామ్యంతో తెలంగాణ డిమాండ్‌ను ముందుకు తెచ్చారు. 1996 నవంబర్ 1న వరంగల్‌లో భూపతి కృష్ణమూర్తి, జయశంకర్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అవతరణను నిరసిస్తూ సభ జరిగింది. ఈ సభలో తెలంగాణ పట్ల జరుగుతున్న అనేక రకాల వివక్షలపై చర్చించారు. పరిమితంగా జరిగిన ఈ సభ తెలంగాణ ప్రజల ఆకాంక్షను బలంగా వినిపించింది. తెలంగాణ ఉద్యమంలో మొదటినుంచి కవులు, కళాకారుల పాత్ర ఉన్నతమైనదని చెప్పడానికి తొలినాళ్ల తెలంగాణ గొంతును వినిపించడానికి 1996 నవంబర్ 20న సిద్ధిపేట్‌లో మంజీరా రచయితల సంఘం వారు ఒక సభ నిర్వహించారు. ఇట్లా తెలంగాణ ప్రాంత ఆలోచనాపరులలో మళ్లీ కదలిక మొదలైంది. అన్ని తెలంగాణ జిల్లాల్లో సభలు, చర్చలు జరిగాయి. తెలంగాణలో నెలకొన్న సామాజిక సంక్షోభాన్ని, హింసాత్మక వాతావరణాన్ని ప్రజా సంక్షేమం దృష్ట్యా

పరిష్కరించేందుకు ఏప్రిల్ నెలలో ఎస్.ఆర్. శంకరన్, కె.జి.కన్నబిరాన్, ప్రొ.జి.హరగోపాల్, ప్రొ.డి.నరసింహారెడ్డి, ప్రొ.బి.చంద్రశేఖరరావు, పొత్తూరి వెంకటేశర్వరరావు, ప్రొ.కె.జయశంకర్, డా.బి. జనార్ధన్‌రావు, బొజ్జా తారకం, పి.జనార్ధన్‌రెడ్డి, ఆర్.అఖిలేశ్వరి, ప్రొ.ఎం.కోదండరామ్, ఎస్.జీవన్ కుమార్, ఎం. అనంతకృష్ణలు కమిటీ ఆఫ్ కన్సర్న్‌డ్ సిటిజన్స్ (సిసిసి)గా ఏర్పడ్డారు. 1997 ఆగస్టులో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్' ఏర్పడింది. అదే నెల 16, 17 తేదీలలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'ప్రాంతీయ అసమానతలు – అభివృద్ధి ప్రత్యామ్నాయాలు' అనే అంశం మీద సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్ పత్రాలను ప్రొ.పి.ఎల్.విశ్వేశ్వరరావు, ఎస్. సింహాద్రిల సంపాదకత్వంలో 'తల్లడిల్లుతున్న తెలంగాణ' పేరుతో పుస్తకంగా ప్రచురించారు.

1996 వరకు తెలుగుదేశం పార్టీలో, తర్వాత లక్ష్మీపార్వతి ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీలో నాయకుడిగా ఉండిన మాజీ హోంమంత్రి పి.ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో 1997లో 'జై తెలంగాణ పార్టీ' ఏర్పడింది. చంపాపేట్‌లో జరిగిన ఈ పార్టీ ప్రారంభ సభకు ఢిల్లీ నుండి అజిత్ సింగ్ హాజరయ్యాడు. ఆ సభ తర్వాత ఇంద్రారెడ్డి తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పర్యటించాడు. న్యాయమూర్తి కొండా మాధవరెడ్డి కొంతకాలం ఆయనకు మద్ధతుగా నిలబడ్డారు. ప్రొ.కె.జయశంకర్, ప్రొ.కేశవరావులు కూడా ఇంద్రారెడ్డికి మద్ధతునిచ్చారు.

1997 నవంబర్ 1న హైదరాబాద్‌లోని మొజాంజాహి మార్కెట్ అశోక్ టాకీస్‌లో 'ఫోరం ఫర్ ఫ్రీడమ్ ఎక్స్‌ప్రెషన్' పేరుతో సభను నిర్వహించారు. గులాం రసూల్ ఎన్‌కౌంటర్‌ను ఖండిస్తూ కవులు, కళాకారలు జరిపిన సభ ఇది. ఈ సభలోనే తెలంగాణకు జరుగుతున్న అన్యాయం గురించి తీవ్రంగా చర్చించారు. ఈ సందర్భంలోనే గద్దర్ రాసిన 'అమ్మా తెలంగాణమా ఆకలి కేకల గానమా' మొట్టమొదటిసారి పాడాడు. ఆ సభ ఇచ్చిన చైతన్యంతో అక్కడికక్కడే పుట్టిన పాట అది.

1997 ఆగస్టు చివరివారంలో ఉస్మానియా విశ్వవిద్యాయలంలో తెలంగాణ ఐక్య

వేదిక ఏర్పడింది. ఆనాటికి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా ఏర్పడిన 28 సంస్థలు కలిసి ఈ ఐక్యవేదిక ఏర్పడింది. ఈ ఏర్పాటులో ముఖ్యులు ప్రొ.కె.జయశంకర్, ప్రొ.కేశవరావ్ జాదవ్, వి.ప్రకాశ్, రాపోలు ఆనందభాస్కర్‌లు.

ఇక తెలంగాణ ప్రాంతంలో ప్రజల బాధలను, గాథలను ప్రపంచానికి తెలియజేసింది 'భువనగిరి సభలు'. 1997 మార్చి 8,9 తేదీల్లో ఈ సభలు జరిగాయి. ప్రతినిధుల సభకు పదివేలమందికి పైగా హాజరయ్యారు. బహిరంగ సభకు నలభైవేలకు పైగానే వచ్చారు. తెలంగాణ నాలుగు మూలల నుండి ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. ఆ సదస్సులో తెలంగాణ భాషా సాహిత్యాలపై, ఆర్థిక, రాజకీయ అంశాలపై విస్తృతమైన చర్చ జరిగింది. ఈ సభను నిర్వహించింది విప్లవ శక్తులు. మరోమాటలో చెప్పాలంటే విప్లవ రచయితల సంఘం సభ్యులు. ఆనాటికి ఉన్న తీవ్ర నిర్బంధంలో విరసం పేరు చెప్పుకోలేని రచయితలు, కవులు, కళాకారులు, అధ్యాపకులు, జర్నలిస్టులు కలిసి 'సాహితీ మిత్ర మండలి'గా ఏర్పడి సభను నడిపించారు. 'దగాపడ్డ తెలంగాణ' పేర జరిపిన ఈ సభ తెలంగాణ ప్రజలపై విశేష ప్రభావాన్ని చూపింది. నాడు స్తబ్ధంగా ఉన్న తెలంగాణ ఆకాంక్షను తట్టి లేపడానికి భువనగిరిలో తెలంగాణ హక్కుల సమితి వేదిక అయ్యింది. తెలంగాణ వ్యాప్తంగా విశేషమైన ప్రభావం వేసిన ఈ సభతోనే తెలంగాణ వాగ్గేయకారిణి బెల్లి లలిత సమాజానికి పరిచయం అయ్యింది. ఆ తర్వాత ఆమె అక్కడితో ఆగకుండా తెలగాణంతా తిరిగి సభలు, సమావేశాల్లో ప్రత్యేక తెలంగాణ ఆవశ్యకతను, నూతన ఆర్థిక విధానాల విధ్వంసాన్ని వివరించే పాటల్ని ఆకట్టుకునేట్లు పాడింది. తెలంగాణ ఉద్యమ వ్యాప్తికోసం గళం ద్వారా విశేషమైన కృషి చేసింది.

1997 ఏప్రిల్‌లో నల్గొండ జిల్లా సూర్యాపేట్‌లో 'తెలంగాణ మహాసభ' ఏర్పడింది. ఇది అంతకుముందటి తెలంగాణ ఉద్యమంలో లేని కొత్త ప్రశ్నల్ని లేవదీసింది. నిచ్చెన మెట్ల కుల సమాజంలో తెలంగాణ ఉద్యమాన్ని ఎలా అర్థం చేసుకోవాలో చెప్పింది. కుల కోణంలో సీమాంధ్ర అగ్రకుల ఆధిపత్యాన్ని ప్రశ్నించింది. బహుజన కులాల నుంచి వచ్చిన నాయకత్వమే తెలంగాణ ఉద్యమంలో నిజాయితీగా పోరాడగలదని ఈ సంస్థ

విశ్వసించింది. తెలంగాణలో బహుజన రాజ్యాన్ని స్థాపించాలనే లక్ష్యంతో ఉద్యమించింది. తెలంగాణ చరిత్ర గుర్తు పెట్టుకోవాల్సిన విషయం, అమరుడు మారోజు వీరన్న తెలంగాణ మహాసభను నడిపించాడు. తెలంగాణ ఉద్యమంలోకి బహుజనులను సమీకరిస్తున్న సందర్భంలోనే సీమాంధ్ర పాలకవర్గాలు మారోజు వీరన్నను చంపేశారు. ఈ హత్య ద్వారా కూడా మల్లీ, బెల్లి లలిత హత్య ద్వారా చెప్పాలనుకున్న సందేశాన్నే చెప్పారు. అయినా ఆనాటి ఉద్యమకారులు త్యాగాలకు సిద్ధపడ్డారు తప్ప తమ న్యాయబద్ధమైన డిమాండ్‌ను వదులుకోలేదు.

1996 నుండి 1997 మధ్య కాలంలో తెలంగాణలోని అన్ని ప్రధాన నగరాలలో భావజాల ప్రచారం కోసం చాలా సమావేశాలు, సభలు జరిగాయి. పదిమంది మొదలు 2 లక్షల మంది హాజరైన సభలు చరిత్రలో నిలిచిపోదగినవి. ఆ కాలంలో జరిగిన సభల్లో అతిపెద్దది 'వరంగల్ డిక్లరేషన్' సభ. పార్లమెంటరీ రాజకీయాల్ని విశ్వసించని శక్తులు, విప్లవ పార్టీలు ప్రజల ప్రజాస్వామిక డిమాండ్‌గా తెలంగాణను అర్థం చేసుకొని కార్యాచరణకు పూనుకున్నాయి. విప్లవ రచయితల సంఘంలాంటి అనేక ప్రజాసంఘాల పూనికతో అఖిల భారత ప్రజా ప్రతిఘటన వేదిక (ఎఐపిఆర్ఎఫ్) ఆధ్వర్యంలో 1997 డిసెంబర్ 28న వరంగల్‌లో సభ జరిగింది. ప్రతినిధుల సభ తర్వాత జరిగిన బహిరంగ సభకు రెండు లక్షలమందికి పైగా ప్రజలు హాజరయ్యారు. ఈ బహిరంగ సభలోనే కాళోజీతోపాటు మరికొందరు రచయితలు, అనేక సంస్థలు కలిసి 'వరంగల్ డిక్లరేషన్' ను విడుదల చేయడం జరిగింది. అంతకు ముందటి తెలంగాణ ఉద్యమంకంటే చాలా స్పష్టంగా, నిర్ధిష్టంగా తెలంగాణ సాధనపట్ల దీర్ఘకాలిక అవగాహన వరంగల్ డిక్లరేషన్‌లో ఉన్నది. తెలంగాణ ప్రాంతంలోని వనరుల దోపిడి చేసి, ప్రజలను పీడించి తమ పబ్బం గడుపుకుంటున్న శక్తులను అర్థం చేసుకోవాలి, ఇలాంటి శక్తులకు వ్యతిరేకంగా పోరాటం చేయడం ద్వారా ప్రత్యామ్నాయ విధానాలను రూపొందించుకోవడం ద్వారా ఈ ప్రాంత ప్రజలు తమ సమాజాన్ని, తమ జీవితాన్ని మార్చుకోవాలని డిక్లరేషన్ తెలంగాణ ప్రజలకు పిలుపునిచ్చింది. నిప్పులు కురిసే నిర్బంధంలో వరంగల్ లాంటి ఉద్యమ ప్రాంతంలో లక్షలమందితో బహిరంగ సభ జరగటం సీమాంధ్ర పాలకవర్గాలకు దిమ్మతిరిగేలా చేసింది.

తెలంగాణ కోసం ప్రజలు నిర్బంధాలను కూడా లెక్కచేయరని అర్థమైంది. సిద్ధిపేట, భువనగిరి, హైదరాబాద్, సూర్యాపేట్‌లలో జరిగిన సభలన్నింటికి వరంగల్ సభ ఉన్నత రూపం. ఒక విధంగా తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించల్సింది పార్లమెంటేతర శక్తులేనని వరంగల్ డిక్లరేషన్ భావించింది. ఈ కర్తవ్యాన్ని నెరవేర్చడానికి ప్రజా సంఘాల నిర్మాణం అవసరమని కూడా నాటి పరిస్థితి తేల్చింది.

ఈ పరిణామాల ప్రభావంతో తెలంగాణ కోసం చాలా ప్రజా సంఘాలు పుట్టుకొచ్చాయి. విడివిడిగా పనిచేస్తున్న 28 సంస్థలు కలిసి 'తెలంగాణ ఐక్య వేదిక' ఏర్పడింది. సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా, పార్లమెంటరీ రాజకీయాలకు దూరంగా తెలంగాణ చర్చను ముందుకు తెచ్చిన సంస్థలను ఏకం చేసి ప్రజా పోరాటాలను నిర్మించాలని ఈ సంస్థ ప్రకటించింది. భావజాల ప్రచారంలో ఈ సంస్థ తనవంతు పాత్ర నిర్వహించింది.

వరంగల్ డిక్లరేషన్ వెలుగులో 1998 ఫిబ్రరి 14, 15 తేదీల్లో 'చైతన్య వేదిక' ఆధ్వర్యంలో సిద్ధిపేట పట్టణంలో సదస్సు జరిగింది. తెలంగాణ పరిస్థితులపై, భవిష్యత్ కార్యాచరణపై విస్తృత చర్చ జరిగింది. ఈ సదస్సులోనే ప్రజా కళామండలి మొదటిసారిగా తెలంగాణపై పాటల పుస్తకాన్ని విడుదల చేసింది. ఇదే సంవత్సరం జులైలో 'తెలంగాణ జనసభ' ఏర్పడింది. హైదరాబాద్‌లోని రాణాప్రతాప్ ఫంక్షన్ హాల్‌లో ఈ ఏర్పాటు జరిగింది. ఉపాధ్యాయులు, లాయర్లు, రైతులు, విద్యార్థులు కలిసి ఈ సంస్థను స్థాపించారు. నెలరోజులు కళాకారులు, విద్యార్థులు, ప్రజాసంఘాల నాయకులు కలిసి హైదరాబాద్‌లో బస్తీల క్యాంపెయిన్ నిర్వహించి జనసభ నిర్వహించ తలపెట్టిన సభకు ప్రజల్ని తరలించారు. జులై 5న జరిగిన ప్రతినిధుల సభకు ఎంపిక చేసిన 1000 మంది ప్రతినిధులు వచ్చారు. జులై 6న అంబర్‌పేట్ మున్సిపల్ గ్రౌండ్‌లో జరిగిన బహిరంగ సభకు లక్షమంది ప్రజలు హాజరయ్యారు. ఈ బహిరంగ సభకు కశ్మీర్, విదర్భ, గూర్ఖాలాండ్ నుంచి ప్రతినిధులు వచ్చి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. తెలంగాణ జనసభకు అమరుడు ఆకుల భూమయ్య కన్వీనర్‌గా 15 మంది రాష్ట్ర కమిటీ సభ్యులుగా ప్రతినిధుల సభ ఎన్నుకుంది. చరిత్రలో

చాలా రకాల విద్రోహాలకు గురైన తెలంగాణ సమాజానికి జనసభ ఏర్పాటు వల్ల ఒక విశ్వాసం దొరికింది. దీర్ఘకాలిక లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జనసభ పుట్టుక తెలంగాణ ప్రజల్లో చైతన్యం తెచ్చింది. అయితే ఇంత పెద్ద లక్ష్యసాధన కేవలం జనసభ నుంచి సాధ్యం కాదని భావించిన నాయకత్వం భావ సారూప్యత కలిగిన విద్యార్థి, కళా సంస్థలను నిర్మాణం చేయాలని అనుకుంది. ఈ నేపథ్యంలో 1998 అక్టోబర్ 13న తెలంగాణ 'స్టూడెంట్ ఫ్రంట్(టీఎస్ఎఫ్)', 'తెలంగాణ కళా సమితి' ఏర్పడ్డాయి. రెండు రోజులు జరిపిన తెలంగాణ జనసభ ఆవిర్భావ సభలో తెలంగాణ ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక వెనుకబాటుతనం, దానికి కారణమైన సీమాంధ్ర పాలకవర్గాల స్వభావం తెలంగాణ సాధనకు మార్గాలు మొదలైన అంశాలపై లోతైన చర్చ జరిగింది. తెలంగాణ జనసభ, తెలంగాణ స్టూడెంట్ ఫ్రంట్ – ఈ మూడు సంస్థలు స్వావలంబన ఆర్థిక విధానాలు, పౌరహక్కుల సాధన, వనరుల సంరక్షణ, ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ నిర్మాణం ప్రధాన ఆశయాలుగా పోరాడాలని నిర్ణయించుకున్నాయి. 1969లో ఎన్నికల రాజకీయాలు చేసిన ద్రోహాన్ని గమనంలో ఉంచుకొని తెలంగాణ సాధించేవరకు తెలంగాణ వాదులు ఎన్నికలకు దూరంగా ఉండాలని భావించాయి. తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నిర్మించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను స్తంభింపజేయడం ద్వారానే తెలంగాణ రాష్ట్రం సాధ్యమవుతుందని ఈ సంస్థలు అనుకున్నాయి. దానికి అనుగుణ్యమైన కార్యాచరణను తయారు చేసుకున్నాయి. అస్సాం గణపరిషత్ లాగా పోరాటాల ద్వారానే తెలంగాణను సాధించగలరని ప్రజలకు, విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు, లాయర్లు, జర్నలిస్టులు కలిసి నిర్మాణమైన తెలంగాణ జనసభ విస్తృతంగా తెలంగాణ సమస్యలపై ప్రజలను కదిలించింది. ఇంతకు ముందు పేర్కొన్న ఆశయాలకు అనుగుణంగా ప్రణాళికను తయారు చేసుకొని ఉద్యమించింది.

కరీంనగర్ జిల్లా కేశవపట్నం మండలంలోని కల్వల ప్రాజెక్టు, కాకతీయ కాలువకు చెందిన డి.బి.యం.6,7 కాలువల మరమ్మత్తుల కోసం జనసభ నాయకత్వంలో 33 రోజులపాటు రైతులు పోరాటం చేసి విజయం సాధించారు. పాలమూరులోని గుంటూరు సున్నం కొండారెడ్డి ఆగడాలకు వ్యతిరేకంగా జనసభ, టిఎస్ఎఫ్. పోరాడి బాధితులకు

నాలుగు లక్షల నష్టపరిహారం వచ్చేట్లు చేశాయి. ఈ విధంగా క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలపై పోరాటం చేసి తెలంగాణ ఆవశ్యకతపై ప్రజల్లో చైనత్యం తీసుకొచ్చాయి. 2000 సంవత్సరంలో ప్రజా చైతన్య యాత్రల పేరుతో తెలంగాణ వ్యాప్తంగా 500 గ్రామాలను తిరిగి ప్రజలను చైతన్యం చేయడంలో ఈ రెండు సంస్థలు విశేషమైన కృషి చేశాయి. తెలంగాణ ప్రజలలో వస్తున్న ఈ చైతన్యాన్ని చూసిన నాటి కోస్తాంధ్ర తెలుగుదేశం ప్రభుత్వం జనసభ, టిఎస్ఎఫ్ నాయకత్వంపై, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టింది, దాడులు చేయించింది. జనసభ ఏర్పాటు చేసిన తెలంగాణ కళాసమితి నాయకురాలు బెల్లి లలితను భువనగిరిలో పదిహేడు ముక్కలుగా నరికి చంపారు. ఇదే సంస్థకు చెందిన వరంగల్ జిల్లా తొర్రూర్‌కు చెందిన ప్రజా గాయకుడు ఐలన్నను కూడా హత్య చేశారు. సుదర్శన్, కనకాచారిలాంటి జనసభ నాయకత్వాన్ని హత్య చేశారు. అయినా ఈ సంస్థలు ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడంలో ఏనాడూ భయపడలేదు.

2004 మార్చిలో ఏర్పడిన 'తెలంగాణ విద్యావంతుల వేదిక' భావజాల రంగంలో విశేషమైన కృషి చేసింది. నిర్బంధ కాలంలో జనసభ, టిఎస్ఎఫ్‌లో పనిచేయలేకపోయిన చాలామంది తెలంగాణ విద్యావంతుల వేదికలో భాగస్వాములయ్యారు. అకుంఠిత కార్యదీక్షతో ఈ వేదిక పనిచేసింది. సంస్థకుండే వెసులుబాటువల్ల తెలంగాణ వ్యాప్తంగా పర్యటించి వివిధ సమస్యల్ని వెలుగులోకి తీసుకువచ్చింది. వాటికి అక్షరరూపం ఇచ్చి పుస్తకాలుగా ముద్రించింది. కొన్ని సమస్యలపై ఎన్నికల రాజకీయ నాయకులను కూడా కదిలించి, మధ్యతరగతి ప్రజలలో ఆలోచన రేకెత్తించింది. మరోవైపు తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తి చేయడంలో భాగంగా 'తెలంగాణ స్టడీఫోరం' కూడా ఆవిర్భవించి, తెలంగాణకు వివిధ రంగాల్లో జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తూ అనేక పుస్తకాల్ని ప్రచురించింది. ఇవాళ ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్‌కు తెలంగాణకు సంబంధించిన చాలా సమాచారాన్ని అందించింది కూడా ఈ సంస్థనే.

2004లో వై.ఎస్.రాజశేఖర రెడ్డి అధికారంలోకి వచ్చాక తెలంగాణ ఉద్యమంపై బహుముఖీనమైన దాడిని మొదలుపెట్టాడు. డబ్బు ఆశ చూపి 'తెలంగాణ రాష్ట్ర

సమితి(టీఆర్ఎస్)' ఎమ్మెల్యేలను కూడా కొన్నాడు. తెలంగాణ ఉద్యమం స్తబ్ధతకు గురైంది. ఈ సమయంలో యాభైకి పైగా ప్రజా సంఘాలు కలిసి 'తెలంగాణ ఐక్యకార్యాచరణ కమిటీ'గా ఏర్పడ్డాయి. 2007-08 మధ్యకాలంలో తెలంగాణ ఆంకాంక్షను ప్రజల్లో సజీవంగా ఉంచడానికి ఈ సంస్థ విశేషమైన కృషి చేసింది. పోలవరం, ఓపెన్‌కాస్ట్ మైనింగ్‌కు వ్యతిరేకంగా ప్రజలను కదిలించి భారీ బహిరంగ సభను నిర్వహించి, ప్రత్యేక రాష్ట్రంలోనే సమస్యలు పోతాయని వివరించింది.

ఈ కాలంలో ప్రముఖంగా చెప్పుకోదగిన మరో సంస్థ తెలంగాణ జర్నలిస్టుల ఫోరం. కోస్తాంధ్ర పత్రికల్లో పనిచేస్తూ కూడా తెలంగాణ జర్నలిస్టులు ప్రముఖ పాత్ర నిర్వహించారు. తెలంగాణ ప్రాంత రాజకీయ నాయకులను, ఉద్యమకారులను ఒకే వేదిక మీదికి పిలిచి ఉమ్మడి కార్యక్రమాన్ని ఇవ్వడంలో, దానిపై చర్చించడంలో ఈ సంస్థ ఎంతో కృషి చేసింది. సీమాంధ్ర పాలకులు తెలంగాణ ఉద్యమకారులపై దాడులు చేసినప్పుడు ఆ దుర్మార్గాలను ప్రపంచానికి తెలియజేయడంలో ఈ సంస్థ ముందుభాగాన నిలబడింది. కలం యోధుల సంస్థగా చరిత్రలో విస్మరించలేని పాత్ర నిర్వహించింది. 'ఉస్మానియా యూనివర్శిటీ ఫోరం ఫర్ తెలంగాణ' అనే సంస్థ కూడా ప్రత్యేక తెలంగాణ భావజాల వ్యాప్తిలో విశేషమైన కృషి చేసింది.

ఈ మలిదశ పూర్వార్ధ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఇంతకు ముందు చెప్పిన తెలంగాణ స్టూడెంట్ ఫ్రంట్ (టీఎస్ఎఫ్) చేసిన కృషిని విడిగా ఇక్కడ చర్చించవల్సిన అవసరం ఉంది. దానికి కారణం మలిదశ తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఏర్పడిన ప్రథమ విద్యార్థి సంఘం తెలంగాణ స్టూడెంట్స్ ఫ్రంట్ (టిఎస్ఎఫ్). ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాలకు చెందిన నలభై మంది విద్యార్థులు కలిసి హైదరాబాద్‌లోని నటరాజ్ హోటల్(కాచిగూడ)లో 1998 అక్టోబర్ 13న టిఎస్ఎఫ్‌ను ఏర్పాటు చేసారు. కేవలం భౌగోళిక తెలంగాణ ఏర్పాటు మాత్రమే కాకుండా, ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పనిచేయాలని టిఎస్ఎఫ్ ఆనాటి చర్చల తర్వాత నిర్ణయించుకున్నది. రాజ్యాంగం పౌరులకు హామీపడిన పౌరహక్కులు అమలయ్యే

తెలంగాణనే ప్రజాస్వామిక తెలంగాణ. అంటే వాక్‌స్వాతంత్ర్యం ఉండటం, ప్రజలందరికి కూడు, గూడు, గుడ్డ అందటం, ఐదేళ్లు నిండిన బాలలందరికీ ఉచితంగా విద్య అందటం, ఉన్నత విద్య అందరికీ అందుబాటులో ఉండడం, చదువుకున్న నిరుద్యోగులందరికీ ప్రభుత్వమే ఉపాధి కల్పించడం, దళితులు, ఆదివాసులు గౌరవంగా జీవించడం, బీసీ, ముస్లిం ప్రజల జీవితాలకు భద్రత ఉండడం, స్త్రీలు స్వేచ్ఛగా బతకడం – ఈ అవగాహనతో టిఎస్‌ఎఫ్ తన కర్తవ్యాలను, ఆశయాలను రూపొందించుకొని ప్రణాళికను రాసుకుంది. దీనికి అనుగుణంగా పనిచేసింది.

తెలంగాణ స్టూడెంట్స్ ఫ్రంట్ ఏర్పాటులో ఉస్మానియా, కాకతీయ యూనివర్శిటీల విద్యార్థులు ప్రముఖ పాత్ర నిర్వహించారు. అయితే టిఎస్‌ఎఫ్ ఏర్పాటుకు ముందు మూడు నెలల క్రితమే మహబూబ్‌నగర్ విద్యార్థులు తెలంగాణ స్టూడెంట్స్ ఫోరం పేరు మీద ప్రత్యేక తెలంగాణ కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేట తాలుకా అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో ఐటిడిఎ అధికారుల అక్రమాలకు వ్యతిరేకంగా స్టూడెంట్స్ ఫోరం 500 మంది విద్యార్థులతో ర్యాలీ – ధర్నా నిర్వహించింది. అయితే ఒక నిర్మాణాత్మక సంఘంగా లేని స్టూడెంట్స్ ఫోరం విద్యార్థులు టిఎస్‌ఎఫ్‌లో కలిసిపోయారు. నిజానికి ఫ్రంట్ అంటేనే అందరు కలిసేదని అర్థం. ఆ అవగాహనతోనే తెలంగాణ స్టూడెంట్స్ ఫ్రంట్ పేరును పెట్టుకున్నారు. టిఎస్‌ఎఫ్ ప్రారంభ సమావేశంలో అమరుడు ఆకుల భూమయ్య టిఎస్‌ఎఫ్ విద్యార్థులకు సలహాలు, సూచనలే కాకుండా అనేక ప్రశ్నలకు సమాధానాలు చెప్పి కార్యక్రమం రూపొందించుకోవడంలో సహకరించాడు. టిఎస్‌ఎఫ్ ప్రారంభ సమావేశంలో 8 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక కన్వీనర్ ఎన్నికయ్యారు. టిఎస్‌ఎఫ్ ఏర్పడేనాటికి సీమాంధ్ర ప్రభుత్వం తీవ్ర నిర్బంధం కొనసాగిస్తోంది. కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలను నెరవేర్చడానికి వచ్చిన చంద్రబాబు నాయుడు వైశ్రాయ్ హోటల్ కుట్ర ద్వారా ముఖ్యమంత్రి అయ్యాడు. ఒక రకంగా ప్రపంచబ్యాంకు నేరుగా పరిపాలిస్తుందా అనే సందేహం వచ్చేలా చంద్రబాబు విధానాలు కొనసాగిన కాలమది. విద్యారంగం పూర్తిగా ప్రైవేట్ వ్యక్తుల(శ్రీ చైతన్య, నారాయణ) చేతుల్లోకి వెళ్లింది. ఆర్ట్స్ కోర్సులు రద్దు చేసి కంప్యూటర్ కోర్సులకు ప్రాధాన్యత ఇచ్చాడు.

బహుళ జాతి కంపెనీల ప్రయోజనాలను నెరవేర్చే విద్యనే ఆనాడు చంద్రబాబు నాయుడి 'విజన్ 2020' లక్ష్యంగా ఉండింది. విద్యార్థులను సామాజిక అవగాహనకు దూరం చేస్తూ కేవలం కెరియరిజం వైపు మళ్లించాడు. డీఎస్సీ, పోలీస్ ఉద్యోగాలను విరివిగా భర్తీ చేశాడు. మిగతా విద్యార్థులు విదేశాలకు వెళ్లి డాలర్లు సంపాదించాలని ఊదరగొట్టాడు. క్యాంపస్‌లలో విద్యార్థులంతా పుస్తకాల పురుగులుగా మారిపోయారు. ఉద్యమాలంటే విద్యార్థులు ఆమడ దూరం పరిగెత్తే పరిస్థితి నెలకొన్నది. విద్యార్థి సంఘాలన్నీ నామమాత్రంగానే పనిచేస్తున్నాయి. విప్లవ, వామపక్ష సంఘాలే కాకుండా బూర్జువా పార్టీల అనుబంధ సంఘాలు ఎన్ఎస్‌యూఐ, టిఎన్ఎస్ఎఫ్, ఎబివివిలతో సహా అన్ని సంఘాలది అదే పరిస్థితి. తెలంగాణ సమాజంపై వలసాంధ్ర ప్రభుత్వం చేస్తున్న దమనకాండ, అన్యాయాలు, వివక్షలు– ఈ పరిస్థితులను పట్టించుకునే స్థితిలో నాటి విద్యార్థి సంఘాలు లేకుండా పోయాయి. ఇట్లా తెలంగాణ గురించి మాట్లాడే వాతావరణం విద్యారంగంలో లేకుండాపోయింది. ఆనాటికున్న విద్యార్థి సంఘాల్లో చాలామటుకు తెలంగాణను వ్యతిరేకించేవే ఉన్నాయి. ఇట్లాంటి ఒక అననుకూల పరిస్థితిలో టిఎస్ఎఫ్ పుట్టింది. ఒకరకంగా నిప్పుల కొలిమిలో పుట్టి నిప్పులగుండంలో ప్రయాణించాల్సిన పరిస్థితి టిఎస్ఎఫ్‌కు ఏర్పడింది. అయినా చరిత్రలో తన కర్తవ్యాన్ని నెరవేర్చడానికి బయల్దేరింది. రాష్ట్రకమిటీ ఏర్పాటయ్యాక అన్ని జిల్లా, తాలుకా కమిటీలను ఏర్పాటు చేసే కార్యక్రమం తీసుకున్నది. 'నిర్మాణం – అవగాహన – పోరాటం' అనే నినాదంతో ముందుకు సాగిన ఈ సంఘం మూడు నెలల్లోనే పది జిల్లాల కమిటీలను ఏర్పాటు చేసింది. ఆ తర్వాత తమ విద్యార్థి సంఘం సభ్యులకు ప్రజాస్వామ్య తెలంగాణ సాధన మీద శిక్షణ తరగతులు నిర్వహించింది.

టిఎస్ఎఫ్ వినూత్నమైన పనివిధానాన్ని ఎంపిక చేసుకుంది. స్తబ్దంగా ఉన్న తెలంగాణ సమాజాన్ని ఉద్యమంలోకి తీసుకురావడానికి వివిధ కార్యక్షేత్రాల్లోకి వెళ్లింది. మొదట ఆంధ్ర వలస వ్యాపారవేత్త సున్నం కొండారెడ్డి బలవంతంగా తనవద్ద పనిచేయించుకుంటున్న బాలకార్మికుల్ని విముక్తి చేసి, వారికి లక్షల్లో నష్టపరిహారం ఇచ్చేదాక పోరాడింది. అట్లే పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణ మీద

బోధనలు చేసింది. తెలంగాణ వ్యాప్తంగా గోడరాతల క్యాంపెయిన్ తీసుకుని తెలంగాణకు సకల రంగాల్లో జరిగిన అన్యాయాలను తెలియజేసింది. 610 జీవో అమలు చేయడం కోసం రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన 500 విద్యార్థులతో ఇందిరాపార్కు వద్ద రోజంతా ధర్నా నిర్వహించింది. పరీక్షలు కాగానే హాస్టల్స్ మూసివేసి విద్యార్థులు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం లేకుండా చేయాలని చూసిన ఉస్మానియా విశ్వవిద్యాలయం వీసీకి వ్యతిరేకంగా పదిరోజులు ఉద్యమం చేసి, చివరికి మూడు రోజులు ఆమరణ నిరాహార దీక్షకు కూర్చున్నారు. ఆనాటికి ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నుండి పదిమంది ఎమ్మెల్యేలు వచ్చి విద్యార్థుల పోరాటానికి సంఘీభావం తెలియజేశారు. కానీ వీసీ మాత్రం అణచివేత వ్యూహాన్ని అమలుచేస్తూ 200 మంది టాస్క్‌ఫోర్స్ పోలీసుల్ని దించి దీక్షను చెదరగొట్టించి, నాయకత్వాన్ని కిడ్నాప్ చేయించాడు. విద్యార్థుల ఉద్యమంతో చివరికి వారిని విడిచిపెట్టారు.

ఇంతకుముందు చెప్పిన తెలంగాణ జనసభ చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో టిఎస్ఎఫ్ క్రియాశీలకంగా పాల్గొంటూ 700 గ్రామాలను తిరిగి, గ్రామ కూడళ్లలో ప్రజల్ని సమీకరించి, తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాలను వివరించింది. వీరికి తోడు తెలంగాణ కళాసమితి వారు పాటలు పాడుతూ ప్రజల్ని చైతన్యం చేసేవారు. ఇక్కడ విశేషం ఏమిటంటే ఈ యాత్రల్లో పాల్గొన్నవారు ప్రజల దగ్గరే పడుకుంటూ, వారు పెట్టిన తిండినే తిన్నారు.

తెలంగాణలో జరుగుతున్న దోపిడీ కేవలం కోస్తాంధ్ర పాలకుల వల్లనే కాకుండా దీని వెనుక సామ్రాజ్యవాద అభివృద్ధి నమూనా ఉందనేది టిఎస్ఎఫ్ అవగాహన కనుక ప్రపంచీకరణ, ప్రపంచబ్యాంకు షరతులు, బహుళజాతి కంపెనీల దోపిడి, అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగిన అన్ని రకాల పోరాట రూపాలలో టిఎస్ఎఫ్ ముందుభాగాన నిలబడింది. ఆనాడు సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు వ్యతిరేకంగా ఏర్పడిన ఫేగ్ (ఫోరం అగైనెస్ట్ గ్లోబలైజేషన్)లో భాగస్వామ్యం తీసుకుని పనిచేసింది. దీంతో టిఎస్ఎఫ్‌ను అణచివేయాలని ప్రభుత్వం కుట్రలు పన్నింది. ఆనాడు తెలంగాణలో

పనిచేస్తుండిన పీపుల్స్‌వార్‌తో సంబంధాలున్నాయనే ఆరోపణలు చేస్తూ భౌతిక దాడులు చేసింది. నల్గొండ జిల్లా నాయకత్వం మొత్తాన్ని అరెస్టు చేసి హింసించింది. కల్వకుర్తిలో తాలుకా స్థాయి సదస్సు నిర్వహించ తలపెట్టిన టిఎస్ఎఫ్ నాయకత్వాన్ని చంపడానికి ప్రయత్నించింది. రాష్ట్ర కమిటీ సభ్యుడైన కాశీంను గుర్తుతెలియని వ్యక్తుల పేరుమీద రాల్లు, కారంపొడి, నాన్‌చాక్‌లతో దాడి చేయించింది. నెత్తుటిమడుగులో పడిపోయిన కాశీం చనిపోయాడని వదిలేసి వెళ్లిపోయింది. ఆ తర్వాత టిఎస్ఎఫ్ మొదటి కన్వీనర్ నాగరాజును వరంగల్ పోలీసులచేత అరెస్టు చేయించి తీవ్ర చిత్రహింసలకు గురిచేసింది. పాలమూరు జిల్లా కమిటీ సభ్యుడైన పరశురాం, మోహన్ రెడ్డి, విజయ్, కిష్టన్నలను వనపర్తి పోలీసులు అరెస్టు చేసి కస్టడీలోనే చిత్రహింసలు పెట్టారు. ఆ తర్వాత టిఎస్ఎఫ్ కన్వీనర్ కాశీం, కో-కన్వీనర్ స్నేహలను మహబూబ్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి రాజద్రోహం కేసు పెట్టారు. తెలంగాణ వ్యాప్తంగా పనిచేస్తున్న టిఎస్ఎఫ్ నాయకత్వమైన ఐలన్న, శ్రీకాంత్, రమేశ్, పరశురాం, ప్రసాద్, మల్లేశ్, మనోహర్, మురళి, దప్పు సురేందర్‌లను రాజ్యాంగ వ్యతిరేక పద్ధతుల్లో దారుణంగా చంపేసింది. ఆ తర్వాత కాశీం ఇంటిమీద అర్ధరాత్రి దాడి చేసి వేలాది పుస్తకాలు, టిఎస్ఎఫ్ కరపత్రాలు, రిపోర్టులను పోలీసులు ఎత్తుకుపోయారు. మొత్తంగా ఆనాడు తీవ్ర నిర్బంధం నడుమ టిఎస్ఎఫ్ రాజీలేని, మడమ తిప్పని పోరాటం చేసింది.

టిఎస్ఎఫ్‌లో ఆనాడు పనిచేసిన కార్యకర్తలు, నాయకులు తర్వాతికాలంలో తెలంగాణ వ్యాప్తంగా న్యాయవాదులుగా, ఉపాధ్యాయులుగా, అధికారులుగా, ప్రొఫెసర్లుగా, జర్నలిస్టులుగా, ప్రజాసంఘాల నాయకులుగా, చేయి తిరిగిన రచయితలుగా, పత్రికా సంపాదకులుగా తమ కృషిని కొనసాగించారు. 2009లో మొదలైన ఉత్తరార్ధ ఉద్యమంలో వీరే చురుకైన పాత్రను పోషించారు.

మరోవైపు 2001, ఏప్రిల్ 27న కల్వకుంట్ల చంద్రశేఖరరావు(కేసీఆర్) నాయకత్వంలో ఏర్పడిన 'తెలంగాణ రాష్ట్ర సమితి(టీఆర్ఎస్)' ఎన్నికల రాజకీయాల్లో ప్రత్యేక తెలంగాణ వాదాన్ని బలంగా వినిపించింది. బలమైన రాజకీయ పార్టీగా

తెలంగాణలోనే కాకుండా దేశవ్యాప్తంగా ప్రత్యేక తెలంగాణ నినాదాన్ని వినిపించింది. పార్లమెంటరీ రాజకీయ పార్టీ కావడం మూలంగా టీఆర్ఎస్ పార్టీకి వచ్చిన విశాల ఆమోదాన్ని ఉపయోగించుకుంటూ, సీమాంధ్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు చేస్తున్న మోసాన్ని విస్తృతంగా ప్రచారం చేసింది. అసెంబ్లీలో తెలంగాణకు సకల రంగాల్లో జరుగుతున్న అన్యాయాలను ఎత్తిచూపింది. మొత్తంగా తెలంగాణ ప్రజలకు ఒక ప్రత్యామ్నాయ, స్థానిక రాజకీయ పార్టీగా నిలబడి తెలంగాణ వాదాన్ని ఢిల్లీకి తీసుకెళ్లింది. ఈ క్రమంలో సీమాంధ్ర ప్రభుత్వం అనేక నిరాధారమైన కుట్రల్ని, ఆరోపణల్ని చేస్తూ టీఆర్ఎస్‌ను అణచివేయాలని చూసినా అవి ఫలించలేదు. అంతకుముందే తెలంగాణ జనసభ, తెలంగాణ కళాసమితి, తెలంగాణ స్టూడెంట్స్ ఫ్రంట్ ప్రజల్లో తెలంగాణ అంశం పట్ల తీసుకువచ్చిన చైతన్యాన్ని ఈ పార్టీ ఉపయోగించుకుంటూ గ్రామస్థాయి నుంచే నిర్మాణాన్ని చేపట్టి సంప్రదాయ పార్టీల పనివిధానాన్ని అమలు చేసింది. ఈ క్రమంలో 2004 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకుని 26 అసెంబ్లీ స్థానాలను, 5 పార్లమెంట్ స్థానాలను గెలుచుకున్నది. అయితే ఈ పొత్తు వెనుక కాంగ్రెస్ తెలంగాణ ఇస్తుందన్న నమ్మకం బలంగా ఉన్నది. కానీ కాంగ్రెస్ నమ్మకద్రోహం చేయడంతో 2006 సెప్టెంబర్‌లో కేంద్రానికి తన మద్ధతును ఉపసంహరించుకున్నది. 2006 సెప్టెంబర్ 13న కేసీఆర్ కరీంనగర్ లోక్ సభ స్థానంకోసం ఉపఎన్నికకు వెళ్లి భారీ మెజార్టీతో గెలిచి తెలంగాణ వాదాన్ని చాటిచెప్పాడు. అధికార కాంగ్రెస్ పార్టీ బడ్జెట్ సెషన్స్‌లోనైనా తెలంగాణ అంశాన్ని మాట్లాడుతుందని నమ్మిన టీఆర్ఎస్, అలా జరగకపోవడంతో 2008లో అందరు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ పదవులకు రాజీనామా చేశారు. 2008 మే 29న జరిగిన ఉప ఎన్నికల్లో 16 అసెంబ్లీ స్థానాలకుగాను ఏడింటిని, 4 లోక్‌సభ స్థానాలకుగాను రెండింటిని గెలిచింది. అయితే ఈ ఓడిపోయిన స్థానాల్లో కాంగ్రెస్ స్వయంగా తెలంగాణ వాదానికి బలమైన వ్యతిరేకిగా నిలబడి పనిచేయడంవల్లనే ఆ ఫలితాలు వచ్చాయని, తెలంగాణకు కాంగ్రెస్ మళ్లీ మోసం చేసిందని ఆనాటి పత్రికలు ప్రచురించిన వార్తల ద్వారా తెలుస్తుంది.

ఇట్లా మలిదశ పూర్వార్ధ తెలంగాణ ఉద్యమంలో ఒకవైపు విద్యార్థి, ప్రజా, కళా

సాంస్కృతిక సంఘాలు, మరోవైపు పార్లమెంటరీ రాజకీయ పార్టీ, తెలంగాణ నినాదానికి దేశవ్యాప్తమైన ప్రచారాన్ని కల్పించడంలోనూ, ఈ ఉద్యమం న్యాయమైనదే అని అర్థం చేయించడంలోనూ సఫలమయ్యాయనే చెప్పాలి.

## 2.4. మలిదశ ఉత్తరార్ధం

పూర్వార్ధ ఉద్యమం ప్రజల్లో చేసిన భావజాలవ్యాప్తి, తీసుకువచ్చిన చైతన్యం, చేసిన ఉద్యమం వలన తెలంగాణ ప్రజల్లో ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుపట్ల బలమైన అభిప్రాయాలు ఏర్పడ్డాయి. దీనికి తార్కాణం 2009 సాధారణ ఎన్నికలు. ఆనాడు దాదాపు అన్ని పెద్ద రాజకీయ పార్టీలు తెలంగాణ ఇస్తామనో, తెస్తామనో చెప్పకుండా తెలంగాణ ప్రజల్లోకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. అయితే సిపిఐ(ఎం) తెలంగాణకు వ్యతరేకం కాబట్టి మిన్నకుండిపోయింది. ఎంఐఎం కూడా సిపిఐ(ఎం)బాటనే అనుసరించింది. ఈ రెండు పార్టీలు మినహాయించి అన్నిపార్టీలు తెలంగాణ నినాదాన్ని ముందుపెట్టుకునే ప్రచారంలోకి దిగాయి. సిపిఐ తమను గెలిపిస్తే తెలంగాణ ఏర్పాటుకు తమ సంపూర్ణ మద్ధతు ఉంటుందని ప్రకటించింది. తెలుగుదేశంపార్టీ తమను గెలిపిస్తే మొదటి శాసన సభ సమావేశంలోనే తెలంగాణ బిల్లును ప్రవేశపెడతామన్నది. సినిమా నటుడు చిరంజీవి స్థాపించిన 'ప్రజారాజ్యం పార్టీ', తమను గెలిపిస్తే సామాజిక తెలంగాణ సాధనకోసం కృషి చేస్తామని వాగ్ధానం చేసింది. తెలంగాణను ఇవ్వగలిగేదీ, తేగలిగేదీ కాంగ్రెస్ కాబట్టి, తమను గెలిపిస్తే తెలంగాణ ఖాయమని కాంగ్రెస్ అన్నది. బీజేపీని గెలిపిస్తే వంద రోజుల్లోనే తెలంగాణ తెస్తామని ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పడిందే తెలంగాణ కోసం కనుక ఆ పార్టీ సంగతి చెప్పనక్కరనే లేదు. మొత్తం రాజకీయ పరిణామాలు ఇలా ఉన్న సన్నివేశంలో చారిత్రకంగానే తెలంగాణకు వ్యతిరేకిగా ఉన్న కాంగ్రెస్‌ను ఓడించడమే లక్ష్యంగా తెలుగుదేశం, టీఆర్ఎస్, సిపిఐ, సిపిఐ(ఎం)లు కలిసి మహాకూటమిగా ఏర్పడ్డాయి. కాంగ్రెస్, ఎంఐఎం జట్టుగా ఏర్పడలేదుగాని అవగాహనలో కలిసి పోటీలోకి దిగాయి. ప్రజారాజ్యం, బీజేపీలు ఒంటరిగానే పోటీకి దిగాయి.

సరిగ్గా ఎన్నికల ముందు కాంగ్రెస్ మాటమార్చింది. నేరుగా నాటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి, తెలంగాణ ఏర్పాటుకు వ్యతిరేకంగా మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే హైదరాబాద్‌కు వెళ్లడానికి సీమాంధ్ర ప్రజలు పాస్‌పోర్టులు తీసుకోవల్సి వస్తుందనీ, పైగా కృష్ణ గోదావరి నీళ్లు దొరకక సీమాంధ్ర ఎడారిగా మారుతుందని రెచ్చగొట్టాడు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణలో ఒకమాట, రాయలసీమ(నంద్యాల)లో ఒకమాట చెప్పిన కాంగ్రెస్ దురుద్దేశాలను తెలంగాణ ప్రజలు సరిగ్గా అర్థం చేసుకోలేకపోయారు. ఫలితంగా కాంగ్రెస్ అత్యధిక అసెంబ్లీ స్థానాలను సంపాదించి ప్రభుత్వాన్ని ఏర్పర్చింది. అయితే ఇక్కడ తెలంగాణ వాదం ఓడిపోలేదు. ఎందుకుంటే టీఆర్ఎస్, తెలంగాణ విద్రోహ పార్టీలైన తెలుగుదేశం, సీపీఐ(ఎం)లతో మహాకూటమిలోకి వెళ్లడాన్ని ప్రజలు, ప్రజాసంఘాలు జీర్ణించుకోలేకపోయాయి. కనుకనే మహాకూటమికి ఓటమిని కట్టబెట్టాయి.

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎప్పటిలాగానే తెలంగాణ గురించి పట్టించుకోలేదు. మిగతా రాజకీయ పార్టీలు కూడా ఎన్నికల ప్రహసనం ముగిసింది కాబట్టి ఎవ్వరూ తెలంగాణ మాట ఎత్తలేదు. టీఆర్ఎస్ ఒంటరిదైంది. పైగా అంతర్గతంగానే చాలా సంక్షోభాలు చవిచూడవల్సి వచ్చింది. రాజకీయ పార్టీల పరిస్థితి ఇలా ఉన్న సందర్భంలోనే ప్రజాసంఘాలు తమ సామాజిక బాధ్యతను నెరవేరుస్తూ పలుచోట్ల తెలంగాణకోసం సభలు, కార్యక్రమాలు నిర్వహించాయి. సరిగ్గా ఈ సమయంలోనే ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి అకాల మరణం రాష్ట్ర కాంగ్రెస్‌లో కుమ్ములాటకు దారితీసి, తెలంగాణ ఉద్యమం రాజుకోవడానికి అవకాశం కల్పించింది.

మరోవైపు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 2009 అక్టోబర్ 9న హైదరాబాద్ ఫ్రీజోన్ అని తీర్పిచ్చింది. వాస్తవానికి తెలంగాణలోని ఆరుజోన్లలో భాగంగా హైదరాబాద్ ఆరవ జోన్‌లో ఉండవల్సింది. కానీ సీమాంధ్ర ఉద్యోగులకు, విద్యావకాశాలకు, వ్యాపారాలకు ఉపయోగపడేవిధంగా హైదరాబాద్‌ను ఫ్రీజోన్‌గా ఉంచాలని సీమాంధ్రులు ప్రతిసారీ పట్టుబట్టేవారు. దాని ఫలితంగానే సుప్రీంకోర్టు తెలంగాణ ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా

తీర్పునిచ్చింది. తెలంగాణ ప్రభుత్వంగాని, ఇతర రాజకీయ పార్టీలుగాని దీనికి ప్రతివాదనలు వినిపించడంలో విఫలమైపోయాయి. సరిగ్గా ఇలాంటి స్థితిలో తెలంగాణ ఉద్యమం ముందుకు వచ్చింది. తెలంగాణ ఉద్యోగ సంఘాలు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు, ముఖ్యంగా ఉస్మానియా విద్యార్థి సంఘాలు హైదరాబాద్‌ను ఆరవజోన్‌లో భాగంగానే ఉంచాలని ఉద్యమం మొదలు పెట్టాయి. తెలంగాణ ఉద్యోగ సంఘాలన్నీ జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ)గా ఏర్పడ్డాయి. టీఆర్ఎస్ దీనికి మద్ధతుగా నిలబడింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌ను ఫ్రీజోన్‌గా ప్రకటించడాన్ని నిరసిస్తూ 2009 అక్టోబర్ 11న సిద్ధిపేటలో భారీ బహిరంగ సభ జరిగింది. ఉద్యోగ గర్జన పేరిట జరిగిన ఈ సభకు లక్షలాదిమంది తెలంగాణ ఉద్యోగులు మాత్రమే కాకుండా ప్రముఖ సామాజికవేత్త స్వామి అగ్నివేష్ కూడా హాజరై ఆ తీర్పును వ్యతిరేకించారు. ఈ సభలోనే టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 'తెలంగాణ వాలే జాగో, ఆంధ్రవాలే బాగో' అనే నినాదం ఇచ్చాడు. తెలంగాణ రాష్ట్రం ఇవ్వకపోతే తాను పుట్టిన సిద్ధిపేట ప్రాంతంలోనే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించాడు. ఒకరకంగా తెలంగాణ సమాజం మొత్తం ఈ సభతో కదలికలోకి వచ్చింది. పైగా కేసీఆర్ ఆవేశపూరిత ప్రసంగంలో 'కేసీఆర్ శవయాత్రలో పాల్గొంటారో, తెలంగాణ జైత్రయాత్రలో పాల్గొంటారో నిర్ణయించుకోండి' అని ప్రజలకు పిలుపునివ్వడం ఆనాడు సంచలనంగా నిలిచింది. అయినా రాష్ట్ర ప్రభుత్వంవైపునుండిగాని, కేంద్రంవైపు నుండి గానీ ఎటువటి స్పందన రాలేదు. టీఆర్ఎస్ దీక్షా ప్రయత్నాలు ప్రారంభించింది. తెలంగాణలోని ఉద్యోగ ప్రజాసంఘాలు టీఆర్ఎస్‌కు మద్ధతుగా నిలిచారు. దీనికి సమాంతరంగా తెలంగాణలోని ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు, టీఆర్ఎస్‌ను నమ్మని తెలంగాణ ఉద్యోగ సంఘాలు కూడా తెలంగాణ ఉద్యమంలోకి క్రియాశీలకంగా వచ్చాయి. ఇదే సమయంలో తెలంగాణ విద్యార్థులు వరంగల్ కాకతీయ యూనివర్శిటీలో జరిపిన సభ చారిత్రాత్మకమైనది. 2009 నవంబర్ 22న లక్షలాదిమంది విద్యార్థులతో కాకతీయ యూనివర్శిటీలో భారీ బహిరంగ సభ జరిగింది. ఆ సభకు కేసీఆర్ హాజరై గతంలో మాదిరిగానే 'కేసీఆర్ చచ్చుడో, తెలంగాణ వచ్చుడో' అని ప్రకటించాడు. తెలంగాణ చరిత్రలోనే గొప్ప పోరాట వారసత్వంగా నిలిచిన ఉస్మానియా విద్యార్థులు కూడా ఉద్యమంలోకి వచ్చారు. అప్పటికే కేసీఆర్ ప్రకటించిన నవంబర్ 29

ఆమరణ నిరాహార దీక్షకు మద్ధతుగా యూనివర్శిటీలోని ఆర్ట్స్ కాలేజీ దగ్గరి నుండి అసెంబ్లీ ముందటి గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. 2009 అక్టోబర్ 28న టీఆర్ఎస్ తెలంగాణ సాధన కోసం ఎంతటి ఉద్యమానికైనా, త్యాగాలకైనా సిద్ధపడాలని, జైల్ బరో కార్యక్రమానికి పిలుపునివ్వడంతో ఉద్యమంలో వేడి పుట్టింది. సరిగ్గా ఈ సమయంలోనే సీమాంధ్ర ప్రభుత్వం ఎలాగైనా కేసీఆర్ తలపెట్టిన దీక్షన భగ్నం చేయాలని అనేక కుట్రలు పన్నింది. సిద్ధిపేట్ పరిసర ప్రాంతాలను పోలీసు నిర్బంధంలోకి తీసుకున్నది. అయినా కుట్రలన్నింటిని భగ్నం చేస్తూ నవంబర్ 28 నాటికే లక్షలాదిమంది తెలంగాణవాదులు సిద్ధిపేట దీక్షాస్థలికి చేరుకున్నారు. నవంబర్ 29న కరీంనగర్‌లోని ఉత్తరతెలంగాణ టీఆర్ఎస్ భవనం నుండి దీక్షా స్థలానికి బయలుదేరిన కేసీఆర్‌ను, ఇతర టీఆర్ఎస్ నాయకులను, ప్రొఫెసర్ జయశంకర్‌ను, ఇతర తెలంగాణ నాయకులను అలుగునూరు సెంటర్లో పోలీసులు అడ్డగించారు. అందరినీ వదిలిపెట్టి వ్యూహాత్మకంగా కేసీఆర్‌ను అరెస్టు చేసి ఖమ్మం తరలించారు. దాంతో తెలంగాణలోని అన్ని ప్రాంతాల్లో ఉద్యమం తీవ్రస్థాయికి చేరుకున్నది. కేసీఆర్ అరెస్టు చేయడమంటే తెలంగాణను అరెస్టు చేయడమే అన్నట్లుగా భావించిన వివిధ ప్రాంతాల్లోని తెలంగాణ ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు రోడ్లమీదకి వచ్చి ధర్నాలు, రాస్తారోఖోలు, ర్యాలీలు నిర్వహించారు. దాంతో పోలీసులు పలుచోట్ల కర్ఫ్యూలు విధించి, లాఠీఛార్జీలు చేశారు. ఈ నేపథ్యంలో ఉద్యమం మరింత తీవ్రతరమైంది. కేసీఆర్ ఖమ్మం జైల్లోనూ దీక్షను కొనసాగించాడు. దాంతో ఆయన ఆరోగ్యం క్షీణించి 2009 నవంబర్ 30న ఖమ్మం జైలునుండి ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో కేసీఆర్ రాత్రి 7 గంటలకు పండ్లరసం తాగి దీక్ష విరమిస్తున్నట్లు మీడియాలో ప్రసారమైంది. దాంతో తెలంగాణలోని విద్యార్థిలోకం భగ్గున మండింది. ఉస్మానియా విద్యార్థులు, ఇక ఉద్యమాన్ని రాజకీయ పార్టీల చేతుల్లో పెట్టి మోసపోవడం కంటే తామే ఉద్యమాన్ని నిర్వహిస్తామని ముందుకు వచ్చి 2009 నవంబర్ 30న పలు విద్యార్థి సంఘాలతో కలిసి 'జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసి)'గా ఏర్పడ్డారు. దాంతో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణ ఉద్యమానికి కేంద్రంగా మారిపోయింది. తెలంగాణ వ్యాప్తంగా ఒకవైపు కేసీఆర్‌కు వ్యతిరేకంగా, మరోవైపు సీమాంధ్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం మిన్నంటింది.

ఈ పరిస్థితులను గమనించిన కేసీఆర్ తాను ఉద్యమం విరమించలేదని, పోలీసులే బలవంతంగా దీక్షను భగ్నం చేసేందుకు ప్రయత్నించారని, తాను చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నానని, తాను చచ్చుడో తెలంగాణ వచ్చుడో అని పునరుద్ఘాటించాడు.

మునుపెన్నడూ లేనంత నిర్మాణాత్మకంగా తెలంగాణ ఉద్యమం రూపొందింది. తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలు తమతమ కార్యక్షేత్రాల్లో జేఏసీలను ఏర్పాటు చేసుకున్నారు. అదే విధంగా కళా సాంస్కృతిక సంస్థలు, విద్యార్థి సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ఎన్జీవోలు, రైతులు, కార్మికులు, కర్షకులు– ఇట్లా తెలంగాణ ప్రజలందరూ వివిధ జేఏసీలుగా ఏర్పడి ఉద్యమంలోకి దిగారు. దాంతో తెలంగాణ సమాజం మొత్తం మూకుమ్మడిగా తెలంగాణ కావాలని కోరుకుంది. ఈ పరిస్థితిని గమనించిన వలసాంధ్ర ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని అమలు చేసి వేలాదిమంది విద్యార్థుల్ని, ఉద్యోగుల్ని అరెస్టు చేసి అక్రమ కేసుల్ని బనాయించి జైల్లకు పంపింది. ఈ పరిణామాలు జరుగుతున్న కాలంలో 2009 డిశెంబర్ 3న ఉదయం 3 గంటలకు కేసీఆర్‌ను ఖమ్మం ఆసుపత్రి నుండి హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. తెలంగాణలో వాతావరణం ఉద్రిక్తంగా మారడంతో ఆపద్ధర్మ ముఖ్యమంత్రి రోషయ్య ఢిల్లీ వెళ్లి సోనియాగాంధీని, మన్మోహన్ సింగ్‌లను కలిసి నివేదికలిచ్చాడు. ఆ తర్వాత మీడియాలో మాట్లాడుతూ సమస్య అధిష్టానం చేతుల్లో ఉందని, తాము ప్రత్యేకంగా ఏమీ చేయలేమని ప్రకటించాడు. అదే తేదీన (డిశెంబర్ 2) తెలంగాణ రాష్ట్ర సమితి నాయకులు ఢిల్లీ వెళ్లి వివిధ యూపిఏ భాగస్వామ్య పార్టీలను కలిసి తెలంగాణ అంశం గురించి మాట్లాడారు. మద్ధతును కూడగట్టారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే తెలంగాణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆనాడు కేంద్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీజేపీ తెలంగాణకు పూర్తి మద్ధతునిస్తున్నట్లు ప్రకటించింది.

ఈ క్రమంలో తెలంగాణలోని అన్ని రాజయకీయ పార్టీల నాయకులు కేసీఆర్ చేత దీక్ష విరమింపజేసే ప్రయత్నం చేసి విఫలమయ్యారు. మరోవైపు విద్యార్థులు 2009 డిశెబర్ 7న ఉస్మానియా యూనివర్శిటీలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు 10 లక్షలమందికి

పైగా హాజరయ్యారు. ఆ సభలోనే ఉస్మానియా జేఏసీ డిశెంబర్ 10న అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చింది. అప్పటికే తెలంగాణ వ్యాప్తంగా అన్ని యూనివర్శిటీలు, పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులు వీరోచితంగా పోరాటంలో ఉండడంతోపాటు, విధ్వంసక కార్యక్రమాలకు కూడా పూనుకోవడంతో కాంగ్రెస్ పార్టీకి దిక్కుతోచకుండా అయ్యింది. అదే సమయంలో దేశంలోని దాదాపు అన్ని రాజకీయ పార్టీలు కూడా కాంగ్రెస్‌ను తెలంగాణ ఇవ్వాల్సిందే అని ఒత్తిడి పెట్టడంతో కాంగ్రెస్ పార్టీ అనేక అంతర్గత సమావేశాలు నిర్వహించింది. చివరికి 2009 డిశెంబర్ 9 తేదీ రాత్రి 11.30 నిమిషాలకు కేంద్ర హోంమంత్రి చిదంబరం తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. దాంతో తెలంగాణ సమాజం మొత్తం వేడుకల్లో మునిగిపోయింది. కేసీఆర్ వెంటనే దీక్ష విరమించాడు.

సరిగ్గా ఈ సమయంలోనే సీమాంధ్ర ప్రాంతానికి చెందిన 140 మంది ఎమ్మెల్యేలు, 20 మంది ఎంపీలు, 30 మంది ఎమ్మెల్సీలు రాజీనామా చేసి, తెలంగాణ ఏర్పాటు నిర్ణయానికి వ్యతిరేకంగా నిలబడ్డారు. సీమాంధ్రలోని అన్ని ప్రాంతాల్లో తెలంగాణకు వ్యతిరేకంగా ప్రతిఘాతుక ఉద్యమం మొదలైంది. తెలంగాణ ఉద్యమం ఎంత సృజనాత్మకమైన పోరాట రూపాలను ఎన్నుకున్నదో అవే రూపాలను అక్కడ తిరిగి చేపడుతూ తెలంగాణ ఉద్యమాన్ని దుష్ప్రచారం చేయడం, తెలంగాణ నాయకుల మీద దుమ్మెత్తిపోయడం, విద్యార్థి నాయకత్వాన్ని కించపరిచే మాటలతో దూషించడం వంటివి చేశారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ అఖిలపక్ష సమావేశంలో తెలంగాణకు తమ మద్ధతు ప్రకటించిన సీమాంధ్ర పార్టీలు తెలంగాణ ఏర్పాటు ప్రకటన రాగానే యూటర్న్ తీసుకున్నాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం 2009 డిశెంబర్ 23న మళ్లీ ఒక ప్రకటన చేసింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై తలెత్తిన వివాదంలో డిశెంబర్ 7న నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఏకాభిప్రాయం వ్యక్తమైందనీ, వాటి ప్రకారమే డిశెంబర్ 9న ప్రకటన చేశామని, ఆ తర్వాత రాష్ట్రంలోని పరిస్థితులు మారిపోయాయని, కనుక రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలతో, గ్రూపులతో విస్తృతస్థాయి చర్చలు జరపాల్సి ఉన్నదనీ, అప్పటిదాకా ఇరుప్రాంతాల్లోని ఉద్యమకారులు శాంతియుతంగా ఉండాలని

ఆ ప్రకటన సారాంశం. స్థూలంగా చెప్పదల్చుకున్న విషయం తెలంగాణ ప్రకటనను వెనక్కి తీసుకుంటున్నామని.

ఈ పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉన్న రాజకీయ పార్టీలన్నీ రెండుగా చీలిపోయాయి. తెలంగాణ ప్రజాప్రతినిధులు తమ పదవులకు రాజీనామాలు ఇచ్చారు. 2009 డిశెంబర్ 24న హైదరాబాద్‌లోని కళింగ భవన్‌లో తెలంగాణ కాంగ్రెస్, తెలంగాణ ప్రజారాజ్యం, బీజేపీ, టీఆర్ఎస్, ఎన్జీవో సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, కార్మిక సంఘాలు, రయితలు కలిసి 'తెలంగాణ రాజకీయ, ప్రజా సంఘాల జేఏసీ' ఏర్పడింది. ఈ కమిటీకి మలిదశ తెలంగాణ పూర్వార్ధ ఉద్యమంలో విశేషమైన కృషి చేసిన తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు కోదండరామ్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జేఏసీ ఏర్పడిన తర్వాత 2009 డిశెంబర్ 30న 'తెలంగాణ బంద్'కు పిలుపునిచ్చింది. దాంతో జేఏసీలోని భాగస్వామ్య పార్టీల, ప్రజాసంఘాల ప్రజలతోపాటు తెలంగాణ సమాజం అంతా స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని విజయవంతం చేశారు. ఈ పరిణామాలు జరుగుతున్న కాలంలోనే 2009 డిశెంబర్ 24 నుండి ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో 18 మంది విద్యార్థులు ఆమరణ నిరాహార దీక్షకు కూర్చున్నారు. ఈ విద్యార్థుల దీక్షకు మద్ధతుగా తెలంగాణలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో, కళాశాలల్లో, పాఠశాలల్లోని విద్యార్థులు దీక్షలు ప్రారంభించారు. వీరికి మద్ధతుగా తెలంగాణలోని అన్ని యూనివర్శిటీల అధ్యాపకులు కలిసి 2009 డిశెంబర్ 28న జేఏసీగా ఏర్పడ్డారు. ఈ క్రమంలో తెలంగాణలోని అన్ని ప్రాంతాల్లో మొదలైన దీక్షల్ని భగ్నం చేస్తూ పోలీసులు లాఠీఛార్జీలు చేసి విద్యార్థుల్ని పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. ఈ క్రమంలో 2010 జనవరి 3న ఉస్మానియా యూనివర్శిటీలో మరొక భారీ బహిరంగ సభ జరిగింది. ఈ సభ అత్యంత చారిత్రాత్మంగా నిలిచింది. విద్యార్థి బలాన్ని దేశానికి చూపించింది. దాంతో 2010 జనవరి 5న కేంద్రం అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చింది. అఖిలపక్ష సమావేశం ఎటువంటి ఫలితాన్ని ఇవ్వలేకపోయింది.

ఆ తర్వాత కేంద్రప్రభుత్వం 2010 డిశెంబర్ 9, 23 ప్రకటనలపై ఒక కమిటీ

వేస్తున్నట్లు ప్రకటించింది. ఈ కమిటీ తెలంగాణ, సీమాంధ్రలో పర్యటించి కేంద్రానికి నివేదిక ఇస్తుందని చెప్పింది. ఇది రెండవ ఎస్సార్సీ. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి శ్రీకృష్ణ దీనికి అధ్యక్షుడు. జాతీయ న్యాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ రణ్‌బీర్‌సింగ్, అంతర్జాతీయ ఆహార విధాన పరిశోధన సంస్థ సీనియర్ పరిశోధకులు డాక్టర్ అబుసలే హరిప్, ఢిల్లీ ఐఐటీ మానవ సామాజిక శాస్త్రాల విభాగం ఆచార్యులు రవీందర్ కౌర్, హోంశాఖ మాజీ కార్యదర్శి, రిటైర్డ్ ఐఏఎస్ వినోద్ కె.దుగ్గల్ ఈ కమిటీలో సభ్యులు. ఇరు ప్రాంతాల ప్రజలు ఈ కమిటీకి తమ నివేదికలు ఇచ్చారు. తెలంగాణలో ఈ కమిటీ నియామకానికి కొందరు వ్యతిరేకత తెలుపగా మరికొందరు తమతమ అభిప్రాయాలను నివేదికల రూపంలో సమర్పించారు. కాలయాపన కోసమే కేంద్రం ఈ కమిటీని వేసిందని తెలంగాణ రాజకీయ జేఏసీ, విద్యార్థి జేఏసీ ప్రకటించాయి. ఉస్మానియా విద్యార్థులు తెలంగాణ కోసం రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రను చేపట్టింది. ఇందులో అన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. జనవరి 18 నుండి ఫిబ్రవరి 7 వరకు ఈ యాత్ర తెలంగాణ ప్రజల మద్ధతుతో, భాగస్వామ్యంతో కొనసాగింది. ఈ క్రమంలోనే తెలంగాణలో విపరీతంగా ఆత్మహత్యలు చేసుకోవడం మొదలైంది. దాంతో విద్యార్థి లోకం భగ్గుమన్నది. ఉస్మానియా జేఏసీ 2010 ఫిబ్రవరి 21న అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది. తెలంగాణ రాజకీయ జేఏసీ దీనికి మద్ధతు ప్రకటించింది. సీమాంధ్ర ప్రభుత్వం లెక్కకు మించిన పోలీసు, ప్యారా మిలటరీ బలగాలను దించి ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం కాకుండా అడ్డుకున్నది. ఈ క్రమంలో యాదయ్య అనే విద్యార్థి అందరూ చూస్తుండగానే ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని చనిపోయాడు. ఈ వార్త తెలంగాణ అంతటా వ్యాపించి పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారిపోయింది. ఈ క్రమంలోనే తెలంగాణ రాజకీయ జేఏసీ రెండు విడుతల బస్సు యాత్రను నిర్వహించింది. మొదటిది 2010 మార్చి 21 నుండి 23 వరకు హైదరాబాద్‌లోని గన్‌పార్క్ నుండి హన్మకొండవరకు సాగింది. రెండవది 2010 ఏప్రిల్ 9 నుండి 12 వరకు కొమరవెల్లి నుండి మంచిర్యాలదాక సాగింది. 2010 మే 28న వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి తెలంగాణలో తలపెట్టిన ఓదార్పు యాత్రను తెలంగాణ విద్యార్థులు వరంగల్ జిల్లా మానుకోటలో తిప్పికొట్టారు.

ఆంధ్రప్రదేశ్ మొత్తం విస్తృతంగా సంప్రదింపులు జరిపిన శ్రీకృష్ణ కమిటీ కేంద్రానికి 2010 డిశెంబర్ 30 నివేదిక సమర్పించింది. ఈ నివేదికలో 668 పేజీలు, తొమ్మిది అధ్యాయాలున్నాయి. స్థూలంగా ఈ కమిటీ కూడా తెలంగాణ వ్యతిరేక నివేదికనే ఇచ్చింది. ఆ నివేదికమీద తెలంగాణ వ్యాప్తంగా నిరసనలు జరగడం మాత్రమే కాకుండా అది ఎంతుకు తప్పుడు నివేదికనో తెలుపుతూ పదుల సంఖ్యలో పుస్తకాలు వెలువడ్డాయి. అవి నివేదికలో పరస్పరం విభేదించుకునే అనేక అంశాలను బయటపెట్టాయి. దాంతో తెలంగాణ వ్యాప్తంగా నడుస్తున్న ఉద్యమం అదే వేగంతో ముందుకు పోయింది. ఈ క్రమంలోనే అప్పటికి తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలంగా పనిచేస్తున్న వామపక్ష భావజాలాన్ని విశ్వసించే ప్రజాసంఘాలన్నీ కలిసి 2010 అక్టోబర్ 1న 'తెలంగాణ ఫ్రంట్' ఏర్పడింది. దీనికి అధ్యక్షుడు గద్దర్. ఇందులో వేదకుమార్, హనుమాండ్లు, పాశం యాదగిరి, రత్నమాల, ఆకుల భూమయ్య, చిక్కుడు ప్రభాకర్, కేశవరావు జాదవ్, అరుణోదయ విమల ముఖ్యులు. ఈ ఫ్రంట్ రాజకీయ పార్టీలకు అతీతంగా నడిచే తెలంగాణ ఉద్యమానికి పిలుపునిచ్చింది. మిగతా ఉద్యమానికీ, ఈ ఫ్రంట్ పిలుపునిచ్చిన ఉద్యమానికి తేడా, మిగతావి కేవలం భౌగోళిక తెలంగాణ సాధన గురించి మాట్లాడితే, ఫ్రంట్ మాత్రం ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణ ఏర్పాటే తన లక్ష్యం అన్నది. ఈ క్రమంలో ఎన్నికలతో సంబంధం ఉండదన్న ఫ్రంట్ అభిప్రాయాలతో విభేదించిన కొద్దిమంది 2011 ఫిబ్రవరి 28న 'తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్'ను స్థాపించారు. దీనికి కేశవరావు జాదవ్ అధ్యక్షుడిగా, అరుణోదయ విమల ఉపాధ్యక్షురాలిగా, కపిలవాయి దిలీప్ కుమార్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సంస్థ కూడా టీపీఎఫ్‌లాగానే ప్రజాస్వామ్య తెలంగాణ సాధనకోసం పనిచేసింది.

తెలంగాణ ఉద్యమానికి మద్ధతునిస్తూ తెలంగాణ ఉద్యోగులు సహాయ నిరాకరణ ఉద్యమం మొదలుపెట్టారు. ఈ క్రమంలో 2011, మార్చి 11న హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ దగ్గర 'మిలియన్ మార్చ్' కార్యక్రమం జరిగింది. వేలాదిమంది పోలీసుల దిగ్భంధనాల నడుమ లక్షలాదిమందితో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆ తర్వాత 2011 సెప్టెంబర్ 13న తెలంగాణ వ్యాప్తంగా 'సకల జనుల సమ్మె' మొదలైంది. ఇందులో అన్ని రకాల ఉద్యోగులు పాల్గొన్నారు. 2011 అక్టోబర్ 2న తెలంగాణ రాజకీయ జేఏసీ

ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌లో మౌన దీక్ష చేపట్టింది. 2011 అక్టోబర్ 11న తెలంగాణకు చెందిన ఉద్యోగుల జేఏసీ 'మహాధర్నా' నిర్వహించింది. ప్రభుత్వంతో చర్చలు జరిపి, రాజకీయ జేఏసీ అభిప్రాయాలు తీసుకున్న ఉద్యోగులు 2011 అక్టోబర్ 23న సకల జనుల సమ్మెను విరమించారు. 2012 సెప్టెంబర్ 30న హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద 'సాగరహారం' నిర్వహించారు. దీనికే మరోపేరు 'తెలంగాణ మార్చ్'.

2013 ఏప్రిల్ 29, 30 తేదీల్లో రాజకీయ జేఏసీ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద 'సంసద్ యాత్ర' నిర్వహించింది. పార్లమెంటు సమావేశాలు నడుస్తున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీమీద ఒత్తిడి తెచ్చేందుకే ఈ కార్యక్రమం తీసుకుంటున్నట్లు రాజకీయ జేఏసీ ప్రకటించింది. 2013 జూన్ 14న తెలంగాణ రాజకీయ జేఏసీ 'ఛలో అసెంబ్లీ'కి పిలుపునిచ్చింది. విద్యార్థి, ఉద్యోగ జేఏసీలన్నీ దీనికి మద్ధతునిచ్చాయి. కార్యక్రమం అనేక బందోబస్తు అడ్డంకుల నడుమ విజయవంతమైంది.

ఈ క్రమంలోనే తెలంగాణ వ్యాప్తంగా నిరాహార దీక్షలు, రోడ్లమీదనే వంటావార్పు కార్యక్రమాలు, రాస్తారోఖోలు, రోడ్లను దిగ్బందిస్తూ మానవహార నిర్మాణాలు, కళా సాంస్కృతిక రంగాల్లోనివారి నిరసన కార్యక్రమాలు నడిచాయి. తెలంగాణ పండుగల్ని కూడా ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష వ్యక్తం అయ్యేట్లు సృజనాత్మకంగా జరుపుకున్నారు.

ఈ నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కేశవరావ్‌తోపాటు మరో ఇద్దరు ఎంపీలు కాంగ్రెస్‌ను విడిచిపెట్టి టీఆర్ఎస్‌లోకి వెళ్లారు. 2013 జూన్ 3న హైదరాబాద్‌లో బీజేపీ భారీ బహిరంగ సభ నిర్వహించింది. దానికి జాతీయ నాయకుడు రాజ్‌నాథ్‌సింగ్ హాజరై కాంగ్రెస్‌ను దుయ్యబట్టాడు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగానే తమ ఉనికికి ప్రమాదం వస్తుందని కాంగ్రెస్‌లో భయం మొదలైంది. 2013 జులై 11న కాంగ్రెస్ కోర్ కమిటీ సమావేశం నిర్వహించి అందులో తెలంగాణ అంశాన్ని ప్రధానంగా పెట్టి చర్చించింది. తర్వాత మళ్లీ 2013 జులై 30న సమావేశమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు చెప్తూ, హైదరాబాదుతోపాటు

పది జిల్లాల తెలంగాణ ఇస్తున్నట్లు ప్రకటన చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు రాజ్యాంగపరమైన చర్యలు తీసుకొమ్మని, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాలకు వనరుల పంపకం, రక్షణ చర్యలు సక్రమంగా అమలు జరగాలని, హైదరాబాద్ రెండు రాష్ట్రాలకు 10 సంవత్సరాలు ఉమ్మడి రాజధానిగా ఉండాలని, ఆలోపు ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధానిని నిర్మించుకోవాలని చెప్పింది. దానికి యూపీఏ సమన్వయ సంఘం కూడా ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో 2014 జూన్ 2 న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది.

పరిశోధన గ్రంథ పరిమితుల్ని దృష్టిలో పెట్టుకుని ఇక్కడ పొందుపరిచినంత సంక్షిప్తంగా ప్రత్యేక తెలంగాణ ఉద్యమం నడవలేదు. తెలంగాణ వ్యాప్తంగా 2000 మందికి పైగా విద్యార్థులు, ప్రజలు ప్రాణత్యాగాలు చేశారు. మరీ ముఖ్యంగా చివరి దశ ఉద్యమం నడిచినన్ని రోజులు తెలంగాణలోని ప్రతి గడపలో తెలంగాణ ఉద్యమ ఆలోచననే నడిచింది. లక్షల సంఖ్యలో సభలు, సమావేశాలు, ర్యాలీలు జరిగాయి. లక్షలాది పేజీల సాహిత్యం వచ్చింది. లక్షలాది ఉపన్యాసాలు వినిపించాయి. వేల సంఖ్యలో కరపత్ర సాహిత్యం వెలువడింది. వేలాది పాటలు వచ్చాయి. కొత్త కవులు, కళాకారులు రూపొందారు. ప్రజాయుద్ధంలో ఎన్ని సృజనాత్మక వ్యక్తీకరణలు ఉండగలవో, ఎన్ని నూతన శక్తులు రూపొందగలవో అన్నీ తెలంగాణ ఉద్యమంలో రూపొందాయి.

**అధ్యాయం - 3**

# సమాజం - కవిత్వం - సంబంధం

మానవుడు సామాజిక జీవనంలోంచే జ్ఞానాన్ని పొందుతాడు. అతని భావనా చట్రాలు మొత్తం సామాజిక పరిణామాల ప్రతిఫలనాలే. కనుక మనిషి చైతన్యంలోని ఏ అంశాన్నైనా సామాజిక పునాదిగానే అధ్యయనం చేయవల్సి ఉంటుంది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం సామాజిక అసమానతల నుండే పుట్టింది. వందల ఏళ్లు భూస్వామ్య, రాచరిక పాలనలో మగ్గిపోయిన తెలంగాణ, స్వతంత్ర్య భారతదేశంలో కలిసిపోయిన తర్వాత కూడా మళ్లీ ఇంకొక ఆధిపత్య పాలనలోకి వెళ్లింది. ఈ నేపథ్యంలో తమకు అన్ని సామాజిక రంగాల్లో జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ, మొదట చేసుకున్న ఒప్పందాలనూ, ఏర్పాటు చేసిన రక్షణలను అమలు చేయమని అడుగుతూ ఉద్యమం ప్రారంభించింది. మరికొద్ది కాలానికే ఒప్పందాలూ, రక్షణలూ పరిష్కారం ఇవ్వలేవని తెలియగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాల్సిందేనని డిమాండ్ చేసింది. ఉద్యమాన్ని ఉధృతం చేసింది. తెలంగాణ సమాజంలోని ఈ చారిత్రక పరిణామాలే, ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వ సృజనకు హేతువయ్యాయి. ఇది కేవలం ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కవిత్వానికి మాత్రమే వర్తించదు. ఏ మానవ సమాజంలోని సాహిత్యానికైనా సామాజిక వాస్తవికతనే పునాదిగా ఉంటుంది. కనుక ఈ అధ్యాయంలో సమాజంలోని సంచలనాలు కవిత్వంగా ఎలా రూపాంతరం చెందుతాయనే విశ్లేషణ చేయడం జరుగుతున్నది.

మానవుడి చైతన్యానికి సమాజం ఎట్లా హేతువు అవుతుందో చాలామంది సామాజిక శాస్త్రవేత్తలు, తత్త్వవేత్తలు విశ్లేషించి ఉన్నారు. వారిలో టిటస్ అభిప్రాయం ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. "మనం యేదో ఒక సామాజిక బృందంలో పుడతాం. యీ బృందాలకి ఓ ఫలానా నడవడిక తీరు, అనుభూతి చెందేతీరు, ఆలోచనలు చేసేతీరు వుంటూ వుంటాయి. మనం మన పట్లా, మన చుట్టూ వున్న లోకంపట్లా ఎరుక తెచ్చుకుంటాం. యితరులతో పరిచయాలు కలిగించుకుంటాం. విషయాలతో పరిచయాలు

కలిగించుకుంటాం. అవి విస్తృతమవుతూ వుండే కొద్దీ వాటి అనుభవాల నుంచి చైతన్యం ఆవిర్భవిస్తుంది" అంటాడు హారోల్డ్ హెచ్.టిటస్ (హారోల్డ్ హెచ్ టిటస్. 2004 :2). మనిషికి చైతన్యం సమాజమే అందిస్తుంది అని వీరి అభిప్రాయం. అంటే చైతన్యం ఒక సామాజిక ఉత్పత్తి. దీని ద్వారా సమాజంలో ఉండే రాజకీయాలు, తత్త్వశాస్త్రం, కళలు, భాష, సాహిత్యం తదితరాలన్నీ సామాజిక చైతన్య నిష్పన్న రూపాలు అని అర్థం చేసుకోవచ్చు. వీటన్నింటికి సమాజంలోని ఆర్థికమే పునాదిగా ఉండి నియంత్రిస్తుంది. ఆ ఆర్థిక పునాది కూడా సమాజ ఉత్పత్తి సంబంధాల మీద ఆధారపడి ఉంటుంది. ఇట్లా సమాజ ఉత్పత్తి విధానం, దాని ద్వారా ఏర్పడే ఆర్థిక విధానం, దాని ఉపరితలాంశాలైన రాజకీయాలూ, తత్త్వశాస్త్రం, కళలు, భాషా సాహిత్యాలూ– వీటన్నింటి మధ్యన గతితార్కిక సంబంధం ఉంటుంది. ఈ సంబంధం జర్మన్ తత్త్వశాస్త్రం చెప్పేకంటే ముందు ఉనికిలో ఉన్నది, ఆ తర్వాతా ఉంటుంది. ఎందుకంటే తత్త్వం కూడా ఉనికిలోని భౌతిక, భావ విషయాల గురించే మాట్లాడుతుంది కనుక, అప్పటికే ఉనికిలోని సామాజిక సంబంధాలను విశ్లేషిస్తూనే గతితర్కాన్ని హెగెల్‌వంటివాళ్లు అభివృద్ధి చేశారు. ఆ తర్వాత దానిని మార్క్స్ స్వీకరించి, భౌతికవాద గతితర్కంగా ఎదిగించాడు. దాంతో అన్ని సామాజిక చైతన్యాలను విశ్లేషించడానికి ఒక శాస్త్రీయమైన ఉపకరణం లభించింది. అనేకమంది భౌతికవాదులు సాహిత్యాన్ని, దాన్ని భౌతిక పునాది నుండి ఎట్లా అధ్యయనం చేయాలో చెప్పారు. ఈ నేపథ్యంలో సాహిత్యానికీ సమాజానికీ, మరింత నిర్దిష్టంగా చెప్పాల్సి వచ్చినప్పుడు సమాజానికీ, కవిత్వానికీ ఉన్న సంబంధాన్ని శాస్త్రీయంగా విశ్లేషించడమే ఈ అధ్యాయంలోని ప్రధాన లక్ష్యం. ఏదైనా ఒక సమాజంలోని సాహిత్యాన్ని అర్థం చేసుకోవడానికి ఇది మాత్రమే శాస్త్రీయమైన ఆధునిక పద్ధతి. ప్రపంచంలోని ఏ సాహిత్య పరిశీలనకైనా అన్వయించగలిగిన, అనువర్తించగలిగిన సూత్రమిది. అందుకే ప్రఖ్యాత నవలా విమర్శకారుడు వల్లంపాటి వెంకటసుబ్బయ్య "సాహిత్య ప్రక్రియలు సమకాలీన సామాజిక పరిస్థితులలో నుంచి మాత్రమే ఉద్భవిస్తాయి. అందుచేత సాహిత్య ప్రక్రియల పుట్టుకనూ, పరిణామాన్నీ చారిత్రకంగా మాత్రమే అధ్యయనం చేయవలసి ఉంటుంది" (వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1989 : 1) అంటారు. ప్రాచీన కాలం నుంచి ధారగా వస్తున్న జానపద సాహిత్యంగానీ, నన్నయ నుంచి నేటి దాక విస్తరిస్తున్న సాహిత్యంగానీ

విస్తృతమైన సామాజిక పునాది కలిగినవే.

మొట్టమొదట చార్వాకం, ఆ తరువాత బౌద్ధం అందించిన సామాజిక తత్త్వ జ్ఞానం ధ్వంసం అయిన తర్వాత భారతదేశంలో భావవాదమే రాజ్యమేలింది. అందుకే ప్రాచీన కాలంనుండి ఆధునిక కాలం దాకా సాహిత్య వివేచనంతా సాహిత్య విలువలకు లోబడే జరిగింది. భాష ఎలా ఉన్నది, సంధులు, సమాసాలు ఏమున్నాయి, అలంకారాలు ఏమున్నాయి, రచనా పద్ధతి ఎలా ఉన్నది, వర్ణనలు ఎలా ఉన్నాయి, పాత్ర పోషణ ఎలా ఉన్నది మొదలైన అంశాలన్నీ రచన లోపలి అంశాలు. కేవలం రచన రూపానికి సంబంధించిన విషయాలు. వీటికి సంబంధించిన చర్చ వీటికి లోబడే చేయడమనేది ప్రాచీన కాలంనుంచీ సాగుతూ వచ్చింది. దీనికి కారణం సమాజం నుండి సాహిత్యాన్ని ఒక విడివస్తువుగా చూసే అశాస్త్రీయమైన విమర్శనా దృక్పథం చాలాకాలం పాటు అధికారం చెలాయించడమే. అందుకే ఆధునిక కాలంలోని సమాజ శాస్త్రాల జ్ఞానంతో మొదలైన విమర్శనా దృక్పథాలు ప్రాచీన విమర్శనా పరికరాల్ని, దృక్పథాల్ని పూర్వపక్షం చేశాయి. "తెలుగు సాహిత్య విమర్శ ప్రధానంగా రూపం మీదే ఇంతవరకు కొనసాగుతూ వస్తోంది. సంస్కృతాంధ్ర లక్షణగ్రంథాల్లో ప్రమాణాలను గ్రహించి కావ్యాలకు అన్వయించడం, అలంకార శాస్త్ర ప్రమాణంగా సాగే పరిశీలన సాంప్రదాయ విమర్శనాపద్ధతిలో భాగం. ఈ పద్ధతిని అసంబద్ధంగా ఆధునిక సాహిత్యానికి అన్వయించే ప్రయత్నం కూడా జరిగింది. దీన్ని అధిగమించి విమర్శలో ఆధునికతను ప్రవేశపెట్టినవాడు కట్టమంచి రామలింగారెడ్డి. ఆయన వ్యాసం(కవిత్వతత్త్వ విచారము)లో ఇతర అంశాలతోపాటు సాహిత్యంపై సామాజిక శక్తుల ప్రభావం గురించి కూడా మొదటిసారిగా కాబోలు ప్రస్తావించాడు"(సుబ్బారావు, సి.వి(సంపా), 1986 : 9, 10). ఆధునిక సాహిత్య విమర్శకు పునాదులు వేసిన కట్టమంచి రామలింగారెడ్డి సాహిత్యాన్ని సామాజిక పునాదుల మీదుగా విశ్లేషించాడు. కనుక పైన ఉటంకించిన అభిప్రాయం ద్వారా తెలిసేదేమంటే ఆధునిక కాలం వచ్చేసరికి ఎదిగిన దర్శన శాస్త్రాల కారణంగా ప్రకృతినీ, అందులో ఉండే అనేకానేక అంశాలనూ, అమూర్త భావనలనూ అర్థం చేసుకోవడానికి తగినన్ని ఆకరాలు లభించాయి. సమాజాన్ని అర్థం చేసుకోవడానికి నూతన ప్రాపంచిక దృక్పథాలు అందుబాటులోకి వచ్చాయి.

అదేవిధంగా సమాజ చరిత్రలో ఒక భాగమైన, దాని చైతన్య వ్యక్తీకరణ అయిన సాహిత్యాన్ని అర్థం చేసుకోవడానికి కూడా నూతన సాహిత్య దృక్పథాలు వెలుగులోకి వచ్చాయి. ఆ తర్వాత అకడమిక్ తెలుగు సాహిత్య పరిశోధనల్లో కూడా ఈ ఆధునిక పద్ధతుల్లో సాహిత్యాన్ని అధ్యయనం చేయడం మొదలైంది. 'ఆధునిక తెలుగు కవిత్వంలో విప్లవ ధోరణులు' అన్న ఎం. గంగాధర్ పరిశోధనా వ్యాస ప్రచురణకు ముందుమాట (ఆధునిక కవిత్వ విశ్లేషణ) రాస్తూ "సాహిత్యాన్ని విశ్లేషించడానికీ, అవగాహన చేసుకోవడానికి దాన్నే ఆశ్రయిస్తే చాలదు. సవ్యమైన విశ్లేషణకూ అవగాహనకూ సామాజిక శాస్త్ర విజ్ఞానం చాలా తోడుపడుతుంది. దీనికి తోడు శాస్త్రీయమైన సైద్ధాంతిక దృష్టి ఎంతో అవసరం. ఇది గతితార్కిక పద్ధతివల్ల చేకూరుతుంది"(కె.వి.ఆర్. 1994 : vii) అన్నారు కె.వి.ఆర్. ఈయన విప్లవ రచయితల సంఘం సభ్యులు. ఆయన గతితార్కిక పద్ధతిలోనే జీవితాంతం సాహిత్య విమర్శ చేసినవారు.

కె.వి.రమణారెడ్డి పైన వ్యక్తం చేసిన అభిప్రాయంలో 'గతితార్కిక పద్ధతి' అనే మాట చాలా కీలకమైనది. ప్రకృతిలో ఉన్న మూర్త, అమూర్త విషయాల మధ్యన ఉండే సారభూతమైన లక్షణం, నిరంతరం చలనంలో ఉండడం. (దీనిని ప్రపంచంలోనే మొట్ట మొదట గుర్తించి తాత్త్విక స్థాయిలో వ్యాఖ్యానించినవాడు ఏథెన్సుకు చెందిన తత్త్వవేత్త హెరాక్లిటస్). అంటే నిరంతరం మార్పుకు గురి కావడం. పరస్పరం సంబంధాన్ని కలిగి ఉండి, ప్రభావితం చేసుకోవడం. ఆ ప్రభావితం చేసుకోవడమనే ఘర్షణ నుండే 'మార్పు' సంభవించడం జరుగుతుంది. ఇట్లా ప్రకృతిలోని సమస్త విషయాల మధ్య ఉండే సంబంధాన్నీ, వాటి చలనంలోని గతినీ శాస్త్రబద్ధంగా తర్కించేది, లేదా వివరించేది గతితర్కం. గతితార్కిక పద్ధతి అంటే సమస్త భావ, భౌతిక విషయాల మధ్య అనివార్యంగా ఉండే సంబంధాన్ని శాస్త్రీయంగా పరిశీలించేది. సాహిత్యాన్ని గతితార్కికంగా పరిశీలించడమంటే సాహిత్యం లోపలి విషయాలతోపాటు సాహిత్యం రూపుదిద్దుకోవడానికి పునాదిగా ఉన్న సమాజాన్ని, దాని గమనాన్ని కూడా పరిగణంలోకి తీసుకుని వివేచించడం అని అర్థం. అంటే సమాజానికీ, సాహిత్యానికీ ఉండే సంబంధాన్ని చర్చించడం.

ఈ రకమైన సమాజ సాహిత్య సంబంధాలను గురించి ప్రత్యేకంగా పరిశీలించడం అన్నది ఆధునిక కాలంలో ప్రారంభమైనా చారిత్రక కోణంలో చూసినప్పుడు ప్రాచీన లాక్షణికులు కూడ అటువంటి ఆలోచనలను ప్రాథమిక స్థాయిలో చేశారని తెలుస్తుంది. అయితే ఆ ప్రాథమిక చర్చంతా చైతన్య ప్రాథమ్యాన్ని విశ్వసించినవిగనుక సులక్షణమైన శాస్త్రీయత లేదు. ఆధునిక కాలంలో కూడ ఇటువంటి లక్షణాలు కనిపిస్తున్నా నిర్దిష్ట స్థల కాలాల వలన సమాజ సాహిత్య సంబంధాలను అనివార్యంగా గుర్తించవల్సి వస్తున్నది. లెనిన్ ప్రబోధించిన పరావర్తన సిద్ధాంతం సాహిత్యానికి అన్వయించి చూసినప్పుడు సమాజ సాహిత్య సంబంధం చాలా స్పష్టంగా విశద పడుతుంది. “పరమ అశాస్త్రీయంగానూ, అత్యంత ప్రాథమికంగానూ సాగుతున్న కళా సాహిత్య రంగాల్ని అధ్యయనం చెయ్యడానికి పరావర్తన సిద్ధాంతం శాస్త్రీయమైన పునాదిని సృష్టిస్తుంది. కళా, సాహిత్య సృష్టికి దోహదం చేస్తుంది. కళ కళాకారుని ‘ప్రతిభ’ నుంచీ పుట్టేది కాదు. కళ ఒక సామాజిక చైతన్య రూపం. కళాకారునికి విడిగా స్వతంత్రంగా ఉండే బాహ్య వాస్తవికత పరావర్తనం ద్వారానే కళ సృజింపబడుతుంది. మానవ చైతన్యం బాహ్య వాస్తవికతని పరావర్తించుకోవడమేకాదు బాహ్య వాస్తవికతను సృష్టిస్తుంది అనే అంశాన్ని కళాసృజనలో సులభంగా అర్థం చేసుకోవచ్చును. తాజమహల్ వంటి అద్భుత కట్టడాలే కాదు మామూలు భవనాలు కూడా ప్రకృతిలో లేవు. వాటిని కళాకారులు సృజిస్తారు. కానీ ఈ భవన నిర్మాణానికి ఉపయోగించిన వస్తువులు అన్నీ బాహ్య ప్రపంచంలోనివే” (మధుసూదనరావు, త్రిపురనేని. 1997 : 66). అంటే ఒక కళా ఖండం రూపొందానికి, ఆ కళాఖండానికి ఉన్న బాహ్య ప్రపంచమే, అంటే మానవ సామాజిక జీవనమే ముడిసరుకుగా ఉంటుంది. అంటే సమాజ జీవనమే సాహిత్యంలో ప్రతిబింబిస్తుంది. అంటే అద్దం ముందు ముఖం పెడితేనే అది ప్రతిబింబం చూపుతుంది. అంతేగాని అద్దం దానికదిగా ప్రతిబింబాన్ని చూపదు. అంటే సమాజం లేనిదే సాహిత్యం లేదు. కనుకనే త్రిపురనేని మధుసూధనరావు “సమాజానికి సంబంధం లేకపోతే సాహిత్యానికి ఉనికి లేదు. కనక సాహిత్య చరిత్రని సామాజిక చరిత్రలో భాగంగానే అధ్యయనం చేయాలి” (మధుసూదనరావు, త్రిపురనేని. 1997 : 88) అన్నాడు.

ఆధునిక కాలంలో సామాజిక శాస్త్రాలు శిఖరాగ్రానికి ఎదిగాయంటే, వాటికి

సంపూర్ణత్వం సిద్ధించిందంటే దానికి ప్రధాన కారణం సాహిత్యం అని కూడ చెప్పాలి. ఎందుకంటే ఇవాళ చరిత్ర పరిశోధనకుగాని, నృశాస్త్ర పరిశోధనలకుగాని, తత్త్వశాస్త్ర పరిశోధనలకుగాని సాహిత్యం ఆకరాల్ని అందిస్తున్నది. ఆధునిక సాహిత్యం మాట అటుంచి ప్రాచీన సమాజాల జీవన విధానాన్ని, అలవాట్లను, ఆలోచనా పద్ధతులను ప్రాచీన సాహిత్యం చిత్రిక పట్టింది. అందువల్ల గతానికి సంబంధించిన విశేషాలను తెలుసుకోవడం కోసం, సమాజ పరిణామ క్రమాన్ని తెలుసుకోవడం కోసం సామాజిక శాస్త్రాలు సాహిత్యాన్ని ఒక ప్రధాన ఆకరంగా వాడుకుంటున్నాయి. “సాధారణంగా ఉత్తమ సాహిత్యం సామాజిక శాస్త్రాలకంటె ప్రతిభావంతంగా సమాజాన్ని ప్రతిఫలిస్తుంది. అందుకే సాహిత్య పరిశీలన సామాజిక అధ్యయనానికి సాధనమే కాదు, అవసరం కూడా అవుతుంది. ఈ పరిశీలన ఎక్కువగా తన దృష్టిని సాహిత్య రూపాల మీద కంటే వస్తువుపైనే కేంద్రీకరిస్తుంది. కథా వస్తువును పరిశీలించడం అంటే ఆ కథా వస్తువుకు ముడి సరుకైన సమాజాన్ని పరిశీలించడమే. అయితే, సాహిత్యాన్ని దాని సామాజిక అస్తిత్వం నుండి పరిశీలించాలంటే ముందుగా సమాజం గురించి కొంత తెలిసి ఉండాలి. సామాజిక చరిత్ర గురించి ఒక అవగాహన విశ్లేషణా చట్రం రేఖామాత్రంగానైనా ఉండాలి. తెలుగు సాహిత్యాన్ని ఈ సామాజిక చరిత్ర పరిధిలో పరిశీలించే ప్రయత్నాలు ఇటీవల ఆరంభమయ్యాయి కూడా” (సుబ్బారావు, సి.వి.(సంపా). 1986 : 13). ఈ మాటలు అచ్చంగా సాహిత్యానికీ, సమాజానికీ ఉండే అవినాభావ, అన్యోన్య సంబంధాన్ని విశదీకరిస్తాయి.

రచయితల లేదా కవుల రచనలు లేదా రచయితల సంఘాలు నిషేదానికి గురికావడం వర్తమాన సమాజ సన్నివేశం. దీనికి కారణం ప్రభుత్వాల, ప్రభుత్వ స్వభావాల, మతాల వ్యతిరేకతను చిత్రించడమై ఉండవచ్చునేది ఒక పార్శ్వం. ఇంకొక ప్రధానమైన విషయం ఆ రచనలు ఆయా దేశకాల పరిస్థితులను కళ్లకు కట్టినట్లు చిత్రించి, సమకాల ఉత్పత్తి సంబంధాలను విశదపరిచి, మానవ పురోగమనానికి అడ్డంకిగా ఉన్న మత తాత్విక విషయాలను తెలియజేసి సమాజంలోని పీడిత వర్గాల చైతన్యాన్ని విశదపరుస్తున్నాయనేది. అంటే ఒక రచన నిషేదానికి గురయ్యేంత స్థాయిలోకి వెళ్లిందంటే అది సమాజాన్ని చాలా స్పష్టంగా అర్థం చేసుకుందనీ, ప్రజలకు అర్థం చేయించిందనీ

అర్థం. ఒక రచన సమాజం మీద ప్రభావవంతమైన ముద్ర వేయగలగడానికి కారణం ఆ సమాజమే రచనలో ప్రతిఫలించడమై ఉండడం. ఇది ప్రగతివాదులకూ, ప్రగతి నిరోధకులకూ సంబంధించిన విషయంగా పైకి కనిపించినప్పటికీ సాహిత్య దృక్కోణంలో చూసినప్పుడు సమాజ సాహిత్య సంబంధాన్ని తెలియజేసేదే.

పైన వివరించిన దృక్పథంతో తెలుగు సాహిత్య సమాజ సంబంధాలను అధ్యయనం చేసినప్పుడు మాత్రమే సాహిత్య వివేచన అర్థవంతం అవుతుంది. అప్పుడు మాత్రమే ప్రత్యేక తెలంగాణ కవిత్వానికీ, సమాజానికీ ఉన్న అవినాభావ సంబంధం బోధపడుతుంది. ఈ పరిశోధనకు కొన్ని మైలు రాళ్లను ముందుంచుకోవడం పనిని సులభతరం చేయగలదు. దానికి చరిత్ర రచనలోని యుగ విభజన ఇందుకు తోడ్పడగలదు. తెలుగుదేశ సాహిత్య చరిత్రను క్రీ.పూ.3వ శతాబ్దం నుండి క్రీ.శ. 11వ శతాబ్దం వరకు పూర్వయుగం, క్రీ.శ.11వ శతాబ్దం నుండి 18వ శతాబ్దం దాకా మధ్యయుగం, 18వ శతాబ్దం నుండి ఆధునిక యుగం అని విభజించారు. ఈ క్రమాన్ని అనుసరించే విషయ వివరణ చేయదల్చుకున్నాను.

తెలుగు సాహిత్య చరిత్రలో పూర్వ యుగ సాహిత్యం ప్రధానంగా జానపద సాహిత్యం. అంటే మౌఖిక సాహిత్యం. మానవ శ్రమ నుండి, ఆ శ్రమను మరిపించే అవసరం నుండి, ఆ శ్రమను వివరించే ఉద్దేశం నుండి మొదలుకొని వివిధ సందర్భాలూ, సంతోషాలూ, బాధలూ చెప్పుకోవడానికి తొలి సాహిత్యం పుట్టింది. అలా పుట్టిన సాహిత్యం ఒకరి నోళ్ల నుండి మరొకరికి వ్యాపించింది. ఒక కాలం నుండి మరొక కాలానికి వ్యాపించింది. ఒక తరం నుండి మరొక తరానికి ప్రసరించింది. ఇట్లా మానవ జాతి ఎప్పుడైతే ప్రకృతితో ఘర్షించడం మొదలు పెట్టిందో అప్పటి నుండి సాహిత్యం ఉన్నది. మానవుని శ్రమ, శ్రమ నుండి భాష, భాష నుండి సాహిత్యం– ఈ క్రమం మానవ చైతన్య ఎదుగుదలను తెలిపేది. ఇట్లా శ్రమ, భాష, సాహిత్యం ప్రాచీన గణ సమాజాల నుండే ఒక క్రమ పద్ధతిలో ఎదిగాయని పురాతన మానవ సమాజాన్ని గురించి వివరించిన నృశాస్త్రవేత్త లూయీ హెన్రీ మోర్గన్ రచనలు చదివితే అర్థమవతుంది. అంటే ఇప్పుడు

గణిస్తున్నట్లు తెలుగు సాహిత్యం వయస్సు కేవలం రెండు వేల ఏళ్లు మాత్రమే కాదు. అంతకు ముందటి మౌఖిక సాహిత్యాన్ని కలుపుకుంటే దాదాపు మరో రెండు మూడు వేల ఏళ్ల చరిత్ర అదనంగా చేరుతుంది. దురదృష్టవశాత్తు తెలుగు సాహిత్య చరిత్రకారులంతా వారి రచనల్లో ప్రాఙ్నన్నయ యుగానికి సంబంధించిన భాషా సాహిత్యాలను చెప్పడానికి ఐదో పదో పేజీలు కేటాయించారు తప్ప వారికి అంతకు ముందు మౌఖిక సాహిత్యం ఒకటి ఉందన్న గుర్తింపు, దాన్ని కూడ సాహిత్య చరిత్రలో భాగంగా చేర్చాలన్న పరిశోధక దృష్టి కొరవడ్డాయి. కానీ అంతకు ముందు కూడ సాహిత్యం ఉన్నది అన్నది సత్యం. సాహిత్యంలో బహుళ ప్రాముఖ్యమున్న భారత రామాయణాలు మొదట జానపదుల వ్యవహారంలోనివే. అంటే అవి మొదట వారు చెప్పినవే. ఆ తర్వాతనే అవి గ్రంథస్తం చేయబడ్డాయి. ఇవి మాత్రమే కాదు అనేక ప్రాచీన కావ్యాలు జానపదుల సాహిత్యం నుండి గ్రహించి రాసినవే. ఈ మాటలు లబ్ధ ప్రతిష్టులుగా కొద్ది మంది తెలుగు కవులను నిలబెట్టినవాళ్లకు రుచించకపోవచ్చుగాని యదార్థమైన విషయాలే. అందుకే ప్రముఖ తెలుగు సాహిత్య పరిశోధకులు జయధీర్ తిరుమలరావు ఇట్లా అంటారు. "మౌఖిక సాంప్రదాయం మొదట ప్రారంభమైంది. ఆ తదుపరి వేల ఏళ్లకు లేఖన సంప్రదాయం అమలులోకి వచ్చింది. అది ఏర్పడినప్పటి నుండీ మౌఖిక సాహిత్యం, మౌఖిక సంప్రదాయం లేఖన సంప్రదాయాన్ని ప్రభావితం చేస్తూనే వచ్చాయి. ఆదికావ్యమైన రామాయణం కూడా మౌఖికంగా వెలువడి తరువాత లిఖిత రూపం పొందింది. మౌఖిక రూపంలోని పురాణాలు ఆ తరువాత లిఖిత రూపంలోకి వచ్చాయి. నాటి వేద పఠనాన్ని తరువాతి కాలంలో లిఖిత రూపంలో భద్రపరచడమైంది. శివకవులు రాసిన దేశీ సాహిత్యం ఆనాడు ప్రజల బాణీకి, వాణికి మూలపట్టు. బసవ పురాణంలో అంతకు ముందు జీవించి ఉన్న భక్తుల కథలను మౌఖికంగా విని లిఖిత రూపంలోకి తెచ్చాయి. అట్లాగే రంగనాథ రామాయణం కథా వస్తువు మౌఖిక రూపానిదే. రెండు దశాబ్దాల కాలం తరువాత శ్రీనాథుడు మౌఖిక రూపంలో దాగిన పలనాటి వీరచరిత్రని లిఖిత రూపంలోకి తీసుకువచ్చాడు" (తిరుమలరావు, జయధీర్. 1994 : 9). ఆనాటి జానపదుల నోళ్ల నుండి ప్రవహించి, తర్వాత గ్రంథస్తం చేయబడిన సాహిత్యం ఆనాటి సమాజ స్థితిగతులను తెలియజేస్తుంది. ఆధునిక కాలంలో భారత యుద్ధం జరిగినట్లు అనేక పురావస్తు అవశేషాలు

బయటపడినప్పుడు ప్రాచీన కాలంలో అది నిజంగానే జరిగింది అని రూఢి చేసుకోవడానికి తర్వాతి కాలంలో గ్రంథస్తం చేయబడ్డ మహాభారత జానపద కథ తోడ్పడతుంది. ఇట్లా చూసినప్పుడు ప్రాఙ్నన్నయ యుగ జానపద సాహిత్యం కూడ పూర్వయుగపు సామాజిక విషయాలను తెలుసుకోవడానికి ఉపకరిస్తుంది.

నన్నయతో మధ్యయుగం ప్రారంభమవుతుంది. లిఖిత తెలుగు సాహిత్య సాంప్రదాయం నన్నయతోనే ఆరంభమైంది. 11వ శతాబ్దంలో తెలుగు ప్రాంతాన్ని తూర్పు చాళుక్య రాజైన రాజరాజ నరేంద్రుడు పాలించాడు. ఆనాటి సమాజం రాచరిక ఏలుబడిలో, భూస్వామ్య సంబంధాలతో ఉన్నది. రాజుల ఆస్థానాల్లో సంస్కృతానికి మాత్రమే గౌరవం ఉండేది. దానికి కారణం వైదిక మత సాహిత్యమంతా సంస్కృతంలో ఉంది. అంటే ఆనాటికే సమాజమంతా ఆర్యీకరణం చెంది ఉన్నది. అందువల్లనే సంస్కృతం రాజభాష కాగలిగింది. "ఆర్యీకరణం ఫలితంగా, సాంఘిక ప్రతిష్టకి చిహ్నం కాబట్టి, ఉత్తర దేశపు రాజుల్తో సమాన ప్రతిపత్తి పొందటానికి, సంస్కృతంలోని రాజ్య సిద్ధాంతాల్ని అనుకరిస్తూ చాలామంది తెలుగు రాజులు సంస్కృతంలో అనేక గ్రంథాలు రాశారు. సంస్కృత పండితుల్ని పోషించారు. సంస్కృత సంస్కృతి పట్ల గౌరవాన్ని ప్రదర్శించారు. సంస్కృతం నుంచి అనువాద, అనుకరణ రచనల్ని విపరీతంగా ప్రోత్సహించారు. తెలుగు సాహిత్య చరిత్రలో ఆర్యీకరణం, సంస్కృతీకరణం చాలా ప్రధాన పాత్ర నిర్వహించాయి. తెలుగు సాహిత్యం తెలుగు ప్రజల జీవితాల్ని కాక తెలుగు రాజుల, సంపన్నుల ఆశలనూ, భ్రమలనూ చిత్రించటానికీ, తెలుగు సాహిత్య చరిత్ర 'అష్టావక్ర' కావటానికీ ఆర్యీకరణమే కారణం"(మధుసూదనరావు, త్రిపురనేని. 1997 : 163). రాజరాజ నరేంద్రుడు వైదిక మతం పట్ల విశ్వాసం ఉన్నవాడు. ఆయన కాలంనాటికి అది బౌద్ధ, జైనాలవల్ల దెబ్బతిన్న దశలో ఉంది. కనుక ఆనాటి సమాజంలో విస్తృత వ్యాప్తిలో ఉన్న జైన, బౌద్ధ మతాలను తలదన్ని వైదిక మత పునరుద్ధరణ కోసం రాజరాజు నన్నయను పంచమ వేదం అనదగిన ఆంధ్రమహాభారత రచన చేయమన్నాడు. ఈ విషయాన్నే వి.చెంచయ్య ఇలా అంటాడు. "భారతాన్ని అనువాదం చెయ్యమన్న రాజులుగానీ, చేసిన కవులుగానీ వైదికమత పునరుద్ధరణను కోరుకున్నవారే. అందుకే రాజులు సంస్కృతానికి అంత ప్రాధాన్యం ఇచ్చారు.

వైదిక మతం పుట్టుకతోనే దోపిడీ స్వభావం కలిగిందిగా కనిపిస్తుంది. ఏ తిరుగుబాటునైనా నిర్వీర్యం చేసి తనలో ఇముడ్చుకోగల శక్తి దానికుంది. కాబట్టే ఇది పాలక వర్గాలకు బాగా ఉపయోగపడుతుంది. అందువల్ల రాజులందరూ సంస్కృత భాషకూ సంస్కృత సాహిత్యానికీ, సంస్కృతం తెలిసిన పండితులకూ విలువ ఇచ్చారు" (చెంచయ్య, వి. 2001 : 24).

శివకవి యుగంలోనూ ఆనాటి సమాజమే సాహిత్య వస్తురూపాల్ని నిర్దేశించింది. శివకవి యుగంలో అప్పటికే నిలదొక్కుకొని వ్యాప్తిలో ఉన్న అసమాన తాత్విక భావజాలం కలిగిన వైదిక మతంపైన నిరసన కనిపిస్తుంది. చాతుర్వర్ణ వ్యవస్థ, వర్గ అసమానతలు, మతపరమైన ఆధిక్యతా భావనలపై శివకవులు వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఆధునిక కాలంలో కుల అసమానతలను పెంచి పోషిస్తున్న హిందూమతాన్ని తిరస్కరించి క్రైస్తవం ఎలాగైతే సమానత్వ భావాలతో నిమ్నకులాల ఆధరాభిమానాలు చూరగొన్నదో, ఎట్లయితే ఒక ప్రత్యామ్నాయంగా నిలిచిందో ఆ కాలంలో కూడ వైదిక మతానికి ప్రత్యామ్నాయంగా శైవం నిలబడింది. శివ కవులు వైదిక మతంలోని అసమానతలను ధిక్కరిస్తూ శివభక్తులైనవారంతా సమానులేనని, వర్ణభేదం అక్కరలేదని అన్నారు. భాష విషయంలో కూడ నిరసన ప్రదర్శించారు. భాషకు రాజకీయ స్వభావం ఉంటుందని గుర్తించిన గొప్ప పరిశోధక దృష్టి శివకవులకు ఉన్నది. అందువల్లనే ఆధిపత్య వైదిక భాష అయిన సంస్కృతం స్థానంలో కొద్దిమేరకైనా ప్రజల భాషను నిరసనలో భాగంగానే ప్రవేశపెట్టి రచనలు చేశారు. అయితే దీనికి భిన్నంగా కవితా సరస్వతిని రాజులకు అమ్మనని చెప్పుకున్న పోతనగానీ, రాజుల సేవ నరకప్రాయమని చెప్పిన ధూర్జటిగానీ సారాంశంలో నన్నయాది కవులకంటే భిన్నం కాదు. నిజానికి ఇది కేవలం సాహిత్య సంబంధమైన విషయం మాత్రమే కాదు. ఆనాడు సమాజంలో వ్యాప్తిలో ఉన్న రెండు మత తాత్త్విక ధోరణుల మధ్యన ఉన్న వైరుధ్యం. ఆ మతాల్లో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రమేయం ఉన్న ప్రజలకు, పాలక వర్గాలకూ మధ్య ఘర్షణ. ఆ ఘర్షణనే అంతర్లీనంగా సాహిత్య సృజనలో అభివ్యక్తమయింది.

ప్రబంధాలను పుట్టించిన కృష్ణదేవరాయల యుగంలోని సాహిత్య వస్తు రూపాలు ఆనాటి దేశకాల పరిస్థితుల్ని పట్టి ఇస్తాయి. ఆయుగాన్ని ప్రబంధ యుగం అని కూడ వ్యవహరించడానికి ప్రధాన కారణం, నాడున్న ప్రధాన సాహిత్య ప్రక్రియ. ఈ ప్రక్రియ పుట్టుక కూడ గాలిలోంచి ఊడి పడలేదు. "రాయల యుగంలో మత దార్శనిక విధానంలో ప్రధానమైన మార్పు వచ్చింది. కృష్ణ దేవరాయలు ఆయనకు సమకాలికులైన ప్రబంధ కవులందరూ విశిష్టాద్వైతులు. ఈ విశిష్టాద్వైతమే ప్రబంధాల్లో ప్రధాన వస్తువు. అరణ్యాల్ని ఛేధించి సాగు చెయ్యటం 'కాడు వెట్టి' విజయనగర రాజ్యంలో విస్తృతమైంది. వర్తక శ్రేణులు ఎంతో అభివృద్ధి పొందాయి. దేవాలయాల్ని నిర్మిచటంలో నూతన శిల్ప పద్ధతులు ఆవిష్కరించపబడ్డాయి..రాజులు, సామంతులు, మంత్రులు, సేనా నాయకులు, వర్తకులు మొదలైన సంపన్న వర్గాలకి ఈ యుగం స్వర్ణయుగమే. చేతి వృత్తులు పరిశ్రమల స్థాయికి పెరిగింది. ఈ మారిన పరిస్థితులనుంచీ, శక్తుల నుంచీ పుట్టిందే ప్రబంధ ప్రక్రియ" (మధుసూదనరావు, త్రిపురనేని. 1997 : 166). ఈ ప్రబంధ రచనా యుగంలో సాహిత్యం భూస్వామ్య యుగంలోని దోపిడీ వర్గ జీవన విధానాన్ని వర్ణించింది. ఆనాటి రాజులు, వాళ్ల పరివారం, వారి విలాసవంతమైన జీవితాలు ప్రబంధ యుగ సాహిత్య లక్ష్యం. ఇదే క్రమంలో పీడిత వర్గ జీవన విధానాన్ని కూడ రాజులకు అనుకూలమైనదిగానే చిత్రించడం జరిగింది. నిజానికి ఆనాడు కష్టాన్ని నమ్ముకుని జీవించే ప్రజలు దుర్భర దారిద్ర్యాన్ని చవిచూశారు. కులవ్యవస్థ ప్రాభవం విచ్చల విడిగా ఉన్నది. స్త్రీ కేవలం ఒక భోగలాలస వస్తువుగానే గుర్తించబడింది. స్థూలంగా చెప్పాలంటే భూస్వామ్య యుగ లక్షణాలన్నీ, భూస్వామ్య సాహిత్యంలోనూ వ్యక్తమయ్యాయి. అయితే దీనికి భిన్నంగా మొత్తం భూస్వామ్య సమాజ, సాహిత్య లక్షణాలకు వెలుపల కూడ సాహిత్య సృష్టి జరిగింది. తత్వాలు, కీర్తనలు, పదాలు, పాటలు, చాటువులు, శతకాలు మొదలైనవి రాజాస్థానాలకు భిన్నంగా వచ్చిన సాహిత్యం. వీటిల్లో రాజులపట్ల నేరుగా నిరసన వ్యక్తం చేయడమూ, అలా వ్యక్తం చేయడానికి ఆదరువు లభించనప్పుడు దేవున్ని తోడుగా ఉంచుకోవడమూ, రాచరిక విధానాలనే తీవ్రాతితీవ్రంగా వ్యతిరేకించడమూ కనిపిస్తాయి. ఇలా ప్రబంధ యుగ సాహిత్యంలో సమాజంలోని రెండు వర్గాల వైరుధ్యం ,రెండు విభిన్న సాహిత్య పాయల మధ్య వైరుధ్యంగా మనకు  కనిపిస్తుంది.

ఈ తర్వాత వచ్చింది దక్షిణాంధ్ర యుగం. దీన్నే కొద్ది మంది తిరోగమన సాహితీవేత్తలు క్షీణయుగం అని పక్షపాత దృష్టితో వ్యవహరిస్తారు. ఇలా వ్యవహరించడానికి వారి సామాజిక, సాహిత్య దృక్పథమే కారణం. వారి దృష్టిలో సాహిత్యమంటే రాజాస్థాన సాహిత్యమే. నిజానికి ఇది తెలుగు సాహిత్య చరిత్ర రాసిన చాలామందిని పట్టి పీడించిన మహమ్మారి అని చెప్పాలి. మొట్ట మొదట సాహిత్యం ఏ ప్రజల నుంచైతే పుట్టిందో మళ్లీ ఈ యుగంలో అక్కడికే వెళ్లింది సాహిత్యం. యక్షగానం అచ్చంగా ప్రజల సాహిత్య ప్రక్రియ. వారి జీవితం నుంచి పుట్టిన సాహిత్య ప్రక్రియ. వారి జీవితాన్ని వారే చెప్పుకోవడంకోసం పుట్టిన ప్రక్రియ. యక్షగానాన్ని ప్రదర్శించేవాళ్లు అతి సామాన్యులు కనుక వారు వారి జీవితానుభవాలను అందులో ప్రోది చేసుకోవడమూ కన్పిస్తుంది. నాటకానికి మూలం యక్షగానాలు. ఆ యక్షగానానికి స్వర్ణయుగంగా వెలుగొందింది దక్షిణాంధ్ర యుగం. ఇది క్షీణయుగం కానేకాదు. ఏ మానవ సమాజపు సాహిత్య చరిత్రను అయినా సక్రమకోణంలో అన్వేషించగలిగితే సాహిత్యంలో క్షీణయుగం అంటూ ఉండదు. ఎందుకంటే ప్రజలంటూ ఉన్నప్పుడు, వారికి కష్టసుఖాలూ, ఆనందాలూ, అనుభూతులూ ఉన్నప్పుడు, వాటిని వ్యక్తీకరించడానికి భాష ఉన్నప్పుడు ఖచ్చితంగా సాహిత్యమనేది వెలువడుతూనే ఉంటుంది. అందులో ఆ కాలంనాటి సామాజిక పరిస్థితులు వ్యక్తం కావడమూ ఉంటుంది.

ఆధునిక సాహిత్య విమర్శకులు చేసిన సూత్రీకరణల ప్రకారం, 19 శతాబ్ది ఉత్తర భాగం నుండి సాహిత్యంలో ఆధునికత మొదలైంది. "సాహిత్యంలో ఆధునికతను రెండు విధాలుగా నిర్వచించవచ్చు. మొదటిది సమకాలీనతనే ఆధునికతగా నిర్వచించడం. ఈ దృష్టితో సమకాలంలో వచ్చిన ఏ సాహిత్యమైనా–సాంప్రదాయికంగాని, నవీనంగాని–ఆధునికం అవుతుంది. రెండవది మారిన ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులు పునాదిగా ఏర్పడిన కొత్త దృక్పథాలను, స్వరూపాన్ని సంతరించుకోవడమే ఆధునికత అని నిర్వచించడం. ఈ విధమైన సాహిత్యానికి అంతకు ముందులేని ప్రత్యేక లక్షణాలు, కొత్త విలువలు ఉంటాయి" (రంగనాథాచార్యులు, కె.కె(సంపా). 2005 : vii). ఆంగ్లేయులు సామ్రాజ్యవాదంలో భాగంగా భారత దేశానికి వచ్చినా వారి

స్వప్రయోజనాలకోసం అనేక సంస్కరణలు చేసినా అందులో కొన్ని అంశాలు భారతీయులకు లాభించాయి. వారు చేసిన ఆంగ్లీకరణం వలన ఆంగ్ల భాషా సాహిత్యాలతో సంపర్కం భారతీయ రచయితలను ఆధునిక భావాల వైపు ఆలోచించేలా చేసింది. ఆంగ్లేయులు పెట్టిన మిషనరీలు విశాల పేద ప్రజారాశులకు విద్య అందించాయి. మెకాలే మొదలైనవారు ప్రవేశపెట్టిన విద్యాసంస్కరణలు నూతన విద్యావ్యాప్తిని చేశాయి. దీంతో బెంగాల్ మొదలైన అనేక ఇతర రాష్ట్రాలతోపాటు తెలుగు రాష్ట్రాల్లో కూడా అప్పటికి సంఘంలో ఉన్న అనేక దురాచారాల మీద చైతన్యవంతమైన రచయితలు విలువైన రచనలు చేశారు. 19 శతాబ్ది ఉత్తరార్ధం నుంచి 20 శతాబ్దం దాకా వచ్చిన సాహిత్యోద్యమాలన్నీ దాదాపుగా సామాజికోద్యమాలు అనదగినవే. ఎందుకంటే సంఘసంస్కరణోద్యమం లేకుండ సంఘసంస్కరణ కవిత్వంగాని, తెలంగాణ సాయుధ పోరాటం లేకుండా తెలంగాణ పోరాట సాహిత్యంగాని, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ ప్రేరణతో ఏర్పడిన భారత కమ్యూనిస్టు పార్టీ దాని ఉద్యమమూ లేకుండా అభ్యుదయ సాహిత్యంగాని, జాతీయోద్యమం లేకుండా జాతీయోద్యమ కవిత్వంగాని, విప్లవోద్యమం లేకుండా విప్లవ కవిత్వం గాని, దళితోద్యమం లేకుండా దళిత సాహిత్యంగాని, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం లేకుండా ప్రత్యేక తెలంగాణోద్యమ సాహిత్యంగాని లేవు. ఇవి స్థూలంగా వివరించినవే తప్ప ఇంకా అనేక వాదాలు, ధోరణులు కూడ తెలుగు సాహిత్యాన్ని సమాజపరం చేశాయి. అంటే సామాజిక జీవన విధానమే అందులో అభివ్యక్తమైంది.

ఇలా ఒక్క తెలుగు సాహిత్యమనే కాదు సాహిత్యం దాని సహజసిద్ధమైన స్వభావం కారణంగా సమాజాన్ని ప్రతిబింబిచడమనేది ప్రపంచవ్యాప్త సాహిత్యాన్నీ, దానికి పునాదిగా ఉన్న మానవ సమాజ చరిత్రనూ అన్వయించి చూసుకుంటే తెలుస్తుంది.

తెలంగాణ సమాజ నడక నల్లేరు మీద ఏమీ సాగలేదు. దాదాపు 20వ శతాబ్దపు ఉత్తరార్ధందాకా బలమైన భూస్వామ్య, రాచరిక పాలనలో నలిగిపోయింది. అయితే నలిగిపోయి ఊరికే ఉండిపోలేదు కూడ. ప్రతి తీవ్ర అణచివేత ఎదుర్కున్న సందర్భంలోనూ ఎదురు తిరిగింది. పోరాడింది. తనను తాను ఆయుధం చేసుకున్నది. ఆ పోరాటంలో

ఎన్నో విజయాలూ, అపజయాలూ ఉన్నాయి. పీడిత ప్రజల, పీడక పాలకుల మధ్య వైరుధ్యం ఆ వర్గాల రద్దువరకు పోదు కాబట్టి వాటి ఉనికి కలిగిన తెలంగాణ సహజంగానే ఘర్షణాయుతమైంది. సమాజం ఇట్లా ఉన్నప్పుడు దాని చైతన్యయుత ప్రతిఫలనమైన సాహిత్యం విరివిగా వెలువడింది. కథలు, నవలలు, నాటకాలు, పాటలు, కవిత్వం మొదలైన భిన్న సాహిత్య ప్రక్రియల్లో సామాజిక పరిణామాలను చిత్రించే సాహిత్యం వెలువడింది. ఒక సామాజిక సంచలనానికి, దాని ప్రేరణకు, వ్యాఖ్యానానికి, విశ్లేషణకు మిగతా అన్ని సాహిత్య ప్రక్రియలకంటే వేగంగా, వెనువెంటనే వెలువడే కవిత్వం ఊటలుగా ఉబికి వచ్చింది. ఈ క్రమం అభ్యుదయ కవిత్వంతో మొదలై, 'రాత్రి' కవిత్వం, దిగంబర కవిత్వం, తిరగబడు కవిత్వం, విపశ్యన కవిత్వం, విప్లవ కవిత్వం, స్త్రీవాద కవిత్వం, దళిత కవిత్వం, ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం, మైనార్టీ కవిత్వం, బీసీవాద కవిత్వం మొదలైన వాటితో విస్తృతమైంది. స్థూలంగా తెలంగాణ నేలమీద వెలువడిన కవిత్వంలో, మరీ ముఖ్యంగా వచన కవిత్వంలో విప్లవ కవిత్వం, ప్రత్యేక తెలంగాణ కవిత్వం రాశిలోనూ, వాసిలోనూ మిగతా అన్ని కవిత్వాల కంటే పైనున్నవి. ఉద్యమ కాలం, వైశాల్యమే వీటిని మిగతావాటికంటే భిన్నమైన స్థానంలో ఉంచాయి. స్వీకృత పరిశోధనాంశంలోనిది ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం. 1948లో మొదలైన ప్రత్యేక తెలంగాణ భావన, 1968లో మొదలైన ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో విస్తరించి, 1995 మలిదశలో సైద్ధాంతిక పునాదిని ఏర్పర్చుకొని, 2009 నుండి వెల్లువగా మారింది. ఈ క్రమమంతా తెలంగాణ సమాజ చరిత్రను రికార్డు చేస్తూనే వచ్చింది. ఉద్యమానికి నేపథ్యాన్ని చిత్రిస్తూ, ప్రేరణను అందిస్తూ, ఉద్యమం నడిచిన తర్వాత దాని సారాంశాన్ని ఎత్తిపడుతూ, భవిష్యత్తుకు ఊహాప్రతిపాదనలు చేసింది. మొత్తంగా ఆరున్నర దశాబ్దాల ప్రత్యేక తెలంగాణ ప్రజాకాంక్షను గ్రంథస్థం చేసింది.

**అధ్యాయం - 4**

# ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం - మౌలిక భావనలు

ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ రాష్ట్రాన్ని బలవంతంగా విలీనం చేసి తెలంగాణ ప్రజలకు అన్యాయం చేసిన తర్వాత ఇక్కడి ప్రజా జీవితంలో ఎటువంటి మార్పులు సంభవించాయో మొదటి అధ్యాయంలో చర్చించాను. చారిత్రకంగానే ఉజ్జ్వలమైన పోరాటాన్ని వారసత్వంగా కలిగిన తెలంగాణ ప్రాంతం సీమాంధ్ర వలసాధిపత్యానికి వ్యతిరేకంగా ఎట్లా పోరాడిందో రెండవ అధ్యాయంలో చర్చించాను. సాహిత్యం ఎట్లా సామాజిక చైతన్య నిష్పన్న రూపమో శాస్త్రీయంగా మూడవ అధ్యాయంలో చర్చించాను. ఈ అధ్యాయంలో ఆరు దశాబ్దాల ప్రత్యేక తెలంగాణ ఉద్యమ చైతన్యం కవిత్వంలో ఎలా వ్యక్తం అయ్యిందో, ఆ ఉద్యమ కవిత్వంలో ఉన్న మౌలిక భావనలేమిటో చర్చిస్తాను.

ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు అటు ఇటుగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కాంక్షతో కవిత్వం వచ్చినట్లుగా ఇప్పటికి జరిగిన పరిశోధన ఫలితాల్లో కనిపించడం లేదు. కానీ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం రాష్ట్రవ్యాప్తమై, సకల జనులు ఉద్యమంలోకి చేరాక తొట్టతొలిగా తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో భాగంగా కవిత్వం వచ్చింది. ఆ తరువాత ఈ కవిత్వం ఒక ప్రవాహంలాగ కనిపించదు. కానీ మళ్లీ సరళీకృత ఆర్థిక విధానాల అమలు(1991)కు తెలంగాణ ఒక ప్రయోగశాలగా మారిన తర్వాత వచ్చిన ప్రజాచైతన్యంలో మళ్లీ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం (మలిదశ పూర్వార్థం) ఒక ముఖ్యమైన భాగం అయ్యింది. ఆ ఉద్యమంతోపాటుగా ప్రత్యేక తెలంగాణోద్యమాన్ని బలపరిచే కవిత్వం కూడా వెలువడింది. “1990ల మధ్యకాలంలోనే తెలంగాణా కవి ప్రాంతీయ స్పృహను ప్రబలంగా వ్యక్తం చేయడం కనిపిస్తుంది. ఎవరి అనుభవాల్ని వాళ్లే రాయాలన్న వాదం అప్పటికే వచ్చింది. స్త్రీలు, దళితులు, మైనారిటీలు తమ పరిధిలో తాము ఏకమవుతున్నారు. ఇదే సమయాన ప్రాంతీయ స్పృహ కూడా కొత్తగా రాసేవారికి ఊతమిచ్చింది. ఆంధ్రప్రదేశ్

ఏర్పడ్డాక తెలంగాణ వివక్షకు లోనయింది. ఇది గత పది, పన్నేండేళ్ళ కాలంలో మరింత తీవ్రమైంది. కోస్తా నుంచి తెలంగాణకు వలసవచ్చినవారి సంఖ్య పెరిగింది. వారు తెలంగాణలో వేలాది ఎకరాల భూముల్ని కొనడం, పరిశ్రమల్ని స్థాపించడం, తెలంగాణలో విద్యాలయాలను స్థాపించడం, రియల్ఎస్టేట్ వంటి లాభదాయకమైన వ్యాపారాల్లోకి చొచ్చుకురావడం తొంభైలనుంచి పెరిగింది. వారి చొరబాటు కారణంగా ఈ ప్రాంతవాసుల్లో అభద్రతాభావం నెలకొంది. తమ ఉనికి ప్రశ్నార్థకమైందన్న సంగతి వారు గ్రహించారు. మరోవైపున వ్యవసాయంలో వాణిజ్యధోరణులు ప్రబలాయి. ఇంకోవైపున భాషా సంస్కృతులు సైతం అపహాస్యానికి లోనయ్యాయి. మొత్తంగా ఈ ప్రాంత సామాజిక, సాంస్కృతిక జీవితం విచ్ఛిన్నమైంది. సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యం, గ్లోబలైజేషన్ క్రమం తెలంగాణవాసుల్ని మరింత దెబ్బతీసింది. వ్యవసాయాలు కుప్పగూలాయి. బతుక్కి భద్రత లేకుండా పోయింది. నిరుద్యోగం విశ్వరూపం ధరించింది. ఉపాధి అవకాశాలు క్షీణించాయి. ఈ వాస్తవాల్ని తప్పించుకోవడం ఏ కవికీ సాధ్యం కాదు"(గుడిపాటి. 2006 : 15). ఇట్లా 90వ దశకంలో ఊపందుకున్న ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం 20 శతాబ్దారంభానికి  మరింత విశాలమై ప్రత్యేక తెలంగాణ మలిదశ ఉత్తరార్ధ ఉద్యమంలో శిఖరాగ్రానికి చేరుకున్నది. దీనికి కొలమానం కవులు – కవిత్వం రాశిలోనూ, వాసిలోనూ క్రమక్రమంగా ఎదగడం. తొలిదశ ఉద్యమంలో ప్రత్యేక తెలంగాణను కాంక్షించిన కవులు పదుల సంఖ్యలో ఉండి, పరిమితమైన కవిత్వం వెలువడితే,  మలిదశ ఉత్తరార్ధ ఉద్యమ సమయానికి వేలాదిమంది కవులు, రెండున్నర లక్షలకుపైగా కవితలు వెలువడ్డాయి. ఆ కవితల్లో రూపపరమైన పరిణతితోపాటు, వస్తు వైవిధ్యమూ విశాలమైంది. ప్రత్యేక తెలంగాణ భావన దారంలాగా ఉంటూ, అనేకానేక సామాజికాంశాలు పూసల్లా కనిపిస్తాయి. తెలంగాణ బుద్ధిజీవులు చేసిన పరిశోధనల్లో వెలుగు చూసిన వాస్తవాలు, తెలంగాణ సమాజానికి నూతన చైతన్యాన్ని అందివ్వడంతో ప్రత్యేక తెలంగాణోద్యమ కవులు అనేక మౌలికమైన అంశాలను కవిత్వీకరించారు.

స్థూలంగా ప్రత్యేక  తెలంగాణోద్యమ కవిత్వం వ్యక్తం చేస్తున్న మౌలిక భావనలు ఇక్కడ పేర్కొంటున్నాను. అనేకానేక అంశాలు ఈ భావనల్లో అంతర్భాగంగా ఉండడంవల్ల

ప్రాతినిధ్య, మౌలిక భావనలను వ్యక్తం చేసే కవితల్ని, కవితా పంక్తుల్ని మాత్రమే ఇక్కడ చర్చిస్తున్నాను. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వ మౌలిక భావనలు ఇవి.

## 4.1. నీళ్లు

భూమి మీద ఉన్న ప్రాణకోటి మొత్తం నీటి నుండే ఆవిర్భవించింది. నాటి నుండి నేటిదాకా ఆ ప్రాణకోటి ఉనికి నీటిమీద ఆధారపడే సాగుతున్నది. నీటిని సృజనాత్మకంగా వినియోగించుకోగలిగే మానవుని జీవితంలో దాని విలువ మరీ ఎక్కువ. అందుకే ప్రపంచంలోని నాలుగు పురాతన నాగరికతలు నదీలోయలోనే వికసించాయి. ఆ వికాసమే మనిషికీ, నీటికీ ఉన్న విడదీయరాని సంబంధానికి సాక్ష్యం ఇస్తుంది.

ఏ ప్రాంతంలోనైనా నీరు లేకుండా మానవ మనుగడ కష్టం అవుతుంది. తెలంగాణలో రెండు జీవనదులు, అనేక ఉపనదులు, వాగులు, వంకలు, చెరువులు, కుంటలు ఉన్నాయి. కానీ వాటి వినియోగ అవకాశాలు మాత్రం మృగ్యమైపోయాయి. కనుకనే తెలంగాణ ప్రజల జీవన పరిస్థితులు సంక్లిష్టంగా మారిపోయాయి. భూములు బీడువడ్డాయి. నీరు, భూమి వినియోగంలో లేనప్పుడు స్థానిక ప్రజల అభివృద్ధి కుంటుపడుతుంది. ఆ స్థితినే నందిని సిధారెడ్డి 2003లో రాసిన 'నీళ్లకోసం' కవితలో ఇట్లా వివరిస్తారు.

**"మట్టికి జీవశక్తిని**
**మాటకు మంత్రశక్తి నిచ్చేది నీళ్లే**
**మనం పిలిస్తే పలికే నీళ్ల కోసమే మన కొట్లాట"**
**(సిధారెడ్డి, నందిని. 2017 : 356)**

'మనం పిలిస్తే పలికే నీళ్లు' అని కవి చెప్పడంలో నీళ్లు మన పక్కనే ఉన్నాయి గానీ, అవి మనకు దక్కడం లేదనే ఉద్దేశం దాగి ఉన్నది. కృష్ణా, గోదావరి నదుల

పరీవాహక ప్రాంతంలో తెలంగాణ భూభాగమే అధికంగా ఉన్నా వాటి నీరు మాత్రం తెలంగాణకు న్యాయబద్ధంగా అందడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడేకంటే ముందు హైదరాబాద్ రాష్ట్రం కోసం నిర్మించతలపెట్టిన ప్రాజెక్టులు కొన్ని నిర్మిచకుండా ఆపేశారు. మరికొన్నింటిని నిర్మించినా, తెలంగాణకు నీరు అందే అవకాశాలను సగానికి సగం తగ్గించి వేశారు. ఇది సీమాంధ్ర రాజకీయ స్వార్థం కోసం జరిగిన పరిణామం. ఈ విషయాన్నే సిద్దెంకి యాదగిరి రాసిన 'తెగించే తెలంగాణ' కవితలో ఇట్లా వివరించారు.

**"ఆనకట్టలు కట్టి, ప్రాజెక్ట్‌లు నిర్మించి**
**చెరిసగం నీళ్లు పారిచ్చుకుందామని**
**మసిపూసి మారెడు కాయజేసి**
**వొదురు ఒట్టిమాటనా..? అని**
**తలాపున పారుతున్న గంగనీళ్లను తరలిస్తుంటే**
**తలుచుకుందామా?.. గెలుచుకోవద్దా?"**
**(యాదగిరి, సిద్దెంకి. 2014 : 106)**

ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేస్తున్నప్పుడు ప్రధానంగా చర్చకు వచ్చిన అంశాల్లో నీరు ఒకటి. అందుకే 'పెద్దమనుషుల ఒప్పందం'లో తెలంగాణకు చెందవల్సిన నీటివాటాకు సంబంధించిన రక్షణల ప్రస్తావన ఉన్నది. అయితే, ఆనాడు ఇచ్చిన వాగ్దానాలకు భిన్నంగా ఆచరణ ఉన్నది. తెలంగాణకు నీటివాటా విషయంలో అన్యాయం జరిగింది. "భారీ నీటిపారుదల ప్రాజెక్టుల నుండి కాలువల ద్వారా నీరందించే విషయంలో తెలంగాణ ప్రాంతానికి అపారమైన నష్టం జరిగింది" (జయశంకర్, కొత్తపల్లి. 2015 : 48). కనుకనే తెలంగాణ కవి మాకు రావాల్సిన నీటివాటాకోసమే మా తండ్లాట అని చెప్పాడు.

తెలంగాణకు నీరు అందకపోవడానికి కారణం కోస్తాంధ్ర పాలకుల స్వార్థ ప్రయోజనాలే అని ఇంతకు ముందే వివరించి ఉన్నాను. అయితే, ఆ నీటిని ఆంధ్రాకు తరలించం కారణంగా ఏం జరిగిందో సీతారాం రాసిన 'భౌగోళిక భవిత – కొన్ని

రాజకీయ ఆకాంక్షలు’ కవితలో వివరించాడు.

**“గుంటూరు మిర్చి**
**నూజివీడు రసాలు**
**ఉభయ గోదావరులు**
**తెలంగాణా కన్నీళులు”**
**(గౌరీశంకర్, జూలూరు(సంపా). 2002 : 393)**

గుంటూరు మిర్చి కేవలం ఆహార వినియోగ కూరగాయగానే కాకుండా వ్యాపార పంటగా కూడా గుర్తించడం జరుగుతున్నది. దీనికి కారణం ప్రధానంగా గుంటూరు మిర్చి వ్యాపారంలో ప్రముఖ స్థానంలో ఉండడమే. అదే విధంగా నూజివీడు మామిడి పళ్లకు కూడా దేశవ్యాప్తంగా పేరున్నది. అయితే, కవితలోని ఈ ‘మిర్చి’, ‘నూజివీడు రసాలు’ అన్న వాటిని కేవలం వాచ్యంగా మాత్రమే కాకుండా వేరే ఉద్దేశాన్ని కూడా రచయిత లక్ష్యం చేసుకున్నాడు. అది తెలంగాణకు రావాల్సిన నీటిని ఆంధ్రాకు తరలించుకుని అక్కడ పంటల్ని, వ్యాపారాల్ని అభివృద్ధి చేసుకున్నారుగానీ, వాస్తవానికి ఆ లాభాలన్నీ తెలంగాణ ప్రజలకు రావాల్సిన నీటివాటాను అక్రమంగా తరలించడం వల్లనే వస్తున్నాయనేది కవి భావన. అందుకే ఆయన ఉభయ గోదావరి జిల్లాల ప్రగతి అన్నప్పుడు, ఆ ప్రగతి వెనుక తెలంగాణ ప్రజల కన్నీళ్లు ఉన్నాయని చెప్పాడు.

తెలంగాణకు కేవలం సాగునీటి విషయంలోనే కాదు, తాగునీటి విషయంలోకూడా అన్యాయమే జరిగింది. ఈ పరిస్థితి పరోక్షంగా తెలంగాణా వ్యాప్తంగా, ప్రత్యక్షంగా నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, ఆదిలాబాద్ లాంటి ప్రాంతాల్లో కనిపిస్తుంది. ఈ స్థితినే దర్పోల్ల రమేశ్ రాసిన ‘వలపోత’ దీర్ఘకవితలో ఇట్లా వివరిస్తాడు.

**“తలాపున జీవనది ఉర్కులాట**
**కొనుక్కు తాగెటి**

**తలరాత ప్రతీపూట ఒక బహుమానం**
**ఇంట్లోడే ఇంటికి పరాయి**
**బతుకును సరుకుజేసినోనికి**
**నీళ్ళొక లెక్కా?"**
**(రమేశ్, డప్పోల్ల. 2013 : 2)**

తెలంగాణకు రెండు జీవనదులు ఉన్నప్పుడు తెలంగాణ ప్రజలందరికీ తాగునీరు అందాలి. కానీ తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు ఆ సౌకర్యం లేదు. ఇవాళ తెలంగాణవ్యాప్తంగా కనిపిస్తున్న 'మినరల్ వాటర్' వ్యాపారానికి మూలం అదే. ఇంతకు ముందు భూగర్భ జలాలు అధికంగా ఉండేవి. ఏ గ్రామంలో చూసినా బోరునీళ్లు తాగే పరిస్థితి ఉండేది. కానీ నేడు నేల అంతర్భాగంలోనే నీళ్లు కొరవడ్డాయి. దాని కారణంగా తాగు నీరు అందడం లేదు.

తాగునీటి విషయంలో మొత్తం తెలంగాణలోనే నల్గొండ జిల్లా పరిస్థితి చాలా విచిత్రంగా, విషాదంగా కనిపిస్తుంది. జీవనది అయిన కృష్ణా, మహబూబ్‌నగర్ గుండా తెలంగాణలోకి ప్రవేశిస్తుంది. ఆ తర్వాత నల్గొండ జిల్లా మీదుగా పోతుంది. కానీ నల్గొండ జిల్లా ప్రజలకు తాగునీరు దక్కడం లేదు. పైగా మిగతా ప్రాంతాలకు ఉండే బోర్లు, బావుల అవకాశాలు కూడా నల్గొండకు లేవు. లేవంటే లేవనికాదు, వాటి నిండా అత్యంత భయంకరమైన 'ఫ్లోరిన్' నిండి ఉన్నది. ఆ నీరు తాగిన కారణంగా కడుపులోని బిడ్డలకు అంగవైకల్యం వస్తున్నది. పిల్లలకు, పెద్దలకు అంతుచిక్కని వ్యాధులు వస్తున్నాయి. అయినా కృష్ణా నీళ్లు అందని కారణంగా తప్పని పరిస్థితుల్లో జీవిక కోసం అవే నీళ్లు తాగవల్సిన పరిస్థితి వస్తున్నది. ఈ స్థితినే వాణి రాసిన 'రండి పోరాడుదాం' కవితలో ఇట్లా వివరించారు.

**"బిరబిర కృష్ణమ్మది నల్లగొండ నివాసం**
**తాగునీళ్లు లేకపాయె – ఫ్లోరోసిస్ శాపమాయె**

**రండిరా పోరాడుదాం తెలంగాణ కొరకు మనం**
**రండిరా పోరాడుదాం తాగునీటి కొరకు మనం"**
**(బుచ్చిరెడ్డి, కోమటిరెడ్డి(సంపా). 2012 : 44)**

నల్గొండ జిల్లాలో ఉన్న ఈ విషాదకరమైన పరిస్థితి మరే ఇతర తెలుగు ప్రాంతంలో కనిపించదు. ప్రభుత్వాలకు కూడా ఈ స్థితి తెలియనిది కాదు. కానీ ఉన్నది పరాయి పాలకులు కనుక ఈ సమస్యను ఎప్పటికప్పుడు పట్టించుకోకుండా, లేదంటే ఉపశమనాలు కలిగిస్తూ దాటవేస్తూ పోయారు. "ఫ్లోరోసిస్ వ్యాధి జిల్లా ప్రజలను బీభత్సం చేస్తుంది. ఈ జబ్బు తల్లి నుండి కూడా సంక్రమిస్తుంది. ఇది ఇంకా వివిధ ప్రాంతాలకు విస్తరిస్తున్నది. చికిత్సలేని ప్రాణాంతక వ్యాధి ఇది. వేలాదిమంది జవసత్వాలు పసితనంలోనే ఉడిగి పోతున్నాయి. కనీసం ఈ ప్రాంత ప్రజలకు ప్రత్యేక శ్రద్ధతో రక్షిత మంచినీటిని కూడా ఈ ప్రభుత్వం కల్పించలేకపోయింది. కలుషిత నీటితో ఇబ్బంది పడుతున్న రాష్ట్రాలన్నింటా కేంద్ర ప్రభుత్వం 75 శాతం, మరియు రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం డబ్బును కేటాయించి త్రాగే నీటి సౌకర్యాన్ని కల్పించాలని ఈ ప్రభుత్వాలే ప్రకటించుకున్నాయి. అలాగే ఈ రాజ్యాంగంలోని ఆర్టికల్: 1లో 39, 47 ప్రకారం పౌరులందరి ఆరోగ్య సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదేననీ, కాలుష్య రహిత నీటిని ప్రతి పౌరుడు పొందడం, నాణ్యమైన జీవితాన్ని గడిపే హక్కు, స్వేచ్ఛగా జీవించే హక్కులో భాగంగా ఉంటుందని, ఫ్లోరోసిస్ ఉన్న ప్రాంతాలలో శాశ్వత నీటి ప్రాజెక్టు అమలుకు వచ్చే వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరిపడ సరఫరా చేయాలని, అలా చేయకపోతే ఈ ప్రాంత వాసులకు ఇతర ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించాలని ఉద్ఘాటించింది"(సి.పి.ఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ. 2003 : 6). కానీ నల్గొండ జిల్లా విషయంలో రాజ్యాంగం కల్పించబడిన హక్కులు కూడా కాలరాయబడింది. పర్యవసానంగా లక్షలాదిమంది ఇంకా ఫ్లోరోసిస్‌బారిన పడి జీవచ్ఛవాలుగా మారుతూనే ఉన్నారు.

చారిత్రకంగా పరిశీలించినప్పుడు తెలంగాణ ప్రజల జీవితంలో చెరువుల పాత్ర అతి కీలకంగా ఉంటూ వచ్చింది. "కాకతీయుల నుండి అసఫ్‌జాహీలదాకా తెలంగాణ

అంతటా వేలాది చెరువులు నిర్మాణం అయినాయి. చెరువుల చుట్టూ ఒక గొప్పదైన సంస్కృతి నిర్మాణం జరిగింది. అందుబాటులో ఉన్న గణాంకాల ఆధారంగా 20వ శతాబ్దం ఆరంభానికి ముందే తెలంగాణలో 21 వేల చెరువులున్నాయని, అవి 8 లక్షల 80వేల ఎకరాలకి సాగునీటి సౌకర్యాన్ని కల్పించాయని అర్థమవుతున్నది. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడేనాటికి 11 లక్షల హెక్టార్ల భూమి చెరువుల కింద సాగవుతుండేది. ఇపుడు 5 లక్షల హెక్టార్లకు పడిపోయింది"(శ్రీధరరావు దేశ్‌పాండే. 2008 : 127). ఈ మాటలు తెలంగాణలోని చెరువుల పరిస్థితిని తెలియజేస్తాయి. ఇవాళ తెలంగాణ వ్యాప్తంగా చూసినప్పుడు కేవలం పదుల సంఖ్యలో మాత్రమే చెరువులు నీళ్లతో నిండి వ్యవసాయానికి ఉపయోగపడుతున్నాయి. వేలసంఖ్యలోని చెరువులు పదుల సంఖ్యలోకి రావడం యాదృచ్ఛికం కాదు. చెరువు సజీవంగా ఉండడానికి మానవ ప్రయత్నం కూడా ఉండి తీరాలి. పూడికతీతలు లేకపోతే కాలక్రమంగా చెరువు నీటి నిలువ సామర్థ్యం తగ్గడం మాత్రమే కాకుండా కొద్ది కాలానికి అది సమతల భూభాగంలాగా మారిపోతుంది. ఆ తరువాత దాన్ని వ్యవసాయ భూమిలాగానే వాడుకోవల్సి వస్తుంది. ఇవాళ తెలంగాణ వ్యాప్తంగా కనిపిస్తున్న దృశ్యం ఇదే. దీని పర్యవసానంగా సహజంగా, భూమి మీదనే నీరు లభించే స్థితి నుండి భూమికి రంధ్రాలు పొడిచి, బోర్లు వేసి పాతాళగంగను నేలమీదకి తీసుకురావాల్సిన అగత్యం ఏర్పడింది. ఈ విషయాన్నే ఐతా చంద్రయ్య 'చెరువు బోర్‌మంది' అనే కవితలో

**"మా ఊరి చెరువు**
**మనసు పొరల్ల దొర్లింది**
**నా గుండెకాయ చెరువై పోయింది**
**జ్ఞాపకాల గుప్పిట్లో ఆనాడు**
**నిండా నీళ్ళతో నిండుగర్భినిలాగుండేది**
**అట్టడుగు తడి కరువై నేడు**
**ఆమాంతం 'బోరు'మంది"**
**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 355)**

చెరువు అదృశ్యమై అది కేవలం ఒక పురాస్మృతిగా మిగలడంవల్ల తెలంగాణ ప్రజల గుండెకాయలు చెరువైపోయాయని కవి ఉద్దేశ్యం. ""బోరు'మంది" అనే పదప్రయోగం లోతైన భావాన్ని ఉద్దేశించింది. ఎండిపోయిన చెరువే అనివార్యంగా మీరు బోరుమీద ఆధారపడవల్సిన స్థితి ఏర్పర్చుకున్నారు అని చెప్పినట్టు కనిపిస్తుంది.

చెరువులు ఎండిపోవడం కారణంగా తెలంగాణ వ్యాప్తంగా ప్రజల జీవన విధానంలో ఏర్పడిన సమస్యల్ని యం.డి.ఇద్రీస్ 'నా తెలంగాణ' కవితలో వివరించాడు.

**"పచ్చని పల్లెనాది**
**పల్లెలోన చెరువునాది**
**పల్లెలన్ని చిన్నబోయె**
**చెరువులేమో వాడిపాయె**
**నా పల్లె జనం గుండె పగిలి**
**వలసెల్లి బోయిరి! నను ఒంటరోణ్ణి జేసిరి!!**
**ఏమి ఖర్మ వచ్చినాది**
**ఎంత కరువు వచ్చినాది"**
**(రవి ప్రకాశ్, సంబరాజు(సంపా). 2010 : 24)**

చెరువు ఉన్నప్పుడు నీళ్లుండేవి. నీళ్లతో వ్యవసాయం సాగేది. చెరువు లేక కరువు ఏర్పడింది. ప్రత్యామ్నాయంగా పాతాళంలోకి బోర్లు వేసుకున్నా, చెరువులు ఉన్నప్పుడే బోర్లు కూడా ఉండగలవు. ఇది ఒక చక్రం. చెరువు లేదు, బోర్లలో నీళ్లు లేవు. అనివార్యంగా మనిషి మనుగడ క్లిష్టతరమవుతుంది. కనుక బతుకుదెరువునిచ్చే ప్రాంతాలకు తరలిపోవడం అన్నది తప్పని స్థితి. అందుకే తెలంగాణ వ్యాప్తంగా వలసలు కనిపిస్తున్నాయని చెప్పాడు.

సంవత్సరాలకొద్దీ చెరువును చూసిన మనిషి, చెరువును ఉపయోగించుకున్న మనిషి, చెరువుతో జీవన బంధాన్ని పెనవేసుకున్న మనిషి చెరువు ఎండిపోతే ఎలా

గుండెపగులుతాడో నందిని సిధారెడ్డి రాసిన 'ఎండిన చెరువు ముందు' కవితలో వివరించారు.

**"ఎండిన చెరువు ముందు నిలబడితే**
**పద్యం ఎండి పట్టున పలుగుతుంది**
**పిట్టలూ లెవ్వు పాటలూ లెవ్వు**
**బుడుంగుమనే బుడుబుంగల జాడలేదు**
**కిరణాలకు ఎగిసిపడే చేపపిల్లల గురుతుల్లేవు**
**మైసమ్మ గుడిదిక్కు మల్లి సూసే మానవుడే లేడు**
**ఎండిన చెరువును చూస్తే**
**ఏడుపు ఎగేసుకొస్తడి**
**ఊరందర్నీ సాదిన చెరువు**
**ఉనికే ఉత్తదయింది**
**పాడుపడ్డ రాజకీయంల**
**పానాది పాడువడింది**
**ఇప్పుడు**
**పానాదులన్నీ**
**బస్టాండు దిక్కే"**
**(సిధారెడ్డి, నందిని. 2017 : 288, 289)**

ఈ కవిత 2000 సంవత్సరంలో రాసినట్లు స్వయంగా కవి కవిత కింద ఆధారం ఇచ్చాడు.

అంబటి వెంకన్న 'అమ్మలా చెరువు' అనే కవితలో
**"ముండ్ల బుట్టైన సర్కారువనం**
**ఇపుడు నా తల్లి వంటి నిండ**

**మండలు గీర్క పోందే**

**బయటికి రాలేని పొద్దు**

**ఎన్నెల రాత్రుల్లో**

**ఎగిరెగిరి తుంగ దొక్కిన కాలు**

**ఇపుడు కదిపితే గాయం**

**బీర చిక్కె విచ్చిన నెర్రెల్లో**

**గంగజాద కోసం**

**చూపు చితికిన కనుగుడ్లు**

**ఎవడు గీశాడో**

**నా తల్లి నుదుటిపై గీత**

**ఎవడెత్తుకెళ్ళాడో**

**నా తల్లి పూల నవ్వుల్ని**

**లేలేత కేరింతల్ని"**

**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 4)**

చెరువు చుట్టూ తెలంగాణ సంస్కృతి నిర్మాణం అయ్యింది. కానీ అది చెరువు ఎండిపోవడంతో విధ్వంసం అయ్యింది. అందుకే కవి చెరువును తల్లిలా భావిస్తూ రోదనాపూర్వకంగా గతాన్ని తలపోశాడు.

సరిగ్గా ఈ స్థితినే వివరిస్తూ యం.వెంకట్ 'కయాలు' అనే కవితలో ఇలా రాశాడు.

**"నీల్లు లేవు నీరికంటి లేదు**

**ఏరు లేదు ఎండ్రికిచ్చ లేదు**

**ఆకుల్లేవు ఆగులమాసం లేదు**

**ఎల్లాయికి ఎడ్లు లేవు**

**మల్లాయికి బర్లులేవు**

**బుడుబుంగకు ఇంగ అడుగుంగాట లెక్కడియి**
**కమ్మగూడెం వచ్చి అమ్మగూడెం ఆగమైంది"**
**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 72)**

మొత్తం ఈ విధ్వంసానికి కారణాన్ని ఒకే ఒక్క కవితా పాదంలో వివరించాడు కవి. 'కమ్మగూడెం వచ్చి అమ్మగూడెం ఆగమైంది' అన్న వాక్యంలోని సారమే అసలు విషయాన్ని బయటపెడుతుంది. తెలంగాణ ప్రజలకు అన్యాయం చేసింది సీమాంధ్ర పాలకులు. ఆ పాలకుల్లో ఎక్కువమంది కులం 'కమ్మకులం'. కనుక ఆ కుల స్వార్థ పాలకులను ఉద్దేశిస్తూ, వారే తల్లివంటి నీటి వనరును ఆగం చేశారని చెప్పాడు.

నీళ్లు లేకుండా మనిషికి చేత లేదు. బతుకు లేదు. ఎదుగుదల లేదు. అందుకే తెలంగాణ అభివృద్ధి కుంటుబడిపోయింది. కనుకనే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ప్రధానంగా తెలంగాణకు రావాల్సిన నీటివాటాకు సంబంధించి ప్రశ్నించింది, కొట్లాడింది. మా నీళ్లు మాకు దక్కడమే అసలైన సామాజిక న్యాయం అని శాస్త్రీయంగా వాదించింది. దీనినే వేణు సంకోజు రాసిన 'మా నీళ్ళు మాకు..' కవితలో ఇట్లా వివరించారు.

**"నీళ్ళు..**
**నీళ్లేగావాలిప్పుడు**
**నిఖార్సయిన మానీళ్లు మాకు**
**ఒక్క సుక్కసుంటిసుంటవోకుంట**
**మాకేదక్కి తీరాలిప్పుడు**
**మానీళ్ళు మాకే చెంది తీరాలెప్పుడూ!**
**మనుషుల్ని మనుషులోలిగ నేసుతాగ**
**సల్లగుండనిచ్చే నీళ్ళు**
**స్థానిక ప్రజల పాలిటి కన్నీళ్లుగాదు**
**బతుకుల్ని బీళ్లు జెయ్యనియ్యని నీళ్ళు**

**సక్కదనాల నీళ్ళు**
**సదాకాపడేనీళ్ళు**
**ప్రతి సుక్కా దక్కి తీరాలిప్పుడు**
**మా నీళ్లు, మాకే చెంది తీరాలెప్పుడూ!"**
**(బుచ్చిరెడ్డి, కోమటిరెడ్డి(సంపా). 2012 : 2)**

నిజానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నిర్మాణం జరిగినప్పుడు చేసుకున్న ఒప్పందాల ప్రకారం తెలంగాణకు చెందవల్సిన నీటిని అందించి ఉంటే తెలంగాణ ఇంత దయనీయ స్థితిలో ఉండేది కాదు. కానీ సీమాంధ్ర పాలకవర్గాల స్వార్థ ప్రయోజనాల కారణంగా సాగునీరు, తాగునీరు రెండూ అందలేదు. పైగా ఉన్న నీటి వనరుల్ని కూడా లేకుండా చేయడం కారణంగానే తెలంగాణ అభివృద్ధి కుంటుపడింది. కనుకనే ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి 'నీరు' ప్రధాన భూమిక అయ్యింది.

## 4.2. వ్యవసాయం

మానవ నాగరికతలో వ్యవసాయానిదే అగ్రభాగం. ఏ సమాజాల్లోని మానవుని మనుగడకైనా వ్యవసాయమే మూలకారణంగా ఉంటున్నది. మనిషి జీవితంలో అంత ముఖ్యమైన వ్యవసాయం తెలంగాణ ప్రాంతంలో వెనుకపట్టు పట్టింది. హైదరాబాద్ రాష్ట్రాన్ని ఆంధ్రరాష్ట్రంతో కలిపి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేశాక క్రమక్రమంగా తెలంగాణలోని వ్యవసాయ రంగం సంక్షోభంలోకి నెట్టివేయబడింది. "దేశంలోని అనేక ప్రాంతాల వలె తెలంగాణలో కూడా వ్యవసాయమే ప్రధాన వృత్తి. దక్షిణ భారతదేశంలోని అతి పెద్ద నదులైన గోదావరి, కృష్ణ, వాటి అసంఖ్యాక ఉపనదులు ఈ ప్రాంతంలోని ప్రతి జిల్లా నుండి ప్రవహిస్తున్నాయి. ప్రకృతి ప్రసాదించిన ఈ అపార సంపదతో ప్రతి గ్రామాన్ని సస్యశ్యామలం చేయవచ్చు. వీటికి తోడు కాకతీయుల కాలం నుండి నిజాం చెరువుల పాలన అంతమయ్యే వరకు ఈ ప్రాంతంలో కల్పించిన కుంటలు, చెరువుల వ్యవస్థ దేశంలోనే ఒక ప్రత్యేకతను సంతరించుకున్నది. నిజాం కాలంలో కట్టిన నిజాం సాగర్,

కడెం ప్రాజెక్ట్ ఆనాటి పెద్ద తరహా నీటి పారుదల వసతులలో చాలా ముఖ్యమైనవి. ఈ ప్రాంతంలో సేద్యానికి యోగ్యంగా ఉన్న భూములు చాలా సారవంతమైనవి. నిజాం కాలపు ఫ్యూడల్ వ్యవస్థలో భూస్వాముల కొరకు చాకిరీ చేసిన రైతు కూలీలు కష్టపడి పనిచేసే అలవాటు కలవారు. నిజాం పాలన అంతమయిన తర్వాత అప్పటి హైదరాబాద్ రాష్ట్రంలో బూర్గుల రామకృష్ణారావు నేతృత్వంలోని ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూసంస్కరణల చట్టం ఆనాటికే ఒక విప్లవాత్మక సంస్కరణ. ఆ సంస్కరణ ఫలితాలను తెలంగాణ రైతాంగం పూర్తిగా చవిచూడకముందే ఈ ప్రాంతాన్ని ఆంధ్రలో కలిపివేయడం జరిగింది. దానితో తెలంగాణ ప్రాంతంలో వ్యవసాయం కుంటుబడటం మొదలయింది. కొత్త నీటిపారుదల సౌకర్యాల కల్పనలో అన్యాయం, అప్పటికే ఉన్న చిన్న నీటి పారుదల సౌకర్యాలను కాపాడే విషయంలో నిర్లక్ష్యం, పరపతి సౌకర్యాల వితరణలో వివక్ష వంటి కారణాల చేత ఈ ప్రాంతపు వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిపోయింది"(జయశంకర్, కొత్తపల్లి. 2015 : 53, 54). దీని కారణంగా ఏర్పడిన పరిస్థితుల్ని తెలంగాణ కవి ప్రతిభావంతంగా చిత్రించాడు. నకిరేకంటి సైదులు రాసిన 'పల్లెగోస' కవితలో ఇలా రాశాడు.

**"తెలంగాణ గడ్డమీద రైతు బతుకు గోసలాయె**
**ఎరువులకు లైనుగట్టి ఎదురుచూసి సచ్చుడాయె**
**అప్పులకు తాళలేక ఆత్మహత్యల శరణమాయె**
**తెగబలిసినాంధ్ర పాలకులదే చెల్లుబాటమ్మా**
**ఎవుసం ఎన్నేండ్లు జేసిన బాయిల బడ్డట్టే బతుకులు**
**పండిన గింజలకేమో దళారీల దోపిడాయె**
**బోదలెదురు జూసినట్టు రైతు సావులు గోరుతుండ్రు**
**మనలా రాశిరంపానా బెట్టు రాజ్యమొద్దమ్మో**
**రావాలి పచ్చని పాలనా మన తెలంగాణమ్మా"**
**(బుచ్చిరెడ్డి, కోమటిరెడ్డి(సంపా). 2012 : 70)**

తెలంగాణ రైతు పడే కష్టాలను ఈ కవిత వర్ణిస్తుంది. అనేక కష్టాలకోర్చి అప్పులు చేసి ఎరువులకోసం ప్రయత్నించి పంటలు పండిస్తే కోస్తాంధ్ర ప్రభుత్వాలు వాటికి గిట్టుబాటు ధరలు ఇవ్వలేదు. అమ్మకాల్లో దళారీల దోపిడీ ఎక్కువైంది. దాంతో రైతులు పంటమీద పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాదు. ఇది ఒక్క సంవత్సరం వ్యవహారం అయితే సరిపుచ్చుకుని మరో సంవత్సరం కష్టాల నుండి గట్టెక్కవచ్చు. కానీ గడిచిన కాలమంతా ఇలానే జరిగితే రైతు అప్పుల ఊబిలో కూరుకుపోతాడు. ఒక అనివార్యమైన స్థితిలో చేసేదేమీ లేక, వేరే ఏ ఇతర పనులు చేసి బతకగలిగే నైపుణ్యం లేక చావు శరణు కోరతాడు. అందుకే తెలంగాణ వ్యాప్తంగా వందలాదిమంది రైతులు ఆత్మహత్యలు చేసుకుని చనిపోయారు. దీనికి కారణం సీమాంధ్ర ప్రభుత్వం అని ఈ కవి భావన.

తెలంగాణలోని రైతుల ఆత్మహత్యల విషాద వాతావరణాన్ని కాంచనపల్లి రాజేందర్ రాజు 'ఆత్మ హింస' కవితలో వర్ణించాడు.

**"ఋణగ్రస్తుల జాబితాలో**
**నీ పేరు నమోదవుతుంది**
**ఎటొచ్చీ**
**ఋణాలన్నీ దళారులకే**
**పథకాలు పటిష్ఠంగా అమలు పర్చలేని రాజ్యం**
**అందని ఋణాలకి మాఫీలు ప్రకటిస్తుంది**

**అయినా ఆత్మహత్య చేసుకుంటావు**

**తాగునీరే లేని నీతో**
**సాగునీరిస్తామనగానే**
**నీ ఆశల్ని రేగడి పగుళ్లపై చల్లి**
**మొక్కల గొంతులో నీటికోసం వేదుకుంటావు**

**అప్పటికే నీ నీరు దారి మళ్లించిన రాజ్యం**
**కృత్రిమ మేఘాలతో**
**నీపై ప్రయోగం చేస్తుంది**

**అయినా నీవు ఆత్మహత్య చేసుకుంటావు**

**నాసిరకం విత్తనాల - కల్తీ మందుల**
**నల్ల బజారులో నీవు అమాయకంగా మోసపోతావు**
**అసలు విషయం అప్పుడే తెలిసినట్లు**
**రాజ్యం కమిటీలు వేస్తుంది**
**ఆకస్మిక తనిఖీలు చేస్తుంది**
**అధికార గణాన్ని నిలదీస్తుంది**

**అయినా సరే నీవు ఆత్మహత్య చేసుకుంటావు**

**నీ శవంపై**
**ఎక్స్‌గ్రేషియా సానుభూతుల జల్లు కురిసి**
**ఓట్ల పంటలు పుష్కలంగా పండుతాయి**

**ఇప్పుడు నీవు నిజంగా చచ్చిపోతావు"**
**(రాజేందర్ రాజు, కాంచనపల్లి. 1999 : 19, 20)**

నిజానికి ప్రపంచంలో ఎక్కడా ఆత్మహత్యలు ఉండవు, అన్నీ హత్యలే. మనిషికి జీవించగలిగే అవకాశాలను వ్యవస్థ కల్పించాలి. ఆ వ్యవస్థ విఫలమైనప్పుడే మనిషి ఆత్మహత్యను ఎంచుకుంటాడు. తెలంగాణలో ఇదే జరుగుతున్నది. అయితే, విషాదమేమిటంటే ఆ ఆత్మత్యలు కూడా అపహాస్యంపాలు కావడం. "సంకట పరిస్థితులను

ఎదుర్కోలేని అనేకులు ఆత్మహత్యలు చేసుకుంటే పాలకవర్గాలు సానుభూతి చూపకపోగా అవహేళన చేస్తున్నవి. ఎక్స్‌గ్రేషియా ఆశతో ఆత్మహత్యలకు పాలుపడుతున్నారని అమానుష ప్రచారానికి పాల్పడుతున్నవి. ఇతర ప్రాంతాలలో ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతను ఆదుకొనుటకు పాలకులు ఆగమేఘాలమీద వెళ్ళి బాధితులను ఓదార్చుతారు. అక్కడ తుఫాను తీగకు కూడా వెలకట్టి నష్టపరిహారం చెల్లిస్తారు. ఇదంతా ఒక సభ్య సమాజంలో జరగవలసిందే. కాని తెలంగాణా ప్రాంతంలో పాలకుల వైఫల్యాల వలన సంభవించే విపత్తులలో నిండు ప్రాణాలు పోయినా పాలకులు పట్టించుకోకపోగా అవహేళన చేస్తారు. బాధిత కుటుంబాలను కనీసం పలకరించే సభ్యత కూడా లేకుండా పోయింది వీరికి."(జయశంకర్, కొత్తపల్లి. 2015 : 61)

ఇటువంటి దుష్ప్రచారాలను ఎండగట్టడం కోసమే తెలంగాణ కవి స్పందించాడు. తెలంగాణ రైతులు ఏ పరిస్థితుల్లో ఆత్మహత్యలకు పూనుకుంటున్నారో వివరించాడు. దామెర రాములు రాసిన 'తిప్పలు – అప్పులు' కవితలో

**"ఇగనాతో అయితలేదు**
**ఎగుసం చెయ్యలేక పోతున్నా**
**నాకే తిండి లేదు**
**గోదల గడ్డి యాడ తెచ్చేది?**
**గోదలకు నీళ్లు కూడా పెట్టలేకపోతున్నా**
**కుడిది ఎండిపోయి ఎన్ని దినాలయిందో**
**అప్పులు తడిసి మోపెడవుతున్నాయి**
**మోయలేకపోతున్నా**
**బతుకు బరువు యీద్వలేకపోతున్నా.."**
**(రాములు, దామెర. 2006 : 21)**

ఇది పాలకుల ప్రచారంలోని అవాస్తవాల్ని, అవకాశవాద కల్పనలను ఎండగట్టిన కవిత.

అట్లే కందేపి రాణీప్రసాద్ 'రెండు కన్నీళ్ళు' అనే కవితలో కూడా అదే పని చేశాడు.

**"భూమికి దూరమై**
**సాగునీటికి కరువై**
**సేద్యం చేసే రైతన్న**
**అసహాయతను చూసి**
**చావొక్కటే పలకరించి**
**అక్కున చేర్చుకుంటోంది**
**పురుగును చంపలేని మందు**
**రైతను చంపుతోంది**
**అరిచి అలమటించిన నాడు**
**ఆదరించని చెయ్యి**
**మరణించాక పలకరిస్తోంది**
**చేరదీసి సాయం చెయ్యని చెయ్యి**
**ఎక్స్‌గ్రేషియా రూపంలో**
**మరణాన్ని గేలిచేస్తోంది"**
**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 197)**

సాహిత్యం అన్న మాటకు అర్థం సమాజానికి హితం చేసేది. తెలంగాణ కవి తెలంగాణ సమాజంలో వ్యవసాయ రంగంలో ఏర్పడిన సంక్షోభాన్ని గమనించాడు. పాలకులు చేస్తున్న విషప్రచారాన్ని చూశాడు. అందుకే రైతు పక్షాన నిలబడుతూ వాస్తవాల్ని చూపెట్టే ప్రయత్నం చేశాడు.

మొత్తం భారతదేశంలోనే కరువు జిల్లాగా పాలమూరుకు పేరుంది. నిజానికి పాలమూరు అనే పేరు ఆ ప్రాంతంలో పాలు, పెరుగు సమృద్ధిగా దొరికిన కాలంలో వచ్చిందని చారిత్రకాధారాలు చెప్తున్నాయి. కానీ కోస్తాంధ్ర పాలన నీడన పాలమూరు

కరువు జిల్లాగా మారిపోయింది. దేశమేకాదు, అనేక దేశాలకు వలసపోయి గ్రామాలకు గ్రామాలే ఖాళీ అయిన విషాద స్థితి పాలమూరు జిల్లాలో కనిపిస్తుంది. నిజానికి ఈ కరువు సహజ కరువుకాదు, పాలకులు కల్పించిన కృత్రిమ కరువు. ఈ కరువు, పాలమూరు జిల్లాను ఎట్లా మార్చేసిందో కమలేకర్ శ్యాంప్రసాద్‌రావు 'పాలమూరు కరువు దృశ్యం' కవితలో వివరించాడు.

**"కనికరించని మేఘాలు వట్టిపోయి**
**నీళ్ళింకిన చెఱువులు నోళ్ళు తెరిచి**
**భూమిలనుంచి చేతులు పైకెత్తని మొలకలు**
**రైతు గుండెలో గునపాలు దింపినట్టుంది**
**పక్కన కృష్ణవేణమ్మ పారుతున్నా**
**పాలమూరుకు నీళ్ళ ఫలము దక్కలేదు**
**పల్లెల పాలదనం కండ్లల్ల మెరుస్తలేదు**
**వానజల్లు కురవని నేలపై**
**హామీల జల్లులు కుండపోతగా కురుస్తున్నయి**
**గాయపడిన నేలపై**
**శంఖుస్థాపనల ఫలకాలు మొలుస్తున్నయి**
**కరువు రక్కసి పాదాల కింద చితికిన**
**నా తెలంగాణ కోటి బీటల బీడు**
**నా పాలమూరు వలసపక్షుల గూడు"**
**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 132)**

ఇంతకు ముందే చెప్పినట్లు పాలమూరు జిల్లాకు నీళ్లు లేక కరువు రాలేదు. జీవనది అయిన కృష్ణా పాలమూరు జిల్లానుండే ప్రవహిస్తుంది. కానీ ఆ నీళ్లు అందేది మాత్రం అత్యంత స్వల్పం. దానివల్ల వ్యవసాయం కుంటుబడిపోయింది. కేవలం బావులు, బోర్లు, వానల మీద ఆధారపడి వ్యవసాయం చేసే పరిస్థితి ఏర్పడింది. కానీ బావులు

ఎండిపోయాయి. ఎన్ని బోర్లు వేసినా భూగర్భ జలాలు తరిగిపోయి నీళ్లు రావడం లేదు. సమయానికి వానలూ కురవవు. ఈ పరిస్థితిలో పాలకుల జోక్యం అవసరం. రైతును కాపాడే చర్యలు చేయాల్సింది. కానీ కరువు జిల్లా మీద ప్రత్యేక ప్యాకేజీలు, ప్రకటనలు తప్ప ఆచరణాత్మకంగా చేసింది మాత్రం శూన్యం. ఆ స్థితినే కవిత వివరిస్తుంది. ఈ స్థితినే వివరించే మరో కవిత కందాళై రాఘవాచార్య రాసిన 'గోస.. గోస..'. ఈ కవితలో

**"సెరువెండిపాయె**
**బోరు బోడబోడాయె**
**కరెంటు కాలిపాయె**
**భూమిలేసిన ఇత్తులు మట్టిలెక్క మారిపాయె**
**గోస.. గోస..**
**కాయకష్టం సేసే సేతులు తలవట్టుకోని కూసున్నై**
**నాట్లు లేవు గీట్లు లేవు**
**బతుకుల కరువు పోట్లు**
**యాదున్నవే నాగలంటే దున్నుడుకు దూరమై**
**కొట్టంల కొలువున్నా అంటది**
**గోస.. గోస.. గడ్డిలేక గోదలు అమ్ముడాయె**
**మా ఊర్ల ఇంటింటికి ఇదే సోది**
**కష్టం మీదచ్చి పడ్డది**
**లేసుడెట్లా ఇల్లు నడుసుడెట్లా.. గోస.. గోస.."**
**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 80)**

వ్యవసాయం బతుకుదెరువునిచ్చే శక్తిని కోల్పోయినప్పుడు అనివార్యంగా అప్పటిదాకా వ్యవసాయానికి ఉపయోగపడిన సమస్తమూ నిరుపయోగంగా పడివుంటుంది. ఎడ్లు, నాగలి, ఇతర పరికరాల అవసరం లేనప్పుడు అవి మూలకు పడిపోతాయి. నిజానికి వాటిలాగే తెలంగాణ కవి కూడా నిర్వేదంగా, నిర్జీవంగా పడి ఉన్నాడు అని ఇక్కడ కవి

ధ్వన్యాత్మకంగా చెప్పదల్చుకున్నాడు.

తెలంగాణలో వ్యవసాయాన్ని దెబ్బతీసిన మరో ముఖ్య కారణం ప్రపంచీకరణ. అలవాటులేని కొత్త పంటలూ, ఎరువులు, పరికరాలు వినియోగించడంలో నైపుణ్యంలేని రైతు చతికిలపడ్డాడు. జీవితాన్ని అమ్ముకునే స్థితిలోకి నెట్టివేయబడ్డాడు. ఈ స్థితినే వి.ఆర్.శర్మ 'అంగడి' అనే కవితలో వివరించాడు.

**"తెలంగాణాలో**
**అంగట్లో కూచున్న ఈ రైతులకు**
**అమెరికాలో ఉన్నట్టుగా**
**పారిశ్రామిక వ్యవసాయిక ఫాంహౌజులు లేవు**
**దాహం తెలియని నదీతీర ప్రాంతాలూ**
**కరువుల్లేని డెల్టా భూములు లేవు**
**నేలతల్లి ఒంటిమీద తగిలిన**
**గాయాల మచ్చల్లాంటి**
**చిన్నా చితకా భూమిచెక్కలు తప్ప**
**...**
**ఆదివారం అంగట్లో**
**బిచ్చగత్తెల చంకన**
**కనబడే పిల్లల్లానో**
**బల్లినోట్ల చిక్కిన పురుగుల్లానో**
**కనబడతారు వీళ్ళు**
**ఈ రైతులకు**
**వ్యాపార సూత్రాలు తెలియవు**
**ఆకలి తీర్చుకోవడం కోసం**
**తమవాళ్ళ అవసరాలు తీర్చడం కోసం**

**బతికి వుండడం కోసం**

**తమ జీవిత సారాన్ని**

**రంగుల్నీ కలల్నీ**

**అమ్మకానికి పెడతారు”**

**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 81, 82)**

ఇది ప్రపంచీకరణ కారణంగా తెలంగాణ వ్యవసాయంలో వచ్చిన బాధాకరమైన స్థితి. నిజానికి మొత్తం ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచీకరణ విధానాల్ని అమలు చేయలేదు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేవలం తెలంగాణనే ఒక ప్రయోగశాలగా ఎంచుకుని ప్రయోగం చేశాడు. దాని కారణంగా జరిగిన నష్టం అపారమైనది. ప్రపంచీకరణ కారణంగా ఎన్ని రంగాలు ధ్వంసమైనా వాటి అన్నింటిలో వ్యవసాయం ముఖ్యమైనది. ఎందుకంటే మనిషి జీవించడానికి మౌలికమైన అవసరం అది. దాని ప్రాధాన్యత అటువంటిది. ప్రపంచీకరణ ఎట్లా వచ్చిందో, ఏం చేసిందో అల్లం నారాయణ ‘యాది – మనాది’ అనే దీర్ఘ కవితలో వివరించాడు.

**“ఒంట్లో బద్దె పురుగు ప్రవేశించింది**

**అభివృద్ధి మేడారంలో వంతెనయింది**

**పత్తి కొత్త వలస సారం**

**పత్తి బతుకును అత్తిపత్తి చేసింది**

**కాలం ఆత్మహత్యలని కన్నది**

**శవాలు కాలుతున్న వాసన..”**

**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 38)**

నిజానికి తెలంగాణలో ఆదినుండీ వ్యాపార పంటల సాగు చాలా తక్కువ. కానీ ప్రపంచీకరణ రకరకాల వ్యాపార పంటల్ని పండించేవిధంగా ఆశలు రేపింది. కృత్రిమ ఎరువులు, నూతన వంగడాల విత్తనాలు, మందులు అమ్ముకోవడం కోసం రైతను

బలిచేసింది. అటువంటివాటిలో ప్రధానంగా పత్తిపంట ఉంటుంది. పత్తి వ్యాపార పంట. ఆ పంట పండటానికి సారవంతమైన భూమి, సమృద్ధిగా నీరు, మంచి విత్తనాలు, ఎరువులు కావాలి. కానీ తెలంగాణ రైతు దగ్గర కేవలం స్వీయ శ్రమ, భూమి మాత్రమే ఉన్నాయి. విత్తనాలు, ఎరువులు అప్పు తీసుకోవాలి. అలాగే తీసుకున్నాడు కూడా. కానీ వర్షమే ఆధారమనుకుని వేసిన పంట పండలేదు. దాంతో చేసిన అప్పులు అలాగే మిగిలిపోయాయి. మరొక సంవత్సరమూ అలాగే జరిగింది. ఇలా జరగుతూనే పోయింది. దాంతో రైతు స్వీయహత్యకు పాల్పడ్డాడు. చాలామంది కేవలం రైతు అప్పులు మాత్రమే గణనలోకి తీసుకుంటారుగానీ, శ్రమను పట్టించుకోరు. నిజానికి కేవలం స్వీయశ్రమను ఉపయోగించే పంటను పండించలేదు. దానికోసం కూలీలను ఆశ్రయిస్తాడు. వారికీ అప్పులు చేసే డబ్బిస్తాడు. తన శ్రమను కూడా దాచుకోకుండా వినియోగిస్తాడు. కానీ ఇవన్నీ ఒక్కదెబ్బకు కూలిపోతాయి. ఈ పరిణామంలో కేవలం వర్షం మాత్రమే దోషి కాదు. ఒకవేళ వర్షం పడినా కూడా పంట పండినా కూడా గిట్టుబాటు ధర ఉండాలి. కానీ ఉండదు. ఇది మరో కోణం. ఇంకొకవైపు నూతన వంగడాల కారణంగా, విషతుల్యమైన కృత్రిమ ఎరువుల కారణంగా భూమి క్రమక్రమంగా నిస్సారమైపోతుంది, విషతుల్యం అవుతుంది. దాంతో కొద్దికాలం పోయేసరికి ఏ పంట వేసినా వాటికి మోతాదుకు మించి ఎరువులు ఉంటేనే పండుతాయి. వ్యవసాయం కుంటుబడటంవలన అమ్ముకున్న పశువుల వలన ఏర్పడే సహజ ఎరువులు దొరకవు. దాంతో మళ్లీ కృత్రిమ ఎరువుల మీదనే ఆధారపడాల్సిన పరిస్థితి. మళ్లీ అప్పులు చేయాల్సిన పరిస్థితే దాపురిస్తుంది. అందువల్లనే 1990ల తర్వాత దేశంలో ఎక్కడాలేనన్ని పత్తిరైతుల ఆత్మహత్యలు తెలంగాణలో చోటుచేసుకున్నాయి.

ఇట్లా ఒకవైపు కోస్తాంధ్ర పాలకులు తెలంగాణపట్ల చూసిన నిర్లక్ష్యపు చూపువలన, మరోవైపు ఆ పాలకులే తీసుకువచ్చిన ప్రపంచీకరణవలన తెలంగాణ వ్యవసాయం అభివృద్ధికి నోచుకోకపోవడంతోపాటు, రైతుల ఆత్మహత్యలకు కేంద్రం అయ్యింది.

## 4.3. భూమి

తెలంగాణ భూమి పలురకాలుగా స్థానిక ప్రజలకు వినియోగంలోకి రాకుండా

పోయింది. కొన్నిసార్లు అది స్థానికుల చేతుల్లోనే ఉన్నా దాన్ని వాడుకునే స్థితిలో లేకుండడం, మరికొన్నిసార్లు చౌకగా తెలంగాణ ప్రజల నుండి కొనుగోలు చేసి దాన్ని ఒక వ్యాపార సరుకుగా మార్చడం, ఇంకొన్నిసార్లు ప్రభుత్వాలే స్వయంగా ప్రజల ఇష్టానికి వ్యతిరేకంగా భూమిని లాక్కుని బహుళజాతి కంపెనీలకు, బడా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం జరిగి మొత్తంగా తెలంగాణ భూమి తెలంగాణ ప్రజలకు చెందకుండా పోయింది. ఈ స్థితినే అల్లం నారాయణ 'యాది – మనాది' అనే కవితలో వర్ణించారు.

**"భూమి ఒక పరాధీన**
**కాలువ ఒక బిడ్డకు దక్కని స్తన్యం"**
**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 26)**

జీవనదులకు పరీవాహక ప్రాంతంగా ఉన్న తెలంగాణకు నీరు ఎట్లా అందకుండా పోయిందో అదే విధంగా భూమి కూడా పరాధీనం అయిపోయింది. దాన్ని ఆధీనం చేసుకున్నవాళ్లలో సీమాంధ్ర వ్యాపారులున్నారు, సీమాంధ్ర ప్రభుత్వాలూ ఉన్నాయి. ఈ స్థితిని వివరించేదే ఈ కవిత. ఇదిలా ఉంటే మరోవైపు ఉన్న కొద్దిపాటి సారవంతమైన భూమిని కూడా కొన్నిచోట్ల బలవంతంగానూ, మరికొన్ని చోట్ల వంచన పద్ధతుల్లోనూ తెలంగాణ భూములను సీమాంధ్ర వ్యాపార రైతులు లాక్కున్నారు. ఇదంతా తెలంగాణలోని ముఖ్యపట్టణాల పరిసరాల్లో ఎక్కువగా జరిగినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా మరి తెలంగాణ రైతులు ఎలా భూములు ఇచ్చారు అనే ప్రశ్న ముందుకు వస్తుంది. వాస్తవానికి ఇక్కడ జరిగిందేమిటంటే సారవంతమైన భూములు ఉన్నా సాగుకు నీరు లేదు, నీరున్నా కరెంటు లేదు, అది ఉన్నా పెట్టుబడికి శక్తి చాలని స్థితి ఉన్నది. అలా నిరుపయోగంగా ఉన్న భూమిని అనివార్యంగా అమ్ముకోవల్సిన స్థితి ఒకటి కల్పించబడింది. కనుకనే తెలంగాణ రైతు ప్రాణప్రదమైన భూమిని అమ్ముకోవల్సి వచ్చింది. చారిత్రకంగా చెప్పాల్సి వచ్చినప్పుడు భూమిని లాక్కున్నారు అనే చెప్పాల్సి ఉంటుంది. ఈ స్థితినే అన్నవరం దేవేందర్ 'మంగులం' కవితలో వివరించారు.

**"మా ర్యాగడి భూములన్నీ గుంజుకున్నవ్**
**మాకు నీళ్ళ పారకమే తక్వ**
**ఉన్నకాడికి నీవే గొంగడి జాపినవ్**
**పట్నం సుట్టూ బారాన వంతు**
**కనీలు పాతుకున్నవు**
**ఇంక మాకేం మిగిలిందని"**
**(దేవేందర్, అన్నవరం. 2001 : 6)**

ఉన్న కాస్త భూమిని అమ్ముకున్న తర్వాత వచ్చిన డబ్బులు కొన్నాళ్లకు అయిపోయే స్థితి వస్తుంది. ఆ తర్వాత పనికోసం సమీప పట్టణాలకో, లేదంటే వేరే ప్రాంతాలకో, దేశాలకో వలస పోవాల్సి వస్తుంది. దీని కారణంగానే ఇవాళ పల్లెలు ఖాళీ అయి పట్టణాలు నిండుతున్నాయి.

భూమి ఒక వ్యాపార సరుకు కావడమే ఒక విషాదం. నిజానికి రైతు ఉనికి భూమితోనే ముడిపడి ఉంటుంది. తెలంగాణలో పెట్టుబడుల కారణంగా అభివృద్ధి చెందిన పట్టణాల చుట్టూ ఉన్న గ్రామాల్లో నేడు చాలావరకు భూమి స్థానిక రైతుల చేతుల్లో లేకుండా పోయింది. తెలంగాణ అస్తిత్వ చైతన్యం వచ్చేదాక కూడా తాము కోల్పోయిందేమిటో రైతులకు అర్థం కాలేదు. ఈ స్థితినే నాళేశ్వరం శంకరం 'భూమి భవిష్యత్తు!' కవితలో వివరించారు.

**"అణచివేత ఆధిపత్యం ఒక రాక్షస క్రీడే!**
**అందువల్లే కదా**
**మా మట్టి మానభంగానికి గురైంది**
**మాంసం కొనుక్కుపోయేంత సహజంగా**
**మా నేలతల్లిని అంగట్లో పెట్టి కాజేస్తుంటే**
**మేం యేంచేయాలో చివరకు అదే చేస్తున్నాం!**

**తెలియకడుగుతా**
**ప్రజలు భాషను రక్షిస్తారు గానీ**
**భాష భూమిని రక్షించలేదుగదా!**
**ఆ గుణమేవుంటే మా భూములెందుకు మాయమైతయి!**
**భూమి ఉంటేనేకదా మాకు ఉనికుండేది**
**ఉనికి ఉంటేనేకదా మాదైన భాషను నెత్తినెత్తుకునేది**
**తల్లిపేరున జరిగే ఈ పిల్లల పంచాయితీలో**
**ముందుగా మా నేలతల్లినే రక్షించుకుంటం!**
**తల్లే లేకపోతే ఇనుపకాళ్ళ బారినుండి పిల్లల్నెలా కాపాడేది!)**
**(రమేశ్, సుంకర(సంపా). 2008 : 109, 110)**

మనిషికీ, భూమికీ ఉన్న సంబంధాన్ని చెప్పడంతోపాటు మనిషికి భూమి దూరమైన క్రమాన్ని కూడా ఈ కవిత వివరిస్తుంది. నిజానికి తెలంగాణ అస్తిత్వ పరివేదన చర్చలో నీటి వాటా విషయంలోగాని, భాష విషయంలోగాని జరిగినంత లోతైన విశ్లేషణ భూమి విషయంలో జరగలేదనే వాస్తవాన్ని కూడా ఈ కవిత అర్థం చేయిస్తుంది. అంతమాత్రాన భూమి అప్రధానమైన విషయం కాదనీ, దాన్ని కాపాడుకోవడం కూడా తెలంగాణ ప్రజల కనీస కర్తవ్యం అని ఈ కవిత ఉద్ఘాటిస్తుంది. మనిషి ఉనికికి భూమి ఎంత ప్రధానమో వివరించేదే వేణు సంకోజు రాసిన 'నేలే' కవిత.

**"చూపంతా నేలమీదే అయిన పక్షికి**
**నేలే ఒక మహా సందర్భం**
**నేలే ఒక మహాద్భుత పలవరింత**
**నేలే ఇక అనంత రుతువు**
**ప్రాణి నేలే ప్రదేశం – సర్వస్వం నేలే!"**
**(రమేశ్, సుంకర(సంపా). 2009 : 116)**

తెలంగాణలో భూమికోసం అనేక పోరాటాలు జరిగాయి. వేలాదిమంది ప్రాణత్యాగం చేశారు. నిరంకుశ భూస్వామ్య నైజాం పాలనకు వ్యతిరేకంగా 'దున్నేవారికే భూమి' నినాదంతో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమే జరిగింది. ప్రపంచవ్యాప్తంగా ప్రచలితమైన ఈ పోరాటం సాధించుకున్న హక్కుల్లో మొట్టమొదటిది భూమే. ఈ విషయాన్నే నూటెంకి రవీంద్ర 'గిది తెలంగాణ' అనే కవిత వివరిస్తుంది.

**"అవ్వతోడు గిది తెలంగాణా**
**గిక్కడ**
**బత్కుమీదికన్నా**
**మనిషి మీది కన్నా**
**మట్టిమీన్నే పావురం**
**గీమట్టి పరాయిదైనందుగ్గాదా**
**'బండెనుక బండి గట్టి పదారు బండ్లు గట్టి'**
**నిజాం సర్కారోనికి గోరి గట్టింది**
**గీ మట్టి కిరాయిదైనందుగ్గాదా**
**పొద్దుగూకని రాజ్యానికి పొద్దుపొడుపు లేకుండా జేసింది**
**గీమట్టి గడీల గుత్తసొత్తైనందుగ్గాదా**
**రగల్ జెండాలై మొలిచి రైతుల అండ నిలిచింది"**
**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 124)**

కమ్యూనిస్టుల సారథ్యంలో నిర్వహించబడిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నాటి భూస్వామ్య పాలనను కూల్చడాన్ని ఉద్దేశించింది. కానీ ఆ తర్వాత కమ్యూనిస్టుల్లో ఒక ప్రధానవర్గం పోరాటాన్ని విడిచి ఎన్నికల్లోకి వెళ్లటం, మరోవైపు నిజాం ప్రభుత్వాన్ని కూల్చి స్వయంగా భారత ప్రభుత్వమే హైద్రాబాద్ రాష్ట్రాన్ని భారత యూనియన్‌లో కలుపుకోవడం కారణంగా ఆ తర్వాత మళ్లీ ప్రజల భూమి భూస్వాముల చేతుల్లోకి వెళ్లింది. ఈ చారిత్రక నేపథ్యాన్ని మొత్తంగా గమనించినప్పుడు తెలంగాణ ప్రజలు

భూమికోసం ఎంతటి త్యాగాలు చేశారో, భూమికి ఎంతటి ప్రాధాన్యత ఇచ్చారో అర్థం అవుతుంది.

తెలంగాణలో మొదలైన రియల్ ఎస్టేట్ వ్యాపారం గురించి వివరించేదే రామా చంద్రమౌళి రాసిన 'అంతా ఒల్లెక్కల' కవిత.

**"భూములన్నింటిని అడ్డికి పావుశేరమ్మి**
**గాలిక్కొట్కపోయే రోడ్లేసి, కాలువలు కట్టి**
**మందికొంపలు ముంచి కోట్లకోట్లు తినబట్టిరి..**
**మాతోనే సర్కస్ ఆడిపిత్తాండ్లా-**
**మీరు సర్కస్ ఆడి మాకు సూపిత్తాండ్లా**
**పోరగాండ్లక్కూడా తాగుడు నేర్పబట్టిరి"**
**(రమేశ్, సుంకర(సంపా). 2009 : 31)**

ఈ కవితలో రియల్ ఎస్టేట్ వ్యాపారంతోపాటు మరొక కీలకమైన విషయాన్ని కూడా కవి వెల్లడించాడు. తెలంగాణలో ఏ నిర్మాణాలు జరిగినా వాటి టెండర్లు వేసినప్పుడు ఎక్కువగా సీమాంధ్రులకే వెళ్లాయి. దానికి కారణం అధికార యంత్రాంగంలో సీమాంధ్రులే ఎక్కువ. ఇట్లా నిర్మాణ రంగంలో భారీ స్థాయిలో సీమాంధ్రులే ఉన్నారు. విశేషమేమంటే ఈ నిర్మాణాల్లో కూలీలు మాత్రం తెలంగాణవాళ్లే ఉంటారు. వీళ్లు తమ తమ ఊర్లలో బతకగలిగే అవకాశాలు లేక వలస వచ్చిన ప్రజలు. నిజానికి ఈ కాంట్రాక్టులు, పనులు తెలంగాణవాళ్లకి చెందవల్సినవి. కానీ పరిస్థితి దానికి భిన్నంగా ఉన్న స్థితిని కవిత వివరించింది.

తెలంగాణలో ముందెన్నడూ లేని ఒక కొత్త పరిణామం పంటభూములు ప్లాట్లు కావడం. ఇంతకుముందే చెప్పినట్లు బతుకుదెరువును ఇవ్వని భూముల్ని అనివార్యంగా రైతులు అమ్ముకోవాల్సిన స్థితి దాపురించింది. చాలాచోట్ల కొనుగోలుదారులు సీమాంధ్రులు.

కొన్ని చోట్ల తెలంగాణ బడా వ్యాపార వేత్తలు కూడా ఉన్నారు. వీళ్లు రైతుల దగ్గర చౌకగా భూముల్ని కొనుగోలు చేసి వాటిని వెంచర్లుగా మార్చి అమ్ముతున్నారు. ఇవాళ మరీ గ్రామీణ ప్రాంతాలు మినహాయిస్తే తెలంగాణ వ్యాప్తంగా చాలా భూభాగం ప్లాట్లుగా మారిపోయింది. ఇది సౌందర్యంగా కనిపించే విషాద స్థితి. కందేపి రాణీప్రసాద్ 'రెండు కన్నీళ్ళు' అనే కవితలో అదే చెప్పారు.

**"అన్నం పెట్టిన నేల**
**బీడుబడి బిత్తరపోతుంటే**
**పంట భూములన్నీ**
**ప్లాట్లయి దర్శనమిస్తున్నాయి"**
**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 196)**

పంటభూమికి రైతు యజమాని. ప్లాటుకు వ్యాపారి యజమాని. ఇక్కడ యజమాని మారడంలోనే రాజకీయం ఉన్నది. మనుషులకు అవసరమైన నివాస స్థలాలు ఏర్పాటు చేసుకోవడం వేరు. కానీ వ్యాపార లక్ష్యంతోనే భూమిని ప్లాట్లుగా తయారు చేయడం వేరు. తెలంగాణలో కనిపిస్తున్నది రెండవ స్థితి. సీమాంధ్ర రియల్టర్ల చేతిలో తెలంగాణ భూమి ప్లాట్లుగా మారిపోతున్నది.

తెలంగాణలో కనిపించే మరొక దుర్మార్గమైన స్థితి సెజ్‌ల నిర్మాణం. ప్రత్యేక ఆర్థిక మండలి. దీనిమీదా తెలంగాణ కవి స్పందించాడు. కందుకూరి శ్రీరాములు రాసిన 'ఆరడుగుల భూమైనా..' కవితలో ఇలా అంటాడు.

**"మనసులో చేపలు ఈదాలి!**
**మొసళ్ళు ప్రవేశిస్తే**
**డేంజర్ గుర్తు పెట్టాలి!!**

**ఆధునిక హిరణ్యాక్షులు**

**భూమిని చంకలో చుట్టుకుని**

**పండులా పిండేసి రసాన్ని తాగుతున్నారు**

**వస్తువుల మీదా**

**పదార్థాల మీదనే కాదు వ్యాపారం**

**ప్రకృతినీ అమ్మి**

**సొమ్ము చేసుకుంటున్నారు**

**సెజ్ పాదం**

**వామనపాదం కంటే దురాక్రమైనది"**

**(శ్రీరాములు, కందుకూరి. 2009 : 122)**

సీమాంధ్ర రియల్టర్లు ఒకవైపు భూమిని వ్యాపార సరుకు చేస్తే సీమాంధ్ర ప్రభుత్వాలు తామేమీ తీసిపోమని తెలంగాణ ప్రజలవద్ద నుండి బలవంతంగా భూముల్ని లాక్కుని బహుళజాతి కంపెనీలకు, బడా వ్యాపారవేత్తలకు అప్పజెప్పుతున్నది. నిజానికి ప్రత్యేక ఆర్థిక మండలి అనేది ఒక అప్రజాస్వామిక చట్టం. ప్రభుత్వాలు సీమాంధ్రులవే కనుక వారికిష్టమొచ్చినట్లు చట్టం చేసుకున్నారు. పోలీసుల్ని ఉపయోగించి ప్రజల దగ్గర నుండి బలవంతంగా భూములు లాక్కుని ఊర్లకు ఊర్లే ఖాళీ చేయించిన సంఘటనలు కోకొల్లలు. దానికి ఉదాహరణ మహబూబ్ నగర్ జిల్లాలోని జడ్చర్ల సమీపంలోని పోలేపల్లి. ప్రభుత్వం తమదగ్గర అక్రమంగా భూమి తీసుకున్నదని అక్కడి ప్రజలు దాదాపు రెండు సంవత్సరాలు ఉద్యమం చేసినా పట్టించుకున్న నాథుడు లేదు. పైగా అక్కడ తీసుకున్న భూమిని అరబిందో ఫార్మాస్యూటికల్ ఇనిస్టూట్ అనే కంపెనీకి అప్పజెప్పింది. ఆ కంపెనీ ఏర్పాటు అయిన తర్వాత దాని విసర్జిత పదార్థాలవల్ల సమీపగ్రామల్లోని పశువులు, గొర్రెలు వందల సంఖ్యలో మరణించాయి. ప్రజలకు సాగునీరు రసాయనాల కంపుతో వస్తున్నాయి. అయినా ఈ విషయాలన్నీ ప్రభుత్వం దగ్గరికి తీసుకువెళ్లినా సెజ్‌కు అనుమతిచ్చిందే తాము కనుక ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. ఇంతటి దయనీయమైన స్థితి తెలంగాణలోని చాలా ప్రాంతాల్లో కనిపిస్తుంది. ఈ కవిత దాన్నే పట్టుకున్నది. సరిగ్గా ఇదే విషయాన్ని నాళేశ్వరం

శంకరం 'అస్తిత్వానికి అంత్యక్రియలు' కవితలో చెప్పారు.

**"ఆకాశం నక్షత్రాలను పండించినట్లే**
**నేలమీద మేమూ గింజల్ని పండించగలం**
**భూమి పుత్రులు సఫలమయ్యేది భూమి వొండిలో అయినా**
**కబళించే సెజ్‌ల విద్రోహచర్యల వల్లనే**
**మా భూమి భూకంపానికి గురౌతోంది!**
**మా నేల మాది అదే మా అన్నంముద్ద**
**అమ్మా అమ్మమ్మా నానమ్మ అనేకాదు**
**మా తనువంతా ఆమె ప్రతిరూపమే!**
**...**
**బంజార భూముల బట్వాడాలకు ముగింపే లేదు కదా!**
**ఇది విపక్షాలకే కాదు స్వపక్షాలకూ తెలుసు కదా!**
**మెల్లిమెల్లిగా మా కన్నీళ్ళ కళ్ళలోంచి**
**అదృశ్యమైపోతోంది మాత్రం మా నేలనే!**
**మేమిప్పుడు స్వదేశంలోనే పరాధీనులం**
**అస్తిత్వం లేని అనాథలం**
**ఆత్మ గౌరవం లేని ఆధునిక హరిశ్చంద్రులం**
**యెవడో దున్నేవాడిదే భూమన్నాడు గానీ**
**ఇప్పుడు మాత్రం ల్యాండ్ మాఫియా ఉగ్రవాదులదే**
**ఇక చెప్పడానికేముంది కళ్ళకు గంతలు కట్టుకున్న**
**న్యాయం కూడా నోరు విప్పటం లేదు**
**మా మట్టికాళ్ళ మనుగడకు**
**సెజ్‌లిచ్చే అంతిమ బహుమానం మా అంత్యక్రియలే!"**
**(సాగర్ కళామందిర్. 2012 : 14)**

కవితా శీర్షికనే తెలంగాణలోని విషాదభరితమైన వాతావరణాన్ని పట్టిచూపిస్తుంది. భూమిలేకుండా అస్తిత్వం ఉండదు. తెలంగాణ తన అస్తిత్వాన్ని కోల్పోవడం వెనుక భూమిని కోల్పోవడం ఉన్నది అని ఈ కవిత చెప్తుంది. అదే సమయంలో మరొక కీలకమైన విషయాన్ని కూడా పసిగట్టి చెప్పింది. ఇవాళ తెలంగాణలోని పట్టణ ప్రాంతాల పరిసరాల్లోని భూములన్నీ హంతక ముఠాల, రౌడీషీటర్ల, మాఫియా గ్యాంగుల ఆధీనంలో ఉన్నవి. వీరు భూముల్ని ఆక్రమించుకునే క్రమంలో ఎదురుతిరిగినవాళ్లను అనేకమందిని హత్యలు చేశారు. ఇట్లా ఒకవైపు వీళ్లు, మరొక వైపు ప్రభుత్వాలు భూమి లాక్కుని ప్రజలకు మిగిల్చింది ఆత్మహత్యలు అని చెప్పడం కవితలోని సారం.

ఇట్లా తెలంగాణలోని భూమి పరాయీకరణకు గురవుతుంటే ఉద్యమాలు కూడా ఊపందుకున్నాయి. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు మాత్రమే తెలంగాణ ప్రజలకు నిజమైన పరిష్కారమని భావించిన వందలాది మంది సంఘటితమై ఉద్యమించారు. వాళ్లను, ప్రైవేటు ముఠాలు, ప్రభుత్వాలు అత్యంత దుర్మార్గంగా చంపేశాయి. ఆ విషయాన్నే పగడాల నాగేందర్ 'జోలి' కవితలో వివరించారు.

**"నెత్తిన మన్ను బోసుకొని**
**కడుపు కొట్టుకుంటూ**
**భోరున ఏడ్వడమే మిగిలింది గీ గడ్డకు**
**ఇప్పుడు**
**ఈ భూమిలోంచి ఎక్కడ పిడికెడు మట్టి తీసుకున్నా**
**ఒరిగిన వీరుల కనుగుడ్లే కదలాడుతున్నాయ్!**
**నుజ్జునుజ్జయిన**
**జీవాల ఆత్మకతలే వినిపిస్తున్నాయ్!!"**
**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 14)**

ఈ దాష్టీకాల గురించి విపులంగా 'నిర్బంధం – రాజ్యహింస' అనే భాగంలో

వివరించడం జరిగింది.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం పురుడుపోసుకోవడంలో భూమి అన్యాక్రాంతం కావడం కూడా ఒక ప్రధాన కారణమని ఈ కవిత్వం ద్వారా అర్థం చేసుకోవచ్చు.

## 4.4. విద్యుత్తు

ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి నాంది పడింది ఖమ్మం జిల్లాలో. అక్కడి పాల్వంచ థర్మల్ విద్యుత్ కేంద్రంలో రవీంద్రనాథ్ అనే కార్మికుడు ఆమరణ నిరాహార దీక్ష మొదలుపెట్టాడు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడి 12 సంవత్సరాల తర్వాత ఈ నిరసన మొదలైంది. ఈ మధ్య కాలంలో తెలంగాణ ప్రాంతానికి ఇచ్చిన రక్షణలేవీ అమలుకు నోచుకోకపోగా ఉద్యోగరంగంలో సింహభాగం సీమాంధ్రులే స్థిరపడ్డారు. పాల్వంచ థర్మల్ విద్యుత్ కేంద్రంలోని ఉద్యోగాల విషయంలోనూ అదే జరిగింది. దాంతో రవీంద్రనాథ్ తెలంగాణ ప్రాంతానికి అన్యాయం జరిగిందని పోరాటం మొదలుపెట్టాడు. ఆ సెగ తెలంగాణ అంతటా తాకింది. ఈ పరిణామానికి స్పందనగా 1969లో యాదగిరి 'శివుడు మూడవ కన్ను తెరవనేలేదా??' కవిత రాశాడు.

**"ఒడలిలో విద్యుత్తు**
**వెయ్యి వోల్టుల బల్బు**
**వెలిగించి రగులగా–**
**అగ్ని జ్వాలలె కత్తి**
**వలె చేత ధరియించి –**
**'నిప్పులవాన'ను కండ్ల**
**నిండుగా కురిపించి**
**ఈ 'ఆంధ్ర నాయకుల'**
**నిశ్శేషముగ జేయ**

**కదలిరారా వీర!**

**కదలిరారా వీర!**

**ప్రాణాలపై ఆశ**

**వదిలిరారా ధీర!**

**శివుడు మూడవ కన్ను**

**తెరువనే లేదా??"**

**(యాదగిరి, జి. 2009 : 37)**

విద్యుత్ రంగంలో ఉపాధి అవకాశాలు కోల్పోయిన కోణం ఇలా ఉంటే తెలంగాణలో ఉత్పత్తి అయిన విద్యుత్ సీమాంధ్రకు వెలుగులు ఇవ్వడం మరొక కోణం. దానినే సిద్దెంకి యాదగిరి 'తెగించే తెలంగాణ' కవితలో రాశారు.

**"కరంటి యెలుగుల కయిత్కాలల్ల**

**బొగ్గుతవ్వి కరెంటు తయారు చేయవట్టిరి**

**తయారైన కరంటిని తలుగు తప్పదీసి తీసుకపోవట్టిరి"**

**(యాదగిరి, సిద్దెంకి. 2014 : 106)**

తెలంగాణలోని గోదావరి లోయంతా విస్తారమైన బొగ్గు నిక్షేపాలున్నాయి. వాటిని వెలికితీసి వివిధ ప్రయోజనాలకోసం వినియోగిస్తారు. అందులో ఒకటి విద్యుత్ ఉత్పత్తి. తెలంగాణలో ఉత్పత్తి అయిన విద్యుత్తు తెలంగాణకు ఉపయోగపడి మిగులు ఉన్నప్పుడు ఇతర ప్రాంతాలకు సరఫరా చేయవచ్చు. కానీ తెలంగాణ బొగ్గుతో, తెలంగాణ కార్మికులతో, తెలంగాణలో ఉత్పత్తి అయిన విద్యుత్తు తెలంగాణకు అందకుండా పోతున్నది. "విద్యుత్ రంగంలో తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతున్నది. ముడిసరుకులు, ఇన్‌పుట్స్ తెలంగాణలోనే ఎక్కువగా ఉన్నప్పటికీ విద్యుత్‌లో తెలంగాణకు దక్కాల్సిన వాటాను ఇవ్వడంలో సవతి తల్లి ప్రేమనే ప్రదర్శిస్తున్నారు"(లోకేందర్ రెడ్డి, ఎ. 2004 : 253). ఇటువంటి స్థితినే కవి నిరసిస్తున్నారు. సరిగ్గా ఇదే విషయాన్ని భీంపల్లి శ్రీకాంత్ రాసిన

'సోది' దీర్ఘకవితలో ఇట్లా చెప్పారు.

**"సింగరేణి**

**గనుల మాగాణి**

**తెలంగాణ రాణి**

**కరెంటు కోత**

**తెలంగాణలో**

**కడుపుకోత"**

**(శ్రీకాంత్, భీంపల్లి. 2004 : 14)**

తెలంగాణలో వ్యవసాయం కుంటుపడటానికి ఉన్న కారణాల్లో విద్యుత్తు అందకపోవడం ఒకటి. ఇక్కడ కవి 'కరెంటు కోత'ను 'కడుపు కోత'గా భావించడం గమనించదగిన ముఖ్యవిషయం. కడుపుకోత కన్నబిడ్డలు దూరం అయితే వచ్చే బాధ. బిడ్డలంటే తాము జన్మనిచ్చినవాళ్లు. ఇక్కడ కవి కరెంటును ఉత్పత్తి చేసింది తెలంగాణ తల్లి, కానీ బిడ్డ అనే కరెంటు మాత్రం ఆంధ్రాకు తరలించబడింది. అందుకే ఆయన కడుపుకోతగా దాన్ని అర్థం చేసుకుని రాశారు. ఇటువంటి భావనే అన్నవరం దేవేందర్ రాసిన 'మంగులం' కవితలో వ్యక్తమైంది.

**"గద్దోలె తన్నుకపోయినవ్**

**మా కరెంట్ మాకు గాకుంట జేసినవ్"**

**(దేవేందర్, అన్నవరం. 2001 : 6)**

ఏ సంపద అయినా ప్రాథమికంగా స్థానికులకు అందుబాటులో ఉండడం అన్నది సామాజిక న్యాయం అవుతుంది. పైగా వనరులన్నీ తెలంగాణవే అయ్యుండి ఉత్పత్తి మాత్రం ఇతరులు స్వార్థపూరితంగా వాడుకోవడం అన్యాయమే కాగలదు. అందుకే కవి ఆవేశంగా గద్దలాగ తన్నుకుపోయారని అన్నారు.

చంద్రబాబునాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచింది. అసలే అంతంతమాత్రంగా అందుబాటులో ఉన్న విద్యుత్తు రైతు జీవితాన్ని ఇరుకునపెట్టింది. ఆ అందుబాటులో ఉన్న విద్యుత్తుకు కూడా ఛార్జీలు పెంచడం అన్నది మూలిగే నక్కమీద తాటికాయపడ్డ చందంగా మారుతుంది. తెలంగాణలో ఇదే పరిస్థితి ఏర్పడింది. దానికి నిరసనగా రైతులు సంఘటితమై హైదరాబాదుకు చేరారు. తమ నిరసన గళం వినిపించారు. దానిని సహించలేని చంద్రబాబునాయుడి ప్రభుత్వం అన్యాయంగా నిరనసకారులపై లాఠీ ఛార్జీ చేయించి కాల్పులు జరిపించింది. దాంతో నలుగురు రైతులు అక్కడికక్కడే మరణించారు. ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సింది పోయి, తామే ప్రజల్ని ఇబ్బంది పెట్టి, ఇదేం అన్యాయమని ప్రశ్నిస్తే కాల్చి చంపడం అత్యంత ఘోరమైన ఆధిపత్యం. ఈ సంఘటనను వివరించేదే సిద్దెంకి యాదగిరి రాసిన 'అయ్యో కరెంటు' కవిత.

**"పెరిగిన ధర పేలిన తూట**
**కాలుతున్న మంటలు జాలువారుతున్న నెత్తుటికాల్వ**
**నింగికెగిసిన జనం ఘోష**

**ఇన్నాళ్లు కరెంటు ముట్టుకుంటె జనం సచ్చేది**
**ముట్టుకున్న చార్జీలను నిలదీస్తే చాలు**
**పొలిటికల్ పవర్‌తో ధరపెరిగిన కరెంటు**
**జనం చావుకు అరెస్టు వారెంట్ జారీచేస్తుంది**

**గొంతెత్తి నినదించిన యువకులపై**
**రక్షణ ఆన ముంచెత్తిన రాళ్లవాన**
**మరణంతో పోరాడుతూ ఒక పాణం**
**చార్జీ.. తగ్గించాలి చార్జీ.. తగ్గించాలి**
**అన్న గావుకేక సావుకేకగా మారింది**

**ఆత్మీయుల కన్నీటి వర్షం**
**బుల్లితెరపై చూస్తే గుండె తరుక్కపోతూ**
**కుండపోత వర్షం కండ్లల్లనుంచి కురుస్తుంది**
**అయ్యో కరెంట్ దయలేదే**

**స్వచ్ఛమైనదానవే కరెంటు**
**స్వార్థపరుల చేతుల్లో చిక్కి**
**నీ నీతి నీటమునిగింది గదే**

**నినదించే జనప్రళయం**
**పిడికిలెత్తితే ఉడుకురక్తం ఉప్పెనైతది**
**కరెంటా!**
**ఒకసారి వెనక్కి చరిత్ర చూడు**
**ఉద్యమాలు రాజ్యాలను రద్దు చేస్తాయి**
**ఈ కరెంటు పవరోలెక్క**
**విజయం ఖాయం ఒరిగిన వీరుల సాక్షిగా..”**
**(యాదగిరి, సిద్దెంకి. 2008 : 10, 11)**

ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలు తగిలి మరణించినవారు ఎక్కడైనా ఉన్నారు. ఇది యాదృచ్ఛికం. కానీ వ్యవసాయం అనుకూలించక కరెంటు స్తంభాలకు ఉరేసుకుని చనిపోయిన రైతులు తెలంగాణలో అనేకమంది ఉన్నారు. ఇది రాజకీయం. కరెంటు తీగలను ముట్టుకుని చచ్చిపోయే జనాలు సీమాంధ్ర ప్రభుత్వానికి శత్రువులు కారు. కానీ కరెంటు ఛార్జీలను ముట్టుకుంటే మాత్రం శత్రువులు. అందుకే అన్యాయంగా ప్రభుత్వమే కాల్పులు జరిపి రైతుల్ని చంపేసింది అని  చెప్పడం కవి ఉద్దేశం.

నిజానికి కరెంటు ఛార్జీలు పెరగడం అన్నది ప్రైవేటీకరణ పర్యవసానం. “ఇటీవలే

మౌలిక రంగాల నిర్వహణకయ్యే ఖర్చును వాడకందార్లనుండి రాబట్టాలన్న లక్ష్యంతో ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను కూడా పెంచాలన్న నిర్ణయాన్ని తీసుకున్నది. ఒక్క యూనిట్ ధర కనీసం 50 పైసలైనా ఉండాలని, క్రమంగా దశలవారీగా రేటు ఇంకా పెంచాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. ఉత్పత్తి ఖర్చులో కనీసం సగం ఖర్చును వాడకందార్లనుండి రాబట్టాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది. ఇదికాక విద్యుత్ ఉత్పత్తిలో ప్రైవేటు రంగానికి భాగస్వామ్యం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించడమే కాక ప్రైవేటు రంగంలో విద్యుత్ ఉత్పత్తిని అనుమతించింది. ఈ కంపెనీలు ఉత్పత్తి చేసిన కరెంటును ప్రభుత్వం యూనిట్‌కు రెండు రూపాయల నలభై పైసలు చెల్లించి కొనుగోలు చేయడానికి కూడా అంగీకరించింది. సరఫరాలను, సప్లయి ఖర్చులను కలుపుకుంటే ఇలా కొనుగోలు చేసిన విద్యుత్తు ఖర్చు వాడకందార్ల దగ్గరకు వచ్చేసరికి యూనిట్ ధర నాలుగు రూపాయలవుతుంది. ఎన్‌టిపిసి నుండి కొనుగోలు చేసే కరెంటు యూనిట్ ధర కేవలం ఒక రూపాయి ఎనిమిది పైసలని గమనించాలి. ప్రైవేటు కంపెనీల నుండి కొనుగోలు చేసే కరెంటుకయ్యే ఖర్చులో కనీసం సగమైనా వాడకందార్లనుండి రాబట్టాలన్న నియమాన్ని పాటిస్తే యూనిట్ ధర సుమారుగా రెండు రూపాయలవుతుంది. వ్యాపార సరళిలో, లాభాలననుసరించి రేట్లను నిర్ణయించాలన్న సూత్రం కనుక పూర్తిగా అమలులోకి వస్తే విద్యుత్ రేట్లు బాగా పెరిగిపోతాయి. ఇటువంటి పరిస్థితిలో వ్యవసాయరంగంలో విద్యుత్ వినియోగం పడిపోతుంది. అందువల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ వ్యవస్థ ఇంకా శిథిలమయ్యే ప్రమాదమున్నది. రేట్లు పెరిగితే విద్యుత్‌ను వ్యాపారసరళిలో అమ్మాలనుకుంటే కొనగలిగే శక్తి వున్న అభివృద్ధి చెందిన ఇతర ప్రాంతాలకు ప్రాధాన్యత పెరుగుతుంది. కొనుగోలు శక్తి అంతగా లేని తెలంగాణ గ్రామీణ ప్రాంతాలు నిర్లక్ష్యానికి లోనవుతాయి''(కోదండరామిరెడ్డి, ఎం. 2001 : 105, 106). ఈ ఊహాప్రతిపాదన విద్యుత్ రంగ ప్రైవేటీకరణ ప్రారంభకాలంలో చేసినది. తరువాతి కాలంలో అదే నిజమైంది కనుకనే రైతుల మీద భారం పడింది. పర్యవసానంగానే రైతులు పెరిగిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా ఉద్యమించవల్సి వచ్చింది. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించడాన్నే కవి 'స్వచ్ఛమైనదానవే కరెంటు / స్వార్థపరుల చేతుల్లో చిక్కి / నీ నీతి నీటమునిగింది గదే' అన్నారు.

"రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వడమనేది కొత్త విషయమేమీ కాదు. మన పొరుగు రాష్ట్రమైన తమిళనాడు, ఉత్తర భారతంలో పంజాబ్‌లు ఇప్పటికీ రైతులకు ఉచిత విద్యుత్తును ఇస్తున్నారు. అయినా ఆ రాష్ట్రాల విద్యుత్ బోర్డులు ఆర్థికంగా బాగానే ఉన్నవి. దీనికి కారణం వారు ఉత్పత్తి, సరఫరా, పంపిణీ రంగాలలో అనుసరిస్తున్న మెరుగైన పద్ధతులు. ఉదా: తమిళనాడులో స్పాట్ బిల్లింగ్ పద్ధతి ద్వారా వందశాతం రెవెన్యూను వసూలు చేస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. మన రాష్ట్రంలో స్పాట్ బిల్లింగ్ ప్రవేశపెట్టమని ఇంజనీర్ల సంఘాలు ఎన్నో ఏళ్ళుగా మొత్తుకుంటున్నా ప్రభుత్వం తమ లొసుగులు బయటపడతాయనే భయంతో ఈ సలహాను పెడచెవిన పెట్టింది. దీన్ని బట్టి అర్థమయ్యేది ఏమిటంటే రైతులకు ఉచిత విద్యుత్తు ఇవ్వడమనేది ఏమాత్రం కష్టమయిన పనికాదు. కాని ప్రపంచబ్యాంకుకు అమ్ముడుపోయిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత విద్యుత్ ఇవ్వడు. ఈ పరిస్థితుల్లో రైతన్నలకు ఉచిత విద్యుత్తు అందించాలంటే తెలంగాణా రాష్ట్ర సాధనే ఏకైక మార్గం"(వెంకటరెడ్డి, వెదిరె. 2002 : 5, 6). స్థూలంగా చూసినప్పుడు ఒకవైపు తెలంగాణలో విద్యుత్ రంగంలోని ఉద్యోగాల్లో తెలంగాణ వారికంటే ఎన్నో రెట్లు సీమాంధ్ర ఉద్యోగులు ఉన్నారు. కనుక తెలంగాణ నిరుద్యోగులకు అవకాశాలు మృగ్యమైపోయాయి. మరోవైపు తెలంగాణలో ఉత్పత్తి అయిన కరెంటు తెలంగాణకు న్యాయబద్ధమైన వాటా ప్రకారం అందడం లేదు. ఇంకొకవైపు విద్యుత్ రంగంలో ప్రైవేటు కంపెనీలకు అవకాశాలు కల్పించి, కరెంటు ఛార్జీలు పెంచి, కొనుగోలు శక్తిలేని తెలంగాణ వాడకందార్లను, అందులోనూ వ్యవసాయదారులను అన్యాయం చేసింది సీమాంధ్ర పాలకవర్గాలు. ఈ మొత్తం సారాంశమంతా తెలంగాణకు విద్యుత్ రంగంలో అన్యాయం జరిగిందనే విషయాన్ని తెలియజేస్తుంది కనుకనే తెలంగాణ కవి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని కోరుకున్నట్లు అర్థం చేసుకోవచ్చు.

## 4.5. ప్రపంచీకరణ

తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ప్రాంతీయ చైతన్యం ఉన్నా ఒక శాస్త్రీయమైన విశ్లేషణ దానికి లేదు. ఆర్థిక రంగంలో సరళీకరణ విధానాలు అమలు

అయిన స్థితి అప్పటికి లేదు. కానీ ప్రపంచీకరణ నూతన విధానాలను అమలు చేసింది, తెలంగాణలోని సకల రంగాలను విధ్వంసానికి గురిచేసింది సీమాంధ్ర ప్రభుత్వం. కాబట్టి మలిదశ పూర్వార్ధ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం స్పష్టంగా ప్రపంచీకరణ విధానాల నేపథ్యం నుండి రూపుదిద్దుకుంది. "ప్రపంచీకరణ, సామ్రాజ్యవాద వ్యతిరేక భావజాలం అడుగుజాడల నుంచి తెలంగాణ ప్రాంతీయ చైతన్యం అస్తిత్వ వేదనవాదంగా నిలదొక్కుకుంది"(ముదిగంటి సుజాతారెడ్డి, ముద్దెర, పుట. 13). కనుక తెలంగాణ కవులు తామున్న స్థితికి కేవలం అంతర్గత వలసవాదమే కారణం కాదని, దానికి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ అండగా ఉన్నదని గుర్తించే స్పష్టమైన దృక్పథంతో కవిత్వం రాశారు. యెన్నం ఉపేందర్ 'గంజి కేంద్రం' కవితలో ఇట్లా రాశాడు.

**"చుక్కలు చుక్కలుగా**
**బట్టీ దిగుడు మొదలైంది**
**పేలని ఎల్.పి.జి. సిలెండర్‌లా**
**వేచి చూస్తున్న మిలీనియం పదార్థం**
**'ఎల్' అంటే లిబరలైజేషన్ కావొచ్చు**
**'పి' అంటే ప్రైవేటీకరణే కావొచ్చు**
**'జి' అంటే గ్లోబలీకరణే కావొచ్చు**
**ఏదైతేనేం**
**ఖాళీ పొట్ట చుట్టూ చుట్టుకొన్న**
**ఒకే ఒక అనకొండ సర్పం"**
**(ఉపేందర్, యెన్నం. 2010 : 40)**

ప్రపంచీకరణ విడిగా అమలు జరగలేదు. దానికి తోడు సరళీకరణ, ప్రైవేటీకరణ కూడా అమలు అయ్యాయి. వాస్తవానికి ఈ మూడూ విడివిడి అంశాలు కావు. పరస్పరాశ్రితాలూ, ఆధారితాలూ. అయితే, అవి వినడానికి ఉన్నంత సానుకూలంగా ఆచరణలో ఉండవు. ఈ మూడు మాటలకు ఒక విశ్వకుటుంబం ఏర్పడడం అనే భావనలో

విశాలత్వం ఉన్నది గానీ ఆచరణలో అది సామాన్య ప్రజల జీవనాన్ని విధ్వంసించేది. కనుకనే ఈ కవి 'ఏదైతేనేం ఖాళీ పొట్ట చుట్టూ చుట్టుకొన్న ఒకే ఒక అనకొండ సర్పం' అన్నారు.

ప్రపంచీకరణ మానవ ఆలోచనా విధానాన్ని ఎంతగా మార్చి వేసిందో జూలూరు గౌరీశంకర్ రాసిన 'అక్షరం ఒక జీవనాడి' కవిత వివరిస్తుంది.

**"నేనిప్పుడు**
http.money.com **ఫైల్లో**
**పాస్‌వర్డ్ లేకుండా నాలోకి నేను పోలేను**
**పదుగురు కలిసి పాడుకునే 'జానపదానికి'**
User ID **లేక**
Pop **సంగీతానికి పైకెగిరి పోయింది**
**జీవితం కంప్యూటర్లలోకి**
**ఈ ప్రపంచీకరణ "బగ్"ని నింపింది**
**వరల్డ్ బ్యాంక్ కావచ్చు..**
**అమెరికా దొరవారూ కావచ్చు..**
**నా మీద ఏ ముళ్ల ప్రపంచీకరణ**
**కిరటీమైనా పెట్టండి**
**పరాయి వారికోసం శిలువనెక్కే ఓపిక లేదు.**
Think Globally
Act Locally
**అన్న వాక్యానికి ఎటు చూసినా నేనే..!"**
**(గౌరీశంకర్, జూలూరు. 2008 : 66)**

మనిషి తనలోకి తాను పోవడానికి పాస్‌వర్డ్ అవసరమవుతున్నది అని చెప్పడం

మనిషి పరాయీకరణ చెందాడని చెప్పడానికి సూచిక. ఈ పరాయీకరణ చెందించినది అమెరికన్ సామ్రాజ్యవాదం, ప్రపంచబ్యాంకు. అందుకే కవి ఈ రెండూ కలిసి తెలంగాణ సగటు మనిషి తలమీద ప్రపంచీకరణ అనే ముళ్లకిరీటం పెట్టారు అని భావించి రాశారు. ఇంతకు ముందే చెప్పినట్లు ప్రపంచీకరణ అనే మాట తీయనైనదేగాని ఆచరణలో అది అత్యంత చేదైనది అని సూటిగా వ్యక్తం చేస్తుదీ కవిత.

ప్రపంచీకరణకు ప్రతీదీ మార్కెట్ వస్తువుగానే కనిపిస్తుంది. మానవ జీవితంలో వెలకట్టలేని అనేకమైనవాటిని సరుకు చేసింది ప్రపంచీకరణ. ఎందుకంటే అది సామ్రాజ్యవాదాన్ని అంతర్గత సారంగా కలిగి ఉన్నది. ఈ దారుణాన్ని వివరించేదే నందిని సిధారెడ్డి రాసిన 'విజన్' కవిత.

**"చంద్రుడిలో ఇంకా ఆ నల్లటి మచ్చలేంటి?**
**సిల్వర్ పెయింట్ వేయండి**
**ఈ కోట ఇంకా లాల్‌ఖిలా ఏమిటి?**
**గోల్డ్ పెయింట్ వేయండి**
**తెలుపూ పసుపూ తప్ప ఇంకే రంగూ కనబడకూడదు**
**వెంటి బంగారాలతో ఈ దేశం తులతూగాలి**

**దేశమంటే మనుషులు కాదు**
**దేశమంటే మార్కెట్**
**ఈ కవులు ఎప్పుడర్థం చేసుకుంటారో.."**
**(సిధారెడ్డి, నందిని. 2017 : 278)**

ఈ కవిత 2001లో ప్రచురించిన 'ఒక్క బాధగాదు' కవితా సంపుటిలోనిది. "ప్రపంచీకరణ ప్రభావాలు, ఆక్రోశాలు, చెదిరిపోతున్న విలువలు, గ్రామఘోష 'ఒకబాధగాదు"(సిధారెడ్డి, నందిని. 2017 : 6) అని స్వయంగా కవే చెప్పుకున్నారు.

తెలుగు ఆధునిక సాహిత్యం వెలువడుతున్న తొలినాళ్లలో గురజాడ దేశమంటే మట్టికాదు, మనుషులు అని చెప్పి సాహిత్యాన్ని ప్రజలపరం చేయడం అవసరం అన్నాడు. ప్రపంచీరణ విధానాలు అమలయిన తర్వాత కవులు తమ సామాజిక బాధ్యతగా దేశమంటే ఇవాళ మనుషులు కాదు, మార్కెట్‌గా మారిపోయారు కనుక ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని అభిలషిస్తున్నారు.

పొన్నాల బాలయ్య రాసిన 'గ్లోబలైజేషన్' కవితలో ప్రపంచీకరణ పల్లె మీద చేసిన బహుముఖీనమైన దాడిని అక్షరీకరించారు.

**"అదో విషసర్పం**
**పాకుతుంది నాకుతుంది**
**రూపాలు మారుతుంది**
**ప్రపంచాన్నంతా పాకుతుంది**
**గ్లోబునంతా చుట్టేస్తుంది**
**పల్లెల్లో..**
**గొర్రెల మందలపైన చిరుతల దాడి**
**మట్టికుండలు మాయం**
**ఊటబావుల ఉసురు**
**కాలినడకలు కూలిపోయినై**
**మనిషి నడవడానికి మరలొచ్చినై**
**అదిగో..**
**నా పల్లెతల్లి గుండె పగిలింది**
**పల్లెజనం పక్కదారి**
**గుంటుకల నాగళ్లు గుటుక్కుమన్నయ్**
**ఇనుప నాగండ్లు ఇగిలిత్తున్నయ్**
**డొక్కలెండిన రైతు బోర్లబడుతండు**

**అగో..**

**రూపం మారింది**

**నా ఎడ్లబండి ఎట్లనడుత్తది**

**బండినిలాగే బర్లకు ఇస సర్పం గుట్టింది**

**కొండ చిలువలా చుట్టుతంది**

**కొంపలన్నీ ముంచుతుంది**

**అదో రంగుల కల**

**రంగులు మారుతుంది**

**పల్లెల్లో పాకుతుంది**

**సంస్కృతిని సంపుతుంది**

**బానిసలను జేత్తంది**

**భారతాన్నే మింగుతుంది"**

**(బాలయ్య, పొన్నాల. 2008 : 65, 66)**

పల్లె సకల వృత్తుల, సకల శ్రమల కేంద్రం. మానవ సంబంధాల సమూహం. కానీ ప్రపంచీకరణ వృత్తులను దూరం చేసి మనుషులను దూరం చేసింది. తద్వారా మనిషి జీవిక కష్టం కావడం మాత్రమే కాకుండా సంస్కృతి కూడా విధ్వంసానికి గురవుతుంది. ఈ క్రమంలో మనిషి నూతనంగా ఏర్పడిన మార్కెట్ సంస్కృతికి అనివార్యంగా అలవాటుపడి బానిసత్వంలోకి నెట్టివేయబడతాడు. ఈ మొత్తం క్రమాన్ని కవిత ప్రతిభావంతంగా చిత్రించింది.

ప్రపంచీకరణ వ్యవసాయ చక్రాన్ని ఎలా విధ్వంసం చేసిందో వివరించేదే కట్టా భగవంతరెడ్డి రాసిన దీర్ఘకవిత 'జుదాయి జంగ్'.

**"యవుసం చేసిన యాది**

**మోటాగొట్టిన యాది**

**మోటసిమ్ములమీ నుండి**

**దుంకి యాత కొట్టిన యాది**

**యాతమేసిన యాది**

**నాగలిబట్టిన యాది**

**కొంబ్రలేసిన యాది**

**కమ్మరి శివయ్య కొలిమి యాది**

**కుమ్మరి దుర్గయ్య వాము యాది**

**వడ్ల లచ్చయ్య ధాతి యాది**

**తోలు చెప్పుల యాది**

**తొండం గుట్టె చిత్రం దుర్గయ్య యాది**

**బండ్లు గట్టిన యాది”**

**(భగవంతరెడ్డి, కట్టా. 2010 : 18, 19)**

'యాది' అంటే తెలంగాణ భాషలో జ్ఞాపకం. జ్ఞాపకం అంటే వర్తమానంతో సంబంధం ఉన్న గతం. ఇక్కడ మనిషి వర్తమానం. అతడు జీవించిన పచ్చటి జీవితం గతం. ఇలా గతాన్ని తలపోసుకోవల్సిన పరిస్థితి వర్తమానంలో అది లేనప్పుడే దాపురిస్తుంది. తెలంగాణలో ఒకరిమీద ఒకరు ఆధారపడే వ్యవసాయ వృత్తం ఒకటి ఉండేది. అది ఎక్కడైనా ఉంటుంది. కానీ తెలంగాణలో ప్రపంచీకరణ అమలు ఫలితంగా ఈ వృత్తం అదృశ్యం అయ్యింది. ఈ కవిత ఆ విషయాన్ని ఉద్దేశించింది. అట్లే వ్యవసాయరంగ విధ్వంసం కారణంగా జరిగిన పరిణామాన్ని దామెర రాములు రాసిన 'వగల మాటలు – పగల బాటలు' కవితలో వివరించారు.

**“నల్లరేగడి భూముల్లో**

**తెల్ల నాగుంబాము కాటెస్తె**

**ఎంతమంది నా తెలంగాణ రైతన్నలు**

**కన్ను మూయలేదు?”**

**(రాములు, దామెర. 2006 : 25)**

ఇక్కడ తెల్లనాగుంబాము అనే మాటకు అమెరికన్ సామ్రాజ్యవాదం అని అర్థం. నల్లరేగడి భూమి అత్యంత సారవంతమైన, వ్యవసాయయోగ్యమైన భూమి. ఆ భూమి తెలంగాణకు సూచిక. తెలంగాణ వ్యవసాయ రంగాన్ని ప్రపంచీకరణ కాటువేసినందుకు పర్యవసానంగా వేలాదిమంది రైతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నట్లు గత అధ్యాయాలలో స్పష్టంగా వివరించడం జరిగింది.

ప్రపంచీకరణకు ఉన్న స్వభావం అది తీసుకువచ్చే అన్ని మార్పులు వేగవంతంగానూ, కంటికి కనపడేవిగానూ ఉండవు. కానీ జరిగే నష్టం మాత్రం పూడ్చుకోలేనిదిగా జరిగిపోతూనే ఉంటుంది. ఆ స్థితినే తైదల అంజయ్య 'శత్రు స్పృహ' కవితలో వివరించాడు.

**"నిశ్శబ్దం పొంచి వుంటుంది**
**నీడలు భయపెడతాయి**
**చాపకింద నీటిపాము కదిలినట్లు**
**నువ్ మేల్కొనక ముందే**
**శత్రువు చాలా రూపాల్లో ఎదురవుతాడు**
**ఇపుడు కంప్యూటర్లు అర్థమైనంత సులభంగా**
**సమస్య అర్థం కాదు**
**శత్రువు అసలు కనబడదు**
**అసలును మించిన వడ్డీగానో**
**ఆకాశాన్నంటే ధర రూపంలోనో**
**పంటకు పట్టిన చీడగానో**
**నీ వెంటనే తిరిగే కోవర్ట్‌గానో**
**ఏదో ఒక విధంగా శత్రువాత పడకుండా**

**నువ్విప్పుడు ఇంటికి చేరలేవు"**
**(మంజీరా రచయితల సంఘం. 2001 : 40)**

రైతులకు ప్రపంచీకరణ అంటే తెలవదు. ప్రపంచబ్యాంకు నియంత్రణలూ, ప్రయోజనాలూ తెలియవు. కానీ వ్యవసాయం సాగకపోవడం మాత్రం అనుభవంలోకి వస్తూనే ఉంటుంది. కష్టాలు అనుభవంలోకి వస్తూనే ఉంటాయి. జీవితాన్ని ఛిద్రం చేస్తూనే ఉంటాయి. ఇటువంటి అదృశ్య శత్రు విన్యాసాన్ని వివరించేదే ఈ కవిత. దాదాపు ఇవే భావనలతో రాసిందే అల్లం నారాయణ 'యాది – మనాది' కవిత.

**"బతుకు ఛిద్రం.. బతుకు విధ్వంసం**
**విత్తనం మీద బహుళజాతి పేరు**
**ఎవనికి పుట్టిన బిడ్డయినా**
**అంగట్ల అమ్మే అపసవ్యవపు సరుకు**
**నెలలు నిండని శిశువులను కన్న**
**ప్రపంచీకరణ**
**గుమ్మంలో తోలు బొమ్మలాట**
**మట్టి కుండలో కోకాకోలా**
**నట్టింట్లో కలర్ కలల కంప్యూటర్లు**
**ఆత్మహత్యలు కాస్తున్న కళాశాలలు**
**నాకున్నది సెలక ఒకట కోంగ్రెడు**
**నీకున్నది**
**'స్ప్రింక్లర్' చుక్కలతో ఇజ్రాయిలీ**
**వ్యవసాయం చేసే**
**నూరెకరాల క్షేత్రం**
**నువ్వూ నేనూ కలిసి ఎగురుదాం**
**అనంతాలకు అట్నుంచటే**

**స్వర్ణాంధ్రకు**

**ప్రపంచబ్యాంకు మూచూసిన కుక్క**

**అది కాలెత్తినప్పుడు**

**పరవశిస్తున్న స్వదేశీ పాలకుడు**

**బతుక్లు అగ్గిదల్గ**

**ఆకుకు అందది.. పోకకు పొందది**

**అటురాదు.. ఇటు పోదు**

**బోరు బావి బావురుమంటున్నది**

**నాగలి విరిచి పొయిలో పెట్టు**

**కమ్మరోడు, కుమ్మరోడు, వడ్లోడు**

**ధాతి మడిచిపెట్టి, కొలిమి సల్లార్చి, సారె**

**పారిపోయిన బతుకులు..**

**ఇప్పుడు ట్రాక్టర్‌కు రెండెడ్లను కట్టు**

**ఎడ్ల బాటల మీదుగా**

**నేరుగా స్వర్ణాంధ్రకు..**

**విజన్ 2020 ఒక మాయని పత్రం**

**కోస్తాంధ్రదది, వలస సమర్థన చట్రం"**

**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 39, 40)**

ప్రపంచీకరణ సారాన్ని భిన్న కోణాల్లో వివరించిన కవిత ఇది. ప్రధానంగా వ్యవసాయరంగ సంక్షోభాన్నే చిత్రించినా దాని ఆశ్రితంగా ఉండే వృత్తుల ధ్వంసాన్ని కూడా చెప్పారు. అట్లే సామ్రాజ్యవాద ప్రయోజనాలను నెరవేర్చే విద్యారంగ మార్పులను కూడా వర్ణించారు. స్థూలంగా ఒకవైపు యాంత్రికత, మరోవైపు నూతన వంగడాలు, ప్రైవేటు రంగ స్వార్థాలు, వెరసి తెలంగాణ ప్రజలు ఉనికిని కోల్పోతున్నారని చెప్తూనే మరోవైపు కోస్తాంధ్ర పాలకవర్గాల వివక్షాపూరిత ధోరణిని కూడా ఎండగట్టారు.

ప్రపంచీకరణ కారణంగా మానవ సంబంధాల విధ్వంసం ఎలా జరిగిందో చెప్పేది అన్నవరం దేవేందర్ 2001లో రాసిన 'www.ఇండియా డాట్ కాం..' కవిత.

**'నన్ను నేను పొలిమేరల్లో పారేసుకొని**
**నాతలకాయ జేబులో నిక్షిప్తం చేసుకున్నాను**
**ఓరి దేవయా! నువ్వు అమెరికాకు పోకురా అని**
**మా తాత ఎంత కసిరిచ్చినా**
**గెండెను కుదువ పెట్టి - సైబర్ లైఫ్‌ను కలగన్నాను**
**ఇక్కడంతా సైబర్ నవ్వులు - డాలర్ పువ్వులు**
**మేం హృదయాలతో ఉదయించం**
**ప్రేమకు లేకున్న కంప్యూటర్‌కు ప్రాణం ఉన్నట్లే**
**మా ఆత్మలన్నీ మూట గట్టి**
**అటుకు మీద దాచిపెట్టిన వాళ్లం కదా!**
**అంతా 'ఈమెయిల్' డాట్ కామ్‌ల దర్పాలే**
**పిట్‌బర్గ్‌లో మా బాపమ్మ యాదికస్తే**
**కుమ్మరి కనకమ్మ @ యాహూ డాట్ కాం అంటా**
**తెరమీదికి మా ముసలమ్మ వచ్చి**
**నేను కన్ను మూసినంక నన్ను సాగనంపక పోతివా**
**దేవిగా! అంటూ**
**బ్రౌజింగ్ చేస్తున్న నన్ను పొడుస్తుంది**
**'పాలగోకు' తింటవా పిలగా అంటూ**
**కపిశ్కతో నోట్లా పెట్టినట్లే కన్పిస్తుంది**
**పీరిల పండుక్కు మలీల ముద్దలు**
**తినిపించినట్లే తెరపై కదలాడుతుంది**
**కాని ఏం చేయను మా బాపమ్మ పోయింది**
**నేను ఇండియాకు వెళ్ళలేదు**

అంకుల్ శామ్ నన్ను పంపించలేదు
నక్కా నాగలోకం లెక్క
ఎక్కడి మా 'పోతారం' ఎక్కడి 'ఫిట్స్‌బర్గ్'
మా లెక్కలన్నీ డాలర్లు డాలర్లు డాలర్లే కదా

నన్ను కన్న నా పల్లె రొంబొచ్చె గుద్దుకొని రోదిస్తుంది
మాతాత వానిన కుమ్మరి సారె విరిగిపోయింది
ఇవేవి నా కంప్యూటర్ తెరపై కన్పించవు
నా చుట్టూ ఎసి కార్లు ఇంటర్నెట్ తెరలు
ఇన్ఫర్‌మేషన్ విప్లవాలు పరిభ్రమిస్తున్నాయి
ఇన్ని ఉన్నా నాతాత గుర్తుకస్తే
చెదిరి పోయేందుకు నాకు మనస్సు లేదు

కుమ్మరి మల్లయ్య @ యాహూ డాట్ కాం అంటే
చల్లని వెన్నెలతో గడెంచపై కూర్చొని
శాస్త్రాలు చెప్పుతున్న తాత కండ్లల్ల మెరుస్తున్నాడు
ప్రాణం అవుశిపోతుంది
నేను అమెరికాకు ఎగిరి రాగా
తాత ఎక్కెక్కి ఏడ్చిండు
బాపమ్మ అయితే శోకమే పెట్టింది
ఇక్కడ ఏడుస్తామంటే కన్నీరే లేదు
ఆత్మీయత అక్కడే వదిలేసాను

ఇంత ఆలోచన నాకెందుకు
నాకు డాలర్లు కావాలి డాలర్లు
కన్నవారు వద్దు అమెరికానే హద్దు"

**(దేవేందర్, అన్నవరం. 2001 : 28)**

ఇంతకు ముందే చెప్పినట్లు ప్రపంచీకరణ అన్నింటినీ సరుకుగా మార్చేస్తుంది. ఈ క్రమంలో మానవ సంబంధాలు కూడా ధ్వంసం అవుతాయి. ప్రభుత్వాలు ప్రజలకు అవసరమైన ఉపాధి అవకాశాలు స్థానికంగా కల్పించాలి. కానీ తెలంగాణ నిరుద్యోగ సమాజానికి సీమాంధ్ర పాలకులు మొండిచెయ్యి చూపడం జరిగింది. ఈ క్రమంలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు చవకైన మానవ వనరుల అవసరం ఏర్పడింది. తెలంగాణలో అది పుష్కలంగా కనిపించింది. దాంతో అది తెలంగాణ మీద ఎర వేసింది. దేశదేశాలకు ఉపాధి అవకాశాలపేర తరలించి శ్రమను దోపిడీ చేసింది. ఈ క్రమంలో దూరాలకు పోయిన ఉద్యోగులకు తమ ఊర్లే కాదు, ఊర్లోని తమవారు, బంధువులు, ప్రేమలు, ఆప్యాయతలు దూరమైపోయాయి. కేవలం డాలర్లు మాత్రమే వారి కంటికి కనిపించాయి. ఈ వాస్తవాన్ని స్పష్టంగా వివరించిన కవిత ఇది.

కాశీం 2006లో రాసిన 'డాలరు కాపాడునట' కవితలో ఇలా రాశాలు.

**"ఒరే కన్నా!**
**కాట్రోని బండపై**
**నువ్వు చెక్కిన పేరు**
**అమెరికా చెరిపేయకుండా**
**ఐరాస కాపలాకాస్తుందిలే!**
**వాగులో**
**నువ్వు కట్టిన పిట్టగూడును**
**ఇసుక వ్యాపారులు**
**బంజారాహిల్స్‌లో భద్రపర్చారట!**

**చెలిమెలో ఊరిన చేపపిల్ల**

నీ చేతులను ముద్దాడిన జ్ఞాపకమంటావా?
ఎం.ఎన్.సి. ఎక్వేరియంలో
కొంగబావ కాపలున్నాడట!

ప్రేమతో పుస్తకంలో దాచిన
నెమలి ఈక
పశ్చిమ గాలికి లేసిపోయింది!
సైబర్ కేఫ్‌లకే పేటెంట్ హక్కట!
సీతాకోకచిలకల రెక్కల మీద
నువ్వు దాచుకున్న బాల్యంపై
ప్లాస్టిక్ పుప్పొడి రేణువులు
మధువు గొలుపునట!

నీ ఒంటరితనం ఒడిలో
గూడుకట్టుకున్న పిట్టలూ
అలిసిన కనురెప్పలపై వాలిన
బింగన్నలకూ
పేనుకున్న ప్రేమలకు
ఐమాక్స్ థియేటర్ గుడి కట్టిందట!

నూకలు చల్లిన హైటెక్ వేటగాడే
కాపలట!

చందమామ నీడలో
నులకమంచంపై
ప్రపంచీకరణ అంగట్లో

**కాటగలిసిపోకుండా**

**డాలర్ కాపడునట!**

**(కాశీం, సి. 2015 : 113, 114)**

ప్రపంచీకరణ పల్లెను మింగేసిందంటే అందులో కేవలం ఆర్థిక కోణం మాత్రమే లేదు. బహుముఖీనమైన మానవ జీవిత సంవేదనలు ఇమిడి ఉన్నాయి. పుట్టుక నుండి మరణం దాకా జీవితం పొడుగూతా గుర్తుంచుకోదగిన తీపి జ్ఞాపకాలూ ఉన్నాయి. అది కలకాలం నిలిచిపోయే బండమీద రాయితో చెక్కిన పేరుకావచ్చు, వాగు ఇసుక మీద కట్టుకున్న పిట్టగూడు కావచ్చు, దూప తీర్చుకోవడం కోసం తవ్విన చెలిమెలో చేపపిల్లలు ప్రత్యక్షం కావడం కావచ్చు, పుస్తకం పేజీల మధ్య దాచుకున్న నెమలీక కావచ్చు, పచ్చిక బయళ్లమీద గాల్లో ఎగురుతూ పట్టుకున్న రంగురంగుల సీతాకోక చిలుకలు కావచ్చు, ఒడుపుగా పట్టుకుని అగ్గిపెట్టెల్లో భద్రపరుచుకున్న బింగన్నలు కావచ్చు, వాకిట్లో నులకమంచం మీద వెల్లకిలా పడుకుని చూసిన చంద్రుడు కావచ్చు, ఇవన్నీ ప్రపంచీకరణ పల్లెలోనికి ప్రవేశించకముందు అగుపించిన దృశ్యాలు, సజీవ జ్ఞాపకాలు. కానీ ప్రపంచీకరణ కారణంగా ఈ జ్ఞాపకాలు వర్తమాన కాలానికి ప్రయాణించకుండా ఆగిపోయాయి. కాంక్రిట్ అడవి ప్రవేశించిన పల్లెలన్నీ ఇవాళ కృత్రిమ జీవనంలో కొలువుదీరాయని, దానికి ప్రపంచీకరణ కాపలాదారు అని వ్యంగ్యంగా చెప్పడం కవి వేదననూ, ఆవేశాన్ని వ్యక్తం చేయడంతోపాటు ప్రపంచీకరణ ఎంత ప్రమాదకరమో కూడా సూచిస్తుంది.

ఏ మానవ సమూహానికైనా స్వతహాగా ఒక జీవన విధానం ఉంటుంది. అందులోనే ఆ సమూహం మనుగడ సాగిస్తూ ఉంటుంది. కానీ ప్రపంచీకరణ తెలంగాణ ప్రజలకు బలవంతంగా నూతన జీవన విధానాన్ని రుద్దింది. ఆ విషయాన్నే నందిని సిధారెడ్డి 'నిర్నిద్ర' అనే కవితలో చిత్రించాడు.

**"చరిత్ర కాదు–**

**వాణిజ్య ప్రకటనలు**

**మనకు జీవించుడెట్లాగో నేర్పుతయి**
**మన పిల్లల్ని మనమెట్ల ప్రేమించాల్నో**
**మల్టీనేషనల్ కంపెనీలు చెబుతయి**
**ఆడపిల్లల్ని ఏ వయసులో ఎట్లా వేధించాల్నో**
**హాలీవుడ్ చక్రవర్తులు చెబుతరు**
**మనుషుల మీది ప్రేమలు వస్తువుల మీదికి మార్చిన వాన్నేమనాలె?"**
**(సిధారెడ్డి, నందిని. 2017 : 282)**

బిడ్డల్ని ప్రేమించడంలో కూడా వ్యాపార నియమాల్ని చొప్పించడం అనే కుసంస్కృతిని ప్రపంచీకరణ ప్రవేశపెట్టింది అని ఈ కవి ఉద్దేశ్యం. పైగా అంతటి దుర్మార్గమైన సంస్కృతిని ఆచరించడం కోసం, అలవాటు చేసుకోవడం కోసం సినిమా రంగం ఎలా ఉపయోగపడుతున్నదో, ఎంతటి నష్టకరమైన పాత్ర పోషిస్తున్నదో చెప్పడం ఈ కవితలోని సారం.

ప్రపంచీకరణ తీసుకువచ్చిన మార్పుల్లో అతి ముఖ్యమైనది ప్రైవేటీకరణ. అప్పటిదాకా ప్రభుత్వ నియంత్రణలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను బహుళజాతి కంపెనీల కోసం మూసివేసి, ప్రైవేటు యాజమాన్యాల కంపెనీలు మొదలు పెట్టడం అన్నది ప్రజలకు ప్రభుత్వరంగాన్ని దూరం చేయడమే అవుతుంది. 1997లో ప్రభుత్వరంగ సంస్థలను మూసివేయడాన్ని నిరసిస్తూ వఝల శివకుమార్ 'మూసివేత' కవిత రాశాడు.

**"మా ఆకాశాలన్నీ మసిపట్టేదాకా**
**అవకాశాల్ని గుప్పిట్లో బంధించి**
**ఇప్పుడు పొగగొట్టాలు పెకిలించుకుని**
**కార్ఖానా మూసేసుకుపోతావు సరే**
**నువ్వు ధ్వంసం చేసిన మూలాల్నెక్కడ వెతుక్కోమంటావ్**
**నీ వెన్నుపోటుకి ఛిన్నాభిన్నమైన**

మట్టి స్మృతుల్ని మమకారాల్ని
ఎక్కడినుంచి తవ్విపోసుకోమంటావ్

కడుపుకట్టుకుని వచ్చి
ఈ ఇనపకొమ్మల చెట్టుని చేరిన పక్షుల్ని
ఏ తీరాల వలస పొమ్మంటావ్

నువ్వు మభ్యపెట్టిన పునరావాస వాగ్దానంకింద
నేను వేళ్ళూనుకున్న నేలకి దూరమయ్యా
నువ్వు అభివర్ణించిన ఈ 'ఆధునిక దేవాలయం'లో
కంప్రెషర్లూ, టర్బైన్ల మధ్య ఓ సజీవ పరికరాన్నై
నీ ఉత్పత్తి లక్ష్యం కోసమే
ఊపిరిని గురిపెట్టుకున్నా
నా బతుకుమీది పంచవన్నెల ఊహలకు
కేన్వాసు పరిచింది నువ్వే
ఇప్పుడు రంగులన్నీ లాక్కుంటూ
వివర్ణం చేస్తున్నదీ నువ్వే
దిశమార్చిన ప్రణాళికలతో దిక్కుతోచని శరీరాల్ని
ఖండాంతర కాకులకు విందు చేయబోతున్నదీ నువ్వే

స్వావలంబనకు కొత్త సంకెళ్ళ పరిష్కారాన్నీ
అభివృద్ధికి తాకట్టు తారకమంత్రాన్నీ వల్లిస్తున్నావ్
ఇప్పటికే నీ రెండునాల్కల లాలనల ఫలితాన్ని
యూనియన్ కార్బయిడ్ సాక్షిగా చవిచూశాం

ఇంక మా కళ్ళమీద కొత్తహామీల కుబుసాలు విడవకు

**మాకు నువ్వు మూల్యం కట్టిన స్వర్ణకరచాలనాల కన్నా**

**జీవితం విలువైంది జీవితం కన్నా**

**మట్టితో అనుబంధం విలువైంది**

**మా మట్టిని మేమే సంరక్షించుకుంటాం**

**మా మట్టికి సౌభాగ్యాన్నిచ్చే సంపదనీ కాపాడుకుంటాం"**

**(శివకుమార్, వర్షుల. 1999 : 61, 62)**

ప్రైవేటీకరణలో అతి కీలకమైన అంశం పబ్లిక్‌రంగ సంస్థల సంస్కరణలు. తెలంగాణలో పబ్లిక్‌రంగ సంస్థలు కొన్ని 1995కు ముందే ప్రైవేటు పరమైనా ప్రైవేటీకరణ ఒక విధానంగా రూపొందిందీ, అమలు చేసిందీ నారా చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వమే. ప్రైవేటీకరణ ప్రక్రియ 1995లో సుబ్రహ్మణ్యం కమిటీ నియామకంతో ప్రారంభమైంది. సుబ్రహ్మణ్యం కమిటీ 30 రాష్ట్రస్థాయి పబ్లిక్ రంగ సంస్థల సంస్కరణకు పలు సూచనలు చేసింది. కమిటీ నివేదికను కాబినెట్ సబ్ కమిటీ పరిశీలించి దాని అమలుకై ప్రతిపాదనలు చేసింది. అయితే కాబినెట్ సబ్ కమిటీ ప్రతిపాదనలు, జనవరి 2001లో ప్రభుత్వం విడుదల చేసిన వ్యూహపత్రం ప్రకారం డబ్బులేక చిత్తశుద్ధిలేక అమలుకు నోచుకోలేదు. అందుకే పబ్లిక్‌రంగ సంస్థల సంస్కరణలకు ఊపునివ్వడానికి ఈ సంస్కరణలను ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు సహాయంతో అమలవుతున్న ఆర్థిక పునర్నిర్మాణ పథకంలో చేర్చిందని వ్యూహపత్రం వివరించింది. ఫలితంగా పబ్లిక్‌రంగ సంస్థల సంస్కరణల రూపకల్పన, అమలులో విదేశీ సంస్థలు జోక్యం చేసుకోవడానికి అవకాశం కలిగింది. ఈ ఆర్థిక పునర్వ్యవస్థీకరణలో భాగంగానే ప్రభుత్వం పబ్లిక్‌రంగ సంస్థలను, కో-ఆపరేటివ్ మిల్లులను ప్రైవేటీకరించడానికి ఒక పథకాన్ని రూపొందించింది. పబ్లిక్‌రంగ సంస్థలు ఎటువంటి ఆదాయమూ అందించకపోగా రోజువారీ ఖర్చులకు కూడా ప్రభుత్వంపైనే ఆధారపడుతున్నాయని అందువలన రాష్ట్రాభివృద్ధికి కేటాయించవల్సిన కీలకమైన వనరులను పబ్లిక్‌రంగ సంస్థల నిర్వహణకే మళ్లించవల్సి వస్తున్నదని ప్రభుత్వం చెప్పింది. ఈ పరిస్థితిని రూపుమాపడానికి ప్రైవేటీకరణే ఏకైక మార్గమని ప్రభుత్వం అన్నది. స్వాతంత్ర్యానంతరం ఎదిగిన ప్రైవేటు రంగం వివిధ సేవా, ఉత్పాదక రంగాలను

సమర్థవంతంగా నిర్వహించగలదు కాబట్టి ప్రైవేటీకరణ వల్ల ప్రజలకు ఎటువంటి నష్టమూ వాటిల్లదని చెప్పింది. కానీ వాస్తవానికి అది చేసిన అపారమైన నష్టమని, ఆచరణలో ప్రజలకు ప్రభుత్వం నుండి న్యాయబద్ధంగా అందవల్సిన సేవల్ని అది దూరం చేస్తున్నదని ఈ కవి భావన. అందుకే పరాయి పాలకుల చేతిలో తెలంగాణ నష్టపోతున్నదని, మా నేల మీద మాకే రాజ్యాధికారం కావాలని చెప్పడం ఈ కవిత సారాంశం.

ప్రపంచీకరణ నేపథ్యాన్ని డా॥ జిలుకర శ్రీనివాస్ 'జాగో.. మూలవాసులారా' కవితలో భిన్నమైన దృష్టితో వివరించారు.

**"జాగో మూలవాసులారా!**
**ఆర్యులు, ఆంధ్రావాళ్ళు,**
**ఇటాలియన్లు, పర్షియన్లు, ఆంగ్లేయులు, అమెరికన్లు..**
**ఎవడైతేనేం?**
**ఒక్కో దురాక్రమణదారుడు**
**మనతల్లి తెలంగాణను చెరబట్టిన శత్రువులు**
**జాగో నా రక్త సంబంధీకులారా!**
**మన పూర్వీకుల వీరత్వం శత్రు బలి కోరుతుంది**
**గుణాఢ్యుని గుండెకాయ తెమ్మంటుంది**
**జాగో మూలవాసులారా..**
**జాగో జగావో మూలవాసులారా..!"**
**(స్కైబాబ(సంపా). 2010 : 168)**

మధ్య ఆసియా (యురేషియా) నుండి ఆర్యులు సింధూలోయ ప్రాంతానికి చేరుకున్నది మొదలు ద్రవిడ ప్రజల్ని దురాక్రమించడం మొదలుపెట్టారు. అసలు ఈ దేశంలో దురాక్రమణ మొదలైందే వారితో అని చెప్తున్నాడీ కవి.

సామ్రాజ్యవాదం అంటే ఏదేని ఒక భూభాగంలోని పరిపాలనాధికారాలు చేజిక్కించికుని ఆ భూభాగంలో ఉన్న సకల సంపదలను దోచుకోవడం. ప్రపంచీకరణ విడిగా లేదు, అది సామ్రాజ్యవాద ప్రపంచీకరణ. ఈ విషయంపట్ల కవికి స్పష్టమైన ఎరుక ఉన్నది. అది ఈ కవితలో వ్యక్తమైంది. ఇటాలియన్లు, పర్షియన్లు, ఆంగ్లేయులు, అమెరికన్లు, ఆంధ్రావాళ్లు వరుసగా తెలంగాణను దోచుకోవడానికే ఇక్కడికి వచ్చారని కవి ఉద్దేశం. ఇది కవితా భాగంలోని ఉద్దేశం. మరొక కీలకమైన భావన కూడా ఈ కవితలో ఉన్నది. ఈ నేలకు మూలవాసులైన ప్రజలే నిజమైన వారసులనీ, వారు గతాన్ని తెలుసుకుని వర్తమానాన్ని నిర్మించాలని, చారిత్రకంగా కోల్పోయిన సంపదను తిరిగి పొందడానికి మేలుకోవాలని చెప్పాడు. స్థూలంగా ప్రత్యేక తెలంగాణ సాధించుకోవడమే తెలంగాణ కడగండ్లకు పరిష్కారం అనే నిగూఢార్థం ఈ కవితలో ఉన్నది.

## 4.6. వలసలు

చరిత్రలో వలసలు రెండు రకాలు అని ముందటి అధ్యాయాలలోనే వివరించాను. బతుకుదెరువుకోసం వలస వెళ్లిన జీవితాల్ని చెప్పడం కోసం ఉద్దేశించింది 'వలసలు' అన్న ఈ విభాగం.

స్వాతంత్ర్యానికి పూర్వం నుండే తెలంగాణ ప్రాంతం వలసలకు చిరునామా. పరాయి పాలకుల, భూస్వామ్య రాజుల ఏలుబడిలో పరాధీనులుగా బతికిన ప్రజలు పొట్టకూటి కోసం ఇతరేతర ప్రాంతాలకు వలస వెళ్లడంలో ఒక సహజత్వం, అనివార్యత ఉన్నాయి. కానీ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత స్వపరిపాలనలో వలసలు కొనసాగుతున్నాయంటే అది అనారోగ్య పాలనా విధానాలకు సూచిక.

తెలంగాణ స్వాతంత్ర్యానికి పూర్వం హైదరాబాద్ రాష్ట్రంగా ఉండింది. 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సంవత్సర కాలం తరువాత 1948లో ఈ భూభాగం నిరంకుశ నిజాం ఏలుబడి నుండి విముక్తిని పొంది భారత యూనియన్‌లో విలీనం

చేయబడింది. ఆ తర్వాత తెలంగాణలో 1952లో తొలిసారిగా ఎన్నికలు జరిగాయి. ఈ కాలంలో మద్రాసునుండి చాలామంది ఆంధ్రులు తెలంగాణలోని ఉద్యోగాల్లోకి వచ్చి తిష్ట వేశారని క్రితం అధ్యాయంలో వివరాలు చెప్పడం జరిగింది. ఆ తర్వాతి కాలంలో 1956లో తెలంగాణ ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా ఏర్పడిందే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం. రాష్ట్రావతరణ జరిగిన తర్వాత తెలంగాణ ప్రజలు ఉమ్మడి రాష్ట్రంలో వివక్షకు గురయ్యారు. వ్యవసాయం కుంటుపడింది. ప్రభుత్వం నుండి ఎటువంటి చేయూత అందలేదు. మరోవైపు 1990 నుండి ప్రంపంచీకరణను తీసుకువచ్చారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రాంతంలో వలసలు ఎక్కువయ్యాయి. దేశదేశాలకు, దేశంలోని అన్ని ప్రాంతాలకు బతుకుదెరువుకోసం వలస వెళ్లడం క్రితం కన్నా అధికమైంది. వలస వెళ్లినవాళ్లను తిరిగి రప్పించే ప్రయత్నంగానీ, రప్పించి ఉపాధి అవకాశాలు కల్పించే ఆలోచన కానీ సీమాంధ్ర ప్రభుత్వాలు చేయలేదు. దాని పర్యవసానంగా తెలంగాణ పల్లెల్లో శరీరంలో సత్తువ ఉన్న ప్రజలందరూ ఖాళీ అయ్యే ఒక విషాద వాతావరణం ఆవరించింది. ఆ స్థితినే వి.బి.ఎన్.శ్రీను 'ఆఖరి వేర్లు' అనే కవితలో వివరించారు.

**"ఈ రోజు**
**పొలాల్లో ఎవరూ లేరు**
**మనుష్యుల్లేరు**
**మొక్కల్లేవు**
**నీళ్ళూలేవ్**
**బతుకు పరిగె**
**ఏరుకు తింటానికి**
**ఒక పక్షీలేదు"**
**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 128)**

పొలాలు ఖాళీ కావడానికి వ్యవసాయం కుంటుబడడం కారణం. వర్షాలు లేకపోయినా కాలువ నీళ్ల ద్వారా వ్యవసాయం చేసే అవకాశం లేకుండా చేశారు సీమాంధ్ర

పాలకులు. కనుక ఎక్కడా పచ్చదనం అన్నది లేకుండా పోయింది. మనిషి, మొక్కా, నీరు, జీవితం అన్నవి ఒక ఆరోగ్యవంతమైన సామాజానికి సూచికలు. కానీ తెలంగాణకు రావాల్సిన నీటివాటా దక్కక, నీరు దొరకక, పంట పండించే అవకాశాలు లేక మనుషలు వలసబాట పట్టారని వలస నేపథ్యాన్ని చెప్పాడీ కవి. 'పరిగె' అనే మాటకు మిగిలిపోయినది అని అర్థం. ఇక్కడ 'బతుకు పరిగె' అనే రూపక ప్రయోగం ద్వారా తెలంగాణ ఏర్పడిన ఒక శ్మశాన వాతావరణాన్ని వివరించారు కవి.

ఇంతకు ముందే చెప్పినట్లు శరీరంలో సత్తువ ఉన్న వాళ్లందరూ వలసబాట పట్టారు. మిగిలింది వృద్ధులూ, పిల్లలూ. అది ఎంతటి విషాదమో 1993లో తైదల అంజయ్య రాసిన 'ఇండియన్ హెరిటేజ్!' కవిత వివరిస్తుంది.

**"కరువుకు**
**మనుషలను అమ్ముకున్నప్పటి**
**ఆకలిచావు మా తాత**

**అప్పులను తీర్చుటకు**
**కడుపు గట్టుకున్న**
**వలసబతుకు మా అయ్య**

**చినిగిన అంగీలాగుతో**
**బడిలో చేసే జండావందనం నేను"**
**(అంజయ్య, తైదల. 2006 : 22)**

తన తాత కరువు కాలంలో ఆకలి చావు చచ్చాడనీ, అప్పుల్ని తీర్చడం కోసం, కడుపు నింపుకోవడం కోసం తన తండ్రి వలసబాట పట్టాడనీ చెప్పడం వరకు కవితలోని మొదటి భాగం ముగుస్తుంది. కానీ ఈ పరిస్థితిలో కూడా దేశం అభివృద్ధి పథంలో

దూసుకుపోతున్నదని ప్రగల్భాలు పలికే పాలకులు కూడా ఇక్కడే ఉన్నారు అని కవి వ్యంగ్యంగా చెప్పారు. చిరిగిన అంగీలాగుతో జెండా వందనం చేసే బాలుడు రేపటి పౌరుడు ఎలా అవుతాడనే ప్రశ్న కూడా ఇందులో నిబిడీకృతం అయి ఉన్నది.

తెలంగాణలో వలసలు చోటు చేసుకోవడానికి ప్రజల జీవితాల్లో ఎటువంటి విషాదకరమైన అనివార్యతలు చోటు చేసుకున్నాయో వివరించేదే యం.దీక్షిత్ కుమార్ రాసిన 'బతుకు సమరం' కవిత.

**"బదిలవుతున్నాయి నా పల్లె సీమలు**
**బలవుతున్నాయి నా పల్లె బతుకులు**
**ఆకలిమంటల పోరులో**
**అలమటించే వేదనలో**
**ఆర్తితీర్చే బంధువు కోసం**
**ఆపన్న హస్తంపై ఆశతో**
**అలసిసొలసి ఎదురు చూసి**
**కరువులన్నీ ఏకరువు పెట్టి**
**బతుకలేని బతుకు విడిచి**
**బతుకు దెరువు వెదుక్కుంటు**
**కదులుతున్నాయి నా తెలంగాణ పల్లె సీమలు**
**కన్నీళ్ళవుతున్నాయి నా తెలంగాణ పల్లె బతుకులు"**
**(స్నేహ ప్రచురణలు. 2010 : 22, 23)**

అన్నం ఉంటేనే ఆకలి తీరుతుంది. కానీ తెలంగాణలో వ్యవసాయం లేదు. ఇతర ఉపాధి అవకాశాలు లేవు. కనుక అన్నం లభించని దుస్థితి. కనుక వలసనే ఆదుకునే బంధువుగా భావించవల్సిన అగత్యం ఏర్పడింది. కన్న ఊరును, కన్నవాళ్లను వదిలి వెళ్లడం కన్నా విషాదం మరొకటి ఉండదు. కానీ తెలంగాణలో ఎక్కడ చూసినా ఈ

విషాదమే. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో మస్కట్, దుబాయి వంటి అరబ్ దేశాలకు వలస వెళ్లిన వాళ్ల, వారి కుటుంబీకుల పరిస్థితులను పెద్దింటి అశోక్ కుమార్ రాసిన 'ఎడారి మంటలు' నవల కళ్లకు కట్టినట్లు చిత్రించింది. సరిగ్గా ఈ కవిత కూడా అటువంటి విషాదాన్నే చిత్రికపట్టింది.

వలసల నేపథ్యంలో ఒక విభిన్నమైన కోణాన్ని ఆవిష్కరించింది ఏలేశ్వర నాగభూషణాచార్య 'తెగింపు' అనే కవిత.

**"భరించలేని అవమానాల ఖాకీల జులుంలో**
**పల్లె కకావికలై ఎదపై లబోదిబో గుద్దుకుంటూ**
**తలమునకలై తల్లడిల్లుతుంది**
**తెల్లారీ తెల్లారక ముందే బతుకు బండిని సాగదోలుకుంటున్న**
**వలసల నేపథ్యంలోనే పల్లెలకు పల్లెలన్నీ ఖాళీ..**
**బుడ్డగోచి లేని బుడ్డపోరడు మాయమవుతుండు**
**అవ్వసంకల కెల్లి సంటిపోరి ఏడ్పు సటుక్కున మాయమవుతోంది**
**ఎక్కడెక్కడని గావుకేకేసి ఎక్కిళ్ళు పట్టేడ్చిన**
**అవ్వ ఆరోప్రాణం ఆవిరైపోతుంది**
**ఇవాళ తెలంగాణ పల్లెల్లో అమ్మ ఆఖరి చూపు కరువైపోతుంది"**
**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 23)**

తెలంగాణలో పెరిగిపోయిన రాజ్యహింస కూడా వలసలకు కారణం అని చెప్పడం ఈ కవిత ఉద్దేశం. "పోలీసులచే ప్రజల హక్కులన్ని కాలరాయించే ప్రభుత్వాలు ఆ పోలీసుల చర్యలను సహజంగానే సమర్థిస్తూ, వారికి రివార్డులు, అవార్డులు కూడ ఇవ్వడం మూలంగానే ప్రజల ప్రాణాలకు విలువ లేకుండా పోయింది. బహిరంగంగానే ప్రజలమీదికి ఎకె–47, యస్.యల్.ఆర్ లాంటి ఆధునిక ఆటోమేటిక్ తుపాకులు ఉపయోగించి కాల్చి చంపుతుంటే, ప్రజలకు దిక్కెవరు? న్యాయస్థానాలు కూడ పోలీసులను సమర్థిస్తుంటే

ప్రజలు ఏమి చేయాలి?"(ప్రభాకర్, చిక్కుడు. 2009 : 50). ఇదీ ఉత్తర తెలంగాణలో నెలకొని ఉన్న పరిస్థితి. కవి ఉత్తర తెలంగాణ ప్రాంతానికి చెందినవాడు కావడం మూలంగా, అతని చుట్టూ ఇటువంటి నిర్బంధపూరితమైన వాతావరణం ఉండటం కారణంగా ఇటువంటి కవిత రాశాడు. కవిత్వానికి స్థల కాలాల నేపథ్యం ఎలా ఉంటుందో వివరించే కవిత ఇది.

తెలంగాణ కవులు, కవయిత్రులకు స్థానిక సమస్యల వెనుక ఉన్న మూలకారణాల మీద శాస్త్రీయమైన అవగాహన ఉన్నది. చారిత్రక దృష్టి ఉన్నది. కనుక చాలా కవితల్లో చరిత్ర, వర్తమానం, భవిష్యత్తు – ఈ త్రికాలాలకు సంబంధించిన వాస్తవాల్ని చిత్రిక పట్టారు. "నాలుగు దశాబ్దాలుగా సాగునీటి రంగంలో ఏ అభివృద్ధి లేక భూమి ఉన్నా అది ఒక వనరుగా అందుబాటులో లేకుండా పోతున్నది. భూమికి నీటి వనరుల తోడుకావాలి. అపుడే భూమి బంగారాన్ని పండిస్తుంది. లేనట్లయితే కరువుని ప్రసవిస్తుంది. పాలమూరులో నీటివనరుల అభివృద్ధి నిలిచిపోయి, ప్రకృతి కన్నెర్ర చేస్తున్న సందర్భంలో వ్యవసాయం కుంటుపడింది. చిన్నకారు రైతులు వ్యవసాయం మానేసి మోతుబరి రైతుల వద్ద కూలీలకు కుదురుకోవాలనుకున్నా, గిట్టుబాటు కాని వ్యవహారమైంది. గ్రామాల్లో వ్యవసాయం తప్ప మరేముంటుంది? వ్యవసాయం ప్రధాన జీవనాధారం. అది కుంటుపడినపుడు వలస కూలీగా మారటం వారి సామాజిక అనివార్యత. పాలమూరు ప్రజలకు అదే దిక్కయింది. అప్పులు పాలమూరు ప్రజలను వలసకూలీలుగా మార్చడం ఇంకో ప్రధాన సమస్య"(శ్రీధరరావు దేశ్‌పాండే. 2008 : 89, 90). పాలమూరు ప్రజల వలసలను బాల్యం నుండీ అవగతం చేసుకున్న రచయిత్రి సుచరిత. ఆమె రాసిన 'వలసగోస' కవిత వలసల్లోని విషాదాన్ని ఎత్తిపట్టింది.

**"జోడుబాగుందని జతచేశారు**
**శ్రావణపట్టీ మలుపకముందే**
**బతుకుబండి వలసపట్టాలెక్కింది**
**వెళుతున్నది ఎక్కడికో తెలియదు**

సాగనంపేవారికీ తెలియదు
మళ్ళీ కనబడరేమో
మళ్ళీ కలువరేమోనని
మిన్నంటుతున్న రోదనలు
బస్సుహారను శవయాత్రముందు
మోగించిన వాద్యంలా
కాష్టాన్ని కౌగిలించుకోమని
పిలుస్తున్నట్లుంది

అమ్మనుంచి వేరుచేస్తున్న
పెనిమిటి చేతుల్లోంచి
పక్షిలా ఎగిరిపోవాలనిపిస్తుంది
బ్రతుకుదెరువు కొరకు
వాడివెంట నా అడుగులు
అత్తింట తిరగాల్సిన పారాణిపాదాలు
పలుగురాళ్ళమీద పట్టుతప్పుతున్నాయి
ఎన్నో ఆశలతో పట్టుకున్న చేయి
వలసబాట పట్టించింది
ముచ్చటిస్తారని చోట్లు మారుస్తుంటే
మనుషుల మధ్య మౌనం భాషయ్యింది
ఊరుకాని ఊరు
కొత్తముఖాల మధ్య
మనసుల మార్గం మూసుకుపోయి
తట్టలెత్తుతూ తారురోడ్లేస్తున్నాము

పగలంతా కనపడక

గుండెల్లో గుబులు కంటతడి పెట్టిస్తుంటే
కట్టుకున్నోడి ముఖం కటికచీకటిలోనే దర్శనం
సద్దిగంపతో గట్టుమీద నడిచి
ఆకలిదప్పిక తీర్చి
వాడి కంటి వెలుగులను చూడాలనుకున్న
నా కోర్కెలను
కరువు కాలనాగై కాటేసింది
కొత్త మురిపాల గలగలలతో
సందెవేళ తనరాకకోసం
ఎదురుచూడాల్సిన నాకు
వలస నొసటిరాతై మిగిలింది
బొక్కలన్నీ పిండి పిండై
నొప్పులతో సలుపుతుంటే
అమ్మ గుర్తొచ్చి
ఏడుపు వెక్కిళ్లై
నూకలన్నంముద్ద నోట్లోదిగనంటున్నది

తోడబుట్టినవారి ప్రేమ
మనసులో మెదిలి
ఏరాగాలు దరిచేరక
కంకర బొడ్డెలతో
బ్రతుకు సాగదీసుడాయె

తొలిచూలు వికారాలు
రుచులు కావాలంటున్న నాలుక
బుజ్జగించి తినిపించే

**అమ్మ ప్రేమలేక**

**బతుకు బండ బారిపోతుంటే**

**పెల్లలు పెల్లలుగా కదలిన జ్ఞాపకాలతో**

**తన్నుకొస్తున్న దు:ఖం**

**రాళ్ళబరువు మోతలతో**

**పట్టుతప్పిన నెలలపిండాలు**

**ఊడిపోయిన పేగుకొరకు**

**దిక్కుతోచక వెక్కుతోంది**

**ఏమున్నది జీవితంలో వెలుగు**

**కారునలుపు పరుచుకుంది**

**పాలమూరంటే**

**పాలుపెరుగు కాదు**

**పారాణి ఆరకముందే**

**తలకెక్కిన తట్టలు**

**చిదమబడిన బిడ్డలు**

**పగిలిన గుండెలు"**

**(సుచరిత. 2012 : 64, 65, 66)**

ఈ సుదీర్ఘమైన కవితను పరిశోధన గ్రంథంలో మొత్తానికి మొత్తంగా చేర్చడానికి కారణం అందులోని భావదీర్ఘత. ఏ భాగాన్ని విడిగా చెప్పలేనంత అంతర్గత నిర్మాణ పటిష్ఠత ఉన్న కవిత ఇది కనుకనే మొత్తం స్వీకరించడమైనది.

ఈ కవిత వలసగోసల్లో స్త్రీ కోణాన్ని ఆవిష్కరిస్తుంది. మామూలుగా ఉండే వలస జీవిత కష్టాల్లో స్త్రీల కష్టాలు విభిన్నమైనవని ఈ కవిత రుజువులు చూపిస్తుంది. ఉమ్మడిలో ప్రత్యేకంగా ఎదుర్కొంటున్న సమస్యల్ని ఏకరువు పెట్టింది.

పాలమూరు లేబరును వలసలకు తీసుకుపోయే క్రమం చాలా విచిత్రంగా ఉంటుంది. ఏదైనా ఒక కంపెనీ తనకు అవసరమైన కూలీలను సమీకరించేందుకు కొంతమంది గ్రూపు మేస్త్రీలను నియమించుకుంటుంది. వారి ద్వారానే కూలీలను పోగుచేసుకుంటుంది. ఇక్కడ గమనించవల్సిన విషయం కూలీకి, కంపెనీకి ప్రత్యక్ష సంబంధం ఉండదు, పైగా మేస్త్రీ ఒక దళారీ. ఈ మేస్త్రీ భార్యాభర్తలిద్దరికి కలిపే కూలీరేట్లు నిర్ణయిస్తాడు. పాలమూరు లేబర్ భార్యాభర్తల జంటను 'లెంక' అంటారు. ఈ లెంకకు ముందస్తుగా తొమ్మిది నెలల కూలీని చెల్లించి కార్యక్షేత్రానికి తీసుకుని పోతారు. అట్లా భర్త వెంట భార్య కూడా ఎక్కడికైనా వెళ్లవల్సిందే. అట్లా వెళ్లిన కొత్తగా పెళ్లైన జంటలోని స్త్రీ పడే యాతనను ఈ కవిత వివరిస్తుంది. ఒకవైపు ఎముకలు సున్నం అయ్యే శారీరక శ్రమ, పనిస్థలంలో వంట మొదలైన ఇంటిపనులు ఊపిరి సలపనివ్వని దుర్గతిలోకి నెట్టివేస్తే, కనీసం బాధలు పంచుకోవడానికి నమ్ముకుని వచ్చిన భర్తను కూడా సరిపోయేంత సమయం భార్య దగ్గర ఉండనివ్వని యజమానులు కింకరుల్లా ఉంటారు. అటువంటి క్రమంలోనే నెలతప్పితే ప్రాకృతికంగా స్త్రీ శరీరం కోరుకునే చిన్న చిన్న కోరికలు కూడా తీర్చుకోలేని విషాదభరితమైన పరిస్థితి. స్త్రీ గర్భవతి అయినప్పుడు తన సహచరుడో, కనీసం తన తల్లో తనతోనే ఉండాలనే న్యాయమైన, సహజమైన కోరిక ఉంటుంది. కానీ అది వలస కూలీలుగా ఉన్న స్త్రీలకు అందని ద్రాక్షలాంటిది. పైగా శారీరకంగా చోటుచేసుకునే కొత్తకొత్త మార్పుల కారణంగా నాలుక కొత్త రుచులను దేవులాడుతుంది. కానీ అది కూడా తీరని కోరికగానే మిగిలిపోతుంది. చివరికి కాస్త విశ్రాంతి తీసుకుందామన్నా ముందే ఇచ్చిన అడ్వాన్సు కారణంగా యజమాని అజమాయిషీ కారణంగా పనిలోకి తప్పనిసరిగా వెళ్లాల్సిన స్థితి. గర్భవతులు అట్లా తప్పనిసరి పరిస్థితుల్లో, అనివార్యంగా పనుల్లోకి వెళ్లటం కారణంగా అనేక సందర్భాల్లో గర్భస్రావం అవతుంది. అటువంటి స్త్రీల మానసిక, శారీరక బాధ వర్ణనాతీతం. కనీసం ఆ బాధను పంచుకునే స్వేచ్ఛలేని నిర్బంధ జీవితాన్ని సూక్ష్మస్థాయిలో వివరించిన ఈ కవిత తెలంగాణ కవిత్వ బాధాతప్త హృదయాన్ని ఆవిష్కరించింది.

వలస వెళ్లిన వాళ్లు క్షేమంగా తిరిగి ఇంటికి చేరుతామనే గ్యారంటీ ఉండదు.

వాళ్ల చావులకు కనీసం నష్టపరిహారం కూడా ఉండదు. ఇంతటి విషాదకరమైన పరిస్థితుల్లో దేశదేశాల్లో, వేరేవేరే రాష్ట్రాల్లో, పట్టణాల్లో అనాథ శవాలుగా మారిపోయినవాళ్లు ఎందరో ఉన్నారు. వాళ్లను పట్టించుకోవడానికి సహచరులకు సమయం ఉండదు. యజమానులకు పనిచేయించుకోవాలనే ధ్యాస తప్ప హృదయం ఉండదు. కనుక వలసకూలీలు నిర్మాణాల సందర్భంలో మృత్యువాతపడ్డా ఎవరూ పట్టించుకునే స్థితి ఉండదు. వరవరరావు రాసిన '2020' కవిత అదే విషయాన్ని చెప్తుంది.

**"బంజారహిల్స్‌లో కూలింది**
**ప్రహారిగోడ అయినా**
**చచ్చింది మాత్రం పాలమూరు లేబరు"**
**(గౌరీశంకర్, జూలూరు(సంపా). 2002 : 350)**

బంజారాహిల్స్ మొత్తం ఆంధ్రప్రదేశ్‌లోని సంపన్నులు ఉండే ప్రదేశం. దేశదేశాలనుండి వచ్చే అతిథులు కొలువుదీరే రాజధాని నగరంలోని ఖరీదైన ప్రాంతం. దాన్ని నిర్మాణం చేసింది మాత్రం ఎక్కువమంది పాలమూరు లేబరు. కానీ చరిత్రలో ఈ వాస్తవం రికార్డు కాలేదు. నిజానికి ఇక్కడ బంజారహిల్స్ సంపన్నవర్గాలకు ఒక పోలిక. సంపన్నవర్గాల కాంతివంతమైన నిర్మాణాలకోసం పాలమూరు లేబరు జీవితాల్ని త్యాగం చేస్తున్నారు అని చెప్పడం కవి ఉద్దేశ్యం. సరిగ్గా ఇటువంటి వస్తువుతోనే వనపట్ల సుబ్బయ్య 'నల్ల బానిసత్వానికి నయారూపం' అనే కవిత రాశారు.

**"ఊరుకాని ఊరు**
**నాల్గు తట్టలు మోసి**
**మరికొన్ని దినాలు బతకాలనే ఆశ**
**ఆ ఏడంతస్తుల మేడ**
**ఎప్పుడు కూలుతుందో**
**ఏ కొండెప్పుడు మీద పడుతుందో**

**తాము తవ్విన మట్టి పెల్లలే**

**తమ ప్రాణాలు కప్పేస్తాయని**

**ఎవరూహిస్తారు!**

**బహుళ అంతస్తుల భవనాలు, నిర్మాణాలు**

**బడగుల పాలిట సమాధులు**

**...**

**పెండ్లి పీటల నుంచే**

**దేశం బండెక్కే కొత్త లెంకలు**

**పదేళ్లు నిండని పసి మొగ్గలు బాలింతలు, మూడుకాళ్ల ముదుసలి**

**అంతా వలస జీవులే**

**సంతలో పశువులు**

**మా పల్లెల్లో కూలీలు**

**హర్రాజులో అమ్ముడయ్యే అమాయకులు**

**నల్ల బానిసల అమ్మకానికి నయా రూపం**

**మనిషిబేరమే అసలు సారం"**

**(జగన్ రెడ్డి, ఎస్(సంపా). 2012 : 48, 49)**

ఇంతకు ముందే చెప్పినట్లు మేస్త్రి దగ్గర 'లెంక'లు అడ్వాన్సు తీసుకున్న కారణంగా వాళ్లు ఆ క్షణమే బానిసలుగా మారిపోవాల్సి ఉంటుంది. జాగ్రత్తగా గమనిస్తే ఇక్కడొక తిరకాసు ఉంది. కేవలం తొమ్మిది నెలలకు మాత్రమే మేస్త్రి అడ్వాన్సు ఇస్తాడు. కానీ సంవత్సరం మొత్తం వెట్టి కూలీ చేయించుకుంటాడు. పైగా రోజుకు 12 గంటలు పని చేయాల్సి ఉంటుంది. కేవలం 15 రోజులకు ఒకసారి మాత్రమే విశ్రాంతినిస్తారు. ఆ రోజు కూడా 15 రోజులకు సరిపడే వంటచెరుకును సేకరించే పని చేయాల్సి ఉంటుంది. కనీసం తిండైనా సరిగ్గా పెడతారా అంటే అదీ ఉండదు. నూకలన్నం, పిండిపులుసు మాత్రమే వీరికి ఆహారం. వారానికి ఒకసారి మాత్రమే పప్పు పెడతారు. ఈ క్రమంలో ఏదో ఒకరోజు అనారోగ్యంతోనో, మరే ఇతర కారణాలవల్లనైనా పనికి వెళ్లలేకపోతే

ఒక్కరోజుకు బదులుగా రెండు రోజులు అదనంగా పని చేయాల్సి ఉంటుంది. స్థూలంగా చెప్పాలంటే భారత రాజ్యాంగం కల్పించిన హక్కులేవీ ఈ పాలమూరు లేబరుకు అన్వయించరు. ఎనిమిది గంటల పనిదినంగానీ, కనీస వేతనాల చట్టంగానీ, జీవించే హక్కుగానీ వీరికి ఏవీ ఉండవు. కనుకనే వీరిని వనపట్ల సుబ్బయ్య నల్లబానిసలతో పోల్చారు.

స్థూలంగా ఈ వలసలు పోవాలంటే తెలంగాణలో తాండవిస్తున్న కరువు రూపుమాయాలి. దానికి పాలకులు పూనుకోవాలి. కానీ సీమాంధ్ర పాలన ఉన్నంత కాలం అది సాధ్యమయ్యేపని కాదు. కనుక ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు మాత్రమే పరిష్కారం అని ఈ కవిత్వ అంతర్గత ఉద్దేశం.

## 4.7. విద్య

సీమాంధ్ర వలస పాలనలో తెలంగాణ విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. సకల ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరించినట్లుగానే తెలంగాణ విద్యారంగాన్ని కూడా పరాయి పాలకులు వ్యాపారబద్ధం చేశారు. పర్యవసానంగా పాఠశాల, కాలేజీ, విశ్వవిద్యాలయ చదువులు తెలంగాణ విద్యార్థులకు అందని ద్రాక్షలాగా మారిపోయాయి. ఈ పరిస్థితులను తట్టుకుని నిలిచి ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, యూనివర్శిటీల్లోని విభాగాల్లో అరకొర సదుపాయాల్లో దిక్కులేక చదువుకునే పరిస్థితి దాపురించింది. వాస్తవానికి ఏ సమాజాల్లో అయినా విద్య ప్రభుత్వ బాధ్యతగా ఉండాలి. కానీ వ్యాపార యుగంలో తెలంగాణ విద్య ప్రైవేటీకరణకు గురై విద్యార్థులు అనేక అగచాట్లు పడుతున్నారు.

పాఠశాల విద్య అనేది ప్రతి విద్యార్థి జీవితంలో పునాదిరాయి వంటిది. మనిషి పుట్టి, పెరిగి, తన చుట్టూ ఉన్న సమాజం ఏమిటో అర్థం చేసుకునే ప్రయత్నం మొదలు పెట్టగానే పాఠశాల ప్రవేశం జరుగుతుంది. విద్యార్థికి సరైన పద్ధతిలో విద్యనందించినప్పుడే

భవిష్యత్తులో దేశానికి పనికి వచ్చే యోధులుగా తయారవుతారు. కానీ తెలంగాణలో పాఠశాలల పరిస్థితి దారుణంగా తయారైంది. విచ్చలవిడిగా ప్రైవేటు పాఠశాలలకు అనుమతివ్వడం ద్వారా ప్రభుత్వమే స్వయంగా విద్యా ప్రైవేటీకరణకు పూనుకున్నది. దాని పర్యవసానం ఏమిటో ఎం.రాఘవాచారి 'మా బడి' అనే కవితలో వివరించారు.

**"కూల్చిన గోడలు**
**రాల్చిన ఇటుకలు**
**ఎగిసి ఎగిసి పడుతున్న**
**దుమ్ము ధూళికింద**
**నేల మీద ఆకాశాన్ని పరిచినట్టు**
**తారుమీద జారిపోయే వాహనాల పొగలో**
**కదించిన మైదానంలో మా బడి"**
**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 568)**

ఈ కవితలో 'కూలిన గోడలు' అనే పదబంధానికి బదులుగా 'కూల్చిన గోడలు', 'రాలిన ఇటుకలు' అనే పదబంధానికి బదులుగా 'రాల్చిన ఇటుకలు' అనే ప్రయోగాలు చేశారు కవి. ఇందులోనే కవితా సారాంశం ఇమిడి ఉన్నది. కూలినా, రాలినా దానికి సహజత్వం ఉంటుంది. కానీ ఆ కూలడం సహజంగా జరగలేదు, ఎవరో పనిగట్టుకుని కూల్చారు. కనుకనే కవి 'కూల్చిన', 'రాల్చిన' అనే పదప్రయోగం చేశారు. ఆ కూల్చినవారు సీమాంధ్ర పాలకులు అని కవి ఉద్దేశం. అలా కూలడం కారణంగా పాఠశాల విద్య తరగతిలో కాకుండా మైదానంలో గడపడం జరుగుతున్నది. ఇది అత్యంత విషాదం.

నిజానికి ప్రభుత్వం ఎప్పటికప్పుడ పాఠశాలల్ని పర్యవేక్షిస్తూ అవసరమైనవాటిని సమకూర్చాలి. కానీ ప్రైవేటు రంగాన్ని బలోపేతం చేయడం కోసం ప్రభుత్వమే ప్రభుత్వ పాఠశాలల్ని నిర్లక్ష్యం చేసింది. అలా చేస్తే అనివార్యంగా మంచి చదవులకోసం అప్పోసప్పో చేసి అందరూ ప్రైవేటు పాఠశాలలకే వెళ్లాల్సిన అనివార్యత నెలకొంటుంది. అదే ప్రభుత్వ

వ్యూహం. దానినే ఈ కవితలో సారాంశంగా వ్యక్తం చేయడం జరిగింది.

ఎక్కడైనా చదువుకోవాలంటే చదువకునే వాతావరణం ఉండాలి. ప్రభుత్వమే ఆ వాతావరణం కల్పించాలి. తెలంగాణలో మెజార్టీ ప్రజలు వ్యవసాయం చేసుకునో, కూలీ చేసుకునో, చిరు వ్యాపారాలు చేసుకునో, కుల వృత్తులు, చేతి వృత్తులు చేసుకునో, పొట్టనింపుకొని బ్రతికేవాళ్లే. వాళ్లు తమ పిల్లల్ని చదివించాలంటే తమ ఆర్థిక పరిస్థితి కనీస స్థాయిలోనైనా సహకరించాలి. కానీ తెలంగాణలో పరిస్థితి అత్యంత దయనీయంగా ఉన్నది. తల్లిదండ్రులకు తమ పిల్లల్ని చదివించాలనుకున్నా తమ ఆర్థిక పరిస్థితి దానికి అనుకూలించదు. ఆ విషయాన్నే సిద్దెంకి యాదగిరి 'బతుకుపాఠం' కవితలో వివరించాడు.

**" 'హోంవర్కు ఎందుకు చెయ్యలేదు'**
**'కాపి లేద్సార్'**
**'ఏం పేరు'**
**'పవీన్'**
**'తెచ్చుకోపోయినవ్'**
**'మా నాయిన తేడు'**
**'మీ నాయిన ఏంజేస్తడు'**
**'బుగ్గలు అమ్ముతడు'**
**'మీ అమ్మ ఏం చేస్తది'**
**'ఎంట్రుకల బ్యారం'**
**'మరెట్ల సదువుతవురా'**
**'ఇపుడేడు'**
**'ఎక్కడ మీ యిల్లు'**
**'చెట్టుకింద'**
**'ఆ..'**
**'కరంటి వున్నదా'**

**‘గుడిసె మీదికేలి పోతది’**

**‘బట్టలు’**

**‘పాతయి అడుక్కుంటం’**

**‘తిండెట్లా’**

**‘మధ్యాహ్న భోజనం బడిల’**

**‘దొరికితె తింటం లేకుంటే ఉపాసముంటం’ ”**

**(యాదగిరి, సిద్దెంకి. 2014 : 31, 32)**

ఈ కవితలో సగటు తెలంగాణ విద్యార్థి ఆత్మఘోష ఉన్నది. కడుపుకు తిండిలేనివాళ్ల పిల్లల దయనీయమైన పరిస్థితి చిత్రణ ఉన్నది. స్థూలంగా తెలంగాణ విద్యార్థులు పడే అగచాట్ల నేపథ్యం ఇమిడి ఉన్నది. ‘దొరికితె తింటం లేకుంటె ఉపాసముంటం’ అనే ఒక్క పాదంతో తెలంగాణ పేద విద్యార్థుల భవిష్యత్తు ఎలా ఉండబోతోందో చెప్పకనే చెప్పారు కవి.

తెలంగాణ ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రైవేటీకరించడం ద్వారా ప్రభుత్వాలు ఎవరి ప్రయోజనాలను నెరవేర్చాయో, దాని పర్యవసానాలేమిటో చింతం ప్రవీణ్ రాసిన ‘నా తెలంగాణా’ కవితలో చిత్రించాడు.

**“పోగుచేసుకున్న ఆశలన్ని**

**నారాయణ శ్రీచైతన్యలు**

**కబలిస్తూంటే**

**మరణశయ్యపై మౌనంగా**

**నా తెలంగాణా”**

**(ప్రవీణ్, చింతం. 2012 : 23)**

విద్యావ్యాపారం మొదలైన తర్వాత వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులు

విద్యారంగంలోకి ప్రవేశించారు. వారంతా సీమాంధ్ర ప్రాంతానికి చెందినవారే కావడం గమనార్హం. వారి ప్రయోజనార్థమే విద్యను ప్రైవేటీకరించి తెలంగాణ విద్య నడ్డివిరిచారు పాలకులు. కోటి ఆశలతో తమ పిల్లల్ని చదివించి ప్రయోజకుల్ని చేయాలనుకున్న తల్లిదండ్రులకు నిరాశను మిగిల్చారు. ఫలితంగా తెలంగాణ భవిష్యత్తు మరణశయ్యమీద మౌనంగా నిలబడింది అని చెప్పడం కవి ఉద్దేశ్యం.

దిగువ మధ్య తరగతి, మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి వర్గాల ప్రజలు ఏవేవో కష్టాలకోర్చి, అప్పులు చేసి తమ పిల్లల్ని చదువుకోవడానికి పంపిస్తుంటే కనీసం ఆ విద్యలోనూ మానవీయ విలువలు లోపించాయని, వారిని కేవలం మరయంత్రాలుగా మార్చే దుర్నీతి దాగి ఉన్నదని తెలంగాణ కవి గుర్తించాడు. అందుకే దర్భశయనం శ్రీనివాసాచార్య 'ఆట' దీర్ఘకవితలో విద్యారంగంలోని వ్యాపార ధోరణిని ఎండగట్టాడు.

**"పిల్లాడేం చదవాలి**
**అది నీ చేతిలో ఆట**
**పిల్లాడొక మర**
**నువ్వు తిప్పినట్టే తిరగాలి**
**ఏది చదువంటావు**
**ఏది ప్రతిభంటావు**
**ఐతే ఇంజనీరింగ్ లేదా వైద్యం**
**గ్లోబు మీద పరుగుకు**
**లైసెన్స్ విద్య కంప్యూటర్!**
**ఒక్క డాలర్నీ రాల్చలేని**
**ఆర్ట్సు అస్పృశ్యం**
**అన్ని విధాలా అవాంఛనీయం"**
**(శ్రీనివాసాచార్య, దర్భశయనం. 2001 : 7, 8)**

ఆనాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుగారు స్వయంగా విద్యారంగంలో ఆర్ట్స్ చదువులు నిరుపయోగమని, వాటి స్థానంలో సాంకేతిక చదువులు చెప్పాలని స్వయంగా ఉద్బోధించారు. "జూనియర్, డిగ్రీ, పి.జి. సదువులలో ఆర్ట్స్ సబ్జెక్ట్స్‌ను తొలగించి కంప్యూటర్ విద్యావిధానం ప్రవేశపెట్టడం ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకేననేది మనమంతా గమనించాల్సి ఉంది. సామాజిక శాస్త్రాలను అధ్యయనం చేయటం వల్ల ప్రజలు గత చరిత్రను తెలుసుకొని సమాజంలో ఉద్యమాల పరంపర కొనసాగుతుందనే ఉద్దేశ్యంతో వీటిని పాఠ్యాంశాల నుంచి తొలగిస్తే చరిత్రను తెలుసుకొనే అవకాశం ఉండటంచే ఉద్యమాల గురించి మాట్లాడేవారి శాతం తగ్గుతుందనే భావనతో నేడు ప్రభుత్వాలు ఉన్నాయి" (కాశీం. 2004 : 26). సాంకేతిక విద్యనే ప్రోత్సహించడంలోని ఇంకొక ఉద్దేశ్యం బహుళజాతి కంపెనీలకు చవకైన మానవ వనరులను రూపొందించడం అనేది. మూడవ ప్రపంచ దేశాల్లోని మానవ శ్రమను దోచుకోవాలంటే ఆ మానవులు తమకు అవసరమైన పనులు చేయడం కోసం నైపుణ్యాలు సాధించాలి. అవి ఆర్ట్స్‌లో ఉండవు. కనుక సాంకేతిక పాఠ్యాంశాలను చదివించాలి. ప్రపంచీకరణను ప్రవేశపెట్టిన పాలకుల ఉద్దేశంలో అది ఉండడం కారణంగానే 'ఆర్ట్స్ అస్పృశ్యం' అయిందని ఈ కవిత చెప్తుంది.

ప్రపంచ దేశాలకు అమెరికా పెద్దన్న. సీమాంధ్ర పాలకులు వెన్నుదన్ను. కనుక అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగానే తెలంగాణలో విద్యారంగం రూపుదిద్దుకుందని జూకంటి జగన్నాథం రాసిన 'వల్లుబండ' కవిత వివరిస్తుంది.

**"గీ సదువులు అద్దని సెప్పుడు**
**బేపారమే ఇక ఇంటావంటా ఇలవరస కావాలనుడు**
**అమ్రికా! దిక్కు సూపి పిల్లిపులి వాతలు గుంజుకు**
**సిందుబాగోతంలోని బుడ్డరకానేషాలు"**
**(జగన్నాథం, జూకంటి. 2002 : 34)**

స్థూలంగా తెలంగాణ విద్యారంగం కోస్తాంధ్ర పాలకుల దుర్నీతి కారణంగా వెనుకబడిపోయింది. "విద్యా లక్ష్యాలు సామాజికమైనవి, వ్యక్తిగతమైనవి కావు. బ్రతుకు తెరువొక్కటే విద్యాలక్ష్యం కారాదు. విద్యకు అంతకంటె విస్తృత ప్రయోజనం ఉంది. 'జీవితంపట్ల ఇష్టం, తోటివారికి తోడ్పడుతూ, సంతృప్తిగా సహజీవనం చేసే చైతన్యాన్ని అందించడం విద్యా లక్ష్యంగా వుండాలి. సమాజ ప్రగతికి తోడ్పడడం అటు సమాజానికే కాదు ఇటు వ్యక్తికీ అవసరం' అంటారు కొఠారీ"(శ్రీధరరావు దేశ్‌పాండే. 2007 : 2). కానీ తెలంగాణలో పరిస్థితి ఈ స్ఫూర్తికి పూర్తి భిన్నంగా తయారు చేశారు. ఒకవైపు ప్రభుత్వ విద్యను కుంటుపరుస్తూ మరోవైపు ప్రైవేటు విద్యను ప్రోత్సహించారు. ఆ విద్యలో కూడా ఆర్ట్స్‌వంటి సామాజిక అధ్యయనం చేసే అవకాశం కల్పించే పాఠ్యాంశాలను తొలగించి బహుళజాతి కంపెనీలకు అవసరమైన మానవ వనరులను తయారు చేయడం కోసం సాంకేతిక పాఠ్యాంశాలకే పెద్దపీట వేశారు. దాంతో విద్యాలక్ష్యాలు పూర్తిగా విధ్వంసం అయిపోయాయి. ఈ మొత్తం క్రమానికి నాయకత్వం వహించింది, స్వప్రయోజనాలు నెరవేర్చుకున్నది సీమాంధ్ర పాలకులు కాబట్టి, స్వపరిపాలనే దీనికి పరిష్కారం అని తెలంగాణ కవి భావించినట్లు ఈ కవిత్వం ద్వారా అర్థం చేసుకోవచ్చు.

## 4.8. వైద్యం

సీమాంధ్ర పాలకులు ప్రవేశపెట్టిన ప్రైవేటీకరణ విధానాలు వైద్యరంగాన్ని కూడా తాకాయి. ప్రభుత్వ వైద్యాన్ని నిర్లక్ష్యం చేయడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవాల్సిన అనివార్యతలో ప్రజలు కార్పొరేట్ ఆసుపత్రుల మెట్లు ఎక్కాల్సిన గత్యంతరం కల్పించడం వలస పాలకుల కుట్ర. అపోలో, కేర్, యశోద, కాంటినెంటల్, గ్లోబల్ ఆసుపత్రుల వంటి ఆసుపత్రులు ఇవాళ తెలంగాణలో అత్యంత ఆధునికమైన టెక్నాలజీతో వైద్యం అందిస్తున్నాయి. వాస్తవానికి ఈ ఆసుపత్రుల్లోని వైద్య సేవలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే లభ్యం కావాలి. ప్రభుత్వాలు దానికోసం కృషి చేయాలి. కానీ ప్రభుత్వ ఆసుపత్రుల్ని సాంకేతికంగా, అవకాశాలపరంగా అభివృద్ధి చేస్తే తమ వ్యాపార లక్ష్యాలు నెరవేరవు కాబట్టి స్వయంగా ప్రభుత్వాలే వాటిని నిర్లక్ష్యం చేశాయి.

హైదరాబాద్‌లోని కోరంటి ఆసుపత్రికి ‘ఫీవర్ హాస్పిటల్’ అని ప్రచలితమైన పేరు ఉన్నది. ఎలాంటి జ్వరాలు వచ్చినా ఆ ఆసుపత్రికి వెళ్తే నయమైపోయేవి. అది పూర్తిగా ప్రభుత్వ ఆసుపత్రి. కానీ సీమాంధ్ర పాలకుల కుట్రల కారణంగా ఆ ఆసుపత్రిని క్రమక్రమంగా నిర్వీర్యం చేస్తూ వచ్చారు. ఆ స్థితినే వరవరరావు రాసిన ‘2020’ కవితలో వివరించాడు.

**“కోరంటి దవాఖానాకే జ్వరం వస్తే**
**కోటొక్క దేవుళ్ళకు మొక్కడంకన్నా**
**పూటకెళ్ళనోళ్ళకు కంప్యూటర్‌లో తొవ్వ ఉన్నాదా?**
**మురికివాడల్లో ముసలీ ముతకా**
**పిల్లలూ ముస్లింలూ చస్తే**
**చావుకూ బతుక్కూ మధ్య**
**సరిహద్దు రేఖలే లేవు”**
**(గౌరీశంకర్, జూలూరు(సంపా). 2002 : 350)**

ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లేవాళ్లు పేదలు, హైదరాబాద్‌లోని పేద ముస్లింలు. ఆ ఆసుపత్రులు నిర్వీర్యం అయిపోవడం కారణంగా, పెద్ద పెద్ద కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఫీజులను చెల్లించలేక మృత్యువాత పడుతున్నారని ఈ కవిత విశదం చేస్తుంది.

కుక్క కరిస్తే నారాయణగూడలో, క్షయకు ఎర్రగడ్డలో వైద్యం చేసే ప్రభుత్వ ఆసుపత్రులు ఉన్నాయి. కానీ అవి ఇవాళ సరైన సదుపాయాలు లేక రోగులను పరిరక్షించే స్థితిలో లేకుండా పోయాయని  కాశీం 2011లో రాసిన ‘నన్ను నిషేదించావు’ కవితలో చెప్పారు.

**“నా తండ్రి క్షయతో రక్తం కక్కుతున్నాడు**
**నా తల్లి కుక్కకాటుకు పిచ్చిదయింది**

**ప్రభుత్వ దవాఖాన మూతబడ్డది!??"**
**(కాశీం, సి. 2015 : 67)**

కుక్క కరిచినా, క్షయ వచ్చినా ప్రాణాంతకమైన స్థితి వస్తుంది. ఆ సరిస్థితిలో తప్పనిసరి వైద్యం అవసరం. పేదలకు ప్రభుత్వ ఆసుపత్రులే శరణ్యం. కానీ ఆ ప్రభుత్వ ఆసుపత్రులు సీమాంధ్ర పాలకుల ప్రైవేటీకరణ విధానాల కారణంగా సదుపాయాల లేమితో కొట్టుమిట్టాడుతున్న కారణంగా అక్కడ వైద్యం అందడం లేదు. పర్యవసానంగానే నా తండ్రి క్షయతో రక్తం కక్కుతున్నాడని, నా తల్లి కుక్కకాటుకు పిచ్చిదైపోయిందని కవి ఆవేదన, ఆవేశం వ్యక్తం చేశాడు.

ప్రభుత్వ ఆసుపత్రుల స్థానంలో కొత్తగా ఏవేమి మొలుచుకొచ్చాయో అల్లం నారాయణ 'యాది – మనాది' కవితలో స్పష్టం చేశారు.

**"నిన్నటిదాకా వున్నదేదీ నేడు లేదు**
**నువ్వు పుట్టిన ఆస్పత్రి మీద**
**అయిదంత్రాల బంగ్లా.."**
**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 38)**

వాస్తవానికి ఇవాళ మనుషుల్ని ప్రాణాపాయ స్థితిలో కాపాడగలుగుతున్నది కార్పొరేట్ ఆసుపత్రులే. అప్పులు చేసి మరీ తమ ఆరోగ్యం కోసం ఖర్చు పెట్టవల్సిన అగత్యం తెలంగాణ ప్రజలకు ఏర్పడింది. అందుకే కవి ఫైవ్‌స్టార్ హొటల్‌ల వంటి ఫైవ్‌స్టార్ ఆసుపత్రులే రాజ్యమేలుతున్నాయని వ్యంగ్యంగా చెప్పారు.

తెలంగాణ మొత్తానికి నిజాం కాలంలో స్థాపించిన ఉస్మానియా ఆసుపత్రి గుండెకాయవంటిది. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ ఎవరికి ప్రాణాపాయ స్థితి వచ్చినా చివరి గమ్యం ఉస్మానియా ఆసుపత్రే. తెలంగాణలోని వివిధ జిల్లాల్లో స్థానికంగా ఉస్మానియా

ఆసుపత్రిలోని సదుపాయాలతో ఆసుపత్రుల నిర్మాణం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అది ప్రభుత్వాల బాధ్యత. కానీ ఆ బాధ్యత నుండి ప్రభుత్వాలు వైదొలిగి ప్రైవేటు ఆసుపత్రుల నిర్మాణాలకు చేయూతనందిస్తున్నాయి. ఇత తప్పని పరిస్థితుల్లో ఆరోగ్యాలు ఎంత విషమించిపోతున్నా, ఎంత అత్యవసర పరిస్థితులు నెలకొన్నా కిరాయికి వాహనం తీసుకుని ఉస్మానియాకు తరలివస్తుంటారు జనం. అట్లా మార్గమధ్యలో చనిపోయినవాళు లెక్కలేనంతమంది తెలంగాణలో ఉన్నారు. గమ్యం చేరుకున్నా అప్పటికే పరిస్థితి విషమించడంవల్ల మరణించినవాళ్లు ఉన్నారు. ఆరోగ్యాలు బాగుపడి గండాల్ని గట్టెక్కినవాళ్లూ ఉన్నారు. అటువంటి ఆసుపత్రులే నిజమైన ప్రజాబంధువులని, ఉస్మానియా ఆసుపత్రిని కీర్తిస్తున్నాడు తెలంగాణ కవి. పోగుల రాజన్న రాసిన 'ఉస్మానియా హాస్పిటల్' కవితలోని భాగం ఇది.

**"కార్పొరేట్ ఆసుపత్రి**
**నన్ను నిలువునా దోచేస్తే**
**పేదవాడి ఆసుపత్రి**
**కాపాడే ప్రయత్నం చేస్తుంది**
**దాని ప్రయత్నం**
**విజయవంతం అగుగాక!"**
**(రాజన్న, పోగుల. 2006 : 26)**

ఈ కీర్తనలో అసలు ఉద్దేశ్యం వేరే ఉన్నది. ప్రభుత్వ ఆసుపత్రులే పేదల్ని కాపాడుతాయని, కనుక వాటిని కాపాడుకోవాల్సిన అవసరాన్ని చెప్పడం ఒకటైతే, ఉస్మానియా ఆసుపత్రి వంటివాటిని అన్ని జిల్లాల్లో సకల సదుపాయాలతో ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేయడం మరొకటి.

కార్పొరేటు ఆసుపత్రుల విధానాలను వివరించే కవిత వర్ఘుల శివకుమార్ రాసిన 'కార్పొ'రేటు' చికిత్స'. ఇందులో పేద ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సవాళ్లను చిత్రించాడు.

"దబ్బొక్కటే చికిత్సని వశం చేసుకుంటున్నచోట
ఆయాలు, స్టాఫ్‌నర్సులూ
డ్యూటీ డాక్టర్లు, కన్సల్టింగ్ స్పెషలిస్టు
మొత్తం సిబ్బందీ మొండిజాడలై
దప్పిక తీర్చని మృగతృష్ణలై
ఆసుపత్రికి ఆసుపత్రే ఎడారౌతుంది
తడారిన గొంతుకి ఒక్క నీటిచుక్కలా
పొడారిన ప్రాణానికి తడి పలకరింపు కరువై
నాలుక పిడచకట్టుకపోతుంది
కార్పొ'రేటు' కాలుష్యం కమ్ముకున్న వైద్య రంగం
వింతరోగాల్ని పరిచయం చేస్తూ
విషవాతావరణాల్ని ప్రభావితం చేస్తూ
వికృతంగా వికటంగా మరోరోగిని  మింగడానికి
అట్రాక్టివ్ గాజు తలుపులు తెరుచుకుని
ఆహ్వానిస్తుంది"
(శివకుమార్, వఝుల. 1999 : 25, 26)

ఏ కార్పొరేటు ఆసుపత్రికి వెళ్లినా మొట్టమొదట కొంత డబ్బును జమ చేయమంటారు. అపాయంలో ఉన్న బాధితుడి ఆరోగ్యం గురించి లేశమాత్రమైనా పట్టింపులేకుండా డబ్బు కడితేనే వైద్యం ప్రారంభిస్తామని నిస్సిగ్గుగా ముఖం మీదనే చెప్పేస్తారు. తమది వ్యాపారం కోసమే పెట్టిన ఆసుపత్రి అని పరోక్షంగా అర్థం చేయిస్తారు. కనుకనే 'కార్పొ'రేటు' కాలుష్యం కమ్ముకున్న వైదర్య రంగం' అని కవి ఎద్దేవా చేశారు.

స్థూలంగా ప్రత్యేక తెలంగాణ ఏర్పాటులోనే తెలంగాణ ప్రభుత్వ వైద్య రంగం మెరుగు అవ్వగలదనే విశ్వాసం ఈ కవులందరి కవిత్వంలో బలంగా వ్యక్తమైంది.

## 4.9. పరిశ్రమలు

సీమాంధ్ర వలస పాలకవర్గాల పాలనలో తెలంగాణలోని పారిశ్రామిక రంగం పతనదశకు చేరుకున్నది. నిజానికి 20వ శతాబ్ది ఆరంభం నుండి తెలంగాణలో పరిశ్రమల స్థాపన మొదలైంది. సాలార్‌జంగ్, ఏడవ నీజాం రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్‌ల కారణంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడేనాటికే ఇతర తెలుగు ప్రాంతాలకన్నా తెలంగాణలో ఎక్కువ పారిశ్రామిక అభివృద్ధి జరిగింది. ఆ తర్వాత వలసాంధ్ర ప్రభుత్వ వివక్షాపూరితమైన పాలన కారణంగా పారిశ్రామిక అభివృద్ధి, అందులో తెలంగాణవారికి ఉపాధి అవకాశాలు, పెట్టుబడులు, ఉత్పాదక రంగాలలో తెలంగాణకు అన్యాయమే జరిగింది. "పందొమ్మిదో శతాబ్దంలో తెలంగాణలో జంఖానాలు, తివాసీలు, నూలు బట్టలు, ఇనుప వస్తువులు, కత్తులు, తుపాకులు, టస్సర్ పట్టుబట్టలు, కాగితం పరిశ్రమలు ఉండేవని సురవరం ప్రతాపరెడ్డి రాశారు. ఆ కాలపు తెలంగాణ పరిశ్రమల ప్రాముఖ్యత గురించి రాస్తూ ఆయన 'తెలంగాణము ప్రధానముగా నూలుబట్టలకు ప్రపంచ ప్రఖ్యాతి గన్నట్టిది. మార్కొపోలో, రుద్రమదేవి కాలములోని సన్నని బట్టలను జూచి అవి సాలె పురుగుల దారాల అని భ్రమ పడెను. వరంగల్ తివాసీలను, జంఖాణాలను 1851లో ఇంగ్లండుకు ప్రదర్శనార్థం పంపిరి. ఇనుమును కరిగించి ఇనుప వస్తువులను చేయుచుండిరి. వరంగల్, కూన సముద్రము, దిందుర్తి, కొమరపల్లి, నిర్మల్, జగిత్యాల, అనంతగిరి, లింగంపల్లి, నిజామాబాద్ మున్నగు స్థలాలలో ఈ పనులు జరుగుతుండెను. నిర్మల వద్ద నుండు కూన సముద్రములో శ్రేష్టమైన ఉక్కును సిద్ధము చేస్తూ ఉండిరి. ఎల్గందల్, ఇబ్రహీంపట్టణము, కోనాపూరు, చింతలపేట మున్నగు స్థలాలలో మంచి ఉక్కు సిద్ధమగుతుండెను. కూన సముద్రము ఉక్కువంటి దానిని పర్షాలో చేయుటకు చాలా ప్రయత్నము చేసి విఫలమైరి. కత్తులను హైదరాబాదు, గద్వాల, వనపర్తి, కొల్లాపురములలో 1890 వరకు కూడా విశేషముగా తయారు చేస్తుండిరి. బంగారు నీరుపోసిన కత్తులు ఖమ్మంలోని జగదేవపూరులో తయారగుచుండెను. గద్వాలలో తుపాకీలు కూడా సిద్ధము చేస్తుండిరి. రోహిలాలు పట్టే పెద్ద తుపాకీలను వనపర్తి, గద్వాల, నిర్మలలో చేసిరి. నూలు, పట్టు కలిపి నేసిన మష్రూ అను బట్టలను హైద్రాబాదులో, గద్వాలలో నేసిరి.

టస్సర్ పట్టుబట్టలను వరంగల్, నారాయణపేట, మట్వాడా, హసన్‌పర్తి, కరీంనగర్ జిల్లాలోని మాధాపురంలో నేస్తూ ఉండిరి. ఇందూరు (నిజామాబాదు), మెదకు, హైద్రాబాదులలోను, మహబూబునగర్‌కు 10 మైళ్ళ దూరములో ఉన్న కోయిలకొండలోను కాగితములు సిద్ధము చేస్తూ ఉండిరి' అన్నారు"(వేణుగోపాల్, ఎన్. 2004 : 97). ఈ మాటలద్వారా వలసాంధ్ర పాలనకంటే ముందు తెలంగాణలో విలసిల్లిన పారిశ్రామిక రంగాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు జరిగిన తర్వాత ఒక్క తెలంగాణను మినహాయించి ఆంధ్రా జిల్లాలన్నింటిలో పరిశ్రామిక అభివృద్ధికి పాలకవర్గాలు చేయూతనందించాయి. తెలంగాణలో మాత్రం ఎక్కువశాతం పరిశ్రమలన్నీ హైదరాబాద్ చుట్టూ కేంద్రీకృతం అయ్యాయి. ఈ పరిశ్రమలకు అధిపతులు, పెట్టుబడిదారులు, వాటిలోని పెద్ద పెద్ద ఉద్యోగులు మొత్తం తెలంగాణేతరులే కావడం గమనార్హం. తెలంగాణలోని ఇతర జిల్లాల్లో కూడా అవరసమైన పరిశ్రమల స్థాపన చేసి ఉండవచ్చు, కానీ తెలంగాణ జిల్లాలను వివక్షకు గురిచేస్తూ, ఆంధ్రా జిల్లాలోనే పరిశ్రమల్ని స్థాపించారు. మరోవైపు తెలంగాణలోని జిల్లాల్లో అప్పటికే ఉన్న ప్రభుత్వ రంగ పరిశ్రమలన్నింటిని ఒక్కొక్కటిగా మూసివేస్తూ పోయారు.

వరంగల్‌లోని ఆజంజాహి మిల్లులో బట్టలు తయారయ్యేవి. అది ప్రభుత్వ పరిశ్రమ. కానీ వలసాంధ్ర ప్రభుత్వం కుట్రపూరితంగా దానిని మూసివేసింది. ఆ విషయాన్నే చింతం ప్రవీణ్ 'చెక్‌పెట్టబడినవాణ్ణి' కవితలో వివరించాడు.

**"నాకు పాటుంది**
**పాడటానికి**
**పాడితే**
**మూగబోయిన ఆజంజాహీ మిల్లులా**
**నా పాట కబలించబడుతుంటది**

**నేను దగాపడ్డ వరంగల్ బిడ్డను**

**నాలాగే నా తెలంగాణ"**

**(ప్రవీణ్, చింతం. 2012 : 25)**

వరంగల్ బిడ్డలు దగాపడడానికి కారణాలు అనేకం ఉన్నాయి. అందులో వేలాదిమందికి ఉపాధి అవకాశం కల్పిస్తున్న ఆజంజాహి మిల్లును మూసివేయడం. ఏదైనా పరిశ్రమ ఉన్నచోట స్థానికులకు ఉపాధి అవకాశాలు ఉంటాయి. కానీ ఆ మిల్లును మూసివేయడం కారణంగా వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. వాస్తవానికి సీమాంధ్ర పాలనా విధానాలవల్ల మూతపడిపోయిన పరిశ్రమలకు, ఉపాధి కోల్పోయిన తెలంగాణ ప్రజానీకానికి లెక్కలేదు. అంతర్గాం స్పిన్నింగ్ మిల్లు, డిబిఆర్ మిల్స్, సర్‌సిల్క్, ఆల్విన్, రిపబ్లిక్ ఫోర్జ్, ఎ.పి.స్కూటర్స్, బోధన్, మిర్యాలగూడ వంటిచోట్ల సహకార రంగంలోని చక్కెర కర్మాగారాలు మూతపడగా, వాటితోపాటే ఆజంజాహీ మిల్స్, హిందుస్తాన్ కేబుల్స్, నిజాం షుగర్స్ కూడా పతనం చెందాయి. ఆ విషయాన్నే ఈ కవిత వివరించింది. సరిగ్గా ఇటువంటి భావాలతోనే పాలమూరు జిల్లాకు చెందిన భీంపల్లి శ్రీకాంత్ 'సోది' దీర్ఘకవిత రాశాడు.

**"తెలంగాణ**
**బద్నామైతోంది**
**కళ్లు తెరవాలె!**
**ఫ్యాక్టరీలు**
**మూతవడ్డవి**
**కొలువులెక్కడ!"**
**(శ్రీకాంత్, భీంపల్లి. 2004 : 19)**

ఇంతకు ముందే చెప్పినట్లు ఫ్యాక్టరీలు మూతపడడం అనేది బతకు ఆధారానికి మూతపడటమే అవుతుంది. వివిధ రంగాలలో తెలంగాణ నిరుద్యోగులకు మొండిచెయ్యి చూపిన వాతావరణంలోనే మరొకవైపు నుండి ఇట్లా పరిశ్రమల్ని మూసివేస్తూ పోవడం

కారణంగా కొత్త నిరుద్యోగ వర్గం తెలంగాణలో రూపుదిద్దుకున్నది.

తెలంగాణలో తమకు అనుకూలమైన చోట్ల ఆంధ్రా పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలు పరిశ్రమలు స్థాపించారు. తాము స్థాపించనిచోట్ల బహుళజాతి కంపెనీలకు ఆ అవకాశాన్ని కల్పించారు సీమాంధ్ర పాలకులు. ఆ పరిశ్రమల్లోని ఉద్యోగాల్లో తెలంగాణ వారికి అవకాశాలు లేకుండా చేయడం మాత్రమేకాదు. ఆ ఫ్యాక్టరీల్లోంచి వెలువడే విషపూరిత రసాయనాలవల్ల కూడా చుట్టు పక్కల ప్రాంతాలవారు అపారంగా నష్టపోయారు. ఆ విషయాన్నే యం.వెంకట్ 'వర్జి' దీర్ఘకవితలో వివరించాడు.

**"కాల్వలు కండ్లల్ల తొవ్వి**
**మట్టి మీన**
**పొగ గొట్టాలు**
**పొడుస్తున్నాయి**
**నెత్తిమీన మబ్బులేవు**
**కాళ్ళకింద కాల్వలేవు**
**ఆయిలు మరకల కాలం**
**నాగలికేం సుట్టం**

**ఇనుము ఇగురేస్తుంటే**
**సేను సెదలు బట్టె**
**కార్ఖానా కండ్లకి**
**కమాను పట్టెలమైతిమి"**
**(వెంకట్, యం. 2000 : 22)**

కమాను పట్టెలు వాహనాలకు ఉంటాయి. ఆయా వాహనాల భారాన్ని మొత్తం మోస్తూ, బ్యాలెన్స్ చేసే పని కమాను పట్టెలు చేస్తాయి. వాహనం బరువు పెరిగిపోవడం

జరిగినప్పుడు ఆ కమాను పట్టెలు విరిగిపోతాయి. సీమాంధ్ర పెట్టుబడిదారుల, వ్యాపారవేత్తల పరిశ్రమలకు తాము కమాను పట్టెలం అయిపోయామని చెప్పడం ఈ కవి ఉద్దేశ్యం.

హైదరాబాద్ చుట్టుపక్కల తమ పెట్టుబడులతో, తమ మానవ వనరులతో, తమ ప్రయోజనాల కోసం సీమాంధ్ర పెట్టుబడిదారులు ఇండస్ట్రియల్ పార్కుల్ని నిర్మించారు. వాటి ద్వారా తెలంగాణ ప్రజలకు ఒనగూరింది ఏదీలేదు, పైగా పూడ్చుకోలేనంత నష్టం వాటిల్లింది. ఆ విషయాన్నే బోల యాదయ్య 'తెలంగాణ జ్వాల' కవితలో వివరించారు.

**"మా పొట్టగొట్టి కూడు లాగి – గూడు కూల్చి గోడ గట్టి**
**ఇండస్ట్రియల్ పార్కు బెట్టి – ఇంటి భూమిలో వంటమనిషిని జేసి**
**మమ్ము మంట గలిపి – మలమల మాడ్చిన**
**కలియుగ కళంకితులారా.. సీమాంధ్ర సంపన్నులారా.."**
**(యాదయ్య, బోల. 2011 : 23)**

ఇలా కోస్తాంధ్ర సంపన్నవర్గాలు స్థాపించిన పరిశ్రమలకు ముడి సరుకు మాత్రం తెలంగాణలోంచే దండుకోవడం జరిగింది. కనుకనే ఈ కవి తమ పొట్టను కొట్టారు అన్నారు. ఏ ప్రాంతంలో లభించే సహజ వనరులను ఆ ప్రాంతానికి అవసరమైనంత వినియోగించాకే ఇతర ప్రాంతాల ప్రయోజనాలకు వినియోగించాలనేది ప్రజాస్వామిక సూత్రం. కానీ తెలంగాణకు ఈ విషయంలో అన్యాయమే జరిగిందని చెప్పాలి. తెలంగాణలో ప్రాంతేతరులు స్థాపించిన పరిశ్రమల్లో ముడిసరుకుల్ని మాత్రం తెలంగాణ నుండే రాబట్టుకుని, ఆయా పరిశ్రమల్లో తెలంగాణ వాళ్లకు ఉపాధి ఇవ్వలేదు సరికదా, ఉత్పత్తిని సైతం తమ ప్రయోజనాలకే వినియోగించుకోవడం అత్యంత దారుణమైన వాస్తవం. అందుకే ఈ కవిత రాసినట్లు తెలుస్తోంది.

తెలంగాణలో సీమాంధ్ర పెట్టుబడిదారులు స్థాపించిన పరిశ్రమల్లో తెలంగాణవారికి

ఉద్యోగావకాశాలు ఇవ్వడం లేదనే ఆవేదనతో గాదె వెంకటేష్ 'భౌగోళికమా? సైద్ధాంతికమా?' అనే కవిత రాశాడు.

**"ఫ్యాక్టరీలలో నాన్ లోకల్ అంటే**
**పుట్టిన ఊళ్ళనే పూటకు గతిలేక**
**అణచివేయబడ్డందుకు ఆవేదనతో..**
**రగులుతున్న కొలిమి నా తెలంగాణ"**
**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 93)**

ఇట్లా స్థానికులందరూ పరాయివాళ్లుగా పరిగణించబడుతున్నందునే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం రూపుదిద్దుకున్నదని చెప్పడం ఈ కవి ఉద్దేశ్యం. పుట్టిన ఊరు తెలంగాణ. ఆ ఊరు బతుక తెరువును ఇవ్వలేదు. పైగా ఉపాధి అవకాశాలను వెతుక్కుంటూ స్థానికంగా ఉన్న ఫాక్టరీలో ఉద్యోగం కోసం పోతే నాన్‌లోకల్ అనడం దారుణం. నిజానికి తెలంగాణలోని ఫ్యాక్టరీలకు తెలంగాణ వాళ్లే లోకల్, ఇతర ప్రాంతాల వారు నాన్‌లోకల్ అవుతారు. కానీ పరిస్థితి దీనికి భిన్నంగా ఉన్నదని ఈ కవిత వివరిస్తుంది. అందుకే భీంపల్లి శ్రీకాంత్ 'సోది' దీర్ఘకవితలో ఇలా అన్నాడు.

**"తెలంగాణలో**
**ఫ్యాక్టరీలు**
**ఆంధ్రోళ్లే యజమానులు!**
**గాలివాన**
**వచ్చింటే బాగుండు**
**నీ దరిద్రం పోయేది!"**
**(శ్రీకాంత్, భీంపల్లి. 2004 : 10)**

తెలంగాణలో సీమాంధ్ర పెట్టుబడిదారులు స్థాపించిన ప్రమాదకరమైన ఫ్యాక్టరీల

కారణంగా ఏర్పడుతున్న పర్యవసానాలను దార్ల రామచంద్ర రాసిన 'కరువు కన్నీళ్ళు' కవిత వివరిస్తుంది.

**"పరిశ్రమల కాలుష్యపు కనికట్టు**
**మా భూముల్లో రాలిపడనీయదు వానబొట్టు**
**కరువుకోరల్లో గుట్టలు – గుట్టలుగా తొవ్వినా?**
**గుక్కెడు నీళ్ళు ఊరటం లేదు! సుమా?**
**నీటికి కూటికివసించే బుక్కెడు బతుకులు**
**ఎప్పుడు బుస్సుమంటయో బిడ్డా?**
**అడుగంటుతున్నాయి భూగర్భజలాలు"**
**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 106)**

అడవులను క్షీణింపజేయడం వర్షాలు రాకపోవడానికి ఒక కారణమైతే, వాతావరణ కాలుష్యం కూడా మరో పెద్ద కారణం. తెలంగాణలో రెండు జీవనదులు, అనేక ఉపనదులు, వాగులు పారుతున్నా వ్యవసాయానికి మాత్రం నీరందడం లేదు. కనీసం వర్షాధార పంటలనైనా నమ్ముకుందామంటే సీమాంధ్రుల ఫ్యాక్టరీలు వెలువరించే విషవాయువుల వలన వాతావరణ కాలుష్యం జరిగి వర్షాలు పడటం లేదు. తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్ తాలుకాలో జరిగిన ఒక సంఘటన బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. దక్షిణ భారత దేశం మొత్తం విస్తారంగా వర్షాలు కురుస్తున్నా, తెలంగాణలో కూడా ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నా, షాద్‌నగర్ తాలుకాలో మాత్రం ఒక్క వానచుక్క పడటం లేదు. దీనికి కారణం షాద్‌నగర్ తాలుకాలో సీమాంధ్రులు విచ్చలవిడిగా స్థాపించిన పరిశ్రమలు వెలువరించే విషవాయువులు. షాద్‌నగర్ తాలుకా ప్రజలు అక్కడి ఫ్యాక్టరీలను మూసివేసి, తమకు వ్యవసాయం చేసుకోవడానికి వాతావరణాన్ని అనుకూలం చేయమని కలెక్టర్‌కు వినతి పత్రాలు కూడా సమర్పించారు. ఇటువంటి ఒక విషాద వాతావరణాన్నే ఈ కవిత వివరించింది.

ఈ పరిస్థితుల నేపథ్యంలోనే తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుకున్నారు. భవిష్యత్తులో తమ రాష్ట్రంలో ఎటువంటి పారిశ్రామిక విధానం ఉండాలో కూడా శాస్త్రీయంగా ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే వ్యవసాయ సంబంధమైన పంచదార, పొగాకు, వస్త్ర పరిశ్రమ, వంట నూనెల పరిశ్రమ, ఇతర అనుబంధ పరిశ్రమలను, అటవీ సంబంధమైన కాగితం, గుజ్జు, లక్క, కలప, ఫర్నిచర్ పరిశ్రమలు, రసాయన సంబంధమైన, ఖనిజ సంబంధమైన బొగ్గు, క్వార్ట్జ్, సీసం, రాగి, డోలమైట్, ఇనుము, గ్రానైట్, అభ్రకం వంటి పరిశ్రమలు, ఇంజనీరింగ్, విద్యుత్, ఎలక్ట్రానిక్స్ వంటివన్నీ స్థాపించవచ్చు అని చెప్పారు. తెలంగాణలోని సహజ వనరలును ప్రజాస్వామిక పద్ధతుల్లో వినియోగిస్తే తెలంగాణ అంచనాలకు మించిన ఆర్థిక అభివృద్ధిని సాధిస్తుందని చెప్పారు. ఈ కవిత్వంలోని స్థూల సారాంశం అదే అని అర్థం చేసుకోవచ్చు.

## 4.10. ఉద్యోగాలు

నిజాం ఏలుబడిలోంచి భారత ప్రభుత్వ ఏలుబడిలోకి తెలంగాణ వెళ్లేదాకా మధ్య కాలంలో తెలంగాణలోకి దొంగ ముల్కీ సర్టిఫికెట్లతో ఎట్లా సీమాంధ్రులు ప్రవేశించారో గత అధ్యాయాల్లో వివరించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటును మొదట సమర్థించిన కాళోజీ వంటి కవులు తర్వాతి కాలంలో సీమాంధ్రుల కుట్రపూరితమైన విధానాలను అర్థం చేసుకున్నారు. అందుకే కాళోజీ 'దొంగ ముల్కి పట్టణాలలో' కవిత రాశారు.

**"దొంగ ముల్కి పట్టణాల్లో**
**నంగనాచివై మెలగుచు**
**ఉద్యోగం లేని 'ముల్కి'**
**ఉద్రేకం కాదనకు**
**బ్రతుకు తెరువులన్ని ఆంధ్ర**
**బాంధవులే కాజేసిన**
**తెలంగాణ, రాళ్లసీమ**

**తిండికి గుతుపలు ఎత్తవ?"**

**(కాళోజీ. 2012 : 388)**

స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలనే నిబంధన నిజాం కాలం నుండే తెలంగాణలో అమలవుతూ వచ్చింది. కానీ నిజాం పాలన అంతరించాక నిబంధనలన్నీ తుంగలో తొక్కబడ్డాయి. పదిహేను సంవత్సరాలు తెలంగాణలో నివసించి, భవిష్యత్తులో కూడా తెలంగాణలోనే స్థిరపడే ఆలోచన ఉన్నవారిని 'ముల్కీ'లుగా గుర్తించాలని నిజాం ఫర్మానా చెప్పింది. కానీ అది ఆచరణలో నీటిమాటగా మిగిలిపోవడం కారణంగానే కాళోజీ ఈ కవిత రాసినట్లు అర్థం అవుతుంది.

స్థానికుల ఉద్యోగావకాశాలు కొల్లగొట్టడం ద్వారా తెలంగాణలో ఎటువంటి పరిస్థితులు ఏర్పడ్డాయో జూకంటి జగన్నాథం రాసిన 'ధోకా!' కవిత వివరిస్తుంది.

**"కొలువుల పేర తావుల పేర**
**ఊర్లే పొద్దు గూకాన్నా అడివిల గూకినట్టు**
**నడిచే కాళ్లల్ల కట్టె పెట్టినట్టు**
**చేసే చేతులను ఇరుగొట్టినట్టు**
**మనసును కాలబెట్టేటోల్లు**
**వచ్చింద్రు వచ్చింద్రు**
**ఏ ఎండ కాగొడుగు పట్టి**
**కండ్లల్లో దుమ్ము కొట్టి**
**దీపాలను ఆర్పేటోల్లు**
**వచ్చింద్రు వచ్చింద్రు"**

**(రమేశ్, సుంకర(సంపా). 2010 : 91, 92)**

1956లో తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలను విలీనం చూస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం

ఏర్పాటు చేసే సందర్భంలో తెలంగాణకు కల్పించిన అనేక రక్షణల్లో ముల్కి రూల్సు కొనసాగింపు కూడా ఒకటి. ముల్కీ నిబంధనల ప్రకారం తెలంగాణలో కనీసం పదిహేను సంవత్సరాల స్థిరనివాసం ఉన్నవారికే తెలంగాణ ప్రాంతంలో ఉద్యోగాలు పొందే అర్హత ఉండేది. కాని 1956 నుండి 1968 వరకు అంటే తొలిదశ ప్రత్యేక తెలంగాణోద్యమం మొదలయ్యే నాటికి ముల్కీ రూల్సుకి విరుద్ధంగా లేదా దొంగ ముల్కి సర్టిఫికేట్లు సంపాదించి వేలాదిమంది స్థానికేతరులు తెలంగాణ వారికి చెందాల్సిన ఉద్యోగాలను కొల్లగొట్టుకుపోయారు. 1968లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి దారితీసిన ప్రధాన కారణాల్లో ఇది కూడా ఒకటి. అక్కడినుండి మలిదశ ఉత్తరార్థ ఉద్యమం దాకా తెలంగాణ నిరుద్యోగ సమస్య అలానే ఉండిపోయింది. పర్యవసానంగా ఉపాధిలేక చదువుకున్న యువత బతుకు సంకటంలో పడిపోయిందని ఈ కవిత చెప్తుంది.

ఎనిశెట్టి శంకర్ రాసిన 'గుత్పనందుకుందాం' కవితలో హైద్రాబాద్‌ను ఫ్రీజోన్‌గా ఉంచాలనే వివాదం గురించి వివరించారు.

**"రండి - అందరూ రండి! పరిగెత్తుక రండి!!**
**ఉద్యోగాలు పందేరం**
**హైద్రాబాద్ ఫ్రీజోన్!**
**హైదరాబాదీలే కావాల్సినవసరంలేదు**
**ఎవరైనా రావచ్చు**
**లోకల్, నాన్‌లోకల్ వర్తించదు**
**దీనికొక్కదానికే మినహాయింపు**
**పోలీసులతో మొదలు**
**నోరెత్తకపోతే - నోరు తెర్వకపోతే అన్ని శాఖల్లో అమలు**
**కనీసం లాఠీ పట్టుకుందామన్నా టోపీ పెట్టుకుందామన్నా**
**వీలు లేదు - తెలంగాణకు రాదు**
**'తినుడు లేదు - పంటల కాలం లేదు**

**బాడీ వీక్ - హైట్ లేదు**

**పరుగెత్తరాదు - పని చెయ్యరాదు తెలివికి లేరు**

**పైసల్లేవు - పెద్ద స్కూళ్ళలో సదువులేదు**

**ఏడ సెలక్టయితరు!? అనుకుంటాం'**

**ఎండ్ల పనికిరావని ఎల్లగొట్టుడే!**

**ఏందండి? అట్లా మాట్లాడతారు?**

**మాకు మాత్రం జ్ఞానం లేదండీ?**

**అయ్యో! మళ్ళీ గదే భాస రావట్టే!**

**అండి - తొండి అనవద్దిని!**

**మరి- పుట్టినసంది సచ్చేదాక**

**గాళ్ళ సోపతేనాయే!**

**గదే ముచ్చటాయె - గదే మాటాయె**

**ఇగ - యాడికి ముందలవడ్తం?**

**అందుకే క్యాలికద్దాం**

**గుత్పనందుకుందాం**

**దునియా సూపిద్దాం**

**'ఫ్రీజోన్' అన్నమాట**

**ఫియర్ జోన్ చేద్దాం"**

**(స్కైబాబ (సంపా). 2010 : 129)**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ ఆరవ జోన్‌లో ఉండాలన్నది తెలంగాణావాదుల న్యాయమైన డిమాండ్. కానీ దానికి సీమాంధ్రులు అంగీకరించలేదు. తెలంగాణ ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా సుప్రీం కోర్టు కూడా హైదరాబాదును ఫ్రీజోన్‌గా ప్రకటించి తెలంగాణావారిని అన్యాయానికి గురిచేసింది. ఆ సందర్భంలోనే ఈ కవిత రాశారు. తెలంగాణలో అంతర్భాగమైన హైదరాబాద్ తెలంగాణాకే చెందాలన్న వాదలనలో న్యాయమున్నది. కానీ సీమాంధ్రులు తెలంగాణకు రావాల్సిన అవకాశాల్ని కొల్లగొట్టడం

కోసమే ఈ వ్యూహాన్ని ఎన్నుకున్నట్లు ఈ కవిత ద్వారా తెలుసుకోవచ్చు. అందుకే ఇక అనివార్యంగానైనా హైదరాబాద్‌ను కాపాడుకోవాలని, ఫ్రీజోన్ అన్నమాట మాట్లాడేవారిని భయపెడదామని ఈ కవి ధర్మాగ్రహాన్ని వ్యక్తం చేశాడు.

తెలంగాణలోని నిరుద్యోగుల దౌర్భాగ్యాన్ని గురించి సిద్దెంకి యాదగిరి రాసిన 'నిరుద్యోగి పరితాపం' కవిత వివరిస్తుంది.

**"దేహం నిండా డిగ్రీల డ్రెస్సుతో**
**అరిగిన చెప్పులతో రోడ్డును కొలుస్తూ**
**తలపండిన జ్ఞానం గోడుకు వేలాడుతూ**
**అందినట్లే అందకపోయిన అవకాశం**
**నిరాశతో కుర్చికొరిగిన నిరుద్యోగి పరితాపం**
**నిత్యాన్వేషణ.."**
**(యాదగిరి, సిద్దెంకి. 2008 : 21)**

నిజానికి తెలంగాణలో చదువుకునేవారి శాతమే తక్కువ. సీమాంధ్రులతో పోలిస్తే ఇక్కడ రాజరికంలో మగ్గడం కారణంగా నిరక్షరాస్యత ఒక సామాజిక వాస్తవం. కానీ, ఇన్ని అవాంతరాల్లోనూ కష్టాలకోర్చి చదువుకున్నా, ఎన్ని డిగ్రీలు సంపాదించిన ఉద్యోగాలు దక్కడం లేదనే వాస్తవాన్ని ఈ కవిత స్పష్టం చేస్తుంది. అదే పద్ధతిలో తెలంగాణలోని నిరుద్యోగ సమస్య గురించి బోల యాదయ్య 'నిరుద్యోగం – లంచం' కవిత రాశారు.

**"కంబలి కప్పుకొని**
**శరీరాన్ని వెచ్చని కుంపట్లో**
**దాచుకునే చలిమంచు తీరానా**
**నిరుద్యోగులు ఉద్యోగం వేటలో**
**నిత్యం వేడెక్కె..**

**గవర్నమెంటోళ్ళ గాసమంటినే**

**మెతుకుకు అతుకు వేసి**

**అతికిస్తారు నోటిపికేషన్**

**గిన్ని పోస్టులు గీడ ఉన్నాయని..**

**వేలాది నిరుద్యోగ దౌర్భాగ్యులు**

**నిండా మునిగినం సల్లేందని**

**ముందుకొస్తారు మూడు పోస్టులైన**

**ఉన్నా ఎన్నడో ఉడుస్కొ నాకింటారు**

**లచ్చకో.. మూడు లచ్చలకో**

**అమ్ముకుంటారు తమ సొమ్మని**

**కొమ్ము గాసెటోళ్ళకు..**

**సదివినోడు**

**సంకలు గుద్దుకు సావాలే**

**ఎగిరెగిరి సర్కారుమీద**

**ఎంగిలి మెతుకుల వోలె**

**రోడ్డున బడాలె..”**

**(యాదయ్య, బోల. 2013 : 14)**

ఉద్యోగాల్లో లంచాలివ్వడం కోసాంధ్ర పాలకులు అనధికారికంగా అమలు చేసిన విధానం. తెలంగాణ ప్రజలకు తినడానికి తిండే లేని పరిస్థితుల్లో లక్షలకు లక్షలు లంచాలిచ్చి ఉద్యోగాలు ఎక్కడ తెచ్చుకోగలరు? వాస్తవానికి ముక్కారు పంట తీసే ఆంధ్రా ప్రాంతంలోని వారందరూ ఏదో ఒక స్థాయిలో ఆర్థికంగా నిలదొక్కుకున్నవాళ్లే. కానీ తెలంగాణ బహుజనులు ఆర్థిక అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిపోయారు. అరకొర ప్రభుత్వ విదాసంస్థల్లో చదువుకున్నా వారికి ఎండిన మెతుకులే మిగిలాయని చెప్పడం తెలంగాణలో నిరుద్యోగుల మానసిక పరితాపాన్ని చెప్తుంది.

స్థూలంగా చూసినప్పుడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కాంక్షలో సీమాంధ్రులు తెలంగాణ వారికి రావాల్సిన ఉద్యోగావకాశాల్ని అక్రమంగా కొల్లగొట్టుకుపోయారనే భావన దాగి ఉన్నదనేది స్పష్టం అవుతున్నది. కనుకనే ఈ కవిత్వం కూడా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షతోనే వ్యక్తం అయ్యింది.

## 4.11. భాష

ప్రత్యేక తెలంగాణ ఉద్యమ మూలాల్లో భాషది కూడా అగ్రస్థానమే. మద్రాసులో భాగంగా ఉండిన సీమాంధ్రులు తమ తెలుగు భాషను మద్రాసీలు అవమానిస్తున్నారంటూ ఉద్యమాలు లేవదీశారు. ప్రత్యేక 'ఆంధ్రరాష్ట్రం' సాధించుకున్నారు. కానీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేసిన తర్వాత మద్రాసీలు సీమాంధ్రుల భాష పట్ల ఎటువంటి వివక్షా ధోరణిని కనబరిచారో, ఆంధ్రప్రదేశ్‌లో మళ్లీ ఈ సీమాంధ్రులు తెలంగాణవారి భాషపట్ల సరిగ్గా అటువంటి వివక్షనే చూపించారు. తెలంగాణ భాష ప్రామాణికం కాదనీ, భాషలో జిగి లేదని, శబ్దజాలం లేదనీ, మోటుగా ఉందనీ, సున్నితత్వం అసలే లేదని, మర్యాదకరంగా నాజూకుగా ఉండదని, తెలంగాణ భాషలో ఎక్కువగా ఉర్దూ పదాలుంటాయని, వ్యాకరణ విరుద్ధమని నిందలేయడం జరిగింది. అంతమాత్రమేకాదు తెలుగు కళా, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో తెలంగాణ భాషను అవమానించారు, లేదంటే విస్మరించారు. ఆ క్రమంలోనే ఆంధ్రా పెట్టుబడిదారులు నిర్మించిన తెలుగు సినిమాల్లో, టీవీ సీరియళ్లలో ప్రతినాయకులకు, హాస్య పాత్రలకు తెలంగాణ భాషను పెట్టారు. ఈ క్రమంలో రాయలసీమ భాషను కూడా అవహేళన చేయడం ఆంధ్రా సంపన్నవర్గాల ఆధిపత్య ధోరణికి నిదర్శనం. నిజానికి సాహిత్యభాషగా తెలంగాణ భాష గౌరవం దక్కించుకోకపోవడానికి కారణం కోస్తాంధ్ర సంపన్నవర్గాల కుట్రనే అని చెప్పాలి.

ఈ కుట్రను సాహిత్యంలో పసిగట్టాడు కనుకనే సురవరం ప్రతాపరెడ్డి గోలకొండ కవుల సంచిక తీసుకురావడం జరిగినట్లు చరిత్రలో రికార్డు అయ్యింది. తొలుత విశాలాంధ్రను కాంక్షించిన కాళోజీవంటి కవులు స్వయంగా సాహితీ జీవులు కావడం

కారణంగా తెలంగాణ భాషకు జరుగుతున్న అవమానాన్ని అర్థం చేసుకుని ప్రత్యేక తెలంగాణకు మద్దతుదారులుగా మారిపోయారు. తెలంగాణ భాషకే కాదు, ఏ భాషకైనా ఉండే ఉనికికి సంబంధించిన విషయాలను శాస్త్రీయంగా వివరిస్తూ కాళోజీ 'తెలుగుబాస ఎన్నితీర్లు' కవిత రాశాడు.

**"తెలుగుబాస ఎన్నితీర్లు**
**తెలుగు యాస ఎన్ని తీర్లు**
**వాడుకలున్నన్ని తీర్లు**
**'వాడుక' ఏ తీరుగున్న**
**తెలుగుబాస వాడుకయే**
**అన్ని తీర్ల వాడుకకు**
**పరపతి పెత్తనమొకటే**
**ముఖే ముఖే సరస్వతి**
**నోట నోట మాటమ్మ**
**అన్ని తీర్ల వాడుకను**
**ఒకే తీరుగా చూచుట**
**ఎవరి వాడ వారిది అని**
**ఎవరి వేద్క వారిది అని**
**ఎవరిదైన వాడుకె అని**
**అందరికి వేడుకగ తలుస్తే**
**తెలుగు బాస అభివృద్ధి**
**ఒకే బాస మాటాడే**
**తెలుగు వారిలో సమైక్యత**
**లేకుంటే తన్నులాట**
**తప్పదు ఏనాటికైన**
**రెండున్నర జిల్లాల**

రెండు మూడు తెగలోండ్లకు

'బడిపలుకుల' బాబులకు

పంజరాల చిలుకలకు

ఎప్పుడు తెలుస్తుందంట

ఎన్నడు తెలిసొస్తుందంట

వాడుక భాషంటే ఏందో?

ఎవరి వాడకం భాషో?

గ్రాంథికాన్ని వద్దంటూ

రెండున్నర జిల్లాల

చదువుకున్న తెగలోళ్ళ

వాడుకనే గొప్పజేసి

దానికె పట్టం గట్టి

'గురజాడ' 'గిడుగు' పేర

మసిబూసి ముందమోపి

రెండున్నర జిల్లాలదె

దండిభాష అంటు చాటి

తక్కినోళ్ల నోళ్ల యాస

తొక్కి నొక్కి పెట్టి వుంచి

రెండున్నర జిల్లాల

చదువుకున్న కుటుంబాల

రెండు మూడు తెగలోళ్లదె

'ప్రామాణిక భాష' అని

శిష్టుల వ్యావహారికమని

అందరి తలపై రుద్దితే

ఎక్కడి న్యాయం అంట"

**(కాళోజీ. 2012 : 377)**

ఈ కవితలో కనిపించే ప్రధానమైన విషయం 'వ్యావహారిక భాషోద్యమం'లోని అంతర్గత సమస్యలు. నిజానికి తెలుగులో గ్రాంథిక భాషమీద వ్యవహార భాష సాధించిన విజయం చాలా ప్రగతిశీలమైనదే. అయితే, తెలంగాణ భాషను అణచివేయటంలో ఆంధ్రప్రాంత వ్యవహార భాష పాత్ర కూడా గుర్తించాలి. వ్యావహారిక భాషావాదులు ప్రగతిశీలురైన ఆంధ్ర భాషా పండితులు తెలంగాణ వ్యవహార భాష విషయంలో ఎందుకు అడ్డంకులు పెట్టారో విశ్లేషించాల్సిన అవసరం ఉన్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల భాషా సమస్య ముందుకు వచ్చినప్పుడల్లా కోస్తాంధ్రకు చెందిన తెలివైనవాళ్లు, భాషావేత్తలు 'ప్రామాణిక భాష'ను ముందుకు తీసుకొచ్చారు. వాస్తవానికి 'ప్రామాణిక భాషా'వాదంలో అంతర్గతంగా న్యూన ప్రమాణ భాష, న్యూనభాషా దృష్టి కూడా ఇమిడి ఉన్నవి. ఏది ప్రామాణిక భాష? ప్రమాణాలు ఎవరు నిర్ణయిస్తారు? ఎలా నిర్ణయిస్తారు? అనే చర్చ అస్తిత్వ పరివేదన మొదలైన తర్వాత కొద్దిస్థాయిలో సాగింది. అప్పుడు కోసాంధ్ర పండితులు, భాషావేత్తలు, సాహితీకారులు పత్రికా భాష, రచనా భాషనే ప్రామాణిక భాషగా స్వీకరించాలనే తీర్మానం చేశారు. ఈ వాదం వెనుక ఉన్న ఆంతర్యం వేరు. పత్రికా భాష అంటే ఇప్పుడున్న తెలుగు పత్రికల్లో ఉపయోగించే భాష. ఈ పత్రికలు ఎవరివి;(అతికొద్ది మినహాయింపులతో), ఏ భాషను అవి ఉపయోగిస్తున్నాయి? (ఏ మినహాయింపులు లేకుండానే), ఉన్న అన్ని పత్రికలకు పెట్టుబడులు పెట్టిన యజమానులు ఆంధ్రాప్రాంతం వాళ్లు. ప్రసార మాధ్యమాలు, ప్రచురణ సంస్థలు ఆంధ్ర ప్రాంతీయులవి. మరీ ముఖ్యంగా కోస్తాంధ్రులవి. అందులో ముఖ్యస్థానాల్లో ఉంటూ భాషా నిర్మాణాలు, రచనా పద్ధతులు నిర్ణయించేవాళ్లు కోస్తాంధ్రులే. వాళ్లు నిర్ధారించి ప్రచారం చేసిన రూపాల్ని ప్రమాణంగా భావించడంవల్ల కోస్తాంధ్ర బూర్జువా వర్గాల భాష, సంపన్న పాలక వర్గాల భాష ప్రమాణ భాష అయి కూర్చున్నది. వ్యవహార భాషావాదంలో ప్రజల వాడుక భాషను ముందుకు తెచ్చి, గ్రాంథిక భాష మీద విజయం సాధించిన వారు తెలంగాణ ప్రజల వాడుక భాష గురించి చర్చ వచ్చేసరికి ప్రామాణిక భాష కొలమానంతో వెనుకకు వెళ్లి పత్రిక, గ్రంథభాషను ముందుకు తీసుకు వచ్చారు. ఆధిపత్యం కోసం ఒకప్పుడు శాస్త్రీయ దృష్టిని అవలంబించి, మళ్లీ వాళ్లే ఆధిపత్యం కోసమే శాస్త్రీయ దృష్టిని పక్కన పెట్టి అవకాశవాదాన్ని ప్రదర్శించారు. కనుకనే గిడుగు,

గురజాడలవంటివాళ్లు మేరు శిఖరాలుగా మారారని ఈ కవిత విశ్లేషిస్తుంది.

తూర్పు మల్లారెడ్డి 'ఆగమైన తెలంగాణ' అనే కవితలోని సారం కూడా పైన చేసిన విశ్లేషణకు ఉదాహరణగానే చూడవచ్చు.

**"భాష ఏదైనా భావాన్ని వ్యక్తీకరించేదే**
**యాస ఏదైనా ప్రాంతీయతను శ్వాసించేదే**
**వ్యవహారం పేర**
**నా భావాన్ని కూడా నా భాష ద్వారా రానీయకుంటె**
**నా యాసలో మీరు మాట్లాడి**
**విదూషకులమని ప్రచారం చేసిరే ఏమి ఆధిపత్యం మీది"**
**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 237)**

భాషలో జ్ఞానముంటుందిగానీ భాషకే జ్ఞానం ఉండదు. కానీ భాషకు ఆధిపత్యం కూడా ఆపాదించాయి అప్రజాస్వామిక సమాజాలు. తెలంగాణ భాష కూడా అట్లే ఆంధ్ర భాష ఆధిపత్యానికి గురైంది. మోసానికి గురైంది. ఈ విషయాన్నే సి.హెచ్.మధు రాసిన 'వీర గీతం' కవితలో చూడవచ్చు.

**"భాష మోసానికి పర్యాయ పదంగా మారినపుడు**
**నీభాష వేరు నాభాష వేరు**
**నాది వీరతెలంగాణ దాశరథి భాష**
**నాది వేరు తెలంగాణ కాళోజీ బాట"**
**(స్నేహ ప్రచురణలు, 2010 : 42)**

రెండున్నర జిల్లాల, రెండున్నర కులాల తెలుగే ఆధిపత్యం చెలాయిస్తుందని ప్రకటించిన కవి కాళోజీ తెలంగాణ కవులకు మార్గదర్శకులయ్యారు కనుకనే ఈ కవితలో

ఆయన పేరు ప్రస్తావించినట్లు అర్థం చేసుకోవాలి. దానితోపాటే తమది వేరు భాష కాబట్టి, తమ భాషను అణచివేశారు కాబట్టే తాము వేర్పాటును కోరుకోవల్సి వస్తున్నదనే వివరణ కూడా ఈ కవితలో చూడవచ్చు.

అప్పటికే ప్రచారంలో ఉన్న, ప్రామాణిక భాషగా చెలామణి అవుతున్న తెలుగే పత్రికల్లోనూ, పాఠ్యాంశాల్లోనూ, సాహిత్యంలోనూ ఉంటూ వచ్చింది. కనుక తెలంగాణ సాహిత్యకారుల్లో ఎక్కువ మంది, ఒకవేళ తాము తమదైన భాషలో రాస్తే మెజార్టీ తెలుగు ప్రజలకు అర్థం కాకుండా పోతుందేమోననే, సాహిత్య ప్రయోజనం దెబ్బతింటుందేమోననే అభద్రతాభావంలోకి నెట్టివేయబడ్డారు. ఈ విషయాన్నే జూలూరు గౌరీశంకర్ 'తెలంగాణ కవిత్వ పాదం' అనే కవిత తెలియజేస్తుంది.

**"కుచ్చితం ఎవరిదో తేలాలి**
**నా మాటన్నేను దొంగతనంగా సూసుకొనుడేంది?**
**నా నేలపై నన్ను గేలి చేసినోణ్ణి**
**నా యాసతోనే నరుక్కొస్తా**
**ఇది నేల పాడే పాట"**
**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 159)**

ఎప్పుడైతే తమ భాషకు అన్యాయం జరిగిందని గుర్తించారో అక్కడి నుండి తెలంగాణ కవులు, రచయితలు క్రమంగా ప్రాంతీయ భాషకే పట్టం కట్టడం మొదలు పెట్టారు. అందుకే ఈ కవి తిరుగుబాటును ఈ విధంగా ప్రకటించారు.

ఏదైనా ఒక భాషను అవమానం చేసినంత మాత్రాన, వివక్షాపూరితమైన వైఖరి ప్రదర్శించినంత మాత్రాన ఆ భాషేమీ నశించదు. భాషా వ్యవహర్తలు ఉన్నంత కాలం సజీవంగానే ఉంటుంది. సాంఘిక జీవితంలో పరస్పరం భావాలను పంచుకోవడానికి ఉపయోగపడుతూనే ఉంటుంది. కనుక మీరు గుర్తించినా గుర్తించకపోయినా మాది

భాషేననే ఆత్మగౌరవ ప్రకటన చేయడం తెలంగాణలోని కవుల్లో చాలామందిని చూడవచ్చు. మంచాల వెంకటేశ్వర్లు 'తెలంగాణ భాష' కవితలో కూడా అదే వ్యక్తం చేశాడు.

**"నా భాషల నేను మునిగిన, తేలిన**
**నా భాషల నేను ఏడ్చిన, నవ్విన**
**నా భాషన నేను బతికిన, బట్ట కట్టిన**
**నాజూగ్గ లేదనీ, ఒయ్యారంగా రాదనీ**
**తింపులాడి గాదనీ**
**నువ్వు నా భాషను భాషగాదంటే**
**కాకుంట పోతాది?"**
**(వెంకటేశ్వర్లు, మంచాల. 2008 : 5)**

తెలంగాణ భాషకు అవమానం జరిగిన రంగాల్లో అత్యంత ముఖ్యమైనది సినిమా రంగం. అందుకే ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో భాష గురించి రాసినవాళ్లలో చాలామంది తెలుగు సినిమాల్లో తెలంగాణ భాషకు పట్టించిన దుర్గతిని గురించి రాశారు. జింబో 'నా పేరు యాద్గిరి' అనే కవితలో ఇట్లా రాశారు.

**"నేను భాషను ప్రేమిస్తాను**
**యాసను ప్రేమిస్తాను**
**భాష నా తల్లి**
**తల్లిని ప్రేమించని వాడు మనిషే కాదు**
**కవి అంతకన్నా కాదు**
**ఏ భాషైనా యాసైనా నాకిష్టమే**
**నా భాషను ఎవడు ఖూనీ చేసినా**
**వాడిని ఖూనీ చేయాలనేంత కోపం**
**నా పేరు యాద్గిరి**

**నా పేరు వింటేనే**

**మీ మొఖాలు వెకిలిస్తాయి**

**నన్నో సర్వర్‌గానో విలన్‌గానో**

**ద్వంద్వార్థాల్లో జోకర్‌గానో**

**మోసగాడిగానో తార్పుడిగాడిగానో చూపిస్తారు**

**అవహేళన చేస్తారు**

**నా భాషలోలేని అనాకారితనాన్ని**

**వంకరలని జొప్పించి**

**నాతో మాట్లాడిస్తారు**

**ద్రౌపదిని వివస్త్ర చేస్తున్న**

**కురుసోదరుల్లా సంబర పడుతారు**

**నిజమే!**

**భార్యని వదినని అవమానించిన**

**వ్యక్తులు చరిత్రలో వున్నారు**

**కానీ, తల్లిని మానభంగం చేస్తున్న వ్యక్తులు**

**ఇప్పుడే తయారవుతున్నారు"**

**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 85)**

తెలంగాణ భాషంటే కోస్తాంధ్ర సినిమావాళ్లకు మరీ లెక్కలేకుండా పోయినట్లు ఆధారాలు చెప్తున్నాయి. సినిమాల్లో జోకర్లు(విదూషకులు), ప్రతినాయకులు, ప్రతినాయకుల సహాయకులు అందరికీ తెలంగాణ భాషనె పెట్టారు. తెలంగాణ పేర్ల మీద ఆంధ్రప్రాంతంలో సినిమాలు తీసి తెలంగాణలో డబ్బులు సంపాదించుకున్నారు. తెలంగాణ భాష పోలీసులకు పెట్టి ఎగతాళి చేశారు. తెలంగాణలో 'యాదగిరి' అనే పేరు చాలామంది పెట్టుకుంటారు. బహుశా ఆ పేరు 'యాదాద్రి పుణ్యక్షేత్రం' వల్ల ప్రచలితం అయ్యుంటుంది. అయితే, ఆ పేరును కోస్తాంధ్ర సినిమాల్లో అవహేళన చేశారు. సినిమాల్లోని గూండాలకు యాదగిరి అనే పేరును పలుమార్లు వినియోగించారు. కానీ తెలంగాణవాళ్లకుగానీ,

తెలంగాణ భాషకు గానీ అంతటి క్రూరత్వం లేదని అడువాల సుజాత రాసిన 'తెలంగాణ తల్లి ఎత' అనే కవిత స్పష్టం చేసింది.

**"మాట నచ్చకపాయే**
**భాష యాసాయే**
**తెలంగాణ తెలుగంటే..**
**'గుండాల మాట'నుకున్నరా?**
**కాదు..**
**ఇంపు సొంపుల గుర్గి**
**సింగారాల బుడ్డి**
**తెలంగాణ తెలుగు**
**ఎద మెత్తని తనం-**
**కల్తీలేని కన్నతల్లి ప్రేమసొంటిది!**
**మా భాషనూ.**
**మా మంచితనాన్నీ..**
**ఆసరా చేసుకొని అణిచేసింద్రు"**
**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 343, 344)**

భాషకూ, మానవుని స్పందనలకూ ఉండే సహజమైన సంబంధాన్ని గురించి అల్లం నారాయణ 'యాది - మనాది' కవిత వివరిస్తుంది. ఈ కవిత్వంలో కూడా ఆత్మగౌరవ ప్రకట చేస్తూనే తమ భాషలో ఉన్న తీపిని గురించి కూడా చెప్పడం ఉన్నది. అదే సమయంలో తెలంగాణకు జరిగిన అవమానాన్ని ఎండగట్టడం కూడా ఉన్నది.

**"అలాయి బలాయిలు**
**ఆత్మ సంభాషణలు**
**మనసును ముట్టుకునే**

**అగ్గి పర్వతాలు**

**బతుకు సారపు సామెతలు**

**ఆటుమాటలు, అక్కర మాటలు**

**'తౌరక్యాంధ్రము' పేరిట**

**ఎగ్గడించిన బతుకులు**

**బోర్లిచ్చిన గుమ్ములు**

**ఎన్నడూ నిండని గరిసెలు**

**భాష ఒక బతుకుపటం**

**భాష ఒక అలాయి బలాయి**

**భాష ఒక ముట్టిచ్చిన దీపం**

**భాష ఆత్మల అనుసంధానం..**

**ఆరాట, పోరాట విరాట్ స్వరూపాల**

**అమ్మలగన్నయమ్మ భాష**

**యాసేడిది..**

**తెలంగాణ ఒక జీవద్భాష**

**మనసు ముచ్చట**

**కృతక, ఘాతుకం మీది..**

**ఉల్టా బనాయింపు మీది..**

**భాష ఒక కడగొట్టు స్వప్నం"**

**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 28, 29)**

తెలంగాణకు నీటి వాటా విషయంలో చాలా అన్యాయం జరిగినట్లు క్రితం అధ్యాయాల్లో ఆధారాలతో వివరించాను. నిజానికి ప్రత్యేక తెలంగాణ ఉద్యమ మూలాల్లో నీటి వాటాల్లో జరిగిన వివక్షలే ప్రధాన కారణంగా కనిపిస్తుంది. అంతటి పెద్ద విషయాన్ని కూడా ఆత్మగౌరవ ప్రకటన సందర్భంలో కాస్త వెనక్కు నెట్టి మా భాషను అవమానించారు కాబట్టే ప్రత్యేక తెలంగాణ అడుగుతున్నాం అనే ఆవేదన వ్యక్తం చేశారు గుడిపల్లి నిరంజన్.

ఆయన రాసిన 'అగ్గిగొంతుతో అడుగుతున్న' కవితలో ఇట్లా వర్ణించారు.

**"భాషాసంకెళ్లతో**
**మమ్మల్ని బానిసల్ని చేయాలని తలపోస్తున్న**
**అరే బద్మాష్..!**
**కండ్లు పెట్టి సూడు**
**తెలంగాణ వలస గోస**
**కండ్లు పట్టి సూడు**
**తెలంగాణ కరువు గోస**
**మా పోరటం కాసిన్ని కాలువ నీళ్లకు కాదురా..**
**మీ యాసభాష ముంగట**
**మా భాషామతల్లి**
**అల్లాడిపోతున్నందుకు"**
**(జగన్ రెడ్డి, ఎస్(సంపా). 2012 : 41)**

తెలంగాణ భాషలో సొబగులు లేవనీ, జిగి లేదనీ, సున్నితత్వం లేదనీ, జీవం లేదనీ, అసలు అది పనికిమాలిన యాస అని చిన్నబుచ్చిన వాళ్లకు కూడా తెలంగాణ కవులు సమాధానం కవిత్వం ద్వారానే ఇచ్చారు. దామెర రాములు రాసిన 'ప్రాణ సమానం నా తెలంగాణ పదం' కవిత ఇది.

**"తెలంగాణ పదం నిత్యం కదం తొక్కేనడక**
**పురుడు పోసుకునే తెలంగాణ పదాల వాసన**
**నేల ఈనినట్లుంటుంది**
**పదంలో భేషజం ఉండదు**

**పదం నిండుగా తొణకని కుండలా ఉంటుంది**

పదం గలగలా పారే పంపునీళ్లకాల్వ తీర్గ ఉంటుంది
పదంలో టేకాకుల గలగలలు విన్పిస్తాయి
పదం పాట తీర్గ ఉంటది
పదం పది మంది పెట్టు
పదం పేరు పెట్టి పిలిచినట్టు ఉంటుంది
పదం పదనిసలు పలుకుతుంది నవనాడులు మీటుతుంది
తెలంగాణ పదం సంగీతం కంటే లోతైంది యింపయింది
అర్థం చేసుకొని చెవి యొగ్గి వింటే మజా అనుభవిస్తారు
అర్థం చేసుకునే నిష్కల్మషమైన మనసు ఉండాలి మరి
యాసని అమర్యాద చేసే సంకుచిత అవహేళనకి
తెలంగాణ పదం అంతుచిక్కని అందం

తెలంగాణ సహజవనరులు వొక ఎత్తు
తెలంగాణ పద సంపద వొక ఎత్తు
పొరుగు రాష్ట్రాల సమ్మిశ్రిత పదాల మేళవింపు వొక ఎత్తు
అంతర్వాహినిల కలగలసిపోయిన ఉర్దూ పదాలు వొక ఎత్తు
హైద్రాబాదు అంటేనే ఉత్తర దక్షిణ భారతాల సంగమ కేంద్రం
హైద్రాబాదీ భాషోన్మాది కాదు, కానేరదు
ఎన్నో భాషా పదాలన్నీ తన తనువులో బిడ్డని యిముద్చుకున్న
తీరుగా కలుపుకుంటుంది
అంతటి సౌందర్యం తెలంగాణ పదానికే ఉంది
అందుకే తెలంగాణ పదం యీరపు భాషల కంటే నిండారుగా ఉంటుంది
తెలంగాణ పదం గిట్టనివాళ్లు మీరు మాట్లాడేది తెలుగేనా అంటారు
ఇదో జోకరు భాష అని నవ్వుకుంటరు
ఇదో మొరటు భాష అని ముక్కు విరుస్తరు
తెలంగాణ పద సంపద ఎంత శక్తివంతమో

**తెలంగాణ పాట వింటే తెలుస్తుంది**
**లయతప్పని గుండె దడ ద్వారా తెలుస్తుంది**
**పదం సూటిగా సంధించిన బాణంలా గుండెని తాకుతుంది**
**బందూకు నుంచి ట్రిగ్గర్ మీటగా దూసుకొచ్చిన తూటాలా ఉంటుంది**
**తాటితోపుల్లోంచి తుమ్మ చెట్లమీదుగా**
**తంగేడు పూల సువర్ణాలు మోసుకొస్తుంది తెలంగాణ పదం**
**పల్లెపల్లెని లొల్లి పెట్టి లాలిపాడి సవ్వడి చేసి**
**మరీ అక్కున జేర్చుకుని మక్కువ జేస్తుంది తెలంగాణ పదం**
**తెలంగాణ మాటలు ముచ్చట్లు చెవులారా వింటే**
**కడుపార పెరుగుజొన్న అన్నం తొక్కుతో అంచుకు తిన్నట్టుంది**
**అందుకే నా భాషని యాసని ఏమన్న అంటివోబిడ్డా!**
**అసంకల్పితంగా నా పిడికిళ్లు బిగుసుకుంటాయి జాగ్రత్త!"**
**(రాములు, దామెర. 2006 : 51, 52, 53)**

నిజాం రాజు నిరంకుశత్వానికి, ఆడవాళ్లమీద అత్యాచారలకు, హత్యలకు పాల్పడుతున్న పరిస్థితులకు, బతుకుజీవుడా అని ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని నాగ్‌పూర్, బెంగళూర్, విజయవాడ మొదలైన ప్రాంతాలకు తెలంగాణ ప్రజలు వెళ్లారు. ఈ క్రమంలో నాగ్‌పూర్ వెళ్లినవాళ్లకుగానీ, బెంగళూర్ వెళ్లినవాళ్లకు గానీ పెద్దగా ఇబ్బందులేవీ ఎదురు కాలేదు. కానీ విజయవాడకు రైళ్లలో బయల్దేరిన తెలంగాణవాళ్లకు ఆ రైళ్లలోనే భాషాపరమైన అవమానం జరిగింది. సహ ఆంధ్రా ప్రయాణీకులు అసలు మీది తెలుగేనా, మీది కూడా భాషేనా అని ప్రయాణంలో ఉండగానే ఎద్దేవా చేసినట్లు ఆధారాలు ఉన్నాయి. అంతకు ముందు హైదరాబాద్ రాష్ట్రంలో తెలుగే లేదని, సాహిత్యకారులే లేరని, సాహిత్యమే లేదని చేసిన అవమానానికి బదులుగానే సురవరం ప్రతాపరెడ్డిగారు గోలుకొండ కవుల సంచిక తీసుకురావడాన్ని ఇంతకుముందే ప్రస్తావించి ఉన్నాను. ఈ మొత్తం క్రమంలో తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుకోవడంలో భాషది కూడా కీలకమైన స్థానమే అని చెప్పవచ్చు.

## 4.12. సాహిత్యం

మనిషిని జంతువుల నుండి వేరు చేసిన లక్షణాల్లో భాష ప్రధానమైనది. భాష కలిగిన ఏ సమాజానికైనా సాహిత్యం ఉంటుంది. అది మౌఖిక రూపంలో అలిఖితంగా ఉన్నా, లిఖితంగానే ఉన్నా సాహిత్యమే.

తెలుగు సాహిత్య చరిత్రలో అలిఖిత సాహిత్యానికి (జానపద సాహిత్యం) ఉన్న అప్రధాన్యతే తెలంగాణ సాహిత్యానికి కూడా ఉంటూ వచ్చింది. నిజానికి సాహిత్య చరిత్రల నిర్మాణం ఆధునిక కాలంలో మొదలైన ప్రక్రియ. చరిత్ర రచన మొదలైన తర్వాత దాని స్ఫూర్తితో, మార్గదర్శకత్వంతో వివిధ సామాజిక శాస్త్రాల, శాస్త్ర సాంకేతిక శాస్త్రాల చరిత్ర రచన ఆవిర్భవించింది. ఆ క్రమంలో తెలుగు సాహిత్య చరిత్ర నిర్మాణం కూడా ఆధునిక కాలంలోనే మొదలైంది. తెలంగాణ సాహిత్య చరిత్రకారులు 20వ శతాబ్ది చివర్లో తెలంగాణ సాహితీకారులను గుర్తించేదాకా తెలంగాణ సాహిత్యానికి తెలుగు సాహిత్యంలో చాలా స్వల్పమైన భాగం మాత్రమే లభించింది. పాక్షిక సత్యాలు మాత్రమే నమోదు చేయడం జరిగింది. తెలంగాణ ప్రాంతం సకల రంగాల్లో వివక్షకు గురవుతున్నదన్న ఎరుక మొదలైన తర్వాత సురవరం ప్రతాపరెడ్డి మొదలు ముదిగంటి సుజాతారెడ్డి, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్‌ల వరకు తెలంగాణ సాహిత్య చరిత్రను తవ్వి గ్రంథస్థం చేసిన కృషీవలురే. వీరి కృషి ఫలితంగా తెలంగాణకు నన్నయ కంటే ముందు నుండే సాహిత్య ప్రస్థానం ఉన్నదని బయల్పడింది. మరి తెలంగాణ సాహిత్యకారులకు తెలుగు సాహిత్య చరిత్రలో చోటు దక్కకపోవడానికి కారణాల్ని అన్వేషించినప్పుడు ప్రాంతీయ దురహంకారం, వివక్షాపూరితమైన దృష్టి వెలుగులోకి వచ్చాయి.

చింతం ప్రవీణ్ 'వెయ్యేండ్ల చరిత్ర' కవితలో ఇట్లా రాశాడు.

**"నాన్ - లోకల్ నన్నయ్యను**
**మా మెదళ్ళలో**

ఏళ్ళతరబడి నింపిన మీరు
నా తెలుగన్న గురించి
ఏ తరగతిలో చెప్పలేదేం?

పుస్తకాల పేజీల నిండా
మార్కుల మాయాజాలంతో
కే.జీ నుండి పీ.జీ దాకా
మాది కాని భాషను
ఇంజెక్ట్ చేసిండ్లిన్నాళ్ళు

తండ్లాట బతుకు
తెలంగాణా ప్రజలదైతే
భామ కవిత్వపు పాకులాటలు
మీ భావ కవులది

తెలంగాణా బిడ్డలు
గుండెలవిసేలా రోదిస్తుంటే
కనికరం లేని మీ కలం
కవిత్వానికి నేర్పిందో కులం

నన్నయ్య
నరేంద్రుని బొందలో నిద్రపోతే మాకేం!
నిగ్రనీల్గితే మాకేం!?

తెలంగాణా అనంగనే
తెలుగు లెస్స అంటరు

**చంపిన చేతులతోనే దండలేసి**
**శ్రీరాముల భజనలు జేస్తరు**

**మా గోడు పట్టని**
**మీ సాహిత్యానికి**
**జీవితకాలపు**
**ఉద్వాసన పలుకుతున్నాం**

**ఇగ మా చరిత్రను మేమే రాసుకుంటం**
**మా చరిత్రను మేమే సదువుకుంటం**
**ఏండ్లకేండ్లు అంటరానిదైన మా చరిత్ర**
**మీరు అగాధాల అడుగుల తొక్కిపెట్టిన**
**వెయ్యేండ్ల చరిత్ర"**
**(ప్రవీణ్, చింతం. 2012 : 30, 31)**

మలిదశ ఉత్తరార్ధ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మొదలయ్యేనాటికి తెలుగు సాహిత్య చరిత్ర పుస్తకాలు 20 వచ్చాయి. వాటిలో 'తెలుగు సాహిత్య చరిత్ర' (ముదిగంటి సుజాతారెడ్డి), 'తెలుగు సాహిత్య చరిత్ర' (ఎస్వీ రామారావు), 'ముంగిలి' (సుంకిరెడ్డి నారాయణరెడ్డి) మినహాయిస్తే మిగతా 17 సాహిత్య చరిత్ర పుస్తకాల్ని రాసింది తెలంగాణేతర తెలుగువాళ్లే. వీళ్లందరూ తమ చరిత్ర పుస్తకాల్లో తెలంగాణ కవులకు స్థానం ఇవ్వలేదు, ఇచ్చిన వాళ్లకు కూడా చాలా పాక్షికంగానే ఇచ్చారు. తెలంగాణేతర సాహిత్య పరిశోధకులకు, చరిత్రకారులకు తెలంగాణ పట్ల ఉపేక్షాభావం ఉండడం వల్లనే తెలంగాణ సాహిత్యం విస్మరణకు గురైంది. పరిశోధనలు చేస్తున్న క్రమంలో ఎవరైనా గోదావరి తీరంలో జన్మించాడని తేలగానే ఉభయగోదావరి జిల్లాలకు చెందినవారుగా, కృష్ణా తీరం వారని తేలగానే కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందినవారుగా నిర్ధారణ చేశారు. ఆ రకంగా తెలంగాణ సాహిత్యకారుల ప్రాంతాలు మార్చడం, కొన్నిసార్లు

అసలు సాహిత్య చరిత్రలో స్థానం ఇవ్వకపోవడం జరిగాయి. కనుకనే ఈ కవి వెయ్యేండ్ల తెలుగు సాహిత్య చరిత్రను విమర్శకు గురిచేశాడు.

కవుల సాహిత్య దృక్పథం, కృషి, సమాజంపై వారు వేసిన ప్రభావం ఆధారంగా, పక్షపాతం లేకుండా గుర్తించినప్పుడు ఏ తెలుగు కవికీ అన్యాయం జరిగి ఉండేది కాదు. కానీ ఆధిపత్య భావాలతో, ముందస్తుగా మనస్సుల్లో స్థిరపర్చుకున్న అభిప్రాయాలతో సాహిత్య చరిత్ర రచన చేసినప్పుడు స్వార్థాలు బయట పడతాయి. తెలంగాణలో ఉన్న కవులు ప్రాచీన కాలం నుండే సంపద్వంతమైన సాహిత్య సృజన చేశారు. కానీ ప్రాంతీయ అభిమానాలతో తెలంగాణ కవులను నిర్లక్ష్యం చేసింది ఆంధ్రా సాహిత్య చరిత్రకారులు. ఆ విషయాన్నే వడ్డెబోయిన శ్రీనివాస్ 'సమైక్య శాపం' అనే దీర్ఘ కవితలో వివరించాడు.

**"నన్నయను**
**నెత్తికెత్తుకున్నరు**
**తిక్కనను**
**చుక్కల తాకించింద్రు**
**ఎఱ్ఱనను**
**ఎలుగెత్తింద్రు**
**పాల్కుర్కి సోమనాథుడు**
**పాపమేమి జేసిండు?**
**బమ్మెర పోతనకు**
**బ్రహ్మరథమేది?"**
**(శ్రీనివాస్, వడ్డెబోయిన. 2010 : 2)**

ప్రాచీన తెలంగాణ సాహిత్యాన్ని పక్కనపెట్టినా, అన్ని వనరులు అందుబాటులో ఉన్నా, వాస్తవ చరిత్ర కళ్ల ముందే కనిపిస్తున్న ఆధునిక కాలంలో కూడా తెలంగాణ సాహిత్యానికి అన్యాయమే చేశారు. 19వ శాతాబ్దం ఉత్తరార్ధం, 20వ శతాబ్దాలలో

తెలంగాణ నేలమీద అనేక ఉద్యమాలు జరిగాయి. ఉద్యమ సాహిత్యం, ఉద్యమేతర సాహిత్యం విరివిగానే వచ్చింది. కానీ దాన్ని కూడా కోస్తాంధ్ర సాహిత్య చరిత్రకారులు గుర్తించ నిరాకరించారు. అందుకే సుంకిరెడ్డి నారాయణ రెడ్డి 'ఎవడ్రీడు?' కవితలో ఇట్లా రాశారు.

**"ఒక్కసారన్నా గీ మట్టి వాసనతోని దిరిగిందా గాని నాల్కే**
**ఒక్క పదముందా నాది, గాని డిక్షనరీల**
**పత్రికల బజార్లల్ల ఒయ్యిలల్ల సిల్మాలల్ల అసెంబ్లీల టీవీలల్ల**
**నా పిలగాని పెదిమెలల్ల**
**పదమై సుత పాలిస్తుండు గీ నేలల**
**కాటన్ ఎరికే మాకు- హేమన్ డార్ఫ్ ఎర్కనా గానికి**
**మా పాల్కుర్కి పేరుందా గాని నేలల**
**మా సురవరం పేరుందా గాని నేలల**
**దువ్వూరి సైరికాత్మ మాకెరుక**
**మా గలగల నాగలిసాళ్ళేవీ గానీ పుస్తకాలల్ల**
**నాజర్ తంబూరై మా శెవుల్ల ఉన్నడు**
**మా బందగీ యేడి గాని నాలుక మీద**
**విశ్వనాథ మాకు కంఠోపాఠం**
**మా వానమామలై ఏడీ గాని గొంతుల**
**జాషువా పద్యాలు మాకు ఉద్యమ గీతాలు**
**మా భాగ్యరెడ్డి వర్మ పేరుందా గాని నేలల**
**రావిశాస్త్రి కథనాలన్నీ మాకు కతలు కతలు**
**గాడు కతలబద్దడు గని- మా రాజయ్యేడీ గాని కతలల్ల"**
**(స్కైబాబ(సంపా). 2010 : 165)**

తెలంగాణ కవికి ఉన్న సంయమనం, విశాల దృక్పథం, నిస్వార్థ ఆలోచన విధానం

ఈ కవిత ద్వారా అర్థం చేసుకోవచ్చు. తెలంగాణవాళ్లం సీమాంధ్రకు చెందిన కవులను, రచయితలను ఆదరించాం, పూజించాం, ఆరాధించాం, కానీ మీరు మాత్రం మా సాహిత్యకారులను వివక్షతో చూశారు అని ఈ కవిత చెప్తుంది.

డా॥కాంచనపల్లి రాసిన 'తండ్లాట' దీర్ఘకవితలో కుల అస్తిత్వ చేతనతో తెలంగాణ సాహిత్యాన్ని, తెలుగు సాహిత్యాన్ని అంచనా వేయడం కనిపిస్తుంది.

**"కందుకూరీ..**
**ఎవరిని సంస్కరించినవయ్యా**
**ఒక్క ఆంధ్ర బ్రాహ్మణ కులమేనా**
**తెలుగుజాతి అంటే**
**విధవల అతి చిత్రకథలన్నీ**
**ఉన్నాయా తెలంగాణలో**
**ఒక మూలకు నువ్వు చేసిన**
**కొన్ని పనులు**
**నీ ప్రచార ప్రహసనాలు**
**ఎంత ఎంత చేస్తిరి?!**
**వసంతానికి చిగురించడం**
**ఎవడు నేర్పగలడు?**
**అడవి తొలకరి పూవుకు**
**అందం ఎవడు అద్దగలడు**
**నిసర్గమైన తెలంగాణను**
**నువ్వేమి సంస్కరించగలవు**
**గురజాడా..**
**గురజాడా..**
**నువ్వు దేనికి యుగకర్తవు**

గిడుగు వంచనా శిల్పంతో
మమేకమై మా ముఖాల మీద
నీ భాషను సంస్కృతిని దిద్దితివి
చివరికి ఎంత దౌర్భాగ్యులం మేము
తేనెపూసిన కత్తులకు
తలవంచిన మేకలమయ్యాం
ఆవు తోలు కప్పుకున్న పులులకు
మా దేహం మాంసం కండలు
పంచిపెట్టినం
బత్తీసలు లేని జాత్రలమైనం
నిన్ను యుగకర్తవని
భుజాలమీద మోసినం
అదిగో అదిగో
అమలిన సిద్ధాంతకర్త
ఇంకో యుగకర్త
రాయప్రోలు
ప్రాంతకర్తలు
ఎంత గొప్పగా యుగకర్తలయినారయ్యా
మా హుస్సేన్‌సాగర్ గుండెల మీద
కుంపట్లయ్యారు గదయ్యా
దిగుట్ల దీపాలైన
ఆరువందల ప్రాణాలకంటే
విగ్రహాలే విలువయినాయి కదయ్యా"
**(డా॥కాంచనపల్లి. 2011 : 27, 28, 29)**

కందుకూరి, గురజాడ, రాయప్రోలు ఆధునిక తెలుగు సాహిత్యంలో మేరు శిఖరాలుగా

నిలబడినవాళ్లు. వారి కృషిలోని వర్గ స్వభావాన్ని కుల, ప్రాంత చైతన్యంతో విమర్శించడం ఈ కవిత లక్ష్యం. నిజానికి కందుకూరి గొప్ప సంస్కరణవాదిగా తెలుగు సమాజమంతా కీర్తించింది. కానీ ఆయన రచనల్లోని బాధిత స్త్రీలలో తెలంగాణ స్త్రీలు ఉన్నారా, ఆయన ఎంచుకున్న కార్యక్షేత్రంలో తెలంగాణ ఏనాడైనా ఉన్నదా అని ఈ కవి సూటి ప్రశ్న. అంతేకాదు ఆధునిక తెలుగు సాహిత్యంలో యుగకర్త స్థానం కోసం జరిగిన చర్చ, వాదోపవాదాలు మామూలువి కావు. తెలుగు సాహిత్య సమాజం మొత్తం రెండుగా చీలిపోయి కొందరు గురజాడనే యుగకర్త అంటే మరికొందరు రాయప్రోలు సుబ్బారావే యుగకర్త అన్నారు. కొద్దిమంది కందుకూరిని కూడా పేర్కొన్నారు. విచిత్రమేమంటే వీరిలో తెలంగాణ వాళ్లు ఒక్కరు కూడా లేరు. నిజానికి వీరి కాలంలో తెలంగాణలో సంఘసంస్కరణ ఉద్యమాలు నడిపినవాళ్లు, సంఘ సంస్కరణ సాహిత్యం రాసినవాళ్లు, బహుజన కులాలకు బాసటగా నిలబడి సాహిత్యాన్ని వెలువరించినవాళ్లు ఉన్నప్పటికీ వారు యుగకర్తకలు కాలేకపోవడానికి ప్రాంతీయ దురహంకారమే కారణం అని ఈ కవిత తెలియజేస్తుంది.

తెలంగాణ సాహిత్యకారులకు చరిత్ర పొడుగునా జరిగిన అవమానాల్ని, అన్యాయాల్ని చూసిన తెలంగాణ కవి అస్తిత్వ పరివేదనలోంచి ఆవేశంగా కూడా కవిత్వం రాయవల్సి వచ్చింది. ప్రత్యేక తెలంగాణ చైతన్యం వచ్చిన తర్వాత తెలంగాణ సాహిత్య పరిశోధకులు కూడా విశేషమైన కృషి చేసి తెలంగాణ సాహిత్యకారులెవరో, సీమాంధ్ర సాహిత్యకారులెవరో శాస్త్రీయంగానే విడమరిచి చెప్పారు. అయినా కూడా తమ పక్షపాత ధోరణిని అలాగే కొనసాగిస్తూ వాదోపవాదాలు చేయడం తెలంగాణ కవికి మరింత ఆగ్రహాన్ని తెప్పించింది. అందుకే దేశపతి శ్రీనివాస్ 'ఉంటరో పోతరో తేల్చుకోండ్రి' కవితలో ఇట్లా రాశారు.

**"బర్‌బాతే జేసిన్రు**
**బద్‌నామొక్కటి తక్కువాయెనా?**
**మాయన్నీ మీరెప్పుడో అంకితం జేసుకున్నరు**
**మా చెవుల రింగుమని**

**మీ పాటలు మోగుతుంటే**

**మేము మహాగాయకులం ఎట్లయితం?**

**నిలువు నిలువునా కాలిపోతున్న**

**దగ్ధ గీతాలమౌతాంగాని!"**

**(శ్రీనివాస్, దేశపతి. 2010 : 32)**

స్థూలంగా ఈ కవిత్వం అంతస్సారమంతా ఒక్కటే విషయాన్ని బలంగా చెప్పింది. వెయ్యేండ్ల తెలుగు సాహిత్య చరిత్రలో తెలంగాణ సాహిత్యకారులకు సముచిత స్థానం దక్కలేదు. దక్కినవారిని కూడా చాలా పాక్షికంగానే పరిచయం చేశారు. సీమాంధ్ర ప్రాంతాలకు చెందిన కవులను మాత్రం యుగకర్తలను చేశారు. సాహిత్య చరిత్రల్లో కూడా యుగవిభజన చేసిన కాలంలో యుగకర్తల పేర్లన్నీ సీమాంధ్రులకు చెందినవారివే ఉన్నాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తమ విస్మృత చరిత్రను తామే నిర్మించుకుంటాం అని చెప్పడం ఉన్నది. అంటే ఈ కవిత్వమంతా ప్రత్యేక తెలంగాణ కవిత్వం.

## 4.13. కళలు

తెలంగాణ అనేక కళలకు కాణాచి. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో ఒక్కో జిల్లాకు ఒక్కో ప్రాధాన్యత ఉన్నది. ఉదాహరణకు ఆదిలాబాద్‌లోని చిత్ర కళ, వరంగల్, మహబూబ్ నగర్‌లలోని శిల్ప, నిర్మాణ కళలు, నల్గొండ, మహబూబ్ నగర్‌లలోని చేనేత కళ, హైదరాబాద్, నిజామాబాద్, ఆదిలాబాద్‌లలోని పాక కళ, వరంగల్‌లోని పేరిణి అనే నృత్య కళ, సంగీత కళ, తెలంగాణ జిల్లాలన్నింటిలోని జానపద కళలు(ఒగ్గు కథలు, వీధి బాగోతులు మొ॥)లతోపాటుగా అనేక దృశ్య, శ్రవణ కళలు తెలంగాణలో ప్రాచీన కాలం నుండే ప్రపంచం దృష్టిని ఆకర్షించాయి. ఏ సమాజానికైనా కళలను ప్రోత్సహించడం అన్నది గౌరవంగా ఉంటుంది. కానీ సీమాంధ్ర పాలనలోకి తెలంగాణ వెళ్లిపోయాక కేవలం వ్యాపార కళ అయిన చలన చిత్రాలకే ప్రాధాన్యత పెరిగిపోయింది. ప్రభుత్వాలు

ఇచ్చే ప్రోత్సాహకాలు, రాయితీలు మొత్తం సినిమాలకే తప్ప గ్రామీణ జీవితంలో కాకతీయుల కాలం నుండి విలసిల్లుతూ వచ్చిన అనేక కళలకు ఆదరణే లేకుండా పోయింది. ఈ విషయాన్ని కూడా తెలంగాణ కవులు తీవ్రమైనదిగానే పరిగణించారు. సుంకిరెడ్డి నారాయణరెడ్డి రాసిన 'దాలి' దీర్ఘకవితలో ఇట్లా అన్నాడు.

**"బలువూరి కొండన్న సర్వాయి పాపన్న**
**సై అంటే సై అంటు**
**ఎగిరి దునికిన రోషాల తాంబూర**
**గొల్లసుద్దులేయి మందెచ్చు కథలేయి**
**కంగాలి సినిమాల జంగిలి పాటల్దప్ప"**
**(నారాయణరెడ్డి, సుంకిరెడ్డి. 2001 : 9)**

తెలంగాణలో జానపద కళలు అనేకం ఉన్నాయి. వాటికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. స్థానికంగా ప్రజల కోసం పోరాడిన వీరులను గురించి కీర్తించడం అన్నది ముఖ్యమైన విషయం. ఇందులోని విశేషమేమిటంటే అంతకు ముందు పురాణాలు, ఇతిహాసాల్లోని కథా వస్తువును గానం చేయడం అన్న సంస్కృతిని బదిలీ చేస్తూ రూపం అలాగే ఉంచి సారాన్ని మార్చడం. సర్వాయి పాపన్న తెలంగాణ నాయకుడు. సీమాంధ్ర చరిత్ర కారుల చేతిలో బందిపోట్లుగా చిత్రించబడిన అనేక మందిలో సర్వాయి పాపన్న ఒకడు. మీరా సాహెబ్, పండుగల సాయన్న, కొమురం భీము, రాంజీ గోండులు తమ తమ కాలాల్లో ప్రజా విముక్తి కోసం కృషి చేసినవాళ్లే. తమ తమ పరిమితుల్లోనే, తమ శక్తి మేరే బుద్ధిని చాకచక్యంగా ఉపయోగించి, రాచరిక పాలను వ్యతిరేకంగా ప్రజా ప్రయోజన ఉద్యమాలను నిర్వహించినవాళ్లే. కనుక తెలంగాణలోని ఒగ్గు కథల్లో, బుర్ర కథల్లో, వీధి బాగోతాల్లో వీరి జీవితాలు ఇతివృత్తాలుగా మారిపోయాయి. నిజానికి వీటిని ప్రోత్సహించి, అభివృద్ధి చేసి భవిష్యత్తరాలకు ప్రేరణ అందించడం కోసం కాపాడుకోవాల్సిన బాధ్యత ఆధునిక కాలంలో తప్పకుండా ప్రభుత్వాల మీదనే ఉంటుంది. కానీ కోస్తాంధ్ర సంపన్నవర్గాలు కేవలం సినిమా రంగానికే ప్రాధాన్యతను ఇవ్వడాన్ని ఈ కవి నిరసించాడు.

మరో కవి సిద్దెంకి యాదగిరి రాసిన 'దేవులాట' కవితలో తెలంగాణ జానపద కళలకు జరిగిన అన్యాయాన్ని చిత్రించాడు.

**"సింధు దాసరి దరువులు**
**యక్షగానాలు వీధిభాగోతుల మద్దెల సప్పుడు**
**జడకొప్పు కోలాటంలో గురితప్పని గిరిగీత**
**కోయిల కూతలు ప్రజల గొంతులయ్యేవి**
**రంజిల్లిన ప్రజా కళలు**
**సీమాంధ్ర సినిమాల పెట్టుబడిల**
**విలన్ల భాషకు విలవిలలాడుతుంది**
**పోయిన కాన్నె దేవులాట సురువుజెయ్యాలే**
**యిత్తు వేసిన పొత్తును చిత్తు చిత్తు చేయాలే**
**మన కళలను మనం కాపాడుకోవాలె"**
**(యాదగిరి, సిద్దెంకి. 2014 : 38)**

యక్షగానాలు, వీధి బాగోతాలు, జడకొప్పులు తెలంగాణలో విరివిగా కనిపించే కళారూపాలు. కానీ వీటికి ప్రభుత్వ ఆదరణ కరువైంది. ఈ కళారూపాలకున్న గొప్పదనం వీటిలోని భాష అచ్చతెలుగు భాష. నిజానికి ఈ కళారూపాల్లో వాడే భాషమీద విస్తృతమైన పరిశోధన జరగాల్సిన అవసరం కూడా ఉన్నది. దీనికి కూడా ఎటువంటి ప్రోత్సాహం లభించలేదు. కనుకనే మన కళల్ని మనమే కాపాడుకోవాలి అని తెలంగాణావాదాన్ని వినిపిస్తుందీ కవిత. జానపద కళల్ని ఎట్లా నిర్వీర్యం చేశారో చెప్పేదే గ్యార యాదయ్య రాసిన 'ఎర్కోషి' దీర్ఘ కవిత.

**"సిందు మద్దెల తాళం ఇరిగి**
**కూచిపూడి కుషి ఊసి పూసె**
**శిద్దల రావణ్ణం**

**శిరస్త శిష్తు**

**బొందల బొందిల**

**సిందుబాగోతం**

**ఆసపుచ్చె అరికథల**

**తాశీల్ తాగె బుల్లి తెరల**

**సీనువ పాటల సొన**

**జానపదాల ఎదలమీన**

**బలి బూవిల బాలింత గోరుపై**

**కొందంత గానం**

**అడవి ముక్కెర"**

**(యాదయ్య, గ్యార. 2002 : 14, 15)**

తెలంగాణలోని వరంగల్ జిల్లాలో వేయి స్తంభాల గుడి ఉన్నది. పేరులో ఉన్నట్లే ఈ గుడిలో వేయి స్తంభాలు ఉన్నాయి. అట్లా ఉండటం మాత్రమే కాదు దాని ప్రత్యేకత. ఒక్కో స్తంభం మీద జాలువారిన తెలంగాణ శిల్పకళ చూస్తే కళ్లు పెద్దవి కావాల్సిందే. ఒకరకంగా చెప్పాలంటే తెలంగాణలో కాకతీయు కాలం నుండి విలసిల్లిన శిల్పకళకు వరంగల్ జిల్లా పెట్టింది పేరు. వేయి స్తంభాల గుడి దానికి ఉదాహరణ మాత్రమే. మరోవైపు తెలంగాణ ప్రజల రక్తమాంసాలతో చాలా కళాత్మకంగా నిర్మించినది గోలుకొండ కోట. అది కోటనే కావచ్చు కాని, అది ప్రజా ప్రయోజనార్థం నిర్మించినది కాకపోవచ్చుగాని, నిర్మాణ వైశిష్ట్యంలో మాత్రం ప్రపంచంలో పేరెన్నిక గన్నది. అట్లే చార్మినార్, మక్కామసీదు, హుస్సేన్ సాగర్‌లోని బుద్ధ విగ్రహం, అమరవీరుల స్థూలం మొదలైనవెన్నో తెలంగాణ శిల్ప, నిర్మాణ కళా నైపుణ్యాన్ని పట్టి ఇస్తాయి. వీటిని నిరాదరించినవాళ్లు, వాటి మధ్య సినిమా చిత్రీకరణలు చేసుకోవడం ఒక వైరుధ్యం అని వేముల రంజిత్ కుమార్ రాసిన 'మారణ ఘోషలు' కవిత వివరిస్తుంది.

**"వెయ్యి స్తంబాల మధ్య**
**గోలకొండ ఖిల్లా నడుమ**
**కళల పేరిట కోట్లకు కోట్లు**
**ఎగదోసే వినోద వ్యాపారం**
**తెలంగాణా సజీవ చరిత**
**మాత్రం నిర్జీవమై**
**అక్కడికక్కడే**
**పాతాళలోక సమాధి"**
**(రంజిత్ కుమార్, వేముల. 2011 : 28)**

రామానాయుదు స్టూడియో, అన్న పూర్ణ స్టూడియో, రామోజీ ఫిల్మ్ సిటీ తెలంగాణలో నిర్మించారు. వీటి నిర్మాతలు, సీమాంధ్ర పెట్టుబడిదారులు. వీళ్లే సినిమా నిర్మాతలు కూడా. ఇప్పటిదాకా తెలంగాణ నుండి తెలుగు సినిమా రంగంలో ఉన్న దర్శకులు, నిర్మాతలు, నటీ నటులు కేవలం ఐదు శాతానికి మించదు. తెలంగాణ వారసత్వమైన ప్రజా కళలను నిర్వీర్యం చేసి వ్యాపార కళ అయిన చిత్రరంగాన్ని అభివృద్ధి చేసి, అందులో కూడా తెలంగాణ వారికి స్థానం లేకుండా తొక్కేశారు. ఈ విషయాన్ని కూడా తెలంగాణ కవి తీవ్రంగానే పరిగణించాడు. అందుకే సబ్బని లక్ష్మీనారాయణ రాసిన 'సినిమా ఆడకుంటే ఏంటీ?' కవితలో ఇట్లా ప్రశ్నించాడు.

**"మా కోసం పాటుపడని, మా కోసం తపించని**
**మీ సినిమాలు చూడడం మాకెందుకు?**
**తెలంగాణా బంగారు గుడ్డు పెట్టే బాతు కదా మీకు?**
**తెలంగాణా పాలిచ్చే పాడి ఆవు కదా మీకు?**
**బంగారు గుడ్లు మాత్రమే తీసుకొని, పాలు మాత్రమే గుంజుకొని త్రాగి**
**మా బతుకుల్ని పట్టించుకోని కళాకారులారా**
**సినీ నటులారా! నిర్మాతలారా! దర్శకులారా!**

**మీ సినిమాలు మేమెందుకు చూడాలి?"**

**(లక్ష్మీనారాయణ, సబ్బని. 2010 : 44)**

నిరాకరణ ఒక ఉద్యమంగా రూపొందించిన దేశం ఈ దేశం. తమది కానిదాన్ని తమ మీద రుద్దే ఏ ప్రయత్నాన్నైనా తిరస్కరించడం, నిరాకరించడం ప్రజలకు ఉండే హక్కు. తెలంగాణ ప్రజలు తెలంగాణ వ్యతిరేక సినిమాలు చూడటం అనే పని చేసినప్పుడే తెలంగాణ వారికి న్యాయం జరుగుతుందనేది ఈ కవిత విశ్లేషణ.

తెలంగాణ గానకళకు పెట్టింది పేరు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలం నుండి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం దాకా అనేక కుల, వర్గ పోరాటాల్లో వేలాది పాటలు వచ్చాయి. వందలాది వాగ్గేయకారులు ప్రజల భాషలో, భావాలను పాటలుగా మలిచారు. నాజర్, బండి యాదగిరి, సుద్దాల హనుమంతు, గద్దర్, చెరబండరాజు, దయా నర్సింగ్, డప్పు రమేశ్, నందిని సిధారెడ్డి, మాభూమి సంధ్య, మిట్టపల్లి సురేందర్, దేశపతి శ్రీనివాస్, దరువు ఎల్లన్న, పసునూరి రవీందర్, ఏపూరి సోమన్న, ఎర్ర ఉపాలి, గోరటి వెంకన్న, వరవరరావు మొదలైనవాళ్లు తెలంగాణ పాటకు ప్రపంచ ఖ్యాతి తెచ్చిపెట్టారు. పాట రాయడం ఒక ఎత్తైతే పాడటం మరొక ఎత్తు. ప్రపంచస్థాయి వాగ్గేయకారుడైన గద్దర్ స్వయంగా కవి, గాయకుడు. భారతదేశంలో మహిళా గాయకురాళ్లకే పెద్దమ్మ వంటి విమల పాడే పాటలు రాసేది ఆమె సహచరుడు మిత్ర. తెలంగాణలో పాటలు రాసి పాడేవాళ్లు, కేవలం పాడేవాళ్లు రెండు రకాల వాళ్లు ఉన్నారు. పాటలోని సాహిత్యం ఎంత గొప్పగా ఉన్నా పాడేవాళ్ల నైపుణ్యం లేకపోతే పాట ప్రభావం చూపలేదు. పాడేవాళ్లు ఎంత నైపుణ్యంతో పాడినా పాటలోని సాహిత్యం, సారం గొప్పగా లేకపోయినా పాట మనుషుల్ని వెంటాడదు. ఈ రెండు నైపుణ్యాల్ని గద్దర్ వలె వంటబట్టించుకున్నది తెలంగాణ గానకోకిల బెల్లి లలిత. తెలంగాణ సమాజాన్ని నిద్రలేపి ఉద్యమంలోకి ఉరికించిన ఘనత ఆమెది. ఆమె మీద కనీసం వంద పాటల్ని వాగ్గేయకారులు రాసి పాడారు. వందలాది కవితలు కూడా వచ్చి ఉన్నాయి. సిద్దెంకి యాదగిరి రాసిన 'మా కోసం వస్తున్నావా..?' కవిత కూడా బెల్లిలలిత గురించి వివరిస్తుంది.

**“కలమెత్తిన కవితల మీద గురి**
**గళమెత్తే కంఠ స్వరాలకు ఉర్లు**
**పదహారు ముక్కలయిన పాట దేహం**
**భువనగిరి గంగ బాయిల్ల కలిసే**
**దూసుక వచ్చిన తూటాలు ఇంకా**
**వెన్నెముక కెలుకనే వట్టే**
**సర్కార్ పారదర్శకతకు నిందితుల జాడ దొరకకపాయే**
**దాతృత్వ పాలన మీది”**
**(యాదగిరి, సిద్దెంకి. 2014 : 96)**

రాయలసీమ ప్రాంతానికి చెందిన నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బెల్లి లలితను హత్య చేయించినట్లు తెలంగాణ సమాజపు విశ్లేషణ. బెల్లి లలితది నల్గొండ జిల్లాలోని భువనగిరి. ఆమె తన పాటలతో ఆనాటి ప్రభుత్వం తెలంగాణకు ఎట్లా అన్యాయం చేసిందో వివరించింది. తెలంగాణలోని పల్లెపల్లెలో తిరుగుతూ సీమాంధ్ర ప్రభుత్వాల వివక్షాపూరితమైన ధోరణుల్ని ఎండగట్టింది. తెలంగాణ ప్రజలకు సీమాంధ్ర పాలకులు ఎంతటి అన్యాయాన్ని చేస్తున్నారో, తెలంగాణ ప్రజల బతుకుల్ని ఎలా విధ్వంసించారో పాడుతూపోయింది. ఈ క్రమంలోనే ఆమెను కిరాయి గూండాలతో చంద్రబాబు నాయుడే చంపించినట్లు తెలంగాణ ప్రజల విశ్వాసం. ఆమె హత్య ఒక హెచ్చరికలా ఉండాలని ఆమె దేహాన్ని పదిహేడు ముక్కలుగా నరికి పదిహేడు స్థలాల్లో పడేశారు. తల భువనగిరిలోని ఒక బాయిలో లభించింది. ఆనాటి ఆంధ్రప్రదేశ్‌లో ఈ హత్య ఒక సంచలనం. ఆమెను చంపవల్సిన అవసరం ఉన్న మనుషుల్ని బట్టి పరిశోధనలు జరిపినవారు చంద్రబాబు నాయుడే హంతకుడు అని తేల్చారు. అనేక నిజనిర్ధారణ కమిటీల రిపోర్టులు కూడా ఈ విషయాన్నే ధృవీకరించాయి. అంతమాత్రమేకాదు ప్రపంచాన్నే ఆకర్షించిన గద్దర్ కూడా ప్రత్యేక తెలంగాణ పాటలు పాడుతున్నాడని అతని మీద కూడా హత్యాయత్నం చేశారు. కొన ఊపిరితో రక్తపుమడుగులో ఉన్న గద్దర్‌ను కూడా అష్టకష్టాలమీద తెలంగాణ సమాజం బ్రతికించుకున్నది. వరంగల్ జిల్లాకు

చెందిన ఐలన్న అనే వాగ్గేయకారుడిని పద్మాక్షమ్మ గుట్టల్లో చంపేసి దాని పేరును ఎన్‌కౌంటర్ జాబితాలో చేర్చారు. ఇట్లా తెలంగాణలోని గాన కళలను సీమాంధ్ర ప్రభుత్వాలు అణచివేయడం కోసం శతవిధాలా ప్రయత్నించాయి.

స్థూలంగా తెలంగాణ కళను పనిగట్టుకుని నిర్వీర్యం చేయడం కోసమే సీమాంధ్ర పాలక వర్గాలు ప్రయత్నించాయని తెలంగాణ కవుల భావన. అందుకే తమకు ప్రత్యేక రాష్ట్రం కావాలని కవిత్వం రాశారు.

## 4.14. సంస్కృతి

ఆరు దశాబ్దాల ఉమ్మడి జీవనంలో తెలంగాణ సంస్కృతి దారుణంగా పరాయీకరణకు గురైంది. ఏ ప్రజా సమూహానికైనా తనదైన సంస్కృతిని కోల్పోవల్సి రావడం కన్నా విషాదం మరొకటి ఉండదు. ఎందుకంటే సంస్కృతే సమూహాన్ని నడిపించే చోదక శక్తిగా పనిచేస్తూ ఉంటుంది. తెలంగాణలో ఆదినుండీ ద్రావిడ సంస్కృతి విలసిల్లుతూ వచ్చింది. సీమాంధ్ర పాలకులు ప్రవేశపెట్టిన ప్రపంచీకరణ ఫలితంగా తెలంగాణ సమాజంలో ఒక పరాయీకరణ సంస్కృతి అలవాటు అయింది. పండుగలు, వేడుకలు జరుపుకున్నప్పుడు బతుకుదెరువు కోసం వలస వెళ్లినవాళ్లు కూడా తమ తమ ఊళ్లకు వచ్చేవాళ్లు. విడిపోయిన మనుషులందరూ కలవడమన్నది కనీసం సంవత్సరానికి ఒకసారైనా జరిగేది. కానీ జీవితాలు మరీ ఇరుకైపోయే వాతావరణాన్ని తయారు చేసింది ప్రపంచీకరణే అని చెప్పాలి. మనిషి, సమూహ లక్షణాలతో జీవించడం స్థానే ఒక వ్యాపార ఉపకరణంగా మారిపోవడం అది తీసుకువచ్చిన మార్పు. దీన్ని తెలంగాణ కవి సూక్ష్మస్థాయి నుండే అర్థం చేసుకున్నట్లు కనిపిస్తుంది.

జయధీర్ తిరుమలరావు 'ఇది వంద యుద్ధాల ఒడి' కవితలో తెలంగాణ పండుగలను సీమాంధ్రులు సొంతం చేసుకోకపోవడం గురించి ఇట్లా రాశారు.

**“నువ్వెప్పుడైనా నా బతుకమ్మ పాటకి పల్లవైనావా**

**నువ్వెప్పుడైనా కొమిరెల్లి మల్లన్న ‘పట్నం’ చూశావా**

**నువ్వెన్నడైనా సమ్మక్క జాతరల భాగమయ్యావా**

**నువ్వొక ఏలియన్‌వి**

**ప్రజల్ని పరాయీకరించిన రూలర్‌వి”**

**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 49)**

బతుకమ్మ దేశం మొత్తం మీద కేవలం తెలంగాణలో మాత్రమే కనిపించే ఒక శ్రామిక పండుగ, ఒక ప్రకృతి పండుగ. కానీ ఈ పండుగను సీమాంధ్రులు జరుపుకోరు. అట్లే కొమిరెల్లి మల్లన్న, సమ్మక్క సారక్కల జాతరల్లో సీమాంధ్రులు భాగం కారు. పైగా వీటి నిర్వహణకు ప్రభుత్వం కేవలం ముక్కుతుడుపు బాధ్యతలు మాత్రమే చేపట్టింది. కానీ ఆంధ్రాలో జరిగే వేడుకలకు, పుష్కరాలకు కోట్లాది రూపాయలు వెచ్చించి ఏర్పాట్లు చేస్తుంది. తద్వారా తెలంగాణ సంస్కృతిని కూడా కించపరుస్తుంది. మరోవైపు తెలంగాణకు ఎటువంటి సంబంధంలేని అనేక సీమాంధ్ర పండుగల్ని తెలంగాణ మీద రుద్ది, ఇది మనందరి పండుగ అని ప్రచారం చేశారు. అదే ప్రచారం తెలంగాణలోని బతుకమ్మకు, అట్లతద్దెకు కల్పించలేదు. సీమాంధ్రల్లో ఇవీ మన పండుగలే అని జరపలేదు. కనుకనే మీ పాత్ర మమ్మల్ని పరాయీకరణకు గురిచేయడం మాత్రమే అని చెప్పడం ఈ కవిత ఉద్దేశ్యం. వడ్డెబోయిన శ్రీనివాస్ రాసిన ‘సమైక్య శాపం’ దీర్ఘ కవితలో కూడా సరిగ్గా ఇదే విషయం వ్యక్తం అయ్యింది.

**“అక్కడ**

**అట్లతద్దె**

**ఇక్కడ బతుకమ్మ**

**ఇంకా మెటఫర్లెందుకు**

**ఆ కలల్నే చింపుకోవాలి**

**వేర్లలోనే వేరుపురుగు”**

**(శ్రీనివాస్, వడ్డెబోయిన. 2010 : 11)**

ఒకే భాష మాట్లాడే రెండు భిన్నమైన చారిత్రక నేపథ్యం కలిగిన ప్రాంతాలను కలిపి భాష పునాదిమీద ఒక రాష్ట్రంగా ఏర్పాటు చేసినప్పుడు, ఆ రెండింటి మధ్య వైమనస్యాలు కలగడానికి సాంస్కృతిక కారణాలే ప్రధానంగా ఉంటాయి. డా॥ఎ.జయంతి రాసిన 'మా పిల్లల్ని ఎందుకు చంపుతున్నారు?' కవిత అదే విషయాన్ని తెలియజేస్తుంది.

**"రాష్ట్రమొక్కటే రాగం వేరు**
**తిండి వేరు పండుగలు వేరు**
**నీతి వేరు రీతి వేరు**
**అసలు మా బ్రతుకులే వేరు"**
**(జగన్ రెడ్డి, ఎస్(సంపా). 2012 : 149)**

రెండు భిన్నమైన సంస్కృతుల సమ్మేళనం ప్రజాస్వామిక పద్ధతిలో జరిగినప్పుడు ఇరు సంస్కృతులకు గౌరవం దక్కుతుంది. కానీ తెలంగాణ ప్రజల సంస్కృతిని తొక్కిపెడుతూ, ఆంధ్ర సంస్కృతే అసలు సంస్కృతి అని ప్రచారం చెయ్యడం అసలు సమస్యలకు మూలం. అందుకే తెలంగాణ కవి ఆగ్రహంతో అసలు మా బ్రతుకులే వేరు అని ప్రకటించాడు.

పాఠశాల విద్య ప్రతి విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైన దశ. సమాజంతో సంభాషణ జరపడం మొదలుపెట్టడమన్నది పాఠశాల స్థాయి నుండే అలవడుతుంది. అంటే పిల్లల జ్ఞానం వికసించడం పాఠశాలలోనే మొదలవుతుంది. ఈ విషయం ఎవరికైనా తెలిసిన విషయమే. అయితే, తెలంగాణ విద్యార్థులు మాత్రం అనేక ఇతర భాషల మాదిరిగానే (ఆంగ్లం, హిందీ) పరాయి తెలుగులో పాఠ్యాంశాలు చదువుకోవాల్సిరావడం శోచనీయమని 2003లో తైదల అంజయ్య రాసిన 'తెలంగాణా స్కూల్ అసెంబ్లీ' కవిత వివరిస్తుంది.

**"మనదిగాని భాషల చదువుతున్నం**

**పాలిభాషల పాఠమెట్ల అర్థమైతది?**
**తెలుగు పాఠం చెపుదామంటె**
**మన జానపద దు:ఖాలు వినబడుతున్నయ్**
**గణిత పాఠ్యాంశపు లాభనష్టాల లెక్కల్లో**
**మా నష్టాలే ఎక్కువ**
**ఇక నుంచి అట్లగాదు**
**సాంఘిక శాస్త్ర ప్రశ్నాపత్రంలో**
**తెలంగాణా సంస్కృతిని గురించి రాయండి అని**
**వందమార్కులకూ ఒకటే ప్రశ్న అడుగుతాం**
**ఆఖరి పీరియడులో నల్లబల్ల మీద**
**గుండెపటం గీద్దామంటే**
**అది తెలంగాణా చిత్రపటమయింది"**
**(అంజయ్య, తైదల. 2006 : 102)**

ప్రపంచీకరణ కారణంగా చేతి, కుల వృత్తులు ధ్వంసం కావడం, వ్యవసాయం నష్టాలను మిగల్చడంతో గ్రామాలకు గ్రామాలే బదిలీ అయ్యే పరిస్థితి తెలంగాణ వ్యాప్తంగా కనిపిస్తుంది. దేశానికి పల్లెలే పట్టుగొమ్మలు అని చెప్పుకునే భారతీయ సమాజంలో పల్లెలు ఖాళీ అయ్యి ఉపాధి అవకాశాలకోసం పట్టణాలకు తరలి అక్కడే జీవితాంతం బతకాల్సి రావడం వల్ల పల్లెలు వల్లకాడు వాతావరణాన్ని తలపిస్తున్నాయి. ఈ విషయాన్నే ఎస్వీ సత్యనారాయణ కవిత్వం చేశాడు. ఆయన రాసిన 'మనసులో గోడలు' కవితలో ఇట్లా అంటాడు.

**"ఆ గోడల్ని కూలగొట్టకండి**
**అక్కడి ప్రతి ఇటుకకూ**
**నా జ్ఞాపకాల స్పర్శ ఉంది**
**ప్రతి మట్టి రేణువులో**

**నా రక్తకణాల ప్రతిధ్వనులున్నాయి"**

**(రమేశ్, సుంకర(సంపా). 2008 : 117)**

తెలంగాణ సంస్కృతిలో అనేక పండుగలు ఉన్నా దసరా పండుగకు ముందు జరుపుకునే బతుకమ్మ పండుగకు ప్రత్యేకత ఉన్నది. తెలంగాణలోని శ్రామిక సమాజం ప్రకృతి ఒడిలోనే ఎక్కువగా జీవించడం కారణంగా పచ్చదనంతో, పూలతో ఎక్కువ అనుబంధం కలిగి ఉన్నది. ఆ అనుబంధంతోనే పురుషాధిపత్యానికి బలైన (చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న) ఆడపిల్లను బతికించుకోవడం కోసం ప్రతియేటా నువ్వు బతుకమ్మా అని పూలను నీటిలో వదిలి ప్రకృతి దేవతను పూజిస్తారు. రంగురంగుల పూలను ఏరి అద్వితీయమైన నిర్మాణకళతో పొందికగా పూలను అమరుస్తారు. ఒకచోట నేలమీద బతుకమ్మను ఉంచి దానిచుట్టూ యువతులందరూ చేరి బతుకమ్మను బతకమని కోరుకుంటూ బతుకమ్మ పాటలు పాడతారు. కొన్ని మినహాయింపులతో తెలంగాణలోని అన్ని ప్రాంతాలలో బతుకమ్మ పండుగ కనిపిస్తుంది. ఆ పండుగంటే పడుచు పిల్లలందరికీ ఒక వేడుక. ఇప్పుడది ఒక పురాస్మృతిగా మారింది. దాన్ని తలపోసుకోవడం తెలంగాణ కవికి అలవాటుగా మారింది. కందుకూరి శ్రీరాములు రాసిన 'రావురూకుల' కవితలో అదే కనిపిస్తుంది.

**"బతుకమ్మ పండుగంటే**
**పూలకోసం వెతుకమ్మ అనేవాళ్ళు**
**ఎన్ని రకాల పూలో**
**వేటగాడు తిరిగినట్టు**
**పూలకోసం వలపన్నేవాళ్ళం**
**మోపులు కట్టుకొని తెచ్చి**
**రంగులద్ది**
**సద్దుల బతుకమ్మ పండక్కి**
**గుమ్మలోలె పేర్చేవాళ్ళం**

**ఇంటింటి బతుకమ్మలు**
**కచ్చేరు ముందుకు రాగానే**
**ఈతవనం ఊనినట్టుండేది**
**పట్టుచీరెలు చుట్టూ తిరుగుతూ**
**చప్పట్లతో ఉయ్యాల పాటందుకునేవాళ్ళు**
**ఆ ఆట**
**ఆడపడుచుల అందాల ఇంద్రధనుస్సది**
**దసరా సరదా మగవాళ్ళదే**
**పాలపిట్టలకోసం పజ్జొన్న కంకుల కోసం**
**కొత్త బట్టలు వేసుకున్న మనుషుల మంద**
**కొంగల గుంపుల్లా**
**అలాయ్ బలాయ్ చేసుకోటానికి**
**అంతా ఊరు సాయంత్రం కదిలేది"**
**(శ్రీరాములు, కందుకూరి. 2009 : 33, 34)**

తెలంగాణలో గ్రామాలు ఖాళీ అయిన తర్వాత ఏర్పడిన విషాద వాతావరణాన్ని పగడాల నాగేందర్ రాసిన 'జోలి' కవిత వర్ణించింది.

**"ఈ మట్టె మొలచిన ఆత్మల్ని**
**మల్చుకొచ్చిన కన్నీటి కాలం**
**వెయ్యేండ్ల గాయాల్ని కెలుకుతుంది**

**ఇప్పుడిక - బోనం కుండల్లో**
**చేయి జొనిపి తిన్న వెన్నెల ముద్దల్లేవు!**
**జాతరలో వేలాడదీసిన చిలుకల దండల్లేవు!**
**దరిద్రాన్ని మరిపించిన మోట పాటల్లేవు!**

**బుగులు బుగులైన ఈ నేలంతా**
**ఏ తల్లి సాపెనో**
**ఈ పీనుగుల పెంటల్లో**
**జంగపోళ్లమై తిరుగుతున్నం**
**బొందల గడ్డలకు కాటి పాపలమై**
**కాపలా కాస్తున్నాం!"**
**(స్కైబాబ(సంపా). 2010 : 164)**

పీనుగుల పెంటలు అనే పదబంధ ప్రయోగం ద్వారా తెలంగాణ పల్లెల్లోని విషాదభరితమైన వాతావరణాన్ని తెలియజేశాడు. 'బుగులు' అంటే భయం. తెలంగాణ నేలంతా భయం భయం కావడానికి పల్లె వల్లెకాడు కావటమే అని చెప్పడం ఈ కవిత ఉద్దేశ్యం.

ఒక ఇరవయ్యవ శతాబ్దం చివరి దశాబ్దం వరకూ పిల్లలందరికీ అమ్మమ్మ వాళ్ల ఊరుతో విడదీయలేని అనుబంధం, అనురాగాల అనుభవాలు ఉండేవి. కానీ ప్రపంచీకరణ తీసుకువచ్చిన యాంత్రిక జీవితాలకు అలవాటు పడిన మనుషులు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా మారిపోయారు. దీని కారణంగా పిల్లలకు అమ్మమ్మవాళ్ల ఊరు, ఆ ఊరిలోని అమ్మమ్మ, ఆమె చెప్పే కథలూ, వారు చూపే వాత్సల్యం ఏవీ అనుభవించడానికి వీలు లేకుండా పోయింది. ఆ విషయాన్నే కోదూరి విజయ కుమార్ రాసిన 'జున్నుపాల వాసన' కవిత వివరిస్తుంది.

**"నర్సంపేట.. అమ్మమ్మ వాళ్ళ వూరు..**
**చందమామ కథల్లాంటి వూహల్ని అనుభవంలోకి తెచ్చి**
**యిప్పటికీ నా స్మృతుల దొంతరల్లో**
**అత్యంత నవీనంగా వున్న మంత్రనగరి**

**ఆంక్షల్లేవు.. క్రమశిక్షణ శిక్షల్లేవు**

**మంత్రనగరి విడిదిలో నేనొక యువరాజుని**

**...**

**ఇప్పుడక్కడ అమ్మమ్మల్లేరు, మావయ్యల్లేరు**

**దూడలేదు, పశువుల కొట్టం లేదు, జున్నుపాలు లేవు**

**తడికల టాకీసూ లేదు..”**

**(విజయకుమార్, కోడూరి. 2010 : 40, 41)**

యాంత్రిక సంస్కృతిలో పిల్లలు అమ్మమ్మల ఇంటికి పోయేవాతావరణం లేకపోవడం నాణేనికి ఒకవైపు అయితే, అసలు అమ్మమ్మ వాళ్ల ఊర్లో కూడా గతకాలపు వాతావరణం లేకపోవడం మరో కోణం. కేవలం మనుషులు మాత్రమే కాదు, మనుషుల్లో మనుషులుగా మెలగిన పశువులు, వాటి ప్రేమా ఏవీ నిలిచి లేవు. పైగా చిన్నప్పుడు తడికలతో నిర్మించిన సినిమా టాకీసు కూడా లేదని, అంటే బాల్యంలో తాను చూసిన తెలంగాణ సంస్కృతి ఇవాళ మచ్చుకైనా కనిపంచడంలేదని చెప్పడం కవి ఉద్దేశ్యం.

ఇంతకు ముందే చెప్పినట్లు బతుకమ్మ ఒక పండుగ మాత్రమే కాదు, ఎక్కడెక్కడో జీవిస్తున్న మనుషుల్ని ఒక్క దగ్గరికి తీసుకొచ్చే ఒక వేడుక కూడా. అంటే మనుషుల అనుసంధానకర్త పాత్ర నిర్వహించేదని అర్థం. అందుకే కాంచనపల్లి రాసిన ‘బతుకమ్మ’ కవితలో వైయక్తిక జీవితాల ఇరుకుల్లోంచి సమూహ సంస్కృతిలోకి తీసుకురావడానికి బతుకమ్మ పండుగను పిలవడం ఈ కవిత ఉద్దేశ్యం.

**“నగరీకృత కాలకూటముల మాటున**

**కృత్రిమ జీవన సూత్రాల**

**మిథ్యాగౌరవాల మాటున**

**నువ్వేమైపోయావు బతుకమ్మా**

**ఈ యాంత్రిక యుగధర్మాన్ని**

**తిరస్కరించి**

**మళ్ళీ మాలో బతుకు బతుకమ్మా"**

**(గౌరీశంకర్, జూలూరు(సంపా). 2002 : 100)**

ప్రపంచీకరణ సంస్కృతిని నిరసిస్తూ తెలంగాణలో విస్తృతమైన వచన కవిత్వం వచ్చింది. ప్రపంచీకరణ వ్యతిరేక తెలుగు కవిత్వం పేరు మీద విశ్వవిద్యాలయ స్థాయి పరిశోధనలు కూడా జరిగాయి. కవిత్వం భావోద్రేకాలకు సంబంధించిన సాహిత్య ప్రక్రియ కాబట్టి సహజంగానే ఒక పచ్చటి సమాజాన్ని, సజీవ సంస్కృతిని చూసిన మనుషులు కాంక్రిట్ జంగల్ సంస్కృతిని చూసినప్పుడు కలత చెందుతారు. ఒకవైపు ప్రపంచమంతా ఒక కుగ్రామం అని చెప్తూనే, ప్రపంచ ఏకీకరణ అని చెప్తూనే మరోవైపు మనుషుల్ని మరయంత్రాలుగా మార్చేయడాన్ని దర్భశయనం శ్రీనివాసాచార్య 'గ్లోబల్ విలేజ్' కవితలో వివరించారు.

**"గ్లోబల్ విలేజ్!**

**ఒక దుష్ట సమాసం!**

**కడుపులో కత్తిదించి**

**కావలించుకోవడమంటే ఇదే!**

**కలిసిపోవడం పల్లెతనం**

**విడగొట్టడం గ్లోబల్ సూత్రం**

**తప్పుడు పదబంధంతో**

**పల్లెనవమానించొద్దు**

**బతుకుల్ని విడగొడ్తూ**

**పదాల్ని కలపడం నేరవ్యాకరణమే!"**

**(శ్రీనివాసాచార్య, దర్భశయనం. 2004 : 67)**

ఈ కవితలోని చివరి రెండు పాదాలను పరిశీలిస్తే మొత్తం ప్రపంచీకరణ సంస్కృతి సారాంశం అర్థం అవుతుంది. రాజకీయ ప్రయోజనాల కోసం చెప్పేమాట ప్రపంచం అంతా ఒక్కటే, మనుషులందరమూ కలిసి జీవించవల్సిందే, కనుక ఇదొక కుగ్రామమనీ, స్వేచ్ఛా వ్యాపారం చేసుకోవచ్చనీ, ప్రపంచాన్నీ ఏకీకరించాలని. కానీ వాస్తవంలో జీవన రంగాలను ధ్వంసం చేసి బతుకుల్ని నాశనం చేయడమే గ్లోబలైజేషన్ సారం అని ఈ కవిత వివరిస్తుంది.

ప్రపంచీకరణ సంస్కృతి తీసుకువచ్చిన అతి ముఖ్యమైన మార్పుల్లో పల్లెలోకి సైతం టీవీలను, కేబుల్ నెట్‌వర్క్‌ను పంపడం. చిన్నపిల్లలు మొదలు పండు ముసలివాళ్లదాకా అందర్నీ టీవీలకు కట్టిపడేసి సరికొత్తగా జీవించడం ఎలాగో, ఆలోచించడం ఎలాగో టీవీ నేర్పుతుంది. పిల్లలు ఏం తినాలో, ఏం మాట్లాడాలో, ఏం ఆటలు ఆడాలో, ఏవి గౌరవనీయాలో టీవీనే చెప్తుంది. అత్త కోడలిని ఎలా హింసించాలో, కోడలు అత్తను ఎలా నిర్లక్ష్యం చేయాలో, మనుషులు ఒకరిని ఒకరు ఎట్లా వాడుకొని వదిలేయాలో, ఎలా ద్వేషించాలో చెప్పడం ఈ టీవీల లక్ష్యం. పైగా వివిధ కార్యక్రమాల మధ్యలో వచ్చే వాణిజ్య ప్రకటనలు మనిషి ఆలోచనా విధానం మీద, వినియోగించే వస్తువుల మీద నియంత్రణ సంపాదించాయి. కనుక ఇవాళ తెలంగాణ పల్లెలు విష సంస్కృతిలో మునిగి తేలుతున్నాయని చెప్తూ, దానికి మూలకారణాన్ని కూడా చెప్పాడు పి.మేఘరాజు. ఆయన రాసిన 'ప్రజాస్వామిక తెలంగాణ' కవితలో ఈ విషయాలన్నీ భాగంగా ఉన్నాయి.

**"ఒకప్పటి నా పల్లె జీవనానికి వందనాలు!**
**బహుళజాతి కంపెనీల టీవీలు**
**విష సంస్కృతి ఇవ్వాల్టి నా పల్లెలు**
**వాటికి రాచమార్గం వేసిందీ రాజ్యం**
**అందుకే మూల్యం చెల్లించక తప్పదు**
**చక్కని సంస్కృతి గల్ల నా తెలంగాణ పల్లెలు**
**ఇవ్వాళ కూలిపోతున్నాయి**

**దోపిడీ వర్గాల విష సంస్కృతిలో**
**అందుకే బిగించాలి పిడికిలి ఈ రాజ్యంపై**
**సామ్రాజ్యవాదపు అడుగుజాడల్లో**
**ఇవ్వాల సమాజపు హితవు మరిచిందీ రాజ్యం"**
**(బుచ్చిరెడ్డి, కోమటిరెడ్డి(సంపా). 2012 : 26)**

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం నడుస్తున్న కాలంలో అనేక దీర్ఘ కావ్యాలు వెలువడ్డాయి. పూర్తిస్థాయిగా తెలంగాణ ఉద్యమమే వస్తువుగా ఈ కవిత్వం వెలువడింది. మొత్తం ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికే విద్యార్థులు కేంద్రస్థానంగా ఉండటం కారణంగా ఉద్యమం వల్ల వారు ప్రభావితం అయినంతగా మరెవరూ కాలేకపోయారు. పాఠశాలలు మొదలు విశ్వవిద్యాలాలయాల దాకా విద్యార్థుల చైతన్యం తెలంగాణను కదిలించింది. ప్రధానంగా ఉస్మానియా, కాకతీయ, హైదరాబాదు విశ్వవిద్యాలయాల విద్యార్థులు మేధో, భౌతిక రంగాల్లో చేసిన కృషి, తెలంగాణ సమాజం మీద వేసిన ప్రభావం కొలవలేనిది. 1969 ఉద్యమ ఫలితంగా వచ్చిన హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధక విద్యార్థి పసునూరి రవీరందర్ ఉద్యమం నడుస్తున్నప్పుడు భాగస్వామిగా ఉంటూ, వివిధ చర్చల్లో పాల్గొంటూ తెలంగాణ వాదాన్ని ప్రతిభావంతంగా వినిపించాడు. ఆయన రాసిన 'లడాయి' దీర్ఘకవితలో అనేక ఉద్యమ సంగతులు, లక్ష్యాలు, ఉద్దేశ్యాలు వ్యక్తం అయ్యాయి.

**"పొక్కిలైన మా వాకిల్లు**
**పచ్చటి బంతిపూలను కలగంటున్నయ్**
**పడావు పడ్డ మా ఇండ్లు**
**పసిపిల్లల పాలబుగ్గల నవ్వుల్ని రూపిస్తున్నయ్"**
**(రవీందర్, పసునూరి. 2010 : 44)**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే స్వయం నిర్ణయాధికారం వస్తుందనీ, ప్రాంతీయ పాలకులు నిలదీయడానికి కూడా అందుబాటులో ఉండటం కారణంగా పాలన సరిగ్గా

లేకున్నా సరిదిద్దుకుంటామనీ, మా రాష్ట్రం మాకొస్తే మా జీవితాలను పునరుద్ధరించుకుంటామని, మా సంస్కృతిని మేము పున:స్థాపించుకుంటామని ఈ కవిత వ్యక్తం చేస్తుంది.

స్థూలంగా ఈ కవిత్వమంతా ప్రత్యేక తెలంగాణ ఉద్యమ మూలాల్లోని సాంస్కృతిక కోణాన్ని విశదీకరిస్తూనే, రాష్ట్రం ఏర్పడితే ఉండబోయే లేదా పునరుద్ధరించుకోబోయే సంస్కృతి గురించి కూడా చెప్తుంది.

## 4.15. ఆదివాసులు

నిజాం పాలన దాకా తెలంగాణ ఆదివాసులు అణచివేతను ఎదుర్కుంటూనే ఉన్నారు. ఆ తర్వాత సీమాంధ్ర పాలకుల విధానాల కారణంగా నయా హింసను ఎదుర్కోవాల్సి వచ్చింది. అంతకు ముందు తాము తరతరాలుగా ఆధారపడుతూ వచ్చిన పోడు వ్యవసాయ పద్ధతి మీదా, పూర్తిగా ప్రకృతి మీద ఆధారపడే జీవన విధానం మీదా విపరీతమైన అణచివేత కొనసాగింది. వాళ్లు జీవించే, వాళ్లకు సర్వాధికారాలు ఉండాల్సిన అడవినే వారిది కాకుండా చేసే ప్రయత్నాలు సాగాయి. అందుకే కొమురం భీము, రాంజీ గోండువంటి ఆదివాసీ యోధులు పోరాటం చేయవల్సి వచ్చింది. ఆ తర్వాత దేశానికి స్వాతంత్ర్యం రావడంవల్ల ఆదివాసీలను అర్థం చేసుకునే ప్రభుత్వ పాలన ఉంటుందని అందరూ అనుకున్నారు. కానీ అనేక ఆదివాసీ పోరాటాలు చేయవల్సి రావడం, ఆ తర్వాతనే ఐటీడీయే వంటి సంస్థలు రావడం, వాటి పనితీరు కూడా పాక్షికంగానే ఉండటం ఆదివాసీ జీవన విధ్వంసంలోని ఒక కోణం. మరోవైపు ఆదివాసీలు జీవించే నేల కింద విస్తారమైన ఖనిజ సంపద దాగి ఉన్నది. వాటిని దోచుకోవడం కోసం ఆదివాసీలు తరతరాలుగా జీవిస్తున్న గూడాల్ని బలవంతంగా ఖాళీ చేయిస్తున్నారు. ఎదురు తిరిగినవాళ్లను నిర్దాక్షిణ్యంగా చంపేస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని నల్లమల అటవీ ప్రాంతాల్లో డీబేర్ అనే ముత్యాల కంపెనీ ఆ ప్రాంతంలో విలువైన వజ్రాలు ఉన్నట్లు గుర్తించి, సీమాంధ్ర ప్రభుత్వ సహాయం అడిగితే పోలీసులే స్వయంగా అక్కడి చెంచుల్ని

ఖాళీ చేయించారు. మరోవైపు ఆదివాసీలు కూడా ఈ దేశంలోని ప్రజలే అని గుర్తించి వారి మౌలిక అవసరాలు తీర్చే బాధ్యత తీసుకున్న ప్రభుత్వం ఏదీ లేదు. విద్య, వైద్యం, ఇతర సదుపాయాలు వారికి ఇంకా అందుబాటులోకి రానేలేదు. క్రితం అధ్యాయంలో చర్చించినట్లు వారికి అనారోగ్యం చేసి వందలాది మంది చనిపోయిన దాఖలాలు ఉన్నాయి. అయినా ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదు. ఈ విషయాలన్నీ తెలంగాణ కవికి అర్థం అయ్యాయి. అందుకే ప్రత్యేక తెలంగాణ కవిత్వంలో ఆదివాసీల సమస్యల్ని ఒక ముఖ్య వస్తువుగా ఎంచుకుని కవిత్వం రాశారు.

ఆదిలాబాద్ జిల్లాలోని అటవీ ప్రాంతంలో విస్తారమైన ఖనిజ వనరులు ఉన్నట్లు భూగర్భ శాస్త్రవేత్తలు గుర్తించారు. వాటిని తవ్వుకుని అమ్ముకోవడం కోసం సీమాంధ్ర పాలకులు చేయని ప్రయత్నం లేదు. చివరికి ప్రజామోద ముద్ర కోసం వన్యప్రాణులన్నీ అంతరించి పోతున్నాయనీ, మన రాష్ట్రంలో పులుల సంఖ్య రోజురోజుకీ తగ్గిపోతున్నదనీ, కవ్వాల్ ప్రాంతంలో పులులు స్వేచ్ఛగా సంచరించడం కోసం టైగర్ జోన్ నిర్మిస్తామని ఆదివాసీలను ఖాళీ చేయించారు. టైగర్‌జోన్ నిర్మిస్తామని ఆదివాసి గూడాలను విస్తాపించడాన్ని నిరసిస్తూ బిల్ల మహేందర్ 'పేగుబంధాలు' కవితలో ఇట్లా రాశాడు.

**"ఎక్కడ వెతికినా**
**ఆనవాళ్ళు!**
**అంతా పరిచయాత్మక**
**సంభాషణలు!!**

**చెట్టుపుట్ట**
**చేను చెలక**
**ఏరు సెలయేరు**

**పక్షుల కిలకిలలు**

కోయిల కుహకుహలు
ఆకుల గలగలల సవ్వడులు
విడదీస్తే వీడిపోయే బంధాలా?

ఏళ్ల తరబడి
అడవితల్లి దేహంతో
అణువు అణువై
అల్లుకున్న పందిరివోలే
పెనవేసుకొని చిగురించిన
జీవన బంధాలు!!

ఆకులో ఆకులై
పువ్వులో పువ్వులై
పకృతిలో లీనమై
ప్రకృతే తామై
నేలతల్లిని అంటు పెట్టుకున్న
పేగు బంధాలు!!

పెనవేసుకున్న పేగుబంధాలను
తుంచేస్తూ
నేలతల్లి గర్భాన్ని చీల్చేస్తూ
ఆదివాసి బిడ్డిల్ని
అమ్మఒడి నుండి
అమాంతంగా లాక్కొంటున్న
విషపన్నాగ పులిజోన్ హెచ్చరికలు!!

**చెదురుతున్న గూడేలు**
**మట్టి వాసనకు దూరమవుతున్న**
**ఛిద్రమైన బతుకులు!**

**గాయంతో బరువెక్కిన**
**ఆదివాసి గుండెల ఆకలి కేకలు**
**రేపటి పోరుగీతికలు!!"**
**(మహేందర్, బిల్లా. 2012 : 42, 43)**

నిజానికి టైగర్ జోన్‌లు నిర్మించాల్సిన స్థాయిలో తెలంగాణలో పులుల వేట సాగింది ఎన్నడూ లేదన్నది చరిత్ర రుజువులు చూపిస్తుంది. మరి టైగర్ జోన్ నిర్మించడంలోని ఆంతర్యమేమిటన్నదే అసలు ప్రశ్న. నాగరిక సమాజం అని పిలవబడుతున్న అనాగరిక సమాజానికి దూరంగా, కొండా కోనల్లో ప్రకృతిలో సామూహిక జీవన విధానంతో బతుకుతున్న ఆదివాసీలను, పేగుబంధాన్ని తుంచేస్తున్నట్లు అడవినుండి వేరుచేయడంలో సీమాంధ్ర పాలకుల, బహుళజాతి కంపెనీల ఖనిజ దాహం ఉన్నదని కవ్వాల్‌కు వెళ్లిన నిజనిర్ధారణ కమిటీలు తేల్చాయి.

నల్లమల అడవిలోని చెంచులను బలవంతంగా ఖాళీ చేయించడాన్ని మహబూబ్ నగర్ కవులు చాలామంది నిరసిస్తూ కవిత్వం రాశారు. ఆదివాసీలను స్మరించుకుంటూ వారి గొప్పదనాన్ని, నిష్కల్మషమైన మనసును, నిస్వార్థ జీవన విధానాన్ని కీర్తించారు. ఆ కోవలోనిదే సుచరిత రాసిన 'ఆదివాసీలం' కవిత.

**"ఆదిమ సంస్కృతి వారసులం**
**విషసంస్కృతికి బలౌతున్న**
**అడవి బిడ్డలం**

ఒకప్పటి రాజ్యాలం రాజులం
అడివికీ పుడమికీ దూరం చేయబడుతున్న
కాందిశీకులం

సహజ సంపదలను
సమాజపరం చేసిన
సిసలైన సామ్యవాదులం

బుడ్డగోచీలతో మిగిలిన
బలిచక్రవర్తులం

జలధారలను కలుషితం చేయని
అపరిశుద్ధులం అనాగరికులం
మంచుకడిగిన ముత్యాలం

అక్షరాలు అందని
వేలిముద్రలం
విషజ్వరాలతో వైద్యం అందక
నేలరాలుతున్న అనాథలం
కరెంటు వెలుగులే చూడక
చుక్కలే దిక్కైన
అభివృద్ధి సూచికలం

పెద్దపెద్ద పథకాలు
దళారుల దోపిడీలు
టైగర్ ప్రాజెక్టులు

**పాలకుల పన్నాగాలు**

**ఖనిజాల తవ్వకాలకు**

**వజ్రాలవేటలకు**

**బలౌతున్న భిల్లులం**

**ఖాళీ అవుతున్న**

**చెంచుపెంటలం"**

**(సుచరిత. 2012 : 33, 34)**

తెలంగాణలో ఖనిజాల వేట ఎలా సాగిందో ఇంతకు ముందటి అధ్యాయాల్లో వివరించడం జరిగింది. స్వాతంత్ర్యానంతరం ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎవ్వరు అధికారంలోకి వచ్చినా వారంతా సీమాంధ్రులవారే. లేదా సీమాంధ్రుల నియంత్రణలోని వారే. ఆదివాసీల జీవితాల్లో ఉన్న సమస్యల గురించి ఒక్కరోజు కూడా ఆలోచించని ఈ ప్రభుత్వాలు ఉన్నపళంగా ఊడిపడి తమ స్వార్థం కోసం గూడాలను ఖాళీ చేయించడం ఏమిటని ఈ కవిత సారాంశం.

భారతదేశ స్వాతంత్ర్యోద్యమం కంటే ముందునుండే దేశంలో అనేక చోట్ల ఆదివాసీ తిరుగుబాట్లు జరిగాయి. తెలంగాణలో ప్రాచీన కాలం నుండే ఆదివాసీ పోరాటాలు జరిగాయి. కాకతీయుల కాలంలో తిరుగుబాటు సంస్కృతిని ఆరంభించిన సమ్మక్క సారక్కలు ఆదివాసీలు. ఆంగ్లేయ పాలకుల దుర్నీతి మీద కొరడా ఝుళిపించిన రాంజీ గోండు ఆదివాసీ. దున్నేవాడిదే భూమి నినాదంతో భూమి కోసం, పన్నెండు గ్రామాల విముక్తి కోసం పోరాడిన కొమురం భీం ఆదివాసీ. ఈ వ్యక్తులు తెలంగాణ ఆదివాసీ పోరాటంలో కేవలం ఉదాహరణలు మాత్రమే. ఏ పరాయి పాలకులు తమ మీద ఆధిపత్యం చెలాయించాలని చూసినా ఆదివాసీలు చైతన్యవంతంగా ప్రతిఘటించారు. అది సమ్మక్క సారక్కల దగ్గరి నుండి జనతన సర్కార్ల ఏర్పాటు దాకా సజీవ స్రవంతిగా సాగుతున్నదే. ఆ విషయాన్నే వెంకటేశ్వరశర్మ రాసిన 'నిద్రేలేదు' కవితలో వివరిస్తారు. అప్పటిదాకా ఆదివాసీ జీవితాలు నాశనం అయిపోతున్నాయని వలపోతలో మునిగిపోయిన

సానుభూతిపరుడు వారి పోరాటాన్ని చూసి ఊరట చెందుతున్నాడు అని ఈ కవిత వివరిస్తుంది.

**"పత్రహరితానికి**
**తెల్లటి తెగులంటుకున్నది**
**గుట్టలకు**
**నల్లటి మబ్బులావరించాయి**

**గుదిగుచ్చిన గుండెలలో**
**లబ్‌డబ్‌లు లేవు**
**ఆశ్వాసం ఆరినపుడు**
**పేగులు మెలికపడి**
**కళ్ళలోకి రక్తం ఎగజిమ్మింది**
**మౌనంగా రోదించిన మనసు**
**చిమ్మింది కన్నీరు**
**రేపటికోసం**
**చీకటైన రాత్రిలో**
**నిద్రేలేదు**

**కాలం రగిలింది**

**అరుణ కిరణాల తాకిడికి**
**చెల్లా చెదురైన మబ్బుల గుండా**
**వెలుగు**
**అడివంతా పరుచుకున్నది**
**ఆవహించుకున్న నిర్వేదం**

**పలాయనమయ్యింది**

**మట్టివాసన పీల్చిన మనసు**

**ప్రతిఘటిస్తున్న ఆదివాసినిజూసి**

**ఆనంద బాష్పమయ్యింది”**

**(వెంకటేశ్వరశర్మ. 2012 : 104, 105)**

మునిమడుగుల రాజారావు‘ఆదిలాబాద్ రంజన్లు’ అనే కవిత శ్లేషార్థంలో రాశారు. ఆదిలాబాద్ వాస్తవంగానే రంజన్లకు పెట్టింది పేరు. అదే సమయంలో ఆదివాసీలకు కూడా. ఈ రెండు వస్తువలను ఒకచోటికి చేర్చి కవిత రాశారు.

**“మానవ మూలాలైన**

**అడువుల్లోని**

**ఆదివాసి సంస్కృతిని**

**పులిమిన కుండలు**

**ఎదులాపురంలోని**

**ఎద్దులా కష్టించే**

**అమాయక మట్టి జీవాల**

**స్పర్శను తాకిన కుండలు**

**తడారిన గొంతులను**

**చల్లగా తాకేందుకు**

**మట్టి తదాత్మను**

**మనకోసం ఆత్మార్పణ గావించి**

**ఎర్రెర్రని మంటల్లో**

**వొళ్లంతా కాల్చుకున్న**

**మానవీయత నిండిన**

**మమతల కుండలు**

చల్లని మనసున్న వేసవి కుండలు"
(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 151, 152)

కేవలం తెలంగాణలో మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రజాస్వామిక ఉద్యమాలకు ఊపిర్లూదింది ఆదివాసీలే. ఇవాళ ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదానికి రెండే రెండు వర్గాలు ప్రధాన శత్రువులు. అందులో ఒకరు ఆదివాసీలైతే, మరొకరు ముస్లింలు. ఈ రెండు వర్గాల కాళ్లకింది నేలలో సంపద నిక్షిప్తమై ఉన్నది. అది ఆదిలాబాద్‌లోనైనా, అరబ్ దేశాల్లోనైనా. అందుకే సామ్రాజ్యవాదం కన్ను వీళ్ల మీద పడింది. వాస్తవానికి సమాజ గమనానికి వీరి పాత్ర అమోఘం అని ఈ కవిత సారం.

మలిదశ పూర్వార్ధ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ప్రభుత్వం ముందు పెట్టిన డిమాండ్‌లలో ప్రధానమైనది భారీ తరహా నీటి ప్రాజెక్టులు నిలిపివేసి చిన్న తరహా నీటి ప్రాజెక్టులు కట్టాలని. దీనికి కారణం ఏ భారీ ప్రాజెక్టు అయినా సారవంతమైన భూమిని మింగేస్తుంది, జనావాస ప్రాంతాలను విస్తాపితం చేస్తుంది. అదే చిన్న తరహా ప్రాజెక్టులు కడితే లాభం అపారంగా ఉండి, నష్టం పరిమితంగా ఉంటుంది. అందుకే తెలంగాణ ఉద్యమం పోలవరం నిర్మాణాన్ని వ్యతిరేకించింది. అరుకులోయల్లో లభించే యురేనియాన్ని తవ్వుకొచ్చి, దాన్ని శుభ్రపరిచి అమ్ముకోవడం కోసం సీమాంధ్ర పెట్టుబడిదారులకు వేల క్యూసెక్కుల నీరు అవసరం అవుతుంది. అందుకే పోలవరం నిర్మాణం చేపట్టారు. పోలవరం తప్పక నిర్మించి తీరుతామని చెప్తున్న ప్రభుత్వాల లెక్కల ప్రకారం ప్రాజెక్టు నీటి వినియోగంలో ఏయే రంగానికి ఎంతెంత కేటాయిస్తున్నారో స్పష్టంగానే తెలుస్తున్నది. తాగు, సాగు నీటికోసం ఈ ప్రాజెక్టు ఉపయోగపడేది కేవలం ఐదు నుండి ఏడు శాతం మాత్రమే. అంటే మిగతా నీటిని మొత్తం కోస్టల్ కారిడార్ కోసం వినియోగిస్తామని ప్రభుత్వాలే చెప్తూ వచ్చాయి. మరోవైపు ఈ ప్రాజెక్టు నిర్మిస్తే తెలంగాణలోని అనేక మండలాల గ్రామాలు నీటిలో మునిగిపోతాయి. పదుల సంఖ్యలో ఆదివాసీ గూడాలు ముంపుకు గురవుతాయి. అక్కడి ప్రజా జీవనం సంక్షోభంలో పడిపోతుంది. అంటే తెలంగాణ ప్రజలకు నష్టం జరిగినా పరవాలేదు, కానీ సీమాంధ్ర పెట్టుబడిదారుల ప్రయోజనాలే

నెరవేరాలని సీమాంధ్ర పాలకులు భావించారు. దాన్నే దామెర రాములు 'అయితే ఏంటట?' కవితలో వ్యంగ్యంగా వివరిస్తారు.

**"వేలాది మంది గిరిజనులు నీట మునుగుతరు**
**వాళ్ల గుడిసెలు పొలాలు కనపడవు నీళ్లు కప్పేస్తయి**
**అయితే ఏంటట..**
**వాళ్లనూ ఆదుకుంటం**
**మొదట ప్రాజెక్టులు**
**ఆ తర్వాత మునిగిన వాళ్ల సంగతి**
**వద్దని నివారించేటందుకు మీరెవరు?**
**ప్రాజెక్టులతోనే మాకు పని**
**కాదనటానికి మీరెవరూ?**
**అడిగేందుకు మీరెవ్వరూ?"**
**(రాములు, దామెర. 2006 : 31)**

జాతికి మూలస్తంభమైన ఆదివాసీలను కాపాడుకోవాలంటే, తెలంగాణ ఖనిజ వనరులు తెలంగాణకే దక్కాలంటే, మా పాలన మాకు కావాలని ఈ కవిత్వం బలంగా వ్యక్తం చేస్తున్నది. అదే సమయంలో ఆదివాసీలను నిర్వాసితుల్ని చేయడం కేవలం పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే అని కుండ బద్దలు కొట్టినట్లు వివరిస్తుంది.

## 4.16. ఖనిజ వనరులు

తెలంగాణలో విస్తారమైన ఖనిజ వనరులు ఉన్నాయి. "తెలంగాణ ఖనిజ నిలువలకు కాణాచి. ఇవాళ్టి ఆంధ్రప్రదేశ్‌లో దొరుకుతున్న ఖనిజాలలో అత్యధిక భాగం తెలంగాణ ప్రాంతం నుంచి వస్తున్నవే. బొగ్గు, క్వార్ట్జ్, సీసం, రాగి, డోలమైట్, ఇనుప ఖనిజం, గ్రానైట్, అభ్రకం వంటి ఎన్నో ఖనిజాలు తెలంగాణ జిల్లాల్లో ఉన్నాయి. తెలంగాణ

జిల్లాల్లో 1030 కోట్ల టన్నుల బొగ్గు నిలువలు, ఎనిమిది లక్షల టన్నుల రాగి నిలువలు, 10 కోట్ల టన్నులకు పైగా డోలమైట్ నిలువలు ఉన్నాయని అంచనా" (వేణుగోపాల్, ఎన్. 2004 : 100). అవి వాస్తవానికి తెలంగాణ సమాజ అభివృద్ధికే వినియోగించబడాలి. కానీ సీమాంధ్ర ప్రభుత్వ పాలనలోకి వెళ్లిన తెలంగాణలో సీమాంధ్ర పెట్టుబడిదారులు వనరులన్నీ అక్రమంగా తరలించుకుపోవడం వెలుగులోకి రాని సత్యం.

బిల్లా మహేందర్ 'వాడు' కవితలో ఇట్లా రాశాడు.

**"మొన్న**
**నిన్న**
**నేడు**
**ఎప్పుడైతేనేం?**
**ఎక్కడైతేనేం?**
**ఎలాగైతేనేం?**

**వాడు**
**ఉన్నదంతా మేస్తూనే ఉన్నడు**
**దొరికినదంతా దోస్తూనే ఉన్నడు**

**వాడికి**
**మంచి చెడు**
**ధర్మం అధర్మం**
**న్యాయం అన్యాయంతో సంబంధం లేదు**

**వాడికి**
**రంగు**
**రుచి**

వాసనతో సంబంధం లేదు

అది
ఘనపదార్థమైనా
ద్రవ పదార్థమైనా
వాయు పదార్థమైనా
ఇంకేమైనా కానీ..

వాడి కన్ను
వనరులవైపే చూస్తుంటది
వాడి నోరు
సిరుల గూర్చే మాట్లాడుతుంటది
వాడి మెదడు
దోపిడీ గూర్చే ఆలోచిస్తుంటది

వాడు
మన వనరులన్నీ కొల్లగొడుతూ
మన సిరులన్నీ తరలిస్తూ
మన భాషయాసలపై దాడిచేస్తూ
మన ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తూనే ఉంటడు

వాడే
పెత్తందారుడిగా చెలామణి అవుతూ
పాలకవర్గంలో భాగమవుతూ
ప్రాంతాన్నంతా దోచేస్తూ
చివరికి సమైక్యరాగం తీస్తుంటడు"

**(మహేందర్, బిల్లా. 2012 : 32, 33)**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కావాలని తెలంగాణ ప్రజలు ఆరు దశాబ్దాల పోరాటం చేశారు. ఉద్యమం ఉవ్వెత్తున లేచిన ప్రతిసారీ సీమాంధ్ర పెట్టుబడిదారులు సమైక్య రాగం ఆలాపించారు. నిజానికి రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచాలనే భావనలో ఐక్యత అనేది కేవలం పైకి కనిపించే విషయం మాత్రమే. ఐక్యత చాటున తెలంగాణ సంపదను దోచుకోవడం అసలు లక్ష్యం అని ఈ కవిత చెప్తున్నది.

తెలంగాణలోని గోదావరీ లోయ ప్రాంతమంతా విస్తారమైన బొగ్గు నిక్షేపాలు ఉన్నట్లు నిజాం కాలంలోనే గుర్తించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు తర్వాత ఆ బొగ్గు నిలువలు ఎవరి ప్రయోజనాల కోసం వినియోగంచబడ్డాయో, ఎవరు నష్టపోయారో వివరించేదే పిట్టల రవీందర్ రాసిన 'గోదావరి నదీలోయలో..' కవిత.

**"ఇప్పుడు ఏం మిగిలిందిక్కడ?**
**నల్లబంగారం జాడలేదు**
**టబ్బుల నుండి బంకర్‌లోకి**
**బంకర్ నుండి లారీల్లోకి..**
**ఆపై**
**రైలు వాగిన్లకు బల్లర బల్లర బొగ్గు పెల్లలరొద**
**విందామన్నా లేదు**
**...**
**గోదావరి నదీలోయలో**
**యంత్రభూతములు మరోమారు తల ఎత్తిన జాడ**
**కోరలకింద నలిగిపోతున్న నల్లకలువలు**
**గుండెకింద తడివున్న వీరుల రాకకోసం ఎదురుచూపులు"**
**(రవీందర్, పిట్టల(సంపా). 2007 : 1, 2)**

ఆధునిక యంత్రాల సహాయంతో తెలంగాణలోని బొగ్గు నిక్షేపాలను వెలికి తీసి తమ స్వార్థ ప్రయోజనాలకు వాడుకున్నది సీమాంధ్ర పెట్టుబడిదారులు. దీనికి సీమాంధ్ర ప్రభుత్వాలు సహకరించాయని చెప్పడం కవితాసారం.

తెలంగాణలో విస్తారమైన బొగ్గు నిక్షేపాలున్న సింగరేణిలో జరుగుతున్న మరొక దారుణం 'ఓపెన్ కాస్ట్ మైనింగ్'. దీని మీద కూడా విస్తృతమైన తెలంగాణ కవిత్వం వెలువడింది. వఝల శివకుమార్ రాసిన 'కాలేరన్నలు' కవితలో ఈ విషయాన్నే ప్రస్తావించారు.

**"శ్వాసని కాటేస్తున్న శాసనాలు**
**మాటని దాటేస్తున్న అధికారులు**
**అభివృద్ధి వెలుగునీడల్లో**
**ఆరాటాల నిప్పుల్ని**
**కొంగున కట్టుకుంటున్న 'సింగరేణి'**
**ఓపన్‌కాస్ట్ పెద్ద బొందలల్ల**
**రాకాసిమిషన్ల దగ్గర**
**పనికోసం దేబిరిస్తూ**
**వర్తమానం..**
**మిగిలున్న బావుల్లోకి**
**మిగిలున్న ఆశలతో**
**తట్టాచెమ్మాసులెత్తి**
**కదులుతున్న కాలేరన్నల కాలం.."**
**(రవీందర్, పిట్టల(సంపా). 2007 : 13)**

సింగరేణిలో జరుగుతున్న అన్యాయాలను నిలువరించడం కోసం నిజాం కాలం

నుండే అనేక ఉద్యమాలు నడిచాయి. కార్మికుల నాయకత్వంలో అనేక సంఘాలు ఏర్పడి యాజమాన్యాల దోపిడీకి వ్యతిరేకంగా అనేక సమ్మెలు చేశాయి. దాంతో సింగరేణి యాజమాన్యానికి కార్మిక వర్గం కంట్లో నలుసులా తోచింది. కార్మికులు లేని వ్యవస్థ కోసం ప్రయత్నాలు మొదలు పెట్టి ముందుగా యాంత్రికీకరణ చర్యలను పెద్ద ఎత్తున చేపట్టింది. మనుషుల ప్రమేయం లేని యంత్రాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుని బొగ్గుతోడే పద్ధతులు అమలు చేసింది. కార్మికులు ఈ రకమైన ప్రయత్నాలను కూడా తిప్పికొట్టారు. సమ్మెలకు దిగారు. ఇది 1990 నాటికి ఉధృతమైంది. అదే దశలో సంస్కరణలు మొదలయ్యాయి. సింగరేణి గనుల ఆధునికీకరణ పేరుతో యాంత్రికీకరణ, ఓపెన్ కాస్ట్ విధానాన్ని ప్రకటించింది. అప్పటివరకు అనుసరించిన నియామక పద్ధతులు రద్దు చేసింది. అనారోగ్యంతో స్వచ్ఛందంగా పదవీ విరమణ చేసిన కార్మికుల పిల్లలను ఉద్యోగాల్లోకి తీసుకునే పద్ధతి అంతకు ముందు ఉండేది. అట్లే సింగరేణి గనుల వల్ల ఉపాధి కోల్పోతున్న గ్రామాల్లో కనీసం ఒక్కొక్క కుటుంబంలో ఒక్కరికైనా ఉద్యోగాలు ఇచ్చే పద్ధతి ఉండేది. వీటిని రద్దు చేసింది. అంతటితో ఆగకుండా స్వచ్ఛంద పదవీ విరమణ పథకాన్ని ప్రకటించి దాదాపు 25 వేల మంది కార్మికులను పనిలోంచి నిర్బంధంగా తొలిగించింది. ఈ సంస్కరణల్లో భాగంగానే కార్మికుల శ్రమతో బొగ్గుతోడే అండర్ గ్రౌండ్ గనులను మూసివేసి 1990వ దశకంలో ఓపెన్ కాస్ట్ గనులకు శ్రీకారం చుట్టింది. ఈ ఓపెన్ కాస్ట్ మైనింగ్‌లో తొలిదశలో మనుషులు చేసే పనులన్నీ కాంట్రాక్టర్లకు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో కేటాయించి తమ చేతికి మట్టి అంటకుండా జాగ్రత్త పడింది. మరోవైపు ఈ ఓపెన్ కాస్ట్ మైనింగ్ కారణంగా సింగరేణి చుట్టుపక్క ప్రాంతాల్లో తీవ్రస్థాయి భూకంపాలు వచ్చే పరిస్థితి ఏర్పడింది. ఇంకొకవైపు ఈ విధమైన బొగ్గు వెలికితీత పద్ధతివల్ల చుట్టు పక్కల సుమారు 30 కిలోమీటర్ల మేర అనేక విషవాయువులు వ్యాపించి అక్కడి ప్రజలంతా శ్వాసకోశ సంబంధింత వ్యాధుల బారిన పడుతున్నారు. అయినా సీమాంధ్ర ప్రభుత్వాలు కేవలం తమ స్వార్థ ప్రయోజనాల కోసమే బొగ్గును వెలికితీశాయి.

ఎం.వి.ప్రసన్న రాసిన 'బ్లాక్‌గోల్డ్' కవితలో ఇలా రాశాడు.

"నల్లబంగారపు నిక్షేపాల పంట
నల్గుతున్న జీవితాల ప్రగతిబాట
ఆర్థికాభివృద్ధి పథకాలకు వూపిరిలూది
బలిపీఠంపై బ్రతుకు పరిచిన కార్మికుడా!

రాత్రి – పగలు తెలియకుండ
రాక్షసి బొగ్గును తవ్వి
మహోద్యమానికి మానవీయతను
ఇంధనంగా  అందించి
చీకటి బ్రతుకులలో వెలుగు నింపి
నల్ల జి.వోల దుర్మార్గాల 'డిస్‌గైజ్డ్' చట్టాలతో
యంత్రభూతాల విధ్వంసానికి
విలవిలలాడుతున్న శ్రామికుడా!

సంస్కరణలతో సఖ్యత పెరగాలి
మానవ ప్రధానంగ ఆధునికత కలగాలి
అణగారిన శ్రామిక శక్తి అభివృద్ధి పథంలో సాగాలి
తెలంగాణ గుండెకాయ 'సింగరేణి'
లక్ష కార్మికుల కుటుంబాల వూపిరి శ్వాస
ఉక్కునరాలలో ఉష్ణరుధిరం నింపుకొని
పొట్టలు కొట్టే దోపిడి శక్తిని దహించి వేయాలి
ప్రపంచీకరణ ధ్యేయం పరాయి దోపిడి
వల్లకాడు శాంతిగీతం పాలకుల కుటిలరీతి
నిరంతరం సింగరేణి 'సైరన్' మ్రోగాలి
తరంతరం కార్మిక శక్తి కదలివలె ఉప్పొంగాలి
'బ్లాక్‌గోల్డ్' భావితరాల భూతలస్వర్గం కావాలి

**తెలంగాణ రాష్ట్రానికి నాదమై మ్రోగాలి"**
**(రవీందర్, పిట్టల(సంపా). 2007 : 94)**

తెలంగాణలో కేవలం ఖనిజాలు మాత్రమే కాదు వాటిని కాపాడుకునే తెగువ కూడా ఉన్నదనే విశ్వాస ప్రకటన చేసిన కవిత్వం కూడా ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో భాగంగా వచ్చింది. వడ్డెబోయిన శ్రీనివాస్ రాసిన 'మట్టితల్లీ! మానుకోట!!' కవితలో ఈ విశ్వాసమే కనిపిస్తుంది.

**"గుండె గుండెకు పోరు పట్టాలేసిన**
**ఈ నేల పొరల్లో**
**సలసల కాగే వేడి నెత్తుటి**
**జలవుంది**
**గ్రానైటే కాదు**
**గంధకపు కొండలున్నాయి**
**ఇనుప గుండ్లున్నాయి"**
**(శ్రీనివాస్, వడ్డెబోయిన. 2011 : 13)**

ఇనుప గుండ్లూ, గంధపు కొండలూ యుద్ధ సామగ్రి. తెలంగాణ ప్రాంతానికి దక్కవల్సిన ఖనిజ సంపద దక్కించుకోవడం కోసం తెలంగాణ ప్రజలు ఇవాళ యుద్ధంలో నిలబడి ఉన్నారు అని చెప్పడం ఈ కవి ఉద్దేశ్యం.

ఇట్లా ఈ కవిత్వం నిండా ఏ ప్రాంతంలోని ఖనిజ నిక్షేపాలను ఆ ప్రాంతానికే వినియోగించాలనే ప్రజాస్వామిక సూత్రం ఉన్నది. ఉమ్మడిగా ఉండమంటూనే స్వలాభాపేక్షతో పనిచేస్తున్న సీమాంధ్ర పాలకవర్గాల పట్ల తీవ్రమైన నిరసన ఉన్నది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు మాత్రమే తెలంగాణ ఖనిజ వనరుల్ని తెలంగాణకు వినియోగించుకునే అవకాశాన్ని కల్పించగలదు అనే ప్రకటన కూడా ఉన్నది. తమ

వనరుల్ని తాము కాపాడుకోగలమనే విశ్వాసం కూడా దాగి ఉన్నది.

## 4.17. హైదరాబాదు

భిన్న జాతుల, మతాల, కులాల, ప్రాంతాల, వర్గాల ప్రజలకు హైరాబాద్ కేంద్రబిందువు. అందరినీ ఆదరించే ప్రేమాస్పద కేంద్రం, కన్నతల్లి. ప్రత్యేక తెలంగాణ కోరినప్పుడల్లా హైదరాబాద్ మాకిస్తే రాష్ట్రం విభజించినా పరవాలేదు అని వాదించే కుతర్క సీమాంధ్రులు ఉద్యమం సాగినన్నాళ్లూ కనిపించారు. ఆ సందర్భాల్లో హైదరాబాద్ మాదేననీ, మా చెమట రక్తపు నిర్మితమనీ చెప్పటం మాత్రమే కాదు, దాన్ని కీర్తించడం కూడా సహజంగా జరిగింది. అందులో భాగంగానే అమ్మంగి వేణుగోపాల్ 'కన్నతల్లి హైదరాబాద్' కవిత రాశారు.

**"హైదరాబాద్ ఒక కవల పిల్లల కన్నతల్లి**
**పెద్దకొడుకు యాదగిరి రంజాన్ అంటాడు**
**చిన్నవాడు దస్తగిరి దసరా అంటాడు**
**ఆ తల్లికి మాత్రం ప్రతి రోజూ పండుగే**

**హైదరాబాద్ పేదకొడుకుల ప్రేమగల తల్లి**
**ఒక్క బన్ రొట్టెను చెరిసగం తినిపిస్తుంది**
**తాను పస్తులున్న సంగతి తన ప్రాణానికే తెలియనివ్వదు**
**కొడుకుల్ని చూస్తే చాలు ఆమె కడుపు నిండుతుంది**

**హైదరాబాద్ కథలు చెప్తూ ఇల్లిల్లూ తిరిగే తల్లి**
**తానీషా కథలో అందరికీ రాముణ్ణీ చూపిస్తుంది**
**తుర్రేబాజ్ ఖాన్ కథలో తిరుగుబాటు చెప్తుంది**
**తాను మాత్రం మక్కామసీదు పావురమై ఎగురుతుంది**

**హైదరాబాద్ ఒక కవలపిల్లల కన్నతల్లి**

**హైదరాబాద్ పేదకొడుకుల ప్రేమగల తల్లి**

**హైదరాబాద్ కథలు చెప్తూ ఇల్లిల్లూ తిరిగే తల్లి**

**ఎక్కడ ఏ పాప ఏడ్చినా తన బిడ్డేనని పరిగెత్తే తల్లి"**

**(స్కైబాబ(సంపా). 2010 : 48)**

కేవలం హైదరాబాద్ గొప్పది అని చెప్పడం కాదు, ఎందుకు గొప్పదో చెప్పడమే ఈ కవిత ఉద్దేశ్యం. హైదారబాద్‌లో భిన్నత్వంలో ఏకత్వం అన్నది ఎక్కడికెళ్లినా కనిపించే వాస్తవం. హిందువులు, ముస్లింలు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పారసీలు తదితర మతాల ప్రజలు కలిసే జీవించే వైవిధ్యం హైదరాబాద్‌లో కనిపిస్తుంది. మామూలుగా చెప్పేటప్పుడు కేవలం పల్లెల్లోనే సజీవ మానవ సంబంధాలు ఉంటాయని అంటుంటారు. కానీ హైదరాబాద్‌లో కూడా మనుషుల మధ్య ప్రేమలు అంతే స్థాయిలో ఉంటాయని చెప్పడంకోసం కూడా తెలంగాణ కవులు కవిత్వం రాశారు. హైదరాబాద్ నగరం మీది ప్రేమతో కందుకూరి శ్రీరాములు 'అలాయ్ బలాయ్' అనే కవిత రాశాడు.

**"పల్లెల్లోనే కాదు**

**పట్నంలోనూ ఉంది తెలంగాణ**

**మీ చూపు ఒక్కసారి ఇటు సారించండి**

**ఇరానీ చాయ్ ఒక కప్పెడు ఆదా ఆదా తాగి**

**నిదానంగా ఆలోచించండి**

**నవాబు నిజాం జాగను ఒక్కసారి దర్శించండి**

**సగం తెలూ సగం ఉర్దూ**

**పాలలో నీళ్ళలా తెలంగాణ యాసభాష**

**జంటనగరాలు కలిసిపోయినట్టు కలిసిపోయినయ్**

**సహజీవనం చేస్తూ పల్లెల్లో కన్పిస్తున్న**

**హిందూ ముస్లిం భాయీ భాయీ తెలంగాణ**

**ఉమ్మడి కుటుంబాన్ని గుర్తుకు తెస్తుంది”**

**(శ్రీరాములు, కందుకూరి. 2002 : 25)**

హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ ఒకప్పుడు మంచినీటి జలాశయం. హృదయాకారంలోని ఈ జలాశయాన్ని 1563లో ఇబ్రహీం కులీ కుతుబ్‌షా నిర్మించాడు. 5.7 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ జలాశయం మూసీనది మీద నిర్మాణం అయ్యింది. 1920లో ఉస్మాన్ సాగర్ (గండిపేట్ చెరువు), 1927లో హిమాయత్ సాగర్ నిర్మించేకంటే ముందు హైదరాబాద్ నగరానికి నీళ్లు అందించింది హుస్సేన్ సాగరే. 2012 సెప్టెంబర్ 27న ‘యునైటెడ్ నేషన్స్ వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్ (యుఎన్‌డబ్ల్యూటీవో)’ వారు హుస్సేన్ సాగర్‌ను ‘హర్ట్ ఆఫ్ ద వరల్డ్’(ప్రపంచపు గుండెకాయ)గా ప్రకటించారు. దానికి కారణం ప్రపంచంలోనే హృదయాకారంలో ఉన్న అతిపెద్ద జలాశయం ఇది. దాదాపు ఆంధ్రప్రదేశ్ ఏర్పడే నాటికి కూడా ఈ జలాశయం నుండి నీటిని హైదరాబాద్ ప్రజల అవసరాల నిమిత్తం వినియోగించేవారు. కానీ గడిచిన మూడు, నాలుగు దశాబ్దాలుగా ఈ జలాశయం మురికి కూపంగా మారిపోయింది. దీనికి కారణం హైదరాబాద్‌లో సీమాంధ్ర పెట్టుబడిదారులు విచ్చలవిడిగా స్థాపించిన పరిశ్రమలు, ఐదు నక్షత్రాలు హెూటళ్లు విడుదల చేసే వ్యర్థాలను ఈ జలాశయంలోకి మళ్లించడమే. ఆ విషయాన్నే వరవరరావు ‘2020’ కవితలో రాశాడు.

**“హుస్సేన్‌సాగర్‌కిప్పుడు**
**దేహం లేదు – అలంకరణే గాని**
**నెక్లెస్ బిగించిన కంఠం నుంచి**
**నీళ్ళు నోట్లోకి దిగవు**
**సాయం చేసుకోవడానికి చేతులేవి**
**ఒకటి ఎయిర్‌పోర్ట్ మార్గం**
**ఇంకోటి ఎన్టీఆర్ స్మృతిలో సమాధి”**

**(గౌరీశంకర్, జూలూరు(సంపా). 2002 : 352)**

తాగునీటి జలాశయాన్ని మురుగునీటి జలాశయంగా మారడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణమైన సీమాంధ్ర ప్రభుత్వాలే, మళ్లీ తమ తప్పును కప్పిపుచ్చుకోవడం కోసం నెక్లెస్ రోడ్, ఎన్టీఆర్ గార్డెన్స్ వంటివి తీరంలో నిర్మించి పర్యాటక స్థలాలుగా మార్చారు అని ఈ కవిత తెలియజేస్తుంది.

సీమాంధ్ర పెట్టుబడిదారులు తెలంగాణ భూమిని వ్యాపార సరుకుగా మార్చడాన్ని నిరసించేదే ఎం.ఎ.బాసిత్ రాసిన 'తెలంగాణ దిల్' కవిత.

**"ఏమైతేనేం?**
**పెట్టుబడి విటులపాలై**
**పాలక నటుల వశమై**
**రింగురోడ్డు సర్వద్రష్టయై**
**రియలెస్టేట్ మోహంలో**
**వివస్త్ర అయ్యింది..**
**సెంటుకింత..**
**సెంటీమీటరుకింత..**
**వెలకట్టబడ్డ.. వెలయాలైంది"**
**(బాసిత్, ఎం.ఎ. 2010 : 7)**

హైదరాబాద్‌లోనూ, పరిసర ప్రాంతాల్లోనూ రియల్ ఎస్టేట్ వ్యాపారం వేలకోట్ల రూపాయల్లో నడిచిన సంగతి ప్రపంచానికి తెలిసిందే. అయితే, తెలంగాణ భూముల్ని తొలిదశలో కారుచౌకగా కొన్నదీ, ఈ వ్యాపారాన్ని మొదలుపెట్టిందీ, లాభాలు గడించిందీ, తెలంగాణ మట్టి మనుషుల్ని భూమి నుండి బేదఖలు చేసిందీ సీమాంధ్ర రియల్టర్లే. ఆ భూ వ్యాపారంలో రింగురోడ్డు, ఫిల్మ్ సిటీలు, ఫామ్‌హౌస్‌లు, రిసార్ట్‌లు నిర్మించడం వ్యూహాలుగా అర్థం చేసుకోవాలి. అందుకే ఈ కవి తెలంగాణ భూమి వివస్త్ర అయినట్లు భావించారు.

హైదరాబాద్‌లో వేలకోట్ల రూపాయల అధిపతులు పది శాతం ఉంటే తొంభై శాతం మంది చిరువ్యాపారులు, పేద ముస్లింలు, ఏదో ఒక పని చేసుకుని రోజులు వెళ్లదీసే దిగువ మధ్యతరగతి ప్రజలు, ఫుట్‌పాత్‌లమీదా, ఫ్లైఓవర్ల కిందా, వంతెనల కిందా, బస్టాండుల్లో, రైల్వేస్టేషన్‌లలో బతికే బిచ్చగాళ్లు, స్లమ్ముల్లో జీవించే దినసరి కూలీలు. వీళ్లందరూ దోపిడీదారుల కారు. వీళ్లకు లక్షల రూపాయల విలువ చేసే వాహనాలేవీ ఉండవు. వీరు ఎటువంటి వాతావరణ కాలుష్యానికీ కారకులు కారు. పైగా ప్రేమకు చిహ్నమైన భాగ్యనగర అనాది సంస్కృతిని కాపాడుతున్నది వీళ్లే. హైదరాబాద్ నగరాన్ని నిర్మించిన ఈ కూలిబిడ్డల శ్రమను దోచుకుని బతుకుతున్నది మీరేనంటూ సీమాంధ్ర వ్యాపారవేత్తలను, పెట్టుబడిదారులను హెచ్చరిస్తుంది షాజహానా 'మేరా హైదరాబాద్' అనే కవిత.

**"రాత్రి కూడా పగలై విచ్చుకునే**
**రాత్రీ పగలూ తేడాలేని కష్టజీవి ఈ నగరం**
**ఈ చార్‌సౌ సాల్ షహర్ బిడ్డలు**
**సంపాయించడానికి బతకడం లేదు**
**ముల్లెలు దాచుకోవడానికి జీవించడంలేదు**
**భూమిని చాపలా చుట్టి చంక కింద పెట్టుకునే**
**రియల్ ఎస్టేట్ వ్యాపారులు కాదు వాళ్లు**
**నగర జీవనానికి నాడీ వాళ్లు**
**షహర్ వాళ్లకు అమ్మ**
**నగరానికి నిజమైన వారసులు వాళ్లు**
**ఆ కళకళలాడిన నా హైదరాబాద్ ఏదీ?**
**ఆ సంస్కృతిని నాగరికతను ధ్వంసం చేస్తున్నదెవరు?**
**ఆక్రమణ చేసిందెవరు?**
**ఆశల్ని భుజాల మీదేసుకొని వలసొచ్చిందెవరు?**
**బిల్డింగులు కట్టిందెవరు?**

**రోడ్లని వాహనాల ప్రవాహం చేస్తూ**
**కాలుష్యమని గగ్గోలెత్తడమేంటి?**
**మీ పచ్చదనాల్ని నదీమతల్లుల్నీ**
**కావ్యగానం చేస్తూ కాపాడుకుంటూనే**
**బతుకిచ్చిన నగరాన్ని కులట అంటారా?!**
**పరిశ్రమలంటూ సెజ్‌లంటూ**
**తల్లినే తార్చాలని చూస్తున్నది మీరే కదా**
**మా కంచం ముందు మెతుకు మెతుక్కి**
**మేకులు కొడుతున్నది మీలాంటివాళ్లే కదా"**
**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 259, 260)**

తెలంగాణను ప్రపంచీకరణ విధానాలకు ప్రయోగశాలగా మార్చిన తర్వాత సరికొత్తగా షాపింగ్ మాల్స్ వెలిశాయి. కూరగాయల దగ్గరి నుంచి నిత్యావసర వస్తువులదాకా, పండ్ల దగ్గరి నుండి బట్టల దాకా, పాదరక్షల దగ్గరి నుండి పుస్తకాల దాకా ఈ షాపింగ్ మాల్స్‌లో దొరకని వస్తువే లేదు. చిరువ్యాపారుల నడ్డి విరుస్తూ ఈ షాపింగ్ మాల్స్‌ని నిర్మించింది సీమాంధ్ర బడా వ్యాపారవేత్తలే. మరోవైపు చిన్నచిన్న హోటల్లు నడిపే వాళ్ల జీవితాలను నాశనం చేస్తూ వేల సంఖ్యలో ఆంధ్రా కర్రీ పాయింట్లు స్థాపించారు. ఇంకొకవైపు తెలంగాణ భూముల్ని ఆక్రమించుకుని సినిమా నిర్మాణాల కోసం స్టూడియోలు (రామోజీ ఫిల్మ్ సిటీ, అన్నపూర్ణ స్టూడియో, పద్మాలయ స్టూడియో, రామానాయుడు స్టూడియో వంటివి) నిర్మించారు. ఈ నిర్మాణాలకు ఆక్రమించుకున్న భూమి మొత్తం తెలంగాణ మూలవాసులదే. బంజారాహిల్స్ పేరు చూస్తేనే అది బంజారాల కొండలు అని అర్థం అవుతుంది. మరి ఈ బంజారాల మూల నివాసంలో ఇవాళ కనిపిస్తున్నవి వ్యాపార కేంద్రాలు. ఆ విషయాన్నే ఆశారాజు 'హైదరాబాద్ మేరీ జాన్' అనే కవితలో చెప్పాడు.

**"నా ఇల్లును కూల్చి**

మాల్స్ కట్టిందెవరు?
నా వాకిట్లో
స్టూడియోలు నిర్మించింది ఎవరు?
నా గల్లీలను మాయం చేసి
కాలనీలు పెంచుకొన్నదెవరు?
దీన్ని కబ్జా అంటారా?
దౌర్జన్యమంటారా?
ఆగే పీచే దేఖ్‌ఖే చల్ నా!
ఈ మోడే ఖతర్నాక్ మోడు!
బంతిపూల తోటలో
క్రాస్ పాయింట్లు పెట్టి
ఖూబ్‌సూరత్‌ను
కచ్‌రా చేసావు
నీ అచార్ పచార్ కో
మారోగోలి
నా బిర్యానీ తిని
దునియా ఖుషీ అవుతుంది
చార్మినార్ మీద
చుక్కలు దిగుతాయి
బస్సు బుకింగుల కౌంటర్లు తెరిచి
వెన్నెలను అమ్మేయకు
ఇది అత్తర్ నగరం
కంపు రాజకీయాలతో
బీమార్ పెంచకు!”
(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). **2012 : 332, 333)**

2001లో చంద్రబాబు నాయుడు పాలనలో ఆనాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల మండలి అధ్యక్షుడు సి.నారాయణ రెడ్డి బాలల చలన చిత్రోత్సవం ప్రారంభ సమావేశంలో  మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు హైదరాబాద్‌ను సైబరాబాద్‌గా మార్చి చాలా గొప్ప పని చేశాడు, ఇక ఆయన దీనిని కల్చరాబాద్‌గా మార్చవల్సి ఉన్నది అన్నాడు. దీనికి స్పందిస్తూ విప్లవ రచయితల సంఘం సభ్యుడు, సీనియర్ జర్నలిస్టు అయిన ఎన్.వేణుగోపాల్ సి.నారాయణ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఆ లేఖ ద్వారా తెలంగాణ సంస్కృతిని సీమాంధ్ర పెట్టుబడిదారులు ఎంతగా పరాయీకరించారో అర్థం చేసుకోవచ్చు. “ఆరు సంవత్సరాలుగా ఏలిన వారు హైదరాబాద్‌ను తమ కల్చరాబాద్‌గా మార్చడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారని, యాభై సంవత్సరాలుగా కృష్ణా, గుంటూరు జిల్లా సంపన్నుల భావజాలానికి ఊడిగం చేస్తున్న రాష్ట్ర పాలకులు హైదరాబాద్ సంస్కృతిని విధ్వంసం చేసి కొత్త కల్చరాబాద్‌ను సృష్టిస్తూనే ఉన్నారని మీ దృష్టికి మరొక్కసారి తెచ్చేందుకే ఈ లేఖ. కరినగురం పల్లె సీమల పిల్లనగోవి పాటలను కృష్ణా గుంటూరు జిల్లాల డబ్బు సంచుల సినిమాలకు అమ్మినట్టే, హైదారాబాద్ అమాయక ఆత్మీయ సంస్కృతిని తోసివేసి అమ్మకపు పరాయి సంస్కృతిని ఆ మూల వనస్థలిపురం నుంచి ఈ మూల కూకట్‌పల్లి దాకా ఎట్లా ఎవరు పరిచారో మీకు తెలియనిది కాదు. ఇప్పుడు ఆ తాతతాతల నాటి కథలన్నీ తవ్విపోసే పుర్సత్ లేదు గాని ఈ ఆరు సంవత్సరాలలోనే హైదరాబాద్ ఎంత గొప్ప కల్చరాబాద్ అయిపోయిందో మీ దృష్టికి తెద్దామని ఉంది” (వేణుగోపాల్, ఎన్. 2010 : 173, 174). వ్యంగ్య ధోరణిలో రాసిన ఈ మాటల ద్వారా తెలంగాణ సంస్కృతి ఎంతటి విధ్వంసానికి గురైందో అర్థం చేసుకోవచ్చు.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఎక్కుపెట్టిన మరొక సమస్య ‘హైదారాబాద్ ఫ్రీజోన్’. హైదరాబాద్ ఆరవ జోన్‌లో భాగం కాదని, అది ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాల వారికీ ఉద్యోగాల్లోనూ, ఉపాధి అవకాశాల్లోనూ, ఇతరేతర రంగాల్లోనూ ఫ్రీజోన్‌గా ఉండాలని సమైక్యవాదుల వాదన. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో ఫ్రీజోన్‌ను వ్యతిరేకిస్తూ కనీసం ఐదువందలకు పైగా కవితలు వచ్చాయి. వఝుల శివకుమార్ రాసిన

'ఫ్రీజోన్' కవిత కూడా ఆ విషయాన్నే వ్యక్తం చేస్తుంది.

**"ఔను మరి.. నగరం మీకు ఫ్రీజోనే!**

**ఇంక ఆడుండ్రి**

**ఫిలింనగర్ల నించి ఫిలింసిటీల దాంక**

**జూపార్కుల నించి జూబిలి గుట్టలదాంక**

**సేట్లు మీరు కార్పోరేట్లు మీరు**

**రూట్లు మీరు కార్ల గ్యారేజీలు మీరు**

**సినిమా వాళ్ళు మీరు**

**సినిమా హాళ్ళు మీరు**

**మా రక్తాన్ని జనిగెల్లా పీల్చే**

**బళ్లు మీరు పెట్టుబళ్ళు మీరు**

**ఔను మీకు ఫ్రీజోనే**

**కబ్జాలు కబ్జాలై రియలెస్టేటులై**

**గ్రేటర్ బోర్డులై ఔటర్ రోడ్డులై**

**చుట్టుముట్టు పల్లెల్ని**

**ఎవుసం భూముల్ని**

**అంబుక్క పెట్టచ్చు**

**పొద్దెక్కితే దిల్‌సుఖ్‌నగర్ నించి కూకట్‌పల్లిల్దాక**

**మీ ఫ్యాక్షన్ కక్షల ప్రతీకారాల్ని**

**నిరాటంకంగా తీర్చుకోవచ్చు**

**మీ కోస్తా ద్రోహాల మార్కెట్లు తెరిచి**

**మసిబూసి మారేడు కాయ జెయ్యొచ్చు**

**పొద్దుగూకితే నారాయణగూడల్ని నెక్లెస్ రోడ్లని**

**తెనాల్జెయ్యచ్చు, పెద్దాపురాల్జెయ్యచ్చు**

**నమ్మినోల్లని నట్టేట ముంచే తీరుల్ల**

**ఆరితేరినోళ్ళు గదా**

**ఔను మరి.. నగరం మీకు ఫ్రీజోన్**

**కుతకుత తెలంగాణ అట్టుడికిపోతుంది**

**మీ తడిగుడ్డ మోసాలకు**

**తలకొరివి సిద్ధం జేసింది**

**మరో విముక్తి పోరాటానికి ఆరో ప్రాణమైంది**

**ఇది మీ ఫ్రీజోన్ కాదు**

**మీ అబ్బ సొమ్ము అంతకన్నా కాదు**

**ఈ నగరం మా పదిజిల్లాల**

**మూడున్నర కోట్ల ప్రజల గుండెకాయ**

**మా నేల నాడులకి కేంద్రస్థానం**

**మా వెన్నెముక**

**మేం రక్తాన్ని పారించి నిలబెట్టుకున్న**

**మా బతుకు భాగ్యనగరం"**

**(స్కైబాబ(సంపా). 2010 : 58, 59)**

సీమాంధ్ర బడా పెట్టుబడిదారులు హైదరాబాద్‌ను ఫ్రీజోన్‌గా ఉంచాలనీ కొట్లాడటం వెనుకా, లేదా యుటి చేయాలని అడగటం వెనుకా ఉన్నది వేరే లక్ష్యం ఉన్నది. సీమాంధ్ర అక్రమ భూ ఆక్రమణలు, అక్రమ భవన నిర్మాణ అనుమతులు, అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణ, ఫ్లోర్ స్పేస్ కండీషన్స్ వెసులుబాటు, మాస్టర్ ప్లాన్ ఉల్లంఘున వంటి స్వార్థ ప్రయోజనాలకు రక్షణ కావాలి. కనుక హైదరాబాద్‌ను ఫ్రీజోన్‌గా ఉంచినా, యుటి చేసినా వారికి ఈ రక్షణ దొరకుతుంది. కనుకనే సమైక్యరాగంలో ఈ వివాదాన్ని ముందుకు తీసుకువచ్చారు.

మద్రాసులో ఉంటూ అనేక అవమానాలు ఎదుర్కొన్న తర్వాత ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం అక్కడి తెలుగువాళ్లు ఉద్యమించారు. ఆ సమయంలో కేంద్ర ప్రభుత్వం కొత్త రాష్ట్ర ఏర్పాటుకు అంగీకరించింది. కానీ మద్రాసులోని తెలుగు వాళ్లు ఏర్పడబోయే తమ కొత్త రాష్ట్రానికి మద్రాసును రాజధానిగా చేయాలని, మద్రాసు కోసం పట్టుబట్టారు. రాష్ట్రం ఏర్పాటు చేస్తామని కేంద్రం వాగ్దానం చేసిన తర్వాత కూడా పొట్టి శ్రీరాములు తన ఆమరణ నిరాహార దీక్షను కొనసాగించింది మద్రాసు రాజధానిగా కలిగిన ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలనే డిమాండు కోసమే. సరిగ్గా ప్రత్యేక తెలంగాణ ఉద్యమం విజయవంతం అయ్యే దశలోకి చేరుకున్న తర్వాత ఇక రాష్ట్ర విభజన అనివార్యమనుకున్న సీమాంధ్ర బడా వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులు, వారికి సహకారాన్ని అందిస్తూన్న పాలకులు హైదరాబాద్‌ను మా ప్రాంతానికే ఇవ్వాలనే వాదనను ముందుకు తీసుకువచ్చారు. ఈ క్రమంలో అనేక కుతర్కాలకు, అవాస్తవాల ప్రచారానికి దిగారు. హైదరాబాద్‌ను మేమే అభివృద్ధి చేశాం, మేం పెట్టుబడులు పెట్టడం కారణంగా హైదారబాద్ అభివృద్ధి అయ్యింది, అసలు హైదరాబాద్‌ను నిర్మించింది మేమే అని వాదించడం మొదలు పెట్టారు. వాస్తవానికి హైదరాబాద్‌ను నిర్మించింది ఎవరో చరిత్ర తెలిసినవాళ్లకు అవగతమే. రాచరిక ఏలుబడిలోని తెలంగాణ ప్రాంతంలో తెలంగాణ మట్టిమనుషులు తమ కష్టాన్ని కలబోసి హైదరాబాద్‌ను నిర్మించారు. ఈ వాస్తవాన్ని అవాస్తవంగా చూపదల్చుకున్న సీమాంధ్రుల కుట్రవాదాన్ని తెలంగాణ కవులు తీవ్రంగా నిరసించారు. జలూరు గౌరీశంకర్ 'మోసపోయిన రోజు' కవితలో ఇట్లా రాశాడు.

**"నా మంచితనాన్ని తక్కువగా సూడొద్దు**
**హైద్రాబాద్‌కు మట్టెత్తిన కూలీలెవరో తెల్సు**
**గండిపేటకు చేతులెవరిచ్చింద్రు**
**చార్మినార్‌కు రూపమెవరిచ్చింద్రు**
**భాగ్యనగరానికి రక్త రేఖలెవరిచ్చింద్రు"**
**(గౌరీశంకర్, జూలూరు. 2008 : 29)**

సరిగ్గా పైన తెలిపిన భావాతోనే సబ్బని లక్ష్మీనారాయణ 'హైదరాబాద్! ఓ హైదరాబాద్!' దీర్ఘకవిత రాశారు.

**"హైదరాబాద్! ఓ హైదరాబాద్!**
**ఎవరన్నారు నిన్నేలిన ప్రభువులు**
**అసఫ్‌జాహీలు, నిజాం ప్రభువులు**
**నిన్ను అభివృద్ధి చెయ్యలేదని, నిన్ను పట్టించుకోలేదని**
**హైదరాబాద్ స్టేట్ పల్లెపల్లెను కొట్టి**
**ప్రజల రక్తమాంసాల, చెమట శ్రమతో**
**హైదరాబాద్ నగరాన్ని నిర్మించారు ప్రభువులు**
**తమ చెమట చుక్కల నీళ్ళతో ఇసుక సున్నాలకు కలిపి**
**ఈ సుందర హర్మ్యాలు తెలంగాణ ప్రజలు నిర్మించారు**
**హైదరాబాద్! ఓ హైదరాబాద్!**
**చార్‌సౌ సాల్‌కా సుందర్ షహర్!**
**కులీకుతుబ్‌షాహీల(1512-1687) 175 ఏళ్ళ**
**అసఫ్‌జాహీ నైజాం రాజుల(1724-1948) 400 ఏళ్ళ**
**రాజధానివి నువ్వు**
**బతుకుబాటలో నిన్ను ఎవరు స్మరిస్తారు, గుర్తిస్తారు?**
**చరిత్ర అంటే నిజాలే**
**నీ నగర చిహ్నాలే! సుందర అద్భుత కట్టడాలే అందుకు సాక్ష్యం!**
**హైదారబాద్! ఓ హైదరాబాద్!**
**నాల్గువందల యేళ్ళ నుండి**
**నువ్వు అభివృద్ధి చెందిన నగరానివే!"**
**(లక్ష్మీనారాయణ, సబ్బని. 2010 : 4)**

హైదరాబాద్‌ను మేమే నిర్మించామనీ, సినిమా పరిశ్రమ ఉండటం వల్లనే

హైదరాబాద్‌లోని అనేక ప్రాంతాలు అభివృద్ధి చెందాయని వాదించే వారికి కూడా తెలంగాణ కవి సమర్థవంతంగా సమాధానం చెప్పాడు. వడ్డెబోయిన శ్రీనివాస్ రాసిన 'హైదరాబాద్ మా అబ్బ సొమ్మే' కవితలో ఇట్లా అంటాడు.

**"ఎవరైనా**
**ఆఫ్ఘన్ నుంచో**
**అరేబియా నుంచో**
**ఓ ముక్క తుంచుకొచ్చి**
**హైదరాబాద్‌గా అతికించారా!?**
**ఆంధ్రా నుంచి మట్టి తెచ్చి**
**హైదరాబాద్‌గా పోతపోశారా?**

**ఎక్కడి మట్టైనా**
**రాళ్ళురప్పలు ముండ్లు ముడుసులు తీసి**
**చదునుచేసి**
**ప్రాణం పోసి**
**చరిత్రను కనే తల్లిని చేసిన**
**అక్కడి మట్టిమనిషిదే!**

**సమైక్యవాద పెట్టుబడులది కాదు**
**చిరిగిన జీవితాల్ని**
**భ్రమల చతుకుల్ని చేసీ**
**చిరిగిన జేబులకూ**
**చిల్లులు పెట్టే**
**సినీమాయగాళ్లది కాదు"**
**(శ్రీనివాస్, వడ్డెబోయిన. 2010 : 1)**

హైదరాబాద్ భౌగోళికంగా తెలంగాణ జిల్లాల మధ్య భాగంలో ఉంటుంది. తెలంగాణ జిల్లాల ప్రజలందరి సొమ్ముతో, శ్రమతో దానిని ముస్లిం రాజులు నిర్మాణం చేశారు. కానీ, సీమాంధ్ర పెట్టుబడిదారులు హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా చేయాలనే కొత్త నినాదం ఎత్తుకున్నప్పుడు తెలంగాణ కవిత్వం దానినీ నిరసించింది. నిధి 'హైద్రాబాద్ సిర్ఫ్ హమారా' దీర్ఘ కవితలో ఇట్లా రాసింది.

**"హైద్రాబాదు అంటే ఎడమకు మెదక్**
**హైద్రాబాదు అంటే కుడికి మహబూబ్‌నగర్**
**హైద్రాబాదు అంటే ఎదురుగ నల్గొండ**
**హైద్రాబాదు అంటే చుట్టు చూస్తే రంగారెడ్డి**
**మరి హైద్రాబాదు నీదెట్ల అవుతుంది**
**ఉమ్మడి రాజధానిగా ఎట్ల పనికొస్తుంది**
**ఎటెట్ల యూటి అవుతుంది**
**నోరున్నప్పుడు దానికో హద్దు పద్దు ఉండాలి**
**తెలంగాణ అంటే**
**హైద్రాబాదు స్టేట్ జిల్లాలని**
**దేశంలో తెల్వందెవరికి**
**మరి హైద్రాబాదు లేని**
**తెలంగాణ ఎట్లా నిర్వచిస్తారు?**
**హైద్రాబాదంటే నా పట్నం-నా లష్కర్**
**నా నిమాయిషు-నా నిలువెత్తు చిత్రపటం**
**అచ్చంగా హైద్రాబాదు అంటే**
**తెలంగాణ గుండెకాయ**
**సమ న్యాయమంటే**
**నా గుండెను నానుండి పెర్కేయడమా**
**నా చరిత్రను నానుండి చెరిపేయడమా!**

**నా పట్నాన్ని నాకు పరాయి చేయడమా!"**

**(నిధి. 2013 : 8,9)**

ఎన్ని చారిత్రక ఆధారాలు చూపినా, ఎన్ని శాస్త్రీయమైన వాదనలు చేసినా హైదరాబాద్ మాదేననే కుతర్కాన్ని వీడనివారికి తెలంగాణ కవి కొంత ఆగ్రహంతోనే సమాధానం చెప్పాల్సిన అనివార్యత ఏర్పడింది. ఆ సందర్భంలోనే వేముల ఎల్లయ్య 'ఒగలెందుకురా నగదు దొంగల్లారా!' అనే కవిత రాశాడు.

**"పొట్ట గంజి కొడ్కా ఎచ్చిడా ఏతులబద్దవేందిర**
**పెట్టువడంటె పొట్టబల్గజీర్తం లమ్డికొడ్క**
**ఏంర నఖరాల్ రుబాబేంది బే**
**మెలేసి తల దీస్త్రా"**

**(ఎల్లయ్య, వేముల. 2010 : 2)**

తెలంగాణకు దేశదేశాల నుండి, దేశవ్యాప్తంగా ఉన్న అనేక రాష్ట్రాల నుండి లక్షలాదిమంది వచ్చారు. బతుకు దెరువును వెతుక్కుని ఇక్కడే స్థిరపడ్డారు. వాళ్లెవరూ హైదరాబాద్ మాదేనని ప్రకటించలేదు. కానీ కేవలం సీమాంధ్రులు మాత్రమే ఇది మాది అని మాట్లాడటంతో బతుకడానికి వచ్చినోడివి, హైదరాబాద్ నీదెట్లా అవుతుంది అనడం ధర్మాగ్రహంగానే కనబడుతున్నది. స్థూలంగా ఈ కవిత్వం ప్రత్యేక తెలంగాణ ఏర్పాటును సమర్థించేది మాత్రమే కాదు, ఆ తెలంగాణకు ఆదినుండీ ఉంటూ వస్తున్నట్లుగానే హైదరాబాద్ రాజధానిగా, తెలంగాణలో అంతర్భాగంగా ఉండాలని చెప్తుంది.

## 4.18. చరిత్ర

చరిత్ర రచనలో తెలంగాణకు అన్యాయం జరిగింది. క్రీ.పూ. 6వ శతాబ్ది నుండి తెలంగాణకు సంబంధించిన చారిత్రక ఆధారాలు ఇప్పటికే లభ్యమై ఉన్నాయి. ఆ ఆధారాల్లో

తెలంగాణ ప్రాంతంలో ఒక గణతంత్ర రాజరిక వ్యవస్థ ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ చరిత్రకు తెలుగువారి చరిత్రలో భాగం దక్కనివ్వకుండా చేశారు సీమాంధ్ర చరిత్రకారులు. "చరిత్ర రచనలో తెలంగాణ ఇప్పటికి చాల అన్యాయాన్ని ఎదుర్కొన్నది. తెలుగుజాతి చరిత్రను తమలో సంపూర్ణంగా భాగం చేసుకోలేదు. ఈ తొమ్మిది పది జిల్లాల చరిత్రను, ఇక్కడి ప్రజల చరిత్రను, ఇక్కడి ప్రజల సంస్కృతిని ఎక్కడో ఒక అధోజ్ఞాపికగానే చూశాయిగానీ, మొత్తంగా చూడలేదు. అన్యాయం చేశాయి, లేదా అధ్యాయాలకు అధ్యాయాలు రాయవలసిన చరిత్రను ఎక్కడో ఒకటి రెండు వాక్యాలలో కుదించాయి. ఒకటి రెండు పరిచ్ఛేదాలలో ముగించేశాయి, వక్రీకరించాయి"(వేణుగోపాల్, ఎన్. 2006 : 62).

కవి మొదట సామాజికుడు. తన చుట్టూ ఉంటే సమాజాన్ని అర్థం చేసుకోవడం కోసం చరిత్రలోకి వెళ్లే ప్రయత్నం చేస్తాడు. తన అనుభవంలోకి వచ్చిన విషయానికి పునాదుల్ని అన్వేషించే ప్రయత్నం చేస్తాడు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మొదలుకాగానే తెలంగాణ చరిత్ర అధ్యయనానికి పూనుకున్నప్పుడు తెలంగాణ కవికి అసలు విషయం బోధ పడింది. తెలుగు చరిత్రలో తెలంగాణకు స్థానం లేకపోవడం ఆశ్చర్యం మాత్రమే కాదు, ఆవేశం కూడా కలిగింది. ఆ ధర్మాగ్రహాన్ని కవిత్వంగా వెలువరించారు. చింతం ప్రవీణ్ 'నా తెలంగాణా' కవితలో

**"మూలమైన నా చరిత్ర**
**మూలకుపడ్డది**
**ముందుతరం నా చరిత్ర**
**మూలం మర్సింది**

**ఇగ లేంద్రి**
**తెలంగాణ చరిత్రకై**
**కొత్త శిలాశాసనం వేద్దాం"**
**(ప్రవీణ్, చింతం. 2012 : 23)**

చారిత్రక ఆధారాలను బట్టి ఉత్తర తెలంగాణ గోదావరీ తీరంలోనే తొలి ఆవాసాలు ఉన్నట్లు బయటపడింది. అంటే మొత్తం తెలుగు ప్రాంతాల్లోనే ఉత్తర తెలంగాణ ప్రాంతం అత్యంత ప్రాచీనమైనది. పైగా అక్కడ గణతంత్ర రాజరిక వ్యవస్థ అమలు అయింది. అందుకే ఈ కవి మూల చరిత్ర మూలకు పడింది అన్నాడు. సీమాంధ్ర చరిత్రకారులు తెలుగు వాళ్ల చరిత్ర రాసేనాటికే తెలంగాణకు సంబంధించిన చారిత్రక ఆధారాలు లభ్యమై ఉన్నప్పటికీ వాటిని పక్కన పెట్టడమో లేదంటే కేవలం ప్రస్తావనావశాత్తు ఉటంకించడమో చేశారు తప్ప ఇవ్వవల్సినంత ప్రాధాన్యత ఇవ్వలేదు.

తెలంగాణ చరిత్ర మీద విస్తృతమైన పరిశోధన చేసిన సుంకిరెడ్డి నారాయణరెడ్డి స్వయంగా కవి. ఆయన రాసిన'ఎవడ్రీడు?' కవితలో ఇట్లా అంటాడు.

**"నా ఒక్క యిగ్రహముందా జూయించురి**
**నా ఒక్క పెద్దోడ్ని జూయించురి గా శెరిత్ర కాయితాల్ల**
**నా ఒక్క పేరు జూయించురి గాని గుండెలల్ల**
**మా పేరుందా మా వాడుందా"**
**(స్కైబాబ(సంపా). 2010 : 166)**

తెలంగాణ ప్రాచీన సాహిత్య చరిత్ర రాసింది సుంకిరెడ్డి నారాయణ రెడ్డే. ఆయన ఆ కృషిలో ఉన్నప్పుడు అనేక చరిత్ర గ్రంథాలు చదవవల్సి వచ్చింది. ఆ క్రమంలో అనేక వాస్తవాల్ని అర్థం చేసుకున్నారు. కనుకనే తెలంగాణ చరిత్రకు, చారిత్రక పురుషులకు / స్త్రీలకు చరిత్రలో స్థానం ఇవ్వలేదని కవిత్వం రాశాడు. (ఈయనే తర్వాతి కాలంలో 'తెలంగాణ చరిత్ర' పుస్తకం కూడా రాశాడు).

ఆంధ్రప్రదేశ్ చరిత్రనే తెలుగువాళ్లందరి చరిత్రగా రాశారు. విద్యార్థులకూ అదే బోధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ విద్యార్థుల మెదళ్లలోకి ఆంధ్రుల చరిత్రను చొప్పించారు. ఈ విషయాన్ని చైతన్యంతో అర్థం చేసుకున్న తెలంగాణ పరిశోధకులు

గతాన్ని తవ్విపోసే పనిలో పడ్డారు. వర్తమానంలోని విషాద వాతావరణంలోంచే తెలంగాణ చరిత్ర దర్శనం చేస్తున్నారు. వేముల రంజిత్ కుమార్ 'చరిత్రంతా దగానే తెలంగాణకు' కవితలో ఇట్లా రాశాడు.

**"ఆంధ్రప్రదేశ్ పేరుతో పిలవబడుతున్న**
**సమైక్యాంధ్ర గుమ్మాన నిల్చొని**
**చూశానోసారి వెన్ను వెనక్కి తిరిగి**
**మనగడ్డ చరిత్ర పేజీల్ని తిరగేస్తూ**
**ఏంటో అంతా చిత్రవిచిత్రంగా**
**కనిపించీ కనిపించనట్లుగా గాయాల మచ్చలు**
**వాటి తాలూకు ఎఱుకయిన బాధలు**
**బరువు బరువుగా గిర్రుమని రీలు తిరిగాయి**
**ఏ పేజీలో చూసినా**
**ఏ పేరాలో వెదికినా**
**కళ్ళకు కట్టినట్లుగా**
**నా దగాపడ్డ తెలంగాణే"**
**(రంజిత్ కుమార్, వేముల. 2011 : 21)**

చరిత్ర రచనలోనే కాదు సాహిత్య చరిత్ర రచనలో కూడా తెలంగాణకు అన్యాయమే చేశారు. ఈ విషయాన్ని విస్తృతంగా ఇదే పరిశోధనలో వేరేచోట చర్చించాను. మళ్లీ ఇక్కడ సాహిత్య చరిత్రను ప్రస్తావించడానికి కారణం చరిత్ర, సాహిత్యం పరస్పర ఆశ్రితాలూ, పరిపూరకాలూ. తెలంగాణ సాహిత్య చరిత్రను సక్రమంగా రాసి ఉంటే అనివార్యంగా తెలంగాణ చరిత్రను కూడా ఒప్పుకోవల్సి వచ్చేది. కనుక సాహిత్య, సమాజ చరిత్రల్ని రెండింటినీ నిర్లక్ష్యం చేయడం కేవలం కాకతాళీయం కాదు. ఆ ఎరుక తెలంగాణ కవికి వచ్చాక తిరుగుబాటును ప్రకటించడం మొదలైంది. డా॥లావణ్య 'హెచ్చరిక' కవితలో ఇట్లా అన్నది.

**"చరిత్ర తిరగరాయబడుతుంది**

**నువ్వు ఔననక తప్పదు**

**వట్టికోట ఆళ్వార్‌స్వామి**

**అయోధ్య రామకవి**

**మేడిచర్ల రంగాచార్యులు**

**రంగరాజు కేశవరావు**

**గంగులసాయిరెడ్డి లాంటి**

**విస్మృత కవులు తెరమీదకొస్తారు**

**చిలకమర్తి రామానుజాచార్యులు**

**భాగినారాయణ మూర్తి**

**కంభంపాటి అప్పన్నశాస్త్రి, బెల్లంకొండ నరసింహాచార్యులు**

**సిరిసినహాళ కృష్ణమాచార్యులు**

**కవిత్వమై పునర్జీవితులౌతారు.**

**సవరించబడిన సాహిత్య చరిత్రలో**

**నువ్వు మళ్లీ వేలు పెట్టాలని చూస్తావ్**

**కళ్ళు తెరిచిన జన చైతన్యం**

**వినమ్రంగా నీ వ్రేళ్ళని కత్తిరిస్తుంది"**

**(స్నేహ ప్రచురణలు. 2010 : 72)**

ఈ కవితలో పేర్కొన్న కవులంతా ఆయా సమాజాలకు ప్రతినిధులు. వారివారి సాహిత్యాన్ని వెలికితీయడమంటే అనివార్యంగా వారు జీవించిన సమాజాల చరిత్రను పోగేయడమే. తెలంగాణ సాహిత్య చరిత్ర నిర్మాణం కూడా తెలంగాణ చరిత్ర నిర్మాణంలో భాగమే అని గుర్తించాలి. ఈ గుర్తింపు తెలంగాణ కవులకూ, కవయిత్రులకూ ఉన్నది కనుకనే చైతన్యవంతమైన కవిత్వం రాశారు.

చరిత్ర రచనలోని రచయితల స్వార్థం చరిత్రకు ఎట్లా అన్యాయం చేస్తాయో

తెలంగాణ కవికి ఎరుకలోకి వచ్చింది. "ప్రముఖ దక్షిణ భారత చరిత్రకారుడు కె.ఎ.నీలకంఠ శాస్త్రి, భారతదేశ తొలితరం చరిత్రకారుడైన విన్సెంట్ స్మిత్‌ను ఉటంకిస్తూ ప్రాచీన భారతదేశ చరిత్ర రాసిన ఎక్కువమంది చరిత్రకారులు దక్షిణ భారతదేశం ఉనికిలో లేనట్లే రాసినారు. ఉత్తర భారతానికి ప్రథమ స్థానమిచ్చి దక్షిణ భారతానికి ద్వితీయ స్థానం ఇచ్చినారని రాసినాడు. తెలంగాణ చరిత్ర విషయంలో కూడా ఆంధ్ర చరిత్రకారులు ఇదే పని చేసినారు. అందుకే తెలంగాణ ప్రాంతానికి చరిత్రకారులు ఇవ్వవలసినంత ప్రాముఖ్యం ఇవ్వలేదని బి.ఎన్.శాస్త్రి వాపోయినారు. చరిత్ర ఎవరైతే రాస్తారో వాళ్ళగురించి వాళ్ల చరిత్రగానే దాన్ని ప్రచారం చేసుకుంటారు. ఆర్యులు భారతదేశ చరిత్రను (పురాణాలు తదితర గ్రంథాల రూపంలో) రాసి ద్రావిడులను రాక్షసులుగా చిత్రించి ఆర్యులను వీరులుగా చిత్రించారు. బ్రిటీష్ చరిత్రకారులు భారతదేశ చరిత్ర రాసి భారతీయులు చాలా వెనుకబడినవాళ్లు, అసమర్థులు, ఈ దేశాన్ని వీరు పరిపాలించుకోలేరు కాబట్టి ఈ దేశాన్ని మేమే పరిపాలించాలనే వక్రీకరణకు పూనుకున్నారు. ఉత్తర భారతానికి చెందిన చరిత్రకారులు చాలా కాలం వరకు భారతదేశ చరిత్ర పేరుతో ఉత్తర భారతదేశ చరిత్ర రాసినారు. తరువాత దక్షిణభారతంలో ఉన్న రాష్ట్రాలన్నింటిని కలిపి 'దక్కన్' అనే పేరుతో చిన్న చాప్టర్ కేటాయించి ఇదే భారతదేశ చరిత్ర అని చెప్పినారు. అదే క్రమంలో ఆంధ్ర చరిత్రకారులు తెలంగాణ గురించి పట్టించుకోకుండా కోస్తాంధ్ర చరిత్ర రాసి ఇదే మొత్తం ఆంధ్రచరిత్ర అని చిత్రీకరించారు. దీనంతటిని బట్టి చరిత్ర ఎవరు రాస్తారో వారు తమ గురించి రాసి అందరి చరిత్ర అని రాసినట్టు మనకు కనిపిస్తుంది" (నారాయణరెడ్డి, సుంకిరెడ్డి. 2011 : 20, 21). కనుక ఇటువంటి పక్షపాత ధోరణితో రాసిన చరిత్రల్ని తిరగరాయవల్సిన బాధ్యతతోపాటుగా తెలంగాణ చరిత్రను తెలంగాణవారే రాసుకున్నప్పుడు న్యాయం జరుగుతుందని ప్రత్యేక తెలంగాణ ఉద్యమం చైతన్యం ఇచ్చింది. ఆ చైతన్యంతోనే దాడబోయిన రంజిత్ 'మా చరిత్రను మేమే..' కవిత రాశాడు.

**"ఇక మేమే రాసుకుంటాం**
**విస్మరించబడ్డ మా చరిత్రను**
**బలవంతంగా రుద్దిన చరిత్ర**

ఎక్కడున్నా కూల్చేస్తాం!"
**(గోదావరి సాహితీ మిత్రులు. 2011 : 10)**

స్థూలంగా ఈ కవిత్వమంతా తెలుగు ప్రజల చరిత్ర పుస్తకాల్లో, తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ఎండగడుతూనే, తమ ప్రాంతానికి ఉన్న ప్రాచీన చరిత్రను కీర్తిస్తూనే, తమ చరిత్రను తామే రాసుకున్నప్పుడు మాత్రమే తెలంగాణ చరిత్రకు న్యాయం జరగుతుందని తీర్మానించింది. ఇది ప్రత్యేక తెలంగాణ ఏర్పాటులోనే సులువుగా సాధ్యం అవుతుందని కూడా అంతర్గతంగా సూత్రీకరించింది.

## 4.19. నిధుల కేటాయింపులు

తెలంగాణ సుదీర్ఘకాలం నిరంకుశ నిజాం ఏలుబడిలో ఉన్నది. ఆ కాలంలో తెలంగాణ జిల్లాల అభివృద్ధి కోసం నిజాం న్యాయబద్ధంగా నిధులను కేటాయించలేదు. ఆనాటికి ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడుగా ఉన్న హెన్రీ ఫోర్డ్ తర్వాత సంపన్నుడు నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీ ఖానే. తెలంగాణ జిల్లాల నుండి జాగీర్దార్ల ద్వారా, దేశ్‌ముఖ్‌ల ద్వారా, తన సొంత రెవెన్యూ బలగాల ద్వారా కోట్లాది రూపాయలు సంపాదించినప్పటికీ, అందులో కొంత భాగాన్ని హైదరాబాద్ నగర అభివృద్ధికీ, హైదరాబాద్‌లో ఆధునిక విద్యా, వైద్య, రవాణా, నీటిపారుదల సౌకర్యాలు కల్పించడానికీ ఉపయోగించినప్పటికీ, మిగిలిన జిల్లాలన్నీ ఏ ఆధునిక సౌకర్యాలకూ నోచుకోలేక వెనుకబాటుతనంలోనే ఉంచబడ్డాయి. ఇది భూస్వామ్యం సంగతి. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక, భారత ప్రజాస్వామ్యంలో ఏలుబడి మొదలయ్యాక తెలంగాణకు అన్యాయం జరగడమే అసలైన వివక్ష. ఆంగ్లేయ పాలకుల పాలన వల్ల ఆధునిక సౌకర్యాలు పొందిన కోస్తాంధ్ర ప్రాంతంతో పోల్చి చూసి, తెలంగాణకు ఎక్కువ నిధులు, సౌకర్యాలు, అవకాశాలు కల్పించవల్సి ఉండగా, ఆ పని చేయలేదు సరికదా, 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నాటినుండి ఏ ఒక్క సంవత్సరంలోనూ మొత్తం నిధుల కేటాయింపులలో జనాభా నిష్పత్తి ప్రకారం 40 శాతం వాటాగాని, విస్తీర్ణం నిష్పత్తి ప్రకారం 42 శాతం వాటాగాని,

రెవెన్యూ వసూళ్ల ప్రకారం 40 శాతం వాటాగాని అందలేదు. తెలంగాణ నుంచి వచ్చే ఆదాయపు మిగులును తెలంగాణలోనే ఖర్చు పెట్టాలని పెద్దమనుషుల ఒప్పందంలో రాసుకున్నప్పటికీ, ఆ ఒప్పందం అమలు కాలేదు. దీని కారణంగా స్వాంతత్ర్యానికి పూర్వం తెలంగాణ అభివృద్ధి ఎలా ఉన్నదో, స్వాతంత్ర్యం వచ్చాక, భారత ప్రభుత్వ ప్రజాస్వామ్య పాలనలో కూడా తెలంగాణ పరిస్థితి అలాగే ఉండిపోయింది. ఈ విషయాన్ని కూడా ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం విస్తృంగానే వివరించింది.

వేముల రంజిత్ కుమార్ 'చెయ్యేది? చేయూతేది?' కవితలో ఇట్లా రాశాడు.

**"అవమానప్పుల భారాలు**
**పాపం పెరిగినట్లు పెరిగి**
**పాపమెరుగని బిడ్డడి**
**గొంతు తెగ్గోస్తున్న**
**తిగిడిగాళ్ళ సంగతేంటని**
**నడవలేక తిరగలేక**
**ఊబిలో దిగబడ్డ ప్రాణాన్ని**
**అందుకుని ఆదుకునే**
**చెయ్యేది? చేయూతేది?"**
**(రంజిత్ కుమార్, వేముల. 2011 : 39)**

నిరంకుశ ఏలుబడిలో సుదీర్ఘ కాలం మగ్గిపోయిన తెలంగాణకు కనీసం భారత ప్రజాస్వామ్యంలో మేలు జరుగుతుందని భావించినవాళ్లకు నిరాశే మిగిలింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటినుండి అనేక రంగాల్లో వివక్షకు గురి అయిన తెలంగాణకు కనీస ఆదరువు లేకపోవడం కోస్తాంధ్ర పాలకవర్గాల పక్షపాత ధోరణికి నిదర్శనం అని ఈ కవితాసారం.

హైదరాబాద్ రాష్ట్రాన్ని, ఆంధ్ర రాష్ట్రాన్ని కలిపి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేయడమంటే అమాకమైన అమ్మాయికీ, తుంటరి పిల్లాడికీ పెళ్లి చేయడమే అని ఆనాటి ప్రధాని నెహ్రూ

స్వయంగా తెలంగాణ వచ్చినప్పుడు అన్నాడు. ఆయన 'అమాయకమైన' అమ్మాయి అనడంలోని ఆంతర్యం తెలంగాణ ఇంకా అభివృద్ధికీ, ఎదుగుదలకూ నోచుకోలేదని. అటువంటి తెలంగాణను ప్రభుత్వమే చొరవ తీసుకుని అభివృద్ధి చెందించవల్సి ఉండగా వివక్షాపూరితమైన విధానాలతో మరింత దారిద్ర్యంలోకి నెట్టివేసింది. డా॥ రూప్‌కుమార్ డబ్బీకార్ రాసిన 'ఒంటరి అక్షరం' కవితలో ఈ విషయాన్నే ప్రస్తావించాడు.

**"నా మట్టిగడ్డపై**
**నేనిపుడు ఒంటరి పక్షిలా**
**పలకరింపులు లేక**
**పొలమారిన గొంతుకను సవరించుకుంటూ-**
**...**
**నడిచే దారిలో**
**ముళ్ళకంపలా పొడుచుకొచ్చే కంకర రాళ్ళలా**
**వాడి నిర్లక్ష్యపు చూపులు"**
**(డా॥రూప్‌కుమార్ డబ్బీకార్. 2006 : 40, 41)**

తమ ప్రాంతానికి సకల రంగాల్లో అన్యాయం చేస్తూ, నిధుల కేటాయింపులో కూడ మోసం చేస్తున్నారంటూ తెలంగాణ ఉద్యమం ఎగిసిపడిన ప్రతీ సందర్భంలో సీమాంధ్ర ప్రభుత్వాలు, కేంద్రం కంటితుడుపు చర్యలుగా ఏదో ఒక కమిటీ వేయడమో, జీవోలు తీసుకురావడమో చేశాయి. కానీ అవేవీ తెలంగాణకు న్యాయం చేయలేకపోవడం తెలంగాణ కవి అర్థం చేసుకున్నాడు. అందుకే పగడాల నాగేందర్ రాసిన 'కలల బతుకమ్మ' కవితలో ఇట్లా అన్నాడు.

**"ఇన్నేండ్ల సంది-**
**ఈ చీకటింట్ల దీపం పెట్టే నాథుడే లేకపాయె!**
**ఇంక జి.వో.లెందుకు? కమిషన్ లెందుకు?**

**ప్రణాళిక లెందుకు?"**

**(రమేశ్, సుంకర(సంపా). 2008 : 19)**

ఒకవైపు నీటి వాటాల విషయంలో తెలంగాణకు అన్యాయం చేయడం కారణంగా స్థానిక ప్రజల ప్రధాన జీవనాధారమైన వ్యవసాయం అడుగంటిపోయింది. ఇటువంటి స్థితిలో మళ్లీ సీమాంధ్ర పాలకులు ప్రపంచీకరణ విధానాలను ప్రవేశపెట్టడం, తెలంగాణ ప్రజలకు ఉరితాడు బిగించడమే అని తెలంగాణ కవి స్పందించాడు. భీంపల్లి శ్రీకాంత్ రాసిన 'సోది' దీర్ఘకవితలో ఇట్లా రాశాడు.

**"ప్రాజెక్టులు**
**కేటాయింపులు తగ్గాయి**
**ఆంధ్రా ఎత్తులు!**
**విజన్ 2020**
**సావు పత్రం**
**తెలంగాణకు ఉరితాడు!"**
**(శ్రీకాంత్, భీంపల్లి. 2004 : 27)**

నీటిపారుదల విషయంలో జరిగిన అన్యాయం కారణంగా తెలంగాణ వ్యవసాయం దాదాపుగా వర్షాధారంమీదనే ఆధారపడవల్సి వచ్చింది. ఇటువంటి సందర్భంలో ప్రభుత్వ బాధ్యత, రైతులకు రాయితీలు ఇవ్వడం. కానీ తెలంగాణ వ్యవసాయానికి ఎటువంటి రాయితీలు లభించకపోవడం కారణంగా వందలాదిమంది అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడ్డారు. తమ కుటుంబీకులకు కన్నీళ్లు మిగిల్చారు. ఈ విషయాన్నే వివరిస్తుంది గుముడాల చక్రవర్తిగౌడ్ రాసిన 'కలం – కలకలం' కవిత.

**"ఆంధ్రాలో బిందు సేద్యం**
**తెలంగాణలో బిందెసేద్యం**

**ప్రభుత్వం చూస్తోంది చోద్యం**

**అక్కడ నిధులు పరుగు**

**ఇక్కడి నిర్లక్ష్యం దేవుడెరుగు**

**అక్కడ పంటలకు నీళ్ళు**

**ఇక్కడ ప్రజలకు కన్నీళ్ళు"**

**(శ్రీకాంత్, భీంపల్లి(సంపా). 2011 : 9)**

తెలుగుజాతి మనది, నిండుగ వెలుగు జాతి మనది అని సినిమా మీడియా ద్వారా చెప్పించి, తెలంగాణ ప్రజలను భావదారిద్ర్యంలోకి నెట్టే పనిని సీమాంధ్ర పాలకవర్గాలు చేశాయి. తెలుగు జాతి మొత్తం ఒకటే అయినప్పుడు అన్ని ప్రాంతాలను సమానమైన దృష్టితో చూడవల్సిన బాధ్యత ప్రభుత్వాలది. కానీ పరిస్థితి దీనికి పూర్తి భిన్నంగా ఉన్నదని వివరిస్తుంది బోల యాదయ్య రాసిన 'స్వరాష్ట్రాభిలాష' కవిత.

**"తెలుగు జాతంత ఒకటంద్రు**

**తెలంగాణ బానిసలంటుంద్రు**

**విధులు, నిధులు పదవులన్ని**

**జన్మత: మాకంటుంద్రు**

**పుట్టు మూగల మమ్ము జేసి**

**పట్టణములనేలుచున్న పాలక సీమాంధ్రులారా**

**మీ పంచాన మా చెంచాలు"**

**(యాదయ్య, బోల. 2011 : 32)**

ఒకవైపు సీమాంధ్ర పాలకవర్గాలు తెలంగాణను దోపిడీ చేస్తుంటే ప్రశ్నించవల్సిన తెలంగాణ ప్రాంత ప్రజా ప్రతినిధులు చెంచాల పాత్ర నిర్వహించడం పై కూడా ఈ కవిత ధర్మాగ్రహం వ్యక్తం చేసింది. ఇటువంటి చెంచాల కారణంగానే సీమాంధ్ర పాలకుల కుట్రలు కొనసాగుతున్నాయని కూడా అంతర్గతంగా హెచ్చరించింది. దాదాపుగా ఇదే

సారంతో దంగ్రె రాజమౌళి రాసిన 'ఎన్నేళ్ళీ దోపిడీ?' కవితలో ఇట్లా అన్నాడు.

**"ఆంధ్ర పెట్టుబడిదారులారా!**

**వారి తొత్తులైన తెలంగాణ నేతలారా!!**

**ఎన్నాళ్ళు తెలంగాణను దోచుకుంటరు?**

**ఎంతమంది ప్రాణాలను బలి తీసుకుంటురు??**

**ఇంకా మీ దోపిడి సాగనివ్వం..**

**మా నిధులు మాకే ఖర్చు చేయాలె.."**

**(రాజయ్య, నల్లెల్ల(సంపా). 2009 : 8)**

మొదటి ఎస్సార్సీ నివేదిక ప్రకారమైనా, పెద్ద మనుషుల ఒప్పందంలో చేసుకున్న తీర్మానం ప్రకారమైనా తెలంగాణకు న్యాయబద్ధంగా నిధుల కేటాయింపు జరగవల్సి ఉన్నది. కానీ తెలంగాణ దోపిడే లక్ష్యంగా కొనసాగిన సీమాంధ్ర పాలన తెలంగాణ ప్రజలను బలితీసుకుందని చెప్పడం ఈ కవిత ఉద్దేశ్యం. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఇచ్చిన చైతన్యంతో కావచ్చు, ఇప్పటిదాకా అసమ పంపిణీ చేసిన మీ దోపిడీ విధానాల్ని ఇక సహించబోమని కూడా ఈ కవిత స్పష్టం చేస్తుంది.

స్థూలంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కాంక్షకు నిధుల కేటాయింపులో జరిగిన అన్యాయాలు కూడా ఒక మౌలికమైన కారణం అని ఈ కవిత్వం స్పష్టం చేస్తున్నది.

## 4.20. ఒప్పందాలు, జీవోలు, కమిటీలు, కమీషన్‌లు - ఉల్లంఘనలు

ఆంధ్రప్రదేశ్ ఏర్పాటే పెద్ద మనుషుల ఒప్పందం పునాది మీద జరిగింది. రాష్ట్రం ఏర్పడిన మరుసటి రోజే ఆ ఒప్పందం ఉల్లంఘనకు గురైంది. అది మొదలు రెండవ ఎస్సార్సీ (శ్రీ కృష్ణ కమిటీ) వరకు అనేక ఒప్పందాలు, కమిటీలు, కమీషన్‌లు, జీవోలు వచ్చాయి. కానీ ఏవీ తెలంగాణకు న్యాయం చేయలేకపోయాయి. దానికి కారణం ఇవన్నీ

కూడా తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు, లక్ష్యానికి అనుగుణంగా పనిచేయకపోవడమో, లేదంటే కమిటీలు, కమీషన్‌లు ఇచ్చిన నివేదికలనూ, జీవోలనూ సరిగ్గా అమలు చేయకపోవడమో జరిగింది. కనుకనే తెలంగాణ సమాజానికి వీటిపట్ల నమ్మకం లేకుండా పోయింది. ఏ ఒప్పందాలు చేసుకున్నా, ఎన్ని కమిటీలు, కమీషన్‌లు నివేదికలు, మార్గదర్శకాలు ఇచ్చినా, జీవోలను తీసుకువచ్చినా వాటిని అమలు చేయవల్సింది ప్రభుత్వాలే కనుక, ఆ ప్రభుత్వాలు సీమాంధ్ర పెట్టుబడిదారుల, వ్యాపారుల కనుసన్నల్లో నడిచినవి గనుక తెలంగాణకు రవ్వంతైనా న్యాయం జరగకపోగా పైగా నష్టం వాటిల్లింది. అందుకే తెలంగాణ కవులు వీటిని తీవ్రంగా నిరసించారు. పరిమళ్ 'నెత్తుటి పాదాలతో నడవాలి' కవితలో తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వరకు జరిగిన పరిణామాల్ని విమర్శనాత్మకంగా రాశాడు.

**"ఫజల్ అలీ మొత్తుకున్న**
**మానీల్లు తాగి బలసినపైస**
**పైకి ఎగబాకడానికే**
**56 ద్రోహాన్ని రుద్దింది**
**అసెంబ్లీ ఆంధ్రాజేబులోకి మారాక**
**ఇసుక పరచుకుంటూ పరచుకుంటూ**
**తెలంగాణా ఎడారయ్యింది**
**ఒప్పందాలు కమిటీలు ముల్కిరూల్స్**
**అన్నీ బూజు పట్టి పోయాయ్**
**పగిలిన బతుకులోంచి**
**69 పోరాటం లావాలా చిమ్మింది"**
**(పరిమళ్. 2010 : 6, 7)**

తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఏ అనివార్యతల నడుమ రూపుదిద్దుకున్నదో ఈ కవిత వివరించింది. మొదటి ఎస్సార్సీ జస్టిస్ సయ్యద్ ఫజల్ అలీ, హృదయనాథ్

కుంబ్రూ, కె.ఎం. ఫణిక్కర్‌లతో 1953 డిశెంబర్ 29న ఏర్పాటు అయ్యింది. ఈ ఎస్సార్సీ దేశవ్యాప్తంగా 98, 420 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని పర్యటించి, తొమ్మిదివేల మంది వ్యక్తులతో మాట్లాడి, 1,52,250 అభ్యర్థనలను స్వీకరించి, తన 267 పేజీల నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఆ ఉమ్మడి నివేదికకు అటు ఫజల్ అలీ, ఇటు ఫణిక్కర్‌లు అనుబంధ పత్రాలను కూడా చేర్చారు. కమిషన్ తన నివేదికను 1955 సెప్టెంబర్ 30న సమర్పిస్తే, కేంద్ర ప్రభుత్వం 1956 జనవరి 16న తన నిర్ణయాలను ప్రకటించింది. 1956 ఏప్రిల్‌లో పార్లమెంటులో ప్రవేశపెట్టిన రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ బిల్లు 1956 జులైలో ఆమోదం పొంది, 1956 నవంబర్ 1 నుండి అమలులోకి వచ్చింది. భారత ప్రభుత్వం ఎస్సార్సీ నివేదికను, దాని సిఫారసులను ఎంతమాత్రం ఖాతరు చేయకుండా దాన్ని తన ఇష్టారాజ్యంగా, అడ్డదిడ్డంగా అమలు చేసిందని ఆ తర్వాతి పరిణామాలు రుజువుచేశాయి. 'ఒకే భాష, ఒకే రాష్ట్రం' అనే ప్రాతిపదిక ఎల్లవేళలా ఆమోదయోగ్యమేమీ కాదని, ఇతర కారణాలతో పాటు దాన్ని సమతూకంతో చూడాలని మొదటి ఎస్సార్సీ సిఫారసు చేసింది. డా॥ బి.ఆర్.అంబేద్కర్ కూడా కొత్త రాష్ట్రాల ఏర్పాటు విషయంలో ఇదే అభిప్రాయాన్ని చెప్పి ఉన్నాడు. కానీ ప్రభుత్వం ఈ సిఫారసులను బుట్టదాఖలు చేసింది.

పదహారు రాష్ట్రాలనూ, మూడు కేంద్రపాలిత ప్రాంతాలనూ ఏర్పాటు చేయాలని మొదటి ఎస్సార్సీ సూచించింది. కానీ ఆ స్థానంలో 14 రాష్ట్రాలు, ఆరు కేంద్రపాలిత ప్రాంతాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాజరికపు వాసన కొడుతున్న రాజప్రముఖ్ పదవిని రద్దుచేయాలని మొదటి ఎస్సార్సీ సూచించింది. అంతకు ముందటి సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేసుకున్నప్పుడు మాజీ సంస్థానాధీశులకు పాత రాజభోగాలను కొనసాగించడానికి ఏర్పాటైనది ఈ రాజప్రముఖ్ పదవి. మొదటి ఎస్సార్సీ సూచన ప్రకారం ప్రభుత్వం దాన్ని రద్దు చేయలేదు. ఆ తర్వాత 13 సంవత్సరాలకు ఇందిరాగాంధీ దాన్ని రద్దు చేసేదాకా అది కొనసాగింది.

మొదటి ఎస్సార్సీ హర్యానా, జార్ఖండ్, నాగాలాండ్ రాష్ట్రాలు ఏర్పాటు

చేయనక్కరలేదని సూచించింది. అప్పటికి ఆ సిఫారసును ఆమోదించినట్టు కనిపించిన ప్రభుత్వం ఆ తర్వాత రాజకీయ కారణాల రీత్యా 1963లో నాగాలాండ్‌ను, 1966లో హర్యానాను, 1998లో జార్ఖండ్‌ను ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పాటు చేసింది. మొదటి ఎస్సార్సీ మధ్యప్రదేశ్‌లోని మరాఠీ భాషా ప్రాంతాలైన బుల్దానా, అకోలా, అమరావతి, యవత్మల్, వార్ధా, నాగపూర్, భండారా, చందా జిల్లాలతో విదర్భ ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని సిఫారసు చేసింది. ఆ సిఫారసును అప్పుడు మాత్రమే కాదుకదా, నేటికీ అమలులోకి తేలేదు. తెలంగాణ విషయంలో ప్రధాన నివేదిక పేరా 381 నుండి పేరా 393 వరకూ హైదరాబాదు రాష్ట్రానికి అనుకూలంగా వాదనలు రాసి, సిఫారసు నం. 28.4లో అప్పుడున్న హైదరాబాదు రాష్ట్రం నుండి రాయచూరు, గుల్బర్గా, మరత్వాడా జిల్లాలను వేరు చేసి మిగిలిన భాగాన్ని ప్రత్యేక రాష్ట్రంగా ఉంచాలని సిఫారసు చేసింది. మిగిలిన హైదరాబాదు రాష్ట్ర శాసనసభ 1961 సాధారణ ఎన్నికల తర్వాత ఆంధ్రప్రాంతంతో విలీనం కావాలని నిర్ణయం తీసుకుంటే విలీనం కావచ్చునని సిఫారసు చేసింది. అంతకు ముందే పేరా. 383లో తెలంగాణ ప్రజల అభిప్రాయాలు ఆ ఆరు సంవత్సరాలలో విలీనానికి అనుకూలంగా బలపడకపోతే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఉండిపోక తప్పదని రాసింది. ఈ చరిత్ర ద్వారా అర్థమయ్యే విషయం కేంద్ర ప్రభుత్వం అమలు జరపడం కోసం కాకుండా తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూనే, దానికి ప్రజాస్వామ్య పాలన ముసుగు తొడగడం కోసమే ఎస్సార్సీని నియమించినట్లు అర్థం అవుతుంది. కనుకనే ఈ పరిణామాల్ని గమనించిన, అర్థం చేసుకున్న తెలంగాణ బుద్ధిజీవులకు ఎస్సార్సీల మీదా, ఒప్పందాల మీదా నమ్మకం సడలిపోయింది. కట్టా భగవంత రెడ్డి దీర్ఘ కవిత 'జుదాయి జంగ్' ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు దగ్గరి నుండి జరిగిన పరిణామాల్ని చిత్రించింది.

**"మిలాఖత్ దగా**

**పెద్దమనుషుల దగా**

**హైద్రాబాదాంధ్ర దగా**

**అరువైతొమ్మిది దగా**

**ఆరుగాలం దగా**

**ఇంటిదొంగల దగా**

**జీవో ముప్పైఆరు దగా**

**అఖిల పక్షం దగా**

**అష్టపంచ దగా**

**ఆరుసూత్రాల దగా**

**అధ్యక్ష ఆర్డర్ల దగా**

**అమలు దగా**

**ఆచరణ దగా**

**ఆరువందల పది దగా**

**హైటెక్కుల దగా**

**ఎక్కడలేని దగా**

**ఏడు తరాల దగా"**

**(భగవంతరెడ్డి, కట్టా. 2010 : 8)**

పెద్ద మనుషుల ఒప్పందం దగ్గరి నుండి 610 జీవో దాకా జరిగిన పరిణామాల్ని మొదటి అధ్యాంలో విపులంగా చర్చించడమైనది. ఈ కమిటీలు, జీవోలన్నీ కేవలం తెలంగాణను మోసగించడానికి వాడుకున్న వ్యూహాలే అని ఈ కవి తెలియజేశాడు.

తెలంగాణకు అన్యాయం జరగడంలో కేవలం సీమాంధ్ర పాలకవర్గాల పాత్ర మాత్రమే లేదని, అందులో సీమాంధ్ర పాలకవర్గాలకు తొత్తులుగా మారిన తెలంగాణ ప్రజాప్రతినిధుల ప్రమేయం కూడా ఉన్నదని మసన చెన్నప్ప 'ఏ ఉగాదికి పాడలేని కోకిలలు' అనే కవిత వివరిస్తుంది.

**"ఎలాగైతేనేం**

**కాకుల కోరిక నెరవేరింది**

క్రమంగా ఇవతలి చెట్టుమీదికి
వలసలు మొదలయ్యాయి
ఇష్టం లేకపోతే విడిపోవచ్చని
గద్ద ఒక పత్రం కూడా రాసిపెట్టింది
ఒప్పందాలు జరిగాయి
ఒప్పందాలు తుంగలో తొక్కి
గంగలో మునగడం కాకులకలవాటైంది
నీడనిస్తే చాలన్న కాకులు
పూలను చిదిమేశాయి
కాయలు తుంచేశాయి
అంతటా అధికారం చెలాయించాయి
'కూహూ' అంటే గద్దకు చెప్పి
కోకిలల నోరు మూయించాయి"
(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 321)

తెలంగాణ ఉద్యమ తీవ్రతను తగ్గించడానికి నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 'అష్టసూత్ర ప్రణాళిక'ను ముందుకు తీసుకువచ్చింది. ఆ సందర్భంగా కాళోజీ 'అష్టసూత్ర ప్రణాళిక' కవిత రాశాడు.

"తెలంగాణ వేర్పాటును
తేల్చనిదీ అయితెమానె
అష్టసూత్ర ప్రణాళిక
అందముగా రుజువుజేయు

పన్నెండేడులు పాలన
ఫలితాంశము నిక్కచ్చిగ

కన్నెపిల్లల అన్నయ్యల
కళ్యాణ లాఘవము

బ్రహ్మానందుని అండన
బ్రతుకుచున్న ముల్కిమంత్రి
అష్టకానికాక్కొక్కటి
అందెను ప్రమాణ పత్రము
పన్నెండేడులు ప్రాంతము
బాగోగులు అరయకుండ
ఊరేగిన ఘనత చాటి
పేరు ప్రతిష్ఠల నిలుప

అష్టకానికొక్కొక్కటి
అందెను ప్రమాణపత్రము

ఒప్పందాలను మరచి
తప్పుడు కూతలుకూస్తూ
ప్రాంతాన్ని పాడుజేయు
పన్నాగపు 'బాబా'ల

అష్టకానికొక్కొక్కటి
అందెను ప్రమాణపత్రము"
**(కాళోజీ. 2012 : 347)**

తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉధృతం కాగానే ఆనాటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ 1969 ఏప్రిల్ 11న పార్లమెంట్‌లో అష్ట సూత్ర పథకాన్ని ప్రకటించారు.

అందులోని ప్రధాన అంశాలు ఇవి. 1. ఆంధ్ర ప్రాంతానికి చెందిన తెలంగాణ మిగులు నిధుల లెక్కలు తేల్చడానికి ఒక ఉన్నతాధికార సంఘాన్ని నియమించి, ఆ సంఘం ఒక నెల రోజులలో తమ నివేదిక సమర్పించే విధంగా నిబంధన విధించడం. 2. మిగులు నిధుల తరలింపు వలన తెలంగాణకు జరిగిన నష్టాన్ని భర్తీ చెయ్యడానికి కావలసిన నిధులు సమకూర్చడం. 3. ముఖ్యమంత్రి అధ్యక్షతన ప్రణాళికా సంఘం ప్రతినిధి, తెలంగాణ మంత్రులు, తెలంగాణ ప్రాంతీయ సంఘం అధ్యక్షులు సభ్యులుగా ఒక ప్రాంతీయ సంఘాన్ని ఏర్పాటు చేసి తెలంగాణ అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయడం. 4. ప్రణాళికా సంఘం సలహాదారుడు అధ్యక్షుడుగా ఒక అధికార సంఘాన్ని ఏర్పాటు చేయడం. కేంద్ర హోంమంత్రి, ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రతినిధులు ఆ సంఘంలో సభ్యులుగా ఉండి నిర్ణయించిన పథకాల అమలును పర్యవేక్షించడం. 5. తెలంగాణ ప్రాంతీయ సంఘానికి, ఆ ప్రాంతపు అభివృద్ధి కొరకు ఏర్పాటు చేసిన అధికార యంత్రాంగానికి ఇంకా ఎక్కువ అధికారాలనివ్వడం. 6. తెలంగాణ ప్రాంతంలోని ఉద్యోగాలను స్థానికులకే ఇవ్వడానికి కావలసిన రాజ్యాంగపరమైన కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం. 7. తెలంగాణ ఉద్యోగుల సర్వీసుకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ ఆధ్వర్యంలో ఒక కమిటీ ఏర్పర్చడం. 8. తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన సమస్యలపై నిరంతరం కృషి జరగాలి కాబట్టి, ప్రధానమంత్రి సమక్షంలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి సమీక్ష జరపడం. వాస్తవానికి ఈ ఎనిమిది సూత్రాలను కనీస ఉపశమనంగా కూడా తెలంగాణ ప్రజలు భావించలేదు. పైగా ఏప్రిల్ 15న తెలంగాణ పోరాట దినంగా పాటించారు. ఈ కవిత ఆ నేపథ్యంలోంచి పుట్టిందే. ఆనాటి తెలంగాణ ప్రజలు ఎనిమిది సూత్రాల పథకంపట్ల ఎటువంటి అభిప్రాయాలు కలిగి ఉన్నారో చెప్పడమే ఈ కవితాసారం.

పెద్దమనుషుల ఒప్పందమే ఒక కుట్ర అనీ, తెలంగాణను దోచుకోవడం కోసం పన్నిన పన్నాగమే అది అనీ, నిజానికి రెండు వేరువేరు రాజకీయార్థిక చరిత్రలూ, సంస్కృతి, భాష, సాహిత్యం, చరిత్ర కలిగిన ప్రాంతాలను అశాస్త్రీయంగా కలపడం వలన తెలంగాణ ప్రాంతం నిర్వీర్యం అయిపోయిందని చెప్పేదే బూర్ల వెంకటేశ్వర్లు 'ఆత్మగౌరవ కిరీటం'

అనే కవిత.

**"ఒక గుండెకాయను**
**మరో శరీరంతో కలిపి**
**కుట్టేసిన అనాలోచిత చర్య**
**ఒక్క భాష పేరుతో**
**పరాయి కౌగిట మోసగించబడ్డ విషాద చరిత్ర**
**కృష్ణా గోదారుల తల్లిరొమ్ములు**
**రక్తపింజరలు గ్రోలుతున్న బాధా సందర్భం**
**చేతిలో తీర్థం పెట్టడానికి లక్షన్నొక్క విజ్ఞాపనలు**
**గుళ్ళైపలారం కోసం వేయిన్నొక్క మొక్కులు**
**రోజు రోజుకు అంగడవుతున్న బతుకులు**
**కాకుల గూటిలో జన్మించబడుతున్న కోకిలలు**
**ఎంత జాలెపోతపోసి అల్లినా**
**నువ్వు నాపై ఒడుపుగా విసిరిన వల**
**పెద్దమనుషుల ఒప్పందం**
**నువ్వు పచ్చబొట్టు పొడిపించుకోవడానికి**
**తయారైన ఫార్ములా**
**ముల్కీ నిబంధన సవరణ**
**ఒకానొక నీ చతురత్వకళ**
**ఆరున్నూటపది**
**నా ఆర్థికమూ, రాజకీయమూ**
**సామాజికమూ, సాంస్కృతికమూ**
**నీ గుప్పిట్లోంచి రాలుతున్న ఇసుక"**

**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 275)**

నిజానికి 610 జీవో అన్నది ఆరు సూత్రాల పథకం అమలులో జరిగిన ఉల్లంఘనల్ని సవరించడం కోసమే వచ్చింది. దీని ప్రధాన ఉద్దేశ్యం తెలంగాణలో ఉన్న తెలంగాణేతర ఉద్యోగుల్ని గుర్తించి వారిని వారి వారి ప్రాంతాలకు బదిలీ చేయడం.కానీ ఆచరణలో దీనిని విఫలం చేయడం ఆనాటి ప్రభుత్వ కుట్ర. “సాధారణ పరిపాల శాఖ 1985 డిసెంబర్ 30న విడుదల చేసిన ఈ జి.ఒ.ఎం.ఎస్.నం. 610, ‘ఆరు సూత్రాల పథకం – ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ (ఆర్గనైజేషన్ ఆఫ్ లోకల్ కాడర్స్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్) ఆర్డర్, 1975 – 5,6 జోన్లలో సవరణలు – ఉత్తర్వులు – జారీ చేయడం ’ అని మొదలవుతుంది. అది 20 అక్టోబర్ 1975న జారీ అయిన జి.ఒ.ఎం.ఎస్. నం. 674, 1 నవంబర్ 1975న జారీ అయిన జి.ఒ.నం.728, 729లతోపాటు 5 అక్టోబర్ 1985న తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు రాసిన ఉత్తరాలను ప్రాతిపదికగా పెట్టుకుంది” (వేణుగోపాల్, ఎన్. 2010 : 219). ఈ జీవో ప్రకారం కేవలం రాష్ట్రంలోని కేవలం 5, 6 జోన్లలోని తెలంగాణేతర ఉద్యోగుల్ని మాత్రమే గుర్తించి వెనక్కి పంపాలి. మిగతా తెలంగాణ జిల్లాలు అందులోకి రావు. సరే కనీసం 5,6 జోన్లలో ఉన్న తెలంగాణేతర ఉద్యోగుల్ని అయినా బదిలీ చేశారా అంటే అదీ జరగలేదు. అదొక ప్రహసనంగానే మిగిలిపోయింది. అందుకే తెలంగాణ కవి ఆరువందల పది జీవో పట్ల ఇంతటి నిరసనతో స్పందించవల్సి వచ్చింది. ఏనుగు నరసింహారెడ్డి ‘ఆరు నూర్ల పది’ అనే కవితలో ఇట్లా అన్నాడు.

**“మీకు తెలియదు అన్నలారా,**
**610 ఐదూళ్ళ పెట్టు**
**కురుక్షేత్రాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడానికి**
**ఇన్నాళ్ళూ చక్రం తిప్పిన సెక్రటేరియెట్ల కుట్రలు మరవడానికి**
**‘ఆరవ జోన్’ను ‘ఫ్రీ’గా ఎంజాయ్ చేసిన దగా**
**ఆరు సూత్రాల పథకాన్ని అంగల్లో పెట్టిన ఆగం**
**ముల్కీ నిబంధనల్ని నట్టేట ముంచిన బాధ**
**అక్రమ డిప్యుటేషన్‌లు, అంతులేని చొరబాట్లు**

**సృష్టించిన విషవలయం విషయం మరవడానికి**

**610 ఐదూళ్ళ పెట్టు"**

**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 201, 202)**

తెలంగాణను దోపిడీ చేసిన విషయాన్ని మరిపించడం కోసం వేసిన ఎత్తుగడనే ఈ ఆరువందల పది జీవో అని ఈ కవిత చెప్తుంది. అంతేగాని ఈ జీవో తెలంగాణ ప్రజలకు ఒరగబెట్టేది ఏమీ లేదని స్పష్టం చేస్తుంది.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఫలవంతమైన దశకు చేరుకోవడం కావచ్చు, విశాల ప్రజానీకం ఉద్యమంలో భాగస్వామ్యం వహించడం కారణం కావచ్చు, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేస్తామని స్వయంగా కేంద్రమే ప్రకటించి వెనక్కు తీసుకొని ప్రకటించిన కమిటీ కావడం వలన కావచ్చు, శ్రీకృష్ణ కమిటీ మీద వచ్చినన్ని ప్రత్యేక తెలంగాణోద్యమ కవితలు మరే ఇతర కమిటీ మీద గానీ, రక్షణల మీదగానీ, జీవోల మీదగానీ రాలేదు.

2009 నవంబర్‌లో ప్రత్యేక తెలంగాణోద్యమ మలిదశ ఉత్తరార్థం మొదలైంది. తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కేసీఆర్)ను నవంబర్ 28 అరెస్టు చేసి 14 రోజుల రిమాండ్ కోసం ఖమ్మం సబ్‌జైలుకు పంపించడం, అక్కడనే కేసీఆర్ దీక్షకు ఉపక్రమించడం, అదే నెల 30న ఆయన దీక్షను భగ్నం చేయడానికి చేసిన ప్రయత్నాలు, దాంతో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న యూనివర్శిటీల్లోని విద్యార్థులు ఉద్యమంలోకి రావడం, మళ్లీ డిశెంబర్ 1 నుండి కేసీఆర్ ఖమ్మం ఆసుపత్రిలో దీక్షకు కూర్చోవడం, డిశెంబర్ 4న విజయవంతమైన తెలంగాణ బంద్, మరోవైపు అప్పటికే సినీ నటుడు చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో సభ్యులైన జోగయ్య, కత్తిపద్మారావులు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి జై ఆంధ్ర ఉద్యమాన్ని చేపట్టడం, తెలంగాణ తీర్మానానికి తెలుగు దేశం పార్టీ కూడా మద్దతు ప్రకటించడం, అనివార్యమైన పరిస్థితుల్లో ఆనాటి ముఖ్యమంత్రి అధ్యక్షతలో అఖిలపక్ష సమావేశం జరిపి ప్రాంతీయ, జాతీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోవడం, మరోవైపు తెలంగాణ ఉద్యమకారులపై

పోలీసులు లాఠీచార్జీ చేయడం, విద్యార్థి లోకమంతా వీధుల్లోకి వచ్చి ఉద్యమాన్ని తీవ్రతరం చేయడం, మరోవైపు ఉద్యమం భౌతిక చర్యల్లోకి దిగడం మూలంగా 2009 డిశెంబర్‌లో కేంద్ర హోం మంత్రి పి.చిదంబరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం అయ్యిందని ప్రకటించాడు. దీంతో సీమాంధ్ర ప్రాంతానికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు 117 మంది తమ పదవులకు రాజీనామాలు ప్రకటించడం, లగడపాటి రాజగోపాల్ వంటి పాలకవర్గ పెట్టుబడిదారుడు దీక్షకు ఉపక్రమించడం, అప్పటికి ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో తెలంగాణకు మద్దతు ప్రకటించిన ప్రజారాజ్యం, తెలుగుదేశం పార్టీ, కాంగ్రెస్ పార్టీల్లోని సీమాంధ్ర ప్రజా ప్రతినిధులు పార్టీల నిర్ణయానికి వ్యతిరేకంగా కృత్రిమ ఉద్యమాలు నిర్వహించడం, ఢిల్లీలో ఎంపీల లాబీయింగ్ మొదలైనవాటి నేపథ్యంలో కేంద్రం తన ప్రకటనను వెనక్కి తీసుకుంటూ 2010 ఫిబ్రవరి 3న విస్తృత ప్రజాభిప్రాయ సేకరణ చేస్తామంటూ శ్రీకృష్ణ కమిటీని నియమించింది. దీనినే రెండవ ఎస్సార్సీ అంటారు. అప్పటికే మొదటి ఎస్సార్సీ సిఫారసులను తుంగలో తొక్కిన కాంగ్రెస్ పార్టీ పాలననూ, అనేక కమిషన్‌లనూ, పథకాలనూ, రక్షణలనూ, జీవోలనూ, వాటి అమలుకాని విధానాన్ని చవిచూసిన తెలంగాణ ప్రజలు శ్రీకృష్ణ కమిటీని తీవ్రంగా నిరసించారు. తెలంగాణ ప్రజాభిప్రాయాన్ని నిజం చేస్తూ శ్రీకృష్ణ కమిటీ కోస్తాంధ్ర సంపన్నవర్గాలకు అనుకూలమైన విషయాలనే తన నివేదికలో పొందుపర్చింది. పైగా ఎనిమిదవ అధ్యాయంలో తెలంగాణ ఉద్యమాన్ని ఎట్లా అణచివేయాలో కూడా కేంద్రానికి సూచనలు చేసింది. ఈ నేపథ్యంలో జి.నర్సింహస్వామి రాసిందే 'SKC సీమాంధ్ర కుట్ర కమిటీ' కవిత.

**"SKC సీమాంధ్ర కుట్ర కమిటీ**
**అసలు రంగుసీసా బయటపడింది**
**దాంట్లోంచి నల్లరాక్షసులైదుగురు**
**గజకర్ణ గోకర్ణ టక్కుటమార విద్యల్తో**
**మన పోరగండ్లను ఎట్ల కొట్టాల్నో**
**మనండ్ల మనకు ఎట్ల చిచ్చు పెట్టాల్నో రహస్యంగా చెప్పింద్రు-**

**హిరణ్యకశిపులు హిట్లర్లు కూడా**

**అమలు చేయని పనుల్ని ఎట్ల చేయాల్నో**

**ఎంత ఈజీగా చేయొచ్చో చెప్తుండ్రు**

**మనిండ్లల్ల మనల్ని ఎట్ల సతాయించాలో**

**హింసపెట్టి ఎట్ల కొట్టుకుంట సంపాలో మెల్లమెల్లగ చెప్తుండ్రు**

**డిక్షనరీలల్ల లేనంత దుర్మార్గుల్ని ఎలా పంపింగ్ చేయాల్నో**

**ప్రజల హక్కుల్ని ఎలా కాలరాయాల్నో**

**రక్షణను ఎలా పాతరేయాల్నో చెప్తుండ్రు**

**ప్రజల పైసల్తోని పెట్టిన కమిటీ**

**వాళ్ళకే పంగనామాలు పెట్టుడు చెప్తుంది**

**ప్రభుత్వానికి 'ఎస్ బాస్' అంటున్నందుకు**

**కమిటీ ఛైర్మన్ల నజరానాలు దక్కుతనే ఉంటయి"**

**(సాగర్ కళామందిర్. 2012 : 77)**

ఈ కవిత్వమంతా తెలంగాణకు కావాల్సింది ఉపశమనాలో, రక్షణలో, జీవోలో, కమీషన్‌లో, కంటితుడుపు చర్యలో కాదనీ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు మినహా తమ సమస్యలకు వేరే పరిష్కారం అక్కర లేదని చెప్తున్నది. అదే సమయంలో ఆయా కమిటీలు, ఒప్పందాలు, రక్షణలు, జీవోలు, పథకాలు తెలంగాణకు ఎంత అన్యాయం చేశాయో, పాలకవర్గాల కుటిల నీతి ఎట్లా ఉన్నదో కూడా కీలకంగానే ప్రస్తావించింది.

## 4.21. పాలకవర్గాల రాజకీయాలు

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం పేద ప్రజానీకానికి సాధించిపెట్టిన హక్కులను తిరిగి వెనక్కి తీసుకున్నదీ, హైదరాబాద్ రాష్ట్రాన్ని, ఆంధ్ర రాష్ట్రాన్ని ప్రజాభిప్రాయానికి భిన్నంగా కలిపి, ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటు చేసిందీ, అప్పటినుండి 1983 వరకు ఆంధ్రప్రదేశ్‌ను ఏలింది కాంగ్రెస్ పార్టీనే. ఆ తర్వాత 1983 నుండి 1989

వరకు తెలుగుదేశం పార్టీ పరిపాలించింది. 1990 నుండి 1994 వరకు కాంగ్రెస్ పార్టీ పాలించింది. మళ్లీ 1995 నుండి 2004 వరకు తెలుగుదేశం పార్టీ పాలించింది. 2004 నుండి 2014 వరకు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగేదాక పరిపాలించింది కాంగ్రెస్ పార్టీనే. అంటే మొత్తంగా 41 సంవత్సరాలు కాంగ్రెస్, 16 సంవత్సరాలు తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్‌ను పరిపాలించాయి. ఈ రెండు పార్టీలూ ఆంధ్రప్రదేశ్‌కు పరిచయం అయినప్పటి నుండే సీమాంధ్ర పార్టీలుగా పనిచేశాయి. రాష్ట్రంలోని ఇతర పెద్ద పార్టీలైన బీజేపీ, టీఆర్ఎస్, మజ్లిస్, సీపీఐ, సీపీఎం, లోక్‌సత్తా, వైఎస్ఆర్ కాంగ్రెస్‌లు ఎన్నిక సందర్భంలో కూటముల్లో భాగాస్వాములుగానో, ఒంటరిగానో పోటీ చేస్తూ వచ్చాయిగానీ వాటికి ఏనాడూ పరిపాలనాధికారాలు చేజిక్కలేదు. అంటే మొత్తంగా ఆంధ్రప్రదేశ్ పరిపాలనాధికారాలు రెండు తెలంగాణ వ్యతిరేక పార్టీల చేతుల్లోనే ఉంటూ వచ్చాయి. ఒక్క తెలంగాణ రాష్ట్ర సమితి మినహాయించి మరే ఇతర పార్టీ కూడా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రత్యక్షంగా కృషి చేయలేదు. అధికారంలోకి రాగలిగే పెద్ద పార్టీలతో పొత్తు పెట్టుకోవడం మినహా టీఆర్ఎస్, కాంగ్రెస్, టీడీపీ మినహా ఇతర పార్టీలు తెలంగాణకు ఏమీ చేయలేదు. పైగా తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా అధికారంలో ఉన్న ప్రభుత్వాల ఆధీనంలోనే ఉండవల్సిన అనివార్య స్థితి. దాంతో తెలంగాణ రాజకీయ నాయకత్వం తెలంగాణ ప్రజల అభీష్టానికి అనుగుణంగా పనిచేసే అవకాశమే లేకుండా పోయింది. (పైగా మర్రి చెన్నారెడ్డి స్వయంగా తొలిదశ ఉద్యమాన్ని కాంగ్రెస్ పాదాలవద్ద పెట్టి ద్రోహం చేశాడనే వాదన చరిత్రలో రికార్డు అయి ఉన్నది కూడా.)

ఈ నేపథ్యంలో చూసినప్పుడు అటు సీమాంధ్ర రాజకీయ నాయకులుగానీ, తెలంగాణ రాజకీయ నాయకులుగానీ తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు భిన్నంగానే పనిచేశారు. అందువల్ల తెలంగాణ కవి దీనిని తీవ్రంగా నిరసించాడు. కాళోజీ రాసిన 'పల్లెకు పొయ్యొచ్చిన' కవితలో ఈ విషయమే స్పష్టం అవుతుంది.

**"ఏమో నీ మాటలు విని**

**నమ్మ నేను నమ్మడెవడు**
**ఢిల్లికి పొయ్యొచ్చి నీవు**
**పల్లెకు పొయ్యొచ్చినట్లు**
**కల్లురిమ్మ హెచ్చినట్లు**
**'కైపు'తో పల్కుతు వున్నవు**
**'తెలంగాణ' కడ్డుపడకు**
**దివానాగ మాటాడకు**
**బాడాయిల బ్రహ్మన్నా!**
**పాపాల భైరవన్నా!**
**'జైహింద్, జై తెలంగాణ'**
**కోటిన్నర ప్రజల కోర్కె**
**భారత మాతాకీ జై**
**తెలంగాణ జిందాబాద్"**
**(కాళోజీ. 2012 : 348)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మూడవ ముఖ్యమంత్రిగా పనిచేసిన కాసు బ్రహ్మానంద రెడ్డి మీద రాసింది ఈ కవిత. ఆయన ముఖ్యమంత్రి పదవీకాలం 1964 ఫిబ్రవరి 21 నుండి 1971 సెప్టెంబర్ 30 వరకు. తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఈయన కాలంలోనే నడిచింది. ఆ సమయంలో ఆయన ఢిల్లీకి వెళ్లి రాష్ట్రంలోని పరిస్థితుల గురించి కాంగ్రెస్ పెద్దలకు నివేదించి వచ్చిన సందర్భంలో ఈ కవిత వచ్చింది. గుంటూరు జిల్లాకు చెందిన కాసు బ్రహ్మానంద రెడ్డి సీమాంధ్ర ప్రయోజనాలు నెరవేర్చేందుకు కృషి చేస్తున్న సమయంలో ప్రత్యేక తెలంగాణ అన్నది కోటిన్నర ప్రజల కోరిక అని ఆయనకు తెలియజేయడం కోసమే ఈ కవిత ఉద్దేశించింది.

వేరు తెలంగాణ ఎందుకు అవసరమో తెలియజేస్తూ కాళోజీ రాసిన 'ప్రధానమంత్రి ప్రకటన' కవిత ఆనాడు సంచలనం సృష్టించింది.

“ ‘ఫిర్దోసీ’ చచ్చినాక
గజ్నీ మహమూద్ కానుక
ఎందుకమ్మా? ఎందుకమ్మ?
ఏ పీనుగు శోభకమ్మ

ప్ర.మ. శ్రీమతి గాంధీ!
ప్రకటన ఎందులకమ్మ?
రక్షణ ఒప్పందాల
రక్షణ యిపుడానమ్మ?

అస్తిత్వము మాసినాక
అమృతమెందుకు తల్లీ?
ఆంధ్ర ప్రదేశము రాజ్యము
అయినది తునకలు అమ్మ.

మూడుముళ్లు తెగిపోయెను
మూడునాడులిపుడమ్మా.
పన్నెండేడుల పొత్తూ
పాడైపోయింది తల్లి.

చేటుగూరినోళ్ల పొత్తు
చేయము ఇకమీదటమ్మ
పార్టీ పేరు ప్రతిష్ఠకు
ప్రాంతము బలి పెట్టకమ్మ.

కోటిన్నర ప్రజల మేటి

కోర్కె యిపుడువేరమ్మ.
వేర్పాటు తప్ప యిపుడు
వేరుమాట లేదమ్మా

తెలంగాణ వేర్పాటుకు
తెరువేర్పడి వుందమ్మా
రాయలసీమయు వేరుగ
రాణించునొ ఏమోనమ్మా?

కోస్తావారితో వారికి
కుదరదు యికపైనమ్మా
ఫ.అ.క. నివేదించి
పద్నాలుగేండ్లయిందమ్మా

తిరుగ తోడుటేమి లేదు
తీరినదే ప్రశ్నమ్మా
కేంద్ర ప్రభుత్వం కోర్కెయె
కీడుగూర్చె మాకమ్మా

ఒప్పందాలను నమ్మి
ఒప్పుకుంది చాలమ్మా
ఎవరి ప్రాంతమును వారిని
ఏలనియ్యి ఇందిరమ్మ

వేరు వేరుగ వుంటే
పోరు వుండబోదమ్మ?

మరో రాజ్యమొకటి భరత
మాతకు బరువానమ్మ?

పడీ పడక వేరుబడుట
చెడుట ఎట్లు అగునమ్మ?
తెగేదాక బిగియిస్తే
తెగును తాడు గదనమ్మ

ఆంధ్రరాష్ట్ర మన్నదొకటి
అయివున్న దేనాడమ్మా
తెలంగాణ వేరుపడితె
తీరిపోవు సమస్యమ్మ

తొమ్మిది జిల్లాల పటము
నెమ్మదిగా చూడమ్మా
క్రొత్త జిక్కులేమి లేవు
కోర్కె పాతదేనమ్మా

మెప్పించిన ఒప్పందమె
తప్పి చచ్చిపోయెనమ్మ
చచ్చిన ఒప్పందమిపుడు
తెచ్చె తెలంగాణమమ్మ

అష్టసూత్ర ప్రణాళిక
అరిష్టాల బాపతమ్మ
'తెలంగాణ' ఏర్పాటే

**తెలుగోరికి శుభమమ్మా**

**సదురక మెలిగితె చాలు**
**కుదిరిపోవు రోగమమ్మ**
**'ఫిర్దోసి' చచ్చినాక**
**గజ్నిమహమూద్ కానుక**
**ఎందుకమ్మ? ఎందుకమ్మ?**
**ఏ పీనుగు శోభకమ్మ?**
**ప్ర.మ. శ్రీమతి గాంధీ!**
**ప్రకటన ఎందులకమ్మ?**
**భారతమాతకి జై**
**తెలగాణ జిందాబాద్"**
**(కాళోజీ. 2012 : 354)**

ఈ దీర్ఘమైన కవితను మొత్తం పరిశోధనలో చేర్చడానికి కారణం ఇందులో అనేక ముఖ్యమైన అంశాలు చర్చించబడ్డాయి. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడిన కాలంలో ఆ ఉద్యమానిన చల్లార్చడం కోసం ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ అష్ట సూత్ర ప్రణాళికను ప్రకటించింది. అందులో ఏముందో గత విభాగాల్లోనే వివరించడమైనది. ఆ ప్రణాళికను నిరసిస్తూ ఈ కవిత వచ్చింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ అస్తిత్వాన్ని రూపుమాపే పని చేశాక, పన్నెండేండ్ల ఉమ్మడి పాలనలో తెలంగాణకు అన్ని రంగాల్లో అన్యాయం జరిగాక, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రయోజనాల కోసం, అధికార దాహం కోసమే రాష్ట్రాన్ని కలిపి ఉంచుతున్న సందర్భంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం అడుగుతున్నదని ఈ కవిత చెప్తుంది. అదే సమయంలో తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలను విడివిడిగానే ఉంచాలనే మొదటి ఎస్సార్సీ నివేదికను కూడా ఈ సందర్భంగా గుర్తు చేసింది. ఆనాటికి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న

భూభాగం అంతా ఏనాడూ కలిసి లేదనీ, భిన్నమైన చరిత్ర కలిగిన ఇరు ప్రాంతాలు చరిత్ర పొడుగునా వేరువేరు ఏలుబళ్ల కిందనే ఉన్నాయని విశదీకరిస్తుంది. ఇవాళ వచ్చిన ప్రత్యేక తెలంగాణ డిమాండ్ కొత్తదేమీ కాదని, తెలంగాణ ప్రజానీకం మొదటి నుండి ప్రత్యేక రాష్ట్రంగానే ఉండడానికి అభిలషించినట్లు చెప్పడం ఉన్నది. పైగా ఈ కవితలో కనిపించే విశేషం కాళోజీ ఆత్మవిమర్శ చేసుకోవడం. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు సందర్భంలో కాళోజీ విశాలాంధ్రకే మద్దతు ఇచ్చి ఉన్నాడు. ఆ తర్వాత సీమాంధ్ర పాలకుల దుర్నీతినీ, అన్యాయాలను చూసిన తర్వాత తన అభిప్రాయం తప్పని తెలుసుకున్నాడు. అందుకే కవితలో ఒప్పందాలను నమ్మి మోసపోయాం అని రాశాడు. ఈ కవిత మొత్తం ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు వినా వేరే పరిష్కారం లేదని తెలుపుతుంది.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఎగిసిపడినప్పుడల్లా రెండు తెలుగు ప్రాంతాల్లో ఉన్న రాజకీయ పార్టీల ప్రతినిధులు ద్విపాత్రాభినయం చేయడం తెలంగాణ కవుల అనుభవంలోకి వచ్చింది. ఇంతకు ముందే చెప్పినట్లు తెలంగాణ ప్రాంత రాజకీయ నాయకులు కూడా అధికార పార్టీకు అనుగుణంగా ఉండవల్సి రావడం వలన, వీళ్లు కూడా తెలంగాణకు అన్యాయమే చేశారని గోపని చంద్రశేఖర్ రెడ్డి రాసిన 'ముసుగు' కవిత వివరిస్తుంది.

**"ముసుగు వేస్తే తెలంగాణ**
**ముసుగు తీస్తే సమైక్యాంధ్ర**
**రాజకీయ రాబందుల రహస్య**
**ఒప్పందాల ద్వంద్వ వైఖరులు**
**ద్విపాత్రాభినయ అద్వితీయ లీల**

**పార్టీలన్నీ ఆడుతున్నాయి**
**తెలంగాణ వైకుంఠపాళి**
**వైకుంఠం పోతారో లేదంటే**

నరక కూపంలో పడి చస్తారో
ఏ కాలసర్పం కాటేస్తుందో
ఏ నిచ్చెన కూలదోస్తుందో

రెండు ప్రాంతాలు రెండు కళ్ళంటారు
మేమంతా తెలంగాణ కనుకూలమంటారు
ఏ రెండు కళ్ళకు చూసినా కానరావు
కాలి నేలరాలిన మా విద్యార్థి కుసుమాలు
ఏ చెవులకు వినరావు మూడొందల
మాతృమూర్తుల గర్భశోకాల కన్నీళ్ళు

మాటిమాటికీ అధిష్టానం సాకు
మూటగట్టిన అప్రతిష్టి సోకు
తేనె పూసిన కత్తులు
గొంతులు కోసే ఎత్తులు
...
సీమాంధ్రతో అనుబంధాలా
తెలంగాణతో తెగతెంపులా
ఓదార్పు యాత్రలకు ఆహ్వానాలా
సీమాంధ్ర నేతలకు బాకాలా"
(చంద్రశేఖర్ రెడ్డి, గోపిరెడ్డి. **2010 : 8**)

తెలంగాణ వ్యవసాయాన్ని విధ్వంసం చేసి రైతుల ఆత్మహత్యలకు కారకులైనవారు, మళ్లీ తెలంగాణలోనే 'ఓదార్పు యాత్ర'లు చేపట్టడాన్ని ఈ కవిత విమర్శిస్తుంది. అదే సమయంలో ఈ యాత్రలు చేపడుతున్నవాళ్లందరూ సీమాంధ్ర పెట్టుబడిదారుల ప్రయోజనాలను నెరవేర్చే తొత్తులేననే విషయాన్నీ విమర్శనాత్మకంగా చెప్తుంది.

తెలంగాణలో ఉన్న తెలుగు దేశం పార్టీ, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు తమ అధిష్టానం నిర్ణయానికి అనుగుణంగానే ఉండి, తెలంగాణ ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా పనిచేయడాన్ని నిరసిస్తూ సంబరాజు రవిప్రకాశరావు 'సూరీళ్లై మొలుస్తున్నారు' అనే కవిత రాశాడు.

**"ఏలికలు శూన్యాలై**
**తమ తమ కక్ష్యలలో**
**పరిభ్రమిస్తున్నప్పుడు**
**చేతలు చేతులెత్తేసి పల్లేరు గాయాలను**
**ఒళ్లంతా పూస్తున్నదెవరు?"**
**(జగన్ రెడ్డి, ఎస్(సంపా). 2012 : 92)**

తెలంగాణలో ఎన్నికలను గెలవడానికీ, తమ ఉనికిని కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసే కుట్రల్ని ఎండగట్టడం కోసం పంతం యాకయ్య రాసిన కవితలో ఇట్లా ఉన్నది.

**"ఇచ్చేది మేమంటరు తెచ్చేది మేమంటరు**
**ఇటలీ రాణింటికాడ కుక్కలాగ పడి ఉంటరు**
**కాంగిరేసు నేతలూ వనం విడిచిన కోతులూ**
**తెలంగాణ తేకపోతే.. చెప్పు దెబ్బల మోతలు**
**తెలంగాణ ఉద్యమము మొదలైన ప్రతిసారి**
**మీసాలను మెలేస్తూ మీడియాల ముందుకొచ్చి**
**అమ్మ చేతులున్నదని ఆగమాగం చేస్తుంద్రు**
**ఢిల్లీకి పోతుంద్రు పిల్లులయ్యి వస్తుంద్రు"**
**(బుచ్చిరెడ్డి, కోమటిరెడ్డి(సంపా). 2012 : 67)**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఉండాలా లేదా అని నిర్ణయించవల్సింది తెలుగు ప్రజలు. కానీ ఆ అధికారం సోనియా గాంధీ (కాంగ్రెస్ పార్టీ అధినేత్రి) చేతుల్లో ఉండడం అప్రజాస్వామికం అని ఈ కవిత చెప్తుంది. అదే సమయంలో తెలంగాణ తెచ్చేదీ, ఇచ్చేదీ మేమే అని తెలంగాణలో బాకాలూదిన కాంగ్రెస్ నాయకులు, తెలంగాణ అంశం గురించి కేంద్రంతో మాట్లాడివస్తామని ఢిల్లీకి వెళ్లి, డీలాపడి తిరిగిరావడాన్ని కూడా ఈ కవిత నిరసిస్తుంది.

తెలంగాణ ప్రజల్ని తెలుగుదేశం పార్టీ ఎట్లా మోసం చేసిందో వివరించేదే బియ్యాల జనార్ధన్‌రావు రాసిన 'తెలంగాణ గోగ్రహణం' అనే కవిత.

**"నక్సలైట్లే దేశభక్తులని మెచ్చుకొని**
**నా నవనాడుల్లో నిక్షిప్తమైన**
**అనుబంధాన్ని వోటు బ్యాంకుగా మార్చి భాగ్యనగరాన్ని**
**ప్రపంచ బ్యాంకుకు తాకట్టుపెట్టే తన ఖాతాదారుల**
**వారసులు తెలంగాణ పాలకులు**
**బందగీ, త్యాగాలన్నీ ఆలేరు వాగుల్లో కలిసినాక**
**అయిలమ్మలు అందరు పాలకుర్తికే పరిమితమైనాక**
**దొరలు చచ్చి "దొర బాబులు" హెచ్చాక**
**నైజాములు పతనమై నయా నవాబులు**
**ఆంధ్రాబాద్‌లో అడ్డ వేశాక**
**ఈస్ట్‌సిటీ, వెస్ట్ సిటీ మొత్తం**
**పరాయివాడి సొత్తుగా మారిపోయింది"**
**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 92)**

సినిమా నటుడిగా ఉన్న నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్), రాజకీయాల్లోకి వచ్చి, నక్సలైట్లే నిజమైన దేశభక్తులు అని ప్రకటించాడు. ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వాన్ని స్థాపించాడు. ఆ తర్వాతి కాలం నుండే విప్లవోద్యమాన్ని తీవ్రంగా అణచివేస్తూ వందల

సంఖ్యలో విప్లవకారులను బూటకపు ఎన్‌కౌంటర్లలో కాల్చి చంపించాడు. ఆ విషయం తదుపరి విభాగంలో విపులంగా చర్చించాను. ఎన్టీఆర్ తరువాత తెలుగుదేశం పార్టీ తరఫున ముఖ్యమంత్రి అయిన నారా చంద్రబాబు నాయుడు ప్రపంచబ్యాంకుకు తొత్తుగా పనిచేస్తూ, తెలంగాణను ప్రపంచీకరణకు ఒక ప్రయోగశాలగా మార్చి, స్థానిక ప్రజలను పరాయీకరణకు గురిచేశాడని ఈ కవిత విశదం చేస్తుంది.

ఎన్.గోపి 'ఉద్యమం వర్సెస్ రాజకీయం' అనే కవితలో ఎన్నికల రాజకీయాల అసలు స్వరూపాన్ని, స్వభావాన్ని స్పష్టం చేశాడు.

**"ఎప్పుడైనా**
**ఉద్యమాన్ని ఉరితీయడానికి**
**రాజకీయం తాడు పేనుతుంది**
**నేల రాలిన శవంలోంచి**
**మరో ఊపిరి**
**ఊపిరిని మట్టిలో నాటితే**
**పోరాట వృక్షం మొలుచుకొస్తుంది**
**ఆకులు హరిత తరంగాలౌతాయి**
**ఆకాశం ముక్కు మూసుకొని**
**సముద్రంలో దూకుతుంది**
**చరిత్ర ఎప్పుడూ ఉద్యమం వైపే**
**రాజకీయాలే చీలిన పేలికలౌతాయి**
**ఉద్యమం గడ్డిపోచల ఆకాంక్ష**
**రాజకీయం తుపాకుల ఆంక్ష**
**ఉద్యమం పాట**
**రాజకీయం రెండు నాల్కల మాట**
**ఉద్యమం అగ్నిపునీత**

**రాజకీయం రంగులు మార్చే నేత**

**రక్త తర్పణం ఉద్యమం**

**బిత్తరపోయేది రాజకీయం**

**ఉద్యమంలో విషబిందువు రాల్చేది రాజకీయం**

**వాటిని అరిగించుకునేది ఉద్యమం**

**రాజకీయం రణగొణ**

**ఉద్యమం ఒక మహాఉప్పెన**

**ఉద్యమం జనస్వామ్యం**

**రాజకీయం ధనస్వామ్యం**

**ప్రజాస్వామ్యం పగుళ్ళువారితే**

**ఉద్యమంపై మళ్లీ మరో ఉద్యమం**

**నిరంతరంలోంచి చిరంతనపద్యం"**

**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 303)**

ఏ ప్రజా ఉద్యమమైనా ప్రజా సంక్షేమం కోసమే వస్తుంది, కానీ రాజకీయ పార్టీలు ప్రజా సంక్షేమంకోసం కాక స్వార్థాలకోసం పనిచేస్తాయి కనుక ఉద్యమాల్ని అణచివేస్తాయనీ, ఇప్పటిదాకా తెలంగాణను ఏలిన పార్టీలన్నీ అదే పని చేశాయనీ ఈ కవిత వివరిస్తుంది. పైగా రాజకీయాలన్నీ ధనస్వాముల చేతుల్లో చిక్కాయనీ, ఇటువంటి పరిస్థితి ఉన్నంత కాలం ఉద్యమాలు రావడం అనివార్యమైన సామాజిక పరిణామం అని ఈ కవిత చెప్తుంది.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో తొలిదశలో నాలుగు వందలమందికి పైగా అమరులైతే, మలిదశలో పదిహేనువందలమందికి పైగా అమరులు అయ్యారు. ఆయా కాలాల్లో తెలంగాణ ప్రజాప్రతినిధుల్లో ఏమాత్రం చలనం లేకపోవడాన్ని నిరసిస్తూ సూరేపల్లి సుజాత 'లాఠీలు తూటాలు ఆపలేవు' కవిత రాసింది.

**"సిగ్గు లజ్జ లేని శవ రాజకీయాలు చేసే**

**నాయకుల్లారా మీరు**
**ఈ తెలంగాన గడ్డ బిడ్డలైనందుకు**
**మా చావులు, మాపై విరిగిన లాఠీలు**
**చిందిన రక్తం, మిమ్మల్ని కదిలించనందుకు**
**మీ మౌనాన్ని చూసి**
**మమ్మల్ని మేమే అసహ్యించుకుంటున్నం**
**రాపిడిలో పుట్టేవి అగ్గి రవ్వలే**
**పిల్లిని పట్టుకొని కొడితే అయ్యేది పులే**
**ఇక్కడ రక్తంలో అమాయకత్వం ఉంది**
**అట్లనే విప్లవం కూడా ఉంది"**
**(స్కైబాబ(సంపా). 2010 : 25)**

తెలంగాణ నాయకుల వెన్నెముకలేని తనాన్ని నిరసిస్తూనే, మీకు కూడా కాలం చెల్లే కాలం ఒకటి వస్తుందనీ, తెలంగాణ నేలలో ఉన్న విప్లవం మీకు బుద్ధి చెప్తుందని ఈ కవిత హెచ్చరిస్తుంది. సమ్మక్క సారక్కల దగ్గరి నుండి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వరకు తెలంగాణ నేలమీద అనేక పోరాటాలు జరిగాయి. వాటిలో ప్రజలదే విజయం. కనుకనే ఇవాళ కూడా కుట్రపూరితమైన రాజకీయాలు ఓడిపోక తప్పదని, తెలంగాణ ప్రజల పోరాటం ఎప్పటిలాగే విజయవంతం అయి తీరుతుందని వంగాల సంపత్ రెడ్డి రాసిన 'ప్రజా పోరాట మైక్రోస్కోపు' కవిత స్పష్టం చేస్తుంది.

**"రాజకీయ గుంటనక్కలు**
**పదవీ రాజకీయ వ్యూహాలు పన్నుతూనే ఉన్నాయి**
**అయితేనేం ప్రజలెప్పుడూ మోసపోరు!**
**ఊసరవెల్లి రాజకీయం**
**విషం కక్కుతూనే ఉంది**
**అయితేనేం**

**ప్రతీసారి ప్రజలు**
**పోరాట వారసత్వాన్ని గుర్తు చేస్తూనే ఉన్నారు"**
**(గోదావరి సాహితీ మిత్రులు. 2011 : 23)**

స్థూలంగా ఈ కవిత్వం సీమాంధ్ర పాలకులనే కాదు, తెలంగాణ ప్రాంత ప్రజా ప్రతినిధులను కూడా దుయ్యబడుతుంది. అదే సమయంలో మొత్తంగానే పాలకవర్గ స్వభావం ఎట్లా ఉంటుందో, ప్రజాకంటక పాలన ఎలా ఉంటుందో కూడా చెప్తుంది. ప్రజాపోరాటాలు ఎప్పటికైనా విజయవంతం కావలసినవేనని చెప్తూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కూడా ఏర్పడి తీరుతుందనే విశ్వాసం ప్రకటిస్తుంది.

## 4.22. నిర్బంధం, రాజ్యహింస

సీమాంధ్ర వలస పాలనలో తెలంగాణ ప్రాంతమంతా తీవ్రమైన అణచివేతనూ, నిర్బంధాన్నీ ఎదుర్కుంది. అన్యాయమైన పాలనను భరించలేక, బతుకడమే కష్టమైన అనివార్య పరిస్థితుల్లో సాధారణమైన ప్రజలు ఉద్యమకారులుగా మారారు. అనేక ఉద్యమాలకు ఊపిర్లూది సీమాంధ్ర పాలనా విధానాల్ని ఎండగట్టారు. ఈ క్రమంలో సీమాంధ్ర ప్రభుత్వాలు దమనకాండలకు పూనుకున్నాయి. కేవలం ప్రత్యేక తెలంగాణోద్యమం మీదనే కాకుండా అనేక అస్తిత్వ ఉద్యమాల, పౌర హక్కుల ఉద్యమాల నాయకత్వాలను కూడా చంపేస్తూ పోయాయి. ఈ నిర్బంధం మీద, పాలకవర్గాలు ప్రయోగిస్తున్న హింస మీద కూడా ప్రత్యేక తెలంగాణ కవిత్వం వచ్చింది.

తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మీద కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. హైదరాబాదు, వరంగల్, నిజాంబాదు, రంగారెడ్డి మొదలైన జిల్లాలన్నింటిలో ఉద్యమకారుల మీద లాఠీచార్జీలు, బాష్పవాయుగోళాల ప్రయోగం, కాల్పులు చేసింది. ఈ క్రమంలో వందలాది మంది గాయపడ్డారు. సుమారు 370 మంది మరణించారని ప్రభుత్వ లెక్కలే చెప్తుండగా, 400 మందికి పైగా మరణించారని తెలంగాణ

సామాజికవేత్తలు ఆధారాలు చూపారు. ఇది ఒక ఎత్తైతే ప్రభుత్వం అనుసరించిన మరొక విధానం అక్రమ కేసులు, అరెస్టులు, నల్ల చట్టాల ప్రయోగాలు. 1969 ఉద్యమం కొనసాగుతున్న కాలంలో ఆగస్టు 10న వరంగల్‌లో సత్యాగ్రహం జరిగింది. వైద్య విద్యార్థి నాయకుడు కొల్లూరి చిరంజీవితోపాటు కాళోజీని కూడా అరెస్టు చేశారు. ఆ సందర్భంలో కాళోజీ ఈ కవిత రాశాడు.

కాళోజీ 'ప్రత్యేక తెలంగాణ అంటే' కవితలో ఇట్లా రాశాడు.

**"ప్రత్యేక తెలంగాణ అంటే**
**పక్కలిరగ తన్నేందుకు**
**ఆ.ప్ర.రా ప్రభుత్వాన్కి**
**అధికారము ఎక్కడిది?**
**ప్రజాస్వామ్య రాజ్యాంగం**
**పరిపాలన గల దేశము**
**ప్రజా మతము ప్రకటిస్తె**
**పట్టి కొట్టి చంపేస్తద?**
**వేలు లక్షలు ప్రజలు**
**జేలుకేగ సిద్ధపడితె**
**ఏర్పాట్లు చేయలేక**
**లాఠీచార్జి పరిపాలన?**
**కాడెద్దుల ధోరణిలో**
**కూడని పనియే లేదా?**
**విసిగి వేసారి జనం**
**హింసకాండ తలబెడితె**
**కేంద్రానిది బాధ్యతంత**
**'ప్రెస్టేజి' పేర హింస**

**ప్రభుత్వాన్కి సబబైతె**

**ప్రాణిధర్మ హింసకాండ**

**ప్రజలకు కూడా సబబే**

**బ్రహ్మాన్న చంపు చంపు**

**ఏ పాటి చంపుతావో**

**తూటాలు ఎన్నున్నయో**

**పేల్చుకో, ఆబాలం గోపాలం**

**చంపు చంపు చంపు అనుచు**

**బరి రొమ్ములతో బజార్లో**

**తూటాలను ఎదురుతాౘ్రు**

**ఒకటో రెండో వుంచుకో**

**తుదకు ఆత్మహత్యకైన**

**అక్కరకొస్తె నీకు, లేకుంటే**

**ప్రాణాలతో ప్రజల చేతికే**

**చిక్కితే నీకున్నది కుక్కచావు"**

**(కాళోజీ. 2012 : 399)**

ఏదైనా ఒక సామాజిక సమస్య ఎదురైనప్పుడు మొత్తం సమాజమే స్పందిస్తుంది, ఉద్యమిస్తుంది. ఆ సందర్భంలో ప్రజాస్వామ్యయుతంగా పాలిస్తున్నామని ప్రకటించుకునే ప్రభుత్వాలు సమస్య మూలాల్ని అన్వేషించి, పరిష్కారాల్ని కనిపెట్టాలి. ఇది భారత రాజ్యాంగం కల్పించిన స్ఫూర్తి. కానీ ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి మూలం తామేనని, తమ స్వార్థప్రయోజనాలే అని తెలిసిన సీమాంధ్ర ప్రభుత్వాలు సమస్యను పరిష్కరించే దిశగా కాకుండా ఉద్యమాలను అణచివేసే దృష్టితో చూశాయి. కనుకనే ఈ కవితలో కాసుబ్రహ్మానందరెడ్డి గురించి ప్రస్తావిస్తూ మీ పాలన కూలిపోక తప్పదని కవి హెచ్చరించాడు.

హత్యలు రెండు రకాలు. ఒకటి ప్రత్యక్ష హత్య, రెండు పరోక్ష హత్య (ఇదే ఆత్మహత్యగా సమాజంలో చెలామణి అవుతూ ఉంటుంది). ప్రత్యేక తెలంగాణ ఉద్యమ తొలిదశలో పోలీసులే లాఠీచార్జీలు చేసి, కాల్పులు జరిపి ఉద్యమకారులను హతమార్చారు. మలిదశ పూర్వార్ధంలో కూడా బూటకపు ఎన్‌కౌంటర్‌లు చేసి, హత్యలు చేసి తెలంగాణ ఉద్యమకారుల్ని చంపేశారు. కానీ మలిదశ ఉత్తరార్ధ ఉద్యమంలో ఆత్మహత్యలు చేసుకునే విధంగా ప్రేరేపించారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్‌లో ఒంటిమీద పెట్రోలు పోసుకుని తగులబెట్టుకుని ఆత్మార్పణం చేసిన శ్రీకాంతాచారి మొదలు వందలాది మంది విద్యార్థులు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఆత్మహత్య చేసుకున్నారు. దీనికి ప్రభుత్వమే కారణమని తెలియజేసేదే  జూపాక సుభద్ర రాసిన 'అస్సోయిదూలాతో ఆడే నా రోజెన్నడో' కవిత.

**"గా పొద్దు నీ సెరని యిడిపించనీకి కొట్లాడిన నా పోరగాండ్లని**
**పిట్టలోలె కాల్చి సంపితే**
**గీనాడు కనిపించని కుట్రలు పెట్రోలై హత్యలు జేస్తూ**
**నన్ను సావుల రేవు జేస్తున్నరు"**
**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 337, 338)**

పై కవిత లాగానే ఆత్మహత్యల్ని శాస్త్రీయంగా విశ్లేషించిందే దర్భశయనం శ్రీనివాసాచార్య రాసిన 'దిగంబరం' అనే మరో కవిత.

**"సాంకేతికంగా మాట్లాడితే**
**అవును- అతనిది స్వయం మరణమే!**
**సశాస్త్రీయంగా తెరిచి చూస్తే**
**తెలుస్తుంది అదొక అప్రత్యక్ష హత్య అని!**
**ఇంతకూ అతన్నెవరు చంపారు**
**అత్యాధునిక సరళతర శతాబ్దంలో**
**ఎవరూ ఎవర్నీ ఎదురొచ్చి చంపరు**

**ఎవరికి వాళ్లు స్వచ్ఛందంగా నిశ్శబ్దంగా**
**చచ్చిపోయ్యేలా చెయ్యడమే**
**మహాధునిక రాజకీయ కళాచాతుర్యం!"**
**(రమేశ్, సుంకర(సంపా). 2009 : 97)**

మలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియా విద్యార్థులదే అగ్రస్థానం. మొత్తం తెలంగాణ సమాజాన్ని కదలించి, ఉద్యమంలో భాగస్వాములను చేసింది ఉస్మానియా విద్యార్థులే. అందుకే సీమాంధ్ర ప్రభుత్వాలు ఉస్మానియా విద్యార్థుల మీద దమనకాండను ప్రయోగించాయి. విశ్వవిద్యాలయ ప్రత్యేక అధికారాల స్ఫూర్తికి విఘాతం కలిగిస్తూ, విద్యార్థులు ఉండే హాస్టళ్లలోకి చొరబడి మరీ పోలీసులు దాడులు చేశారు. కేవలం పోలీసు బలగాలు మాత్రమే సరిపోవని, రంగంలోకి దించిన ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌లు, బీఎస్ఎఫ్ (బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్) బలగాలూ విద్యార్థుల మీద లాఠీచార్జి ప్రయోగాలు చేసి కాళ్లూ, చేతులు విరగ్గొట్టి, తలలు పగుల గొట్టాయి. ఆ సందర్భాన్ని వివరించేదే గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి రాసిన 'కాళరాత్రి' కవిత.

**"కాళ రాత్రి**
**అది కర్కశ కరాళ**
**కాఖీమూకల విధ్వంసాల నిశీధి**
**చీకటికే భయమేసిన చీకటిరాత్రి**
**భయానికే వణుకుపుట్టిన భయంకర రాత్రి**

**రాత్రి ఎనిమిది గంటలు మొదలు**
**రెండు గంటల వరకు**
**దారుణ మారణ హోమం**
**అది చేదు అనుభవాల**
**చలించే విషాదాల సమాహారం**

క్షణం క్షణం భయం భయం
క్షణమొక యుగంలా సాగిన ఆరు గంటల సమయం
అంతులేని అరాచకాలు పొంచి ఉన్న పెను ప్రమాదాలు
టకటకమని వినిపించే పోలీసుల బూట్ల చప్పుళ్ళు
దడదడమని చేసిన విద్యార్థుల గుండెల ముచ్చట్లు
రాపిడ్ యాక్షన్ ఫోర్సుల పదఘట్టనలు

ఆంధ్రా పోలీసు మూకలు
హాస్టల్‌పైకి పరుగులు తీస్తూ
కార్గిల్ వార్‌లో శత్రుసేనలను తరిమినట్లు
లాఠీలన్నీ ఏకమై విరుచుకుపడ్డాయ్
విలేకరులపై పిడుగుల్లా
వీరబాదుడు బాదాయ్
ఒళ్ళంతా కుళ్ళబొడిచాయ్

వీపులపై కర్రకాల్చి పెట్టినట్టుగా
రక్తం చింది ధారలు కట్టేటట్టుగా
విలేకరులను విద్యార్థులను కొట్టాయ్
రాపిడ్ యాక్షన్ ఫోర్సులు
ఆంధ్ర స్పెషల్ పోలీసు బలగాలు

ఓ.యు. అంతా చిందర వందర
ఎందుకో ఆంధ్ర పోలీసులకు
తెలంగాణ వాదాన్ని అణచి వేయాలన్న
తొందర తొందర"
(చంద్రశేఖర్ రెడ్డి, గోపిరెడ్డి. **2010 : 46, 47**)

తెలంగాణ పోలీసులైతే తెలంగాణ పిల్లల్ని నియంత్రిచడంలో ఎంతోకొంత మానవత్వాన్ని చూపించే అవకాశం ఉన్నదని భావించిన సీమాంధ్ర ప్రభుత్వం, మరీ ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం సీమాంధ్ర పోలీసుల్ని హైదరాబాద్‌కు రప్పించి, ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థుల మీద దాడి చేయించింది. ఈ వాస్తవాన్ని ఈ కవిత స్పష్టం చేసింది.

విశ్వవిద్యాలయాల్లో మొదలైన ఉద్యమం వికేంద్రీకరించబడి తెలంగాణ వ్యాప్తంగా ఉన్న కళాశాలలు, పాఠశాలలు మొదలు అన్ని ఉద్యోగ రంగాలను కూడా తాకింది. విద్యార్థులు, కార్మికులు, కర్షకులు, సబ్బండ కులాల, వృత్తులవాళ్లు రోడ్లమీదికి వచ్చి ఉద్యమంలో పాల్గొన్నారు. సృజనాత్మకమైన ఉద్యమ రూపాల్ని ఎంచుకుని సీమాంధ్ర పాలకవర్గాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. దాంతో ఉద్యమం నడిచినన్నాళ్లు తెలంగాణ వ్యాప్తంగా ఒక అప్రకటిత కర్ఫ్యూ విధించినట్లు మిలట్రీ పోలీసులే కవాతులు చేశారు. ఆ విషయాన్ని వివరించేదే ఎం.ఎ.బాసిత్ రాసిన 'ముళ్ల కంచె సర్కారు' కవిత.

**"ఇవ్వాళ యూనివర్శిటీలే కాదు**
**తెలంగాణె మిలట్రీ క్యాంపైంది**
**వేటకు బైలెల్లిన క్రూర మృగ దాహం**
**ఆకలి పోరును**
**మింగేసే వ్యూమైంది"**
**(విరసం. 2011 : 90)**

తెలంగాణలో ప్రజా పోరాట యోధుల్ని ఎట్లా ఎన్‌కౌంటర్లలో చంపేశారో, చంపినవాళ్ల ప్రయోజనాలు ఏమిటో వివరించేదే ఎం.ఎ.బాసిత్ రాసిన 'ఐదు తలల ఇసప్పురుగు' కవిత.

**"మట్టిబిడ్డల బుద్దదొయ్యల్ని**

**బుడ్డగోసిగాళ్లే గంజినీళ్లని**

**గుంజి గుంజుకున్న**

**కిరికిర్ల సర్కారు కొరుకుళ్లు..**

**బతుకు విముక్తికి**

**బాధ్యత పడ్డ**

**పోరు బిడ్డలకు**

**'ఎన్‌కౌంటర్' నరుకుళ్లు..**

**రింగురోడ్డును**

**కొండ చిలువై చుట్టకొని**

**అడ్డొచ్చిన జనాల్ని**

**ఆవలికి నరికి పారేసిన**

**ఫ్యాక్షన్ నెత్తుటి చరిత..**

**నేలతల్లిని చెరబట్టిన**

**'రియల్' దొరల స్వైరవిహారం"**

**(విరసం. 2011 : 53)**

ఉత్తర తెలంగాణలో అమలయిన తీవ్ర నిర్బంధాన్ని, రాజ్యహింసను వివరిస్తూ విశాలమైన కాన్వాసు మీద కౌముది 'తరాలపల్లె' నవల రాశాడు. దాని నిండా ఉత్తర తెలంగాణ పల్లెల్లో పారిన నెత్తుటి ఏర్ల చరిత్రను నిక్షిప్తం చేశాడు. సరిగ్గా అటువంటి శీర్షికను అనుసరిస్తూ, అదే విషయాన్ని నిక్షిప్తం చేస్తూ, ఉత్తర తెలంగాణకే చెందిన అన్నవరం దేవేందర్ 1998లో 'నా తెలంగాణ పల్లె' అనే కవిత రాశాడు.

**"కనుకొనల నుంచి రాలుతున్న సముద్రం**

**తెలంగాణ పల్లె**

**ఇది కన్నీళ్ల కోనేరు**

**ఒకవైపు**

ఉడుకుతున్న నెత్తుటి సంగీతం
మరోవైపు
దివ్వుమంటున్న బుల్లెట్లవాన
ఊగుతున్న ఉరితాళ్ళ చప్పుడు
బక్కచిక్కిన బతుకుల్లో ఆత్మహత్యల సన్నివేశాలు
రైతు జీవితాలు
పిల్లి పట్టిన కోడిపిల్ల వైనం
కుక్కుడు పట్టిన పెట్టోలే చీదర
పొద్దు గూకులా రెక్కలు ముక్కలు చేసికొని
ఎలుగటి నాగండ్లకు శిలువ వేయబడ్డ దృశ్యం
పాతాళంలోకి ఇంకిపోయిన నీళ్ళు
కండ్లల్ల వత్తులు ఏసి చూసినా
తిండికి కుంచెడు గింజలు రాలక
గుంజుకుపోయిన రైతుల డొక్కలు
పచ్చని ఆకుల్లోని పత్రహరితాన్ని
బహుళజాతి కంపెనీలు
సరళీకృతంగా ఆరగించి
బక్క ఆసాముల మెడకు విషపు
హారాలు వేస్తున్నాయి

పల్లెనేడు
వెయ్యివక్కలై గుండెచిల్లులుపడి
ఎక్కెక్కిపడి ఏడుస్తున్నది
ఎటు చూసినా ఏడుపులు పెడబొబ్బలు
మృతదేహాలు మృత దేహాలు
నేలకొరిగిన వీరుల తల్లుల రోదనలు

**చావుల సన్నివేశాలతో**
**కకావికలవుతున్న డాక్యుమెంటరీ దృశ్యం**
**నేటి తెలంగాణ పల్లె**

**నా పల్లె**
**రెక్కలు తెగిపడ్డ గువ్వ**
**కచ్రం బండి**
**కమ్ముకూలిన నేపథ్యం**
**నా ఊరు”**
**(దేవేందర్, అన్నవరం. 2001 : 12, 13)**

ఒకవైపు దుర్భర దారిద్ర్యం, కరువు కాటకాలు. మరోవైపు ఎటువంటి సహకారం అందించని పరాయి ప్రభుత్వాలు. పైగా ప్రపంచీకరణ విధానాలు తీసకువచ్చి వృత్తులను మొత్తం విధ్వంసం చేశారు. ఇటువంటి సామాజిక వాతావరణంలో మొదలైన ఉద్యమాన్ని ఎట్లా అణచివేశారో ఈ కవిత తెలియజేస్తుంది.

తెలంగాణ ఉద్యమకారులను చంపడానికి సీమాంధ్ర ప్రభుత్వం వాళ్లకు పెట్టిన పేరు విప్లవకారులు. భారత శిక్షా స్మృతి ప్రకారం విప్లవకారులైనా, మరెవరైనా చంపడానికి పోలీసులకు అధికారాలు లేవు. వాళ్లను అరెస్టు చేసి న్యాయస్థానాల ముందు నిలబెట్టాలి. ఆ తర్వాత న్యాయాన్యాయాలు న్యాయస్థానాలు చూసుకుంటాయి. కానీ తెలంగాణలో న్యాయస్థానాల విధులను కూడా పోలీసులే చేతుల్లోకి తీసుకున్నారు. అంటే చట్టం న్యాయ స్థానంలో లేకుండా పోలీసుల చేతుల్లోకి పోయింది. ఈ పోలీసులకు అండగా ఉన్నది సీమాంధ్ర ప్రభుత్వం. అందుకే తెలంగాణలోని ప్రతిపల్లెలో ఎన్‌కౌంటర్ ధ్వనులు వినిపించాయి. ఈ విషయాన్నే కాశీం 1996లో రాసిన ‘తెలంగాణ’ కవిత స్పష్టం చేస్తుంది.

“ఇప్పుడు తెలంగాణలో
యువకుడివైతే చాలు
ఎన్‌కౌంటర్‌కు అర్హుడివే!?

గ్రామ శివార్లో
ఎర్రమట్టి ఉంటే చాలు
కల్లోలిత ప్రాంతం అయినట్లే

కాడెద్దులు రంకెలేస్తే చాలు
రాడికల్స్‌కు స్థావరమైనట్లే”
**(కాశీం, సి. 2015 : 163)**

ఈ కవే 2012లో రాసిన మరో కవిత ‘రాజద్రోహం’లో సీమాంధ్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన చీకటి చట్టాల గురించీ, అక్రమ అరెస్టులు, కేసుల గురించీ వివరిస్తుంది.

“నేను రోజూ తరగతి గదిలో
పాఠం బోధిస్తూ ఉంటాను
‘మను చరిత్ర’ పాఠంలో
రాజ్యానికి ‘ద్రోహం’ విన్పించింది

నేను తెలంగాణ గోసను
ప్రజలతో సంభాషిస్తూ ఉంటాను
పోలీసులకు కుట్ర కన్పించింది

నేను తెలంగాణలో
రాలిపడుతున్న మాంసం ముద్దలకు

**నాలుగు అక్షరాలు తొడుగుతాను**

**పాలకులకు 'చట్టవ్యతిరేక'మయ్యాను**

**తెలంగాణ కన్నీళ్లను కలంలో నింపడం**

**ద్రోహమైతే**

**నేను రాజద్రోహం చెయ్యడానికి సిద్ధం"**

**(కాశీం, సి. 2015 : 57)**

తెలంగాణ రాష్ట్రం కోసం మాట్లాడడమే రాజద్రోహం అయిన కాలాన్ని గురించి ఈ కవిత వివరిస్తుంది. స్వయంగా ఈ కవి ప్రత్యేక తెలంగాణ ఉద్యమ ప్రచారంలో భాగంగా కరువు జిల్లా మహబూబ్ నగర్‌లో ఉన్నప్పుడు సీమాంధ్ర ప్రభుత్వాలు హత్యాయత్నం చేయగా కొనప్రాణాలతో బయటపడ్డాడు. అయినా వెరువకుండా ఉద్యమంలో భాగస్వామిగా ఉంటూపోయాడు. తర్వాత విశ్వవిద్యాలయ ఆచార్యుడు అయ్యాడు. అయినా తెలంగాణ వాదం విడిచి పెట్టలేదు. మరోవైపు సీమాంధ్ర పాలకవర్గాలు కూడా ఈ కవిని వెంటాడుతూనే ఉన్న సందర్భంలో ఈ కవిత రాశాడు.

ఉత్తర తెలంగాణలో అమలయిన రాజ్యహింసను తెలియజేసేదే నందిని సిధారెడ్డి రాసిన 'ఉసురు' కవిత.

**"బూట్లు టకటకలాడించుకుంటూ**

**ఖాకీ గుర్రాలొచ్చినప్పుడల్లా**

**ఊళ్ళు ఖాళీ చెయ్యటం వాళ్లకు తప్పనిసరైంది**

**జీవితం ఖాళీ చేయిస్తామన్నప్పుడల్లా**

**రోజులకు రోజులు ఊళ్లు ఖాళీ చెయ్యటం వాళ్లకు తప్పనిసరైంది**

**చీకటిపడేవేళ**

**తలుపుమీద లాఠీతో దబదబా బాదిన చప్పుడైతే**

తలెల అన్నం వదిలిపెట్టి
పరిగెత్తటం కుర్రాళ్లందరికీ అలవాటే
నిద్రలోంచి ఉలికిపడిలేచి దౌడు తీయటం
వాళ్లందరికీ అలవాటే
మంచమ్మీద నుంచి లెవ్వలేని
ముసలమ్మలకే కష్టం!

లారీలు ఊపుకుంటూ లోపలికొచ్చినపుడే
ప్రాణాలు పోతాయి
బాలింత తల్లుల మానాలు పోతాయి
కేరుతున్న తల్లిలేని కోడిపిల్లల్ని
మాంసం ముక్కల కింద కోసుకెళ్లటం పోలీసులకలవాటే
ఊడ్చి సాన్పు జల్లిన
వాడిండ్లలోని ముగ్గులు కత్తిరించి
వ్యాన్‌లో వేసుకెళ్లటం పోలీసులకలవాటే
పోలీసులొచ్చి వెళ్లిన ఇల్లు – ఇకంతే!
మనిల్లు మనమే పోల్చుకోలేం
పోలీసులొచ్చి వెళ్లిన ఇల్లు
కలప నరుక్కపోయినాంక
చెట్లు పారిపోయిన అడవిలాగుంటది
పోలీసులొచ్చి వెళ్లిన ఇల్లు
ఎండాకాలం పూట
చేపలు పట్టినప్పటి చెరువును తలపిస్తది
ఎడ్లు వెళ్లిపోయిన దొడ్డిలా ఎలితిగా ఉంటది
పోలీసులొచ్చిన ఊళ్లో
ఆకాశమ్మీది చంద్రుడు కూడా

**హఠాత్తుగా మాయమవుతాడు**

**మేఘాలు దభాల్న రాలి**

**ఏమూలో దాక్కుంటాయి**

**గాల్లో తేలివచ్చే కోయిలపాట**

**చెట్టు తొర్రలో దూరుతుంది**

**ఎక్కడా ఏమీ కనిపించదు**

**ఎవరయినా ఎంత బాధయినా**

**ఇగం పట్టించే డిసెంబర్ చలి రాత్రులయినా**

**ఉన్న పళాన ఊరు ఖాళీ చెయ్యాల్సిందే**

**ఊరడించడానికి ఊరపిచ్చుకా రాదు**

**చెట్టంత కొడుకూ రాదు**

**ఎన్ని రోజులయినా తల్లి దు:ఖం వొడువదు**

**ఇల్లు ఖాళీ చేసి**

**ఊరు ఖాళీ చేసి**

**అడవుల పాలయిన ఆ కుర్రాళ్ల**

**ముసలితల్లుల ఉసురు ఊరకే పోదు**

**ముసలి అవ్వల ఉసురు ఊరకే పోదు"**

**(మంజీరా రచయితల సంఘం, 2001 : 36, 37)**

ఉత్తర తెలంగాణ విప్లవోద్యమానికి ఊపిర్లూదింది రాజ్యహింసేనని ఈ కవిత ద్వారా అర్థం చేసుకోవచ్చు. న్యాయమైన ఆకాంక్షలతో ఉద్యమాలు నిర్వహించగలవారందర్నీ నిర్మూలించాలన్నది సీమాంధ్ర ప్రభుత్వ వ్యూహం. ఉద్యమాలు నిర్వహించగలడానికి అవసరమైన శారీరక, మానసిక శక్తి ఉండేది యుక్త వయసులోనే. అందుకే ఉత్తర తెలంగాణలోని పల్లెల్లో అసలు యువతరమే లేకుండా చేయాలని ప్రభుత్వం నిర్బంధం ప్రయోగించినట్లు ఈ కవిత విశదం చేస్తుంది.

నేటి బాలలే రేపటి పౌరులు అని ప్రభుత్వాలే స్ఫూర్తిదాయకమైన మాటలు వల్లెవేస్తాయి. కానీ తెలంగాణలో బాల్యం ఎంతటి అణచివేతకు గురయ్యిందో, మొత్తం సామాజిక వాతావరణం అంతా ఎంతటి రాజ్యహింసకు బలయ్యిందో చెప్పేదే వంశీకృష్ణ రాసిన 'స్టేట్ డివైడెడ్' కవిత.

**"కోస్తా ఆంధ్ర..**
**ఒక మారుమూల పల్లెటూరు**
**ఈ టి.వి. చూస్తూ ఒక చిన్న పిల్లాడు**

**చాలా చిన్న ప్రశ్న**
**'బాబు పెద్దయ్యాక నువ్వేం అవుతావు?'**
**డాక్టర్,**
**లాయర్,**
**ఇంజనీర్**
**ఫిల్మ్‌స్టార్, క్రికెటర్.**
**నే తల్చుకుంటే ఏదయినా కాగలను**

**ఉత్తర తెలంగాణా.**
**ఒక మారు మూల పల్లెటూరు**
**పరిగె ఏరుకుంటూ ఒక పాలబుగ్గల జీతగాడు**
**చాలా పెద్ద ప్రశ్న**
**'బాబు! పెద్దయ్యాక నువ్వేం అవుతావు?'**
**నక్సలైట్**
**యిన్‌ఫార్మర్**
**కొరియర్**
**అసలు బతికుండాలి కదా..**

**ఏదయినా కావడానికి"**

**(గౌరీశంకర్, జూలూరు(సంపా). 2002 : 349)**

ప్రపంచీకరణ వచ్చి, తెలంగాణ సమాజాన్ని అతలాకుతలం చేశాక ఉద్యమాలు కూడా ఊపందుకున్నాయి. సీమాంధ్ర పాలనా విధానాలకు వ్యతిరేకంగా చర్చలు, సదస్సులు, మీటింగులు నిర్వహించారు. పల్లెల్లోకి వెళ్లిన ఉద్యమకారులు, ఉపాధ్యాయులు తెలంగాణ ఏర్పాటు ఆవశ్యకతను బోధించారు. పర్యవసానంగా సీమాంధ్ర ప్రభుత్వం తీవ్రమైన అణచివేతను ప్రయోగించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులైన ప్రసాద్, ఐలయ్యలు విప్లవోద్యమంలోకి వెళ్లిన నేపథ్యమూ, అమరత్వం పొందడానికి కారణమూ ఇదేనని అనేక నిజనిర్ధారణ కమిటీలు తేల్చాయి. ఈ వాస్తవాన్నే అఫ్సర్ రాసిన 'తెలంగాణా 2002' కవితలో చూడవచ్చు.

**"కదులుతున్న ఉరికంబం నా వూరు**
**సూర్యచంద్రుల్ని వెలేసిన ఆకాశం నాది**
**నా చుట్టూ వీచే గాలి**
**అధికారం విసిరిన ఉచ్చు**
**ఇరుసు విరిగి కుప్పగూలి**
**చెల్లాచెదురైన బండి**
**విరిగిన చక్రాల మధ్య**
**తెగిన కాళ్ల మధ్య యెప్పుడూ వో రక్తప్రవాహం**
**నెత్తురేదో చెమటేదో కన్నీళ్లేవో తెలియని యేరు**
**ఉరికంబం కదులుతోంది మూలుగులతో.**
**వొళ్ళంతా వొక నెగడు**
**నాలుకలు దాచిన బతుకు వాంఛ.**
**నరాల తీగల్లో నిప్పుల వాగు**
**...**

**వేట మొదలైంది**

**గోడల్లో కత్తులు**

**వీధుల్లో తుపాకులు**

**ఎర్రజీర కనిపించిన చోటల్లా కార్చిచ్చు.**

**కాలి గోళ్లకి మేకులు**

**అరిచేతుల్లో సూదులు**

**దేహం వాడి చేతుల్లో పిండిముద్ద**

**'యమబాధ'ల నరకానికి తెరిచిన దారి**

**వూళ్లకి వూళ్లే నెగళ్లు**

**అడివిదారి అప్పుడే తెలిసింది"**

**(గుడిపాటి(సంపా). 2009 : 35, 41)**

తెలంగాణలో మొదలైన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికైనా, విప్లవోద్యమానికైనా సీమాంధ్ర వలసపాలకుల దమననీతి నేపథ్యంగా కనిపిస్తుంది. అప్పటికే జీవనాధారాలు కూలిపోయి, కరువు కరాళ నృత్యం చేస్తున్న బతుకుల మీద మళ్లీ రాజ్యహింసను ప్రయోగించినప్పుడు ప్రజలు అనివార్యంగానే ప్రతిహింసను చేపడతారనీ, ఇది ప్రాకృతిక న్యాయమని తెలియజేసేదే బి.వేణుగోపాల్‌రెడ్డి 'పగోని పాలన' అనే కవిత.

**"మూడు తరాలు గిపుడు**

**తెగిన స్వరాలు**

**ప్రతి తరం ఉద్యమబాటనే**

**ఒక కల కోసం తపన..**

**నిజాం దాష్టీకం నుంచి**

**తప్పించుకున్న తరం**

**గిపుడు**

**రెండింతలు పెర్గిన హింసల నడుమ**

**కండ్ల ముంగట కొలువు దూరమై**

**అందివచ్చిన చైతన్యం**

**రక్తం మడుగైంది**

**గోస కాలువలై పారుతూనె ఉన్నది**

**పాలన అంతా పరాయి అయినపుడు**

**పగ అంతర్లీనమైంది**

**'వలసోని పాలన'**

**హింసల రాజ్యమైనపుడు**

**ప్రతిహింస అనివార్యమవుతుంది"**

**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 187)**

మొత్తంగా చూసినప్పుడు ఈ కవిత్వం నిండా తెలంగాణలో సీమాంధ్ర పాలకులు ప్రయోగించిన హింసనూ, హింసా సాధనాల్ని తెలియజేయడంతోపాటు ప్రభుత్వ విధానాల పర్యవసానమే ఉద్యమాలు అని ప్రకటించడం కనిపిస్తుంది.

## 4.23. హక్కులు

కశ్మీర్ వంటి కొన్ని మినహాయింపులతో భారతదేశ ప్రజలందరికీ భారత రాజ్యాంగం వర్తిస్తుంది. అది కల్పించిన అన్ని హక్కులు, అధికారాలూ వర్తిస్తాయి. ప్రతి పౌరుడికీ భావప్రకటనా హక్కు, జీవించే హక్కు, సభలూ, సమావేశాలూ నిర్వహించుకునే హక్కు మొదలైనవన్నీ భారత రాజ్యాంగం ఇస్తున్నది. ఆ భారత రాజ్యాంగం ప్రకారమే ఎన్నికైన ప్రభుత్వాలు తెలంగాణ ప్రజలకు ఈ హక్కులను రద్దు చేశాయి.

తెలంగాణలో భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తూ తెలంగాణ శాసనసభలో 'తెలంగాణ' అనే పద ప్రయోగాన్ని నిషేధించింది సీమాంధ్ర ప్రభుత్వం. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు శాసనసభా స్పీకర్‌గా యనమల రామకృష్ణుడు ఉన్నాడు. ఆయన తెలంగాణ అనే పదాన్ని శాసన సభలో వాడకూడదని నిషేధించాడు. ఆ విషయం

మీద మడిపల్లి రాజ్‌కుమార్ 'తెలంగాణ నిక్వాణం' కవిత రాశాడు.

**"ఆ మాటనే నిషేధించిన చోట**
**ఆ మాట అనడానికి**
**ఎవరూ సాహసించని పూట**
**ఆ మాట పెగలకుండా**
**అంతా నోళ్లు కుట్టేసుకున్న**
**కలాలు గళాలు కట్టేసుకున్న**
**మీడియా ఝూటా స్వేచ్ఛా కాలాన్ని కాలుస్తూ**
**అంటుకునన ఎలగడ మంట"**
**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2011 : 16)**

ఒకవైపు తెలుగుదేశం ప్రభుత్వం సరళీకృత ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టి తెలంగాణ సమాజాన్ని అతలాకుతలం చేస్తుంటే, మరోవైపు ఆనాటి పీపుల్స్‌వార్ పార్టీ ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను ప్రవేశపెట్టి అమలు చేసే ప్రతయ్నం చేసింది. ఈ వైరుధ్యంలోంచే మలిదశ పూర్వార్థ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం పురుడుపోసుకున్నది. ప్రభుత్వ అభివృద్ధి నమూనాను వ్యతిరేకించడం అంటే భారత రాజ్యాంగాన్ని వ్యతిరేకించడం కాదు. వాస్తవానికి ఆనాటి ఉద్యమ సంఘాలు ప్రకటించిన విధానాలే రాజ్యాంగ బద్ధంగా ఉన్నాయి. వారు ఆనాడు ప్రకటించింది ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలకు అద్దంపట్టే విధంగా ప్రజాస్వామ్య తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని. ప్రజలకు తిండి, బట్ట, ఇల్లు, విద్య, వైద్యం వంటి మౌలిక జీవితావసరాలు, స్వేచ్ఛ, గౌరవం ఉండే విధంగా ప్రజాస్వామ్య తెలంగాణ ఏర్పడాలని. ఈ లక్ష్యాలకోసం పనిచేసినవాళ్లను అనేకమంది సీమాంధ్ర ప్రభుత్వాలు హత్య చేయించాయి. మారోజు వీరన్న, పౌరహక్కుల పురుషోత్తం, ఆజం అలీ, బెల్లి లలిత, నల్లా వసంత్, సుదర్శన్, కనకాచారి మొదలైనవాళ్లంతా ఈ ప్రజాస్వామ్య తెలంగాణ అడిగినందుకే హత్యగావించబడినవాళ్లు. నిజంగా తెలంగాణలో ప్రజాస్వామ్య పాలన ఉండి ఉంటే, ప్రజల కోసమే రక్షణ వ్యవస్థ ఉండి ఉంటే, కోర్టులు పనిచేసి ఉంటే వీరి

హత్యలకు సంబంధించిన నేరస్థుల్ని పట్టుకుని శిక్షించేవాళ్లు. చంపించిందే ప్రభుత్వాలు అయినప్పుడు ఇక పట్టుకునే అవకాశం ఎక్కడ ఉంటుంది అని ప్రశ్నిస్తుంది కాంచనపల్లి రాజేందర్ రాజు రాసిన 'తెలంగాణా కాన్వాస్' కవిత.

**"పౌర హక్కులెక్కడివి?**
**నిజ నిర్ధారణ లెక్కడివి?**
**కేసు విచారణ లెక్కడివి?**
**నీతీ నిజాయితీ లెక్కడివి?**
**రెండు వేపులా**
**కత్తులు వేళ్ళాడుతున్నప్పుడు**
**హక్కులు**
**రాజ్యాంగపు అలంకారాలవుతాయి"**
**(రాజేందర్ రాజు, కాంచనపల్లి. 1999 : 18)**

ప్రజాసామ్య తెలంగాణ అడిగినందుకు, కనీస జీవిత అవసరాలు తీర్చమని ప్రభుత్వాన్ని కోరినందుకు, అలా న్యాయమైన కోరిక తీర్చనందుకు ఉద్యమించినందుకు ఎంతో మంది హత్యకు గురికాబడ్డారని పైన వివరించి ఉన్నాను. ఇటువంటి స్థితిలో ఉద్యమాలు మళ్లీ జీవించే హక్కుకోసం పోరాడాల్సిన అనివార్యత ఏర్పడడాన్ని పోగుల రాజన్న రాసిన 'బతుకుపోరు' కవిత వివరిస్తుంది.

**"జీవించే హక్కుకై పోరాడటం**
**జీవితాన్ని ప్రసాదించమని కోరడం**
**హీనస్థితిని తెలియపరుస్తుంది**
**ఒకానొక బలహీనమైన దినాన**
**అన్నీ వుండి, అందరూ వుండి**
**సమూహంలో ఏకాకితనం**

**సర్వశక్తులు పీడింపబడినవాడు**
**లో గొంతుకలో స్వరం పొదారినపుడు**
**దయనీయమైన క్షణం**
**దుర్భరం - దుర్భరం**

**యాచించడం తప్పు కాదు**
**పరిస్థితిని దిగజార్చిన**
**సంకల్పిత**
**రహస్య పంజరాన్నవాలి**
**ఇక్కడ-**
**జీవించే హక్కునివ్వమని**
**అడగడం నేరమే"**
**(రాజన్న, పోగుల. 2006 : 27, 28)**

జీవించే హక్కును ఇవ్వమని అడగటం నేరం కావడం కేవలం భూస్వామ్య, రాచరిక ఏలుబడిలో మాత్రమే జరుగుతుంది. అసలు ప్రజలు ప్రశ్నించడమే నేరం కావడం అనేది ఒక అప్రజాస్వామిక ఏలుబడిలోని సమాజపు లక్షణం. తెలంగాణలో అటువంటి భూస్వామ్య స్వభావం కలిగిన సీమాంధ్ర ఏలుబడి ఉన్నది కాబట్టే ప్రజలు జీవించే హక్కుకోసం పోరాడాల్సి వచ్చింది. ఆ పోరాటం కూడా మళ్లీ ఏం మిగిల్చిందో కందుకూరి శ్రీరాములు రాసిన 'నన్ను గన్న నా నేల' కవిత వివరిస్తుంది.

**"హక్కుల సాధనకోసం**
**మృతవీరుల త్యాగాలే**
**తెలంగాణాను రణభూమిని చేశాయి**
**రక్తాన్ని పొంగించాయి - నేలను ఎరుపెక్కించాయి"**
**(శ్రీరాములు, కందుకూరి. 2013 : 100)**

నిజానికి తెలంగాణ ప్రజలు గొంతెమ్మ కోర్కెలేవీ కోరలేదు. ఉపాధి అవకాశాల్లో, నీళ్లలో తమ వాటా తమకు కావాలన్నారు. తమ వ్యవసాయ రంగాన్ని ధ్వంసం చేయవద్దన్నారు. కరువు కోరల్లో చిక్కుకొని వలసలు వెళ్లే పరిస్థితి నుండి కాపాడమన్నారు. విద్య, వైద్య రంగాలను పూర్తిగా ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. తమ భాష, సంస్కృతి, సాహిత్యం, కళలను పరాయీకరణకు గురిచేయొద్దన్నారు. చరిత్రలో తమకు స్థానం కావాలన్నారు. ఇవన్నీ సాధ్యం కావాలంటే చారిత్రకంగానే ప్రత్యేక ప్రాంతంగా ఉండిన తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా చేయమన్నారు. ఇవన్నీ అత్యంత ప్రజాస్వామిక ఆకాంక్షలు. భారత రాజ్యాంగమే ప్రజలకు కల్పించిన హక్కులు. కానీ వాటిని అడిగినందుకు ఎటువంటి దౌర్భాగ్య స్థితిలోకి నెట్టబడ్డారో సిహెచ్. ఉపేందర్ రాసిన 'తెలంగాణ పోరు' అనే కవిత వివరించింది.

**"హక్కుల కోసం ఉద్యమిస్తే అణచివేస్తారా!**
**న్యాయం కోసం పోరాడితే కాళ్లు విరగ్గొడతారా!**
**చైతన్యం వెల్లివిరిసి చరిత్ర కొంత తెలిసిపోయి**
**పేదరికం, వెనుకబాటుతనం**
**దారిద్ర్యం, మా వారసత్వం కాదంటే కాల్చేస్తారా!**
**మా యూనివర్శిటీలు ఉగ్రవాద కేంద్రాలా!**
**మా విద్యార్థులు టెర్రరిస్టులా!**
**సరిహద్దుల్లోని సైనిక బలగమంతా.. బారులు కట్టి**
**బాంబులు, తుపాకులతో మమ్మల్ని**
**బలిపీఠమెక్కించేందుకు సిద్ధమయ్యారా!**
**మా భూమిని, మా బువ్వను దోచుకున్నరు..**
**మా నీరును, మా ఏరును మళ్లించుకున్నరు..**
**మా శ్రమను, మా ఉద్యోగాల్ని లాగేసుకున్నరు..**
**మా చరితను మార్చేసి వారి చరితను రాసుకున్నరు..**
**మా ప్రాణాలకు దిక్కెవరు?**

**మా హక్కులకు రక్షణెవరు?"**

**(బుచ్చిరెడ్డి, కోమటిరెడ్డి(సంపా). 2012 : 40)**

తెలంగాణ భూస్వామ్య పాలనలోనే 1948 వరకూ ఉండిపోయింది. సకల రంగాల్లో వెనుకబాటకు గురైంది. అటువంటిది దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, స్వయం పాలనలోకి మారిన తర్వాత, రాజ్యాంగం అమలులోకి వచ్చాక తనను తాను పునరుద్ధరించుకునే అవకాశం కలిగింది. కానీ సీమాంధ్రుల పాలన కారణంగా మళ్లీ పాత భూస్వామ్య విధానాలే అమలు కావడం జరిగిందని కాళోజీ రాసిన 'అల్పుల ఆధిపత్యము' కవిత తెలియజేస్తుంది.

**"మధ్యయుగం భూమీశుల**
**మాదిరిగా ఈ నాడును**
**అల్పులు అధినేతలగుచు**
**అనాదల ఓట్లన్ని దోచి**
**రాజ్యాంగ సూత్రాలను**
**లాంఛనప్రాయము చేసి**
**అధికారము చేతబూని**
**అన్యాయం చేస్తుంటే**
**అడిగే నాథుడు లేదా?**
**బడితున్నోనిదె బర్రా?**

**ప్రజాస్వామ్య సిద్ధాంతము**
**పైన నమ్మకములేని**
**ముఠాబంది స్వార్థపరులు**
**మొక్కుబళ్ళు తీర్చేందుకు**
**ప్రజాస్వామ్య రాజ్యాంగం**

**రాతియుగం అమలు తీరా?**
**(కాళోజీ. 2012 : 354)**

ప్రజలచేత, ప్రజల కొరకు ఎన్నుకోబడిన నేను ఆ ప్రజల కోసమే పదవీ కాలం ఉన్నంత వరకు శ్రమిస్తానని ప్రజాప్రతినిధులు పదవులును స్వీకరించే ముందు రాజ్యాంగం మీద ప్రమాణం చేస్తారు. కానీ పదవుల్లోకి వచ్చాక, పాలించేటప్పుడు మళ్లీ రాజ్యాంగ వ్యతిరేకమైన కార్యకలాపాలకే పాల్పడుతున్నారనే సందేశం ఈ కవిత ఇస్తుంది. సరిగ్గా ఇటువంటి భావనలతోనే బోల యాదయ్య 'స్వాతంత్ర్యమంటే ఇదేనా' కవిత రాశాడు.

**"ప్రజాస్వామ్యమంటే ప్రజలా..?**
**పాలించే పాలకులా..?**
**ప్రజల ఆకాంక్షకు ప్రజాస్వామ్యంలో**
**నిబద్ధత ఉందా..?**
**ఉంటే..**
**నాలుగున్నర కోట్లమంది ఆకాంక్ష**
**'తెలంగాణ' ఎందుకియ్యరు"**
**(యాదయ్య, బోల. 2013 : 24)**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయకపోవడానికి సీమాంధ్ర పాలకవర్గాలు, పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలే అడ్డంకిగాని సీమాంధ్ర ప్రజానీకం కాదు. అంటే మొత్తం ఆంధ్రప్రదేశ్‌లోని పేద ప్రజానీకం తెలంగాణకు అనుకూలంగానే ఉన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వాలు ప్రజల కోసమే పనిచేయవలసి ఉంటుంది. కానీ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా, పౌర హక్కులను కాలరాస్తూ సీమాంధ్ర ప్రభుత్వ పాలన సాగుతున్నదని ఈ కవిత స్పష్టం చేస్తుంది.

భారతదేశ చరిత్రను నిశితంగా అధ్యయనం చేసిన పండితుడు, పరిశోధకుడు,

సామాజిక శాస్త్రవేత్త డా॥ బి.ఆర్. అంబేద్కర్, భారతదేశంవంటి దేశంలో హక్కులు అడుక్కుంటే రావు, పోరాడితే వస్తాయని బోధించాడు. దానికి కారణం మెజార్టీ ప్రజలు పాలితులుగా ఉన్నారు, అల్ప సంఖ్యాక సంపన్న వర్గాలు పాలకులుగా ఉన్నారు, అయినా పాలకవర్గాల చేతుల్లోనే రాజ్యం ఉంటుంది కనుక వారి ఇష్టారాజ్యంగా పాలిత హక్కులు హరిస్తారు కనుక హక్కుల కోసం పోరాడాల్సిన అనివార్యత ఉందని ఆయన ఉద్దేశ్యం. సరిగ్గా వి.ఆర్.విద్యార్థి రాసిన 'యుగపరీక్ష' కవిత కూడా అదే విషయాన్ని స్పష్టం చేసింది.

**"లేచిరండి లేచిరండి**
**మన హక్కులను మనకు**
**ఎవడో ఇప్పించేదేం**
**మనమే సాధించాలె**
**చెడిపోయినవాడి పైన**
**శ్రద్ధెవ్వడు చూపుతాడు?**
**పేదరికంలో మునిగిన**
**వాడినెవరు దరితీస్తరు?**
**హక్కుల కోసం పోరే**
**వాడినెవరు ఆదరిస్తరు?**
**అన్యాయం జరుగుతుంటె**
**ఆపుదామనేవాడేడీ?"**

**(రాజయ్య, నల్లెల్ల(సంపా). 2009 : 16)**

మొత్తంగా ఈ కవిత్వం తెలంగాణ సమాజంలో పౌర హక్కుల ఉల్లంఘన ఎలా జరిగిందో తెలియజేస్తూ, దానికి మూల కారణంగా సీమాంధ్ర సంపన్నవర్గ పాలకుల తీరేనని నిర్ధారిస్తూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనే తెలంగాణ ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు అందుతాయని తెలియజేస్తుంది.

## 4.24. అస్తిత్వం - ఆత్మగౌరవం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అన్ని రంగాల్లో తెలంగాణకు అస్తిత్వం లేకుండా చేశారు. అన్ని సామాజిక రంగాల్లో తమ ఆధిపత్యాన్ని నెరుపుకుంటూ తెలంగాణ ప్రజలకు రావాల్సిన అన్ని అవకాశాల్ని రాకుండా చేశారు. దీనికి సమాంతరంగా, 1990ల తర్వాత సీమాంధ్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన ప్రపంచీకరణ వలన అప్పటికీ విస్మరణకు, వివక్షకు గురైన తెలంగాణ మరింత పరాయీకరణకు గురైంది. దాంతో మొదట కేవలం ప్రత్యేక రాష్ట్రం కోసం మొదలైన ఉద్యమం, తరువాతి కాలంలో గ్లోబలైజేషన్ వ్యతిరేక పోరాటంతో కలిసి నడిచింది. ఎందుకంటే రెండురకాల పరాయీకరణల వలన నష్టపోయింది పరాధీన తెలంగాణనే. "గ్లోబలైజేషన్ నేపథ్యాన ప్రాంతీయ అస్తిత్వవాదం ప్రాధాన్యం పెరిగింది. తమ స్థానిక సంస్కృతుల పరిరక్షణ గ్లోబలైజేషన్ వ్యతిరేక పోరాటంలో భాగం అయ్యింది" (గుడిపాటి. 2006 : 21). ఉద్యమం మరింత విశాలమై తానెంత ప్రజాస్వామికమైనదో తెలియ జేసింది.

పరాయీకరణకు గురైన తెలంగాణ సమాజంలోని కవులు బుద్ధిజీవులుగా సరైన పాత్రనే నిర్వహించారు. చదువుకున్న విద్యావంతులుగా మిగతా సమాజంకంటే ముందుగా మేల్కొని తెలంగాణ అస్తిత్వాన్ని వెతికిపెట్టే ప్రయత్నం చేశారు. కాత్యాయనీ విద్మహే రాసిన 'యుద్ధం ఒక ప్రయాణం' కవితలో ఇట్లా అంటుంది.

**"నేనెవరిని**
**తనను తాను వెతుక్కొనే**
**అనాది మనిషి ఆరాటం**
**నిర్మించిన మానవ జీవిత ఇతిహాసంలో**
**ఇది తెలంగాణ పర్వం**
**ఒక వ్యక్తి**
**భిన్న అస్తిత్వాల ఉనికి**
**నేనొక స్త్రీని - నేను తెలంగాణను**
**నేనొక పీడిత తాడిత జన ప్రతినిధిని**

**వివక్ష నాకెప్పుడూ అనుభవమే**

**నేనెప్పుడూ**

**ఆత్మగౌరవ అస్తిత్వ చైతన్య కేతనమే**

**యుద్ధం నా నిరంతర నినాదమే"**

**(రాజయ్య, నల్లెల్ల(సంపా). 2009 : 28)**

స్త్రీవాద అస్తిత్వ ఉద్యమం మొదలైన తర్వాత పురుషాధిపత్య సమాజంలో స్త్రీ అస్తిత్వానికి సంబంధించిన ప్రశ్నలు అనేకం పుట్టుకు వచ్చాయి. భాషలో, భావాల్లో, రాజకీయాల్లో, చరిత్రలో, సాహిత్యంలో, సకల రంగాల్లో స్త్రీల సామర్థ్యాలు, ఉనికికి సంబంధించిన విలువైన ప్రశ్నలు సంధించింది స్త్రీవాద ఉద్యమం. స్థూలంగా ఇది ఆధిపత్యాల సమాజాన్ని నిరాకరించి స్త్రీ పురుషుల సమానత్వాన్ని కాంక్షిస్తుంది. సరిగ్గా తెలంగాణ ఉద్యమం కూడా స్త్రీ వంటిదే. కాకపోతే పురుషాధిక్య సమాజానికి ఉన్నంత వయసు సీమాంధ్ర పాలనాధిపత్యానికి లేదు. అయినా రెండూ ఆధిపత్య ధోరణులే. అందుకే ఈ కవయిత్రి తెలంగాణను తనలో, తనలో తెలంగాణను చూసుకుని అభేదం ప్రకటించింది. తరతరాలుగా వివక్షను ఎదుర్కొంటున్న స్త్రీగా, తెలంగాణపై సీమాంధ్ర పాలకవర్గాలు చూపుతున్న వివక్షను స్వానుభవంతో చెప్పింది. అందుకే వివక్షల వ్యవస్థను నిరసిస్తూ ఈ కవిత రాసింది.

దెంచనాల శ్రీనివాస్ రాసిన 'త్రిలింగ పాంచభౌతికం' అనే కవిత తాత్విక స్థాయిలో అస్తిత్వ చర్చను లేవనెత్తింది. గాలి, నేల, నీరు, నిప్పు, ఆకాశం పాంచభౌతికాలు. ఇవి ఎవరి స్వంత ఆస్తులు కావు. మానవ నాగరికత అని చెప్పుకుంటున్న ఈ వ్యవస్థ, వీటిని వ్యక్తిగత ఆస్తులుగా మార్చేసింది. తాత్కాలిక మానవ జీవితంలో న్యాయంగా చూసినప్పుడు స్వంత ఆస్తి ప్రకృతి విరుద్ధం. కానీ స్వార్థ మానవుడు వీటిని స్వంత ఆస్తులుగా మార్చుకున్నాడు. సీమాంధ్ర ప్రభుత్వాలు వీటిని వ్యాపార సరుకుగా మార్చేయడాన్ని నిరసిస్తూ ఈ కవిత రాశాడు.

"ఎవడి నెత్తురు ఈ నీరు?
ఎవడి దేహం ఈ భూమి?
ఎవడి శ్వాస ఈ గాలి?
ఎవడి బతుకు ఈ ఆకాశం?
ఎవడి దు:ఖం ఈ అగ్ని?"
(స్కైబాబ. 2010 : 4)

భౌతికవాద తత్త్వశాస్త్రం ప్రకారం భౌతికమైన పదార్థమే ఆలోచనను పుట్టిస్తుంది. అంటే భౌతికమైనది పునాది, భావం ఉపరితలం. గతితార్కిక చారిత్రక భౌతికవాదం ప్రకారం పునాది ఉపరితాల్ని సృష్టించినా, ఉపరితలం కూడా పునాదిని ప్రభావితం చేస్తూ ఉంటుంది. కనుక ఒక్కోసారి పునాదిని మార్చడానికి ఉపరితలాన్ని కూడా లక్ష్యం చేసుకోవాల్సి ఉంటుంది. సరిగ్గా బిల్లా మహేందర్ రాసిన 'నువ్వు ఖండించాల్సింది..' కవిత అదే విషయాన్ని ధ్రువీకరిస్తుంది.

"వాడు
నీ స్వేచ్ఛను కాలరాస్తూ
నీ ఆకాంక్షను బ్రద్దలు చేస్తడు
నువ్వు దాన్ని ఖండిస్తవు

వాడు
నీ హక్కును హరిస్తూ
నీ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తడు
నువ్వు దాన్ని ఖండిస్తవు

వాడిప్పుడు
నీ అక్షరాన్ని బంధిస్తూ

**నీ అస్తిత్వాన్ని ప్రశ్నిస్తాండు**
**నువ్వు..**

**నువ్విప్పుడు**
**ఖండించాల్సింది**
**వాని ఆలోచనల శిరస్సునే”**
**(మహేందర్, బిల్లా. 2012 : 64)**

మనిషి భావాలను నియంత్రించేది మనిషి చుట్టూ ఉన్న సామాజిక జీవితమే. మనిషి స్పందనలకూ, ఆలోచనా విధానానికి హేతువు సమాజమే. భాష, భావాలు, ఆలోచనా చట్రాలు చుట్టూ ఉన్న సమాజం చేతనే ప్రభావితం అవుతాయి. కనుక తెలంగాణ సమాజపు ఆగ్రహానికి కారణం సీమాంధ్రుల ఆధిపత్య పాలనా విధానాలే అని దానక్క ఉదయ్ భాను రాసిన ‘అప్రయత్నంగా’ కవిత వివరిస్తుంది.

**“కవిత్వానికి నెత్తుటి వాసనొస్తోందంటే**
**తప్పు కవిదికాదు**
**గాయపడ్డ కాలానిది**

**భాషలో కత్తులూ కటారలూ దొర్లుతున్నాయంటే**
**కారణం భావాల్లో లేదు**
**పగులుతున్న నేలలో ఉంది**

**అడుగు అడుగులో యుద్ధాలు మొలుస్తున్నాయంటే**
**పాదాల ప్రమేయమేమీ లేదు**
**చివరి నమ్మకమూ చిట్టిపోవడమే**

**ఆత్మగౌరవ జెండా రెపరెపలాడుతున్నదంటే**
**ఒక మీటర్ వైశాల్యపు బట్టముక్క పాత్రేమీ లేదు**
**ఆగిన శ్వాసలు గాలితో కలిసి వీయటమే**

**కాలం పగిలేటట్లు నోరు ఉరుముతున్నదంటే**
**తప్పు నోటిదేంకాదు**
**అర్ధరాతిరి అమ్మ మరణానిదే**

**నేనిక్కడ కుదురుగా ఉండలేను**
**ప్రశాంతంగా ప్రవచించనూలేను**
**ఎండిన గుండె చెరువునుండి**
**ఆవేశం మాత్రమే అలుగువారుతోంది"**
**(ఉదయ్ భాను, దానక్క. 2010 : 9, 10)**

తెలంగాణలో అస్తిత్వ పరివేదన మొదలు కావడానికీ, ఉద్యమం రూపుదాల్చడానికీ, ఆత్మగౌరవ ప్రకటన చేయడానికీ కారణం తెలంగాణ అస్తిత్వాన్ని కాలరాయడమే అని జూలూరు గౌరీశంకర్ రాసిన 'నా కలల తెలంగాణ' కవిత స్పష్టం చేస్తుంది. ఇవాళ తెలంగాణ ప్రజలు సకల రంగాల్లో తాము వివక్షకు, అన్యాయానికి గురి అయ్యాం కాబట్టే, ఈ నేపథ్యంలోంచే ఆత్మగౌరవ నినాదం వినిపిస్తున్నామని ఈ కవిత స్పష్టం చేస్తుంది.

**"నీళ్లు, నిధులు, ఉద్యోగాలు**
**ముంబయ్, బొగ్గుబాయి, దుబాయ్**
**ఫ్లోరోసిస్‌తో పోరుభూమి వంకర్లు**
**బిడ్డల్ని అమ్ముకుంటున్న నా జొన్నరొట్టెలు**
**అడవిలో నెత్తుటి రంగేసుకున్న చెట్లు**
**ఆధిపత్యానికి తలకొరివి ఎవరు పెట్టినా**
**మన స్వపరిపాలన గేట్లు ఎవరు తెరిచినా**

**ఆత్మగౌరవ నినాదమై ప్రతిధ్వనిస్తాం"**

**(గౌరీశంకర్, జూలూరు. 2008 : 100)**

ఆత్మగౌరవంతో అస్తిత్వాన్ని గురించి మాట్లాడేటప్పుడు ఏ సమాజానికైనా తన చరిత్ర గొప్పదనాన్ని చెప్పుకోవాల్సిన అనివార్యత ఏర్పడుతందింది. సరిగ్గా ఆర్.రత్నాకర్ రెడ్డి రాసిన 'పాలపిట్ట' కవితలో అదే చేశాడు. తెలంగాణ సంస్కృతిలోని సామూహిక చైతన్యాన్ని, జీవన విధానాన్ని, శ్రామిక సంస్కృతిని ఎలుగెత్తాడు.

**"ఇది**
**గుమ్మడి పువ్వు**
**పీరీల కుడుక**
**చింతపల్క పండు**
**జొన్న చేను**

**ఇది అవ్వ బువ్వల బాస**
**పాణమెత్తు కవిత్వం**
**కడుపుల మసిలే అగ్గి**
**మట్టి బతుకు**

**ఇది**
**తెలంగాణా**
**వీడు కవి**
**ఇది పాట**
**ఎగిరే పాలపిట్ట"**

**(రత్నాకర్‌రెడ్డి, ఆర్. 2003 : 64)**

తెలంగాణ సంస్కృతిలో పోరాటం ఉన్నది. ఆర్యావర్తనం కంటే ముందు ప్రకృతితో పోరాటం చేసి విజయవంతమైన గణతంత్ర రాజ్య పాలనలో విలసిల్లిన సమసమాజ సంస్కృతితో తెలంగాణ సంస్కృతి చరిత్ర ప్రారంభమవుతుంది. అది కాకతీయుల కాలం నుండి కొనసాగి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వరకు నడుస్తూ వచ్చింది. ఈ క్రమంలో ప్రజల నిజమైన విముక్తి కోసం త్యాగ నిరతితో పోరాడిన విప్లవోద్యమ సంస్కృతి కూడా ఉన్నది. దానినే సి.కాశీం రాసిన 'నా తెలంగాణ' కవిత తెలియజేస్తుంది.

**"మోదుగు పువ్వులో**
**నలతగా పొడుస్తున్న**
**చంద్రుని ముఖానికి**
**ఎరుపుని అలికి**
**సాగనంపిన తల్లి**
**నా తెలంగాణ"**
**(విరసం. 2011 : 26)**

ఈ కవితలో విప్లవోద్యమానికి ఊపిరిలూదిన తెలంగాణ గొప్పదనాన్ని చెప్పాడు కవి. ఇవాళ భారత దేశ విముక్తి కోసం సాగుతున్న విప్లవోద్యమంలో జాతీయ స్థాయి నాయకత్వంలో (మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో) ఎక్కువ భాగం తెలంగాణ వారే ఉన్నారని ఈ కవితాసారం.

సమ్మక్క-సారక్క కాకతీయ రెండవ ప్రతాపరుద్ర చక్రవర్తి సేనలతో పోరాడి అసువులు బాసిన కోయ వీరనారీమణులు అని సమ్మక్క, సారక్కల గురించి చరిత్రలో కీర్తించారు. ఇవాళ దేశవ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన మేడారం జాతరకు ఈ సమ్మక్క, సారక్కల పోరాట నేపథ్యమే మూలంగా ఉన్నది.

13వ శతాబ్దంలో తెలంగాణలోని వరంగల్ కాకతీయుల ఏలుబడిలో ఉంది. జిల్లాకు 100 కిలోమీటర్ల దూరంలో మేడారం అడవి ఉన్నది. ఆ అటవీప్రాంతానికి

రాజు కోయరాజు (ఇతని పేరు చరిత్రలో రికార్డు కాలేదు. కొద్దిమంది పొలవాస మేడరాజు అన్నారు కానీ, చాలామందికి అది అనంగీకారమయ్యింది). ఆ కోయరాజు కాకతీయ రాజైన రెండవ ప్రతాపరుద్రునికి సామంత రాజు. ఒకరోజు కోయలు వేటకు వెళ్లారు. అడవిలో వారికి ఒక వింత దృశ్యం కనిపించింది. పెద్దపులులు కాపలాగా ఒక పసిపాప వాళ్లకు కనిపించింది. దాంతో వారు కోయగూడెం పెద్దలను పిలిపించి ఆ దృశ్యాన్ని చూపించారు. వాళ్లందరూ కలిసి పసిపాపను పల్లకిలో ఎత్తుకుని, బాకాలు వాయిస్తూ మేడారానికి తీసుకువెళ్లారు. ఆ పసిపాప మేడారానికి వచ్చినప్పటినుండి కోయ దొరలకు అన్నీ శుభాలే జరిగాయి. అడవిలోని విషసర్పాలు, క్రూర జంతువులు గుంపులు గుంపులుగా వచ్చి గద్దె చుట్టూ ప్రదక్షిణాలు చేసేవని, వీటిని చూసిన కోయదొరలు సాక్షాత్తు కొండదేవతే పాపరూపంలో అవతరించి తమ వద్దకు చేరిందని భావించి 'మాఘ శుద్ధ పౌర్ణమి' రోజున ఆ చిన్నారికి సమ్మక్క అని నామకరణం చేయగా పులులు, సింహాలు, క్రూర జంతువులపై ఎక్కి స్వారీ చేయడం, గిరిజనుల దీర్ఘ రోగాలను నయం చేయడం, వృద్ధులకు సాయపడడం గొడ్రాళ్లకు సంతానాన్ని అనుగ్రహించడం వంటి అతీతమైన మహిమలు చేయడం వల్ల సమ్మక్క కీర్తి నలుదిశలా వ్యాపించింది. సమ్మక్క పెరిగి పెద్దదయ్యాక సబ్బినాటి (నేడు కరీంనగర్) కోయరాజైన మేడరాజు మేనల్లుడైన పగిడిద్దరాజుకిచ్చి పెళ్లి చేస్తాడు. అయితే ఆమెను అల్లుడింటికి పంపక కూతురినీ, అల్లుడిని ఇంటివద్దనే ఉంచుకుంటాడు. అంటే అది ఇల్లరికం. కోయరాజు తర్వాత మేడారం అడవికి పగిడిద్దరాజే రాజయ్యాడు. వారికి ముగ్గురు పిల్లలు కలిగారు. కూతుళ్లు, సారక్క (ఈమెనే సారలమ్మ అని కూడ వ్యవహరిస్తారు), నాగులమ్మ, కొడుకు జంపన్న. వారు పెరిగి పెద్దవారయ్యారు. సారక్క పెళ్లి కూడా అవుతుంది. ఆమె భర్త గోవిందరాజు. కాకతీయుల ఏలుబడిలో ఉండగానే నాలుగేళ్లు వరుసగా వర్షాలు కురవకపోవడంతో తీవ్రమైన కరువు కాలం వచ్చింది. దాంతో సామంతుడైన కోయరాజు పాలకులకు పంపవలసిన కప్పం పంపించలేకపోయాడు. అదే విషయాన్ని కాకతీయ రాజు ప్రతాపరుద్రునికి తెలియజేశారు. సాధారణంగా రాజులకు ప్రజల జీవన స్థితిగతుల పట్ల జాలి, విశ్వాసం మొదలైనవేవీ ఉండవు. వాళ్లకు కావలసింది ధనం. కరువుకాలంలో కోయలు కప్పం పంపకపోవడంతో రాజుకు కోపం వచ్చింది. దాంతో ప్రతాపరుద్రుని మంత్రి యుగంధరుడు కోయరాజ్యంపైకి

సైన్యాన్ని పంపించాడు. కరువు తాండవిస్తున్న కాలంలో తమ పరిస్థితిని అర్థం చేసుకోకుండా తమపైకే సైన్యాన్ని పంపడంతో సహజంగానే ఆత్మగౌరవం కోసం ప్రాణాలైనా ఇచ్చే కోయలకు ఆగ్రహం కలిగింది. దాంతో కాకతీయ సైన్యంపై తిరుగుబాటు చేశారు. సంపెంగవాగు దగ్గర భీకరమైన యుద్ధం జరిగింది. యుద్ధ నైపుణ్యం కలిగిన కాకతీయ సైన్యంతో కోయలు శాయశక్తులా పోరాడారు. ఆ యుద్ధంలో పగిడిద్దరాజు, అతని అల్లుడైన గోవిందరాజు, కూతురు నాగులమ్మ వీరమరణం పొందారు. అదే సమయంలో మేడారానికి కాపలా కాస్తున్న జంపన్న కాకతీయ సైన్యం మేడారంలోకి ప్రవేశించడాన్ని ఎదుర్కోలేక, ఆత్మాభిమానంతో సంపెంగవాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందువల్లనే నాటి సంపెంగవాగు జంపన్నవాగయ్యింది. ఇంత జరిగినా సమ్మక్క పట్టువదలక పరాక్రమాన్ని ప్రదర్శిస్తూ, శివతాండవం చేసినట్లు శత్రుసేనలను చిత్తు చేసింది. ఒక్కొరినీ మట్టుబెట్టింది. ఆమె ధాటికి శత్రుసైన్యం నిలువలేకపోయింది. అందుకే ఒక కాకతీయ సైనికుడు దొంగచాటుగా సమ్మక్కను వెనుకనుండి బల్లెంతో పొడిచాడు. సమ్మక్క బాధతో యుద్ధరంగం నుండి నిష్క్రమించి సమీపంలోని 'చిలకల గుట్ట' అడవిలోకి వెళ్లిపోయింది. యుద్ధం తర్వాత కోయలు సమ్మక్క వెళ్లిన చిలకల గుట్టను మొత్తం గాలించినా ఆమె జాడ కనిపించలేదు. కానీ ఒక నాగవృక్షం దగ్గరి పుట్ట దగ్గర కుంకుమ భరిణి కనిపించింది. దానినే కోయలు సమ్మక్క జ్ఞాపకంగా దాచుకున్నారు. ఇది తెలంగాణ జానపద సమాజంలో దాగి ఉండి పుస్తకాలకెక్కని చరిత్ర.

ఇది తెలంగాణ నేలమీద తొట్టతొలిగా జరిగిన ప్రజాతిరుగుబాటు. రాజుల నీచస్వభావానికి వ్యతిరేకంగా, సామంతరాజలపై దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా, ఆత్మాభిమానంతో చేసిన యుద్ధం. ప్రతాపరుద్రుడు కప్పం కట్టకపోవడానికి కరువే కారణంగా గుర్తించి, మంచి మనసుతో అర్థం చేసుకుని ఉంటే ఆ యుద్ధమే జరిగేది కాదు. కానీ రాజు సహజ స్వభావంతో అణచివేత ధోరణి ప్రదర్శిస్తే దాని ఫలితంగా తీవ్రమైన తిరుగుబాటు జరిగింది. అది కూడ అడవినే నమ్ముకుని జీవించే అమాయక కోయల తిరుగుబాటు. ఈ చరిత్ర తెలంగాణ సమాజానికి ఒక ఉజ్జ్వలమైన చరిత్ర, స్ఫూర్తి. అందుకే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం తొలిదశలో మొదలు కాగానే గతాన్ని

కీర్తిస్తూ కవిత్వం రాశారు. 1969లో యాదగిరి రాసిన 'తెలుగు వీరా!' కవిత ఈ స్ఫూర్తితోనే ప్రారంభం అవుతుంది.

**"కాకతీయుల వీరగద్దర!**
**కాకతేరిన తెలుగు గద్దర!**
**నేడు మరి యీ గడ్డ బిడ్డలు**
**వాడిపోయిరి ఏలనో**

**కాకతీయుల కత్తి వాడికి**
**కదనమందున పదునుబెట్టిన**
**తెలుగుబిడ్డల మగతనాలకు**
**తెగులు పుట్టిందా?**

**చిక్కనగు పులిపాలు త్రావిన**
**ఉక్కుతునకల వంటిమీకిక**
**కండ కండలు చెండివేసెడు**
**కాంక్ష చచ్చిందా?**

**ముష్కరుల ఎద రక్తపెరుపును**
**పుష్కలముగా పుక్కిలించగ**
**చీల్చివేసెడు తెలుగు జాతికి**
**చీడపట్టిందా?**

**ఎండవానలకోర్చి పొలమున**
**తిండి తిప్పలు మాని సేద్యము**
**కండ కరుగగ జేయు 'కాపు'ను**

**కష్టములె వరియించెనా?**

**గండు మగలను బెండు పోలిక**
**చెండు రుద్రమదేవి దగు ఆ**
**నిప్పులుమిసెడు చికిలి కత్తికి**
**తుప్పు పట్టిందా?**

**రాణి రుద్రమ దేవి కంటిలొ**
**రాజ్యముల శాసించు శక్తిని**
**తెలుగు బిడ్డలు యింకనైనా**
**తెలిసికొనలేరా?**

**గత చరిత్రను ఆకళించర!**
**కన్ను విప్పర! కత్తి పట్టర!**
**రార తెలుగా! రార! ఆంధ్రుల**
**పారద్రోలుటకై– "**
**(యాదగిరి, జి. 2009 : 30, 31)**

సమ్మక్క సారక్కలు మాత్రమే కాదు, వీరనారి రుద్రమదేవిని తెలంగాణ వీరతిలకంగా అభివర్ణించడం తెలంగాణ సమాజానికి ఉన్న రివాజు. ఇట్లా గత చరిత్రను చెప్తూ ఆత్మగౌరవాన్ని ప్రకటించడం కూడా ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో ముఖ్యమైన భాగం. ఆ క్రమంలోనే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరులను కూడా కీర్తిస్తూ కవిత్వం రాశారు. వెలపాటి రామరెడ్డి రాసిన 'బందగి రక్తం చిందిన క్షేత్రం' కవితలో అదే వ్యక్తం అయ్యింది.

**"బందగి రక్తం చిందిన క్షేత్రం**

**బందూకులకు బెదరని క్షాత్రం**

**చాకి రేవుకు దొరల నుతికిన**

**చాకలి ఐలవ్వ సమరక్షేత్రం**

**తుపాకి గుండుకు గుండెలొడ్డిన**

**దొడ్డి కొమురయ ధర్మక్షేత్రం**

**రాచ కిరీటం రాల్చి నేలకు**

**రాణకెక్కిన రైతుల రాజ్యం**

**ఉద్యమాలకు ఊపిరులూదే**

**స్వేచ్ఛా జీవుల జన్మస్థానం**

**పోరాటాలకు పురుడు పోసిన**

**స్వాభిమానపు సస్యక్షేత్రం"**

**(రామరెడ్డి, వెలపాటి. 2011 : 1)**

ఈ కవిత కూడా సరిగ్గా పైన తెలిపిన ఉద్దేశాలతోనే రాయబడినా ఇందులో మరికొంత మంది తెలంగాణ సాహిత్య మేరు శిఖరాల కీర్తన కూడా ఉన్నది. నలిమెల భాస్కర్ రాసిన 'గులిమెల' కవితలో

**"ఇగ మొదలయ్యింది తెలంగాణ లొల్లి**

**ఇది రాజాధిరాజుల్ని ధిక్కరించిన నేల**

**పోతన్న పుట్టిన పోతుగడ్డ**

**తానీషానే ఎదిరించిన**

**రామదాసు కన్నతల్లి**

**నిజాముకే మత్రవడ్డ**

**దాశరథి, కొమురం భీముల భూమి**

**ఇది జీగీ జీగీ జగిత్యాల గడ్డ**

**ఇది సిరిసిల్ల పోరుగడ్డ**

**తెలంగాణ అంతా**

**చాకలి అయిలమ్మ దొడ్డి కొమురయ్యల వారసత్వం**

**ఇది వన్కని జన్కని మొండిజాతి**

**ఇవ్వి రేషగొండి పుట్టుకలు**

**మాది మక్రం పుట్టు**

**(దేవేందర్, అన్నవరం(సంపా). 2010 : 42)**

తెలంగాణలో అప్రతిహతంగా కొనసాగుతున్న పోరాట సంస్కృతిని ఆత్మగౌరవంతో కీర్తించడం నందిని సిధారెడ్డి రాసిన 'పుట్టువడి' కవితలో కనిపిస్తుంది.

**"జాగ తీరే అట్ల**

**ఈ జాగల రేషమున్నది**

**కుటిలం లేదు**

**కువారం లేదు**

**కుండ బద్దలు కొట్టినట్టు**

**కడిగేసుడే ఎరుక**

**బాధయినా బరువయినా**

**ఎత్తుకున్నంక మోసుడే**

**జివునం పోయినా సరే**

**జిద్దుకు నిలవడ్తం**

**ఇటు పొద్దు అటు పొడిసినా**

**ఇజ్జత్ ఇడిసేది లేదు**

**బట్టలు ఇడిసినట్టు**

**శరీరాన్ని ఇడిసిపెట్టేది ఆత్మ కాదు**

**ఎల్లెడల మనిషిని ఎడబాయనిదే ఆత్మ**

**ఉద్రాక్షపూలు పూసినంత సహజంగ**

మాటలు పూస్తుంటయి
వరిచేండ్ల మీద గాడ్పువలె
స్వచ్ఛంగా
వాసన వాసనగా వచ్చిపోతుంటం
దాలిలో పాలు కాగబెట్టినవాండ్లం
అనుభవాలు కాగబెట్టి పోస్తం
పండ్లమ్మెతందుకయినా తండ్లాడుతం
చేదబాయి గిరక లెక్క
ఇరాం లేకుంట గిరగిర తిరుగుతనే ఉంటం
గవ్వ అందాని లేకపోయినా
గాలికతలు ఎరుగం

ఎవలు కారని తెలిసినా
మేం కాకుంట ఉండలేం
ఎత ఎవలదయినా
ఏడ్వకుంట ఉండలేం
కోపం ఆపుకోలేక
నాలికయినా కొరుక్కుంటం

చావుదలకు సుత లేసి ఉరుకుడే
గెలిసినా ఓడినా
దిగిన తర్వాత కొట్లాడుడే
దిగుట్లె దీపం ఆరిపోయినా
నమ్ముకం ఆరిపోదు

జాగ మీద పానం

**పానమిడిసినా జాగిడువం**

**ఈ జాగ తీరే అట్ల**

**ఈడ పుట్టి పెరిగిన మనిషి తీరే గట్ల**

**ఈ జాగల**

**బర్వుబర్వుగ తిరిగే**

**పూర్వీకుల ఆత్మలుంటయి"**

**(సిధారెడ్డి, నందిని. 2017 : 343, 344)**

తెలంగాణ రైతు దీనస్థితి, మలిదశ తెలంగాణ అస్తిత్వ ఆరాటాలన్నీ కలిపి నందిని సిధారెడ్డి రాసిన 'నదిపుట్టువడి' కవితా సంపుటిలోనిది ఈ కవిత. ఇంతకు ముందే చెప్పినట్లు తెలంగాణ కవి వర్తమానంలోని పరాయీకరణను ప్రశ్నిస్తూనే, అస్తిత్వ స్పృహతో ఆత్మగౌరవాన్ని చాటడం కోసం పురాస్మృతులను ఆశ్రయించాడు.

దక్షిణ తెలంగాణాలోనే అపురూపమైన ఉద్యమాలను చేపట్టిన నల్లమల విప్లవోద్యమాన్ని స్వానుభవంతో అర్థం చేసుకున్న సుచరిత రాసిన 'ఎంతగొప్పదీ నేల' కవితలో వైభవోజ్జ్వల పోరాట చరిత్రను మననం చేసుకోవడం ఉన్నది.

**"ఎంతగొప్పదీనేల**

**ఎంత పునీతమయిందీ నేల**

**పోరాటపొద్దులు పొడచిన నేల**

**ఆపాదముద్రికలంతా పరచుకున్న నేల**

**చీకటి జీవితాలను చీల్చి**

**వెలుగులను పండించుకున్న నేల**

**మాటనేర్పినా పాటనేర్పినా**

**అడుగడుగున చైతన్యం తొణికిసలాడించిన నేల**

దోపిడీ మూలాలను పెకిలించ
దగాపడిన బతుకులతో
దండుకట్టించి
ధిక్కారాన్ని నేర్పించిన నేల

ప్రత్యర్థుల శరాఘాతాలకు
పడిపోకుండా
కొండంత అండగానిల్చి
భరోసానిచ్చిన నేల

రగిలిన రాత్రుల
చుక్కల సహవాసంతో
తొలిసందె మలిసందెలకు
ఎరుపులద్దిన నేల

వసంత మేఘగర్జనలతో
కురిసిన పిడుగులవర్షంలో
విత్తనాలను విరజిమ్మి
వెలుగులను పండించిననేల

అందుకే
నాకీ నేలంటే ఇష్టం
ఈ నేలలోంచి విచ్చిన
మట్టిపూలంటే ఇష్టం
తూరుపు పొద్దుపొడుపులలో
పర్చుకున్న ఈ నేలంటే

మరీమరీ ఇష్టం”

(సుచరిత. 2012 : 52, 53)

స్థూలంగా అస్తిత్వ ప్రకటనకోసం, ఆత్మగౌరవం కోసం రాసిన ఈ కవిత్వం నిండా తెలంగాణ చరిత్రకు సంబంధించిన చారిత్రక స్మృతులు నిండి ఉన్నాయి. ఎడతెగని బాధల్లో ఉండి కూడా ఎడతెగని పోరాట వారసత్వాన్ని కీర్తించే ఆనవాళ్లు ఉన్నాయి. మొత్తంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కాంక్షతో ఈ కవిత్వం సీమాంధ్ర వలస పాలన చేసిన పరాయీకరణను ఎండగడుతూనే తనను తాను వెతుక్కునే ప్రయత్నం చేసింది.

## 4.25. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం

ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటి నుండి ఏయే రంగాల్లో తెలంగాణ నష్టపోయిందో తెలంగాణ ఉద్యమం లేవనెత్తిన చర్చలో, దాని ప్రేరేపిత సాహిత్యంలో నిక్షిప్తం అయివున్నది. అనేక ఒప్పందాల, రక్షణల, కమిటీల, పథకాల, జీవోల వలన తెలంగాణకు నష్టమే జరిగిందని ఆ మేథోమథన సారాంశం. కనుక ఇక ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయడం మినహా వేరే ఏ పరిష్కార మార్గమూ తెలంగాణ ప్రజలకు న్యాయం చేయలేదనే భావన కూడా తెలంగాణ బుద్ధిజీవుల ఆలోచనల్లో ఘనీభవించింది.

ఆ అభిప్రాయాలతో ఆవునూరి సమ్మయ్య ‘వారసత్వం’ కవిత రాశాడు. నిజాం ఏలుబడిలోంచి భారత యూనియన్‌లోకి మారకముందు 1952లో ఇడ్లీ సాంబార్ గోబ్యాక్ ఉద్యమం నడిచింది. ఆ మధ్య కాలంలో తెలంగాణలోకి ఉద్యోగాల్లోకి దొంగ ముల్కీ సర్టిఫికెట్లతో చొరబడిన సీమాంధ్ర ఉద్యోగులకు వ్యతిరేకంగా ఇడ్లీ సాంబార్ గోబ్యాక్ ఉద్యమం నడిచింది. ఆనాటి నుండి తెలంగాణ ప్రజలు తమ ప్రత్యేక రాష్ట్ర కాంక్షను వదులుకోలేదని చెప్పేదే ఈ ‘వారసత్వం’ కవిత.

“అప్పుడు ‘ఆంధ్రా గోబ్యాక్’ అన్నది మేమే

**ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం కావాలంటున్నది మేమే**
**అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడైనా సరె**
**వలస పాలకులను తరిమి కొట్టాలనుకుంటున్నది మేమే"**
**(దేవేందర్, అన్నవరం(సంపా). 2010 : 115)**

'ఇద్దరం విడిపోతే భూమి బద్దలవుతుందా, ఇండియా పాకిస్థానోలే ఇనుప కంచె పడుతుందా' అని తెలంగాణ వాగ్గేయకారుడు గోరటి వెంకన్న రాసిన పాట ప్రత్యేక తెలంగాణ ఉద్యమపు ఉత్తరార్ధంలో విపరీతమైన ప్రాచుర్యం పొందింది. ఆ పాటలో కవి కనబరిచిన చైతన్యానికి మూలమైన కాళోజీ రాసిన 'తెలంగాణ వేరైతే' కవితలో ఇట్లా ఉన్నది.

**"తెలంగాణ వేరైతే**
**దేశానికి ఆపత్తా?**
**తెలంగాణ వేరైతే**
**తెలుగుబాస మరుస్తారా?**

**తెలంగాణ వేరైతే**
**కిలోగ్రాము మారుతుందా?**
**తెలంగాణ వేరైతే**
**తెలివి తగ్గిపోతుందా?**

**తెలంగాణ వేరైతే**
**చెలిమితుట్టి పడుతుందా?**
**వానపడక వుంటుందా?**
**చెలిమలెండి పోతాయా?**

**కులము తగ్గిపోతుందా?**
**బలము సన్నగిల్లుతుందా?**
**పండించిన వరికర్రల**
**గింజరాలనంటుందా?**

**రూపాయికి పైసాలు**
**నూరు కాకపోతాయా?**
**కోర్టు అమలు అధికారము**
**ఐ.పి.సి. మారుతుందా?**

**పాకాల, లఖ్నవరం**
**పారుదలలు ఆగుతాయా?**
**గండిపేటకేమైనా**
**గండితూటు పడుతుందా?**

**ప్రాజెక్టులు కట్టుకున్నా**
**నీరు ఆగనంటుందా?**
**పోచంపాడు వెలసికూడ**
**పొలములెండి పోతాయా?**

**తెలంగాణ వేరైతే**
**దేశానికి ఆపత్తా?"**
**(కాళోజీ. 2012 : 345)**

వ్యంగ్య ధోరణిలో రాసిన ఈ కవిత సీమాంధ్ర పెట్టుబడిదారులను, కాంగ్రెస్ పెత్తందారీ పాలనను లక్ష్యం చేసుకున్నది. నిజానికి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే

అన్ని తెలుగు ప్రాంతాల ప్రజలకు మేలు జరుగుతుందనీ, కేవలం సీమాంధ్ర బడా వ్యాపార వేత్తలకు, పెట్టుబడిదారులకు మాత్రమే తెలంగాణ ఏర్పాటు అడ్డంకి అని ఈ కవిత స్పష్టం చేస్తుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ ప్రజలు ఎట్లా జీవచ్ఛవాలుగా జీవిస్తున్నారో, ఎట్లా మానసిక ఐక్యత రూపొందలేదో వేముగంటి మురళీకృష్ణ రాసిన 'నేల స్వేచ్ఛకోసం' కవితలో వివరించాడు.

**"నా సారవంతమైన పచ్చదనాన్ని మేస్తూ తిరుగుతున్న**
**ఎంద్రకాయల మధ్య సహజీవనం చేయడమంటే**
**గొంతుల్లోకి గడ్డపారలను గుచ్చుకోవడమే**
**ఇకనైనా స్వేచ్ఛా పరిమళం కోసం**
**దర్వాజల్ని తెరుద్దాం**
**అరల్ని ఒడిసి పట్టుకొని కలల సాకారం దిక్కున నడుద్దాం**
**గొంతెండ బెట్టుకుంటున్న జీవికింత**
**తడందిద్దాం"**
**(స్కైబాబ(సంపా). 2010 : 134)**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కాంక్షలోని శాస్త్రీయతను, మూలాల్ని, కారణాల పరంపరను అంబటి వెంకన్న రాసిన 'ఊకెనే ఎందుకెళ్ళిపొమ్మంట' కవితలో వివరించాడు. తెలంగాణ ఉద్యమం మొదలైనప్పుడల్లా సీమాంధ్ర స్వార్థపరులు లేవనెత్తే సమైక్యవాద చర్చను నిరసిస్తూ, అందులోని డొల్లతనాన్ని బయటపెడుతూ ఈ కవిత రాశాడు.

**"తెలంగాణ ఉవ్వెత్తున ఎగిసి పడినప్పుడల్లా**
**తెలుగు భాషని సప్పరిస్తరేంది?**
**అదట్న తెలుగు జాతి గుర్తొస్తదేంది?**

ఉలిక్కిపడి జబ్బ చరుచుకుంటరేంది?
పరాయి భాషా బానిసవైన ఆంధ్రకు
అణిచివేత దారుల పెంపుడు బిడ్డగా పెరిగిన సీమాంధ్రకు
నన్ను నా తెలుగు ఔన్నత్యాన్ని
అంగీకరించే గుణం ఉందా?
నా గోసకు తల్లడిల్లే మనసుందా..!
ఎవనికి తోసినట్టు వాడు
నన్నాడుకుంటడు - అవమానిస్తడు
ఒకడిది స్వర్ణాంధ్రన్నడు - ఇంకొకడు హరితాంధ్రన్నడు
ఇప్పుడింకొకడు రాయల్ తెలంగాణంటున్నడు
దయ్యమై పట్టిన మీరు
మమ్మల్ని విడిచిపోతే గదా గోల్డెన్ తెలంగాణ అయ్యేది
గ్లోబ్‌లో మాకింత స్థానం దక్కేది
ఈ దేశ చిత్రపటంలో మేము బతుకమ్మలా విరబూసేది.."
(వెంకన్న, అంబటి. **2011 : 30, 31**)

ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి జీవితంలో తెలంగాణ విద్యారంగం ఎట్లా మోసపోయిందో చెప్తూనే ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తప్ప వేరే మార్గం లేదని చెప్పేదే 2003లో తైదల అంజయ్య రాసిన 'తెలంగాణా స్కూల్ అసెంబ్లీ' కవిత.

"మా తెలుగుతల్లికి మల్లెపూదండ
గలగలా గోదారి కదిలిపోతుంటేను
విలవిలా మా నేల ఎండిపోతుంటేను
బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను
కటకటా కరువమ్మ వచ్చి నిలుచుంటేను
......................

**మా భూమి మా నీళ్ళు దక్కి తీరేదాక**
**మా ఆటలే ఆడుతాం! మా పాటలే పాడుతాం**
**జై తెలంగాణా! జై తెలంగాణా!!"**
**(అంజయ్య, తైదల. 2006 : 100, 101)**

మా నీళ్లు మాకు దక్కే, మా బతుకు మేము బతికే స్వపరిపాలన వచ్చేవరకు తమ నినాదాన్ని వీడబోమనే ఆత్మవిశ్వాసాన్ని ఈ కవిత ప్రకటిస్తుంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షతో కూడుకున్న ఉద్యమ చైతన్యంతో కూడిన కవిత అన్నవరం గౌతం రాసిన 'లై డిటెక్టర్'.

**"న్యాయం మీద అన్యాయం పెత్తనం**
**నాకిప్పుడే అర్థమైంది పైసలు ఏమైనా చేస్తాయని**
**కృత్రిమ ఉద్యమాలను కూడా పుట్టిస్తాయని**

**'సమైక్యత' అనే వలలో చిక్కుకున్న నేను**
**స్వేచ్ఛా సముద్రంలోకి ఈదడానికి**
**నా కళ్ళ ముందు కదలాడే అమరుల సాక్షిగా**
**'సమైక్యత' గొంతు కోయడానికైనా సిద్ధం**
**వారి పసలేని వాదన గిన్నీస్ రికార్డ్**
**ఉద్యమాలు చేయడం ఇక్కడ కొత్తేమీ కాదు"**
**(దేవేందర్, అన్నవరం(సంపా). 2010 : 163)**

గౌతం ప్రత్యేక తెలంగాణ మలిదశ ఉత్తరార్ధంలో కవిగా రూపుదిద్దుకున్నవాడు. ఆయన యుక్తవయసులోకొచ్చి, తన కళ్లముందు జరుగుతున్న ఉద్యమాన్ని చూశాడు, చరిత్రను అధ్యయనం చేసి అర్థం చేసుకున్నాడు, ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటి నుండి తెలంగాణకు ఎన్నెన్ని అన్యాయాలకు గురైందో తెలుసుకున్నాడు. ఆ చైతన్యంతోనే ఈ

కవిత రాసినట్లు అర్థం చేసుకోవచ్చు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలంలో రూపుదిద్దుకున్న పదం 'విశాలాంధ్ర'. ఒకవైపు నిజాం నిరంకుశ పాలనలో హైదరాబాద్ తెలుగువాళ్లు, మరోవైపు తమిళుల ఆధిపత్య పాలనలో సీమాంధ్ర ప్రజలు ఉన్న కాలంలో ఈ మాటకు చెల్లుబాటు ఉన్నది. కానీ ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు అయిన తర్వాత ఈ మాటలోని మూల భావనకే నష్టం వాటిల్లింది. ఈ నష్టం చేసినది మళ్లీ సీమాంధ్ర నయవంచక పాలక విధానాలే. విచిత్రంగా ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ముందుకు వచ్చిన ప్రతిసారీ ఈ సీమాంధ్ర నయవంచక పాలకులే విశాలాంధ్ర భావనను ముందుకు తీసుకురావడం శోచనీయమని, అసలు వాస్తవాలు వేరని దానక్క ఉదయ్ భాను 'అసలు సంగతి' కవితలో వివరించాడు.

**"విశాలాంధ్ర కాదు**
**విశాల భావనతో చూడు**
**నాలుగు కోట్ల మనోఫలకాలపై**
**ఎన్ని శ్మశానాలు చావుసంతకం చేశాయో!**
**చూపున్న గుడ్డివాడిలా కాకుండా**
**మనసున్న మా తమ్ముడిలా ఆలోచించు**
**నాది నాకివ్వు**
**నీది నువ్వు తీసుకో**
**నీది నాకేమీ వద్దు**
**నాదీ నువ్వేమీ తీసుకోవద్దు**
**నువ్వు నన్ను తెలంగాణోడన్నావు**
**నేను నిన్ను ఆంధ్రోడన్నాను**
**కలిసుండి విడిపోవడం కంటే**
**విడిపోయి కలిసుండడం సముచితం**
**నా మాట విను"**

**(ఉదయ్ భాను, దానక్క. 2010 : 28)**

ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సందర్భంలో విశాలాంధ్ర నినాదాన్ని ముందుకు తీసుకువచ్చిందెవరో ఇంతకు ముందే చెప్పి ఉన్నాను. వాస్తవానికి ఈ నినాదానికీ, సీమాంధ్ర ప్రజల అభిప్రాయానికీ సంబంధం లేదు. అది కేవలం పెట్టుబడిదారుల స్వార్థ నినాదం. ఆ నినాదంలోని అసలు ఉద్దేశ్యాలనూ, సారాంశాన్ని వివరించేదే వడ్డెబోయిన శ్రీనివాస్ రాసిన 'సమైక్య శాపం' దీర్ఘ కవిత.

**"కలిసుండీ**
**విడగొట్టడం సమైక్యాంధ్రయితే**
**విడిపోయి**
**కలిసుండడం తెలంగాణ!"**
**(శ్రీనివాస్, వడ్డెబోయిన. 2010 : 5)**

స్థూలంగా ఈ కవిత్వం ప్రత్యక్షంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును బలపరిచింది. సమాజంలో ఉవ్వెత్తున ఎగిసిపడిన ఉద్యమానికి భావజాల రంగంలో బాసటగా నిలిచింది.

## 4.26. ఉద్యమ గమనం

ప్రత్యేక తెలంగాణ కవిత్వం, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఇచ్చిన చైతన్యం నుండే ఆవిర్భవించింది. 1968 సంవత్సరాంతంలో మొదలైన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం చేత ప్రభావితమై తొట్టతొలి కవిత్వం మహబూబ్ నగర్ జిల్లా నుండి వెలువడింది. ఇది కేవలం యాదృచ్ఛికం కాదు. మొత్తం తెలంగాణ జిల్లాలోనే అత్యంత వెనుకబడేయబడిన జిల్లా మహబూబ్ నగర్. పైగా నిజాం కాలంలోనే నిర్మించతలపెట్టిన నందికొండ ప్రాజెక్టు (నాగరార్జున సాగర్ ప్రాజెక్టు), సీమాంధ్రుల ఏలుబడిలో నిర్మాణం కావడం కారణంగా,

తెలంగాణకు అన్యాయం జరిగింది అని మొదటి అధ్యాయంలో వివరంగా చర్చించాను. అయితే, ఆ అన్యాయం అన్ని జిల్లాలకంటే పక్కనే ఉన్న మహబూబ్ నగర్ జిల్లాకే ఎక్కువ జరిగింది. ఎందుకంటే తెలంగాణలో కృష్ణానదీ పరీవాహక ప్రాంతాల్లో మహబూబ్‌నగర్ భూభాగమే అధికం. దీని కారణంగా అంతకుముందే వలసల బతుకులు ఉన్న పాలమూరు జిల్లాకు కొత్త రాష్ట్రంలో ఆశాభంగం కలగడం మాత్రమే కాదు, ఆదుకుంటారనుకున్న వాళ్లు ఆదుకోకపోవడం కారణంగా వలసలు రెట్టింపయ్యాయి. కనుకనే సీమాంధ్ర పాలనపట్ల మిగతా తెలంగాణ జిల్లాల ప్రజలకన్నా మహబూబ్ నగర్ ప్రజలకు తీవ్రమైన వ్యతిరేకత ఏర్పడింది. కనుకనే తొలి ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కవిత్వం మహబూబ్ నగర్ నుండే వచ్చింది. ఆ కవిత్వమంతా పన్నెండేళ్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ప్రస్తావిస్తూనే, తెలంగాణ పోరాట వారస్వాన్ని గుర్తు చేస్తూ వర్తమాన ఉద్యమానికి స్ఫూర్తిని అందించింది. ఉద్యమం క్రమక్రమంగా తెలంగాణవ్యాప్తం అవుతున్న క్రమంలో అన్ని జిల్లాల నుండి కవిత్వం వచ్చింది. ఈ కవిత్వం కూడా వర్తమానంలో జరుగుతున్న ఉద్యమాన్ని కీర్తిస్తూ స్ఫూర్తిని అందించింది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం నడిచినన్నాళ్లూ, కొన్ని సార్లు మందగమనంతో, మరికొన్నిసార్లు తీవ్రమైన వేగంతో కవిత్వం వచ్చింది.

గతం లేకుండా వర్తమానం లేదు. మలిదశ తెలంగాణ ఉద్యమానికి తొలిదశ ఉద్యమ భూమిక ఉన్నది. అందుకే మలిదశ ఉద్యమంలో భాగంగా 1969 ఉద్యమం అందించిన స్ఫూర్తిని అందుకోవాలని పిలుపునిచ్చాడు తెలంగాణ కవి. అల్లం నారాయణ 'యాది – మనాది' కవితలో అదే చేశాడు.

**"యాదికున్నదా!**
**1969 జూన్, 1**
**ఛాదర్‌ఘాట్ సాక్షిగా**
**అరుణ తెలంగాణ పొద్దుపొడుపైన**
**అరుణారుణ కిరణం**

**మతికున్నదా!**

**తూటా తగిలిన దుర్భల శరీరంమీద అంగీని తీసి**

**ఎగరేసిన నెత్తుటి జండా**

**పాడండి తెలంగాణను**

**నా తెలంగాణ ప్రజలారా!**

**ఆలకించండి..**

**అలనాటి నినాదాలు,**

**అలనాటి శబ్దాలు అలనాటి నిట్టూర్పులు**

**నెత్తురోడిన శరీరాలు**

**బుల్లెట్లు మింగిన కాలేజీ పిల్లలు**

**గుండె రంపె కోతలు**

**స్తూపాలకెక్కని పేర్లు"**

**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 32)**

మలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం అన్ని ప్రాంతాల్లో ఒకేసారి మొదలు కాలేదు. ఒక్కచోట మొదలై అన్ని ప్రాంతాలకు వ్యాపించింది. ఈ వ్యాప్తిలో కవులు, కళాకారులు, మేధావుల పాత్ర ఉంటుంది. ఒకచోట జరుగుతున్న ఉద్యమంలోని గొప్పదనాన్ని, అవసరాలని అన్ని ప్రాంతాలకు తెలియజేయడం కోసం తెలంగాణ కవులు కృషి చేశారు. అదే సమయంలో ఉద్యమం నిర్వహించబడుతున్న ప్రాంతంలో కూడా స్ఫూర్తిని నింపడం కోసం, వైభవోజ్జ్వల మైన గతాన్ని గుర్తు చేశారు. ఈ కవితలో అదే చేశాడు తెలంగాణ కవి.

మలిదశలో తెలంగాణ ఉద్యమం నడుస్తున్న కాలమంతా ఏచోట చూసిన ఉద్యమం మాటనే వినిపించింది. ఏ సంభాషణలోనైనా, ఆలోచనల్లోనైనా, రచనల్లోనైనా, వార్తల్లోనైనా, మొత్తం మేధోసమాజపు భావచిత్రాల్లో తెలంగాణ ఉద్యమమే చర్చనీయాంశంగా మారింది. అంతమాత్రమే కాదు, ఊళ్లకు ఊళ్లు ఉద్యమంలోకి వచ్చాయి.

కేవలం విద్యార్థులు మాత్రమే కాకుండా అన్ని వర్గాల ప్రజలు సృజనాత్మకంగా ఉద్యమాన్ని నిర్వహించారు. మొత్తంగా తెలంగాణ ఉద్యమమే కవిసమయమైన వాతావరణాన్ని స్కైబాబ 'షాయరీ' అనే కవిత వివరిస్తుంది.

**"కణకణ మండే**
**దప్పు సూర్యుడి మీద**
**చిందేసే చిర్రా చిటికెన పుల్ల**
**ఉద్యమకారుడి కంటి ఎరుపు -**
**లేచిన పిడికిలి**
**జవాన్ల కరకట్టల్ని**
**ఛేదించే జన ప్రళయం**
**ఉద్యమ ఉత్ప్రేరకమైన**
**చదువుల బడి**
**ఎగుస్తున్న విద్యార్థులే జెండాలు**
**కాలబడుతున్న ఒంటిలోంచి**
**సానబట్టిన కత్తిలా**
**దూసుకొస్తున్న నినాదం**
**మనసున్న కన్నులోంచి**
**దూకుతున్న అశ్రుకణం**
**అవును**
**కవిత్వం ఇవాళ తెలంగాణ"**
**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 318)**

ఉస్మానియా విద్యార్థి ఉద్యమానికి 1970 నుండే ఘనమైన చరిత్ర ఉన్నది. తాము నమ్మిన రాజకీయ విశ్వాసాల కోసం ప్రాణాలను బలిచ్చిన విద్యార్థులు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉన్నారు. ఆ స్ఫూర్తిని కొనసాగిస్తూ తెలంగాణ పల్లెల్ని మొత్తం

మేల్కొల్పిన ఘనత ఉస్మానియా విద్యార్థులకే దక్కింది. ఆర్ట్స్ కాలేజీ వేదికగా పది లక్షల మంది విద్యార్థులు, ప్రజలతో జరిపిన రెండు బహిరంగ సభలు కావచ్చు, ఊళ్లను మేల్కొలపడం కోసం నిర్వహించిన విద్యార్థి పాదయాత్ర కావచ్చు, తెలంగాణ ఉద్యమాన్ని వేగవంతం చేశాయి. అందుకే సీమాంధ్ర ప్రభుత్వం ఉస్మానియా విద్యార్థుల్ని అణచివేయడం కోసం నేరుగా విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని హాస్టల్లలోకి పోలీసులు, మిలట్రీని పంపి దాడులు చేయించింది. సరిగ్గా ఇదే సమయంలో తెలంగాణ ఉద్యమం ఆచరించవల్సిన వ్యూహాలను, ఎత్తుగడలను తెలియజేయడం కోసం మేధావులు, కళాకారులు, కవులు, రచయితలు ఎనలేని కృషి చేశారు. ఆ క్రమంలోనే ఎస్.చంద్రయ్య రాసిన 'ఊళ్లే ఉస్మానియాలు కావాలి' కవితలో ఉద్యమ వ్యూహాన్ని చెప్పాడు.

**"ప్రతిపల్లె ఒక ఉద్యమ కేంద్రం కావాలి**
**మూలం దొరకని పాలమూరు పిల్లలమర్రిలా**
**ఉద్యమ వికేంద్రీకరణ జరగాలి**
**అప్పుడే**
**గత నెత్తుటి చరిత్రకు శాశ్వత చిరునామా**
**సో అండ్ సో కేరాఫ్ తెలంగాణ"**
**(విరసం. 2011 : 37)**

ఉద్యమం ఒక్కచోట కేంద్రీకృతం కావటం మూలాన పాలకవర్గాలకు దాన్ని అణచివేయడం సులభం అవుతున్నది కనుక ఉద్యమాన్ని వికేంద్రీకరించాలని చెప్పిందీ కవిత. అప్పుడు మాత్రమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి తెలంగాణ విడివడుతుందని బోధిస్తుందీ కవిత.

తెలంగాణ ఉద్యమంలోకి ఎన్నెన్ని సామాజిక వర్గాలు వచ్చి చేరాయో, ఎంతటి త్యాగనిరతిని ప్రదర్శించాయో చెప్పేదే ఎం.ఎ.బాసిత్ రాసిన 'ముళ్ల కంచె సర్కారు' కవిత.

**"మాదిగ దివాకర్.. మాల సుధాకర్**
**మంగలి మల్లయ్య.. తెనుగు దేవరాజ్**
**ఉప్పరి కిష్టయ్య.. తెలుగోళ్ల రాజయ్య**
**ఆరె మరాఠీలు.. అవుసల లస్మయ్య**
**పెరుక సాంబయ్య.. తురుక సాయెబులు**
**ఎరుకల రజిత.. లంబాడి శ్వేత**
**గౌండ్ల శంకరయ్య.. గొల్ల ఎల్లయ్య**
**వడ్లోళ్ల వీరాచారి.. కాసోల్ల గోపాల్ రెడ్డి**
**కోమటి పుల్లయ్య.. బాపన రామశాస్త్రి**
**సబ్బండ వర్ణాలు.. సమస్త వృత్తులు**
**జత కలిసినయ్..**
**బడాయి సర్కారు మీద**
**లడాయి తప్పదని"**
**(విరసం. 2011 : 90)**

మలిదశ ఉత్తరార్ధ తెలంగాణ ఉద్యమం తెలంగాణ ప్రజల్లోని సృజనాత్మక శక్తిని వెలికితీసింది. రోడ్ల మీద వంటలు చేయడం, రైలు పట్టాల మీద పడకలు వేసుకుని పండుకోవడం, రాస్తారోఖోల్లో బోనాల పండుగ నిర్వహించడం, హుస్సేన్ సాగర్ పక్కనే సచివాలయం ఉంటుంది కాబటి మిలియన్ మార్చ్, సాగర హారం వంటి కార్యక్రమాలు నిర్వహించడం, కళాకారులు మేధావులతో కలిపి ఆటా మాటా పాట కార్యక్రమాలు నిర్వహించడం, రాత్రులకు రాత్రులు మేలుకుని ఉండి పీరీల గుండం చుట్టూ అలావు ఆడినట్లు నెగళ్ల చుట్టూ నృత్యాలు చేస్తూ పాటలు పాడటం మొదలైనవన్నీ ఉద్యమాన్ని సజీవంగా ఉంచాయి, మున్ముందుకు నడిపించాయి. అట్లా తెలంగాణ ఉద్యమంలో ప్రఖ్యాతమైన 'సాగరహారం' ఉద్యమం గురించి బోల యాదయ్య రాసిన 'సాగరహారం – సమర నినాదం' కవితలో వివరించాడు.

**"అరెస్టులు**

**అక్రమ నిర్బంధాలు**

**బైండోవర్‌లు**

**రైలు బంద్‌లు**

**బస్ బంద్‌లు**

**సాగరహారానికి**

**అడ్డంకేవీ కాలే..**

**సలసల మర్లుతున్న**

**తెలంగాణ నాదాన్ని**

**నరనరాన నింపుకొని**

**హోరెత్తె వానలో కూడా**

**జోరుగా తెలంగాణ**

**సమర నినాదాల హోరుజేసే**

**నడిరాతిరి వెన్నెల నవ్వులలో**

**సాగరహారము..**

**తెలంగాణ సమర నినాదం"**

**(యాదయ్య, బోల. 2013 : 2)**

తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం నడుస్తున్నప్పుడు విద్యార్థిగా ఉన్న మహబూబ్‌నగర్‌కు చెందిన ఉదయమిత్ర అనే కవి మలిదశ ఉద్యమం వచ్చేసరికి విశ్రాంత ఉపాధ్యాయుడయ్యాడు. ఈ కాలమంతా తెలంగాణ ఉద్యమ ప్రస్థానాన్ని కవిత్వం, పాట, కథ ద్వారా గ్రంథస్థం చేశాడు. మలిదశ ఉత్తరార్ధ ఉద్యమంలో విద్యార్థుల పోరాట పటిమను చూసి, వాళ్లను కీర్తిస్తూ తనకు మళ్లీ విద్యార్థిగా మారాలని ఉందని ఆశను వ్యక్తం చేశాడు.'విద్యార్థీ.. నమస్కారం!' అనే కవితలో ఇట్లా అంటాడు.

**"ఒక విద్యుత్ తేజం**
**ఆకాశం తాకి భూమి గర్భాన్ని చేరింది**
**ఒక చారిత్రక సందర్భం అగ్ని పుష్పమై వికసించింది**
**అరవైయేండ్ల ఉద్యమం యూనివర్శిటీ ప్రాంగణంలో**
**తన చరిత్రను తానే తిరగరాసుకుంది**

**తిరుగుబాటు జెండా దిగంతాలకేసి వ్యాపించింది**
**పోరే చదువు కాగా లాఠీలకు వెరవని విద్యార్థులు**
**వీధుల్లో విస్ఫోటనం సృష్టించారు**
**ప్రజల చేతుల్లో కరపత్రాలై వెలిగారు**
**కాలమేఘం మీద మెరుపులై మెరిసారు**
**చదువులు నేర్చే విద్యార్థులు**
**సంఘర్షణ బాటలో గురువులుగా ఎదిగారు**
**పాలకులు కళ్ళు తెరిచేలోపు ప్రవాహం సునామీగా మారింది**
**నాకిప్పుడు విద్యార్థిగా మారాలనుంది**
**పోటెత్తిన కెరటాలలో మునిగి తేలాలనుంది"**
**(విరసం. 2011 : 34)**

ఈ కవితలో కేవలం కవి కోరిక మాత్రమే వ్యక్తం కాలేదు. ఆ కోరిక పుట్టడానికి కారణమైన విద్యార్థి చైతన్యాన్ని, త్యాగనిరతినీ, వ్యూహాల పరంపరనూ కీర్తించడం కూడా నిక్షిప్తమై ఉంది.

తెలంగాణ ఉద్యమ కాలంలో గిద్దె రామనర్సయ్య అనే ఉత్తర తెలంగాణ కవి వినూత్నమైన పాట రాశాడు. తెలంగాణ ఉద్యమంలో కేవలం మనుషులు మాత్రమే భాగస్వాములు కారని, ప్రకృతి ప్రకృతంతా తనవంతు పాత్ర నిర్వహించడం కోసం ఉద్యమంలోకి వస్తానంటున్నది అని ఆ పాట సారాంశం. అటువంటి సారంతోనే కుమ్మరి భిక్షపతి 'శక్తి గల మూలపుటమ్మ' అనే కవిత రాశాడు.

**" 'తంగెడు పువ్వు'..**

**తల్వార్ అందుకొని..**

**తయ్యారైంది.. తాడో పేడో తేల్చుకుందామని..!**

**'బంతిపువ్వు'..**

**బందూకు పట్టుకుని**

**బాసిన బ్రతుకు.. మా కొద్దేవద్దని..!**

**'గునుగు పువ్వు'.. పోరుదండలల్లుతున్నది**

**ఈ రోజు 'మన బతుకమ్మ'..**

**ప్రత్యేక తెలంగాణ ఆశతీర్చే..**

**'శక్తిగల మూలపుటమ్మై'..!**

**బొడ్రాయిమీద కూసొని లడాయి మొదలుపెట్టింది"**

**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 540)**

పై కవితలో ప్రకతిలోని పూలు ఎట్లా స్పందిస్తున్నాయో వర్ణించబడింది. దానక్క ఉదయ్ భాను రాసిన 'మట్టిమాట' కవితలో తెలంగాణ నేల ఏమంటున్నదో రాశాడు. భూమితో మాట్లాడు, అది నీకు జ్ఞానాన్ని ఇస్తుంది అని బైబిల్ అంటుంది. ప్రపంచవ్యాప్తంగా అనేకమంది కవులు భూమి గురించి రాశారు. మానవుని ఉనికికి కేవలం ఆధారభూతం కావడం మాత్రమే కాదు, మనుగడకు అవసరమైన అన్ని అవసరాలు తీర్చే మాతృహృదయం భూమిది అని కీర్తించారు. ఆ స్ఫూర్తితోనే తెలంగాణ భూమి గురించి ఈ కవిత రాశాడు.

**"మా వాడి చెమటా నెత్తురుల్ని పిండి**

**డబ్బు సంచులు బుజానేసుకుని**

**చిరకాల స్వప్నాల్ని తుంచేస్తున్నావా**

**వాడికొక మిత్రుడుండాలి గుర్తుందా**

**నేనే..**

**మనిషికొక మట్టీ**

**మట్టికొక గొంతూ**
**గొంతుకొక గర్జనా**
**గర్జనలో యుద్ధం**
**ఉంటాయని మర్చిపోకు**
**చితి సిద్ధమౌతుంది సుమా”**
**(విరసం. 2011 : 21)**

మలిదశ ఉత్తరార్ధ ఉద్యమం నడిచినంత కాలం తెలంగాణ గ్రామాలు, పల్లెలు, పట్టణాలు, నగరాలు అన్ని చోట్లా వేలాది టెంట్‌లు వేసుకున్నారు. అందులో దీక్షలకు కూర్చోవడమో, ఉద్యమ గీతాలు పాడటమో, ఉపన్యాసాలు ఇచ్చి ప్రజల్ని చైతన్యం చేయడమో చేశారు. మొత్తంగా ఉద్యమ కాలమంతా టెంట్‌లు ఉద్యమ కేంద్రాలుగా కనిపించాయి. రేపల్లె వెంకటేశ్వరరావు ఉద్యమంలో టెంట్ నిర్వహించిన పాత్రను ధ్వన్యాత్మకంగా చిత్రిస్తూ ‘విద్యుత్ కేంద్రమైన ఆ ఒక్క టెంటు’ కవిత రాశాడు.

**“ఆ ఒక్క టెంటు**
**విద్యుత్ కేంద్రమై**
**కోట్ల సిరలు ధమనులై**
**పది దిక్కుల ప్రవహించింది**

**ఈ టెంటులో**
**వార్తలు వీక్షించాల్సిన వాళ్ళు**
**వార్తాప్రసార కేంద్రాలని**
**తమ చుట్టూరా ఉపగ్రహాల్లా తిప్పారు**

**పాతుకున్న టెంటు**
**కొయ్యల మోగాళ్ళ భూమిలో నిలిపి**

నిటారుగా నిలబడ్డాయి
రాబోయే
తుఫాను గాలిని సైతం ఎదుర్కొనే
ఒక దృఢ చిత్తంతో..
ఒక టెంటు
వేల టెంట్లయితే
విస్తరించిన
తమ టెంటకిల్స్‌తోనూ లాభం లేదని-

ఈ టెంటు కూల్చందే
రెండు రాజ్యాలకు నిద్ర పట్టలేదు
ఈ చిన్న గుడారం
నాలుగు కోట్ల ఆశల గూడైంది
అక్కడ రెపరెపలాడిన
ప్రతి హృదయం
ఒక్కో గుడారాన్ని
గుండెల్లో దాచుకుని
బలవంతంగా, భారంగా
హాస్టళ్ళ వదిలి
ఒక్కొక్కటే గ్రామాలకు చేరుతున్నాయి

నేల నేలంతా తనువై
ఆ గుడారాలను స్పర్శించాలని
ఊళ్ళు ఎదురు చూస్తున్నాయి"
(డా॥కాశీం, సి(సంపా). 2010 : 4)

ఆధునిక కాలంలో ఉద్యమ రూపాలు మరింత సృజనాత్మకతను సంతరించుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగా నిరసన వ్యక్తం చేయడం కోసం అమెరికా అధ్యక్షుడు జార్జ్‌బుష్ మీద ఒక మీటింగ్‌లో అల్‌జైదీ అనే జర్నలిస్టు చెప్పును విసరడం, సిక్కుల ఊచకోతకు పాల్పడిన కాంగ్రెస్‌పై ఆగ్రహంతో పి.చిందరబం మీద జర్నైల్ సింగ్ అనే జర్నలిస్టు చెప్పును విసరడం, ప్రజా వ్యతిరేక పాలన నెరుపుతున్న నాయకులు బహిరంగ సభలు నిర్వహిస్తున్నప్పుడు టమాటాలు, కోడిగుడ్లు విసిరి తమ నిరసన వ్యక్తం చేయడం, సభలు సమావేశాల్లో అప్రజాస్వామికమైన భావనలు వ్యక్తం చేస్తున్నప్పుడు బల్ల మీద చరుస్తూ (ఇది మద్దతు తెలిపే సందర్భంలో కూడా ప్రయోగించారు) తమ వ్యతిరేకతను తెలియజేశారు. తెలంగాణ కూడా ఇవాళ తన నిరసనను తెలియజేయడంకోసం ఇప్పుడు అటువంటి పోరాట రూపమే ఎన్నుకుంటుంది అని హెచ్చరిస్తూ పద్మ 'ఓట్లు కాదు, బూట్లే!' అనే కవిత రాసింది.

**"సామ్రాజ్యవాది జార్జి బుష్‌పై**
**బూట్లు విసిరిన అల్‌జైదీ**
**మాకిప్పుడు ఆదర్శం**
**సిక్కుల ఊచకోత**
**సామూహిక హత్యాకాండ**
**పాతికేళ్ళ అన్యాయంపై**
**బూటు విసిరిన జర్నైల్ సింగ్**
**మరో ఆదర్శం**
**అస్తిత్వాన్ని వక్రీకరణ చేసి**
**ఆత్మగౌరవాన్ని అవహేళన చేస్తున్న**
**ఓ మాయ మాటల మాంత్రికులారా!**
**పుట్టెడు దు:ఖంతో**
**లేస్‌లన్నీ విప్పుతున్నాం**
**యాభై ఏళ్ళ అన్యాయం అవమానంపై**

**పులి జూదమాడుతున్న**

**మీకు మీ బిడ్డలకు రేపు వేసేది**

**ఓట్లు కాదు బూట్లు”**

**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 266, 267)**

పై కవితా వస్తువుకు కొనసాగింపుగా సతీశ్ ఉసిరికపల్లి రాసిన 'కొత్తరాతియుగం' అనే కవిత రాశాడు. తెలంగాణ ఉద్యమంలో రాయి నిర్వహించిన పాత్ర గురించి తెలియజేసేదే ఈ కవిత.

**“కిరాయి పరాయి పెత్తనాన్ని**

**గురిచూసి కొడుతున్నది రాయి**

**శ్రీనగర్‌స్ట్రీట్..**

**కైరో చౌరస్తా..**

**ట్యూనిష్ బజార్**

**ఉస్మానియా క్యాంపస్..**

**మానుకోట రైల్వేస్టేషన్**

**రాళ్లవానల రెవల్యూషన్స్**

**గుండెల్లో ఆవేశం చేతిలోని రాతికి ట్రాన్స్‌ఫర్ అయితే**

**తూటాలకు రాళ్లే సమాధానం**

**నెత్తురు రుచిమరిగిన పాలక మృగాల కాళ్లకింద**

**శక్తులు నిండిన యువత పుట్టిస్తున్న భూకంపం..!**

**స్టోన్ ఫెల్టింగ్ యూత్**

**ఫేస్ ద న్యూ ట్రూత్**

**వేటతో కడుపునింపిన**

**ఆదిమ ఆయుధం**

**ఆధునిక యుగంలో**

**అణిచివేతను ఎదిరిస్తున్న వాడి కొత్త అస్త్రం**
**విరబూసిన ప్రతి మార్పు విముక్తి బాటలో తూర్పు**
**ఆడేవాడిని కొట్టు.. ఆడించేవాడు వణక్కపోతే ఒట్టు**
**రాళ్లేదిక్కు.. రాళ్ళకు మొక్కు"**
**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 289)**

మొత్తంగా ఈ కవిత్వమంతా తెలంగాణ ఉద్యమ గమనాన్ని తెలియజేసింది. ఉద్యమంలోని అనేక సృజనాత్మక పోరాట రూపాలు, వస్తువుల కీర్తనతోపాటు ఆవేశం కూడా వ్యక్తం అయ్యింది. ఉద్యమం పతాక స్థాయికి వెళ్లగానే దాడులు కూడా తప్పవనే హెచ్చరిక చేస్తూ, ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు చేయాల్సిందేనని నొక్కి వక్కాణించింది.

## 4.27. ఎలిజీలు

ఏ ప్రజా పోరాటంలో అయినా త్యాగాలు ఉంటాయి. ఆ పోరాట సాహిత్యంలో త్యాగాల కీర్తన ఉంటుంది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కూడా సుమారు రెండువేల మందికి పైగా అమరులయ్యారు. వారిని కీర్తిస్తూ కూడా విస్తృతమైన కవిత్వం వచ్చింది.

మలిదశ పూర్వార్ధ ఉద్యమం మొదలు పెట్టిన నాయకులలో మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన చింతకింది కాశీం ఒకరు. సీమాంధ్ర పాలకుల హత్యాయత్నాన్ని కూడా ఎదుర్కొన్నవాడు. తెలంగాణ పల్లెలన్నీ తిరిగి తన కంచు కంఠంతో వేలాది ఉపన్యాసాలు చేసినవాడు. ఎంతోమంది సహచరుల్ని కూడా ఉద్యమ ప్రస్థానంలో కోల్పోయినవాడు. ఆయన స్వయంగా కవి కావడం కారణంగా అమరుల్ని గుర్తు చేసుకుంటూ పదుల సంఖ్యలో ఎలిజీలు రాశాడు. అందులో ఒకటి 'ఆ నలుగురు' కవిత.

**"శకలాలైన శరీరం నుంచి**
**పాటను పుష్పించి**
**లక్షలాది గొంతుల్లో**

రాగమై వికసించిన
"బెల్లిలలిత"

అంటరాని వాకిట్లో
మండుతున్న మాదిగడప్పుపై
ఆకలిగొన్న పేగులకు
పాటను నేర్పిన "ఐలన్న"

సిల్లులు పడిన ఈతకమ్మ గుడిసెలో
ఎక్కుపెట్టిన వెదురుదబ్బలా
పాటై దూసుకెల్లిన "శ్రీకాంత్"

మగ్గంపై అద్దిన రంగుల్లో
తెలంగాణను కలగని
అర్థాంతరంగా తెగిపోయిన దారంలా
సూర్యుడు కూకినట్లే
ఒరిగిపోయిన "సుదర్శన్"

ఆ నలుగురు
తెలంగాణను శ్వాసించి
నాగేటి సాల్లను ముద్దాడుతున్న
నీరెండ కిరణాలు"
**(కాశీం, సి. 2015 : 111, 112)**

బెల్లి లలిత, ఐలన్న, శ్రీకాంత్, సుదర్శన్ వీరంతా తెలంగాణ ఉద్యమాన్ని గానం చేసిన వాగ్గేయకారులు. వీరికీ, మిగతా తెలంగాణ వాగ్గేయకారులకూ ఒక వ్యత్యాసం

ఉన్నది. ఈ నలుగురు కూడా మలిదశ పూర్వార్ధ తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ పాటలు పాడినవాళ్లు. అప్పటికి తెలంగాణ వాదం ఉద్యమరూపం తీసుకోలేదు. పైగా ఈ గాయకులంతా విప్లవ భావజాలంతో ప్రజాస్వామిక తెలంగాణ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసినవాళ్లూ, అదే భావజాలాన్ని ప్రజల్లో వ్యాప్తి చేసినవాళ్లు. కనుకనే వీళ్లందర్నీ సీమాంధ్ర ప్రభుత్వం కిరాయి మనుషుల చేత చంపించింది. సహచరుల్ని కోల్పోయిన ఆవేదనలోంచి ఈ కవిత వచ్చినట్లు అర్థం చేసుకోవచ్చు.

మలిదశ ఉత్తరార్ధ తెలంగాణ ఉద్యమంలో కనిపించిన ఒక అవాంఛనీయమైన స్థితి ఆత్మహత్యలు. వాటిని నివారించడం కోసం, ఆవేశాన్ని ఉద్యమంగా మార్చమని బోధించడం కోసం వందలాది కవితలు వచ్చాయి. ఆ కోవలోనిదే బోల యాదయ్య రాసిన 'మీకెందుకు ఈ బలిదానం' కవిత.

**"ఎందుకు బిడ్డా బలిదానం**
**ఎక్కిరింపులు పడలేకనా..**
**ఎందుకు బిడ్డా.. ఆత్మత్యాగం..**
**మరిపియ్య జూపిన తెలంగాణను**
**బతికించడానికా..!**
**వద్దు బిడ్డా వద్దు**
**ఎదిగొచ్చె మీ హృదయాన్ని**
**భగభగ మండే మంటలో కాల్చొద్దు..!"**
**(శ్రీకాంత్, భీంపల్లి(సంపా). 2012 : 23)**

వనపట్ల సుబ్బయ్య రాసిన 'అఖండ జ్యోతులై' కవిత కూడా ఆత్మహత్యల్ని నివారించడం కోసమే రాశాడు. మొత్తం తెలంగాణ ఉద్యమానికే వెన్నెముకగా ఉన్న విద్యార్థి లోకమే ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడడం ఈ మహబూబ్ నగర్ కవిని కదలించింది. అందుకే వయసులో పెద్దవాడిగా, తల్లిగా, తండ్రిగా విద్యార్థులకు

ఉపదేశం చేయడం కోసమే ఈ కవిత రాశాడు.

**“తోవకు తొలిపొద్దులు**
**ఆశయాల నిట్టాళ్లు**
**ఉద్యమ ఊట సెలిమలు**
**పోరు నెలవంకలు**
**మా అరుంధతులారా!**
**మీరు లేని తోవ నడిచేదెట్ల**
**ఇంద్రధనస్సులాంటి**
**మీ భవిష్యత్తు కోసం**
**ఎర్రటి ఎండలో కర్రులా కాలినం**
**మీ ఫీజుల కోసం**
**కూలి చెయ్యని చెలుక లేదు**
**దేశం పోని ఊరు లేదు**
**పత్తి పువ్వుల్లా పెంచి**
**పాడెమీద పూలు చల్లె కర్మరాత**
**క్యాంపస్‌లో**
**పొన్న చెట్ల మాన్లకి**
**మీరు చెక్కిన జై తెలంగాణ నినాదాలు**
**కొమ్మ కొమ్మకి మీరు కట్టిన జెండాలు**
**కన్నీటితో అడుగుతున్నె**
**మా భోజ్యానాయక్, శ్రీకాంత్,**
**వేణుగోపాల్‌రెడ్డి, ఇషాన్ రెడ్డి**
**సువర్ణ, యాదయ్య, కరుణాకర్‌లు**
**కాలేజికెప్పుడొస్తరని”**
**(శ్రీకాంత్, భీంపల్లి(సంపా). 2012 : 41)**

సీమాంధ్ర పాలకుల కారణంగానే తెలంగాణ ఉద్యమంలో ఆత్మహత్యలు చోటు చేసుకున్నా, ఆ పోరాట రూపాన్ని అందించి మాత్రం తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ సిద్ధిపేట్ ఎమ్మెల్యే హరీశ్‌రావు. 2009లో కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు కూర్చుంటానన్నప్పుడు ఆయనను పోలీసులు అరెస్టు చేసి ఖమ్మం జైలుకు తరలించారు. ఆ సందర్భంలో, కేసీఆర్‌ను దీక్షకు కూరోనివ్వకుంటే తాను ఆత్మహత్య చేసుకుని చనిపోతానని బెదిరిస్తూ, సిద్ధిపేట్‌లోని తన నివాసంలో ఒంటి మీద పెట్రోల్ పోసుకున్నాడు హరీశ్ రావు. హరీశ్‌రావు అందించిన స్ఫూర్తితోనే తాను ఒంటిమీద పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నానని తొలి ఆత్మహత్యకు పాల్పడిన శ్రీకాంతాచారి చనిపోయేకంటే రెండు రోజుల ముందు ఆస్పత్రిలో చెప్పి ఉన్నాడు. శ్రీకాంతాచారి చనిపోయిన తర్వాత తెలంగాణ వ్యాప్తంగా వంటిమీద కిరోసిన్, పెట్రోలు పోసుకొని చనిపోయినవాళ్లు పదుల సంఖ్యలో ఉన్నారు. దీనికి మూలకారణమైన హరీశ్‌రావు మాత్రం భద్రంగా ఉన్నాడు, మీరు మాత్రం బలవుతున్నారని తెలియజేస్తూ చాలామంది తెలంగాణ కవులు కవిత్వం రాశారు. ఆ క్రమంలోనే హెచ్.రమేశ్‌బాబు 'నీ మరణమే చివరి మజిలి' అనే కవిత రాశాడు.

**'తమ్మీ ఎంత ముద్దుగున్నవురా**<br>
**ఎంత మంచోనివిరా**<br>
**తమ్మీ యాదయ్యా**<br>
**అన్యాయమై పోతివా**<br>
**అనాథవై**<br>
**ఆదర్శానికే నిదర్శనం**<br>
**ఆశయానికే అద్దం**<br>
**...**<br>
**అన్యాయమై పోతివా**<br>
**మంటలై మండితివి**<br>
**మాడిపోతివి**

**నాలుగు రోడ్ల సాక్షిగా**

**మెడ కోసుకుంటనన్న నాయకుడు బాగనే ఉన్నడు**

**సస్త అని బెదిరింపులకు దిగినవాడు**

**మస్తుగ తిని తిరుగుతున్నడు**

**వాని బిడ్డె, వాని కొడుకు బాగనే ఉన్నరు**

**బిడ్డా**

**మా నిస్సహాయత్వానికి**

**నిరసన రూపమయినోడా**

**యాదయ్యా**

**నిను మరువం**

**మా భవితవ్యపు బాటకు**

**నీ తలాపు**

**దీపమే సాక్ష్యం"**

**(జగన్ రెడ్డి, ఎస్(సంపా). 2012 : 69, 70)**

యాదయ్య ఉస్మానియా యూనివర్సిటీ గేట్ దగ్గర ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి. ఉద్యమ కాలంలో విద్యార్థులు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. ఆ సమయంలో చాలామంది విద్యార్థుల్ని జిల్లాల్లో, హైదరాబాదు శివార్లలోని జిల్లాలను కలిపే రోడ్లలో, యూనివర్సిటీల గేట్ల దగ్గర, ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. ఆ సందర్భంలో యాదయ్య ఉస్మానియా యూనివర్సిటీలోనే అడ్డగించబడ్డాడు. మధ్యాహ్నం దాటే వరకు అక్కడే ఉన్నాడు. అక్కడే ఉన్న ఒక పోలీసుతో, అన్నా అసెంబ్లీ ముట్టడి విజయవంతం అయినట్లేనా అని అడిగినప్పుడు ఆయన అంతా ప్రశాంతంగా ఉన్నది అని చెప్పాడు. దాంతో తమ ఉద్యమ ప్రయత్నం విఫలమైనట్లుగా భావించిన యాదయ్య నిరాశతో అక్కడికక్కడే పెట్రోలు పోసుకుని తగులబెట్టుకుని చనిపోయాడు. ఇది కేవలం ఒక సంఘటన మాత్రమే. తెలంగాణ వ్యాప్తంగా ఇట్లా ఎంతో మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకుని చనిపోయారు. వారి గురించి బాధ పడుతూ మసన

చెన్నప్ప 'ఏ ఉగాదికి పాడలేని కోకికలు' అనే కవితలో ఇట్లా రాశాడు.

**"ఉగాది అనగానే**
**వసంతం అనగానే**
**మామిడి చిగుళ్లూ**
**కోకిలలూ గుర్తుకొచ్చాయి**
**గొంతు జీరవోయి కోకిలల్ని**
**తలుచుకుంటే కన్నీళ్లొచ్చాయి**
**కాకులతో ఎదురైన కష్టాలకు**
**కోకిలలు దిమ్మెరపోయాయి**
**ఆత్మగౌరవం కోసం**
**ఆరాటపడే కోకిలలు**
**ఆత్మహత్యలకు పాల్పడుతున్నాయి"**
**(మురళీకృష్ణ, వేముగంటి(సంపా). 2012 : 319)**

ఉద్యమమంటే పోరాడడం కానీ, శత్రువుకు తలొగ్గడం కాదని తెలియజేస్తూ, స్ఫూర్తిని నింపుతూ, చైతన్యం చేసిన కవిత్వం కూడా తెలంగాణలో విరివిగానే వచ్చింది. కె.వి.నరేందర్ రాసిన 'నువ్వులేక' కవితలో ఇట్లా అంటాడు.

**"ఉద్యమమంటే ఊపిరి తీసుకోవటం కాదు**
**శాంతికోసం యుద్ధాన్ని ప్రజ్వరిల్లజేసే**
**సైనికుడెప్పుడూ బలిదానం చేయడు**
**ఉద్యమమంటే శవాల ఊరేగింపుకాదు**
**నిరసనంటే నిశ్శబ్దాన్ని మోసుకెళ్లటం కానేకాదు**
**మరణమే చివరి చరణమైతే**
**ఉద్యమగీతమెప్పుడూ అశ్రుసంగీతమే.. అది మాకొద్దు**

**నువ్వెళ్ళిపోయాక.. మట్టి, చెట్టు, పక్షీ, పశువూ**

**తల్లిగర్భం, కన్నపేగు తల్లడిల్లిపోతున్నాయి**

**ఏ భాషకీ లొంగని దు:ఖాన్ని నువ్వు మిగిల్చిపోతే**

**ప్రతిగుండె పుండై సలుపుతుంది**

**నువ్వు చిరిగిన స్వప్నమైనా.. చెరిగిన సత్యమైనా..**

**నువ్వులేని తెలంగాణ మాకెందుకు..**

**నువ్వు బతికుండాలి..**

**రేపు.. కంప్యూటర్ తెరలమీద కదంతొక్కే శాస్త్రవేత్తవు కావాలి.**

**పెద్దరికాన్ని ప్రేమించే చేతికర్రవు కావాలి**

**మట్టిరేణువు పొత్తిళ్ళలో పువ్వులై పరిమళించాలి**

**అంతేకాని.. ఉద్యమాన్ని స్వాగతిస్తూ**

**నువ్వు వీడ్కోలు తీసుకోవటం ఎంతవరకు న్యాయం..?**

**బలిదానమెప్పుడూ ఆయుధం కాదు..**

**ఇంకా ఎగరని పతాకాన్ని అమరుడవై.. అవనతం చేయకు**

**ఇది పోరుగడ్డ..**

**తప్పుచేస్తే రామున్ని నిలదీసిన రామదాసు వారసులం**

**నీ పోరు తెలంగాణా కోసమే అయితే**

**నువ్వు లేని తెలంగాణ ఎవరి కోసం..?**

**నువ్వు లేని ఉషోదయం కూడా**

**మాకు నిషిద్ధమే..!!"**

**(దేవేందర్, అన్నవరం(సంపా). 2010 : 111)**

అమరుల్ని కీర్తిస్తూనే, వారి త్యాగాలు వృథా పోవనే విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ డా॥ కాంచనపల్లి 'తండ్లాట' దీర్ఘకవిత రాశాడు.

**"వీరుడా.. అమరుడా..**

అమృతుడా

నీ త్యాగం వృథా పోదు

పోరాటం ఆగిపోదు

యుగాల ప్రస్థానంలో

చందమామ భుజాల మోసినవాడా

నీలి తారల మంద పవనాలను

పద పవనాలుగా మలచినవాడా

ఎదలను కన్నుల్లో నిలుపుకొని

చూపుల దారాల మీద

రేపటి పూవుల మాలలు

స్వప్నించిన వాడా

అఖండుడా

అమోఘుడా

తెలంగాణ రాష్ట్ర శాంఖికుడా

ఆపకు నీ ప్రస్థానం

నీ చేతిలో లాఠీలే పాములై

నీ పైకే బుసకొడుతున్నాయి కదా

నీ ప్రాతినిధ్యమే నిన్ను

నిర్లజ్జగా మోసగిస్తుంది కదా

ఆరువందల ప్రాణం పూవులు

రాలిపోయిన శిశిరంలో

తల్లిచెట్లు కన్నీళ్ళు

వ్యర్థమవుతున్నాయి కదా

అటుచూడు

ఉస్మానియా అగ్ని సరస్సు

కాకతీయ కదన కాహళం

**పిడికిలి బిగించిన నల్లకోట్లు**

**ఎగిసిపడిన తెల్లదనం**

**ఒకరేమిటి**

**సమస్త ప్రజానీకం**

**అదొక మహా ప్రస్థానం**

**అదే మహా ప్రస్థానం**

**పాములను తరిమికొట్టే కప్పలు**

**గద్దల కళ్ళు పొడుస్తున్న**

**కోడిపిల్లలు"**

**(డా॥కాంచనపల్లి. 2011 : 10, 11)**

భారత దేశానికి రాజ్యాంగం దిక్సూచి. అందులో ప్రతి భారత పౌరుడికి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంతో జీవించడానికి అనేక హక్కులు కల్పించబడ్డాయి. ఆ హక్కుల రూపకర్తలు రాజ్యాంగాన్ని రాసినవాళ్లే కావచ్చు కానీ, ఆ హక్కులనే భావనలు రూపుదిద్దుకోవడం కోసం వందల సంవత్సరాలుగా చాలామంది ఉద్యమించి ప్రాణాలను త్యాగం చేశారు. వారి త్యాగాల పునాదిమీదనే ఇవాళ సభ్యసమాజం ఎంతో కొంత స్వేచ్ఛగా బ్రతకగలుగుతున్నది. అంటే వర్తమాన సమాజ శ్రేయస్సుకోసం ఎన్నో ఉద్యమాల నేపథ్యం పునాదిగా ఉన్నది. ఆ విశ్వాసంతోనే తెలంగాణ ఉద్యమంలోని త్యాగాలు కూడా వృథా పోవని తెలియజేయడం కోసమే ఈ కవితను రాసినట్లు అర్థం అవుతుంది.

స్థూలంగా ఈ కవిత్వం అమరత్వాన్ని గానం చేస్తూనే, ఆ అమరత్వం సాధించబోయే భవిష్యత్తు సాకారాలను కూడా ఎత్తి పట్టింది. త్యాగాలు కలిగించిన విశ్వాసంతో భరోసాను వ్యక్తం చేసింది.

స్థూలంగా ఇక్కడ వివరించినవన్నీ ప్రత్యేక తెలంగాణోద్యమంలో కనిపించే మౌలిక

భావనలు. వీటి పునాదిగా వేల సంఖ్యలో కవితలు వెలువడ్డా, పరిశోధనా పరిమితులను దృష్టిలో ఉంచుకుని కేవలం ప్రాతినిధ్య కవితలను మాత్రమే ఎంచుకున్నాను.

# పరిశోధన ఫలితాలు

1. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు అటుఇటుగా హైదరాబాద్ రాష్ట్రాన్ని విడిగా ఉంచాలనే అభిప్రాయాలతో కవిత్వం రాలేదు. దీనికి కారణం ఆనాటి హైదరాబాద్ రాష్ట్ర కవులు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిర్మాణం చేసిన విశాలాంధ్ర భావనలో ఉండిపోయారు. అందుకే కాళోజీవంటివాళ్లు కూడా ఆంధ్రప్రదేశ్ ఏర్పాటును సమర్థించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పన్నెండేళ్ల చేదు అనుభవాల తర్వాత కాళోజీతోపాటు చాలామంది తెలంగాణ కవులు రియలైజ్ అయ్యారు. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం రాశారు.

2. తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం నడిచిన కాలంలో మేధావులు, కవులు, కళాకారులు దాదాపుగా విప్లవోద్యమ ప్రభావంలో ఉండిపోవడం కారణంగానే ప్రత్యేక తెలంగాణ కవిత్వాన్ని రాయలేకపోయారు. అయినప్పటికీ వారిలో చాలా మంది ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని బలపరిచారు. ప్రధానంగా తెలంగాణ ప్రాంతంలో ఉంటూ విప్లవోద్యమానికి నాయకత్వం వహిస్తుండిన ఆంధ్రాప్రాంతానికి చెందిన నాయకత్వం కూడా ప్రత్యేక తెలంగాణ ఉద్యమ శక్తుల్ని గైడ్ చేసినట్లు తెలుస్తోంది.

3. తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ముగిసిన తర్వాత ఉద్యమ కవిత్వం కూడా ఒక స్రవంతిగా రాలేదు. మళ్లీ ప్రపంచీకరణ విధానాలు తెలంగాణ మీద ప్రయోగించిన తర్వాత ఏర్పడిన విషాదకరమైన పర్యవసానాల నేపథ్యంలో ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వాన్ని ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కవిత్వంలో భాగంగా రాశారు. ఈ రెండు కాలాలకు మధ్య కవిత్వం రాకపోవడానికి కారణం తగినంత ఉద్యమ ప్రేరణ లేకపోవడమే.

4. తెలుగు నేలమీద మాత్రమే కాకుండా మొత్తం దేశంలోనే అస్తిత్వ ఉద్యమాలకు చూపునిచ్చింది, బాట వేసింది ప్రత్యేక తెలంగాణ ఉద్యమం అని చెప్పడం ఈ కవిత్వంలో కనిపించే ప్రధాన భావన. తెలుగునేల మీద వచ్చిన స్త్రీ, దళిత, మైనార్టీ, బీసీవాద లేదా

ఏ ఇతర అస్తిత్వవాదాలకైనా, అస్తిత్వవాదాల సాహిత్యానికైనా ప్రత్యేక తెలంగాణ అస్తిత్వ ఉద్యమమూ, సాహిత్యమే కనిపించని ప్రభావంగా ఉన్నది.

5. తొలిదశ ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో నిరుద్యోగ సమస్య, అప్పటికే ఉద్యోగాల్లో ఉన్నవారికి సంబంధించిన పదోన్నతుల సమస్య, రక్షణల ఉల్లంఘనలు, వనరుల దోపిడీ, నిధుల కేటాయింపులో వివక్ష మొదలైన విషయాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. మలిదశ పూర్వార్ధ ఉద్యమ కవిత్వంలో ప్రపంచీకరణ వ్యతిరేకతతో పాటు అనేక సామాజిక రంగాల్లో జరుగుతున్న వివక్ష, ఉత్తరార్ధ ఉద్యమ కవిత్వంలో, పై రెండు దశల్లోని అన్ని విషయాలు కనిపిస్తున్నాయి. దీని పునాదిగా తెలంగాణ సామాజిక చైతన్యం క్రమక్రమంగా విశాలమైనట్లు చెప్పవచ్చు.

6. తెలంగాణలోని దాదాపు అన్ని ప్రాంతాల నుండి ప్రత్యేక తెలంగాణ కవిత్వం విరివిగా వెలువడినప్పటికీ, ఆ కవిత్వమంతా సాంద్రమైనదనీ, గాఢమైనదనీ చెప్పడానికి వీలు లేకుండా ఉన్నది. చాలా మంది కొత్తకవులు రాయడం మూలంగా కొంత కవిత్వం పూర్తి వచనం అయిపోయినట్లు కూడా కనిపిస్తోంది. అయితే ఈ కవిత్వంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కాంక్ష మాత్రం బలంగా ఉన్నదని చెప్పాలి. మరోవైపు సుదీర్ఘ కాలం ప్రత్యేక తెలంగాణ కవిత్వాన్ని పండిస్తున్న కవులు చాలా తాత్వికమైన, లోతైన కవిత్వం రాయడం కూడా కనిపిస్తుంది. ఈ రెండు రకాల కవిత్వాలలో రెండవదే ఎక్కువగా ఉన్నది.

7. ఈ మొత్తం కవిత్వంలో స్పష్టమైన రాజకీయ ప్రాపంచిక దృక్పథం ఉన్న కవులు రాసిన కవిత్వం రూప, సారాల్లో చాలా బలంగా ఉన్నది కానీ, ఏ తాత్వికత లేకుండా కేవలం తెలంగాణ కోరుకునే కవిత్వం పలుచగా ఉన్నది. అంటే పలుచనబడటానికి కారణంగా రాజకీయ దృక్పథంతో రాయలేకపోవడాన్ని చెప్పవచ్చు.

8. ప్రత్యేక తెలంగాణోద్యమంలో వచ్చినంత కవిత్వం (రాశిలో) భారతదేశంలోని ఏ ఇతర ఉద్యమంలో రాలేదు.

9. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం, తెలుగు భాషకు అతి నూతనమైన, విలువైన భాషా సంపదను ఇచ్చింది.

10. మొత్తం ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో రాయలసీమ పాలకులమీదా, కోస్తాంధ్ర పాలకులూ, ప్రజలమీదా వ్యతిరేకత కనిపిస్తుంది. ఉత్తరాంధ్ర మీద ఏ వ్యతిరేకతా కనిపించదు. దీని ద్వారా తెలంగాణకు ఎక్కువ నష్టం చేసినవారెవరనే ఎరుక తెలంగాణ కవులకు స్పష్టంగానే ఉన్నదని అర్థం అవుతుంది.

11. మొత్తం ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో ఆంధ్రభాషాధిపత్యాన్ని నిరసిస్తూ కవిత్వం రాసినా దాదాపు ఎనభై శాతం కవిత్వం ఆధ్రభాషలోనే రాశారని చెప్పవచ్చు. దీనికి కారణం ఆంధ్రభాష తెలంగాణ కవుల మీద నిరవదికంగా చెలాయిస్తున్న ఆధిపత్యమే అని నిర్ధారించవచ్చు. మిగిలిన 20 శాతం వాడుక భాషలో రాసిన వారిలో 90శాతానికి పైగా ఉత్పత్తి కులాలవారే ఉన్నారు. దీని ద్వారా ఉత్పత్తి కులాలవారే ఆంధ్రభాషాధిపత్యాన్ని ఎక్కువగా అర్థం చేసుకుని, వదిలించుకున్నానరి చెప్పవచ్చు.

12. తెలంగాణలోని అన్ని జిల్లాల కవులు ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం రాసినా, వారి వారి జిల్లాల్లోని ప్రత్యేకతలూ, ప్రత్యేక సమస్యలు వారి కవిత్వంలో కనిపిస్తున్నాయి. ఉదాహరణకు నల్గొండ జిల్లా కవులు ఎక్కువగా ఫ్లోరోసిస్ సమస్య మీదా, మహబూబ్‌నగర్ కవులు ఎక్కువగా కరువు, వలసల మీదా రాయడాన్ని చెప్పవచ్చు.

13. అప్పటిదాకా భూస్వామ్య నిరంకుశ పాలనలో మగ్గుతూ ఉన్న తెలంగాణ భారత స్వాతంత్ర్యానంతరం, స్వపరిపాలనలో కోలుకుందామనుకున్నది. కానీ తెలంగాణ ప్రజల ఆశల్ని వమ్ము చేస్తూ నిజాం పాలన కంటే దారుణమైన విధానాలు, వివక్షలు అమలు చేయడం కారణంగా తెలంగాణ ప్రజలు మామూలు స్థాయికంటే ఎక్కువ గాయపడ్డారు.

14. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో మౌలిక భావనల్లో నీరు అతి కీలకమైన అంశం.

నీటికి సంబంధించిన భావనలు కూడా భిన్నమైన దృక్కోణాల్లో వ్యక్తం అయ్యాయి. తెలంగాణలో జీవనదులు, ఉపనదులు ఉన్నా వాటిమీద ఆనకట్టలు, బహుళార్థ సాధక ప్రాజెక్టులు కట్టకుండా ఉండటం ద్వారా పల్లపు ప్రాంతమైన కోస్తాంధ్రకు నీటిని తరలించుకుపోయారని చెప్పడం ఒక అంశం. నిజాం కాలంలోనే నిర్మించతలపెట్టిన ప్రాజెక్టులు సీమాంధ్రుల పాలనలో పూర్తయినా, వాటి నీటి నిలువ సామర్థ్యాలను అత్యంత అన్యాయంగా తగ్గించి, తద్వారా ఎక్కువ నీటిని లోతట్టు ప్రాంతమైన ఆంధ్రాకు తరలించారని చెప్పడం రెండవ అంశం. కట్టిన ప్రాజెక్టుల్లోనూ ఇసుకమేటలు వేయడం వల్ల నీటి నిలువ సామర్థ్యాన్ని తగ్గించారని చెప్పడం మూడవ అంశం. నిజాం కాలంలో నిర్మాణమైన వేలాది చెరువుల్ని పూడిక తీయకుండా ధ్వంసం చేయడం ద్వారా చెరువులు ఎండిపోయాయని చెప్పడం నాల్గవ అంశం. పెద్ద వ్యాపారవేత్తలు భవణ నిర్మాణ రంగంలో వినియోగించే ఇసుకను లెక్కకు మించి, అక్రమంగా తరలించడం ద్వారా భూగర్భజలాల్ని కూడా లేకుండా చేశారని చెప్పడం ఐదవ అంశం. స్థూలంగా విస్తృతమైన మానవ వనరులు, బంగారం పండగల భూమి ఉన్నప్పటికీ నీటి వసతులు లేకపోవడం కారణంగా వ్యవసాయం దెబ్బతిని వలసలు తలెత్తాయని చెప్పడం ఆరవ అంశం. నల్గొండ వంటి కృష్ణానదీ తీరప్రాంతం ఉన్న జిల్లాకు కూడా కృష్ణా నీళ్లు అందకపోవడం కారణంగా అక్కడి భూమిలో కలిసిపోయి ఉన్న ఫ్లోరైడ్ నీళ్లలో కలిసి, అనివార్యంగా ఆ నీళ్లనే తాగడం కారణంగా ప్రతి ఇంట్లో అనేక రకాల జబ్బులు, అంగవైకల్యాలతో బాధపడేవారే కనిపించడం, దానికి కారణం కృష్ణానది నుండి సాగునీరు అందకుండా చేయడమే అని చెప్పడం ఏడవ అంశం. గోదావరి నదిపై తెలంగాణ ప్రాంతంలో పోలవరం వంటి భారీ ప్రాజెక్టులు కట్టి, తెలంగాణ ప్రాంతాన్ని ముంపుకు గురి చేసి, సీమాంధ్ర వ్యాపారవేత్తల ప్రయోజనాలకోసం నీటిని తరలించి తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని చెప్పడం ఎనిమిదవ అంశం. మొత్తంగా తెలంగాణకు సాగు, తాగు నీరు అందించకుండా, లోతట్టు ప్రాంతమైన ఆంధ్రాప్రాంత ప్రయోజనాలకోసమే సీమాంధ్ర పాలకవర్గాలు పనిచేశాయని, ఒకవైపు ఆంధ్రా ప్రాంతం నీటిని వినియోగించుకుని అభివృద్ధి చెందడానికి అవకాశం కల్పిస్తూ, తెలంగాణ ప్రాంతాన్ని ఎడారిగా మార్చాయని చెప్పడం నీటికి సంబంధించిన భావనల్లో కీలకంగా కనిపిస్తున్నది.

15. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో కనిపించే మరొక ముఖ్యమైన భావన, సీమాంధ్రుల పాలనలో తెలంగాణ వ్యవసాయ రంగం విధ్వంసానికి గురైందని చెప్పడం. ఇందులో భిన్నమైన కోణాలు ఉన్నాయి. ప్రవహించే (నదులు, ఉపనదులు మొదలైనవి), నిశ్చల (చెరువులు, బావులు) నీరు అందకపోవడం కారణంగా వ్యవసాయం దెబ్బతినటం ఒక అంశం. ప్రపంచీకరణ విధానాలను అమలు చేయడానికి తెలంగాణను ప్రయోగశాలగా ఎన్నుకోవటం, మరొకవైపు అవసరమైనంత విద్యుత్తును అందించకపోవటం కారణంగా వ్యవసాయం నష్టపోవడం రెండవ అంశం. దీని మూలంగా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారనీ, అవి ప్రభుత్వ హత్యలే అని ప్రకటించడం మూడవ అంశం. నీరు, కరెంటు అందివ్వకుండా, సబ్సిడీలు ఇవ్వకుండా, దళారీ వ్యవస్థను ప్రోత్సహించడం ద్వారా, గిట్టుబాటు ధరలు నిర్ణయించకుండా ఉండటం ద్వారా సీమాంధ్ర పాలకవర్గాలే తెలంగాణ వ్యవసాయాన్ని దెబ్బతీశాయని చెప్పటం ఈ కవిత్వంలో స్థూల భావన.

16. సీమాంధ్ర పాలనలో తెలంగాణ భూములు ఆక్రమణకు గురయ్యాయనీ, తెలంగాణ భూములను తెలంగాణవారికే చెందకుండా చేశారనీ చెప్పడం ఈ కవిత్వంలోని మరొక భావన. ఇందులో విభిన్నమైన అంశాలు ఇమిడి ఉన్నాయి. తెలంగాణలో చాలా సారవంతమైన నల్లరేగడి భూములు ఉన్నాయి. నిజాం కాలంలోనే ఉత్తర తెలంగాణలో ప్రారంభమైన వలస వచ్చినవాళ్ల భూ వ్యాపారం, సీమాంధ్రులకు పాలనాధికారాలు దక్కాక పూర్తిగా విస్తరించిందని చెప్పడం ఒక అంశం. మొదట వ్యవసాయ భూములు ఆక్రమించినది సీమాంధ్ర సంపన్న రైతులు. ఆ తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని ప్రవేశపెట్టి, తెలంగాణలోని అన్ని పట్టణాల్లోని, పరిసర ప్రాంతాల్లోని భూములను ఆక్రమించుకున్నారని చెప్పడం రెండవ అంశం. ప్రత్యేక ఆర్థిక మండలాల (సెజ్ – స్పెషియల్ ఎకనామికల్ జోన్) కోసమని ప్రభుత్వాలే స్వయంగా రంగంలోకి దిగి, బలవంతంగా ప్రజల వ్యవసాయ భూములను లాక్కుని బహుళజాతి కంపెనీలకు, సీమాంధ్ర బడా వ్యాపారవేత్తలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అప్పజెప్పింది అని చెప్పడం మూడవ అంశం. మట్టితో తరతరాల అనుబంధం పెనవేసుకుపోయిన తెలంగాణ రైతులు తమ

భూములు కోల్పోవడం ద్వారా జీవితాల్నే కోల్పోవలసి వచ్చిందని చెప్పడం నాలుగవ అంశం. స్థూలంగా ఈ కవిత్వమంతా తెలంగాణ భూమి తెలంగాణకే దక్కాలి అనే సారంతో నిండి ఉన్నది.

17. తెలంగాణలో ఉత్పత్తి అయిన, తెలంగాణకు న్యాయబద్ధంగా చెందవల్సిన విద్యుత్తు తెలంగాణకు అందకుండా పోతున్నదని చెప్పడం ఈ కవిత్వంలోని మరొక మౌలిక భావన. ఇందులో ప్రపంచీకరణలో భాగంగా తీసుకువచ్చిన విద్యుత్ రంగ ప్రైవేటీకరణను వ్యతిరేకించడం కూడా కీలకంగా కనిపిస్తుంది.

18. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలోనే అతి కీలకమైన భాగం ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వం. ఇది కేవలం ప్రపంచీకరణ కాదనీ, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ అని చెప్పడం మౌలికమైన భావన. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ అన్న మూడు పనులను, ప్రపంచీకరణ అనే మృదుత్వం ఉన్న పేరుమీద జరిపారనీ, ఇది ప్రజా జీవన విధ్వంసక విధానమని చెప్పటం ఈ కవిత్వంలో కనిపిస్తుంది. అన్ని జీవన రంగాలను వ్యాపారమయం చేయడంతోపాటుగా, ఆ వ్యాపారానికి అనువైన మానవ చైతన్యాన్ని తయారు చేయడం కోసం సాంస్కృతిక విధ్వంసానికి కూడా పాల్పడిందని చెప్పడం ఈ కవిత్వంలో తీవ్రస్థాయిలో కనిపిస్తుంది. ఈ కవిత్వం ఎక్కువగా 1995 – 2009 మధ్య కాలంలో వచ్చినట్లు, అది కూడా మార్క్సిస్టు కవులు ఎక్కువగా రాసినట్లు తెలుస్తున్నది.

19. కరువు వలసలు, వాటి నేపథ్యం, పనిక్షేత్రాల్లో వలసజీవుల కడగండ్లు మొదలైనవాటిని గురించి కూడా ప్రత్యేక తెలంగాణ కవిత్వంలో విస్తృతమైన చిత్రణ ఉన్నది. ఇందులో కూడా తెలంగాణ కవులు భిన్నమైన పార్శ్వాలను కవిత్వీకరించారు. తెలంగాణలో ఉన్న కరువు సహజ కరువు (ప్రాకృతికమైనది) కాదని, సీమాంధ్ర పాలకుల పక్షపాత పాలనవలన ఏర్పడిందని, కొనసాగుతున్నదని చెప్పడం ఈ కవిత్వంలో ఒక భాగం. నిజానికి తెలంగాణలో ఉన్న జలసంపదను, తెలంగాణలో ఉత్పత్తి అయిన విద్యుత్తును, తెలంగాణకే చెందిన సారవంతమైన భూముల్ని తెలంగాణ వ్యవసాయానికి మిగిల్చి ఉండినట్లయితే

తెలంగాణలో కరువు ఏర్పడి ఉండేది కాదని ఈ భాగంలో స్పష్టం చేశారు. వలసల కారణంగా ఊర్లకు ఊర్లే స్మశాన వాతావరణాన్ని తలపిస్తున్నాయని, మానవ సంబంధాల సమూహం (సమాజం) నిర్జీవమైపోతున్నదని చెప్పడం రెండవ అంశం. వలస వెళ్లినవాళ్లు వలస ప్రాంతాల్లో నిర్మాణ రంగంలోని దళారుల అమానవీయమైన వైఖరి కారణంగా కేవలం శ్రమదోపిడీకి మాత్రమే కాకుండా మానసిక హింసకు గురవుతున్నారనీ, మహిళలు లైంగిక దోపిడీకి కూడా గురవుతున్నారని, ఎంతోమంది వలస ప్రాంతాల్లోనే కనుమూస్తున్నా, వారి గోడును పట్టించుకునేవాడే లేడని చెప్పడం మూడవ అంశం. సీమాంధ్ర పాలక వర్గాలు తెలంగాణ పట్ల చూపుతున్న వివక్షను ఎదిరిస్తూ ఉద్యమాలు నిర్మాణం చేసినవాళ్లమీద మాత్రమే కాకుండా యువతరం మొత్తం మీద తీవ్రమైన నిర్బంధం అమలు చేయడం కారణంగా కూడా చాలామంది సొంత ఊర్లను విడిచిపెట్టి వెళ్లిపోవాల్సిన అగత్యం ఏర్పడిందని చెప్పడం నాల్గవ అంశం. స్థూలంగా సీమాంధ్ర పాలకుల వివక్షాపూరితమైన పాలనా విధానాలు, తీవ్రమైన నిర్భందమే తెలంగాణలో నిరవధిక వలసలకు కారణమని చెప్పడం ఇందులోని సారాంశం.

20. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో తెలంగాణ విద్యారంగంలో జరిగిన విధ్వంసాన్ని శాస్త్రీయంగా చెప్పడం మరొక మౌలికమైన విషయం. భూస్వామ్య రాచరిక పాలనలో వందల సంవత్సరాలు మగ్గిన తెలంగాణలో అక్షరాస్యత శాతం చాలా తక్కువ. స్వయం పాలనలో విద్యావకాశాలు మెరుగవుతాయని భావించిన తెలంగాణ ప్రజలకు సీమాంధ్ర పాలకుల విధానాలు మొండి చెయ్యి చూపాయి. తెలంగాణ విద్యారంగానికి కేటాయించవల్సిన నిధులను కేటాయించకపోవడం మాత్రమే కాదు, విద్యా ప్రైవేటీకరణ జరపడం మూలంగా విద్యను వ్యాపార సరుకుగా మార్చేశారని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో వసతులను కల్పించకపోవడం ద్వారా ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించారని చెప్పడం ఈ కవిత్వంలో కనిపిస్తుంది. అదే సమయంలో విశ్వవిద్యాలయాల స్థాపనలో కూడా తెలంగాణకు అన్యాయమే జరిగిందని, తెలంగాణలో ఉండవల్సిన అనేక విశ్వవిద్యాలయాన్ని అక్రమంగా, స్వార్థపూరితంగా సీమాంధ్రకు తరలించారని ఈ కవిత్వం స్పష్టం చేస్తుంది. ప్రపంచీకరణలో భాగంగా విద్యార్థుల్ని కేవలం సాంకేతిక రంగం వైపుకు

మళ్లించారని, మనిషికి సంస్కారం, చారిత్రక నేపథ్యం, రాజకీయ దృక్పథం అందించే సామాజిక శాస్త్రాలను నిర్లక్ష్యం చేయడం ద్వారా బహుళజాతి కంపెనీలకు అవసరమయ్యే చవకైన మానవ వనరుల్ని, ఒకరకమైన మేధోబానిసల్ని తయారు చేశారని ఈ కవిత్వం నిర్ధారిస్తుంది.

21. ప్రపంచంలోని ఏ ప్రజాస్వామ్య పాలనలోనైనా విద్య, వైద్యం తప్పనిసరిగా ఉచితంగా అందించవల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. కానీ సీమాంధ్రుల పాలనలో అప్పటికే ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్ని నిర్వీర్యం చేయడం, తద్వారా బహుళ అంతస్తుల, మోయలేని ఆర్థిక భారాలు వేసే కార్పొరేట్ ఆసుపత్రుల్ని (వీటి యజమానులు సీమాంధ్ర ప్రాంతానికి చెందినవారే) ప్రోత్సహించడం, పేద, మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి ప్రజలకు వైద్యరంగాన్ని దూరం చేయడం లేదా అత్యంత ప్రియం చేయడం వంటివి జరిగాయని ఈ కవిత్వం వివరిస్తుంది.

22. ఆంధ్రప్రదేశ్‌లో భాగమైన తర్వాత తెలంగాణ ప్రాంత పారిశ్రామిక రంగం ఎంతటి విధ్వంసానికి గురైందో చెప్పడం ఈ కవిత్వంలో కనిపించే మరొక ముఖ్యమైన విషయం. ఇందులో అనేక పార్శ్వాలున్నాయి. నిజాం రాజుల ఏలుబడిలో తెలంగాణ పారిశ్రామిక రంగం అత్యంత అభివృద్ధికరంగా ఉన్నదని, సీమాంధ్ర పాలనలో అది పూర్తిగా దిగజారిపోయిందని చెప్పడం ఒక అంశం. ప్రభుత్వ రంగ పరిశ్రమలను అన్నింటిని మూసివేస్తూ, ప్రేవేటురంగ పరిశ్రమల్ని అభివృద్ధి చేయడం కారణంగా వేలాదిమందికి ఉపాధి అవకాశాలు లేకుండా పోవడమే కాకుండా, ఉత్పత్తి మరింత ప్రియం అయిపోయింది, వినిమయ సామర్థ్యం తగ్గిపోయింది అని చెప్పడం రెండవ అంశం. తెలంగాణలో సీమాంధ్రులు స్థాపించిన పరిశ్రమల్లో తెలంగాణ నిరుద్యోగులకు అవకాశాలు ఇవ్వలేదు, పైగా వారిని నాన్‌లోకల్స్‌గా గుర్తించడం జరిగింది అని చెప్పడం మూడవ అంశం. తెలంగాణలో ఉన్న విలువైన సహజ వనరుల్ని చిన్నతరహా పరిశ్రమలు స్థాపించడం ద్వారా అనేకమందికి ఉపాధి అవకాశాలు కల్పించడం మాత్రమే కాకుండా ప్రాకృతిక వనరుల శాస్త్రీయ వినియోగం జరిగేది, తద్వారా పారిశ్రామిక రంగం అభివృద్ధి జరిగేది,

కానీ సీమాంధ్రుల పక్షపాత పాలనా విధానాలు కేవలం ప్రైవేటు రంగాన్ని మాత్రమే ప్రోత్సహించాయని చెప్పడం నాలుగవ అంశం. పర్యావరణ విధ్వంసాన్ని పట్టించుకోకుండా సీమాంధ్ర బడా వ్యాపారవేత్తలు తెలంగాణ భూభాగంలో స్థాపించిన అనేక రసాయన పరిశ్రమల కారణంగా వాటి పరిసర ప్రాంతాల్లో వాయు, జల, భూ కాలుష్యం విపరీతంగా పెరిగిపోయి జనజీవితం క్లిష్టతరంగా మారిందని చెప్పడం ఐదవ అంశం. స్థూలంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడటం మూలంగానే తెలంగాణ పారిశ్రామిక రంగం పూర్వ వైభవాన్ని సంతరించుకోగలదు అని చెప్పడం ఈ కవిత్వ సారాంశం.

23. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో తరువాతి మౌలిక భావన తెలంగాణ ఉద్యోగ, నిరుద్యోగ సమాజ చిత్రణ. ఇందులోనూ విభిన్నమైన కోణాలు అంతర్భాగంగా కనిపిస్తాయి. నిజాం రాజు భారత సైన్యానికి లొంగిపోయిన తర్వాత తొట్టతొలి సాధారణ ఎన్నికలు జరిగే కాలం మధ్యలో వేలాదిమంది సీమాంధ్ర ఉద్యోగులు వలసవచ్చి తెలంగాణ ఉద్యోగాల్లో పాగా వేసింది మొదలు మలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వరకు అదే పరిస్థితి కొనసాగుతూ రావడాన్ని తెలంగాణోద్యమ కవిత్వం ఒక చారిత్రక డాక్యుమెంటుగా రికార్డు చేయడం మొదటి అంశం. స్థానికులకే ఉద్యోగావకాశాల కల్పన ఉండాలనే నిబంధన నిజాం పాలనా కాలం నుండే (1919) అమలులో ఉన్నప్పటికీ సీమాంధ్ర ఉద్యోగులు అక్రమ ముల్కీ సర్టిఫికెట్లతో తెలంగాణ ఉద్యోగాల్లో చొరబడ్డారనీ, ఆ తరువాత పదోన్నతులు కూడా వారే అనుభవించారనీ ఈ విషయం తెలియజేస్తుంది. పెద్దమనుషుల ఒప్పందంలో చేసుకున్న ఒప్పందాలను తుంగలో తొక్కి తెలంగాణ నిరుద్యోగితకు అన్యాయం చేశారని చెప్పడం రెండవ విషయం. దాదాపు ఆరు దశాబ్దాలు తెలంగాణ ఉద్యోగాల్లో చొరబడింది కాక మళ్లీ ఆ చొరబాటును చట్టబద్ధం చేసుకోవడం కోసం హైదరాబాద్‌ను ఫ్రీజోన్‌గా ఉంచాలనే వాదన చేస్తున్నారని, దీనికి సీమాంధ్ర పాలకుల వెన్నుదన్నులు కనిపించని శక్తులుగా ఉన్నాయని చెప్పడం మూడవ విషయం. తెలంగాణ ఉద్యోగాల్లో సీమాంధ్రులు ప్రవేశించేటప్పుడు వేలాది, లక్షలాది రూపాయలు చేతులు మారాయని చెప్పడం నాల్గవ విషయం. స్థూలంగా తెలంగాణ ప్రాంతానికి దక్కవల్సిన ఉద్యోగావకాశాలన్నీ తెలంగాణ నిరుద్యోగులకు దక్కకుండా, బ్రిటిష్ పాలిత విద్యావంతులైన

సీమాంధ్రులు కాజేసుకుపోయారని చెప్పడం ఈ కవిత్వంలోని మౌలిక తత్త్వం.

24. తెలంగాణ, సీమాంధ్రల మధ్య నడిచిన భాషారాజకీయాలను కేవలం భావోద్రేకంతోనే కాకుండా చారిత్రక దృష్టితో, భాషా శాస్త్ర పరిజ్ఞానంతో చెప్పడం మరొక మౌలికాంశం. తెలంగాణ ఉద్యమ సందర్భంలో సీమాంధ్రులను ఉద్దేశించి మీ భాష వేరు, మా భాష వేరు అని మోసపోయిన బాధలోంచి ధర్మాగ్రహ ప్రకటన చేసిన ఉద్యమకారులు, వాగ్గేయకారులు ఉన్నప్పటికీ కవులు మాత్రం భాషాశాస్త్రావగాహనతోనే కవిత్వం రాశారు. తెలుగు భాష ఒక్కటే అయినప్పటికీ, తెలంగాణ భాషమీద రెండున్నర జిల్లాల, రెండున్నర కులాల భాష ఆధిపత్యం చెలాయించడమేంటి అని ప్రశ్నించడం ఈ కవిత్వంలోని విశేషంగా చెప్పాలి. స్థూలంగా తెలంగాణ మాండలికం వివక్షకు గురికావడాన్ని నిరసిస్తూ, భాషాధిపత్యం వెనుక కనిపించని రాజకీయాల్ని బహిర్గతం చేస్తుందీ కవిత్వం.

25. ప్రత్యేక తెలంగాణోద్యమం, ఉద్యమ కవిత్వం చేసిన చాలా గొప్ప పనుల్లో సాహిత్యానికి సంబంధించిన శాస్త్రీయమైన చర్చను లేవనెత్తడం కీలకమైనది. తెలుగు సాహిత్య చరిత్రల్లో ఇప్పటిదాకా జానపద సాహిత్యానికి ప్రాధాన్యతను ఇవ్వలేదని, ఆ ఆధిపత్య భావన కలిగిన సాహిత్య చరిత్రకారులే తెలంగాణ సాహిత్యాన్ని కూడా చరిత్రలో లేకుండా చేశారని, తెలంగాణకు సంపద్వంతమైన సాహిత్య చరిత్ర ఉన్నదని చెప్పడం ఈ కవిత్వంలోని స్థూల సారాంశం.

26. తెలంగాణలోని పది జిల్లాల్లో అనేక రకాలైన కళా సంపద ఉన్నదనీ, దానిని ఉద్దేశ్యపూర్వకంగానే వివక్షకు గురిచేసి వెనుకపట్టు పట్టించారని చెప్పడం ఈ కవిత్వంలోని మరొక మౌలిక భావన. సినిమా రంగంలో మొత్తం సీమాంధ్రుల ఆధిపత్యాన్నే చెలాయిస్తూ వచ్చారనీ, తెలంగాణ కళలూ, భాష కేవలం హీనపాత్రలకు మాత్రమే ఉపయోగించారని, తద్వారా తెలంగాణ కళల్ని న్యూనపరిచారని చెప్పడం రెండవ విశేషం. 20వ శతాబ్ది మధ్య భాగంలో మొత్తం ప్రపంచం దృష్టిని ఆకర్షించిన తెలంగాణ రైతాంగ పోరాటం అద్భుతమైన ప్రజా కళారూపాల్ని సృష్టించి, ప్రజల్లోకి తీసుకెళ్లింది, కానీ కళారంగ చరిత్రలో

దానికి స్థానం లేకుండా చేశారని చెప్పడం మూడవ విశేషం. చారిత్రకంగానే తెలంగాణకు అత్యద్భుతమైన నిర్మాణ కళ ఉన్నదని, దానికి ప్రభుత్వాలు సహకరించి ఉంటే ఇవాళ ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందడమే కాకుండా కళాకారులకు జీవనభృతి దొరికేదనీ, సీమాంధ్ర ప్రభుత్వాలు ఈ రంగాన్ని అసలు పట్టించుకోలేదని చెప్పడం నాలుగవ విశేషం. స్థూలంగా సీమాంధ్ర పాలకులు చారిత్రకంగా తెలంగాణ ప్రాంతానికి ఉన్న కళారంగ చరిత్రను ముందుకు తీసుకుపోలేదు, పైగా ఉన్నదానిని నాశనం చేశారు అని చెప్పడం ఈ కవిత్వంలో కనిపించే ముఖ్యమైన భావన.

27. ఆరు దశాబ్దాల ఉమ్మడి జీవనంలో తెలంగాణ సంస్కృతి దారుణంగా పరాయీకరణకు గురైందని చెప్పడం ఈ కవిత్వంలోని మరొక మౌలికాంశం. ఏ ప్రజా సమూహానికైనా సంస్కృతే నడిపించే చోదక శక్తిగా పనిచేస్తూ ఉంటుందనీ, అటువంటిది ఆ సమూహానికి తనదైన సంస్కృతిని కోల్పోవల్సి రావడం కన్నా విషాదం మరొకటి ఉండదు అని చెప్పడం మొదటి అంశం. తెలంగాణలోని శ్రామిక ప్రజల పండుగల్ని ధ్వంసం చేసి సీమాంధ్ర పండుగల్ని ఉమ్మడి సంస్కృతి పేరుమీద తెలంగాణ ప్రజల మీద రుద్దారని చెప్పడం రెండవ అంశం. పాఠశాలల్లో, కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో తెలంగాణ విద్యార్థులు అనేక ఇతర భాషల మాదిరిగానే (ఆంగ్లం, హిందీ) అర్థంకాని (సీమాంధ్ర) తెలుగులో పాఠ్యాంశాలు చదువుకోవాల్సిరావడం శోచనీయమని చెప్పడం మూడవ అంశం. ప్రపంచీకరణ సంస్కృతిని ప్రవేశపెట్టడం ద్వారా మొత్తం తెలంగాణ సమాజ సంస్కృతిని నాశనం చేసి వ్యాపార సంస్కృతిని ప్రవేశపెట్టారనీ, దానివలన మొత్తం మానవీయమైన విలువలకే మోసం వచ్చిపడిందని చెప్పడం నాలుగవ అంశం. స్థూలంగా ఈ ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వమంతా తెలంగాణ సాంస్కృతిక కోణాన్ని విశదీకరిస్తూనే, రాష్ట్రం ఏర్పడితే ఉండబోయే లేదా పునరుద్ధరించుకోబోయే సంస్కృతి గురించి కూడా చెప్తుంది.

28. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలోని మరొక మౌలిక భావన ఆదివాసుల పరిస్థితి చిత్రణ. ఇందులో కూడా భిన్నమైన అంశాలు అంతర్భాగంగా ఉన్నాయి. నిజాం కాలంలోనే తమ జీవనానికి అడ్డంకులు ఎదుర్కున్న ఆదివాసులు స్వయం పాలనలో ఆ పరిస్థితి

మారుతుందనుకున్నారు, కానీ పరిస్థితి ముందటికంటే దయనీయంగా తరాయరైందని చెప్పడం ఒక అంశం. ఆదివాసులు నివసించే అడవీ ప్రాంతంలో భూగర్భంలో విలువైన ఖనిజాలు ఉండటం వల్ల, వాటని దోచుకోవాలనే కుట్రతోనే సీమాంధ్ర ప్రభుత్వాలు కవ్వాల్ వంటి అభయారణ్యాల ప్రకటనలు చేశారని, ఖనిజాల దాహంతోనే ఆదివాసుల్ని నిర్వాసితుల్ని చేస్తున్నారని చెప్పడం రెండవ అంశం. ప్రపంచంలోని ఏ ప్రజాస్వామిక ఉద్యమానికైనా పునాదులు వేసింది ఆదివాసులే అని చెప్పడం మూడవ అంశం. పోలవరం వంటి భారీ ప్రాజెక్టుల నిర్మాణం కారణంగా నష్టపోయేది మిగతా సమాజం కంటే ఆదివాసులే ఎక్కువ అని చెప్పడం నాల్గవ అంశం.

29. తెలంగాణలో ఉన్న ఖనిజ వనరుల దోపిడీని వివరించేది మరొక ముఖ్యమైన విషయం. ఇందులోనూ భిన్నమైన పార్శ్వాలు ఉన్నాయి. తెలంగాణ ప్రాంతంలో లభించే బొగ్గు, క్వార్ట్జ్, సీసం, రాగి, డోలమైట్, ఇనుము, గ్రానైట్, అభ్రకం వంటి ఎన్నో ఖనిజాలను సీమాంధ్ర ప్రభుత్వాలు అక్రమంగా దోచుకున్నాయని చెప్పడం ఒక అంశం. ఓపెన్ కాస్ట్ మైనింగ్ ద్వారా భూ, వాయు, జల కాలుష్యానికి పాల్పడి తెలంగాణ ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారని చెప్పడం రెండవ అంశం. సీమాంధ్ర ప్రయోజనాలకోసం ఉపయోగపడుతున్న సింగరేణి బొగ్గుగనుల్లో బొగ్గును వెలికితీయడంలో కార్మికులు చేస్తున్న త్యాగాల గురించి చెప్పడం మూడవ అంశం. ఈ ఖనిజ వనరుల దోపిడీ చేస్తున్న సీమాంధ్ర రాజకీయ వ్యాపారవేత్తలను నిలువరించే శక్తి కూడా తెలంగాణ ప్రజలకు ఉన్నదని తెలియజెప్పడం నాల్గవ అంశం. స్థూలంగా ఈ కవిత్వమంతా తెలంగాణ ప్రాంత ఖనిజ నిక్షేపాల్ని తెలంగాణ ప్రజల ప్రయోజనాలకే వినియోగించాలని చెప్తున్నది.

30. తెలంగాణోద్యమ కవిత్వంలో కనిపించే ప్రధాన భావనల్లో హైదరాబాదుకు సంబంధించిన రాజకీయాల చర్చ ఒకటి. ఇందులోనూ భిన్నమైన కోణాలున్నాయి. భిన్న సంస్కృతుల సమ్మేళన జీవన విధానం హైదరాబాద్ సొంతమని, అందుకే అది భారతదేశంలోని ఏ ప్రాంత ప్రజల్నైనా ఆదరించి, అన్నంపెట్టే కన్నతల్లిగా కనిపిస్తుందని చెప్పడం ఒక అంశం. హైదరాబాద్‌లోని మంచినీటి జలాశయమైన హుస్సేన్ సాగర్‌ను

మురికినీటి జలాశయంగా మార్చింది సీమాంధ్ర పెట్టుబడిదారుల పరిశ్రమల రసాయనాలు, ఐదు నక్షత్రాల హోటళ్ల వ్యర్థాలేనని చెప్పడం రెండవ అంశం. హైదరాబాద్‌లోనూ, పరిసర ప్రాంతాల్లోనూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి తెలంగాణ భూములు మొత్తం ఆక్రమించారని చెప్పడం మూడవ అంశం. ఇందులో భాగంగా భూ వ్యాపారంలో రింగురోడ్డు, ఫిల్మ్ సిటీలు, ఫామ్‌హౌస్‌లు, రిసార్ట్‌లు నిర్మించడం వ్యూహాలుగా అర్థం చేసుకోవాలని చెప్పడం అంతర్భాగంగా ఉన్నది. హైదరాబాద్‌లో వాతావరణ కాలుష్యం చేస్తున్నవారిలో ఎక్కువ భాగం సీమాంధ్రులే ఉన్నారని చెప్పడం నాల్గవ అంశం. హైదరాబాద్‌లోని చిరువ్యాపారుల నడ్డి విరుస్తూ షాపింగ్ మాల్స్‌ని నిర్మించింది సీమాంధ్ర బడా వ్యాపారవేత్తలే అని చెప్పడం ఐదవ అంశం. కళాసాంస్కృతిక రంగాల్ని వివక్షకు గురిచేయడంతోపాటుగా, తెలంగాణ భూముల్ని అక్రమంగా ఆక్రమించుకుని సినిమా నిర్మాణాల కోసం స్టూడియోలు (రామోజీ ఫిల్మ్ సిటీ, అన్నపూర్ణ స్టూడియో, పద్మాలయ స్టూడియో, రామానాయుడు స్టూడియో వంటివి) నిర్మించారు. ఈ నిర్మాణాలకు ఆక్రమించుకున్న భూమి మొత్తం తెలంగాణ మూలవాసులదే అని చెప్పడం ఐదవ అంశం. హైదరాబాద్ ఫ్రీజోన్ కాదని, తెలంగాణలోని ఆవర జోన్‌లో భాగమే అని తెలియజేయడం ఆరవ అంశం. ఇందులో భాగంగా కీలకమైన విషయాల్ని చర్చించారు. సీమాంధ్ర బడా పెట్టుబడిదారులు హైదరాబాద్‌ను ఫ్రీజోన్‌గా ఉంచాలనీ కొట్లాడటం, లేదా యూటీ చేయాలని అడగటం కానీ వీటి వెనుక ఉన్నది వేరే లక్ష్యం, సీమాంధ్ర అక్రమ భూ ఆక్రమణలు, అక్రమ భవన నిర్మాణ అనుమతులు, అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణ, ఫ్లోర్ స్పేస్ కండీషన్స్ వెసులుబాటు, మాస్టర్ ప్లాన్ ఉల్లంఘన వంటి స్వార్థ ప్రయోజనాలకు రక్షణ కావాలి, కనుక హైదరాబాద్‌ను ఫ్రీజోన్‌గా ఉంచినా, యుటి చేసినా వారికి ఈ రక్షణ దొరకుతుంది, కనుకనే సమైక్యరాగంలో ఈ వివాదాన్ని ముందుకు తీసుకువచ్చారు అని చెప్పడం ఇందులో అంతర్భాగం. స్థూలంగా హైదరాబాద్ తెలంగాణ ప్రజలు తమ రక్తమాంసాలతో నిర్మించుకున్నది అనీ, హైదరాబాద్‌తో కూడిన తెలంగాణే మాకు కావాలి అని చెప్పడం ఈ కవిత్వంలో బలంగా కనిపిస్తుంది.

31. చరిత్ర రచనలో తెలంగాణకు అన్యాయం జరిగిందని చెప్పడం ఈ కవిత్వంలో

కనిపించే మరొక మౌలిక భావన. ఇందులో భిన్నమైన దృక్కోణాలు ఉన్నాయి. క్రీ.పూ. 6వ శతాబ్ది నుండి తెలంగాణకు సంబంధించిన చారిత్రక ఆధారాలు ఇప్పటికే లభ్యమై ఉన్నా చరిత్ర రచనలో మాత్రం తెలంగాణకు తక్కువ ప్రాధాన్యతను ఇచ్చి, సీమాంధ్ర చరిత్రనే తెలుగు ప్రజల చరిత్రగా రాశారని చెప్పడం ఒక అంశం. తెలంగాణ సాహిత్యకారులకు సాహిత్య చరిత్రలో సముచిత స్థానం ఇవ్వలేదన్నది రెండవ అంశం. స్థూలంగా ఈ కవిత్వమంతా తెలుగు ప్రజల చరిత్ర పుస్తకాల్లో, తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ఎండగడుతూనే, తమ ప్రాంతానికి ఉన్న ప్రాచీన చరిత్రను కీర్తిస్తూనే, తమ చరిత్రను తామే రాసుకున్నప్పుడు మాత్రమే తెలంగాణ చరిత్రకు న్యాయం జరగుతుందని తీర్మాణించింది. ఇది ప్రత్యేక తెలంగాణ ఏర్పాటులోనే సుళువుగా సాధ్యం అవుతుందని కూడా అంతర్గతంగా సూత్రీకరించింది.

32. తెలంగాణోద్యమ కవిత్వంలో మరొక మౌలిక భావన నిధుల కేటాయింపుల్లో అసమానతలు. ఇందులో భిన్నమైన దృక్కోణాలున్నాయి. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నాటినుండి ఏ ఒక్క సంవత్సరంలోనూ మొత్తం నిధుల కేటాయింపులలో తెలంగాణ జనాభా నిష్పత్తి ప్రకారం 40 శాతం వాటాగాని, విస్తీర్ణం నిష్పత్తి ప్రకారం 42 శాతం వాటాగాని, రెవెన్యూ వసూళ్ల ప్రకారం 40 శాతం వాటాగాని అందలేదు అని చెప్పడం ఒక అంశం. ఈ సందర్భంలో తెలంగాణ నుంచి వచ్చే ఆదాయపు మిగులును తెలంగాణలోనే ఖర్చు పెట్టాలని పెద్దమనుషుల ఒప్పందంలో రాసుకున్నప్పటికీ, ఆ ఒప్పదం అమలు కాలేదనీ, దీని కారణంగా స్వాంతత్ర్యానికి పూర్వం తెలంగాణ అభివృద్ధి ఎలా ఉన్నదో, స్వాతంత్ర్యం వచ్చాక, భారత ప్రభుత్వ ప్రజాస్వామ్య పాలనలో కూడా తెలంగాణ పరిస్థితి అలాగే ఉండిపోయింది అని చెప్పారు. నీటిపారుదల విషయంలో జరిగిన అన్యాయం కారణంగా తెలంగాణ వ్యవసాయం దాదాపుగా వర్షాధారంమీదనే ఆధారపడవల్సి వచ్చిందనీ, ఇటువంటి సందర్భంలో ప్రభుత్వ బాధ్యత, రైతులకు రాయితీలు ఇవ్వాలనీ, కానీ తెలంగాణ వ్యవసాయానికి ఎటువంటి రాయితీలు లభించకపోవడం కారణంగా వందలాదిమంది అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడ్డారు, అయినా సీమాంధ్ర ప్రభుత్వాలు చలించలేదని చెప్పడం రెండవ అంశం. ఒకవైపు సీమాంధ్ర

పాలకవర్గాలు తెలంగాణకు నిధుల కేటాయింపుల్లో వివక్ష చూపిస్తుంటే, ప్రశ్నించవల్సిన తెలంగాణ ప్రాంత ప్రజా ప్రతినిధులు చెంచాల పాత్ర నిర్వహించారని చెప్పడం మూడవ అంశం. స్థూలంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కాంక్షకు నిధుల కేటాయింపులో జరిగిన అన్యాయాలు కూడా ఒక మౌలికమైన కారణం అని ఈ కవిత్వం స్పష్టం చేస్తున్నది.

33. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో కనిపించిన మరొక మౌలిక భావన ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు సమయంలో చేసుకున్న ఒప్పందాలు ఉల్లంఘనకు గురికావడం, తెలంగాణ ప్రయోజనాలకోసం తీసుకువచ్చిన జీవోలు, హామీలు, కమిటీలు, కమీషన్‌లు ఏవీ తెలంగాణకు న్యాయం చేయలేకపోయాయని, పైగా ఇవన్నీ ఆయా సందర్భాల్లో ప్రత్యేక తెలంగాణ వాదాన్ని, ఉద్యమాన్ని నీరుగార్చడం కోసమే వచ్చాయని చెప్పడం.

34. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలోని మరొక మౌలిక భావన పాలకవర్గ రాజకీయాల్ని విమర్శకు పెట్టడం. ఇందులోనూ అనేక విభాగాలున్నాయి. 57 సంవత్సరాలు ఆంధ్రప్రదేశ్‌ను పాలించిన ముఖ్యమంత్రుల్లో సీమాంధ్ర పాలకుల ఆధిపత్యమే ఉన్నదని చెప్పడం మొదటి అంశం. ఇందులో భాగంగా 41 సంవత్సరాలు కాంగ్రెస్, 16 సంవత్సరాలు తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్‌ను పరిపాలించాయనీ, ఈ రెండు పార్టీలూ ఆంధ్రప్రదేశ్‌కు పరిచయం అయినప్పటి నుండే సీమాంధ్ర పార్టీలుగా పనిచేశాయనీ, రాష్ట్రంలోని ఇతర పెద్ద పార్టీలైన బీజేపీ, టీఆర్ఎస్, మజ్లిస్, సీపీఐ, సీపీఎం, లోక్‌సత్తా, వైఎస్ఆర్ కాంగ్రెస్‌లు ఎన్నిక సందర్భంలో కూటముల్లో భాగాస్వాములుగానో, ఒంటరిగానో పోటీ చేస్తూ వచ్చాయిగానీ వాటికి ఏనాడూ పరిపాలనాధికారాలు చేజిక్కలేదనీ, అంటే మొత్తంగా ఆంధ్రప్రదేశ్ పరిపాలనాధికారాలు రెండు తెలంగాణ వ్యతిరేక పార్టీల చేతుల్లోనే ఉంటూ వచ్చాయని చెప్పారు. తెలంగాణ ప్రాంతం నుండి ముఖ్యమంత్రులు పనిచేసినా, వారు కూడా సీమాంధ్ర పెద్దల కనుసన్నల్లోనే మెలిగారని, తెలంగాణకు ఏం న్యాయం చేయలేని నిస్సహాయ స్థితిలోనే ఉండిపోయారని చెప్పడం రెండవ అంశం. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసినప్పుడల్లా, ప్రాంతీయ పార్టీలుగానీ, జాతీయ పార్టీలు గానీ కేంద్రం మీద ఆధారపడ్డాయి తప్పితే, స్వయంగా ఒక తీర్మానం చేసుకుని పనిచేసే

స్వతంత్ర్యాన్ని ప్రదర్శించలేదని చెప్పడం మూడవ అంశం. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వచ్చినప్పుడల్లా రెండు తెలుగు ప్రాంతాల్లో ఉన్న రాజకీయ పార్టీల ప్రతినిధులు ద్విపాత్రాభినయం చేశారని చెప్పడం నాల్గవ అంశం. తెలంగాణకు అన్యాయం చేసి, స్థానిక ప్రజల మరణాలకు బాధ్యులైన ప్రభుత్వాలే మళ్లీ ఉపశమన చర్యలకు పాల్గొనడం ఒక కుట్రపూరితమైన వ్యవహారం అని చెప్పడం ఐదవ అంశం. సీమాంధ్ర అధిష్ఠానం నియంత్రణలో ఉన్న తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం, తెలంగాణ ప్రజల్ని తీవ్ర నిర్బంధానికి గురి చేసిందని చెప్పడం ఆరవ అంశం. ఉద్యమకాలంలో ప్రజలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా పాలకవర్గాలు ఏమాత్రం స్పందించలేదని చెప్పడం ఏడవ అంశం. స్థూలంగా ఈ కవిత్వంలో సీమాంధ్ర ప్రజాప్రతినిధులైనా, తెలంగాణ ప్రజాప్రతినిధులైనా వారు కేవలం సాధారణమైన పాలకవర్గ స్వభావాన్నే కలిగి ఉన్నారనీ, తెలంగాణకు ద్రోహమే తప్ప మేలు చేయలేదని చెప్పడం ఈ కవిత్వ సారాంశం.

35. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో కనిపించే మరొక మౌలిక భావన రాజ్యం ప్రయోగించిన నిర్బంధాన్ని, రాజ్యహింసను విమర్శనాత్మకంగా వ్యాఖ్యానించడం. ఇందులో భిన్నమైన కోణాలున్నాయి. సీమాంధ్ర పాలక వర్గాలు, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మీదనే కాకుండా అనేక అస్తిత్వ ఉద్యమాల, పౌర హక్కుల ఉద్యమాల నాయకత్వాలను కూడా చంపేస్తూ పోవడమో, అక్రమ కేసులు బనాయించి, నల్ల చట్టాలు అమలు చేసి జైల్లకు పంపడమో చేశారని చెప్పడం మొదటి అంశం. సీమాంధ్ర ప్రభుత్వాలు తెలంగాణలో ఏ ఉద్యమం వచ్చినా సమస్య మూలాల్ని అన్వేషించి, పరిష్కారాల్ని కనిపెట్టం అన్న పద్ధతి మీద కాకుండా కేవలం అణచివేత ధోరణి మీదనే ఆధారపడిందని చెప్పడం రెండవ అంశం. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ తొలిదశలో పోలీసులే లాఠీచార్జీలు చేసి, కాల్పులు జరిపి ఉద్యమకారులను హతమార్చారనీ, మలిదశ పూర్వార్ధంలో కూడా బూటకపు ఎన్‌కౌంటర్‌లు చేసి, హత్యలు చేసి తెలంగాణ ఉద్యమకారుల్ని చంపేశారనీ, కానీ మలిదశ ఉత్తరార్ధ ఉద్యమంలో ఆత్మహత్యలు చేసుకునే విధంగా ప్రేరేపించారనీ, వీటిని ప్రభుత్వ హత్యలుగానే గుర్తించాలని తీర్మాణించడం మూడవ అంశం. తెలంగాణ ఉద్యమకారులను చంపడానికి సీమాంధ్ర ప్రభుత్వం వాళ్లకు పెట్టిన పేరు విప్లవకారులనీ, భారత శిక్షా

స్మృతి ప్రకారం విప్లవకారులైనా, మరెవరైనా చంపడానికి పోలీసులకు అధికారాలు లేవనీ, వాళ్లను అరెస్టు చేసి న్యాయస్థానాల ముందు నిలబెట్టాలి, ఆ తర్వాత న్యాయాన్యాయాలు న్యాయస్థానాలు చూసుకుంటాయనీ, కానీ తెలంగాణలో న్యాయస్థానాల విధులను కూడా పోలీసులే చేతుల్లోకి తీసుకున్నారనీ, ఈ పోలీసులకు అండగా ఉన్నది సీమాంధ్ర ప్రభుత్వమే అని చెప్పడం నాలుగవ అంశం. పాలకవర్గాలు అనుసరించిన అణచివేత విధానాల కారణంగానే తెలంగాణలో విప్లవోద్యమం పురుడుపోసుకున్నదని చెప్పడం ఐదవ అంశం. తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో అందరు ఉద్యమకారుల మీద నిర్బంధం ప్రయోగించారని, మలిదశ పూర్వార్థంలో ఎక్కువగా మేధావులు, కళాకారులనే లక్ష్యం చేసుకున్నారని, మలిదశ ఉత్తరరార్థంలో మళ్లీ అందరిమీద నిర్బంధం ప్రయోగించారని చెప్పడం ఆరవ అంశం. ఇందులో భాగంగా మలిదశ పూర్వార్థంలో ఉద్యమాన్ని వ్యాప్తి చేయడంలో మేధావులు, కళాకారులు ముందున్నారు కాబట్టే వారిని లక్ష్యం చేసుకున్నారని చెప్పడం ఉన్నది. మొత్తంగా చూసినప్పుడు ఈ కవిత్వం నిండా తెలంగాణలో సీమాంధ్ర పాలకులు ప్రయోగించిన హింసనూ, హింసా సాధనాల్ని తెలియజేయడంతోపాటు ప్రభుత్వ విధానాల పర్యవసానమే ఉద్యమాలు అని ప్రకటించడం కనిపిస్తుంది.

36. ప్రత్యేక తెలంగాణోద్యమంలో కనిపించే మరొక ముఖ్యమైన భావన హక్కుల ఉల్లంఘన గురించి చెప్పడం. ఇందులో అనేక దృక్కోణాలు ఉన్నాయి. భారత రాజ్యాంగం భారత ప్రజలందరికీ కల్పించిన భావప్రకటనా హక్కు, జీవించే హక్కు, సభలూ, సమావేశాలూ నిర్వహించుకునే హక్కు మొదలైన హక్కుల్ని తెలంగాణ ప్రజలకు లేకుండా చేశారని చెప్పడం మొదటి అంశం. ఈ హక్కుల గురించి మాట్లాడినవారిని కూడా హతమార్చారని చెప్పడం రెండవ అంశం.

37. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో ఉన్న మరొక మౌలిక భావన అస్తిత్వ పరివేదన. ఇందులో భాగంగా తెలంగాణోద్యమ కవులు అనేక కోణాల్ని నిక్షిప్తం చేశారు. సీమాంధ్ర పాలకవర్గాలే ప్రపంచీకరణను తీసుకువచ్చి తెలంగాణలోని అనేక సామాజిక రంగాల్ని పరాయీకరణకు గురిచేశారని చెప్పడం ఒక అంశం. ఈ క్రమంలో తెలంగాణ కవులు

ప్రపంచీకరణ విధానాల్ని లోతుగా, శాస్త్రీయంగా విమర్శిస్తూ కవిత్వం వెలువడినట్లు తెలుసుకోవచ్చు. తెలంగాణ సాహిత్యం, భాష, రాజకీయాలను విస్మరణకు, వివక్షకు గురిచేయడాన్ని నిరసించడం, స్థానిక చరిత్రను ఎలుగెత్తి చాటడం రెండవ అంశం. తెలంగాణ అస్తిత్వాన్ని, పోరాట వారసత్వాన్ని చారిత్రక కోణంలో కీర్తించడం మూడవ అంశం. స్థూలంగా తెలంగాణ అస్తిత్వాన్ని నిలబెట్టుకునే ప్రయత్నం ఈ కవిత్వంలో కనిపిస్తుంది.

38. తొలిదశ నుండి మలిదశ ఉత్తరార్ధం వరకు నడిచిన, నడుస్తున్న ఉద్యమ గమనాన్ని వివరించడం మరొక మౌలిక భావన. ఇందులో తొలిదశ ఉద్యమం నుండి తీసుకోవల్సిన స్ఫూర్తిని, మలిదశ పూర్వార్ధంలో తెలంగాణ వీరులు చేసిన త్యాగాల్ని, ఉత్తరార్ధంలో నడుస్తున్న ఉద్యమంలోని సృజనాత్మకతనూ, నవీన సంప్రదాయాల్ని ఎత్తిపట్టడం కనిపిస్తుంది. భవిష్యత్తు సామాజిక ఉద్యమాలు నిర్వహించడానికి ఎత్తుగడల్నీ, వ్యూహాల్నీ, అనుసరించవల్సిన రాజకీయ కార్యక్రమాల్ని నూరిపోసే పని చేసింది.

39. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో మరొక మౌలిక భావన అమరుల కీర్తన (ఎలిజీలు రాయడం). పత్యేక తెలంగాణ ఉద్యమంలో కూడా సుమారు రెండువేల మందికి పైగా అమరులయ్యారు. వారి త్యాగాల్ని కీర్తిస్తూనే, ఆ అమరత్వం సాధించబోయే భవిష్యత్తు సాకారాలను కూడా ఎత్తి పట్టింది.

40. అనేక చేదు అనుభవాలను ఎదర్కొన్నాం, ఇక వేరు తెలంగాణ తప్ప తెలంగాణ ప్రజలకు ఇతరేతర పరిష్కారాలేవీ న్యాయం చేయలేవని చెప్పడం మరొక మౌలిక భావన.

41. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం కేవలం భౌగోళిక తెలంగాణను కాకుండా ప్రజాస్వామిక తెలంగాణను కోరుకున్నది.

42. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వ లక్షణాల్లో ముఖ్యమైనవి అమరవీరులను

స్మరించుకోవటం, నాస్టాల్జియాతో రాయటం.

43. వచన కవిత్వం ప్రధానంగా చదువుకున్న మధ్యతరగతి బుద్ధిజీవుల సాహిత్య ప్రక్రియ. కానీ ఈ భావనను ప్రత్యేక తెలంగాణోద్యమ వచన కవిత్వం కొంతమేరకు పూర్వపక్షం చేసే ప్రయత్నం చేసింది. నందిని సిధారెడ్డి, వంశీకృష్ణ, కాశీం, పగడాల నాగేందర్, పసునూరి రవీందర్, చింతం ప్రవీణ్, సుంకిరెడ్డి నారాయణ రెడ్డి లాంటి సీనియర్ కవులతోపాటు ఉద్యమంలోనే రూపుదిద్దుకున్న ప్రతిభావంతమైన కవులు చాలామంది పుష్కలమైన కవితా విలువలతో రాసిననప్పటికీ, అద్భుతమైన టెక్నిక్‌ను ప్రయోగించినప్పటికీ వీరి కవిత్వం కవితా పామరులను కూడా ఆకర్షించగలిగింది.

# ఉపసంహారం

స్థూలంగా చూసినప్పుడు ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం మొత్తం, తెలంగాణ ప్రజలకు కావాల్సింది కేవలం భౌగోళిక తెలంగాణ కాదనీ, ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణనే కావాలని బలంగా తెలియజేస్తున్నది.

సిద్ధాంత గ్రంథం ఆరంభంలో ఉన్న ప్రవేశికలో సిద్ధాంత గ్రంథ వస్తు, రూపాలకు సంబంధించిన సంక్షిప్త సమాచారం తెలిచపరిచాను.

మొదటి అధ్యాయంలో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు గురించి వివరించాను. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉంటూ తెలంగాణ ప్రాంతం ఏయే రంగాల్లో వివక్షకు గురైందో విడివిడిగా ఒక్కో కేంద్రక అంశాన్ని తీసుకుని ఆధారాలతో సహా వివరించే ప్రయత్నం చేశాను. అట్లే వివక్షకు గురి కావడం మూలంగా చోటుచేసుకున్న పర్యవసానాలేమిటో వివరించాను.

రెండవ అధ్యాయంలో 1952 నుండే హైదరాబాద్ రాష్ట్ర ప్రజలు అస్తిత్వం కోసం చేసిన వీరోచిత పోరాటాల్ని వివరించాను. అట్లే 1968 సంవత్సరాంతం నుండి అధికారికంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 జూన్ 2 వరకు జరిగిన పరిణామాల్ని సోదాహరణంగా వివరించాను.

మూడవ అధ్యాయంలో సమాజం కవిత్వంగా పరిణామం చెందే క్రమాన్ని శాస్త్రీయంగా విశ్లేషిస్తూ, తెలంగాణ సామాజిక చరిత్రలో సంచలనమైన ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ కవిత్వంగా ప్రతిఫలించిన విధానాన్ని వివరించాను.

నాలుగవ అధ్యాయంలో ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలోని మౌలిక భావనల్ని విడివిడిగా వివరిస్తూ, వాటిని బలపరిచే కవితా పంక్తుల్ని ఉదహరించాను. ఈ అధ్యాయం

మొత్తం పరిశోధనలోనే కీలకమైనది కావున కొంత ఎక్కువ పరిధిలోనే విశ్లేషించాను.

'పరిశోధనా ఫలితాలు' అనే విభాగంలో ఈ పరిశోధన ద్వారా వెలికితీసిన 43 నూతనాంశాలకు నంబర్లు వేసి, విడివిడిగా తెలియజేశాను.

ఈ పరిశోధనలో ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వ వస్తువు మీద ప్రధానంగా దృష్టి నిలిపింది కనుక, భవిష్యత్తులో ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలోని కింది అంశాలమీద పరిశోధనలు చేసే అవకాశం ఉన్నది.

1. శిల్పంలోని అన్ని ఉపాంగాలకు సంబంధించి విడివిడిగా విస్తృతమైన పరిశోధనలు చేయడానికి అవకాశముంది.

2. కేవలం తెలంగాణ భాషలో రాసిన కవిత్వంలోని విశేషాంశాల మీద కూడా విడి పరిశోధన చేయవచ్చు.

3. తెలంగాణలోని ఉత్పత్తి కులాల కవిత్వ దృక్పథం, ఉత్పత్తిలో లేని కులాల కవిత్వ దృక్పథాల మధ్య తులనాత్మక పరిశీలన చేయవచ్చు. లేదా ఈ రెండు కులాల కవిత్వాభివ్యక్తిలోని వైవిధ్యాన్ని తులనాత్మకంగా పరిశోధించవచ్చు.

4. ప్రత్యేక తెలంగాణోద్యమ కవయిత్రుల కవిత్వాన్ని విడిగా పరిశోధించవచ్చు.

5. తెలంగాణలోని వివిధ రచయితల సంఘాల వారీగా వెలువరించిన ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వాన్ని విడివిడిగా అధ్యయనం చేయవచ్చు. ఉదాహరణకు విప్లవ రచయితల సంఘం, మంజీరా రచయితల సంఘం, సింగిడి తెలంగాణ రచయితల సంఘం, మట్టిపూలు – తెలంగాణ దళిత రచయిత్రుల సంఘం, బహుజన రచయితల వేదిక మొదలైన సంఘాలు విరివిగా ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వాన్ని వెలువరించాయి.

ఈ సంస్థలకు ఉన్న దృక్పథాల్లోంచే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సమస్యను చూడటం, అర్థం చేసుకోవడం, కవిత్వం వెలువరించడం చేశారు కనుక, ఈ సంస్థల కవిత్వం మీద విడి పరిశోధన చేయాల్సిన అవసరం ఉన్నది.

6. తెలంగాణ అస్తిత్వ వాద కవిత్వానికీ, ఇతర అస్తిత్వ వాద కవిత్వాలకు ఉన్న బేధ, సాదృశ్యాలను తులనాత్మకంగా పరిశోధించవచ్చు.

# తొలిదశ ఉద్యమ చిత్రాలు




హైదరాబాదులోని నిజాం కళాశాల ముందు పోలీసుల కవాతు



## తొలిదశ ఉద్యమ అమరుల్లో కొందరు

కె.వెంకటేశ్వర్ రావు



డి.రేణుక



ఎం.ఎ.రషీద్



నారాయణ



సర్వారెడ్డి



రాపోల్ క్రిష్ణ



టీకారాం



## హైదరాబాద్‌లోని నాంపల్లిలో అమరవీరుల స్మారక స్థూపం



# మలిదశ పూర్వార్ధ ఉద్యమ చిత్రాలు

**తెలంగాణ జెండా ఎగురవేస్తున్న**
**తెలంగాణ స్టూడెంట్స్ ఫ్రంట్ నాయకులు**



# మలిదశ పూర్వార్ధ ఉద్యమ అమరులు

బెల్లి లలిత




ఐలన్న



శ్రీకాంత్



రమేశ్



ప్రసాద్



పరుశురాం



మల్లేశ్



మనోహర్



హత్యాయత్నానికి గురై
ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న
డా॥ సి.కాశీం



తెలంగాణ సమస్యల్ని గానం చేస్తున్న వాగ్గేయకారుడు గోరటి వెంకన్న



విద్యార్థి నాయకుడు రఘుపతిరావు



## పత్రికలకెక్కిన ఉద్యమ వార్తలు



ఆరుసూత్రాల పథకం అమలు చేయాలి

## ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన చైతన్య సదస్సు



## తెలంగాణ విద్యార్థులు నిర్వహించిన ర్యాలీ



# మలిదశ ఉత్తరార్ధ ఉద్యమ చిత్రాలు

## మలిదశ ఉత్తరార్ధ ఉద్యమ అమరుల్లో కొందరు

ప్రాణత్యాగంతో తెలంగాణను రగిలించిన శ్రీకాంతాచారి



ఆత్మహత్య చేసుకుని సీమాంధ్ర ప్రభుత్వానికి సవాల్ విసిరిన యాదయ్య



ఆత్మహత్య చేసుకుని తెలంగాణ బాధలు వినిపించిన భోజ్యానాయక్



నిరాహార దీక్షలో టీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు



తెలంగాణను గానం చేస్తున్న ప్రజావాగ్గేయకారుదు గద్దర్



తెలంగాణ విద్యార్థులు ఓయూలో నిర్వహించిన చారిత్రాత్మక 'విద్యార్థి గర్జన'



ఓయూలో నిర్వహించిన చారిత్రాత్మక 'విద్యార్థి గర్జన' బహిరంగ సభ వార్త




హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్‌వద్ద నిర్వహించిన 'మిలియన్ మార్చ్'



సీమాంధ్ర ప్రభుత్వం ప్రయోగించిన రాజ్యహింసకు పరాకాష్ట




న్యాయవాదులూ ఎదుర్కోవల్సి వచ్చిన రాజ్యహింస



## తెలంగాణ ప్రజల సృజనాత్మక పోరాట రూపాలు








www.travelindia-guide.com





## నిర్బంధాన్ని తుత్తునియలు చేస్తున్న విద్యార్థి ప్రభంజనం






# ముఖాముఖి ప్రశ్నావళి

1. తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం నడిచినంత విస్తృతంగా కవిత్వం వెలువడకపోవడానికి కారణాలు ఏమిటి?
2. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో వస్తురూపాల గురించి చెప్పండి?
3. కవిగా / విమర్శకుడిగా / చరిత్ర రచయితగా మీరు తెలంగాణ ఉద్యమాన్ని ఎట్లా అర్థం చేసుకున్నారు?
4. తెలంగాణవాదంలోని అన్ని పార్శ్వాలు కవిత్వంలో ప్రతిఫలించాయా?
5. వచన కవిత్వం, పాటల్లో ప్రత్యేక తెలంగాణావాదం విస్తృతంగా వ్యక్తమైంది గానీ, ఇతర సాహిత్య ప్రక్రియల్లో ప్రధానంగా కనిపించకపోవడంలోని కారణాలు ఏమిటి?
6. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం సమాజం మీద వేసిన ప్రభావం ఎటువంటిది?
7. చివరిదశ ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం రాసిన వాళ్లలో ఎక్కువగా యువతరం ఉన్నారు. భవిష్యత్ తెలుగు కవిత్వానికి వారు భరోసానివ్వగలరు అని చెప్పగలరా?
8. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం మీద ఏయే కోణాల్లో పరిశోధనలు చేయవచ్చు?
9. ఇతర అస్తిత్వవాదాల కవిత్వానికి, తెలంగాణ అస్తిత్వవాద కవిత్వానికీ బేధం ఏమిటి? వాటికి వచ్చినంత గుర్తింపు తెలంగాణ కవిత్వాకిని వచ్చిందని భావిస్తున్నారా?
10. తెలుగు వచన కవితా ప్రస్థానంలో ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం స్థానం ఏమిటి?

## - సంగిశెట్టి శ్రీనివాస్‌తో ముఖాముఖి -

**1. తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం నడిచినంత విస్తృతంగా కవిత్వం వెలువడకపోవడానికి కారణాలు ఏమిటి?**

**జవాబు :** ఈ విషయం గురించి మాట్లాడుకునేటప్పుడు కొంత తాత్విక / చారిత్రక చర్చ చేయాల్సిన అవసరముంది. 1969-73 మధ్య కాలంలో ఉద్యమం విస్తృతంగా లేదు. అది కొన్ని వర్గాలకే పరిమితమై ఉండింది. సామాన్య ప్రజలు ఎక్కువగా ఉద్యమంతో మమేకం కాలేదు. కానీ ఉద్యమం పట్ల పూర్తి సంఘీభావంతో ఉన్నరు. అదెలా అంటే 1970లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో తొమ్మిది/10 మంది ఎంపీలు తెలంగాణ ప్రజాసమితి నుంచి ఎన్నికయిండ్రు. ఇందిరాయే ఇండియా అని దేశమంతా ముక్తకంఠంతో ఘోషిస్తున్న సందర్భమది. బ్యాంకుల జాతీయాకరణ, పాకిస్తాన్‌పై యుద్ధంలో విజయం, బంగ్లాదేశ్ ఏర్పాటు ఇవన్నీ కాంగ్రెస్ పార్టీ ఇమేజ్‌ని, ఇందిరాగాంధి చరిష్మాని ఇనుమడింపజేశాయి. అయితే తెలంగాణ ప్రజల 'ప్రత్యేక రాష్ట్ర' డిమాండ్ ముందు ఇవేవి నిలవలేదు. అందుకే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకు పోయింది. కొండా లక్ష్మణ్ బాపూజీ, సదాలక్ష్మి లాంటి కొంతమంది నిస్వార్థంగా ఉన్నారు. బాపూజీ తన మంత్రి పదవికి రాజీనామా చేసి ప్రజలతో మమేకమయిండు. అదే సమయంలో ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధానికి గురైన చెన్నారెడ్డి విద్యార్థుల నేతృత్వంలో నడుస్తున్న ఉద్యమాన్ని వ్యూహాత్మకంగా తన చేతుల్లోకి తీసుకున్నడు. తర్వాతి కాలంలో లౌల్యాలకు లోబడి ఉద్యమాన్ని నీరు గార్చిండ్రు.

ఇక పోతే విస్తృతంగా కవిత్వం వెలువడలేదనేది అర్థ సత్యం. ఉద్యమం ఏమేరకు నడిచిందో ఆ మేరకు కవిత్వం/పాటలు వెలువడ్డాయి. నిజానికి దాశరథి, సి.నారాయణ రెడ్డి, బిరుదురాజు రామరాజు, కేశవపంతుల, కప్పగంతుల.. ఇట్లా తెలంగాణలోని లబ్ధప్రతిష్టులైన కవి, పండితులందరూ 'ప్రత్యేక తెలంగాణ'కు వ్యతిరేకంగా ఉన్నరు. ప్రముఖుల్లో ఒక్క కాళోజి నారాయణరావు మాత్రమే తెలంగాణకు మద్దతుగా, నిలబడిందు,

విస్తృతంగా రాసిండు. యువ కవులు ఎక్కువ మందికి కాళోజి ఆదర్శమయిండు. అందుకే ఎన్.గోపి, ఖుక్నుద్దీన్, జి.యాదగిరి, ఎస్వీ సత్యనారాయణ, అనముల శ్రీహరి ఇట్లా చాలా మంది ప్రత్యేక తెలంగాణకు అనుకూలంగా కవిత్వమల్లింద్రు. ఇ.వి.పద్మనాభన్, ఇంకొంత మంది పాటలు రాసింద్రు, పాడింద్రు. దీనికి సంబంధించిన సాహిత్యమంతా సుంకిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి నేను '1969-73 ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కవిత్వం' పేరిట సంకలనంగా తీసుకొచ్చాను.

ఆనాడు సాహిత్యకారులు ఎక్కడికక్కడ స్థానిక సమస్యలను కైగట్టి పాటలుగా పాడింద్రు. అయితే దురదృష్టవశాత్తు ఈ పాటలేవి సీడీలు / క్యాసెట్ల రూపంలో రాలేదు. అంతెందుకు పత్రికల్లో కూడా ఈ పాటలను ప్రచురించలేదు. మేము సేకరించిన కరపత్రాల్లో ఉన్న పాటలు కొన్ని అక్కడక్కడా రికార్డయ్యాయి. పాటలు అప్పటికప్పుడే కైగట్టి పాడడం ఒక వైపూ, పాడిన వారూ, రాసిన వారూ తమ తక్షణ అవసరం తీరుస్తుందా లేదా అనేది చూసుకున్నారే తప్ప వాటిని భావితరాల కోసం నిక్షిప్తం చేయలేదు. దాని వల్ల తక్కువ పాటలు వచ్చినాయనే అపోహ కలుగుతుంది.

జర్నలిస్టులు తెలంగాణ ఉద్యమంలో కీలకంగా ఉన్నప్పటికీ పత్రికల యాజమానులు ఆంధ్రాప్రాంతం వారు దాంతో మెయిన్‌స్ట్రీమ్ పత్రికల్లో చాలా తక్కువ కవిత్వం అచ్చుయింది. ప్రగతిశీల, అభ్యుదయ సంఘాలు ఉద్యమాన్ని వ్యతిరేకించాయి. సిపిఐ, సిపిఎం సంఘాలకు అనుబంధంగా నడిచే విద్యార్థి సంఘాల ఉద్యమానికి వ్యతిరేకంగా ర్యాలీలు నిర్వహించాయి. ఆబిడ్స్ బృందావన్ లాడ్జిలో ఆంధ్రా ప్రాంతం నుంచి వచ్చిన రౌడీలు / మూకలు మకాం వేసి తెలంగాణకు అనుకూలంగా ర్యాలీలు తీస్తున్న విద్యార్థులపై దాడులకు తెగబడ్డారు. 1970లో ఏర్పడ్డ 'విరసం' ఉద్యమానికి మద్ధతిచ్చి చేతులు దులుపుకుంది. దాని అధ్యక్షుడు శ్రీశ్రీ ప్రత్యేక తెలంగాణను వ్యతిరేకిస్తూ, విరసం నిర్ణయాన్ని నిరసిస్తూ పదవికి రాజీనామా చేసిండు. నిజానికి వరవరరావు సంపాదకత్వంలో వచ్చిన 'సృజన' పత్రికలో తెలంగాణ ఉద్యమానికి మద్దతిస్తూ ఒక్క కవితను కూడా అచ్చేయలేదు. కచ్చితంగా ఇది వారి వెనుకబాటుతనమే! ఎం.ఎస్.ఆచార్యలాంటి సాంప్రదాయవాదులు నడిపిన 'జనధర్మ'

పత్రిక తెలంగాణ ఉద్యమానికి, ప్రత్యేక సంచికను వెలువరించి మద్దతు పలికింది.

నిజానికి 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమం అత్యంత అన్యాయానికి గురైన విద్యావంతులైన నిరుద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగులు ఉమ్మడిగా చేసిన ఉద్యమం. ఈ చీమలు పెట్టిన పుట్టలో రాజకీయ పాములు ప్రవేశించి ఉద్యమాన్ని పక్కదారి పట్టించాయి. ఫలితాలు ప్రజలకందకుండా చేశాయి. రాజకీయులు మాత్రం పదవులందుకున్నారు.

**2. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో వస్తు రూపాలగురించి చెప్పండి?**

**జవాబు** : తొలి దశ ఉద్యమంలో నిరుద్యోగం, ఉద్యోగస్తులకు జరుగుతున్న అన్యాయాలు, వనరుల దోపిడీ, నిధుల కేటాయింపులో వివక్ష ప్రధానంగా కవిత్వంలో రికార్డయింది. మలిదశ ఉద్యమంలో వీటితో పాటు 'నీళ్లు, నిధులు, నియామకాల'తో పాటుగా ఆత్మగౌరవ పోరాటం, సాంస్కృతిక అస్తిత్వం, భాషా, సాహిత్యం, ప్రతీకలు, దోపిడీ ఇట్లా ప్రతీది వస్తువయింది. సాంకేతికాభివృద్ధి ఉద్యమ విస్తృతికి తోడ్పడింది. వీటితో పాటుగా నాయకత్వ స్థానంలో ఉన్న వారు, విద్యావంతులు, సాహిత్య సంఘాల బాధ్యులు సూటిగా తాము చెప్పదలుచుకున్న విషయాల్ని తెలంగాణ భాషలోనే చెప్పిండ్రు. కేసీఆర్, జయశంకర్ సార్, కోదండరామ్, వివిధ జాక్‌ల బాధ్యులు అందరూ అవసరమైనప్పుడు ఉమ్మడిగా, మిగతా సమయంలో ఒంటరిగా పోరాటాలు చేసిండ్రు. ఎవరికి వారు తాము చేస్తున్న పోరాటాన్ని కరపత్రాల దగ్గర నుంచి, సీడీలు, డాక్యుమెంటరీలు, పుస్తకాల రూపంలో రికార్డు చేసిండ్రు. సీమాంధ్ర నాయకులు ఏది మాట్లాడినా వాటిలోని డొల్లతనాన్ని వెల్లడించడానికి చదువుకున్న వారు సాంస్కృతిక సైన్యంగా వ్యవహరించారు. 1969లో ఆంధ్రా ప్రాంతం నుంచి ఎలాంటి మద్దతు దక్కలేదు. అయితే ఈ సారి సీమాంధ్రుల నుండి, ముఖ్యంగా అక్కడి దళిత బహుజనుల నుంచి తెలంగాణ ఉద్యమానికి సంఘీభావం దక్కింది. 'కావడి కుండలు' లాంటి పుస్తకాలు వచ్చాయి. తెలంగాణది న్యాయమైన డిమాండ్ అని కొండా లక్ష్మణ్ బాపూజీ ఢిల్లీలో 95 ఏండ్ల వయసులో సత్యాగ్రహం చేసి అందరి మద్దతు కూడగట్టిండు. ఇట్లా ఎవరికి వారు స్థానికమైన సమస్యగా కొట్టిపడేస్తున్న తెలంగాణ

అంశాన్ని జాతీయ అంశంగా.. అదీ తక్షణం పరిష్కరించాల్సిన సమస్యగా.. ఇంకా చెప్పాలంటే 'తెలంగాణ' ఒక పరిష్కారంగా ప్రతిపాదించగలిగారు.

తొలిదశ కవిత్వంలో కొన్నికొన్ని సార్లు ఆగ్రహం కట్టలు తెంచుకొని నాయకులపై పరుషపదాలు ప్రయోగించారు. కాళోజిలాంటి వారు ఆనాటి నాయకులందరినీ ఏకి పెట్టిండు. ఇక మలిదశ ఉద్యమంలో భాష ప్రధాన పాత్ర పోషించింది. చాలామంది కవులు తమ రచనలకు తెలంగాణ పదాలు శీర్షికలుగా పెట్టింద్రు. సంకలనాలకు జాగో జగావో, మునుం, పొక్కిలి, మత్తడి, జిగర్, దిమ్మిస, క్విట్ తెలంగాణ అని పెట్టి వాళ్ల గుండెల్లో రైల్లు పరుగెత్తించారు. 'క్విట్ తెలంగాణ' కవితా సంకలనంలోని కవిత్వాన్ని కోట్ చేస్తూ ఇది మా మీద దాడి అని కొంతమంది ఆంధ్రావాళ్ళు ఢిల్లీలో ప్రెస్‌క్లబ్‌లో సమావేశాలు నిర్వహించి పత్రికలకెక్కింద్రు. దాంట్లో ఇప్పటి రక్షణ మంత్రి భర్త పరకాల ప్రభాకర్ కూడా ఉన్నారు.

**3. కవిగా/విమర్శకుడిగా/చరిత్ర రచయితగా మీరు తెలంగాణ ఉద్యమాన్ని ఎట్లా అర్థం చేసుకున్నరు?**

**జవాబు** : తెలంగాణ ఉద్యమ కచ్చితంగా ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమం. ఇది సకల అస్తిత్వాల సమాగమం. సబ్బండ వర్ణాలు, సకల జనుల డిమాండ్, కోరిక, స్వప్నం 'తెలంగాణ రాష్ట్రం'. రాగ్ పికర్స్ నుండి రాజకీయ నాయకుల వరకు అందరూ తెలంగాణ రాష్ట్రానికి అనుకూలంగా ఉన్నరు, ఒక్క సిపిఎం పార్టీ తప్ప. ఆధునిక కాలంలో, ప్రపంచీకరణ నేపథ్యంలో అస్తిత్వ ఉద్యమాలు విజయవంతం కావు అనేది ఒక నమ్మకం. అయితే ఈ నమ్మకాన్ని వమ్ము చేస్తు తెలంగాణ యావత్తు ప్రజానీకం కొట్లాడి తెచ్చుకున్నదే తెలంగాణ. చరిత్ర రచయితగా ఇన్నేండ్లు మరుగున పడ్డ, విస్మరణకు, వివక్షకు, వక్రీకరణకు, ఫుట్‌నోట్సుకు మాత్రమే పరిమితమైన ఘనమైన, సబాల్టర్న్ చరిత్ర వెలుగులోకి వచ్చేందుకు ఈ ఉద్యమం దోహదపడుతుందని భావిస్తున్నాను. పాఠ్యపుస్తకాల్లోకి గతంలో కన్నా తెలంగాణ దళిత, బహుజనులు ఎక్కువమంది ఎక్కింద్రు. అయితే సాహిత్య అవార్డుల

విషయంలో ఈ అన్యాయం ఇంకా కొనసాగుతూనే ఉన్నది. తెలంగాణకు ఎన్నడూ అనుకూలంగా లేని దాశరథి పేరిట అవార్డివ్వడం ఒక వైపూ, మరో వైపు దాశరథి సామాజిక వర్గానికే చెందిన కాళోజి పేరిట కూడా అవార్డివ్వడం అన్యాయం. మీదుమిక్కిలి ఈ అవార్డులేవి అర్హులకు (ఒకరిద్దరు మినహా) దక్కడం లేదనేది నా భావన. ఉద్యమ ఫలాలు ముందుగా దళిత, బహుజనులకు దక్కాలి. కాని ప్రస్తుతం దానికి రివర్స్‌గా జరుగుతున్నది. దళిత, బహుజనులకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు దక్కాలనేది న్యాయమైన డిమాండ్. ఇది రాజ్యాధికారం ద్వారానే జరుగుతది. ఉద్యమ సమయంలో కంచె ఐలయ్య లాంటి వారు అగ్రకులాధిపత్యం తెలంగాణలో వస్తది అని ఉద్యమంలో ఎక్కువగా భాగస్వాములు కాలేదు. అయితే నేను మాత్రం మొదట తెలంగాణ రావాలనే కోరుకున్నాను. ఎందుకంటే 'సమైక్యాంధ్ర'లో శత్రువు బలవంతుడు. ప్రత్యేక తెలంగాణలో వాళ్ల బలం తగ్గుతుందని అంచనా వేశాము. అట్లానే జరిగింది కూడా. కాని దళిత, బహుజనులు సంఘటితం కావాల్సినంత ఉద్యమస్థాయిలో కావడం లేదు. ఎవరి లౌల్యాలు వారికున్నాయి. ప్రలోభాలకు లొంగేవారు ఎక్కువయ్యారు. అయితే ఉద్యమ సమయంలో ఎలాంటి ప్రలోభాలకు, లౌల్యాలకు లొంగని వారే ఎక్కువగా ఉన్నారన్నది నా అభిప్రాయం.

**4. తెలంగాణవాదంలోని అన్ని పార్శ్వాలు కవిత్వంలో ప్రతిఫలించాయా?**

**జవాబు** : సాహిత్యంలోని ఏ ప్రక్రియలోనూ, ఏ వాదంలోనూ అన్ని పార్శ్వాలు ప్రతిఫలించడం అసాధ్యమైన విషయం. అసంభవం కూడా. ఎందుకంటే తెలంగాణలోని సమూహాలు, వ్యక్తులు, కులాలుగా, మతాలుగా, వృత్తుల వారిగా, భావజాల పరంగా, భౌగోళికంగా, వర్గ, వర్ణ.. ఇట్లా లక్షల తీరుల్లో విభజింపబడి ఉన్నరు. వీళ్లలో తొంభైతొమ్మిది శాతం మందికి ప్రత్యేక రాష్ట్రం అనేది అంగీకారమైన విషయం. అయితే ఇందుకు సృజింపబడిన సాహిత్యంలో ముఖ్యంగా కవిత్వంలో అన్ని పార్శ్వాలు ప్రతిఫలించడం సాధ్యమయ్యే విషయం కాదు. ఒకే వ్యక్తికి భిన్నమైన సందర్భంలో భిన్నమైన అస్తిత్వాలుంటాయి. ఉదాహరణకు తెలంగాణలో ముస్లింలు ప్రత్యేక తెలంగాణ కోరుకున్నరు. కానీ అదే సమయంలో బిజేపి ఇచ్చే తెలంగాణ మాకొద్దు అని చెప్పింన్రు.

అందుకే కొన్ని వందల 'జాక్'లు ఏర్పడ్డాయి. జయశంకర్ సారు చెప్పినట్లు ఒకరితో ఒకరు కలిసి నడిసింద్రు. కుదరనప్పుడు ఒకరి మీద ఒకరు కాకుండా కూడా ఉన్నరు. ఇట్లా కొన్నిసార్లు కాంప్రమైజ్ కావడం, మరికొన్ని సార్లు రాజీలేని పోరాటం చేయడం అన్నీ ఉద్యమంలో భాగంగా జరిగాయి. వీటన్నింటిని కవులు పట్టుకోలేదు. పట్టుకోలేరు కూడా.

రాగ్ పిక్కర్ ఎందుకు ఉద్యమంలో పాల్గొన్నడో, కాటి కాపరి ఎందుకు ఆంధ్రోళ్ళ శవాలు కాష్టం చేయనన్నడో ఇడమర్సి చెప్పే కవిత్వం రాలేదు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా పనిచేసినవారూ, ప్రలోభాలకు లొంగిపోయి పదవులు సంపాదించుకున్నవారు అందరినీ తెలంగాణ అక్కున జేర్చుకుంది. అయితే ఈ విషయాలు కవిత్వంలో అక్కడక్కడా రికార్డయినా దాని అంతరార్థం పట్టుకోలేక పోయింద్రు. ఒక వైపు తెలంగాణ ఉద్యమం జరుగుతున్నా సీమాంధ్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల్లో తెలంగాణ వాళ్లు కూడా పాల్గొన్నారు. అది నిర్వహించిన వ్యక్తే ఇవ్వాళ తెలంగాణ ప్రభుత్వంలో సాంస్కృతిక రంగంలో కీలకంగా ఉన్నారు. ఇదిట్లా ఉంటే ఉద్యమంలో ముందున్న చాలా మంది నాలాంటి వ్యక్తులు అటు సి.నారాయణరెడ్డితో పాటు తిరుపతి ప్రపంచ తెలుగు మహాసభలకు వెలుతున్న వారిని విమర్శిస్తే ఆయన శిష్యులకు కోపమొచ్చింది. ఈ విషయాలు కవిత్వంలో రికార్డు కాలేదు. విరోదాభాస ఏంటంటే ఆనాడు ప్రపంచ మహాసభలు నిర్వహించిన పండితులే ఈసారి నిర్వహించబోతున్నారు. ఇలా పండితులు నిర్వహించే పండుగల్లో కింది కులాల వారికి ఏమి ఒరగబోదు అనే విషయం అర్థమైతూనే ఉన్నది.

**5. వచన కవిత్వం, పాటల్లో ప్రత్యేక తెలంగాణ విస్తృతంగా వ్యక్తమైంది గానీ ఇతర సాహిత్య ప్రక్రియల్లో కనిపించకపోవడానికి కారణాలు ఏమిటి?**

**జవాబు** : ఇది కొంతమేరకు వాస్తవమే. కవిత్వం వెలువరించేందుకు తెలంగాణ ముద్ర ఉన్న పత్రికలు చాలా వచ్చినయి. సోయి లాంటి పత్రికలు ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి

ఊతంగా నిలిచాయి. ఎలక్ట్రానిక్ మీడియా పెరగడంతో అటు ఎంటర్‌టైయిన్‌మెంట్ కోణంలో కూడా పాటలకు ప్రత్యేకమైన స్థానాన్ని టీవీ ఛానళ్లు కల్పించాయి. అలాగే మొబైల్ ఫోన్స్, సీడీలు, ఇవన్నీ కూడా పాటలు ప్రతి ఇంటికి తీసుకురావడానికి తోడ్పడ్డాయి. ఇక మిగతా ప్రక్రియలు అప్పటికప్పుడు రాసేవి కావు. కథలు, నవలలు, నాటకాలు, రూపకాలు అన్నీ గూడా టైమ్ తీసుకుంటాయి. నిజానికి ఈ ప్రక్రియల్లో రాసే రచయితలందరూ కూడా తీరిక లేని విధంగా ఉద్యమాల్లో ఉన్నారు. ఉద్యమాల్లో ఉంటూ రోజూ వారి కార్యక్రమాలు నిర్వహించుకుంటూ రాయడమనేది చాలా కష్టసాధ్యమైన విషయం. అయినప్పటికీ బెజ్జారపు వినోద్‌కుమార్ లాంటి వాళ్ళు కొన్ని కథలు రాసిండ్రు. పరవస్తు లోకేశ్వర్ 'సలామ్ హైదరాబాద్'లో తొలి తరం తెలంగాణ ఉద్యమాన్ని కొంత రికార్డు చేసిండు.

**6. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం సమాజం మీద వేసిన ప్రభావం ఎటువంటిది?**

**జవాబు** : ప్రభావం ప్రస్ఫుటంగా ఉండింది. తన శత్రువెవడో తెలంగాణకు అన్యాయం ఎవరు చేస్తున్నరో కవిత్వం కన్నా పాటలు ఎక్కువ తెలియ జెప్పినయి. కవిత్వం కేవలం చదువుకున్న సమాజానికి మాత్రమే పరిమితమయింది. ఇందులో కూడా కవిత్వం చదివి స్పందించే వారు చాలా తక్కువ. ఇంకా చెప్పాలంటే .001 శాతం మాత్రమే కవిత్వం చదివి స్పందిస్తారు. తమ పాత్రను నిర్వచించుకోగలుగుతారు. అదే పాటలైతే అక్షరం ముక్క రాని వాడిని కూడా కదిలిస్తాయి. కనబడని శత్రువుని కళ్లముందట నిలబెడుతాయి. గుత్పందుకునేలా చేస్తాయి. తెలంగాణ ఉద్యమంలో గూడ అంజయ్య, గోరటి, అందెశ్రీ, గద్దర్, జయరాజు ఇంకా అనేక వందల మంది కవిగాయకులను సామాన్య పాఠకులకు పరిచయం చేశాయి. తమ కర్తవ్యాన్ని బోధించాయి.

**7. చివరి దశల ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం రాసిన వాళ్లలో ఎక్కువగా యువతరం ఉన్నారు. భవిష్యత్ తెలుగు కవిత్వానికి వారు భరోసా నివ్వగలరు అని చెప్పగలరా?**

**జవాబు** : యువతరం ఎక్కువగా ఉన్నారనేది కొంత నిర్ధారణ చేయాలి. తమ యవ్వనమంతా తెలంగాణ ఉద్యమంలో కరిగించిన కవులు చాలా మంది ఉన్నరు. సుంకిరెడ్డి నారాయణరెడ్డి, జూలూరి గౌరీశంకర్, నందిని సిధారెడ్డి, సురేంద్రరాజు, స్కైబాబ, పగడాల నాగేందర్, జగన్ రెడ్డి, అన్నవరం దేవేందర్, జూకంటి జగన్నాథం తదితరులందరూ మూడు దశాబ్దాల వయసులో తెలంగాణ ఉద్యమంతో మమేకమై ఐదు దశాబ్దాలు నిండేంత వరకూ కవిత్వం రాస్తూనే ఉన్నారు. 1995లో వెలువడ్డ 'బహువచనం' నాటికే తెలంగాణ సోయితో రాస్తున్న వారు చాలామంది ఉన్నరు. అయితే తర్వాతి తరం తమ అనుభవాల్లోంచి ఎదిగొచ్చి కవిత్వ మల్లింగ్రు. వనపట్ల సుబ్బయ్య, గుడిపల్లి నిరంజన్, ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్, వేముగంటి మురళి తదితరులు ఉద్యమంలో తిరుగుతూ కవిత్వం రాసింగ్రు. భవిష్యత్‌లో తెలంగాణ కవిత్వానికి భరోసా ఇవ్వగలిగే వాళ్లలో పూర్తిగా అస్తిత్వవాదంతో ఉన్నటువంటి వనపట్ల సుబ్బయ్య, సిద్దెంకి యాదగిరి, గుడిపల్లి నిరంజన్, షాజహానా, పసునూరి రవీందర్, బండారి రాజ్‌కుమార్, తప్పెట ఓదయ్య, కూకట్ల తిరుపతి, బూర్ల వెంకటేశ్వర్లు ఇంకా అనేకమంది ఉన్నారు. అయితే వీళ్లు నిరంతర అధ్యయనం ద్వారా నీరక్షీర వివేకంతో ప్రజలపక్షాన నిలబడగలిగితేనే మెరుగైన సమాజ నిర్మాణానికి తోడ్పడగలరు.

**8. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం మీద ఏయే కోణాల్లో పరిశోధనలు చేయవచ్చు?**

**జవాబు** : సాహిత్యంలో ఖాళీలు ఎప్పుడూ పూరించబడవు. ఎంత చేసినా ఏదో ఒక కోణం మిగిలే ఉంటుంది. ఆ కోణాన్ని పట్టుకోవాలంటే నిరంతరం ప్రజలతో ఉండాలి. వారి కష్టసుఖాల్లో భాగస్వాముల కావాలి. మమేకం కావాలి. సమస్యల పరిష్కారానికి తోచిన మేరకు కృషి చేయాలి. అయితే బ్రాడ్‌గా కొన్ని అంశాల్లో ఇమ్మీడియేట్‌గా పరిశోధన జరగాల్సిన అవసరమున్నది. అందులో.. అ) తెలంగాణ భాషలో రాసిన కవిత్వమేది? ఇప్పటి వరకు తెలంగాణ సాధనలో భాగంగా తెలంగాణ జనజీవితంలో ఉన్న పదాలను ఏరుకొని వాటిని కవిత్వంలోకి తీసుకొచ్చినవారు. తెలంగాణ పదాలను తమ కవితా శీర్షికలకు, పుస్తకాలకు ఎవరెవరు? పెట్టుకున్నారు. అవి తెలంగాణలోని ఇప్పటి 31

జిల్లాల్లో ఎట్లా ఉన్నాయి. ఆ) 31 జిల్లాల్లో ఎలాంటి పుస్తకాలు వచ్చాయి. కవులెవరు? వారు రాష్ట్ర సాధనలో చేసిన కృషి ఏమిటి? ఇ) దళితులు, బహుజనులు, ముస్లింలు తెలంగాణ ఉద్యమంలో రాసిన కవిత్వమేది? దానిలో ఉన్న వైవిధ్యమేమిటి కలిపి లేదా దేనికదిగా రీసెర్చ్ చేయవచ్చు. ఉ) మహిళలు రాసిన తెలంగడాణ కవిత్వమేది? వస్తు, రూపాలేవిటి? అనే అంశంపై పరిశోధన చేయవచ్చు. ఊ) తెలంగాణ కవితా బిబ్లియోగ్రఫి తయారు చేసుకోవచ్చు. తెలంగాణలో వచ్చిన కవితలన్నింటిని పత్రికలు, పుస్తకాలు, వెబ్, బ్లాగ్స్, సైట్స్, ఇట్లా అన్నింటిలోనూ మొత్తం ఎంత కవిత్వమొచ్చింది. కవితా సూచి తయారు చేసుకోవచ్చు. ఋ) తెలంగాణ కవిత్వంలో వస్తు వైవిధ్యం/చారిత్రక/స్ఫూర్తి/ దోపిడీ/నిలదీత/త్యాగం/ సంఘటనల వారిగా (సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్, మార్చ్‌లు) ఇట్లా విషయాల వారిగా కూడా కవిత్వాన్ని విభజించి పరిశోధన చేయవచ్చు. ౠ) పొక్కిలి, మత్తడి, మునుం, జిగర్, జాగో జగావో, దిమ్మిస, క్విట్ తెలంగాణ, ఇట్లా రాష్ట్ర స్థాయి కవుల కవిత్వంతో వచ్చిన కవిత్వాన్ని తులనాత్మక అధ్యయనం చేయవచ్చు. ఎ) 31 జిల్లాల నుంచి తెలంగాణ అంశంగా వెలువడ్డ సంపుటాలు ఏవి? వస్తు రూప విశ్లేషణ.. ఏ) వివిధ రచయితల సంఘాలు.. కవిత్వానికి అవి ఇచ్చిన ప్రోత్సాహం. ప్రచురణ/పత్రికలు/దోహదంపై పరిశోధన.. ఐ) ఇట్లా ఎన్ని చేసినా ఏదో ఒక కోణం మిగిలే ఉంటుంది. అన్ని కోణాలు ఆవిష్కరించాలంటే కచ్చితంగా జీవిత కాలం చాలదు.

**9. ఇతర అస్తిత్వ వాదాల కవిత్వానికి, తెలంగాణ అస్తిత్వవాద కవిత్వానికీ బేధం ఏమిటి? వాటికి వచ్చినంత గుర్తింపు తెలంగాణ కవిత్వానికి వచ్చిందని భావిస్తున్నారా?**

**జవాబు** : చాలా తేడా ఉన్నది. ఇతర అస్తిత్వవాదాలు కొందరికే స్థానం కల్పించాయి. అదే తెలంగాణ అస్తిత్వవాదం దళితులు, స్త్రీలు, బహుజనులు, విప్లవవాదులు, గిరిజనులు ఇట్లా అన్ని రకాల భావజాలం ఉన్నవారిని 'తెలంగాణ' పేరిట ఒక్కతాటిపైకి తీసుకురావడం సాధ్యమైంది. అందుకే జయశంకర్ సార్ ఆర్ఎస్‌యూ నుంచి ఆర్ఎస్ఎస్ వరకూ అందరూ కలిస్తేనే తెలంగాణ సాధ్యమని నమ్మిండ్రు. ఆచరించిండ్రు.

ఏ అస్తిత్వవాదానికైనా వాదంతో గాకుండా ఆ వాదాన్ని గట్టిగా వినిపించిన కవితకు/కవికే గుర్తింపు ఎక్కువగా ఉంటుంది. రచన ద్వారా వాదానికి గుర్తింపు వస్తుంది.

శషభిషలు లేకుండా చెప్పాలంటే కేవలం అగ్రకులాల వారికే తెలంగాణవాద కవిత్వం ఎక్కువ గుర్తింపునిచ్చింది. ఎందుకంటే వారికి ఇతరేతర ఏ అస్తిత్వం లేదు కాబట్టి వారు రాసిందంతా 'తెలంగాణ' వాద కవిత్వంగా రికార్డయింది. అదే దళిత, బహుజన, ముస్లిం, స్త్రీలు ఇటు తమ స్వీయ అస్తిత్వంతోనూ, అటు తెలంగాణ వాదంతోనూ కవిత్వం రాసిండ్రు. ఇందులో ఎవరు ఏ భావజాలంతో ఎక్కువ కవిత్వం రాసిండ్రో అందులోని ఎక్కువ గుర్తింపు తెచ్చుకున్నరు. అయితే ఎక్కువ మంది కవులు కులాలతో సంబంధం లేకుండా వామపక్ష భావజాలం నుంచి వచ్చిన వారు. వీళ్లు తెలంగాణ వాదులుగా, వారు రాసిన దానికి తెలంగాణ వాద కవిత్వంగా గుర్తింపు వొచ్చింది. 'నల్లవలస' సంయుక్త రచనలో ఒక్క శివకుమార్ తప్ప మిగతావారందరూ అగ్రకులాల వాండ్లే. శిరసులులో శివకుమార్ బి.సి. కాగా రఘునాథం, సుంకిరెడ్డి అగ్రకులాల వాండ్లు. ఈ పుస్తకం తెలంగాణ వాద కవిత్వానికి 'బ్రాండ్' ఐకాన్. వరవరరావు, ఎన్.వేణుగోపాల్, కాసిం ఇంకా అనేక మంది విరసం సభ్యులు ఉద్యమం ఊపందుకున్న తర్వాత తప్పనిసరి పరిస్థితుల్లో రాసిన కవిత్వం అంతిమంగా 'విప్లవ' దృక్కోణాన్నే ప్రతిపాదించేవి తప్ప పక్కా మాస్ తెలంగాణను ప్రతిఫలించినవి కావు.

పాట విషయంలో ఈ సిద్ధాంతీకరణలేవీ వర్తించవు. దానికి వేరే ప్రాతిపదికలు ఏర్పాటు చేసుకోవాలి. విశ్లేషించుకోవాలి.

**10. తెలుగు వచన కవితా ప్రస్తానంలో ప్రత్యేక తెలంగాణోద్యమ స్థానం ఏమిటి?**

**జవాబు** : నిజానికి తెలుగు వచనానికి పునాది ఖమ్మం జిల్లాకు చెందిన కవిరాజమూర్తి రాసిన 'మహైక'తో పునాది పడింది. ఇది 1953నాటి సంగతి. ఇక తెలుగు కవితా ప్రస్థానంలో 'తెలంగాణ రాష్ట్రసాధన' కవిత్వం ప్రధానమైనది, భిన్నమైనది కూడా. భిన్న

భావజాలాల వాండ్లు ఉమ్మడిగానూ, విడివిడిగానూ ప్రత్యేక తెలంగాణ కోసం కవిత్వమల్లింద్రు. బహుశా ఇటీవలి కాలంలో ఏ ఉద్యమం కూడా ఇంత మంది కవుల్ని కదిలించి ఉండింది కాదు. తెలంగాణలోని నాలుగువేల పైచిలుకు గ్రామాల్లో దాదాపు ప్రతి ఊరి నుంచి ఒక కవిగానీ, లేదా పాటగాడు గానీ తనదైన ముద్ర ఉన్న కవిత్వాన్ని ఈ ఉద్యమ సందర్భంలో సృజించిండు. కన్నతల్లి కన్నా ఎక్కువగా తెలంగాణ తల్లికి మోకరిల్లిండు. అన్నదమ్ముల కన్నా అమరుల స్థూపాలను/స్మృతిగీతాలను మొక్కింద్రు/ ఆలపించింద్రు. ఎన్నో దీర్ఘ కావ్యాలు, మరెన్నో కవితా సంపుటాలు, లెక్కకు మిక్కిలి కవితా సంకలనాలు ఈ ఉద్యమ సందర్భంగా వెలువడ్డాయి. ఇందులోనిదంతా మేలైన సరుకు అని చెప్పలేము గానీ ఉద్యమం కోసం తామూ ఏదో ఒకటి చేయాలి అనే తపన ఇందులో ఉన్నదనే విషయాన్ని గమనించాలి.

## - డా॥ సి.కాశీంతో ముఖాముఖి -

**1. తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం నడిచినంత విస్తృతంగా కవిత్వం వెలువడక పోవడానికి కారణాలు ఏమిటి?**

**జవాబు :** 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి కొన్ని పరిమితులు ఉన్నాయి. ఒకటి రాజకీయ పరిమితి, రెండు నిర్మాణ పరిమితి. మొదట మనం రాజకీయ పరిమితి గురించి మాట్లాడుకుంటే, 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడే క్రమంలో జెంటిల్మెన్ అగ్రిమెంట్ జరిగింది. ఈ అగ్రిమెంట్ అమలవుతుందని తెలంగాణ ప్రాంతంలోని మధ్య తరగతి ఆశించింది. కానీ విషాదమేమిటంటే, ఒక పది సంవత్సరాలు గడిస్తేగాని.. అంటే 1966 వరకు చేసుకున్న ఒప్పందాలు ఎట్లా బుట్టదాఖలు అయినాయనే విషయం అర్థం కాలేదు. అందుకే ఈ క్రమంలో ఇంకొక మూడేండ్లు వేచిచూసి తెలంగాణ ప్రాంతంలో ఉన్న మధ్య తరగతి.. ముఖ్యంగా ఎన్జీవోలు.. ఎందుకంటే నేరుగా అన్యాయం జరిగింది, ప్రత్యక్షంగా అనుభవంలోకి వచ్చింది ఎన్జీవోలకే.. అయితే ఉద్యమం మొదలు కావడానికేమో కార్మికులు, స్టూడెంట్స్ ఉద్యమాన్ని రాజేశారుగాని, దాన్ని ఎక్కువగా అందుకొని ముందుకెళ్లింది, దాని బ్యాక్‌గ్రౌండ్‌లో మనకు ఎన్జీవోలు ఎక్కువగా కనిపిస్తరు. అయితే చివరికి వచ్చేసరికి విద్యార్థులు దాన్ని మరింత ముందుకు తీసుకెళ్లి పతాక స్థాయికి చేర్చారు. కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రంలో కృష్ణ అనే దినసరి కార్మికుడు మొదలు పెట్టిన ఉద్యమాన్ని అదే ఖమ్మం జిల్లా నడిబొడ్డున రవీంద్రనాథ్ అనే విద్యార్థి అందుకున్నడు. ఈ విద్యార్థి కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘమైన ఎన్ఎస్‌యూఐ కార్యకర్త. ఇక అక్కణ్నుంచి అది మొదలై మొదట హైదరాబాదు, వరంగల్, మహబూబ్‌నగర్, మెదక్, రంగారెడ్డి తర్వాత అన్ని తెలంగాణ జిల్లాలకు వ్యాపించింది. అంటే వరంగల్ హైదరాబాద్ సెంటర్సు (ఇవి రెండు ఎడ్యుకేషన్ సెంటర్స్‌గా ఉన్నయి, ఇక్కడ డిగ్రీకాలేజీలు, యూనివర్శిటీలు ఉన్నయి కనుక). ఇక్కణ్నుంచి అన్ని జిల్లాలకు ఉద్యమం వ్యాపించడం చూస్తం మనం. ఉద్యమాన్ని విద్యార్థులు అందుకున్నప్పటికీ దాన్ని అంతర్గతంగా టీఎన్జీవోలు, లాయర్లు, కొంతమేరకు టీచర్లు ఈ ఉద్యమంలో ఉండి పనిచేసింద్రు. చాలా తక్కువ

కాలం.. ఒక  తొమ్మిది నెలల ఉద్యమం. ఐతే ఈ తొమ్మిది నెలల ఉద్యమానికి ఒక రాజకీయ లక్ష్యమనేది స్పష్టంగా లేకుండింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడి కేవలం పదమూడేండ్లే అయ్యింది కనుక మొత్తం ప్రజానీకం ఉద్యమంలో మమేకం అయ్యే పరిస్థితి కనిపించలేదు. రెండవదేందంటే తెలంగాణ ప్రాంతంలో, లేదా తెలుగు నేలమీద ఆ కాలంలో కమ్యూనిస్టుల ప్రాబల్యం ఉండేది. కనుక కమ్యూనిస్టులు దేనికి స్పందిస్తే దానికి అట్రాక్ట్ అవుతరు, అటాచ్ అవుతరు. ఈ కాలంలో కమ్యూనిస్టులు ఉదాసీనంగ ఉండిపోయిండ్రు. అంటే దీన్ని స్పాంటీనిటీగా వచ్చిన మూవ్‌మెంట్‌గ మనం దీన్ని గుర్తించాలి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడాలనే లక్ష్యం ఒకటి బలంగా ఉన్నప్పటికీ, ఆ లక్ష్యం వెంట ప్రజలందర్ని, విద్యార్థుల్ని, మధ్య తరగతిని నడిపించే ఆ స్పష్టత లేకపోవటం, ఎక్కడివరకు ఉద్యమాన్ని తీసుకెళ్లగలం అనే రాజకీయ దృక్పథం కూడా స్పష్టంగా లేకపోవడం అనేది మనకు కన్పిస్తది. ఎక్కడికక్కడ.. ఎవరికి తోచినట్లు వాళ్లు.. ఇడ్లీ సాంబార్ గోబ్యాక్ అని నినాదాలు.. తర్వాత గుంటూరు పల్లెలని ఇప్పుడు మనకు కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్‌లోని గద్వాల్ ఏరియాల్లో ఉన్న గుంటూరు పల్లెల మీద దాడులు చేయటం కనిపిస్తది. హైదరాబాద్ బేస్డ్‌గా ఉన్న ఉద్యమం కూడా స్పాంటినిటీగానే నడిచింది. ఇదొక అంశమైతే ఆ ఉద్యమానికి ఒక సైద్ధాంతికమైన దృక్పథం అందించిన శక్తులు కూడా లేవారోజు. చెన్నారెడ్డి అయితే చివర్లో వచ్చి ఉద్యమంలో చేరిండు. మొదటి నుంచి మదన్‌మోహన్‌లాంటి వాళ్లు నాయకత్వం వహించిండ్రు, విద్యార్థి లీడర్లుగా. అంటే చెన్నారెడ్డిలాంటి వాళ్లు దీన్ని ఎట్లా హైజాక్ చేయాలి, కాంగ్రెస్ కోవర్టుగా తన ప్రయోజనాలకోసం ఎట్లా ఉపయోగించుకోవాలి అనే పద్ధతిలోనే వచ్చినట్లు మనకు చరిత్ర చెప్తుంది. ఇది రాజకీయ స్పష్టత లేకపోవడం, ఈ రాజకీయ పరిమితి అనేది ఈ ఉద్యమానికి ఉండింది. రెండవ పరిమితి నిర్మాణ పరిమితి. అసలు ఏ ఉద్యమమైనా నడవాలంటే దానికొక పటిష్టమైన నిర్మాణం అవసరం. విద్యార్థి, యువజన కార్యాచరణ కమిటి అని ఒకదాన్ని ఏర్పాటు చేసుకున్నరుగానీ, ఆ కార్యాచరణ కమిటీకి దీర్ఘకాలికమైన దృక్పథంతో నిర్మాణాన్ని ఇవ్వలేకపోయిండ్రు. ఈ నిర్మాణం అనేది కూడా రాష్ట్రవ్యాప్తంగా ఉండి, జిల్లాల, మండల స్థాయి వరకు నిర్మాణం చేసి ఉంటే ఇంకొకలాగ ఉండేది. అట్ల కాకుండా, ఏదో కొద్దిమంది వాళ్లకు తోచినటువంటి నినాదాలను, కరపత్రాలను

విద్యార్థుల్లోకి, యువజనుల్లోకి పంపించడం అనే లూజ్ నిర్మాణం కూడా దీనికి ఉంది. ఈ రెండు పరిమితులతోపాటుగా కమ్యూనిస్టులు, ప్రోగ్రెస్సివ్ శక్తులు ఏమాత్రం ఉద్యమానికి సపోర్ట్ చేయకపోవటం అనే మూడవ పరిమితి ఉంది. ఇక కవులు కళాకారుల విషయం. వీళ్లు ఉద్యమం దీర్ఘకాలికంగా నడిచినప్పుడు, దానికొక రాజకీయ దృక్పథం ఉన్నప్పుడు నిర్మాణమై, ఉద్యమంలోకి వస్తరు. వాళ్ల సాహిత్య రూపాలు వ్యక్తం చేస్తరు. ఇది జస్టు ఎనిమిది నెలలు, తొమ్మిది నెలలు నడిచినటువంటి ఉద్యమంగా ఉండటం మూలంగా వెంటనే కవులు, కళాకారులు తమ కవిత్వాన్నిగానీ, లేకపోతే ఇతర కళారూపాల్ని గానీ, పాటలు గానీ ఉద్యమానికి ఇవ్వలేకపోయారు. ఇవి రాకపోవడానికి ఈ మూడు పరిమితులు మనకు స్పష్టంగా కనిపిస్తది. ఇక ఆరోజు కవులు కళాకారులు అంటే ఎవరు? అప్పటికే దిగంబర కవిత్వం వచ్చి ఉంది తెలుగు సాహిత్యంలో. దిగంబర కవిత్వం తర్వాత దాదాపు 67 నాటికే నక్సల్బరీ, 68 నాటికే శ్రీకాకుళం వచ్చేసింది. అంటే మొత్తం తెలుగు సమాజంలో ఉన్న కవులు, కళాకారులు ఆ రోజుల్లో శ్రీకాకుళ పోరాటాన్ని కీర్తిస్తూ రాయడమే గొప్పగా భావించే స్థితి ఉండింది. దానికి నక్సలైట్ ఉద్యమం విప్లవోద్యమం నాయకత్వం వహిస్తూ ఉండడం, కమ్యూనిస్టు పార్టీల్లో ఒక చర్చనీయాంశంగా మారటము, అందరి కాన్సన్ట్రేషన్ అటువైపు ఉండింది. తెలంగాణంటే ఏంటసలుకు, ప్రత్యేక తెలంగాణ అడగమేంది, మనం కార్మికవర్గ దృక్పథంతో మొత్తం దేశాన్ని విముక్తి చేయాలెగద, గీ చిన్నచిన్న ప్రాంతీయ ఉద్యమాలకు సపోర్టు చేస్తరా అనే ఒక తక్కువ భావం కూడా ఉండింది. కవులు ఇంటలెక్చువల్ సెక్షన్ కనుక ఆ తక్కువ భావం ఉద్యమం పట్ల ఉండటంతో దీనిమీద రాయటమనేది చిన్నచూపుగా చూశారు. అందుకే ఉద్యమం నడిచినంతగా ఎక్కువ కవిత్వం ఈ కాలంలో రాలేదు. 'జై తెలంగాణ విప్లవ ఢంకా' లాంటి ఒకట్రొండు, తర్వాత అక్కడక్కడా విడివిడిగా రాసినటువంటివి గూడ ఈ మధ్యన సుంకిరెడ్డివాళ్లు పుస్తకం వేసినట్లుగా మనం చూస్తున్నం. అయితే విప్లవ శిబిరంలో ఉన్నటువంటివాళ్లు.. అంటే విప్లవ రచయితల సంఘం(విరసం) ఏర్పడకపోయినప్పటికీ కొద్దిగ ప్రోగ్రెస్సివ్ దృక్పథంతో ఉన్నటువంటి చెరబండరాజు దీనిమీద రాసిండు. ప్రత్యేక తెలంగాణలో ప్రజారాజ్యం.. పుచ్చలపల్లి సుందరయ్య విశాలాంధ్రలో ప్రజారాజ్యం అని రాస్తే ఈయన అటు ఆంధ్రా ఉద్యమాన్ని, ఇటు తెలంగాణ ఉద్యమాన్ని పోలుస్తూ, తెలంగాణ ఏర్పడాలె అనే ఒక

ఆకాంక్షను అంతర్లీనంగా వ్యక్తం చేసి, ఆ తెలంగాణ కూడా ప్రజాస్వామిక తెలంగాణగా ఉండాలని రాశాడు. బాగా పేరున్న కవుల్లో ఆనాడు ఆయనొకడు. కాళోజీ కూడా చాలా బలమైన కవిత్వం రాసి ఉన్నడు. ఎక్కువ కవిత్వం రాసి ఉన్నడు. అయితే కవిగా ఆయనకు ఆరోజుల్లో గుర్తింపు లేదు. ఆంధ్రాప్రాంతంలో ఉండే సాహిత్యకారులు, విమర్శకులు ఆయనను కవిగా గుర్తించ నిరాకరించటం మూలంగా ఈ ప్రాబ్లం వచ్చింది. స్థూలంగా చూసినప్పుడు ఈ పరిమితుల వలన ఆరోజు ఎక్కువ కవిత్వం రాలేదు.

**2. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో వస్తు రూపాలగురించి చెప్పండి?**

**జవాబు** : తొలిదశ ఉద్యమంలో వచ్చిన కవిత్వం చాలా తక్కువ. వచ్చినదాంట్లో కూడా నేరుగా తెలంగాణ ఆకాంక్షను వ్యక్తం చేయడమనే కంటెంటు బలంగా ఉన్నది. విప్లవ ధంకాలో రాసిన కవులు కూడా పెద్దగా పేరున్న కవులు కారు. లేదా వస్తు రూపాలకు సంబంధించి, కవిత్వ నిర్మాణానికి సంబంధించిన టెక్నిక్స్ తెలిసిన కవులు కూడా కారు. ఆ రోజుల్లో తక్షణంగా వాళ్లకనిపించిన భావాన్ని వ్యక్తం చేయడం కోసం, తెలంగాణను వస్తువుగా చేసుకుని కవిత్వం రాసింద్రు. రూప వైవిధ్యం అనేది మనకేమంద పెద్దగా కనిపించదు.

తొంభైల తర్వాత మొదలైన కవిత్వాన్ని చూస్తే వస్తు వైవిధ్యం ఉన్నది, రూప వైవిధ్యం ఉన్నది.. తొంభయ్యారు తర్వాత.. మనకు ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఎజెండ మీదికి రావటాన్ని, పాలక వర్గాలు తీసుకొచ్చిన ఆర్థిక విధానాలను పునాదిగా తీసుకొని చూస్తే మనకు స్పష్టంగా అర్థం అవుతది. పీవీ నర్సింహారావు నూతన ఆర్థిక విధానాల్ని మొదలు పెట్టిన తర్వాత ఎన్టీరామారావు తొంభైనాలుగు ఎన్నికల్లో గెల్సి ముఖ్యమంత్రి అయ్యి, నూతన ఆర్థిక విధానాల అమలులో భాగంగా, సంస్కరణల్లో భాగంగా మల్టీ నేషనల్ కంపెనీల ప్రయోజనాలను నెరవేర్చలేదు అని నిర్ణయానికి సామ్రాజ్యవాద శక్తులు వచ్చాయి. మల్టీ నేషనల్ కంపెనీలకు సంబంధించిన సీయీవోలు అంచనాకు వచ్చారు. వచ్చి, అక్కడ కేంద్రంలో ఎంత స్పీడుగా నూతన ఆర్థిక విధానాలు అమలవుతున్నయో,

తెలుగు నేలమీద, ప్రత్యేకంగా తెలంగాణలో అంత స్పీడుగా అమలు కావాలంటే, వాళ్లకు నమ్మిన బంటుగా ఉన్న చంద్రబాబు నాయుడి వల్లనే అది సాధ్యమవుతుందని వాళ్లు అనుకొని, వెంటనే ఎన్టీరామారావును దించి చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిని చేసింర్రు. చంద్రబాబునాయుడ్ని ముఖ్యమంత్రిని చేసిన తర్వాత రాజ్యాంగ పరిధిని కూడా దాటి.. నిజానికి మన కేంద్ర రాష్ట్ర సంబంధాలు.. రాష్ట్రానికీ అంతర్జాతీయ సంబంధాలకూ చాలా పరిమితులు ఉంటయ్. నిజానికి ప్రపంచబ్యాంకుతో అప్పుతెచ్చుకోవాలన్నా, లేదంటే ఇంకేదైనా చేయాలనుకున్నా కూడా కేంద్రం ద్వారా వెళ్లాల్సిన స్థితి ఒకటి ఉంటది. కాని మనకు తొంభయ్యో దశకం తర్వాత మనకు సంకీర్ణ ప్రభుత్వాలొచ్చినై. దీని పర్యవసానంగా వివిధ రాష్ట్రాల్లో ఉండే ప్రాంతీయ పార్టీల సపోర్ట్‌తో ఆ ప్రభుత్వాలు మనుగడ సాగించే స్థితి ఉండింది. కనుక చంద్రబాబునాయుడు ఆ రోజుల్లో చక్రం దిప్పిండు. అందుకే నేరుగా కేంద్రంతో సంబంధం లేకుండా ప్రపంచబ్యాంకు, మల్టీ నేషనల్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకునే స్థితికి చంద్రబాబు నాయుడు ఎదిగిండు. ఎదగటమే కాకుండా, రాజ్యాంగంలోని ఆర్టికల్ 253ని సవరించాలని డిమాండ్ పెట్టిండు. ఎందుకంటే రాష్ట్రాలే డైరెక్టుగా బహుళజాతి కంపెనీలతో, విదేశీ సంస్థలతో సంబంధాలు పెట్టుకోవడానికి రాజ్యాంగంలోని ఆ ఆర్టికల్ అడ్డంకిగా ఉంది కనుక దాన్ని తీసివేయాలని చర్చ పెట్టిండు ఆ రోజుల్లో. అంత స్పీడుగా ఇక్కడ చంద్రబాబు నాయడు వెళ్తున్న స్థితి ఒకటి కనిపిస్తే.. రెండోది ఇక్కడ ప్రతిఘన కూడా ఉన్నది. ప్రపంచీకరణకు వ్యతిరేకంగా, దాని సంస్కృతి, ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా ప్రతిఘటన ఉంది తెలంగాణలో. మరెక్కడా ఈ ప్రతిఘటన లేదు. అందుకే నేననుకుంటా వాళ్లు తెలంగాణను ఎంచుకున్నరు. తెలంగాణను ప్రయోగశాలగా ఎంచుకోవడంలో వారి ప్రధాన ఉద్దేశం అదే. ప్రతిఘటన ఉద్యమం బలంగా ఉన్న తెలంగాణలో ఈ ప్రయోగం సక్సెస్ అయితే, దేశంలో, ప్రపంచంలో ఇంకెక్కడైనా సక్సెస్ చేయవచ్చని వాళ్లు అనుకుని ఉండవచ్చు. ఎందుకు దీన్ని ప్రయోగశాలగా ఎంచుకున్నరు అంటే ఇక్కడ విప్లవోద్యమం పనిచేస్తూ ఉంది. దాదాపుగా మనకు ఇటు ఆంధ్రప్రదేశ్, అటు ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లో చాలా గ్రామాలు, జిల్లాలు జిల్లాలు మొత్త విప్లవోద్యమం చేతుల్లో ఉన్నవి కనుక విప్లవోద్యమం చాలా ప్రధాన అడ్డంకిగా ఉంది గ్లోబలైజేషన్‌కి. ఈ బహుళజాతి కంపెనీల దోపిడీకి. ప్రపంచబ్యాంకు ఆర్థిక

నమూనాకి ఆటంకంగా ఉండింది. అందుకే వాడు దీన్ని ప్రయోగశాలగా ఎంచుకొని, మేము ప్రజల వ్యతిరేకతలో లేదా విప్లవోద్యమం వ్యతిరేకతలో లేదా మిడిల్ క్లాస్ వ్యతిరేకతలో, కవులు, కళాకారుల వ్యతిరేకతలో కూడా మేము దీన్ని అమలు చేశాం అనిపించుకోవడం కోసం తెలంగాణను ఎంపిక చేసుకున్నరు. అయితే విప్లవోద్యమం ఒక ప్రత్యేకమైన అభివృద్ధి నమూనాను ఆ కాలంలో ప్రతిపాదించింది. అప్పటివరకు విప్లవోద్యమానికి ఒక ఆర్థిక ఆల్టర్‌నేటివ్ అభివృద్ధి నమూనా అనేది లేదు. మొట్టమొదటిసారి అనుకుంటా 95లోనో, 96లోనో ఆనాటి పీపుల్స్‌వార్ పార్టీ ప్రపంచబ్యాంకుకు వ్యతిరేకమైనటువంటి ప్రజల స్వయం సమృద్ధి, స్వావలంబన అనే నినాదం మీద ఒక అభివృద్ధి నమూనాను రూపొందించి ప్రజల్లోకి పంపించింది. నిజానికివాళ జనతన సర్కారు ఏర్పాటై పనిచేస్తున్నటువంటిది ఏదైతే ఉందో అది చాలా ప్రాథమిక స్థాయిలో ఉత్తర తెలంగాణలో అమలు చేయబడింది. చెరువుల్ని నిర్మాణం చేయటం, భూముల్ని పంపకం చేయటం, రైతు కమిటీలు ఏర్పాటు చేయటం, న్యాయ కమిటీలు ఏర్పాటు చేయటం, రైతులకు విప్లవోద్యమమే కో-ఆపరేటివ్ సొసైటీలను ఏర్పాటు చేసి వాటిద్వారా విత్తనాలివ్వటం, రుణాల్విటం, అంటే మీరు వడ్డీ వ్యాపారస్తుల దగ్గర డబ్బు తెచ్చుకోకుండా, ఆ వడ్డీ వ్యాపారస్తుల దగ్గర డబ్బులు తెచ్చుకుని అప్పుల పాలయ్యి, బాధ పడకుండా, ఆత్మహత్యలు చేసుకోకుండా ఉండటం కోసం ఆరోజు విప్లవోద్యమం ఈ ప్రయత్నం చేసింది. సరిగ్గా ఈ సమయంలోనే తెలంగాణ ఉద్యమం ఎజెండా మీదకి వచ్చింది. అంటే ఒకరకంగా తెలంగాణ ఉద్యమానికి ప్రపంచబ్యాంకు, బహుళజాతి కంపెనీల ఆర్థిక అభివృద్ధి నమూనాను వ్యతిరేకించటమనేది నేపథ్యంగా ఉన్నది. ఆ ప్రభావం ప్రజల మీద, మధ్య తరగతి మీద ఉండటం మూలంగా మనకు స్పష్టంగా తెలంగాణ అనే ఆకాంక్ష ఆ రూపంలో వచ్చినట్లు తెలుస్తోంది, విప్లవోద్యమ రూపంలో.. అంటే ఒక ప్రాంతీయ డిమాండ్ రావడానికి పాలక వర్గాల అభివృద్ధి నమూనా ఈ ప్రాంతాన్ని దోపిడీ చేస్తుంది అనే భావన వచ్చింది. మరి ఈ ప్రాంతంలోని పాలకవర్గాలు ఎవరు అన్నప్పుడు, ఆంధ్రాశక్తులే. కోస్తాంధ్రా ప్రాంతానికి చెందిన పెట్టుబడిదారీ శక్తులు తెలంగాణను దోపిడీ చేస్తున్నయి. కనుక ఏం జెయ్యాలి? ఈ పాలకవర్గాలిక్కన్నుంచి వెళ్లిపోవాలె, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడాలనే భావన వచ్చింది. 1996 నుండి ఈ

భావనను విస్తృతంగా ముందుకు తీసుకువచ్చింది నిజానికి కవులు కళాకారులే. మొట్టమొదలు భువనగిరి సభ విరసం కవులు చేసిండ్రు. తర్వాత సిద్ధిపేట ప్రాంతం, సిధారెడ్డిలాంటివాళ్లు, విప్లవోద్యమానికి దగ్గరగా ఉంటేటటువంటివాళ్లు, మంజీర రచయితల సంఘం ఆ బాధ్యత నిర్వహించింది. వరంగల్ డిక్లరేషన్ రావడానికి అన్ని సంఘాలు బాధ్యత వహించినట్లే కవులు, కళాకారులు బాధ్యత వహించారు. తెలంగాణలో ఈ మూడు పరిణామాలు జరగటం వెనుక విప్లవోద్యమం ఉండింది. కనుక, తెలంగాణ అడుగుతున్నమంటే, కవులు తమ కంటెంటును, తమ ఫామును ఏ రూపంలో అడుగుతున్నామనే స్పష్టత ఉన్నది. ఎట్లా వ్యక్తం చేయాలంటే తెలంగాణను దోపిడీ చేయడం అంటే కోస్తాంధ్ర దోపిడీదారులు మాత్రమే దోపిడీ చేయటం కాదు, తెలంగాణను దోపిడీ చేయడంలో కోస్తాంధ్ర పెట్టుబడిదారుల రూపంలో బహుళజాతి కంపెనీలు, ప్రపంచబ్యాంకు ఉన్నయనేంతటి స్పష్టమైన రాజకీయ దృక్పథం ఉండటం మూలంగా కంటెంటులో ఆ వైవిధ్యం కనిపిస్తది మనకు. 69లో స్టేట్‌గా ఆంధ్రావాళ్ల మీద పడినట్లుగా, ఈ కవిత్వంలో మనకి కనిపించదు. వనరుల దోపిడీ, దాని వెనుక ఉండే రాజకీయార్థిక నమూనా, అదంతా వస్తువులో వచ్చిన పరిపక్వతగా మనం చూడవచ్చు. రెండవది రూపంలో. నిజానికి మనం రూపం అనే విషయంలో భాష, ప్రతీకలు, ఉత్ప్రేక్షకాలు రకరకాల విషయాలను చర్చిస్తంగానీ, ప్రక్రియలో రూప వైవిధ్యంగ చూసినప్పుడు సరిగ్గ పాట గూడ ఈ కాలంలో వచ్చింది. భువనగిరి సభనాటికే గద్దర్ పాట రాశిండు. భువనగిరి సభకు అటుఇటుగా గోరటి వెంకన్న పాట రాశిండు. అంటే కేవలం వచన కవిత్వమే కాకుండా తెలంగాణలో ఉండే ట్రెడిషన్లో భాగంగా ఒక పాట సంప్రదాయంలో భాగంగా వెంటనే పాట గూడ వచ్చింది. దాంతోపాటు కవిత్వ నిర్మాణంలోనే ఉండే ఫామ్‌కు సంబంధించిన వైవిధ్యం కూడా ఆ మొదటి దశలో మనకు స్పష్టంగా కనిపిస్తుంది. ఇది తొంభయ్యారు నుంచి మొదలుపెడితే మనకి 2005 వరకు ఇది కంటిన్యూగా కొనసాగింది. అంటే ఒకరకంగా పదేండ్లు. కవిత్వంలో. ఏ కవి గూడా.. తెలంగాణ ప్రాంతంలో ఉండే కవులు.. విప్లవ కవులతో సహా తెలంగాణ సమస్యని చెప్పకుండా ఇంకోలాగ చెప్పే పరిస్థితి లేదు. నువ్వు విప్లవాన్ని చెప్పాలన్నా తెలంగాణ సమస్యను చెప్పాలి. లేదా ఏదైనా మధ్యేమార్గం గురించి చెప్పాలన్నా తెలంగాణ సమస్యను చెప్పాలి. అట్లా కవులందరిలో

తెలంగాణ సోయి అనేది కనిపిస్తుంది. 2004లో రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యి, 2005లో చర్చలు అయ్యి, మధ్యలో ఆగిపోయిన తర్వాత, రాజశేఖర్‌రెడ్డిలాంటివాడు వచ్చి తెలంగాణ మాటనో, ఆకాంక్షనో వ్యక్తం చేయలేని ఒక స్థితిని కల్పించినప్పుడు వచనకవిత్వం కాస్త ఆగిపోయి, పాట ముందుకు వచ్చింది. ఇది ప్రక్రియ వైవిధ్యం. అంటే రూపంలో భాగంగా ప్రక్రియా వివైధ్యంగ చూడవచ్చు మనం. పాట ముందుకు వచ్చింది. ఎందుకు పాట ముందుకు వచ్చిందంటే, ఇంకేమాత్రం వచన కవులు వచన కవిత్వం రాసి, తెలంగాణ ప్రజల్ని చైతన్యం చేసే స్థితికన్నా, డైరెక్టుగా మాస్ మాస్ పీపుల్‌ను కదిలించాల్సిన స్థితి వచ్చింది. మధ్యతరగతి ప్రజల్లో ఉన్న తెలంగాణ ఆకాంక్ష, రాజశేఖర్ రెడ్డి నిర్బంధం ప్రయోగించి, విప్లవోద్యమం మీద తీవ్రమైన నిర్బంధం ప్రయోగించి చాలామందిని ఎన్‌కౌంటర్ చేసి చంపుతున్న సందర్భంలో తెలంగాణ రాష్ట్రం ప్రత్యేకంగా ఉంటే ఇట్లా జరుగునా? అనే ఒక ఆకాంక్ష, ప్రశ్న రావటం వలన ఎక్కడికక్కడ కళాకారులు దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఏర్పడింది. సరే అప్పటికి తెలంగాణ మీద ఏర్పడి పనిచేస్తున్న ఒక రాజకీయ పార్టీ కూడా ఉండటం కూడా దీనికొక ప్లస్ పాయింటే. ఆ రాజకీయ పార్టీకి ఒక దీర్ఘకాలికమైన.. 69 ఉద్యమంలో ఒక రాజకీయ పార్టీ ఏర్పడలే.. ఇక్కడ ఒక రాజకీయ పార్టీ 2001లోనే ఏర్పడి, స్థానిక ఎలక్షన్లలో పోటీ చేసి, మెజార్టీ స్థానాలు గెలుపొంది ఉందిగనుక ఆ పార్టీకి రేపు ఈ రాష్ట్రాన్ని ఏలే అవకాశం వస్తుంది అనే దృక్పథంతో, చాలా దీర్ఘకాలిక దృష్టితో రాజకీయ పార్టీ పనిచేసింది. కవులకి, కళాకారులకి సిద్ధాంతాలతో సంబంధం లేకుండా ఆ రాజకీయ పార్టీ అన్ని రకాల సహాయ సహకారాలు కూడా ఇచ్చింది. దాని వలన గ్రామాల్లోకి కళాకారుల రూపంలో పాటలు విస్తృతంగా, 2005 తర్వాత వెళ్లాయి. 2009 వరకు కూడా భిన్నమైన శక్తుల మాస్ ఉద్యమంగ ఇదేం మారలేదు. కేవలం కొంత ప్రగతిశీలనో, అభ్యుదయనో, లేదా అస్తిత్వ ఉద్యమాల్నుంచి చైతన్యమైన కవులో, కళాకారులో రాస్తూ, పాడుతూ ఉన్నరు. 2009 ఉద్యమం ఎప్పుడైతే మొదలయ్యిందో.. కేసీఆర్ నిరాహార దీక్ష, అరెస్టు, తర్వాత ఆమరణ నిరాహార దీక్ష ఇదంతా ఒక కాలంగా చూసినప్పుడు, ఇది విద్యార్థులు వేలాదిమందిగా కదలటం కారణంగా మాస్ ఉద్యమంగా మారటానికి అవకాశం ఏర్పడింది. మాస్ ఉద్యమంగా మారినప్పుడు ఏం జరుగుతది? కవిత్వం గూడ మాస్‌గా

వస్తది. కవిత్వం మాస్‌గా వచ్చినప్పుడు ఏం జరుగుతది? వస్తువైవిధ్యం పెరిగితే పెరగొచ్చేమోగాని, రూప పరమైన బలహీనత చాలా ఎక్కువగా ఉంటది. కవిత్వం పలుచనబడ్తది. పల్చని కవిత్వం వస్తది. దాన్ని 2009 తర్వాత మనం చూడొచ్చు. అంటే మేమందరం బలంగా రాయాలనే ఆకాంక్ష బలంగా వచ్చింది, అది పాటగావచ్చు, లేదా వచన కవిత్వంగావచ్చు. తర్వాత కవితా సంకలనాలు గూడా విపరీతంగా వచ్చిపడ్డయి, 2009 నుంచి మనం జాగ్రత్తగ గమనిస్తే 2010, 11 వరకు చూస్తే కొన్ని వందల కవితా సంకలనాలు వచ్చేష్నయి. అంటే ఒక రెండుమూడేండ్లలో. ఇంత విస్తృతంగ ఎన్నడు రాలే తెలుగు సాహిత్యంలో. వచ్చిన కవిత్వంలో, కవిత్వంపాలు ఎంత ఉందంటే.. మా వృత్తులు పోయినయి కోసాంధ్ర పాలన ఉండటం మూలంగా, జీవితం ఇట్లయిపోయింది, అట్లయిపోయింది, వలసలు ఎక్కువైనయి అని భిన్నమైన విషయాలు చర్చలోకి వచ్చినయి. కానీ, ఆ భిన్నమైన విషయాలు చర్చలోకి వచ్చిన సందర్భంలో రాసిన కవికి రాజకీయ దృక్పథం లేకపోవటం, పరిపక్వత లేకపోవటం, కవిత్వం అనేది ఆవేశంతో స్పాంటినిటీతో వచ్చేది గనుక, వచ్చినటువంటిదాన్ని పటాపటా రాసిపడేయటం వలన, మళ్లీ వెనక్కి తిరిగి చూసుకునే అవకాశం కూడా లేకపోవటం మూలంగా, అట్లా రాసి ఓ పది కవితలు కాంగనే, ఓ ఇరవై కవితలు కాంగనే ఒక పుస్తకం వేసుకునే ధోరణి బాగా వచ్చేసంది. ఈ కాలంలో మనము సైద్ధాంతిక సంయమనంతో కవి స్పందించాల్సిందిపోయి ఆవేశకావేశాలతో కవిత్వం రావడం చూస్తం. ఒక రకంగా తిట్టు కవిత్వం కూడ మనం గమనిస్తం. పుస్తకాల పేర్లు పెట్టడంకాన్నుంచి మొదలు పెడితే కవితా పంక్తుల్లో కూడా మనకది కన్పిస్తది. కనుక ఒక రకంగా సంఖ్య పరంగా చూస్తే సంకలనాలొచ్చాయిగానీ, వాసి పరంగా చూస్తే మనకి చాలా పలుచనైన కవిత్వంగనే కనిపిస్తది.

**3. కవిగా/విమర్శకుడిగా/చరిత్ర రచయితగా మీరు తెలంగాణ ఉద్యమాన్ని ఎట్లా అర్థం చేసుకున్నరు?**

**జవాబు** : నా మేరకైతే తెలంగాణ ఉద్యమము రాజకీయంగా నన్ను నిలబెట్టింది సమాజంలో.

సరే, సమాజమంతా మారాలి అనే రాజకీయాలతో మొదలైనప్పటికి నేను, నా పనివిధానం వలన లేదా నేను పనిచేస్తున్న సంస్థ వలన కావచ్చు, తెలంగాణ ఉద్యమంతో.. తెలంగాణ స్టూడెంట్ ఫ్రంట్ మేం ప్రారంభించి, దాంట్లో నాయకత్వ బాధ్యతలు తీసుకొని పనిచేస్తున్న క్రమంలో ఈ ఉద్యమం తెలంగాణ సమాజంలో భిన్న అస్తిత్వాల నుంచి వచ్చినటువంటివాళ్లకి ఒక అవకాశంగ చెప్పవచ్చు మనం. వాళ్లు నేర్చుకోవడానికి, ఎదగడానికి, స్థిరపడడానికి, ఇది ఒక భూమికగా పనిచేసింది. అంటే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంకే ప్రాంతంలో కూడా కొత్తతరం సాహిత్యంలోకి, రాజకీయాల్లోకి వచ్చినట్లుగ మనం చూడలేం. అది తెలంగాణ ప్రాంతంలోనే చూస్తం. అదెట్లా సాధ్యమయ్యిందంటే తెలంగాణ ఉద్యమం వలన సాధ్యమయ్యింది. మా జెనరేషన్.. అదే మనం ఆంధ్రప్రాంతంలోకి పోతే రాజకీయ సామాజిక వ్యాఖ్యాతలుగా ఉన్నటువంటివాళ్లు నా ఏజ్ గ్రూపోళ్లు ఆంధ్రా ప్రాంతంలో చాలా పరిమితం. ఒకరకంగా లేరనే చెప్పవచ్చు. ఆంధ్రప్రాంతమే కాదు, భారతదేశంలో ఎటువొయ్యిగూడ ఈ పరిస్థితే కనిపిస్తది. కానీ తెలంగాణ ప్రాంతంలో నా వయసు కలిగినటువంటివాళ్లు కొన్ని దజన్లకొద్ది బలంగా వ్యాఖ్యానించి, బలంగా రాయగలిగి, బలంగా వాదించేటటువంటి వ్యక్తులు తయారయ్యింద్రు. అంటే ఒక జనరేషన్ జనరేషనే వచ్చింది. అది సాహిత్య విమర్శలో కావచ్చు, అది కవిత్వ రచనలో కావచ్చు, రాజకీయాల్ని వ్యాఖ్యానించడంలో కావచ్చు, సామాజిక విశ్లేషణలో కావచ్చు, సంస్థల్ని నిర్మాణం చేయడంలో కావచ్చు, ఆ సంస్థలకు నాయకత్వం వహించే లీడర్‌షిప్ తయారుకావడంలో కావచ్చు, ఇన్ని రకాలుగా మనుషుల్ని తయారు చేయడానికి తెలంగాణ ఉద్యమమనేది ఉపయోగపడింది. ఇది ఈ సమాజానికి ఒక సజీవమైన లక్షణంగా చూడవచ్చు, తెలంగాణ సమాజంలో. ఇట్లా తయారైనటువంటివాళ్లు ఇంకొక ఇరవై ముప్పై సంవత్సరాలపాటు ఈ తెలంగాణ సమాజంలో ఉంటరు. ఇంకో ఇరవై ముప్పై సంవత్సరాలు తెలంగాణలో జరిగే మార్పులని విశ్లేషించేటటువంటి వ్యక్తులుగా, జ్ఞానాన్ని ఆ సమాజానికి అందించేటువంటి వ్యక్తులుగా, ఆ సమాజం నుంచి నేర్చుకునే వ్యక్తులుగా ఈ చరిత్రకు దక్కినటువంటి ఒక అవకాశం. మిగతా ప్రాంతాల్లో మనం దీన్ని చూడలేం. ఏ చిన్న ప్రజా కదలిక అయినా, అది ప్రత్యేక రాష్ట్రాల ఉద్యమం కావచ్చు, అది జాతుల ఉద్యమం కావచ్చు, అది అస్తిత్వ ఉద్యమాలు

కావచ్చు, ఏవైనా సరే ఉద్యమం జరగటమనేదే ఒక సమాజంలో కదలిక. ఒక్కసారి జరిగిన కదలిక, సమాజాన్ని కొన్ని ఏండ్లపాటు నిలబెడుతది. అది మనకు కాకతీయుల కాలంలో ఢిల్లీ కోటను ఎదరించినటువంటి కాకతీయుల తిరుగుబాటుతత్వం, ఈనాటికీ తెలంగాణ సమాజంలో కొనసాగుతుంది. కాకతీయుల్నే ఎదిరించిన సమ్మక్క సారక్కల స్పిరిట్ ఈనాటి తెలంగాణ సమాజంలో కొనసాగుతుంది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఇచ్చిన స్ఫూర్తి ఇప్పటికి పోనేలేదు. ఇంకా కూడా ఆ స్పిరిట్‌తో నిలబడి పనిచేస్తున్నవాళ్లు ఉన్నరు. కనుక ఇవాళ తెలంగాణ ఉద్యమం ఇచ్చిన స్ఫిరిట్ ఇంకొక ముప్పై ఏండ్లు, నలభై ఏండ్లు కొనసాగడానికి ఉపయోగపడుతుంది. నామట్టుకు నేను ఈ తెలంగాణ ఉద్యమంలో ప్రారంభమై, ఉద్యమంలో స్థిరపడి, ఉద్యమంలో ఎక్స్‌పోసై ఉన్నటువంటివాడిగా.. ఇది నా కోణంలోంచి నేనాలోచించిన, వైయుక్తిక స్థాయిలో కాకుండా సామూహిక స్థాయిలో కూడా దీని రిసల్ట్ ఇట్లే ఉంటుందని నా అభిప్రాయం.

**4. తెలంగాణ వాదంలోని అన్ని పార్శ్వాలు కవిత్వంలో ప్రతిఫలించాయా?**

**జవాబు** : వచన కవిత్వంలోకన్నా, కవిత్వంలోనే అంతర్భాగమైన పాటల్లో ఎక్కువ కోణాలు ప్రతిఫలించాయి. ఎందుకంటే వచన కవిత్వం కన్నా రాశిలోనూ, వాసిలోనూ పాటలు ఎక్కువగా వచ్చి ఉన్నాయి, వాటిని రాసినవాళ్లు ఎక్కువగా ఉత్పత్తి కులాలకు సంబంధించినవాళ్లు కనుక విభిన్నమైన కోణాలను కవిత్వంలోకి తీసుకొచ్చారు.

**5. వచన కవిత్వం, పాటల్లో ప్రత్యేక తెలంగాణ విస్తృతంగా వ్యక్తమైంది గానీ ఇతర సాహిత్య ప్రక్రియల్లో కనిపించక పోవడానికి కారణాలు ఏమిటి?**

**జవాబు** : ఎక్సాక్ట్లీ. నిజానికి వచన కవిత్వంతో పోల్చుకుంటే పాటలో ఎక్కువగా వ్యక్తమైంది. వచన కవిత్వం కూడా తక్కువ వచ్చింది. నిజంగా మనమనుకునే సారభూతమైన కవితలు ఎన్నున్నయని ఏరి, ఒక దగ్గర, ఒక పుస్తకంగ వేస్తే, ఒక మూడు నాలుగు వందల పేజీల పుస్తకంకన్న ఎక్కువగ రాదు. కానీ, అదే మనం పాటలను చూస్తే, కొన్ని వేల పాటలు

వచ్చినయి. సారభూతమైన పాటలు వచ్చినయి. ఈ తేడాను కూడా గమనించాలి మనం. ఎందుకు గమనించాలి ఈ తేడానంటే.. తెలంగాణ ఉద్యమంలోకి ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలు చదువుకున్న కులాలు ఈ కాలంలో ఉద్యమంలోకి వచ్చినయి. యూనివర్శిటీ స్థాయిలో నాయకత్వం వహించింది ఈ వర్గాలే. గ్రామస్థాయిలో జేయేసీలకు నాయకత్వం వహించింది ఈ వర్గాలే. దాదాపు తొంభయ్యారు తర్వాత ప్రారంభమైన ఉద్యమానికి నాయకత్వం వహించింది ఈ వర్గాలే. అంటే.. చదువుకున్నటువంటి, ఒకరకంగా మొదటి జెనరేషన్ ఉద్యమంలోకి ప్రవేశించటం మూలంగా వాళ్లలో ఉండే సృజనాత్మక శక్తి పాట రూపంలో వ్యక్తమైంది. వచన కవిత్వం అనేది పండిత వర్గాలకి, లేదా మధ్య తరగతికి, లేదా అగ్రకులాల్లో ఉంటేటటువంటివాళ్లకు సంబంధించిన ప్రక్రియగా ఉండింది. కానీ పాట అనేది నేను ఇంతకు ముందు చెప్పిన వర్గాల ప్రక్రియ కావటం మూలంగా విస్తృతంగా పాట వచ్చింది. అయితే తమ జీవితాల్నుంచి వచ్చిందాపాట. పాట పాటగా మామూలుగా కాకుండా, తెలంగాణ ప్రాంతంలో వాళ్ల గ్రామాల్లో పడుతున్న యాతన నుంచి, ఘర్షణ నుంచి పాటలొచ్చినయి. అందుకే జీవితాన్ని ఆవిష్కరించారు వాళ్లంతే. అందుకే అద్భుతమైన వేలాది పాటలు వచ్చినయి మనకు. ఇవిట్లా పెడితే, అసలుకు తెలంగాణ ప్రాంతం వ్యక్తీకరణనే మొదటి నుండి.. ఒక వంద సంవత్సరాలు తీసుకున్నా.. కవిత్వం ద్వారా, పాట ద్వారా వ్యక్తం చేసినట్లుగా ఇతర ప్రక్రియల ద్వారా తెలంగాణ సమాజం వ్యక్తం కాలేదు. ఎందుగ్గాలేదంటే, తెలంగాణ సమాజం పూర్తిగా ఫ్యూడల్ సంబంధాల్లో ఉన్నది, ఇప్పటికీ. నైజాంకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం పూర్తిగా ఫ్యూడల్ సంబంధాలకు వ్యతిరేకంగా జరిగిందే. విప్లవోద్యమం ఫ్యూడల్ సంబంధాలకు వ్యతిరేకంగా జరిగిందే. ఇక్కడ పెట్టుబడి ప్రవేశించలేదు. నిజానికి బహుళజాతి కంపెనీలు తొంభయ్యారు తర్వాత వచ్చినప్పటికీ, పెట్టుబడులు పెట్టినప్పటికీ అది ఇక్కడుంటేటువంటి భూస్వామ్య సంబంధాల్ని పూర్తిగా విచ్ఛిన్నం చేసేంతగా రాలేదు. అదే మనకు ఆంధ్రా ప్రాంతంలో చూస్తే, ఎప్పుడో వందా నూటా యాభై సంవత్సరాల కిందటే పెట్టుబడి ప్రవేశించింది. ఆ పెట్టుబడితోపాటు ఇంగ్లీషులో ఉండే సాహిత్య ప్రక్రియలు ప్రవేశించాయి. విశ్రాంతి వర్గం ఏర్పడింది. ఆ వర్గానికి కావల్సినటువంటి కథ, నవల, నాటకం ఆ ప్రాంతంలో ప్రవేశించాయి. కానీ ఇక్కడ విశ్రాంతి వర్గం చాలా తక్కువగా ఉన్నది. ఫ్యూడల్స్.. నైజాం,

ఆయన కింద ఉండే జాగీర్దార్లు, జమీందార్లు.. వీళ్లు. అందుకే ఇక్కడ తెలుగు చదువుకోవడమే కష్టమైన రోజుల్లో, తెలుగు మాధ్యమంలో చదువుకోలేని స్థితి ఉన్న ప్రాంతం కావటం మూలంగా కోపమొచ్చినా, ప్రేమ కలిగినా, ఏదైనా కవిత్వ రూపంలో వ్యక్తం చేయడం, లేదా పాట రూపంలో వ్యక్తం చేయటమే మనం చూస్తం. అంటే ఆ ఫ్యూడల్ సంబంధాల్లో మౌఖిక సాహిత్యానికుండే ఇంపార్టెన్సే సాహిత్యం రావడానికి ఉపయోగపడింది. అందుకే వట్టికోట ఆళ్వారుస్వామి లాంటివారు నిజామాబాదు ప్రాంతానికి వెళ్లి, అక్కడ కొంత చదువుకోవటం మూలంగా నవల రాయగలిగాడు తప్ప, ఆయన రాసిన నవలకంటే ముందు ప్రామాణికమైన నవలలు అసలుకు లేనే లేవు. అంటే సాయుధ పోరాటం విరమించిన తర్వాత నవలా ప్రక్రియ మొదలైందని చెప్పవచ్చు ఒకరకంగా. అంటే ప్రశాంతంగా కూర్చొని విశ్రాంతిగా రాసే పరిస్థితి తెలంగాణలో ఏ కవికి, రచయితకు లేదు. లేకపోవటం మూలంగా పరిమితి ఏర్పడింది అని నాకనిపిస్తుంది. అట్లే కథ కూడా అదే స్థితిలో మనకు కనిపిస్తది. కనుక ఇది తెలంగాణ ఉద్యమం నడుస్తున్న కాలంలో కూడా కనిపిస్తది. తెలంగాణ ఉద్యమం ప్రధానంగా భావోద్వేగాలతో నడిచిన ఉద్యమం. ఈ భావోద్వేగాలతో నడిచే ఉద్యమంలో వెంటనే కవిత్వంలో, పాటలో వ్యక్తమైనట్లుగా కథలో, నవలలో వ్యక్తం కాలేని స్థితిని మనం తెలంగాణ సమాజంలో చూస్తం. ఎక్కన్నో కొన్ని అక్కడక్కడ కొన్ని కథలు వచ్చినప్పటికీ ఆ కథలు కూడా చాలా బలంగా తెలంగాణ ఉద్యమాన్ని ప్రతిబింబిస్తూ, భిన్న పార్శ్వాల ఘర్షణను ప్రతిబింబిస్తూ వచ్చిన కథలు ఎక్కడా లేవు. అసలు నవల అయితే ఇప్పటి వరకు తెలంగాణ ఉద్యమం మీన రానేలేదు. తెలంగాణ ఉద్యమ సందర్భంలో నవల రానేలేదు.

**6. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం సమాజం మీద వేసిన ప్రభావం ఎటువంటింది?**

**జవాబు** : దీనికి సంబంధించిన సమాధానం ఇంతకు ముందటి సమాధానాల్లోనే చెప్పిన. దాంతో దీన్ని సమన్వయం చేసుకోవచ్చు.

**7. చివరి దశల ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం రాసిన వాళ్లలో ఎక్కువగా యువతరం**

**ఉన్నారు. భవిష్యత్ తెలుగు కవిత్వానికి వారు భరోసా నివ్వగలరు అని చెప్పగలరా?**

**జవాబు** : ఎస్. అయితే 20 నుంచి 30 సంవత్సరాల వయస్సున్నటివంటి వాళ్లు ఎక్కువగా కవిత్వం రాసిండ్రీకాలంలో, పెద్దవాళ్లకన్నా. నిజానికి పెద్దవాళ్లందరూ అప్పటికే కవిత్వంలో నిష్ణాతులుగా ఉన్నటువంటివాళ్లు, ప్రత్యేక తెలంగాణోద్యమాన్ని ఉద్దేశించి ఒక సంపుటం, ఒక సంకలనం వేసిన సందర్భం మనకు కన్పియ్యదు. అయితే యువకవులు ఈ పని బాగా చేసింద్రు. నాకు తెలిసి ఒక వందమంది ఈ వయసు.. 20 నుంచి 30లోపు వయసు కలిగినటువంటివాళ్లు సంకలనాలు వేసింద్రు. అయితే వీళ్లందరు కూడా వేసినటువంటి పుస్తకాల్లోని కవిత్వంలో వంద మందిని మనం చూసినప్పుడు, మీరడిగిన భవిష్యత్తుకు భరోసాన్విగలిగేవారు ఉన్నరు, లేకపోవటమనేది ఏమీ లేదు. వందమందిలో పది నుంచి ఇరవై మందిని మనం ఏరొచ్చు. కనుక స్పాంటినిటీతో మొదలైనటువంటి రచనా వ్యాసంగమనేదాన్ని స్థిరంగా, కొంత అధ్యయనం చేసి, కొంత నైపుణ్యం పెంచుకుని కవిత్వ రాస్తే, ఈ ఉద్యమ కాలంలో వచ్చినటువంటి వాళ్లు భవిష్యత్తులో, తెలంగాణ ప్రాంతం నుంచి కవులుగా మారి, కవిత్వానికి భరోసానిచ్చేటువంటి వ్యక్తులుగా తయారవుతరు.

**8. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం మీద ఏ యే కోణాల్లో పరిశోధనలు చేయవచ్చు?**

**జవాబు** : ప్రత్యేక తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో వచ్చిన కవిత్వంలో ఒకటి తప్పనిసరింగ జరగవల్సిందేంటంటే భాష కోణంలో ఒక పరిశోధన జరగాలె. అంటే కవులు, కాన్షియెస్‌గా కవితా సంపుటులకు పేర్లు పెట్టడం కాన్నుంచి మెదలుపెడితె కవితా పాదాల్లో తెలంగాణ ప్రాంతంలో ఉండే భాషను వాడింద్రు. కనుక తెలంగాణకు భాష లేదు, తెలంగాణకు వినసొంపైన భాషా రూపం లేదు అని రకరకాల విమర్శలు మనకు కన్పిస్తయి. ఈ విమర్శలన్నిటిని మనం పూర్వపక్షం చేయాలంటే, ఇక్కడ కచ్చితంగా భాష మీద పరిశోధన జరగాలి. మొదటి కాలంలో.. అంటే 2000 సంవత్సర కాలంలో వచ్చిన కవితా సంకలనాలను చూస్తే మత్తడి, అలుగు, పొక్కిలి వంటి పదాలతో పుస్తకాలకి పేరు

పెట్టడంలోనే ఒక ప్రత్యేకతని చూయించారు కవులు. అంతేకాకుండా కొద్దిమందైతే కవితా పాదాల్లో కాన్షియెస్‌గా పూర్తిగా తెలంగాణ భాషలోనే రాసే ప్రయత్నం చేశారు. అందుకోసం ఈ భాష సుసంపన్నమైన భాష అని చెప్పడానికి, ఇన్నాళ్లూ ఆంధ్రప్రాంత భాష అణచివేతకు గురై, నిరాదరణకు గురైనటువంటి తెలంగాణ ప్రాంత భాషని పరిశోధించాలి. కవిత్వంలో ప్రయోగించిన భాషనే నిఘంటువుల్లోకి వస్తది. ఎప్పుడైన ప్రామాణిక భాషగా మారుతది. అందుకోసం ఆ కోణంలో ఒక పరిశోధన జరగాలి. రెండోది. నేనైతే పాటని కవిత్వంలో భాగంగనే చూస్త. ఇంకో పరిశోధన ఏం జరగొచ్చంటే.. అసలు పాట మీద పరిశోధనలు చాలా పరిమితంగ వచ్చినయ్. దానిమీద రాయటమే చాలా తక్కువ. మన విమర్శకులకి పాటని పట్టించుకునే అది లేదు. కొన్ని వేల పాటలు వచ్చి ఉన్నై కనుక, పాట నిర్మాణం మీద ఒక సీరియస్ పరిశోధన జరగాలి. వచన కవిత్వం నిర్మాణం ఎట్లా జరుగుతుంది, వచన కవిత్వం రూపమేమిటి, రూప వైవిధ్యం ఏమిటి అని మనం విశ్లేషించినట్లుగా పాట నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక విషయాలను చర్చనీయాంశంగ చేసి ఒక పరిశోధన జరగాలి. కనుక ఇప్పటికిప్పుడు కవిత్వం మీన ఈ రెండు రకాల పరిశోధనలు జరిగితే తెలంగాణ సాహిత్యానికి, భాషకు ఉపయోగకరంగ ఉంటుందనేది నా అభిప్రాయం.

**9. ఇతర అస్తిత్వ వాదాల కవిత్వానికి, తెలంగాణ అస్తిత్వవాద కవిత్వానికీ బేధం ఏమిటి? వాటికి వచ్చినంత గుర్తింపు తెలంగాణ కవిత్వానికి వచ్చిందని భావిస్తున్నారా?**

**జవాబు** : ఇతర అస్తిత్వ వాదాలకి, తెలంగాణ అస్తిత్వ వాదానికి మౌలికంగానే చాలా తేడా ఉన్నది. తెలంగాణ అనేది ఒక ప్రాంతీయ డిమాండ్ అది. తెలంగాణ సమాజంలో ఉండే అన్ని అస్తిత్వాలకు సంబంధించినవాళ్లు ఈ డిమాండ్ మీద స్పందించొచ్చు, రాయొచ్చు. అట్లా రాస్తున్న క్రమంలో భిన్న నేపథ్యాల నుంచి రాస్తుంటరు కనుక ఆ నేపథ్యాలన్నీ ఒకటి కాకపోవచ్చు. దానివలన ఏమవుతుంది? సహజంగనే కవిత్వ నిర్మాణం బలంగ జరగకపోవచ్చు. అందుకోసం ఇతర అస్తిత్వ వాదాలు జీవితం నుంచి వచ్చినయి. స్త్రీలు, ఆదివాసులు, దళితుల్లో మాదిగలు, భిన్నమైన బీసీ కులాలు, ఇవన్నీ తమ అస్తిత్వాన్ని వ్యక్తం చేయడం మనం ఒక ఇరవై ఏండ్లుగ చూస్తున్నం. ఇవేమిటంటే సామాజిక

అసమానతల నుంచి వచ్చినటువంటివి. అసమానతలను అనుభవించి, ఆ అసమానతలకు వ్యతిరేకంగా గొంతు విప్పినటువంటివి. కనుక ఇవి చాలా బలంగా ఉంటయి. తామనుభవించిన జీవితంలోనుంచి, ఘర్షణలోనుంచి, కోపమూ, ఆవేశమూ, దు:ఖమూ అన్ని కలగలుపుకొని కవిత్వం సాంద్రతతో వస్తది. అది జరిగింది. మనమది చూశాం దళిత కవిత్వంలో, స్త్రీవాద కవిత్వంలో. కానీ తెలంగాణ కవిత్వం అట్లాంటిది కాదు. జస్టు రాజకీయ సమస్య. ఆర్థిక సమస్య. కొంత సాంస్కృతిక సమస్య. మళ్ల సంస్కృతి అంటే ఎవరి సంస్కృతి అనే ప్రాబ్లం వస్తదిక్కడ. తెలంగాణ ప్రాంతంలో ఉండే దళితుల సంస్కృతా, దొరల సంస్కృతా, రెడ్ల సంస్కృతా అనే ప్రాబ్లం వస్తది కనుక ఎవరి సంస్కృతి అణచివేతకు గురైందిక్కడ? నిరాకరణకు గురైంది? అనే ప్రశ్న ముందుకొస్తది కనుక ఒక ఏకశిలా సదృశ్యంగా ఉండేది సంస్కృతి కాదు. రాజకీయాలనేటువంటివి కూడా ఎవరి రాజకీయాలు? రేపు తెలంగాణ వచ్చింతర్వాత ఎవరికి లాభం జరుగుతది? మళ్లా అగ్రకులాలే అధికారంలోకి వస్తరు గదా అనే ఒక ఉదాసీన భావం కూడా ఉన్నది. అందుకోసమే.. తెలంగాణ ఉద్యమమే ఒక మాస్ మూవ్‌మెంట్‌గా జరగటం మూలంగా, ఆ మూవ్‌మెంట్‌లో భాగంగా, స్పందించడమనేది కనిపిస్తుంది కవిత్వంలో కానీ.. దాంట్లో మమేకమైపోయి, ఆ డిమాండుతో లోతుల్లోకి వెళ్లిపోయి రాయలేదు. అట్లా సాధ్యం కూడా కాదు. కనుక ఆ భేదం మనకిక్కడ స్పష్టంగా కనిపిస్తది.

గుర్తింపు రావడానికి కూడా ఇదే పునాది. కవిత్వానికి ఎప్పుడు గుర్తింపు వస్తది? అది బలమైన కవిత్వంగున్నప్పుడు. దానికి ఒక సిద్ధాంత పునాది ఉన్నప్పుడు. అది అభ్యుదయ కవిత్వమైనా, భావ కవిత్వమైనా, విప్లవ కవిత్వమైనా, దిగంబర కవిత్వమైనా ఏదైనా వాటికొక సైద్ధాంతికమైన బలం ఉన్నది, ఆ బలం మొత్తం సమాజానికి సంబంధించిన ఒక సమస్యను అడ్రస్ చేసే సిద్ధాంతం. కనుక ప్రజలందరు దాంతో మమేకమయ్యారు. దళిత సమస్య వచ్చినప్పుడు దళితులందరు దాంతో మమేకమయ్యారు. దానికొక సైద్ధాంతిక నేపథ్యం ఉన్నది. అట్ల స్త్రీలకు సంబంధించి ఒక సైద్ధాంతిక నేపథ్యం ఉన్నది. తెలంగాణకు సైద్ధాంతిక నేపథ్యం ఏం లేదు. ప్రాంతీయ ఉద్యమమది. ప్రాంతం కోసం పోరాటం. ఒక సపరేట్ రాష్ట్రం ఏర్పడటమనేది దాని పరిమితి. కనుక, ఈ

పరిమితి వలన, సైద్ధాతిక పునాది లేకపోవటం వలన సహజంగనే మిగతా అస్తిత్వ వాదాల కవిత్వానికి వచ్చినంత గుర్తింపు  తెలంగాణ అస్తిత్వ కవిత్వానికి రాలేదు. కానీ తెలంగాణ ఉద్యమం కోసం పనిచేసిన విడివిడి వ్యక్తులకి, పాటలు రాసిన చాలామంది రచయితలకి..(వచన కవిత్వంలో ఈ పరిమితి ఉందిగాని), పాట కవులకు విపరీతమైన గుర్తింపు వచ్చింది. ఏ సందర్భంలో రానంత గుర్తింపు వచ్చింది. దళిత కవిత్వంలో చాలామంది పాటలు రాశారు, కానీ పాటగాళ్లుగా గుర్తింపు రాలేవాళ్లకు, దళిత అస్తిత్వంలో. స్త్రీల సందర్భంలో పాటలు రాసినవాళ్లున్నారు, చాలా పరిమితం, అసలు పాటగాళ్లకి గుర్తింపేలేదాకాలంలో. విప్లవోద్యమంలో పాటగాళ్లకి వచ్చినంత గుర్తింపు మళ్లీ తెలంగాణోద్యమంలోనే వచ్చింది. రెట్టింపు గుర్తింపు వచ్చింది. కనుక మనం వచన కవిత్వాన్ని చూసినప్పుడు ఆ పరిమితి ఉందిగాని, వచన కవిత్వంలో భాగంగా పాటను చూస్తే మాత్రం ఏ అస్తిత్వ ఉద్యమంలో రానంత గుర్తింపు పాటగాళ్లకు ఈ ఉద్యమంలో వచ్చింది.

**10. తెలుగు వచన కవితా ప్రస్తానంలో ప్రత్యేక తెలంగాణోద్యమ స్థానం ఏమిటి?**

**జవాబు** : దీన్ని రెండు రకాలుగా చూడవచ్చు. సంఖ్యాపరంగా, తెలుగు కవిత్వం ఇన్ని సంపుటాలు, సంకలనాలు వచ్చినయనేది ఒక రకంగా చూడొచ్చు మనం. ఆ రకంగా చూసినప్పుడు ఆ కవిత్వ స్థాయి ఏమిటనేది పక్కనపెడితే సంఖ్యాపరంగా దానికుండే ప్రధాన్యత దానికుంటది. రెండవది దాని వాసి ఏమిటనేది మనం చూసినప్పుడు, ఎప్పుడైనా ఆ సాహిత్యం ఎట్ల నిలబడ్తదంటే, వాసి వలననే నిలబడ్తది. రాశి వలన నిలబడదు. అది ప్రామాణికమైన కవిత్వంగా, బలమైన కవిత్వంగా, సాంద్రమైన కవిత్వంగా ఉన్నప్పుడే సాహిత్య చరిత్రకు తోడ్పాటునందిస్తది. చేర్పుగా మనం దాన్ని చూస్తం. కనుక అట్ల చూసినప్పుడు మనం ఇంతకుముందు మాట్లాడుకున్నట్లే సంఖ్యాపరంగా వచ్చింది వాస్తవమే అయినప్పటికీ ఉజ్జ్వలంగా మనం చెప్పుకోదగినటువంటి తెలంగాణ కవిత్వం రాని ఒక విషాదం కూడా ఈ స్థితిలో చూడొచ్చు.

## - డా॥ పి. వరవరరావుతో ముఖాముఖి -

**1. తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం నడిచినంత విస్తృతంగా కవిత్వం వెలువడక పోవడానికి కారణాలు ఏమిటి?**

**జవాబు :** నాకూ ఇది ఇప్పటికీ ప్రశ్నగానే ఉన్నది. బహుశా నేననుకుంటా, ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని చాలా ప్రజాస్వామిక ఉద్యమంగానూ, రాజ్యానికీ, కేంద్రానికీ, వ్యవస్థకూ వ్యతిరేకంగా ప్రారంభమైన ఉద్యమంగానూ, గొప్ప విలువలతోటి, ఆదర్శాలతోటి, చేపట్టినటువంటి, శక్తులు, తరం ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని శ్రీకాకుళోద్యమం నుండి విడిగా చూడకపోవడం వల్ల తెలంగాణ గురించి ప్రత్యేకంగా రాయాలనేటువంటి దృష్టి పెట్టినట్లు అనిపించలేదు. ముఖ్యంగా రెండు పెద్ద మిలిటెంట్ పోరాటాలతోటి.. అంటే మిలిటెన్సీ విషయంలోగానీ, రాజ్య వ్యతిరేకత విషయంలోగానీ, యువకుల యొక్క తెగింపు, త్యాగాల విషయంలోగానీ మాత్రమే పోలుస్తున్న నేను.. అట్లా పోల్చినప్పుడు పంజాబ్‌లో యైటీస్‌లో వచ్చిన ఉద్యమంలో గూడా కవిత్వమూ, సాహిత్యమూ రాలేదు. వాళ్లు నిజానికి కొండను ఢీకొన్నట్లుగా ఢీకొన్నరు, యూత్.. అందరూ యువకులు.. నిరుద్యోగం చాలా ప్రధానమైనటువంటి సమస్య. గ్రీన్ రెవొల్యూషన్ వచ్చింది అని చెప్తున్న రోజులల్లో నిరుద్యోగానికి గురైన యువకులు.. అందులో ఆనంద్ కోషాహరి తీర్మాణాన్ని అమలు చేయాలనే క్రమంలో ఉండేవాండ్లకేమో ఒక జాతీయ స్పష్టత ఉంది, కానీ ఎందుకో సాహిత్యం రాలేదు. చివరికి ఎట్లాగంటే వాండ్లు చనిపోయినప్పుడు జరిగే బోర్డ్ ప్రోగ్రామ్ పత్రికల్లో రావడం తప్ప ఇంకే సాహిత్యం కనపడదు మనకు. ఇప్పుడు డాక్యుమెంటేషన్ చేద్దామంటే. తెలంగాణ గూడా అంతే. తెలంగాణ ఉద్యమంలో మనం వ్యాసాలు రాశాం. విశ్లేషణలు చేశాం. నాకు గుర్తున్నంత వరకు నేను, చెరబండరాజు తప్ప.. నేను లెనిన్ మీద రాసిన పోయెమ్‌గాని.. ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణ ఉద్యమంలో ప్రజలను చూడినవాడు లెనిన్ అని నేను రాసినట్లుగా.. లేదా ఆయన చాలా స్పష్టంగా విశాలాంధ్రలో ప్రజారాజ్యానికి జవాబుగా అన్నట్లు ప్రత్యేక తెలంగాణలో ప్రజాస్వామ్యం అని.. చెరబండరాజు రాసింది తప్ప ఇతరులెవ్వరూ పెద్దగా పోయెట్రీ రాసినట్లుగా లేదు. మళ్లీ

మనలాంటి ఉద్యమమే తెలంగాణ ఎన్జీవోలు చేసిన ఉద్యమం.. ఎన్జీవోలంటే ఉద్యోగస్తులు. జగన్మోహన్‌రావు అధ్యక్షుడుగా 53 రోజులు ఒక పొలిటికల్ కాస్ కోసం గొప్ప స్ట్రగుల్ నడిపింద్రు. వాళ్లమీద ఉన్నదీ మా ప్రభావమే. అయినా జగన్మోహన్‌రావు ఒక్కడూ మంచి కవిత్వం రాసిండు దానిమీద. చాలా పవర్‌ఫుల్ కరపత్రాలు రాసిండు. అంతే తప్ప ఇప్పుడు ఎంతనైతే విస్తృతమైనటువంటి కవిత్వం, ఇవన్నీ వచ్చినయో, అప్పుడు రాలేదు. ఇది వేసుకోవల్సిన ప్రశ్నే. మరి నేను చాలా సందర్భాల్లో పోల్చినట్లుగా.. ఎందుకంటే ఏకకాలంలో ఫ్రెంచి విద్యార్థి ఉద్యమం గురించి నేను చదువుకోని ఉన్న. కళ్ల ముందు తెలంగాణలో చూసిన. నా స్టుడెంట్స్.. సీకెఎమ్ కాలేజీ స్టుడెంట్స్, కేఎమ్‌సీ స్టుడెంట్స్.. అదర్‌వైస్ పొలిటికల్ క్లాసులు వినే కేఎమ్‌సీ స్టుడెంట్స్, అదర్‌వైస్ ఆర్‌ఏసీ స్టుడెంట్స్.. వీళ్లందరు గూడ వాళ్ల ఇన్వాల్వ్‌మెంట్, వాళ్ల తెగింపు.. ఎక్కడా వెస్టెడ్ ఇంట్రెస్ట్స్ లేకపోవడం, కోస్తా జిల్లాల నుంచి వచ్చి లీడ్ చేసినవాళ్లతో సహా.. ఒకవైపు కేవలం సంకుచిత భావనతో చూసేవాళ్లను.. కోస్తా ఆంధ్రా అగ్రవర్ణాలకూ.. అంటున్న సమయంలో కూడా.. ఈ రిస్కు తీసుకుంటూ ఆ రిస్కుతో ప్రజాస్వామిక తెలంగాణ ఉద్యమాన్ని నడిపినవాళ్లు.. మమ్మల్ని గైడ్ చేసినటువంటి కేఎస్.. చివరికి ఎస్ఎమ్ గూడా.. వాస్తవానికి వరంగల్ నుంచి.. ఆర్ఈసీ నుంచి.. దేశాయిపేట, పగిడిపల్లిదాకా ఉద్యమం నడిపినవాడు సత్యమూర్తి.. లేదా చక్కిళ్ల అయిలయ్య.. పైగా సత్యమూర్తి అప్పటికే రైతు బిడ్డడు గెరిల్లాగా గండ్రగొడ్డలి లేపిన.. ఇటువంటి పాటలు రాసిండుతప్ప తెలంగాణ మీద ఒకటి రాయాలనేది లేదు. ఒక్క కాటా నారాయణరావు ఒక్కడు రాశాడు. తెలంగాణ పిలిచిందిరా.. అని ఒక అద్భుతమైన పాట రాశాడు. చాలా పాపులర్ అది. ఆనాడు ఈ పాటను సభల్లో పాడేవాండ్లు. అట్లా ఒక పాట వచ్చింది. ఇప్పటితో పోలిచే చాలా తక్కువగా కవిత్వం వచ్చింది. కనుక ఈ విషయం మీద ఇంకా పరిశోధన జరగవల్సి ఉన్నది, ఎందుకు రాలేదు అని. నేనకోవడం ఏంటంటే రాయగలిగినవాండ్లందూ విప్లవోద్యమంలో ఇన్వాల్వ్ అయిపోయారు. ఇది ఎక్స్‌ప్లెయినేషన్ కాదుగానీ.. ఎందుకంటే ఇవాళ దండకారణ్య ఉద్యమంలో పూర్తిగా ఇన్వాల్వయిన సాధనలాంటి వాళ్లు చాలా రాస్తున్నరు.

**2. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో వస్తు రూపాలగురించి చెప్పండి?**

**జవాబు** : విప్లవోద్యమ ప్రాపంచిక దృక్పథం లేనివాళ్లు రాసిన కవిత్వంలో బలమైన కవిత్వం రాలేదని చెప్పాలి. రూపం విషయంలో కూడా ఇదే వర్తిస్తుంది. అయితే తెలంగాణ కవిత్వం మొత్తంలో నాస్టాల్జియా వ్యక్తమైన కవిత్వం మాత్రం చాలా బలంగా కనిపిస్తుంది. ఆ నాస్టాల్జియా కూడా ప్రగతిశీలమైనది.

**3. కవిగా/విమర్శకుడిగా/చరిత్ర రచయితగా / వ్యాఖ్యాతగా మీరు తెలంగాణ ఉద్యమాన్ని ఎట్లా అర్థం చేసుకున్నరు?**

**జవాబు** : తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో మమ్మల్ని గైడ్ చేసినవాడు కొండపల్లి సీతారామయ్య, స్పష్టంగా.. ఆయన ఇచ్చినటువంటి సూచనలతోటి, ఆయన చెప్పిన ఆర్గ్యుమెంట్‌తో కన్విన్స్ అయి, ఆయనతోపాటు ఉండేటువంటి సత్యమూర్తి, చెక్కిళ్ల అయిలయ్య, కొల్లిపర నర్సింహారావు.. వీళ్లు మనకు బలం ఉన్నచోట, మన శక్తుల మధ్యన ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కోసం పనిచేశారు. కొల్లిపర నర్సింహారావు మొదలు ఆర్గనైజర్‌గా ఆదిలాబాదు వెళ్లినప్పటికీ, ఎక్కువగా హైదరాబాదుకు వచ్చి, సికింద్రాబాదు ఏరియాలో ఉండి.. ఆర్వీబీ శర్మ అని ఆంధ్రభూమిలో పనిచేసే ఆయన, పీఎన్ స్వామి – ఈయన కూడా ఆంధ్రభూమిలోనే పనిచేసేవాడు.. వీళ్లిద్దరు విరసం ఫౌండింగ్ మెంబర్స్ కూడా.. ఈ ఇద్దరి దగ్గర ఉండి ఇక్కడ మిలిటెంట్ స్ట్రగుల్‌ను గైడ్ చేసినవాడు, క్లాక్‌టవర్ దగ్గర 69 మూవ్‌మెంట్‌ను మిలిటెన్సీ వైపు నడిపినవాడు, నేపథ్యంలో ఉన్నవాడు కొల్లపర నర్సింహారావు. దానికి అన్నివిధాలా ఆంధ్రభూమి పత్రికను ఉపయోగించుకుంటూ వీళ్లిద్దరూ హెల్ప్ చేశారు. తరువాత పీఎన్ స్వామి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో చాలా ముఖ్యమైన రోల్ ప్లే చేసినవాడు. ఆయన్ను జ్వాలా అని కూడా అనేవాళ్లు. చాలా అద్భుతమైన ప్రసంగాలు చేసేవాడాయన. ఆర్వీబీ శర్మ అయితే 'పట్టణంలో గెరిల్లా విధానాలు' అనే ఒక పుస్తకం ట్రాన్స్‌లేట్ చేశాడు. అప్పుడు పింగిడి రంగారావు ఆంధ్రభూమిలో పనిచేసేవాడు. విపరీతంగా ఆయన ప్రభావంలోకి వస్తే ఈ పిల్లవాడెక్కడ బాంబులు తయారు చేస్తాడో అని, వాళ్లన్న మెడికల్ కాలేజీలో పనిచేసేటాయన ఉద్యోగం మాన్పించి

తీసుకుపోయి పరీక్షలు రాయించి ప్రావిడెంట్ ఫండ్ ఉద్యోగంలో చేర్పించాడు. దీని వెనుక కొండపల్లి సీతారామయ్యకు 1956 నుండి తెలంగాణలో ఉండిన అవగాహణ, జీవితానుభవం నేపథ్యంగా ఉన్నాయి. ఉదాహరణకు ఆయన ఆదిలాబాదు జిల్లాలో విచిత్రమైన స్థితి చూశాడు. దొరలు సుధాకర్‌రావు, తపాల్‌పూర్ దొరలు, నస్పూర్ దొరలు, వీళ్లందరూ రెడ్లూ వెలమలైన దొరలు. రావులు అనిపించుకున్న దొరలు. ఫారెస్టునంతా (వందల వేల ఎకరాలు ఉండేవి) దోచుకున్నారు. అక్కడ జె.వి.నర్సింగరావులాంటి వారు కూడా ధనిక రైతులు. సేమ్ బ్యాక్‌గ్రౌండే. కానీ వారి మధ్య వైరుధ్యం. అట్లా విచిత్రంగా 62 ఎలక్షన్స్‌లో జె.వి.నర్సింగరావు ప్రచారంలో కేఎస్ తిరిగాడు. ఎందుకంటే దొరలు ఊళ్లో స్కూల్ పెట్టనివ్వరు, ప్రాజెక్టులు రానివ్వరు, సరస్వతి కెనాల్ తవ్వనివ్వరు, పోస్టాఫీసు కూడా రానివ్వరు. దొరలు వాళ్ల ఊర్లనుంచి రైల్వే లైన్ కూడా పోనివ్వరు. ఇవన్నీ తేవడానికి మనం ఏయే శక్తులను కలుపుకురావాలి అనే కాంట్రాస్టులో ఆయనతో కలిసి పనిచేశాడు. ఈ కాంట్రాస్టును చూసిండాయ. లక్సెట్టిపేటలో, మంచిర్యాల పక్కనుండేటి పల్లెల్లో సెటిలైన ఆంధ్రా సెటిలర్స్ స్థితి చూసిండు. ఆదిలాబాదులో ఉండే రైతు స్థితి చూసిండు. ఆదివాసీల సంగతి చెప్పనక్కర లేదు. ఆయన జన్నారంలో ఉన్నాడు. ఆయన చుట్టూతా ఆదివాసీలే ఉన్నారు. వాళ్ల లైఫ్, రైతుల లైఫ్, ఈ సంపన్నుల లైఫ్ చూసిండాయన. ఇది చూసి అసమ అభివృద్ధిని అర్థం చేసుకున్నాడు. 1956లో తెలంగాణకు వచ్చినప్పటినుండి ఆదిలాబాద్‌లో ఈ పరిస్థితి దాకా అనేక విషయాల్ని అర్థం చేసుకున్నాడు. ఆయన చదువుకున్న మార్క్సిజంలోంచి అసమ అభివృద్ధి అనేది సామ్రాజ్య వాద లక్షణంగా గుర్తించాడు. కనుక తెలంగాణకు కలయిక వలన అన్యాయం జరిగిందని నిర్ధారించుకున్నాడు. కార్మికవర్గ నాయకత్వంలో అసమ శక్తులు కలిస్తే, వాళ్లమీద ప్రత్యేక శ్రద్ధ పెట్టి కార్మిక వర్గం దానిని సమం చేస్తుందికానీ, బూర్జువా వర్గం నాయకత్వంలో కలిసినప్పుడు అసమానత పెరుగుతుంది. ఈ అవగాహనతోనే ప్రత్యేక తెలంగాణను సమర్థిస్తూ ప్రభాకర్ రెడ్డి పేరుతో పెద్ద వ్యాసం రాస్తే ఆర్వీబీ శర్మ ఆంధ్రభూమిలో అచ్చువేసిండు. ఇవన్నీ పెద్ద కథలు. చెప్పాలంటే గోరాశాస్త్రి అప్పటికే యాంటీ కమ్యూనిస్టు అయిపోయిండు. సీఐఏ పేమెంట్‌లో ఉన్నడు. నల్లమందు తినేది. నల్లమందు వేసుకుని సంపాదకీయం రాసేవాడు. అది అయిపోయేలోపు మత్తులోకి వెళ్లేవాడు. ఆయన వెళ్లిపోగానే

ఉద్యమ వార్తలన్నీ పెట్టేవాళ్లు. డెబ్భైమూడులో ఫస్ట్ టైం మేము అరెస్టు అయినప్పుడు 37 రోజులు మేము జైలులో ఉంటే ముప్పై ఏడు రోజులు పత్రికలో వార్తలు ఉండేటట్లు చూసిండ్రు. అట్లా ప్రతిరోజు చేశారు. ప్రతి తెల్లారి గోరాశాస్త్రి వార్తల్ని చూసి, ఈ వార్తలు నేనున్నప్పుడు పెట్టలేదే, ఇవెక్కడినుండి వచ్చాయి అని ఆశ్చర్యపోయేవాడు. అంటే ఈ జర్నలిస్టులిద్దరూ ఉద్యమకాలంలో జర్నలిస్టులు ఎలా పనిచేయాలనేదానికి ఎక్సాంపుల్‌గా నిలిచారు. ఇక్కడ ఫ్రెంచి విప్లవ ప్రభావాన్ని ఎందుకు చెప్తున్నానంటే, మనం సెపరేట్ తెలంగాణ ఉద్యమం ఎట్లా చూసినమంటే, చైనాలో, కల్చరల్ రెవొల్యూ షన్ టైంలో మావో చెప్పినటువంటి ఆన్ ఎడ్యుకేషన్, ఆన్ ది కాస్ అనే వాటిల్లో ఎడ్యుకేషన్ గురించి ఉన్న అభిప్రాయం విద్యార్థికి క్లాస్ రూంలో పాఠం నచ్చకపోతే నిద్రపోయే హక్కు ఉన్నది. అది టీచర్ లోపం కానీ స్టూడెంట్ లోపం కాదు. ఇది మావో సేటుంగ్ చెప్పింది. ఫ్రెంచ్ స్టూడెంట్స్ రెవొల్యూషన్‌లో ఇది రొట్టెలకోసమే కాదు, గులాబీల కోసం కూడా జరుగుతున్న పోరాటం అన్నారు. అంటే స్వేచ్ఛ కావాలన్నారు. ఈ రెండూ కూడా ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రతిఫలించాయి. నల్లమల్లారెడ్డి, షుకూర్ మెడికల్ కాలేజీ విద్యార్థులు భుజంగరావ్, ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు గోడల మీద నినాదాలు రాసిండ్రు. ఇంకొకాయన మమ్మల్ని గైడ్ చేసినవాడు పాములపల్లి సదాశివరావు. మార్క్సిజం బ్యాక్‌గ్రౌండ్‌లోంచి ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని గైడ్ చేసినవాడు. తెలంగాణలో హ్యూమన్ రైట్స్ వాయిలేషన్ మీద విశ్వజ్యోతి అనే పత్రికను తీసుకొచ్చినవాడు కె.నర్సింహారెడ్డి. తెలంగాణ ఉద్యమ సమయంలో ఇక సంచికను కంప్లీట్‌గా ఉద్యమానికి కేటాయించి, తెలుగు, ఇంగ్లీష్ రెండింటిలో ప్రింట్ చేశారు. ఇంగ్లీష్‌లోని హ్యూమన్ రైట్స్ వాయిలేషన్ ఇన్ తెలంగాణ అనే పేరుతో ఉన్న సంచికను యునైటెడ్ నేషన్స్‌కు పంపించిండ్రు. అట్లా పంపడం కోసమే ఎప్పుడూ తెలుగులో వచ్చే పత్రికను ఇంగ్లీష్‌లో తెచ్చిండ్రు. ఇంకొకాయన మహానందీశ్వర శాస్త్రి అని ఉండేవాడు. సాయుధ పోరాటం నడిచినన్ని రోజులు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్‌లో ఉండి చండ్ర రాజేశ్వరరావు చైనా మార్గమే మన మార్గం అని ప్రకటన చేసిన తర్వాత, చైనా పుస్తకాలను ట్రాన్సిలేట్ చేసి ప్రచురించాలనే ప్రతిపాదన పెట్టిండు. దానికి కమ్యూనిస్టు పార్టీ ఒప్పుకోలేదు. మాటైతే అన్నారుగానీ మావోసేటుంగ్‌ను గానీ, చైనా కమ్యూనిస్టు పార్టీనిగానీ సీరియస్‌గా

తీసుకోలేదు. ఒకవైపు చైనాలో ఉద్యమం నడుస్తున్నది. కానీ భారత కమ్యూనిస్టు పార్టీ ఒప్పుకోకుండా ఏదో చెప్పనైతే చెప్పినంగానీ, మీరంత సీరియస్‌గా తీసుకుంటే ఎట్లా అని నందీశ్వర శాస్త్రిని అన్నది. ఎందుకంటే రష్యానుండి వారికి ఆదేశాలు అందుతున్నవి. అప్పుడాయన ఇది జనాలకు చెప్పడం కోసమేగాని, ఆచరణలో లేదని అర్థం చేసుకుని బయటికి వెళ్లిపోయి త్రిలింగ ప్రచురణలు అని పెట్టి 'కొడుకులు కూతుళ్లు', 'ప్రజలమధ్య వైరుధ్యాలు' ఈ పుస్తకాలను స్వయంగా ప్రచురించాడు. ఆయనకు కమ్యూనిస్టు పార్టీ ఆదరణ పోయిన తర్వాత ఆయన వరంగల్ వచ్చి మహబూబియా పాఠశాలలో టీచర్‌గా చేరిండు. ఆయన కూడా మమ్మల్ని గైడ్ చేసిండు. ముఖ్యంగా నేను వరంగల్ పోయేనాటికే డా॥ రామనాథంగారిమీద ప్రభావం వేసిండు.

అసమ అభివృద్ధి అనేది సామ్రాజ్యవాదం స్వభావం. కాబట్టి యాభైఆరులో జరిగిన కలయిక ఏదైతే ఉన్నదో.. పెట్టుబడి.. ముఖ్యంగా విశాఖపట్నం నుండి విజయవాడ వరకు రైల్వే లైన్ వచ్చి, కృష్ణా గోదారి మీద ప్రాజెక్టు వచ్చి, అడివంతా పోయి, వేలాది ఎకరాల భూమి సాగుయోగ్యమైంతర్వాత, దానిని సాగు చేయడానికి ఒక సామాజిక వర్గం వచ్చి, పంటలు పండించి, మిగులు వచ్చింది. ఈ మిగులు ఒక సామాజిక వర్గాన్ని సంపన్న చేయడం మాత్రమే కాకుండా దళారీలను చేసింది. ఈ సర్‌ప్లస్ వ్యాల్యూ ఏ సామాజిక వర్గం గుత్త సొత్తు అయ్యిందో, బ్రాహ్మణులు, వ్యవసాయ రంగంలో కమ్మలు, గోదావరి జిల్లాల వరకు రాజులు.. అంటే కాళోజీ చెప్పిన రెండున్నర కులాల రెండున్నర సంపన్న వర్గాల.. ఏదైతే ఉన్నదో సరిగ్గా సరిపోయే మార్క్సిస్టు అవగాహన అదే. అది నిన్నటిదాకా పరిపాలించడమే కాదు, ఇప్పటికీ పరిపాలిస్తున్నదీ వాళ్లే. కాకపోతే ఇప్పుడు ఇంకొక అరలో తెలంగాణ దళారీలు కూడా కలిసి ఆ సంఖ్య ఇప్పుడు మూడైంది. ఈ అవగాహన మాకు కేఎస్ ఇచ్చిండు. శ్రీకాకుళ ఉద్యమంలో కేంద్రం అర్ధ సైనిక బలగాలను మోహరించిన తర్వాత ఉద్యమాన్ని ఏజెన్సీ ప్రాంతమైన, చిన్న ప్రాంతమైన శ్రీకాకుళానికే పరిమితం చేస్తే, తెలంగాణ ప్రాంతంలో ఇంకొక ఫ్రంటు ఓపెన్ చెయ్యకపోతే శ్రీకాకుళాన్ని కాపాడుకోలేమనే అవగాహన.. శ్రీకాకుళం ఒక చిన్న ఏజెన్సీ ఏరియా.. తెలంగాణ తొమ్మిది పది జిల్లాలు.. కనుక తెలంగాణలో ఒక ఫ్రంటు ఓపెన్ చేసి ఎనిమీ అటెన్షన్‌ను

డైవర్ట్ చేయాలి. పైగా మనం ఎనిమీ అటెన్షన్‌ను పట్టణాలలోకి, అర్బన్ ఏరియాలలోకి డైవర్ట్ చేస్తే ఎనిమీ బలహీనపడతాడు. ఇది ప్రజల్లోకి నేరుగా తీసుకెళ్తే వీళ్లకొక ప్రయోజనం ఉందనుకుంటారు. అందరూ కమ్యూనిస్టుల్లా అర్థం చేసుకోలేరు కదా.. మాలాంటి క్యాడర్‌కు చెప్పింది అది. అయితే ఈ విషయం కమ్యూనిస్టులకు అర్థం అయింది, ఎనిమీకి అర్థం అయింది. ఇనిమీకి అర్థం అయింది కనుకనే అక్కడ 370 మందిని, ఇక్కడ 370 మందిని లెక్కపెట్టినట్లు చంపిండు.

ఫ్రెంచ్ రెవొల్యూషన్ పుస్తకాలు చూపించుకుంటూ సీకేఎం, ఆర్ఈసీ కాలేజీ విద్యార్థులు తెలంగాణ ఉద్యమంలో పాల్గొనేవారు. తొమ్మిది నెలలు కాళేజీలు నడవలేదసలు. పాలిటెక్నిక్ కాలేజీ ఒక జైలు, మెడికల్ కాలేజీ ఒక జైలు, జైలు ఒక జైలు. కాలేజీలు స్కూళ్లు అన్నీ జైళ్లే. చైనాలో కల్చరల్ రెవొల్యూషన్ ఎట్లా అయితే జరిగిందో, ఎట్లైతే యూనివర్శిటీలు మూతపడ్డాయో, ఫ్రెంచి రెవొల్యూషన్‌లో ఎట్లా జరిగిందో ఈ ప్రభావాలు.. అంటే కల్చరల్ రెవొల్యూషన్ ఇంపాక్ట్, ఫ్రెంచ్ రెవొల్యూషన్ ఇంపాక్ట్, శ్రీకాకుళం మూవ్‌మెంట్ ఇంపాక్ట్.. ఈ మూడు ఇచ్చిన విలువలు కలిగిన ఉద్యమం ఇది. మున్సిపల్ కుండీలను తీసుకురావడం, బ్యారికేడ్లను ఏర్పాటు చేయడం, పోస్టాఫీసుల మీద, రైల్వేస్టేషన్లమీద, పోలీస్ స్టేషన్‌ల మీద దాడులు చేయడం.. సీసాలు తీసుకువచ్చి అందులో ఏవేవో నింపి పోలీస్ స్టేషన్‌ల మీదికి విసరడం.. పోలీసులు ఫైరింగ్ చేసుకుంటూ రాగానే పద్మాక్షమ్మ గుట్టలు ఎక్కడం.. మొత్తం యూత్ అంతా మా వెంట ఉండేవాళ్లు. వాళ్లను స్టూడెంట్స్ లీడ్ చేసేవాళ్లు. నేను సరిగ్గా సీకేఎం కాలేజీలో ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకి వెళ్లినరోజు, అక్కడే పీజీ పూర్తైన విద్యార్థులు ఇక్కడ మనకు ఉద్యోగాలు రావు, ఆంధ్రావాళ్లకు వస్తాయని స్ట్రైక్ చేస్తున్నారు. అట్లా తెలంగాణ ఉద్యమం మార్క్సిస్టు అండర్‌స్టాండింగ్‌తో నడిచింది. అందులో మెడికల్ కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీ క్యాడరంతా మావాళ్లే కాబట్టి.. భుజంగరావు, చిరంజీవి మొదలైనవాళ్లంతా మావాళ్లే. ఈ విధంగా చూసినమేం తెలంగాణ ఉద్యమాన్ని ఎట్లా చూసినమంటే పెట్టుబడి వచ్చి, ప్రాజెక్టులు వచ్చి, రైల్వే లైన్లు వచ్చి, సర్‌ప్లస్ వచ్చినటువంటి ఒక సమాజం, ముఖ్యంగా ఇవాళ మనం కోస్తా జిల్లాలు లేదా డెల్టా జిల్లాలుగా పిలుచుకుంటున్న సమాజం చేతుల్లోకి

ఆంధ్రప్రదేశ్ సంపదంతా వచ్చి సర్‌ప్లస్ అంతా వచ్చి ఒక సంపన్న వర్గం ఏర్పడింది. సంపన్న కులం నుండి వచ్చిన సంపన్న వర్గం ఏర్పడింది. వాళ్ల పరిపాలన అయ్యింది యాభైఆరులో. ఇది అసమ అభివృద్ధికి దారితీసింది. ఇదేమో మధ్యయుగాలను మరిపించేటువంటి ఫ్యూడలిజం బ్యాక్‌గ్రౌండ్‌నుండి వచ్చిన హైదరాబాద్ స్టేట్.. తెలంగాణ.. కనుక ఈ అసమ అభివృద్ధి జాతుల సమస్య, తెలుగు జాతి అంతా ఒక్కటనే భావన ఎలా ఉన్నా అసమ అభివృద్ధి అనేది దానికంటే బలమైంది కాబట్టి స్టాలిన్ చెప్పినట్లుగా తప్పకుండా మనం జాతుల పోరాటాల్ని బలపర్చాలి. అది వాస్తవమే కాని ఆ అర్థంలో యూదు జాతి కోసం ఇజ్రాయెల్‌ను ఏర్పాటు చేయడం మనం బలపర్చం కదా.. పాలస్తీనాను మనం బలపర్చం కదా.. అందులో ప్రోగ్రెస్ ఏంటో కూడా చూస్తాం.. కార్మికవర్గ ప్రయోజనమేంటో కూడా చూస్తాం.. ఆ ప్రయోజనం రీత్యా ఆంధ్రా, తెలంగాణల కలయిక అన్యాయమైంది. మొదటి నుండి కూడా ఇది సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటమే. నిజాం కాలం నుండి తెలంగాణలో జరిగిన అన్ని పోరాటాలూ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలే. భూస్వామ్య వ్యతిరేక పోరాటాలే. కొమురం భీం, రాంజి గోండు చేసిన పోరాటాలు కూడా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలే. అసలు బ్రిటీష్ వాడు మనదగ్గర ఇప్పుడే కాదు ఎప్పుడూ ఉన్నాడు. హైదరాబాద్ సంస్థానం ద బిగ్గెస్ట్ అండ్ రిచ్చెస్ట్ సంస్థానం కాబట్టి ఇంగ్లిష్ వాళ్లు చాలా స్నేహం చేసిండ్రు. కనుక నిజాంకాలంలో జరిగిన పోరాటాల్ని కూడా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలుగా చూడాలి.

**4. తెలంగాణ వాదంలోని అన్ని పార్శ్వాలు కవిత్వంలో ప్రతిఫలించాయా?**

**జవాబు** : ఈ ప్రశ్నకు సమాధానం కవితలన్నీ పెట్టుకుని అధ్యయనం చేసి చెప్పాలి. ఎంత చెప్పినప్పటికీ 68, 69 మూవ్‌మెంటు ఉద్యమం అంత విస్తృతంగా వచ్చినప్పటికీ అందులో విద్యార్థులు, యువకులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, డాక్టర్లు ప్రధానంగా ఉన్నారు. కొత్త అర్బన్ కూడా .. అర్బన్ క్యారెక్టర్ గూడ టౌన్స్ వరకు.. తెలంగాణలో టౌనంటే పెద్ద పల్లెటూరే అయినప్పటికిగూడా.. ఇదొకటైతే.. పెద్ద సమస్య నిరుద్యోగం, చదువు ఇటువంటివి. కానీ ఇప్పటి ఉద్యమం ముఖ్యంగా రైతులు, భూమి.. ఉదాహరణకు

ఏటూరు నాగారం ప్రాంతంలో ఒక అగ్రాహారీకుని భూమి స్వాధీనం చేసుకోవాలని చెప్పినం. గుంటూరు నుంచి వచ్చినటువంటి మర్చి, పత్తి పండించేటోండ్ల భూములు ఆక్యుపై చేసుకోవాలని చెప్పినం. అది విప్లవోద్యమ ప్రభావం ఉన్నచోట. కొద్దిగా రంగారెడ్డి జిల్లాలోని ప్రాంతంలో కూడా చెప్పినం. అదీ కొద్ది కొద్దిగానే. కానీ ఇప్పుడు ఒక పెద్ద అప్‌సర్జ్. అంటే ఒక డెమోక్రటిక్ స్ట్రగుల్ కోసం అప్‌సర్జ్. సబ్బండ రాశులు పాల్గొన్నరు. అన్ని కులాలు కటింగ్ ఎక్రాస్. అన్ని మతాలు. వర్కర్స్.. సింగరేణి వర్కర్స్.. ఆర్టీసీ వర్కర్స్.. ఎలక్రిసిటీ వర్కర్స్.. ఇంత వర్కింగ్ క్లాస్.. వర్కింగ్ క్లాస్ వర్కింగ్ క్లాస్‌గా పార్టిసిపేట్ చేసిందా అంటే మళ్లీ అదొక యాస్పెక్ట్ గానీ, వాళ్లంతా వర్కర్స్. మనకవసరమైన ఫోర్స్.. ఉత్పత్తి కులాల నుంచి వచ్చినవాళ్లు.. ఇంతమంది పాల్గొన్నరు. ఈ పాల్గొన్నదాని యొక్క అద్భుతమైన రిఫ్లెక్షన్ కళారూపాల్లో కన్పించింది. దృష్య, మౌఖిక కళారూపాలన్నింట్లల్ల కనిపించింది. చరిత్ర పరిశోధనలో కనిపించింది. వ్యాసంలో కనిపించింది. పెద్దింటి అశోక్ కుమార్‌లాంటి వారు రాసిన రచనల్లో, కథల్లో, నవలల్లో కనిపించింది. కవిత్వంలో సిధారెడ్డి, దర్భశయనం.. తక్కువ. ఈ ప్రపోర్షన్‌తో పోలిస్తే.. ముఖ్యంగా పాట తీసుకుంటే.. కవిత్వాన్ని పాటను వేరు చేసి చూడటమే తప్ప పాటలో అద్భుతమైన కవిత్వం వచ్చింది. గోరటి వెంకన్న పాటల్లో అది కనిపిస్తుంది. సరే ఆయన పాటల్లో చెప్పిన కొన్ని అభిప్రాయాలతోటి.. ఇండియా పాకిస్తాన్‌లాగా వేరైపోతామా ప్రజలకు అప్పీల్ చేసే ఒక అప్పీలిస్ట్‌కే అయితది తప్ప మనం చెప్పాల్సిన మాట కాదది. అటువంటివి మినహాయిస్తే.. అట్లే నువ్వు తినేది దోస, నేను తినేది అట్టు.. ఇటువంటివి చిన్న విషయాలుగాని, అదర్‌వైస్ గూడ తెలంగాణ జీవితాన్ని అద్భుతంగా చిత్రించేవి.. ఒకరకంగ చెప్పాల్నంటె చాలా టైమ్లీగా వచ్చిన కవి ఆయన. అదిగదిగో అమెరికోడొచ్చిండు.. పొడుస్తున్న పొద్దు మీద తెలంగాణ.. ఇట్ల రెండు మూడు పాటలు మినహాయిస్తే.. తెలంగాణ పాటలన్నీ వచ్చింది.. గోరటి వెంకన్న, గూడ అంజయ్య, అందెశ్రీ, జయరాజు ఇటువంటివాళ్లు అన్నిట్లల్ల నీకు.. వాళ్లు ఎంత ఉద్దేశించినమని చెప్పడం కాదుగని, అన్నీ యాంటీ ఇంపీరియలిస్టు పాటలే. అటువంటి కవిత్వం అంత రాశిలో ఉన్నది. మొట్టమొదటి కవితా సంకలనం.. మంజీరా రచయితల సంఘం వేసిన 'మొగులైంది' కూడా యాంటీ ఇంపీరియలిస్టే. మంజీరా రచయితల సంఘం చాలా

కాన్షియస్‌గా ఈ పని చేసింది. విప్లవ రచయితల సంఘం రాష్ట్రవ్యాప్తంగా చేయని పనులు, ఒక్క మెదక్ జిల్లాలో మంజీరా రచయితల సంఘం చేసింది. అంటే వాళ్లు తెలంగాణ ఇష్యూను కాంప్రహెన్సివ్‌గా తీసుకున్నరు. కల్తీ కల్లు, సారా వ్యతిరేకం, చేతబడి, తెలంగాణ ఫ్యూడల్ దాడి వల్ల వచ్చినటువంటి అన్ని అవలక్షణాలకు వ్యతిరేకంగా పోరాడడం.. వీటన్నింటి వెనుక సామ్రాజ్యవాదాన్ని, భూస్వామ్యాన్ని చూడడం.. ఇది మంజీరా రచయితల సంఘం.. బహుశా వాళ్ల ఇరవయ్యేండ్ల సభల్నుంచి ముప్పైయ్యేండ్ల సభల వరకు.. నైంటీ నుండి దాదాపు తెలంగాణ వచ్చేవరకు వాళ్లు సాహిత్యాన్ని తెచ్చింద్రు. కనుక ఇక్కడ వైవిధ్యం కనపడుతది. పాలమూరులో కనపడ్డది. విప్లవోద్యమ శక్తులున్నచోటల్లా కనిపిస్తది. లేదా ఈ శక్తులు లేకున్నా, యాంటీ ఇంపీరియలిస్టులు ఉన్నచోటైనా.. వరంగల్‌లో తక్కువ.. విప్లవ సాహిత్యం వచ్చినంత ఇదిగా రాలేదని నేననుకుంటున్న.. అది మళ్లీ చూడాలె. ఇదంతా విప్లవోద్యమం బ్యాక్‌గ్రౌండ్‌గా ఉన్నచోట కనిపించే పరిస్థితి. లేని చోట, తెలంగాణ వాదులుగానే వచ్చినచోట పీపుల్ మధ్య ఈ పోలికలు.. అభిరుచుల మధ్య పోలికలు.. జీవన శైలిపట్ల పోలికలు.. ఇగ అక్కడ వర్గం లేదు కులం లేదు.. ఆంధ్రా తెలంగాణ అంతే.. ఈ ఆంధ్రా తెలంగాణ విభజనతోటే వచ్చిన చోట చాలా పలచనైంది కవిత్వం. అట్లగాక దీన్ని భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేకతతో.. లేదా ఈ రెండూ లేనిచోట స్వీయ గౌరవం ఉండొచ్చు.. స్వీయ గౌరవం ఉన్నచోట, స్వావలంబన ఉన్నచోట.. నా కాళ్లమీద నేను నిలబడాలి.. నా చదువులు నాకు కావాలి.. నన్ను మాదిగ కనుక తక్కువ చూస్తున్నరు.. ఈ భావనల్తో రాసినవాళ్లకు ఇవన్నీ ఉండకపోవచ్చు.. నేను వివక్షకు గురవుతున్న అనే చైతన్యం విపరీతంగా పెరిగింది తెలంగాణ ఉద్యమంలో. ఆ చైతన్యం నుంచి వచ్చిన కవిత్వమంత బాగున్నది.

దాదాపుగా అన్ని పార్శ్వాలూ వచ్చాయి. సింగరేణి కార్మికులకు జరిగే అన్యాయాలు కవిత్వంలోకొచ్చాయి. అన్ని పార్శ్వాలొచ్చాయి. ఇదేంటంటే ముఖ్యంగా, గ్రామగ్రామన శిబిరాలు ఏర్పాటు చేయడం వలన, అన్నిచోట్ల జేయేసీలు ఏర్పడటం మూలంగా విపరీతంగా క్రియేటివిటీ బయటికొచ్చింది. ఈ క్రియేటివిటీ అంతట వ్యక్తమవుతదిగద.. ఒక్కచోట ఆగదది.. అంత పెద్ద ప్రవాహమది.. ఎక్కడికక్కడ మత్తడి వడ్డది. కనుక

సహజంగనే అన్నిట్లట్లకొచ్చిందది.

**5. వచన కవిత్వం, పాటల్లో ప్రత్యేక తెలంగాణ విస్తృతంగా వ్యక్తమైంది గానీ ఇతర సాహిత్య ప్రక్రియల్లో కనిపించక పోవడానికి కారణాలు ఏమిటి?**

**జవాబు** : కవిత్వం, పాట ఒక హైయర్ ఎమోషన్‌లో వస్తయి. తెలంగాణ ఉద్యమంలో హైయర్ స్టేజ్ ఎమోషన్‌లోనే పాట, కవిత్వం వచ్చినయి. మిగతా సాహిత్య ప్రక్రియలు వెనువెంటనే రావడానికి అంత టైం లేకుండింది.

**6. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం సమాజం మీద వేసిన ప్రభావం ఎటువంటిది?**

**జవాబు** : కవిత్వం ప్రధానంగా మిడిల్‌క్లాస్‌ను ఆలోచింపజేసింది. అందులో రోల్ ఎక్కడంటే ఇతరులు ఇందులో న్యాయమున్నదని గుర్తించడం. పాటేమో ఇక్కడి ప్రజలను అమితంగా ఉత్తేజపర్చడానికి, వాళ్లను ఉద్యమంలోకి తీసుకురావడానికి ఉపయోగపడ్డది. కానీ కవిత.. నిజానికి సిధారెడ్డి రాసిన ఒక కవిత, పాపినేని శివశంకర్‌కు రీచ్ అయితే సిధారెడ్డిలాంటి కవి.. నాలాంటి సీరియస్ కవి గూడా తెలంగాణను బలపరుస్తున్నడంటే ఎక్కడో ఉండి ఉండాలెగదా న్యాయము.. అనుకుంటరు గద.. అంత మంచి స్నేహితులు, నిన్నటిదాకా కలిసినోళ్లు, ఇవాళ తెలంగాణ అంటున్నరంటే శివారెడ్డిని తండ్రిలాంటివాడిగా పోల్చినవాడు.. తెలంగాణ కావాలంటున్నడంటే ఎక్కడో అన్యాయం జరగంది ఆయన ఈ మాట ఎందుకంటడని ఆయనకనిపిస్తదిగద. ఉదాహరణ చెప్తున్న. అట్లా అనిపించిందా లేదా అన్నది వేరే. అట్లాగే జయశంకర్ పోయి అక్కడ ఉపన్యాసాలిస్తే ఎంత కన్విన్స్ అయ్యిండ్రు.. ప్రతి ఒక్కళ్లు చెప్పిండ్రు.. ఆయన మాట్లాడినట్లు మాట్లాడితే మేమంత కన్విన్స్ అయితమని. అందుకే ఆయన్ను పిలిచిండ్రుగద రాయలసీమకు, ఆంధ్రకు.. హరగోపాల్ ఉపన్యాసాలు.. నేనీ ఉదాహరణలు స్థాయి కొరకు చెప్తున్న.. ఇటువంటి బ్యాక్‌గ్రౌండ్ నుండి డెమోక్రటిక్ కవిత్వం ఏదైతో ఒచ్చిందో.. ముఖ్యంగా నువ్వనే వచన కవిత్వం రోల్ డెఫనెట్‌గా చాలా ఉన్నది. మిడిల్ క్లాస్‌ను, చదువుకున్నవాళ్లను, అవును

మనం గూడ స్వీయ పరిశీలన చేసుకోవల్సింది, మనం గూడ ఆలోచించాలి అనుకునేట్లు చేసింది. నువ్వన్నట్లు తెలంగాణ ఉద్యమం మొత్తం దేశవ్యాప్తంగానే స్వీయ గౌరవం విషయంలో.. మనం దాన్ని అస్తిత్వం అన్నాం.. పోనీ అస్తిత్వమే అందాం.. అస్తిత్వం కోసం, స్వీయ గౌరవం కోసం, ఐడెంటిటీ కోసం చేసే స్ట్రగుల్స్ అన్నింటికి ఓ బాట వేసింది. మనం అస్తిత్వాలను యాంటీ ఇంపిరియలిస్ట్‌లో భాగంగ చూసినం.

**7. చివరి దశల ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం రాసిన వాళ్లలో ఎక్కువగా యువతరం ఉన్నారు. భవిష్యత్ తెలుగు కవిత్వానికి వారు భరోసా నివ్వగలరు అని చెప్పగలరా?**

**జవాబు** : బలమైన ప్రాపంచిక దృక్పథాన్ని గనుక పెంపొందించుకుంటే మంచి కవులుగా రూపొందే అవకాశం ఉన్నది. నిజానికి పొన్నాల బాలయ్య కవిత్వానికి ముందు మాట రాసిన నేను. ఎంత పవర్‌ఫుల్ పోయెట్రీ! భాషకు ఎంత కాంట్రిబ్యూషన్ ఉన్నదాయనది! తెలంగాణ భాష, దళిత భాష, అందులో మాదిగ భాష.. నేను ముఖ్యంగా, జెండర్, ముస్లిం మైనార్టీ, దళిత్ సాహిత్యం.. వీటిద్వారా చాలా సుసంపన్నం అయిందేంటంటే భాష. ఎంత డిక్షన్ వచ్చి చేరిందిండ్ల! అట్ల తెలంగాణ అద్భుతమైన డిక్షన్‌ను తెచ్చింది. ఇది పాటల్లో ఎట్లొచ్చిందో, కవిత్వంలో అట్లే వచ్చింది. సిధారెడ్డి కవిత్వంలో ఎన్ని తెలంగాణ మాటలుంటయి.. కాశీం కవిత్వంలో ఎన్ని తెలంగాణ మాటలుంటయి.. నీ కవిత్వంలో ఎన్ని తెలంగాణ మాటలుంటయి.. ఇవి తెచ్చిపెట్టుకున్నయి కాదు.. మీరింట్లో మాట్లాడేది.. ఎట్లాగైతే పోయెట్రీని ఎమోషన్ యొక్క హైయర్ స్టేజ్ అంటమో.. మామూలుగా ఇట్లాంటి ఉద్యమాల్లో హైయర్ స్టేజ్ ఎమోషన్‌లోనే మాట్లాడడమైనా రాయడమైనా చేస్తం. అప్పుడే నీ భాష వచ్చేస్తదండ్లకు. అప్పుడు నువ్వు ఒకరకమైనటువంటి సబ్‌కాన్షియెస్‌లో ఉంటవు. కాన్షియస్‌గా వాడినప్పుడు నీకు పుస్తకంల నుంచి మాట వస్తది. హైయర్ స్టేజ్‌లు పోయినప్పుడు గుండెల నుంచి మాటొస్తది. ఈ గుండెల నుంచి వచ్చేదే నీ అసలు మాతృభాష. ఆ మాతృభాష వచ్చేసింది తెలంగాణ కవిత్వంలో. పాటల్లో అద్భుతంగా వచ్చింది.. కవిత్వంలో కూడా వచ్చింది.

వ్యక్తీకరణపరంగా చాలా అద్భుతమైన కవిత్వం వచ్చింది, సరైన ప్రాపంచిక దృక్పథం ఏర్పర్చుకుంటే మంచి కవులు కాగలరు. భాష మనం నేర్చుకోవాలె, ప్రయోగం మనం నేర్చుకోవాలె. మనకు ఒక గివెన్ టర్మినాలజీ ఉంది. ఈ గివెన్ టర్మినాలజీ అరిగిపోతది. క్రియేటివిటీ పోతది. ఉదాహరణకు మనం సామ్రాజ్యవాదం అంటున్నం. రష్యన్ సోషల్ సామ్రాజ్యవాదం, అమెరికన్ సామ్రాజ్యవాదం అంటున్నం. సడన్‌గా ఆఫ్రికన్ రైటర్స్ వోడ్కా సామ్రాజ్యవాదం, కోకాకోలా సామ్రాజ్యవాదం అన్నరు. అది ఎంత బాగనిపిస్తది.. ఇక్కడ తెలంగాణ నుంచి వచ్చిన కవిత్వం అటువంటి మాటలు వాడింది. అయితే జీవితం ఇచ్చే జీవద్భాష నేర్చుకోవాలి, పాలిటిక్స్ ఇచ్చే దృక్పథాన్ని అలవర్చుకోవాలి.

**8. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం మీద ఏ యే కోణాల్లో పరిశోధనలు చేయవచ్చు?**

**జవాబు** : ఇంతకు ముందు చెప్పిన సమాధానాల్లోనే ఈ విషయం చెప్పాను.

**9. ఇతర అస్తిత్వ వాదాల కవిత్వానికి, తెలంగాణ అస్తిత్వవాద కవిత్వానికీ బేధం ఏమిటి? వాటికి వచ్చినంత గుర్తింపు తెలంగాణ కవిత్వానికి వచ్చిందని భావిస్తున్నారా?**

**జవాబు** : అంటే ఇతర అస్తిత్వ వాదాల్లో చాలా వేదన ఉన్నది గద.. ఇక్కడ గూడ కల్చరల్ యాస్పెక్ట్ ఉన్నది, లాంగ్వేజ్ యాస్పెక్ట్ ఉన్నది గానీ, అక్కడ అంటరానితనం, పితృస్వామ్యం.. ఇంటినుంచి బయల్దేరినయవి. స్త్రీ విషయంలోనేమో ఇంటినుంచి బయల్దేరినవి. భర్త, తండ్రి, కొడుకు.. ఆ పెయిన్ ముందర ఈ పొలిటికల్ ఎకానమీ సమస్య కొంత తక్కువ. కానీ గాయమేదైతే ఉందో.. ఈ గాయం దళితుని గాయం, స్త్రీ గాయం.. ముస్లిం మైనార్టీ గాయం.. సెకండరీ సిటిజన్‌గా చూడబడటం.. ఇన్‌సెక్యూరిటీ.. వీటితో పోలిస్తే తెలంగాణ ఒక ఎస్సర్షన్. అంత పెయిన్ నుండి వచ్చిన ఎస్సర్షన్ కాదది.

**10. తెలుగు వచన కవితా ప్రస్తానంలో ప్రత్యేక తెలంగాణోద్యమ స్థానం ఏమిటి?**

**జవాబు** : దీన్ని యాంటీ ఇంపీరియలిస్ట్ స్ట్రగుల్‌గా చూసినప్పుడు తెలుగు సాహిత్యానికి ఒక అద్భుతమై చేర్పుగా చూడాలి. జెండరూ అంతే, కులమూ అంతే, ముస్లిం మైనార్టీలంతే.. ముస్లిం మైనార్టీ సహజంగానే వాళ్లకుండేటువంటి భౌగోళిక, చారిత్రక నేపథ్యం వల్ల అది యాంటీ ఇంపీరియలిస్ట్‌గనే ఉంటది. ఎటువైపునుండనేది వేరే విషయం. ఆ విషయంలో తెలంగాణ వాదమే ఉండేటువంటి దళితులకు తప్ప, ముస్లింలకు యాంటీ ఇంపీరియలిస్ట్ నేచర్ ఉన్నది. అందుకే పుట్టుమచ్చలాంటి కవిత వచ్చింది.

# ఉపయుక్త గ్రంథసూచి


1. అమర్. 2008. ***చితా భస్మం లోంచి....*** హైదరాబాద్. విరసం. ప్రథమ ముద్రణ.
2. అయిలయ్య, బన్న. ***1969 తెలంగాణ ఉద్యమం ప్రజాకవి కాళోజీ కవిత్వం.*** హన్మకొండ. నానీ ప్రచురణలు. ప్రథమ ముద్రణ.
3. అయిలయ్య, బన్న. 2006. ***తెలంగాణ సాహిత్య సాంస్కృతిక చైతన్యం.*** వరంగల్. నానీ ప్రచురణలు. ప్రథమ ముద్రణ.
4. అశోక్ కుమార్, మోతుకూరి. 2004. **కొల్లుపులోల్లం.** కామారెడ్డి. విశ్వసాహితి ప్రచురణలు. ప్రథమ ముద్రణ.
5. అశోక్ కుమార్, మోతుకూరి. 2006. ***పిట్టగూడు.*** నిజామాబాదు. స్ఫూర్తి సాహితి. ప్రథమ ముద్రణ.
6. అశోక్, టంకశాల. 2009. 2009 ***ఎన్నికలు ప్రాంతీయ బడుగు పార్టీలకు హెచ్చరిక.*** హైదరాబాద్. అనుపమ ప్రింటర్స్. ప్రథమ ముద్రణ.
7. అహ్మద్‌ఖాన్, షహబాజ్. 2011. ***ఓ గెలుపుకోసం.*** హైదరాబాద్ అడుగుజాడలు. ప్రథమ ముద్రణ.
8. ఆజం అలీ. 2001. **హెచ్చరిక.** హైదరాబాద్. విరసం. ప్రథమ ముద్రణ.
9. ఆళ్వారుస్వామి, వట్టికోట. 2009. ***తెలంగాణం వ్యాసాలు.*** హైదరాబాద్. తెలంగాణ రచయితల వేదిక. ద్వితీయ ముద్రణ.
10. అంజయ్య, తైదల. 2006. **పునాస. సిద్ధిపేట.** మంజీర రచయితల సంఘం. ప్రథమ ముద్రణ.
11. అంజయ్య, తైదల. 2012. ***ఎర్రమట్టి బండి.*** కరీంనగర్. మంజీర రచయితల సంఘం. ప్రథమ ముద్రణ.
12. ఇక్బాల్, పరిమళ్, ఉదయమిత్ర. 2009. ***దు:ఖాగ్నుల తెలంగాణ.*** మహబూబ్ నగర్. పాలమూరు అధ్యయన వేదిక. ప్రథమ ముద్రణ.
13. ఇందూరు కవులు. 2010. ***ఒకటే మాట తెలంగాణ.*** నిజామాబాద్. స్నేహ ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

14. ఉదయమిత్ర, ఉజ్వల్, ఉదయ్, ఉల్క, మాలిక్. 1996. **దేవులాట.** హైదరాబాద్. ప్రభాత ప్రచురణలు. ప్రథమ ముద్రణ.
15. ఉదయ్ భాను, దానక్క. 2010. ***జంగ్.*** హైదరాబాద్. తెలంగాణ విద్యార్థి వేదిక. ప్రథమ ముద్రణ.
16. ఉపేందర్, యెన్నం. 2001. ***కర్రు పుట్టింది.*** హైదరాబాద్. స్వీయ ప్రచురణ. ప్రథమ ముద్రణ.
17. ఉపేందర్, యెన్నం. 2010. **నారుమడి.** హైదరాబాద్. పాలపిట్ట. ప్రథమ ముద్రణ.
18. ఎల్లారెడ్డి, కర్ర. 2010. ***మన తెలంగాణ (1947-1969).*** హన్మకొండ. తెలంగాణ సాహితి పబ్లికేషన్స్. ప్రథమ ముద్రణ.
19. ఎల్లన్న, దరువు(సంపా). 2011. ***ఓ యుద్ధం.*** హైదరాబాద్. దరువు ప్రచురణలు. ప్రథమ ముద్రణ.
20. కాళోజి. 2012. ***కాళోజీ నా గొడవ కవితలు.*** వరంగల్లు-హైదరాబాదు. కాళోజీ ఫౌండేషన్. ప్రథమ ముద్రణ.
21. కాశీం, సి. (సంపా). 2010. ***ఉద్యమాల తొలిపొద్దులు.*** హైదరాబాద్. స్నేహ ప్రచురణలు. ప్రథమన ముద్రణ.
22. కాశీం, సి. 2016. ***తెలంగాణ స్టూడెంట్స్ ఫ్రంట్ చరిత్ర.*** హైదరాబాద్. నడుస్తున్న తెలంగాణ. ప్రథమ ముద్రణ.
23. కాశీం. 2003. ***నేను తెలంగాణోన్ని మాట్లాడుతున్న.*** హైదరాబాద్. స్నేహ ప్రచురణలు. ద్వితీయ ముద్రణ.
24. కాశీం. 2015. ***కాశీం కవిత్వం 1994 - 2014.*** హైదరాబాద్. స్నేహ. ప్రథమ ముద్రణ.
25. కాశీం. 2015. ***తెలంగాణ సాహిత్యం. హైదరాబాద్.*** స్నేహ ప్రచురణలు. ప్రథమ ముద్రణ.
26. కాంచనపల్లి. 2001. **తండ్లాట.** హైదరాబాద్. తెలంగాణ రచయితల వేదిక. ప్రథమ ముద్రణ.

27. కాంతారావు, వరిగొండ. 2002. **ఝరి.** వరంగల్లు. సాహితి సమితి. ప్రథమ ముద్రణ.

28. కింగ్‌షుక్ నాగ్. 2012. ***తెలంగాణ ఉద్యమం చారిత్రక నేపథ్యం.*** న్యూ ఢిల్లీ. రీమ్ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్. ప్రథమ ముద్రణ.

29. ***క్విట్ తెలంగాణ.*** 'సింగిడి' తెలంగాణ రచయితల సంఘం. ప్రథమ ముద్రణ.

30. కృష్ణమాచారి, దాసోజు. 2007. **వన్నె.** హైదరాబాద్. వీరభోగ వసంతరాయల ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

31. కృష్ణమూర్తి, కే. 2010. ***మహోద్యమం.*** హైదరాబాద్. తెలంగాణ లెక్చరర్స్ ఫోరం. ప్రథమ ముద్రణ.

32. కృష్ణారెడ్డి, బైరెడ్డి. 2002. **ఆర్తి.** నల్గొండ. స్వీయ ప్రచురణ. ప్రథమ ముద్రణ.

33. కృష్ణారెడ్డి, బైరెడ్డి. 2007. **ఆర్తి.** హైదరాబాద్. స్వీయ ప్రచురణ. ప్రథమ ముద్రణ.

34. కోటేశ్వరరావు, కోయి. 2010. **కావడి కుండలు.** హైదరాబాదు. చరిత ఇంప్రెషన్స్. ప్రథమ ముద్రణ.

35. కోదండరామ్, యమ్. 2008. ***తెలంగాణ ముచ్చట.*** హైదరాబాదు. రామయ్య విద్యాపీఠం. ప్రథమ ముద్రణ.

36. గఫూర్ శిక్షక్, సిరిసిల్ల. 2014. ***గుండెలవిసిన చోట.*** కామారెడ్డి. తెలంగాణ రచయితల వేదిక. ప్రథమ ముద్రణ.

37. గంగాధర్, మంచాల. 1994. ***ఆధునిక తెలుగు కవిత్వంలో విప్లవ ధోరణులు – ఒక విశ్లేషణ.*** వరంగల్. ప్రాణహిత ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

38. గాలిరెడ్డి, వంగా (సంపా). 2011. ***కదం కదం.*** సిద్ధిపేట. మైత్రి మిత్రమండలి. ప్రథమ ముద్రణ.

39. గుడిపాటి (సంపా). 2009. ***ఊరి చివర.*** హైదరాబాద్. పాలపిట్ట. ప్రథమ ముద్రణ.

40. గుడిపాటి. 2005. **సహజాతం.** కోదాడ–హైదరాబాద్. చుక్కా రామయ్య విద్యాపీఠం. ప్రథమ ముద్రణ.

41. గుడిపాటి. 2006. **అభివ్యక్తి.** హైదరాబాద్. స్పృహ సాహితీ సంస్థ. ప్రథమ ముద్రణ.

42. గోదావరి సాహితీ మిత్రులు. 2011. **హస్తైదుల.** వరంగల్లు. బందగీ ప్రచురణలు. తృతీయ ముద్రణ.

43. గౌతం పింగ్లే. 2015. **పడిలేచిన తెలంగాణ.** హైదరాబాద్. ఓరియంట్ బ్లాక్‌స్వాన్. ప్రథమ ముద్రణ.

44. గౌరీశంకర్, జూలూరు. 2002. **కాటు.** కోదాడ. స్పృహ సాహితీ సంస్థ. ప్రథమ ముద్రణ.

45. గౌరీశంకర్, జూలూరు. 2002. **పొక్కిలి.** కోదాడ. స్పృహ సాహితీ సంస్థ. ప్రథమ ముద్రణ.

46. గౌరీశంకర్, జూలూరు. 2004. **ముండ్ల కర్ర.** కోదాడ–హైదరాబాద్. స్పృహ సాహితీ సంస్థ. ప్రథమ ముద్రణ.

47. గౌరీశంకర్, జూలూరు. 2005. **నాలుగోకన్ను.** కోదాడ–హైదరాబాద్. స్పృహ సాహితీ సంస్థ. ప్రథమ ముద్రణ.

48. గౌరీ శంకర్, జూలూరు. 2008. **సెగ.** హైదరాబాద్. తెలంగాణ రచయితల వేదిక. ప్రథమ ముద్రణ.

49. చక్రపాణి, గంటా. 2006. **సామాజిక సందర్భం.** హైదరాబాద్. అనేక పబ్లికేషన్స్. ద్వితీయ ముద్రణ.

50. చక్రపాణి, గంటా. 2009. **బొగ్గుపొరల్లో అగ్గిబావుటా.** హైదరాబాద్. వుమేష్ పేపర్ బాక్స్. ప్రథమ ముద్రణ.

51. చంద్రమోహన్, కోయ, చక్రవర్తి, తంగిరాల. 2016. **తెలంగాణ దర్శిని.** హైదరాబాద్. నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్. ప్రథమ ముద్రణ.

52. చంద్రశేఖరరెడ్డి, రాచపాళెం. 2016. **కవుల తెలంగాణం.** హైదరాబాదు. నవచేతన పబ్లిషింగ్ హౌస్. ప్రథమ ముద్రణ.

53. చంద్రశేఖర్ రెడ్డి, గోపిరెడ్డి. 2010. **తెలంగాణ జనని.** హైదరాబాద్. తెలంగాణ పరిరక్షణ సమితి. ప్రథమ ముద్రణ.

54. చెంచయ్య, వి. 2001. **సాహిత్య దృక్పథం.** నెల్లూరు. విరసం నెల్లూరు జిల్లా యూనిట్. ప్రథమ ముద్రణ.

55. చెన్నప్ప, మసన. 2013. ***తెలంగాణోదయం.*** హైదరాబాద్. ప్రమీలా ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

56. చైతన్య ప్రకాశ్. 2009. ***మూయని దర్వాజ.*** కరీంనగర్. ఈరజాల ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

57. చౌదరి, కె.ఆర్. 2011. ***వ్యవసాయం – ప్రపంచీకరణ.*** హైదరాబాద్. వీక్షణం పబ్లికేషన్స్. ప్రథమ ముద్రణ.

58. జగన్నాథం, జూకంటి. 2000. ***వాస్కోడిగామా.కామ్.*** సిరిసిల్ల. వరంగల్ రచయితల సంఘం. ప్రథమ ముద్రణ.

59. జగన్నాథం, జూకంటి. 2002. ***బొడ్డుతాడు.*** సిరిసిల్ల. నయనం ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

60. జగన్‌రెడ్డి, ఎన్ (సంపా). 2012. ***జులూస్.*** హైదరాబాద్. తెలంగాణ సాహితి. ప్రథమ ముద్రణ.

61. జయశంకర్, కె. 2011. ***తెలంగాణలో ఏమి జరుగుతోంది?.*** హైదరాబాద్. సంగం మీడియా గ్రూప్. తృతీయ ముద్రణ.

62. జయశంకర్, కొత్తపల్లి. 2015. ***తెలంగాణ రాష్ట్రం ఒక డిమాండ్.*** హైదరాబాద్. సంగం మీడియా గ్రూప్. తృతీయ ముద్రణ.

63. జితేంద్రబాబు, కుర్రా. 2012. ***హైదరాబాద్ సంస్థానం – ప్రజా ఉద్యమాలు (1900–1950).*** హైదరాబాద్. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాదు. ప్రథమ ముద్రణ.

64. జితేంద్రబాబు, కె. 2007. ***తెలంగాణలో చైతన్యం రగిలించిన నిజాం రాష్ట్రాంధ్ర మహాసభలు రెండవ భాగం.*** హైదరాబాద్. సాహితీ సదన్. ప్రథమ ముద్రణ.

65. జీవన్. 2007. ***గ్లోబలిపీఠం.*** ఖమ్మం. ప్రతిభ ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

66. జె.సి. 1991. ***కవిత్వం – గతితార్కికత.*** హైదరాబాద్. సృజన ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

67. డబ్బీకార్, రూప్‌కుమార్. 2006. ***స్వప్నశబ్ధం.*** హైదరాబాద్. వారుణి పబ్లికేషన్స్. ప్రథమ ముద్రణ.

68. తిరుమలరావు, జయధీర్. 1994. ***జానపద చారిత్రక గేయగాథలు.*** హైదరాబాద్. సాహితీ సర్కిల్ హైదరాబాదు. ప్రథమ ముద్రణ.

69. తిరుమలరావు, జయధీర్. 2013. ***బయ్యారం ఖ'నిజం' ఎవరిది?.*** హైదరాబాద్. కూడలి ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

70. తిరుమలి, ఇనుకొండ. 2008. ***తిరగబడ్డ తెలంగాణ.*** హైరదాబాద్. హైదరాబాద్ బుక్ ట్రస్టు. ప్రథమ ముద్రణ.

71. దాగ్మార్ బెర్న్‌స్టార్ఫ్, హ్యూగ్ గ్రే. 2007. ***ఆంధ్రప్రదేశ్ రాజకీయ వ్యవస్థ–తెలంగాణ రాజకీయాలు.*** హైదరాబాద్. హైదరాబాద్ బుక్ ట్రస్టు. ద్వితీయ ముద్రణ.

72. దిలావర్. 2004. ***గ్రౌండ్ జీరో.*** పాల్వంచ. సమతా ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

73. దేవందర్, అన్నవరం (సంపా). 2010. ***వల్లుబండ.*** కరీంనగర్. సాహితీ సోపతి. ప్రథమ ముద్రణ.

74. దేవేందర్, అన్నవరం. 2001. తొవ్వ. ***కరీంనగర్.*** నూతన సాహితి. ప్రథమ ముద్రణ.

75. దేవేందర్, అన్నవరం. 2005. ***మంకమ్మతోట లేబర్ అడ్డా.*** కరీంనగర్. నూతన సాహితి. ప్రథమ ముద్రణ.

76. దేవేందర్, అన్నవరం. 2008. ***బొడ్డుమల్లె చెట్టు.*** హైదరాబాద్. తెలంగాణ రచయితల వేదిక. ప్రథమ ముద్రణ.

77. దేవేందర్, అన్నవరం. 2011. ***పొద్దు పొడుపు.*** కరీంనగర్. సాహితీ సోపతి. ప్రథమ ముద్రణ.

78. దేవేందర్, అన్నవరం. 2014. ***పొక్కిలి వాకిళ్ళ పులకరింత.*** కరీంనగర్, సాహితీ సోపతి. ప్రథమ ముద్రణ.

79. దేశ్‌పాండే, శ్రీధరరావు. 2015. ***తెలంగాణ సాగునీటి రంగ పితామహుడు నవాబ్ ఆలీ నవాజ్ జంగ్ బహదూర్.*** హైదరాబాద్. తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్స్ ఫోరం. ప్రథమ ముద్రణ.

80. నరసింహం, వుప్పల. 2010. ***ఊసరవెల్లి.*** హైదరాబాద్. జ్ఞానం పబ్లికేషన్స్. ప్రథమ ముద్రణ.

81. నరసింహుడు, ఏరుకొండ. 2014. ***ప్రపంచీకరణ ఆంధ్రవలసవాదం తెలంగాణ ఉద్యమం.*** హన్మకొండ. తెలంగాణ ఉపాధ్యాయ మిత్రమండలి. ప్రథమ ముద్రణ.

82. నాగేందర్, పగడాల. 2012. ***మొగురం.*** హైదరాబాద్. న్యూ డ్రీమ్ పబ్లికేషన్స్. ప్రథమ ముద్రణ.

83. నారాయణ రెడ్డి, సుంకిరెడ్డి (సంపా). 2002. ***మత్తడి.*** హైదరాబాద్. తెలంగాణ సాంస్కృతిక వేదిక. ప్రథమ ముద్రణ.

84. నారాయణ రెడ్డి, సుంకిరెడ్డి. 2001. ***దాలి.*** నల్గొండ. తెలంగాణ సాంస్కృతిక వేదిక. ప్రథమ ముద్రణ.

85. నారాయణ రెడ్డి, సుంకిరెడ్డి. 2009. ***ముంగిలి.*** హైదరాబాద్. తెలంగాణ ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

86. నారాయణ రెడ్డి, సుంకిరెడ్డి. 2011. ***తెలంగాణ చరిత్ర.*** హైదరాబాదు. తెలంగాణ ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

87. నారాయణ, ఉదారి. 2011. ***యాల్లైంది.*** ఆదిలాబాద్. తెలంగాణ రచయితల వేదిక. ప్రథమ ముద్రణ.

88. నారాయణరెడ్డి, సుంకిరెడ్డి. 2012. ***తెలంగాణ సాహిత్య చరిత్ర.*** హైదరాబాద్. తెలుగు అకాడమి. ప్రథమ ముద్రణ.

89. నారాయణస్వామి. 2006. ***సందుక.*** హైదరాబాద్. ఝరి పోయెట్రి సర్కిల్ హైదరాబాద్. ప్రథమ ముద్రణ.

90. నిధి. 2013. ***హైదరాబాద్ సిర్ఫ్ హమారా.*** హైదరాబాద్. అడుగుజాడలు ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

91. పట్వర్ధన్, ఎం.వి. 2012. ***జనాంతర్గామి.*** హైదరాబాద్. సూర్య ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

92. పరిమళ్. 2005. ***మట్టిగంప.*** మహబూబ్‌నగర్. పాలమూరు ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

93. ప్రతాపరెడ్డి, కాసుల. 2002. ***కొలుపు.*** హైదరాబాద్. శైలీ పబ్లికేషన్స్. ప్రథమ ముద్రణ.

94. ప్రతాపరెడ్డి, కాసుల. 2005. ***గుక్క.*** కోదాడ-హైదరాబాద్. స్పృహ సాహితీ సంస్థ. ప్రథమ ముద్రణ.

95. ప్రవీణ్, చింతం. 2012. ***నెగడు.*** వరంగల్. కల్పన ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

96. భగవంతరెడ్డి, కట్టా. 2010. ***జుదాయి జంగ్.*** నల్గొండ. నల్గొండ సాహితీ వేదిక. ప్రథమ ముద్రణ.

97. భంగ్యా నాయక్, బి. 2008. *ప్రజా తెలంగాణ ఉద్యమ ఆలోచనలు.* హైదరాబాద్. పీపుల్స్ తెలంగాణ ఫౌండేషన్. ప్రథమ ముద్రణ.

98. బాలగోపాల్, కె. 2010. ***హక్కుల ఉద్యమం తాత్విక దృక్పథం.*** హైదరాబాద్. మానవ హక్కుల వేదిక. ప్రథమ ముద్రణ.

99. బాపు, చీపెల్లి. 2013. ***వజ్ర సంకల్పం.*** ఆదిలాబాద్ జిల్లా తూర్పు. తెలంగాణ రచయితల వేదిక. ప్రథమ ముద్రణ.

100. బాలయ్య, పొన్నాల. 2008. ***ఎగిలివారంగ.*** కరీంనగర్. మోయతుమ్మెద ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

101. బాలయ్య, పొన్నాల. 2011. ***దండెడ.*** కరీంనగర్. మంజీర రచయితల సంఘం. ప్రథమ ముద్రణ.

102. బాలశ్రీనివాసమూర్తి, గుమ్మన్నగారి. 2002. ***సమకాలీన వాదాలు సాహిత్య విమర్శ.*** సికింద్రాబాదు. జయశ్రీ పబ్లిషర్స్. ప్రథమ ముద్రణ.

103. బుచ్చిరెడ్డి, కోమటిరెడ్డి. 2012. ***డమరుకం.*** హైదరాబాద్. కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్. ప్రథమ ముద్రణ.

104. బుచ్చిరెడి, కోమటిరెడ్డి. 2014. ***ధీరుల మొగసాల.*** హైదరాబాద్. కర్షక ఆర్ట్ ప్రింటర్స్. ప్రథమ ముద్రణ.

105. భూక్యా, భంగ్యా. 2012. ***నిజాం పాలనలో లంబాడాలు.*** హైదరాబాద్. హైదరాబాద్ బుక్ ట్రస్టు. ప్రథమ ముద్రణ.

106. మద్దిలేటి. 2016. ***ఉద్యమకారుడి డైరీ.*** హైదరాబాద్. నడుస్తున్న తెలంగాణ. ప్రథమ ముద్రణ.

107. మధుసూదనరావు, త్రిపురనేని. 1997. ***సాహిత్యంలో వస్తు శిల్పాలు.*** హైదరాబాదు. పర్‌స్పెక్టివ్స్. ప్రథమ ముద్రణ.

108. మహేందర్, బిల్ల. 2012. ***పిడికిలి.*** వరంగల్. దొడ్డి కొమురయ్య ఫౌండేషన్ వరంగల్. ప్రథమ ముద్రణ.

109. మహేశ్, లింగాకారి. 2011. ***నువ్ నా తల్లివి కావ్...*** మహబూబ్‌నగర్. స్వీయ ప్రచురణ. ప్రథమ ముద్రణ.

110. మంజీరా కవులు. 2001. ***ఎడపాయలు.*** సిద్ధిపేట్. మంజీరా రచయితల సంఘం. ప్రథమ ముద్రణ.

111. మాధవరావు, గోరు. 2008. ***నెత్తుటి గోదావరి.*** శ్రీకాకుళం. స్వీయ ప్రచురణ. ప్రథమ ముద్రణ.

112. మానేరు. 2013. ***తల్లడిల్లుతున్న జనహృదయాలు.*** మెదక్. మంజీర పబ్లికేషన్స్, ద్వితీయ ముద్రణ.

113. మురళి, అట్లూరి (సంపా). 2003. ***ప్రపంచీకరణ పదేళ్ళ అనుభవాలు 1991 - 2001.*** హైదరాబాదు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం. ప్రథమ ముద్రణ.

114. మురళీకృష్ణ, వేముగంటి (సంపా). 2012. ***మునుం.*** హైదరాబాద్. తెలంగాణ సాహిత్య సమాఖ్య. ప్రథమ ముద్రణ.

115. మురళీకృష్ణ, వేముగంటి. 2007. ***అలుకుబోనం.*** సిద్ధిపేట్. మంజీరా రచయితల సంఘం. ప్రథమ ముద్రణ.

116. మురళీకృష్ణ, వేముగంటి. 2011. ***జయశిఖరం.*** హైదరాబాద్. తెలంగాణ సాహిత్య సమాఖ్య. ప్రథమ ముద్రణ.

117. మేజర్ జైపాల్ సింగ్. 1995. ***దేశం పిలిచింది.*** విజయవాడ. శ్రీశ్రీ ప్రింటర్స్. నాలుగవ ముద్రణ.

118. యాదగిరి, జి, రుక్నుద్దీన్, కె. 2009. ***జై తెలంగాణ విప్లవ ఢంకా.*** మహబూబ్‌నగర్. పాలమూరు అధ్యయన వేదిక మహబూబ్ నగర్. ద్వితీయ ముద్రణ.

119. యాదగిరి, సిద్దెంకి. 2008. ***మా తొవ్వ.*** సిద్ధిపేట్. దరువు ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

120. యాదగిరి, సిద్దెంకి. 2014. ***బతుకుపాఠం.*** మెదక్. దరువు. ప్రథమ ముద్రణ.

121. యాదగిరిరావు, గొట్టిపర్తి. 2012. ***అలజడి.*** హైదరాబాద్. హైదరాబాద్ పాత నగర రచయితల సంఘం. ప్రథమ ముద్రణ.

122. యాదయ్య, గ్యార. 2002. ***ఎర్కోషి.*** హైదరాబాద్. సిందు. ప్రథమ ముద్రణ.

123. యాదయ్య, బోల. 2011. ***జై తెలంగాణ.*** మహబూబ్‌నగర్, స్వీయ ప్రచురణ. ప్రథమ ముద్రణ.

124. యాదయ్య, బోల. 2013. ***తొలిపొద్దు.*** మహబూబ్‌నగర్. పాలమూరు సాహితి. ప్రథమ ముద్రణ.

125. రజిత, అనిశెట్టి. 2002. ***ఉసురు.*** హైదరాబాద్. స్వీయ ప్రచురణ. ప్రథమ ముద్రణ.

126. రత్నాకర్ రెడ్డి, ఆర్. 2003. ***పాలపిట్ట.*** కరీంనగర్. చైత్రా సుధీరా పబ్లికేషన్స్. ప్రథమ ముద్రణ.

127. రమేశ్, డప్పోల్ల. 2013. ***వలపోత.*** సంగారెడ్డి. మార్పు కళామండలి. ప్రథమ ముద్రణ.

128. రమేశ్, సుంకర. 2008. ***తెలంగాణ కవిత 2007.*** హైదరాబాద్. మట్టి ముద్రణలు. ప్రథమ ముద్రణ.

129. రమేశ్, సుంకర. 2009. ***తెలంగాణ కవిత 2008***. నల్గొండ. మట్టి ముద్రణలు. ప్రథమ ముద్రణ.

130. రమేశ్, సుంకర. 2010. ***తెలంగాణ కవిత 2009.*** నల్గొండ. మట్టి ముద్రణ. ప్రథమ ముద్రణ.

131. రవి, తెలకపల్లి (సంపా). 2008. ***వీర తెలంగాణ మాది.*** హైదరాబాద్. భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటీ. ప్రథమ ముద్రణ.

132. రవి, శాఖమూరి. 2010. ***అవ్వ జెప్పిన తొవ్వ.*** హైదరాబాద్. విప్లవ రచయితల సంఘం. ప్రథమ ముద్రణ.

133. రవిప్రకాష్, సంబరాజు (సంపా). 2010. ***పొద్దైంది.*** నాగర్ కర్నూల్. సింగిడి తెలంగాణ రచయితల సంఘం. ప్రథమ ముద్రణ.

134. రవీందర్, కపిలవాయి. 2011. ***కడుపుమండిన గోస.*** హన్మకొండ. స్వీయ ప్రచురణ. ప్రథమ ముద్రణ.

135. రవీందర్, గోపగాని. 2009. ***చిగురు.*** హైదరాబాద్. శ్రీ ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

136. రవీందర్, పసునూరి. 2010. ***లడాయి.*** వరంగల్. వరవ్వ ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

137. రవీందర్, పిట్టల. 2004. ***సింగరేణి సంస్కరణలు ఒక పరిశీలన.*** కరీంనగర్. విజేత పబ్లికేషన్స్. ప్రథమ ముద్రణ.

138. రవీందర్, పిట్టల. 2007. ***బొగ్గుపొరల్లో.*** హైదరాబాద్. తెలంగాణ విద్యావంతుల వేదిక. ప్రథమ ముద్రణ.

139. రంజిత్ కుమార్, వేముల. 2011. ***తెలంగాణ బిడ్డడి ఉద్యమ గర్జన.*** మహబూబ్ నగర్. స్వీయ ప్రచురణ. ప్రథమ ముద్రణ.

140. రంగనాథాచార్యులు, కె.కె.(సంపా). 2005. ***ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు.*** హైదరాబాద్. ఆంధ్ర సారస్వత పరిషత్తు. ద్వితీయ ముద్రణ.

141. రాజన్న, పోగుల. 2006. ***సెలవింక...*** మెదక్. మంజీర రచయితల సంఘం. ప్రథమ ముద్రణ.

142. రాజయ్య, నల్లెల్ల (సంపా). 2014. ***మోట బొక్కెన.*** వరంగల్. వరంగల్ రచయితల సంఘం. ప్రథమ ముద్రణ.

143. రాజయ్య, నల్లెల్ల. 2009. ***తెలంగాణ జంగ్.*** హన్మకొండ. వరంగల్ రచయితల సంఘం ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

144. రాజిరెడ్డి, పప్పుల. 2008. ***ఆనవాలు.*** సిద్ధిపేట. మంజీర రచయితల సంఘం. ప్రథమ ముద్రణ.

145. రాజేందర్ రాజు, ***కాంచనపల్లి.*** 1999. మట్టి శాపం. వరంగల్. సాహితీ సమితి. ప్రథమ ముద్రణ.

146. రాజేశం, ఉండ్రాల. 2011. ***ఆక్రందన.*** సిద్ధిపేట. జాతీయ సాహిత్య పరిషత్తు. ప్రథమ ముద్రణ.

147. రాజ్‌కుమార్, బండారి. 2013. ***నిప్పు మెరికలు.*** హైదరాబాద్. తెలంగాణ రచయితల వేదిక. ప్రథమ ముద్రణ.

148. రామారావు, కాళీపట్నం. 1990. ***మనలో మనం.*** విశాఖపట్నం. సాగర గ్రంథమాల. ప్రథమ ముద్రణ.

149. రామిరెడ్డి, వెలపాటి. 2011. ***తెలం'గానం'.*** హన్మకొండ. స్వీయ ప్రచురణ. ప్రథమ ముద్రణ.

150. రామిరెడ్డి, వెలపాటి. 2012. ***నడుస్తున్న తెలంగాణ చరిత్ర.*** హన్మకొండ. స్వీయ ప్రచురణ. ప్రథమ ముద్రణ.

151. రాములు, దామెర. 2006. ***జయహే తెలంగాణ!.*** హైదరాబాద్ కోరస్ ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

152. రాములు, దామెర. 2012. ***కొర్రాయి.*** హైదరాబాద్. పాలపిట్ట బుక్స్. ప్రథమ ముద్రణ.

153. రాందాస్, రూపావత్. 2016. ***తెలంగాణలో గిరిజనులు – తిరుగుబాట్లు. హైదరాబాద్.*** నవచేతన పబ్లికేషన్స్. ప్రథమ ముద్రణ.

154. రొనాల్డో మంక్. 2005. ***ప్రపంచీకరణ శ్రామికులు.*** హైదరాబాదు. ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్. ప్రథమ ముద్రణ.

155. లక్ష్మణ్, జి. 2006. ***తెలంగాణలో మూలనపడ్డ ముల్కి – అమలుకాని ఆరుసూత్రాలు జి.వో. 610.*** హైదరాబాద్. తెలంగాణ ఎంప్లాయిస్ ఫోరం. ప్రథమ ముద్రణ.

156. లక్ష్మయ్య, మల్లెపల్లి, కోదండరాం, ఎం. సీతారామారావు, కె. **చెదిరిన చెరువు.** హైదరాబాద్. తెలంగాణ విద్యావంతుల వేదిక. ప్రథమ ముద్రణ.

157. లక్ష్మీనర్సింహ, కె.పి. 2014. ***కుట్ర జేస్తున్న కాలం.*** మహబూబ్‌నగర్. స్వీయ ప్రచురణ. ప్రథమ ముద్రణ.

158. లక్ష్మీనారాయణ, సబ్బని. 2010. ***తెలంగాణ ఒక సత్యం.*** కరీంనగర్. తెలంగాణ సాహిత్య వేదిక కరీంనగర్ జిల్లా. ప్రథమ ముద్రణ.

159. లక్ష్మీనారాయణ, సబ్బని. 2010. **హైదరాబాద్! ఓ! హైదరాబాద్!.** కరీంనగర్. తెలంగాణ సాహిత్య వేదిక కరీంనగర్ జిల్లా. ప్రథమ ముద్రణ.

160. లింగారెడ్డి, కాసుల. 2009. ***అందని చందమామ.*** హైదరాబాద్. శైలి పబ్లికేషన్స్. ప్రథమ ముద్రణ.

161. లెనిన్, ధనిశెట్టి. 2009. ***ది సెజ్.*** హైదరాబాద్. వుమేష్ పేపర్‌బాక్స్. ప్రథమ ముద్రణ.

162. లోకేందర్‌రెడ్డి, ఎ. 2004. ***రగులుతున్న తెలంగాణ.*** హైదరాబాద్. తెలంగాణ రాష్ట్ర సాధన కమిటి. ప్రథమ ముద్రణ.

163. లోకేశ్వర్. 2003. ***ముసాఫిర్.*** హైదరాబాద్. గాంధీ పబ్లికేషన్స్. ప్రథమ ముద్రణ.

164. వరవరరావు. 2008. ***వరవరరావు కవిత్వం 1957-2007.*** హైదరాబాద్. స్వేచ్ఛా సాహితి. ప్రథమ ముద్రణ.

165. వాగీశ్. 2010. ***తెలంగాణ విఫలాంధ్రప్రదేశ్.*** హైదరాబాద్. సకల ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

166. విజయ్ కుమార్, కోడూరి. 2010. ***అనంతరం.*** హైదరాబాద్. పాలపిట్ట. ప్రథమ ముద్రణ.

167. విప్లవ రచయితల సంఘం. 2011. ***తెలంగాణ విరసం కవిత్వం.*** హైదరాబాద్. విప్లవ రచయితల సంఘం. ప్రథమ ముద్రణ.

168. విరసం వ్యాసాలు. 2011. ***ప్రజా తెలంగాణ.*** హైదరాబాద్. విప్లవ రచయితల సంఘం. ప్రథమ ముద్రణ.

169. వివేక్, తడకమళ్ల (సంపా). 2009. ***1969 ఉద్యమం చారిత్రక పత్రాలు.*** హైదరాబాద్. తెలంగాణ హిస్టరీ సొసైటీ. ప్రథమ ముద్రణ.

170. వివేక్, తడకమళ్ల (సంపా). 2010. ***ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు విద్రోహ చరిత్ర.*** హైదరాబాదు. తెలంగాణ హిస్టరీ సొసైటీ. ద్వితీయ ముద్రణ.

171. వివేక్, తడకమళ్ల, వేణుగోపాల్, ఎన్, లోకేశ్వర్, పరవస్తు, రాఘవాచారి, ఎం, శ్రీధర్ దేశ్‌పాండే, శ్రీనివాస్, సంగిశెట్టి. 2010. ***ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు విద్రోహ చరిత్ర.*** హైదరాబాద్. తెలంగాణ హిస్టరీ సొసైటీ. ప్రథమ ముద్రణ.

172. వెంకటయ్య, పెద్ది. 2005. ***మట్టి పరిమళం.*** వరంగల్. స్పందన కళానికేతన్. ప్రథమ ముద్రణ.

173. వెంకటరామారావ్, జి. 1989. ***తెలంగాణాలో విద్యా సాంస్కృతిక రంగాల చరిత్ర.*** తెనాలి సౌభాగ్య లక్ష్మి ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

174. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1989. ***నవలాశిల్పం.*** హైదరాబాద్. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. ప్రథమ ముద్రణ.

175. వెంకటేశం, బి. 1992. ***అరిస్టాటిల్ కావ్యశాస్త్రము.*** కరీంనగర్. సరోజ పబ్లికేషన్స్. ప్రథమ ముద్రణ.

176. వెంకటేశ్వర్లు, మంచాల. 2008. ***పాలగోకు.*** కరీంనగర్. ప్రియాంశ ప్రచురణలు. మొదటి ముద్రణ.

177. వెంకట్ గౌడ్, కొంపల్లి (సంపా). 2015. ***వొడువని ముచ్చట.*** హైదరాబాద్. సహచర బుక్‌మార్ట్. ఏడవ ముద్రణ.

178. వెంకట్ రెడ్డి, వెదిరె. 2004. ***జల – విద్యుత్ రంగాల్లో సంక్షోభం తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకత.*** స్వీయ ప్రచురణ. ప్రథమ ముద్రణ.

179. వెంకట్, యం. 2000. ***వర్జి.*** నల్గొండ. గోసంగి. ప్రథమ ముద్రణ.

180. వెంకన్న, అంబటి. 2011. ***వడిసెల.*** నల్గొండ. జాబిలి ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

181. వేణుగోపాల్, ఎన్. 1999. ***అమ్మకానికి ఆంధ్రప్రదేశ్.*** హైదరాబాద్. విశ్లేషణ ప్రచురణలు. ద్వితీయ ముద్రణ.

182. వేణుగోపాల్, ఎన్. 2002. ***పావురం.*** హైదరాబాద్. స్వేచ్ఛాసాహితి. ప్రథమ ముద్రణ.

183. వేణుగోపాల్, ఎన్. 2004. ***తెలంగాణ నుంచి తెలంగాణ దాకా.*** హైదరాబాద్. దేవులపల్లి పబ్లికేషన్స్. ప్రథమ ముద్రణ.

184. వేణుగోపాల్, ఎన్. 2007. ***ఇది తెలంగాణ విమోచనమేనా?.*** హైదరాబాద్. తెలంగాణ ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

185. వేణుగోపాల్, ఎన్. 2010. ***లేచినిలిచిన తెలంగాణ.*** హైదరాబాద్. స్వేచ్ఛా సాహితి. ప్రథమ ముద్రణ.

186. శర్మ, బి.ఎన్. 2010. ***రెండు తెలుగు రాజ్యాలెందుకు.*** హైదరాబాద్. తెలంగాణ రచయితల వేదిక. ప్రథమ ముద్రణ.

187. శర్మ, వి.ఆర్. 2002. ***తెల్లచీకటి.*** కామారెడ్డి. పిల్లలలోకం ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

188. శంకరరావు, ఎలికట్టె. 2016. ***తెలంగాణ రైతాంగ పోరాట భూమిక చాకలి ఐలమ్మ.*** హైదరాబాద్. నవచేతన పబ్లిషింగ్ హౌస్. ప్రథమ ముద్రణ.

189. శంకర్, ఎలికట్టె. 2004. ***యాది.*** నల్గొండ. అమృత ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

190. శివకుమార్, వఝుల. 1999. ***పాలకంకుల కల.*** హైదరాబాద్. పోయెట్రీ ఫోరమ్ హైదరాబాద్ – వేములవాడ. ప్రథమ ముద్రణ.

191. శివప్రసాద్, పత్తి. 2005. ***ఎరుపెక్కిన పత్తిపూలు.*** కోదాడ–హైదరాబాద్. స్పృహ సాహితీ సంస్థ. ప్రథమ ముద్రణ.

192. శివప్రసాద్, సంకెపల్లి. 2002. ***అష్టమ సముద్రం.*** హైదరాబాద్. పోయెట్రీ ఫోరమ్ వేములవాడ–హైదరాబాద్. ప్రథమ ముద్రణ.

193. శ్రీకాంత్, భీంపల్లి(సంపా). 2011. ***జయహో తెలంగాణ.*** మహబూబ్‌నగర్. పాలమూరు జిల్లా కవుల ఉమ్మడి కార్యాచరణ సమితి. ప్రథమ ముద్రణ.

194. శ్రీకాంత్, భీంపల్లి. 2004. ***పాలమూరు కవిత.*** మహబూబ్‌నగర్. పాలమూరు సాహితి. ప్రథమ ముద్రణ.

195. శ్రీకాంత్, భీంపల్లి. 2004. ***సోది.*** మహబూబ్ నగర్. పాలమూరు సాహితి. ప్రథమ ముద్రణ.

196. శ్రీకాంత్, భీంపల్లి. 2010. ***అమరం.*** మహబూబ్‌నగర్. సింగిడి తెలంగాణ రచయితల సంఘం మహబూబ్‌నగర్. ప్రథమ ముద్రణ.

197. శ్రీధరరావు, దేశ్‌పాండే (సంపా). 2007. ***తెలంగాణలో చదువు.*** హైదరాబాద్. తెలంగాణ విద్యావంతుల వేదిక. ప్రథమ ముద్రణ.

198. శ్రీధరరావు, దేశ్‌పాండే. 2008. ***తెలంగాణ రాజకయ ఆర్థిక సామాజిక వ్యాసాలు.*** హైదరాబాద్. తెలంగాణ విద్యావంతుల వేదిక. ప్రథమ ముద్రణ.

199. శ్రీధర్‌రావు, దేశ్‌పాండే. 2013. ***భారత రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ పరిణామ చరిత్ర.*** హైదరాబాద్. తెలంగాణ విద్యావంతుల వేదిక. ప్రథమ ముద్రణ.

200. శ్రీధర్, గాజుల. 2015. ***వెన్నెల కొలిమి.*** హైదరాబాద్. తెలంగాణ రచయితల సంఘం. ప్రథమ ముద్రణ.

201. శ్రీనివాసరావు, పొట్టపల్లి (సంపా). 2011. ***ఊపిరి.*** వరంగల్లు. వరంగల్లు రచయితల ఐక్య వేదిక. ప్రథమ ముద్రణ.

202. శ్రీనివాసాచార్య, దర్భశయనం. 2001. ***ఆట.*** హైదరాబాద్. మువ్వ చిన్నబాపిరెడ్డి మెమోరియల్ ట్రస్టు. ప్రథమ ముద్రణ.

203. శ్రీనివాసాచార్య, దర్భశయనం. 2004. ***నాగటిచాళ్ళు.*** కరీంనగర్. స్వీయ ప్రచురణ. ప్రథమ ముద్రణ.

204. శ్రీనివాస్, ఎం. 2010. ***తెలంగాణ రాష్ట్ర సాధన.*** హైదరాబాద్. సీపీఐ(ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ. ప్రథమ ముద్రణ.

205. శ్రీనివాస్, జిలుకర. 2012. ***పొతం.*** వరంగల్. ఇండస్ పబ్లికేషన్స్. ప్రథమ ముద్రణ.

206. శ్రీనివాస్, వడ్డెబోయిన, బాసిత్, అబ్దుల్, సంపత్‌రెడ్డి, వంగాల. 2010. ***మా మట్టి కోసం మా హైదరాబాద్ కోసం.*** వరంగల్. బందగి ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

207. శ్రీనివాస్, వడ్డెబోయిన. 1998. ***పోస్టుమార్టంరిపోర్టు.*** వరంగల్. ప్రజాస్వామిక ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

208. శ్రీనివాస్, వడ్డెబోయిన. 2003. ***పదావు.*** హైదరాబాదు. విప్లవ రచయితల సంఘం. ప్రథమ ముద్రణ.

209. శ్రీనివాస్, వడ్డెబోయిన. 2010. ***సమైక్య శాపం.*** వరంగల్. వరంగల్లు రచయితల ఐక్యవేదిక. ప్రథమ ముద్రణ.

210. శ్రీనివాస్, వడ్డెబోయిన. 2012. ***వీరవనం.*** వరంగల్. గోదావరి సాహితీ మిత్రులు. ప్రథమ ముద్రణ.

211. శ్రీనివాస్, సంగిశెట్టి(సంపా). 2009. ***1969 – 1973 తెలంగాణ ఉద్యమ కవిత్వం.*** హైదరాబాద్. సింగిడి తెలంగాణ రచయితల సంఘం. ప్రథమ ముద్రణ.

212. శ్రీనివాస్, సంగిశెట్టి (సంపా). 2010. ***సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణ వ్యాసాలు.*** హైదరాబాద్. తెలంగాణ ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

213. శ్రీనివాస్, సంగిశెట్టి (సంపా). 2012. ***బర్మార్.*** హైదరాబాద్. సింగిడి తెలంగాణ రచయితల సంఘం. ప్రథమ ముద్రణ.

214. శ్రీనివాస్, సంగిశెట్టి. 2010. ***సింగిడి ముస్లిం ప్రత్యేక సంచిక.*** సింగిడి తెలంగాణ రచయితల సంఘం. ప్రథమ ముద్రణ.

215. శ్రీనివాస్, సంగిశెట్టి. 2011. ***హైదరాబాద్ సిర్ఫ్ హమారా.*** హైదరాబాద్. తెలంగాణ రీసెర్స్ అండ్ రెఫరాల్ సెంటర్. ప్రథమ ముద్రణ.

216. శ్రీరాములు, కందుకూరి. 2001. ***సందర్భం.*** హైదరాబాద్, ఝరి పోయెట్రి సర్కిల్. ప్రథమ ముద్రణ.

217. శ్రీరాములు, కందుకూరి. 2002. ***కవ్వం.*** హైదరాబాద్. ఝరి పోయెట్రి సర్కిల్ హైదరాబాద్. ప్రథమ ముద్రణ.

218. శ్రీరాములు, కందుకూరి. 2005. ***పీఠభూమి.*** హైదరాబాద్. ఝరి పోయెట్రి సర్కిల్. ప్రథమ ముద్రణ.

219. శ్రీరాములు, కందుకూరి. 2009. ***రావురూకుల.*** హైదరాబాద్. ఝరి పోయెట్రి సర్కిల్. ప్రథమ ముద్రణ.

220. శ్రీరాములు, కందుకూరి. 2013. ***తెలంగాణ రథం.*** సిద్ధిపేట. మైత్రి మిత్ర మండలి సిద్ధిపేట. ప్రథమ ముద్రణ.

221. శ్రీహరి, రవ్వా (సంపా). 2016. ***తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర.*** హైదరాబాద్. తెలుగు అకాడమి. ప్రథమ ముద్రణ.

222. శోభాగాంధీ. 2010. ***ప్రత్యేక తెలంగాణ ఉద్యమాల చరిత్ర.*** హైదరాబాద్. గాంధి పబ్లికేషన్స్. నాలుగవ ముద్రణ.

223. శోభారాణి, కందాళ, సంపత్ రెడ్డి, వంగాల, శ్రీనివాస్, వడ్డెబోయిన. 2011. ***మే 28 యుద్ధగానం.*** వరంగల్. బందగీ ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

224. సత్తెన్న, పోతుగంటి. 2007. ***చిగురించిన తెలంగాణ ఆశ.*** ఆదిలాబాద్, మానస సాహితి. ప్రథమ ముద్రణ.

225. సత్యనారాయణ, పి. 2015. ***సమాజ శాస్త్రాల్లో పరిశోధన విధానం.*** హైదరాబాద్. నవోదయ బుక్ హౌస్. ప్రథమ ముద్రణ.

226. సరోజినీ, రేగాని. 2002. ***నిజాం – బ్రిటిష్ సంబంధాలు.*** హైదరాబాద్. మీడియా హౌస్ పబ్లికేషన్స్. మొదటి ముద్రణ.

227. సంధ్యా విప్లవ్, కె.బి. 2014. ***నా తెలంగాణ నేల గ్రహణం వీడిన వేళ.*** హైదరాబాద్. స్వీయ ప్రచురణ. ప్రథమ ముద్రణ.

228. సాగర్ కళామందిర్ – ఇందూరు. 2012. ***కలాల కవాతు.*** నిజామాబాద్. సాగర్ కళామందిర్ – ఇందూరు. ప్రథమ ముద్రణ.

229. సాంబమూర్తి, మఠం. 2002. ***ఆరాట కెరటాలు.*** కరీంనగర్. సాహితీ సమాఖ్య – ఫర్టిలైజర్ సిటి. ప్రథమ ముద్రణ.

230. సిధారెడ్డి, నందిని. 2007. ***ఇగురం.*** హైదరాబాద్. తెలంగాణ రచయితల వేదిక. ప్రథమ ముద్రణ.

231. సిధారెడ్డి, నందిని. 2008. ***కులవృత్తులు తెలంగాణ సాహిత్యం.*** హైదరాబాద్. తెలంగాణ రచయితల వేదిక. ప్రథమ ముద్రణ.

232. సిధారెడ్డి, నందిని. 2011. ***ఆవర్తనం.*** హైదరాబాద్. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. ప్రథమ ముద్రణ.

233. సిధారెడ్డి, నందిని. 2017. ***నాలుగు శతాబ్దాల నందిని సిధారెడ్డి కవిత్వం.*** హైదరాబాద్. మంజీర రచయితల సంఘం. ప్రథమ ముద్రణ.

234. సింహాద్రి, యస్ (సంపా). 2001. ***తల్లడిల్లుతున్న తెలంగాణ.*** హైదరాబాద్. సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్. మూడవ ముద్రణ.

235. సీపీఐ(ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ. 2010. ***1948 సెప్టెంబర్ – 17 విద్రోహం.*** హైదరాబాద్. సి.పి.ఐ.(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ. ప్రథమ ముద్రణ.

236. సుచరిత, వెంకటేశ్వర్లు. 2012. ***అడుగులు...*** మహబూబ్‌నగర్. పాలమూరు అధ్యయన వేదిక. ప్రథమ ముద్రణ.

237. సుజాతారెడ్డి, ముదిగంటి. 2009. ***రస చర్చ – ఆధునికత.*** హైదరాబాద్. రోహిణమ్ ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

238. సుబ్బయ్య, వనపట్ల. 2011. ***వొల్లెడ.*** మహబూబ్‌నగర్. సాయి స్పందన ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

239. సుబ్బయ్య, వనపట్ల. 2014. ***మశాల్.*** హైదరాబాద్. ముక్త పబ్లిషర్స్. ప్రథమ ముద్రణ.

240. సుబ్బారావు, సి.వి(సంపా). 1986. ***విభాత సంధ్యలు.*** హైదరాబాదు. సౌత్ ఇండియా పబ్లికేషన్స్. ప్రథమ ముద్రణ.

241. సుందరయ్య, పుచ్చలపల్లి. 1999. ***తెలంగాణ పోరాటంలో స్త్రీల వీరోచిత పాత్ర.*** హైదరాబాద్. ప్రజాశక్తి బుక్‌హౌస్. ప్రథమ ముద్రణ.

242. సూర్యసాగర్, బి. 1995. ***సాహిత్యం – సౌందర్యం.*** జనసాహితి. ప్రథమ ముద్రణ.

243. స్కైబాబ (సంపా). 2010. ***జాగో.. జగావో.*** హైదరాబాద్. తెలంగాణ కవులు, కళాకారులు. ప్రథమ ముద్రణ.

244. స్కైబాబ. 2012. ***జఖ్మీ ఆవాజ్.*** హైదరాబాద్. తెలంగాణ ముస్లిం రచయితల వేదిక. ప్రథమ ముద్రణ.

245. హరగోపాల్, జి (సంపా). 2010. ***గొంతెత్తిన పాలమూరు.*** మహబూబ్‌నగర్. పాలమూరు ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

246. హరగోపాల్. 2006. ***మూలకం.*** ఆలేరు. రచన ప్రచురణలు. మొదటి ముద్రణ.

247. హారోల్డ్ హెచ్ టిటస్. 2004. ***జ్ఞానం యెలా వస్తుంది?.*** గుంటూరు. లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్. మొదటి ముద్రణ.

248. 2003. ***కరువు కోరల్లో నల్గొండ జిల్లా.*** నల్గొండ. సి.పి.ఐ.(ఎం – ఎల్) న్యూడెమక్రసీ. ప్రథమ ముద్రణ.

249. 2006. ***గాయపడ్డ తెలంగాణ.*** హైదరాబాద్. ముల్కి స్టడీ సెంటర్. ప్రథమ ముద్రణ.

250. 2006. ***తెలంగాణ చరిత్ర పునర్నిర్మాణం.*** హైదరాబాద్. తెలంగాణ హిస్టరీ సొసైటీ. ప్రథమ ముద్రణ.

251. 2008. ***ప్రత్యేక మృత్యుమండలాలు.*** హైదరాబాద్. విప్లవ రచయితల సంఘం. ప్రథమ ముద్రణ.

252. 2009. ***ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం.*** హైదరాబాద్. పోరుతెలంగాణ ప్రచురణలు. ప్రథమ ముద్రణ.

253. 2011. ***దిమ్మిస.*** హైదరాబాద్. 'సింగిడి' తెలంగాణ రచయితల సంఘం. ప్రథమ ముద్రణ.

254. 2013. ***ప్రజాస్వామ్య తెలంగాణ చారిత్రక పత్రాలు.*** హైదరాబాద్. నడుస్తున్న తెలంగాణ. ప్రథమ ముద్రణ.

## అంతర్జాలం

255. https://hridayam.wordpress.com/2010/01/08/history-of-telangana-statehood-movement/

256. https://hridayam.wordpress.com/2011/12/12/

## Ph.D. Synopsis

# Pratyēka telaṅgāṇōdyama kavitvaṁ - maulika bhāvanalu

(A Synopsis submitted to the University of Hyderabad in partial fulfilment of the Degree of Doctor of Philosophy)


**Researcher**

D.UDAY BHANU

**11HTPH12**

**Department of Telugu**

School of Humanities

University of Hyderabad

Hyderabad-500046

TELANGANA, INDIA


OCTOBER - 2017

(పిహెచ్.డి. పరిశోధన నివేదిక)

# ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం – మౌలిక భావనలు

(పిహెచ్.డి. పట్టాకోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన నివేదిక)


పరిశోధన

**డి.ఉదయ్ భాను**

**(11HTPH12)**

పర్యవేక్షణ

**ఆచార్య జి.అరుణ కుమారి**


## విషయ సూచిక (1 – 27)


1. పరిశోధన శీర్షిక వివరణ (Description of the Title) 1
2. పూర్వ పరిశోధనల సమీక్ష (Review of Literature) 1
3. పరిశోధనాంశ సైద్ధాంతిక / శాస్త్ర నేపథ్యం (Theoretical Approach) 2
4. పరిశోధన సమస్య (The Research Problem) 3
5. సమాచార సేకరణ (Material Collection) 3
6. ఊహా ప్రతిపాదన (Hypothesis) 4
7. అధ్యయన పరిధి (Limitation) 4
8. పరిశోధన గ్రంథ రచన ప్రణాళిక (The Plan of Thesis Writing) 5
9. పరిశోధన ఫలితాలు (Results of the Research) 7
10. అనుబంధం(Annexure) – I 25
11. అనుబంధం(Annexure) – II 25
12. సంక్షిప్త ఉపయుక్త గ్రంథసూచి(Bibliography) 26

## **1. పరిశోధన శీర్షిక వివరణ** (Description of the Title)

నా పరిశోధనాంశం 'ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం – మౌలిక భావనలు'. 'ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం' అన్న మాటను విస్తృతార్థంలో స్వీకరించాను. ప్రత్యక్షంగా తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడాన్ని ప్రతిపాదించే కవిత్వం మాత్రమే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతం ఎన్ని రకాల వివక్షకు గురైంది, ఎట్లా వివక్షకు గురైంది, దాని మూలంగా ఏర్పడిన పర్యవసానాలేమిటి, వర్తమాన తెలంగాణ సమాజం ఎట్లా ఉన్నది, ఆ సమాజంలోని సమస్యలకు మూలాలు ఎక్కడ ఉన్నాయి, వాటి పరిష్కార మార్గాలేమిటి మొదలైన అంశాలను వ్యక్తం చేసే కవిత్వం కూడా ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వమే అవుతుందని నా భావన. అందుకే పైన వివరించిన అన్ని అంశాలను వ్యక్తం చేసిన కవితలను నా పరిశోధనలోకి తీసుకున్నాను. 'మౌలిక భావనలు' అన్న మాటలో మూడు విభాగాలు ఉన్నాయి. 'మూల' అనే ధాతువుకు 'ఇక' అనే ప్రత్యయం చేరడం కారణంగా 'మౌలిక' అనే పదం ఏర్పడింది. 'భావనల' అంటే ఆలోచనా చిత్రాల సారం. 'మౌలిక భావనలు' అంటే ఒక విషయానికి సంబంధించిన మూల లేద కేంద్ర భావనలు. 'ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం – మౌలిక భావనలు' అనే శీర్షికకు, ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలోని మూల లేదా కేంద్రక భావనలు అని అర్థం. ఇదీ నా పరిశోధనా శీర్షిక సారాంశం.

## **2. పూర్వ పరిశోధనల సమీక్ష** (Review of Literature)

పరిశోధనాంశాన్ని స్వీకరించిన తర్వాత గతంలో ఇదే పరిశోధనాంశం మీద ఏవైనా విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు జరిగాయా అని తెలుసుకునే ప్రయత్నం చేశాను. తెలంగాణా కవుల కవిత్వం మీద, కథల మీద, నవలల మీద, పాటల మీద వివిధ విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు జరిగాయి. కానీ నేను పరిశోధనాంశాన్ని విశ్వవిద్యాలయంలో అధికారికంగా నమోదు చేసుకునే సమయానికి ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం మీద ఏ విశ్వవిద్యాలయంలో పరిశోధన జరగలేదని

తెలుసుకున్నాను. విశ్వవిద్యాలయాలకు వెలుపల ఈ అంశం మీద కొంతమేర ప్రయత్నాలు జరిగాయి. ప్రత్యేక తెలంగాణోద్యమ కవితా సంకలనాలూ, సంపుటులకు రాసిన ముందుమాటల్లో ప్రాథమిక స్థాయిలో ఈ కృషి కనిపిస్తుంది. అట్లే డా॥సి.కాశీం రాసిన 'తెలంగాణ సాహిత్యం', గుడిపాటి రాసిన 'అభివ్యక్తి', బన్న ఐలయ్య రాసిన 'తెలంగాణ సాహిత్య సాంస్కృతిక చైతన్యం', రాచపాళెం చంద్రశేఖరరెడ్డి రాసిన 'కవుల తెలంగాణం', సుంకిరెడ్డి నారాయణరెడ్డి రాసిన 'ఆధునిక తెలంగాణ సాహిత్య చరిత్ర', కాసుల ప్రతాపరెడ్డి రాసిన 'కొలుపు', విప్లవ రచయితల సంఘం ప్రచురించిన 'ప్రజా తెలంగాణ', ఆచార్య రవ్వా శ్రీహరి సంపాదకత్వం వహించిన 'తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర', నందిని సిధారెడ్డి రాసిన 'ఇగురం', నడుస్తున్న తెలంగాణ మాస పత్రికలో ప్రచురితమైన వ్యాసాలు మొదలైన వాటిల్లో ఈ ప్రయత్నం కొంతమేర కనిపిస్తుంది. కానీ పూర్తిస్థాయిలో, ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలోని భిన్నమైన పార్శ్వాలను పరిశోధించే పని విశ్వవిద్యాలయ స్థాయిలో జరిగింది మాత్రం లేదు.

## 3. పరిశోధనాంశ సైద్ధాంతిక / శాస్త్ర నేపథ్యం (Theoretical Approach)

సమాజం అంటే మానవ సంబంధాల సమూహం అని తాత్వికార్థం. సాహిత్యం సామాజిక చైతన్య నిష్పన్న రూపం. అంటే ఒక సమాజంలోని మనుషులు తమ జీవిత గమనంలో తెలుసుకున్న, అర్థం చేసుకున్న, అనుభవాల జ్ఞానం కళాత్మకంగా వెలువడిన రూపమే సాహిత్యం. తెలంగాణ సమాజం వెనుకబాటుకు గురికావడం, దానికి మూల కారణాల్ని అన్వేషించడం, దాని నుండి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటే పరిష్కార మార్గం అని నిర్ధారణకు రావడం తెలంగాణ సమాజ చైతన్యం. అది కవిత్వంలో ఎట్లా ప్రతిఫలించిందో చెప్పడమే ఈ పరిశోధన లక్ష్యం. పైగా భావోద్రేకాల వేగం దృష్ట్యా, నిడివి వలనా కవిత్వం మిగతా సాహిత్య ప్రక్రియలకన్నా ముందు వెలువడుతుంది. నవలవలె కాకున్నా అనేక జీవిత పార్శ్వాలను సూక్ష్మస్థాయిలో పట్టుకుని కళాత్మకంగా వివరిస్తుంది. తెలగాణ కవులు తెలంగాణ సమాజాన్ని ఎట్లా అర్థం చేసుకున్నారు, తమ చారిత్రక మూలాలకు సంబంధించి వారికి కలిగిన జ్ఞానమేమిటి, దానిని వాళ్లు ఎట్లా తర్కించారు, ఎట్లా వర్ణించారు అన్నది

ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కవిత్వంలో నిక్షిప్తం అయ్యింది. కనుక ఈ పరిశోధన చేయడం కారణంగా తెలంగాణ ప్రజల ఆకాంక్షల్లోని ఆత్మను వెలికితీయడం, దానిని సాధారణీకరించడం, సూత్రాలుగా రూపొందించి ప్రతిపాదనలుగా నిలబెట్టడం చేయవచ్చు.

## 4. పరిశోధన సమస్య (The Research Problem)

ఆరు దశాబ్దాల తెలంగాణకు సంబంధించిన భాషా, సాహిత్య, సాంస్కృతిక, రాజకీయార్థిక రంగాలు మాత్రమే కాకుండా బహుముఖీనమైన అనేక జీవన పార్శ్వాలను చరిత్రగా రికార్డు చేసింది ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం. ఈ కవిత్వ సృజనలో పాలుపంచుకున్నవాళ్లు కనీసం మూడువేల మంది. ఈ మూడువేల మంది తమ తమ జీవితానుభవాల్లోంచి, తెలంగాణ సమాజాన్ని, అందులోని ఘర్షణను తాము అర్థం చేసుకున్న పద్ధతిలోంచి కవిత్వాన్ని సృజించారు. ఈ కవులంతా తెలంగాణ పది జిల్లాలకు చెందినవారు కావటం మూలంగా వారి కవితా వస్తువులో వైవిధ్యం కనిపిస్తుంది. కనుక అసలు ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో ప్రచలితమైన పార్శ్వాలు కాకుండా మరేమైనా ఉన్నాయా అని పరిశోధించే ప్రయత్నమే పరిశోధన సమస్య.

## 5. సమాచార సేకరణ (Material Collection)

పరిశోధనాంశాన్ని స్వీకరించిన తర్వాత తెలంగాణలోని పదిజిల్లాలను పర్యటించాను. 1969 ఉద్యమంలో పాల్గొన్న కవుల దగ్గరి నుండి 2009 ఉద్యమంలో పాల్గొన్న కవులదాకా చాలామందిని కలిశాను. వారు వెలువరించిన కవితా సంపుటులును, సంపాదకత్వం వహించిన సంకలనాలను సేకరించాను. వారి దగ్గర ఉన్న ఇతర తెలంగాణ కవులు కవిత్వాన్ని కూడా సేకరించాను. మొత్తంగా 1968 తర్వాతి కాలంలో వెలువడిన తెలంగాణ కవులందరి కవితా సంకలనాలూ, సంపుటులను సేకరించాను. ఇదే క్రమంలో తెలంగాణలోని ప్రముఖ పుస్తక కేంద్రాలకు వెళ్లి, తెలంగాణ చరిత్ర, రాజకీయార్థిక రంగం, సంస్కృతి, భాష, కళలు, సాహిత్యం, విమర్శ మొదలైన రంగాలలో వెలువడిన సాహిత్యాన్ని కూడా సేకరించాను. అస్తిత్వవాద తాత్త్వికతను అర్థం చేసుకోవడం కోసం

సిద్ధాంత గ్రంథాల్ని కూడా సేకరించాను. వివిధ విశ్వవిద్యాలయాలకు వెళ్లి తెలంగాణ సాహిత్యం మీద వెలువడిన అనేక పరిశోధన గ్రంథాల్ని జిరాక్స్ కాపీలు తీసుకున్నాను. ఇది నేను పరిశోధనా సామగ్రిని సేకరించిన పద్ధతి.

## 6. ఊహా ప్రతిపాదన (Hypothesis)

సేకరించిన సమాచారంలో మొదట సైద్ధాంతిక అవగాహన కలిగించే గ్రంథాల్ని అధ్యయనం చేశాను. తర్వాత తెలంగాణ చరిత్రను, రాజకీయార్థిక శాస్త్రాన్ని, కళలను, సంస్కృతినీ, భాషను, సాహిత్యాన్ని, విమర్శను అధ్యయనం చేశాను. స్థూలంగా తెలంగాణలోని విభిన్నమైన సామాజిక రంగాల చరిత్రపట్ల ఒక అవగాహనకు వచ్చాను. ఆ తరువాత తెలంగాణ కవితా సంకలనాలను, సంపుటులను ఆమూలాగ్రం చదివాను. ఆయా సంకలనాలూ, సంపుటులకు ఉన్న ముందు మాటల్ని సామాజిక పరిణామ క్రమం నుండి అర్థం చేసుకున్నాను. ఆ తరువాత పరిశోధ గ్రంథం రాయడానికి ఒక ప్రణాళిక రూపొందించుకున్నాను. పరిశోధనా గ్రంథంలో మొదట ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణను బలవంతంగా విలీనం చేసిన క్రమాన్నీ, ఆ తర్వాత తెలంగాణలో ఏర్పడిన సామాజిక పరిస్థితుల్ని చెప్పి, ఆ తర్వాత ప్రత్యేక తెలంగాణ ఉద్యమ చరిత్రను వివరించి, తర్వాత సమాజం సాహిత్యంగా, కవిత్వంగా పరిణామం చెందే క్రమాన్ని వివరించి, ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కవిత్వాన్ని వివరించాలనుకున్నాను.

## 7. అధ్యయన పరిధి (Limitations)

నేను ఇదే విశ్వవిద్యాలయంలో ఎం.ఫిల్.లో 'తెలంగాణ కవిత్వం – మౌలిక భావనలు' అనే పరిశోధనాంశాన్ని ఎంచుకుని 2000 నుండి 2010 మధ్య పది సంవత్సరాల కాలంలో వచ్చిన ప్రత్యేక తెలంగాణ కవిత్వం మీద పరిశోధన చేశాను. ఆ క్రమాన్ని కొనసాగించడం కోసమే పీహెచ్.డీ.లో చేరాక 'ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం – మౌలిక భావనలు' అనే పరిశోధనాంశాన్ని ఎంచుకున్నాను. 1968 నుండి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 జూన్ 2 వ తారీఖు మధ్య కాలంలో తెలంగాణ సమాజంలో

వెలువడిన కవితా సంపుటులు, సంకలనాలను పరిశోధనకు స్వీకరించాను. వివిధ పత్రికల్లో, అంతర్జాలంలో, వేరువేరు తలాల్లో వెలువడిన కవిత్వాన్ని వదిలేసి, కేవలం సంపుటులు, సంకలనాలుగా వెలువడిన కవిత్వాన్ని మాత్రమే నా పరిశోధనలో భాగం చేసుకున్నాను. ఇది పరిశోధనా విస్తృతిని దృష్ట్యా చేసింది తప్పితే మరొకటి కాదు. పైగా నేను ఎంపిక చేసుకున్నది కేవలం వచన కవిత్వం మాత్రమే. ఇది నా పరిధి.

## 8. పరిశోధన గ్రంథ రచన ప్రణాళిక (The Plan of Thesis Writing)

ఈ పరిశోధనా గ్రంథ రచనలో కింద తెలిపిన అధ్యాయ విభజన చేసుకున్నాను.

**ప్రవేశిక**

**అధ్యాయం – 1 : ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ – సామాజిక పరిస్థితులు**

**అధ్యాయం – 2 : ప్రత్యేక తెలంగాణ ఉద్యమం – ప్రజా చైతన్యం**

**అధ్యాయం – 3 : సమాజం – కవిత్వం – సంబంధం**

**అధ్యాయం – 4 : ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం – మౌలిక భావనలు**

**పరిశోధన ఫలితాలు**

**ముగింపు**

**అనుబంధం – 1**

**అనుబంధం – 2**

**ఉపయుక్త గ్రంథసూచి**

పైన తెలిపిన అధ్యాయాల్లో ఉన్న సారాంశం క్రమానుగతంగా ఇట్లా ఉన్నది.

మొదటి అధ్యాయం 'ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ – సామాజికాంశాలు'. ఇందులో రెండు విభిన్నమైన చారిత్రక నేపథ్యం కలిగిన రెండు తెలుగు ప్రాంతాలను కలిపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఎట్లా ఏర్పరిచారు, ఆ క్రమంలో చేసుకున్న ఒప్పందాలేమిటి, వెనుకబడిన తెలంగాణకు ఇచ్చిన రక్షణలేమిటి, ఆచరణ క్రమంలో కాలానుగతంగా అవి ఎట్లా నీటిమీది

రాతలుగా మారుతూ వచ్చాయో వివరించాను. అదే సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భాగమైన తర్వాత తెలంగాణలోని వివిధ సామాజిక రంగాల్లో ఎట్లా వివక్ష కొనసాగింది, ఎటువంటి ఆధిపత్య భావనలు అమలయ్యాయి, ఏయే రకమైన వివక్షలు చోటుచేసుకున్నాయి, వాటి పర్యవసానంగా తెలంగాణలో ఎటువంటి పరిస్థితులు ఏర్పడ్డాయి అనేది విడివిడిగా చర్చించాను.

రెండవ అధ్యాయం 'ప్రత్యేక తెలంగాణ ఉద్యమం – ప్రజా చైతన్యం'. ఇందులో ప్రత్యేక తెలంగాణ ఉద్యమ చరిత్రను పొందుపర్చాను. ఏ ఉద్యమమైనా సామాజిక స్థాయిని కలిగి ఉంటుంది కనుక, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోని కీలకమైన ఘట్టాలను, అవి సమాజం మీద వేసిన ప్రభావాన్ని, వ్యక్తులను, సంస్థలను, సంఘాలను, పోరాట క్రమాన్ని కాలక్రమంలో నిక్షిప్తం చేశాను. 1968 సంవత్సరాంతం నుండి 2014లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడేదాక నడిచిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సంక్షిప్త చరిత్రను ఈ అధ్యాయంలో పొందుపర్చాను.

మూడవ అధ్యాయం 'సమాజం – కవిత్వం – సంబంధం'. ఇందులో సమాజ సాహిత్య సంబంధాలను చారిత్రకంగా వివరిస్తూ, సమాజం కవిత్వంగా పరిణామం చెందే క్రమాన్ని చెప్తూ, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ప్రత్యేక తెలంగాణ కవిత్వంగా ప్రతిఫలించిన విధానాన్ని శాస్త్రీయంగా విశ్లేషించాను.

నాలుగవ అధ్యాయం 'ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం – మౌలిక భావనలు'. ఈ అధ్యాయంలో ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలోని మౌలిక భావనల్ని వివరిస్తూ, వాటికి కవితా భాగాల్ని ఉదహరిస్తూ పోయాను. ఒక్కొక్క మౌలిక భావనలోని భిన్నమైన పార్శ్వాలను వ్యక్తం చేసే ఉప భావనలకు విడివిడిగా కవితల్ని ఉదహరించాను. ఉదాహరణకు ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో తెలంగాణకు నీటి విషయంలో జరిగిన అన్యాయంలో అనేక ఉపాంగాలు ఉన్నాయి. నదుల నీటి వాటా విషయంలో జరిగిన అన్యాయం, ప్రాజెక్టులు కట్టడంలో చేసిన అన్యాయం, కట్టకుండా వదిలేయడంలో చేసిన

అన్యాయం, నిజాం కాలంలో నిర్మించబడిన చెరువుల్ని పూడిక తీయకుండా వదిలేయడం కారణంగా జరిగిన అన్యాయం, భూగర్భ జలాలలను తగ్గించిన సీమాంధ్ర వ్యాపారవేత్తల ఇసుక మాఫియా చేసిన అన్యాయం మొదలైనవి తెలంగాణకు నీళ్ల విషయంలో జరిగిన అన్యాయాలు. స్థూలంగా నీళ్ల విషయంలో అన్యాయం జరిగినా పైన తెలిపినవన్నీ వివిధ ఉపాంగాలు. కనుక నీటి సమస్య ఒక మౌలిక భావనగా చెప్తూనే, వాటిలోని వివిధ ఉపాంగాలను వివరించే కవితా భాగాల్ని కూడా ఉదహరించాను. ఇట్లా అన్ని మౌలిక భావనలకు ఉన్న భిన్నమైన పార్శ్వాలను వ్యక్తం చేసే ఉపాంగాలకు కవితల్ని ఉదహరించాను.

## 9. పరిశోధన ఫలితాలు (Results of the Research)

1. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు అటుఇటుగా హైదరాబాద్ రాష్ట్రాన్ని విడిగా ఉంచాలనే అభిప్రాయాలతో కవిత్వం రాలేదు. దీనికి కారణం ఆనాటి హైదరాబాద్ రాష్ట్ర కవులు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిర్మాణం చేసిన విశాలాంధ్ర భావనలో ఉండిపోయారు. అందుకే కాళోజీవంటివాళ్లు కూడా ఆంధ్రప్రదేశ్ ఏర్పాటును సమర్థించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పన్నెండేళ్ల చేదు అనుభవాల తర్వాత కాళోజీతోపాటు చాలామంది తెలంగాణ కవులు రియలైజ్ అయ్యారు. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం రాశారు.

2. తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం నడిచిన కాలంలో మేధావులు, కవులు, కళాకారులు దాదాపుగా విప్లవోద్యమ ప్రభావంలో ఉండిపోవడం కారణంగానే ప్రత్యేక తెలంగాణ కవిత్వాన్ని రాయలేకపోయారు. అయినప్పటికీ వారిలో చాలా మంది ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని బలపరిచారు. ప్రధానంగా తెలంగాణ ప్రాంతంలో ఉంటూ విప్లవోద్యమానికి నాయకత్వం వహిస్తుండిన ఆంధ్రాప్రాంతానికి చెందిన నాయకత్వం కూడా ప్రత్యేక తెలంగాణ ఉద్యమ శక్తుల్ని గైడ్ చేసినట్లు తెలుస్తోంది.

3. తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ముగిసిన తర్వాత ఉద్యమ కవిత్వం కూడా ఒక స్రవంతిగా రాలేదు. మళ్లీ ప్రపంచీకరణ విధానాలు తెలంగాణ మీద ప్రయోగించిన

తర్వాత ఏర్పడిన విషాదకరమైన పర్యవసానాల నేపథ్యంలో ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వాన్ని ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కవిత్వంలో భాగంగా రాశారు. ఈ రెండు కాలాలకు మధ్య కవిత్వం రాకపోవడానికి కారణం తగినంత ఉద్యమ ప్రేరణ లేకపోవడమే.

4. తెలుగు నేలమీద మాత్రమే కాకుండా మొత్తం దేశంలోనే అస్తిత్వ ఉద్యమాలకు చూపునిచ్చింది, బాట వేసింది ప్రత్యేక తెలంగాణ ఉద్యమం అని చెప్పడం ఈ కవిత్వంలో కనిపించే ప్రధాన భావన. తెలుగునేల మీద వచ్చిన స్త్రీ, దళిత, మైనార్టీ, బీసీవాద లేదా ఏ ఇతర అస్తిత్వవాదాలకైనా, అస్తిత్వవాదాల సాహిత్యానికైనా ప్రత్యేక తెలంగాణ అస్తిత్వ ఉద్యమమూ, సాహిత్యమే కనిపించని ప్రభావంగా ఉన్నది.

5. తొలిదశ ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో నిరుద్యోగ సమస్య, అప్పటికే ఉద్యోగాల్లో ఉన్నవారికి సంబంధించిన పదోన్నతుల సమస్య, రక్షణల ఉల్లంఘనలు, వనరుల దోపిడీ, నిధుల కేటాయింపులో వివక్ష మొదలైన విషయాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. మలిదశ పూర్వార్ధ ఉద్యమ కవిత్వంలో ప్రపంచీకరణ వ్యతిరేకతతో పాటు అనేక సామాజిక రంగాల్లో జరుగుతున్న వివక్ష, ఉత్తరార్ధ ఉద్యమ కవిత్వంలో, పై రెండు దశల్లోని అన్ని విషయాలు కనిపిస్తున్నాయి. దీని పునాదిగా తెలంగాణ సామాజిక చైతన్యం క్రమక్రమంగా విశాలమైనట్లు చెప్పవచ్చు.

6. తెలంగాణలోని దాదాపు అన్ని ప్రాంతాల నుండి ప్రత్యేక తెలంగాణ కవిత్వం విరివిగా వెలువడినప్పటికీ, ఆ కవిత్వమంతా సాంద్రమైనదనీ, గాఢమైనదనీ చెప్పడానికి వీలు లేకుండా ఉన్నది. చాలా మంది కొత్తకవులు రాయడం మూలంగా కొంత కవిత్వం పూర్తి వచనం అయిపోయినట్లు కూడా కనిపిస్తోంది. అయితే ఈ కవిత్వంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కాంక్ష మాత్రం బలంగా ఉన్నదని చెప్పాలి. మరోవైపు సుదీర్ఘ కాలం ప్రత్యేక తెలంగాణ కవిత్వాన్ని పండిస్తున్న కవులు చాలా తాత్వికమైన, లోతైన కవిత్వం రాయడం కూడా కనిపిస్తుంది. ఈ రెండు రకాల కవిత్వాలలో రెండవదే ఎక్కువగా ఉన్నది.

7. ఈ మొత్తం కవిత్వంలో స్పష్టమైన రాజకీయ ప్రాపంచిక దృక్పథం ఉన్న కవులు రాసిన కవిత్వం రూప, సారాల్లో చాలా బలంగా ఉన్నది కానీ, ఏ తాత్వికత లేకుండా కేవలం తెలంగాణ కోరుకునే కవిత్వం పలుచగా ఉన్నది. అంటే పలుచనబడటానికి కారణంగా రాజకీయ దృక్పథంతో రాయలేకపోవడాన్ని చెప్పవచ్చు.

8. ప్రత్యేక తెలంగాణోద్యమంలో వచ్చినంత కవిత్వం (రాశిలో) భారతదేశంలోని ఏ ఇతర ఉద్యమంలో రాలేదు.

9. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం, తెలుగు భాషకు అతి నూతనమైన, విలువైన భాషా సంపదను ఇచ్చింది.

10. మొత్తం ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో రాయలసీమ పాలకులమీదా, కోస్తాంధ్ర పాలకులూ, ప్రజలమీదా వ్యతిరేకత కనిపిస్తుంది. ఉత్తరాంధ్ర మీద ఏ వ్యతిరేకతా కనిపించదు. దీని ద్వారా తెలంగాణకు ఎక్కువ నష్టం చేసినవారెవరనే ఎరుక తెలంగాణ కవులకు స్పష్టంగానే ఉన్నదని అర్థం అవుతుంది.

11. మొత్తం ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో ఆంధ్రభాషాధిపత్యాన్ని నిరసిస్తూ కవిత్వం రాసినా దాదాపు ఎనభై శాతం కవిత్వం ఆధ్రభాషలోనే రాశారని చెప్పవచ్చు. దీనికి కారణం ఆంధ్రభాష తెలంగాణ కవుల మీద నిరవదికంగా చెలాయిస్తున్న ఆధిపత్యమే అని నిర్ధారించవచ్చు. మిగిలిన 20 శాతం వాడుక భాషలో రాసిన వారిలో 90శాతానికి పైగా ఉత్పత్తి కులాలవారే ఉన్నారు. దీని ద్వారా ఉత్పత్తి కులాలవారే ఆంధ్రభాషాధిపత్యాన్ని ఎక్కువగా అర్థం చేసుకుని, వదిలించుకున్నానరి చెప్పవచ్చు.

12. తెలంగాణలోని అన్ని జిల్లాల కవులు ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం రాసినా, వారి వారి జిల్లాల్లోని ప్రత్యేకతలూ, ప్రత్యేక సమస్యలు వారి కవిత్వంలో కనిపిస్తున్నాయి. ఉదాహరణకు నల్గొండ జిల్లా కవులు ఎక్కువగా ఫ్లోరోసిస్ సమస్య మీదా, మహబూబ్‌నగర్

కవులు ఎక్కువగా కరువు, వలసల మీదా రాయడాన్ని చెప్పవచ్చు.

13. అప్పటిదాకా భూస్వామ్య నిరంకుశ పాలనలో మగ్గుతూ ఉన్న తెలంగాణ భారత స్వాతంత్ర్యానంతరం, స్వపరిపాలనలో కోలుకుందామనుకున్నది. కానీ తెలంగాణ ప్రజల ఆశల్ని వమ్ము చేస్తూ నిజాం పాలన కంటే దారుణమైన విధానాలు, వివక్షలు అమలు చేయడం కారణంగా తెలంగాణ ప్రజలు మామూలు స్థాయికంటే ఎక్కువ గాయపడ్డారు.

14. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో మౌలిక భావనల్లో నీరు అతి కీలకమైన అంశం. నీటికి సంబంధించిన భావనలు కూడా భిన్నమైన దృక్కోణాల్లో వ్యక్తం అయ్యాయి. తెలంగాణలో జీవనదులు, ఉపనదులు ఉన్నా వాటిమీద ఆనకట్టలు, బహుళార్థ సాధక ప్రాజెక్టులు కట్టకుండా ఉండటం ద్వారా పల్లపు ప్రాంతమైన కోస్తాంధ్రకు నీటిని తరలించుకుపోయారని చెప్పడం ఒక అంశం. నిజాం కాలంలోనే నిర్మించతలపెట్టిన ప్రాజెక్టులు సీమాంధ్రుల పాలనలో పూర్తయినా, వాటి నీటి నిలువ సామర్థ్యాలను అత్యంత అన్యాయంగా తగ్గించి, తద్వారా ఎక్కువ నీటిని లోతట్టు ప్రాంతమైన ఆంధ్రాకు తరలించారని చెప్పడం రెండవ అంశం. కట్టిన ప్రాజెక్టుల్లోనూ ఇసుకమేటలు వేయడం వల్ల నీటి నిలువ సామర్థ్యాన్ని తగ్గించారని చెప్పడం మూడవ అంశం. నిజాం కాలంలో నిర్మాణమైన వేలాది చెరువుల్ని పూడిక తీయకుండా ధ్వంసం చేయడం ద్వారా చెరువులు ఎండిపోయాయని చెప్పడం నాల్గవ అంశం. పెద్ద వ్యాపారవేత్తలు భవణ నిర్మాణ రంగంలో వినియోగించే ఇసుకను లెక్కకు మించి, అక్రమంగా తరలించడం ద్వారా భూగర్భజలాల్ని కూడా లేకుండా చేశారని చెప్పడం ఐదవ అంశం. స్థూలంగా విస్తృతమైన మానవ వనరులు, బంగారం పండగల భూమి ఉన్నప్పటికీ నీటి వసతులు లేకపోవడం కారణంగా వ్యవసాయం దెబ్బతిని వలసలు తలెత్తాయని చెప్పడం ఆరవ అంశం. నల్గొండ వంటి కృష్ణానదీ తీరప్రాంతం  ఉన్న జిల్లాకు కూడా కృష్ణా నీళ్లు అందకపోవడం కారణంగా అక్కడి భూమిలో కలిసిపోయి ఉన్న ఫ్లోరైడ్ నీళ్లలో కలిసి, అనివార్యంగా ఆ నీళ్లనే తాగడం కారణంగా ప్రతి ఇంట్లో అనేక రకాల జబ్బులు, అంగవైకల్యాలతో బాధపడేవారే కనిపించడం, దానికి కారణం కృష్ణానది నుండి సాగునీరు అందకుండా చేయడమే అని చెప్పడం ఏడవ అంశం. గోదావరి నదిపై తెలంగాణ ప్రాంతంలో పోలవరం వంటి భారీ

ప్రాజెక్టులు కట్టి, తెలంగాణ ప్రాంతాన్ని ముంపుకు గురి చేసి, సీమాంధ్ర వ్యాపారవేత్తల ప్రయోజనాలకోసం నీటిని తరలించి తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని చెప్పడం ఎనిమిదవ అంశం. మొత్తంగా తెలంగాణకు సాగు, తాగు నీరు అందించకుండా, లోతట్టు ప్రాంతమైన ఆంధ్రాప్రాంత ప్రయోజనాలకోసమే సీమాంధ్ర పాలకవర్గాలు పనిచేశాయని, ఒకవైపు ఆంధ్రా ప్రాంతం నీటిని వినియోగించుకుని అభివృద్ధి చెందడానికి అవకాశం కల్పిస్తూ, తెలంగాణ ప్రాంతాన్ని ఎడారిగా మార్చాయని చెప్పడం నీటికి సంబంధించిన భావనల్లో కీలకంగా కనిపిస్తున్నది.

15. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో కనిపించే మరొక ముఖ్యమైన భావన, సీమాంధ్రుల పాలనలో తెలంగాణ వ్యవసాయ రంగం విధ్వంసానికి గురైందని చెప్పడం. ఇందులో భిన్నమైన కోణాలు ఉన్నాయి. ప్రవహించే (నదులు, ఉపనదులు మొదలైనవి), నిశ్చల (చెరువులు, బావులు) నీరు అందకపోవడం కారణంగా వ్యవసాయం దెబ్బతినటం ఒక అంశం. ప్రపంచీకరణ విధానాలను అమలు చేయడానికి తెలంగాణను ప్రయోగశాలగా ఎన్నుకోవటం, మరొకవైపు అవసరమైనంత విద్యుత్తును అందించకపోవటం కారణంగా వ్యవసాయం నష్టపోవడం రెండవ అంశం. దీని మూలంగా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారనీ, అవి ప్రభుత్వ హత్యలే అని ప్రకటించడం మూడవ అంశం. నీరు, కరెంటు అందివ్వకుండా, సబ్సిడీలు ఇవ్వకుండా, దళారీ వ్యవస్థను ప్రోత్సహించడం ద్వారా, గిట్టుబాటు ధరలు నిర్ణయించకుండా ఉండటం ద్వారా సీమాంధ్ర పాలకవర్గాలే తెలంగాణ వ్యవసాయాన్ని దెబ్బతీశాయని చెప్పటం ఈ కవిత్వంలో స్థూల భావన.

16. సీమాంధ్ర పాలనలో తెలంగాణ భూములు ఆక్రమణకు గురయ్యాయనీ, తెలంగాణ భూములను తెలంగాణవారికే చెందకుండా చేశారనీ చెప్పడం ఈ కవిత్వంలోని మరొక భావన. ఇందులో విభిన్నమైన అంశాలు ఇమిడి ఉన్నాయి. తెలంగాణలో చాలా సారవంతమైన నల్లరేగడి భూములు ఉన్నాయి. నిజాం కాలంలోనే ఉత్తర తెలంగాణలో ప్రారంభమైన వలస వచ్చినవాళ్ల భూ వ్యాపారం, సీమాంధ్రులకు పాలనాధికారాలు

దక్కాక పూర్తిగా విస్తరించిందని చెప్పడం ఒక అంశం. మొదట వ్యవసాయ భూములు ఆక్రమించినది సీమాంధ్ర సంపన్న రైతులు. ఆ తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని ప్రవేశపెట్టి, తెలంగాణలోని అన్ని పట్టణాల్లోని, పరిసర ప్రాంతాల్లోని భూములను ఆక్రమించుకున్నారని చెప్పడం రెండవ అంశం. ప్రత్యేక ఆర్థిక మండలాల (సెజ్ – స్పెషియల్ ఎకనామికల్ జోన్) కోసమని ప్రభుత్వాలే స్వయంగా రంగంలోకి దిగి, బలవంతంగా ప్రజల వ్యవసాయ భూములను లాక్కుని బహుళజాతి కంపెనీలకు, సీమాంధ్ర బడా వ్యాపారవేత్తలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అప్పజెప్పింది అని చెప్పడం మూడవ అంశం. మట్టితో తరతరాల అనుబంధం పెనవేసుకుపోయిన తెలంగాణ రైతులు తమ భూములు కోల్పోవడం ద్వారా జీవితాల్నే కోల్పోవలసి వచ్చిందని చెప్పడం నాలుగవ అంశం. స్థూలంగా ఈ కవిత్వమంతా తెలంగాణ భూమి తెలంగాణకే దక్కాలి అనే సారంతో నిండి ఉన్నది.

17. తెలంగాణలో ఉత్పత్తి అయిన, తెలంగాణకు న్యాయబద్ధంగా చెందవల్సిన విద్యుత్తు తెలంగాణకు అందకుండా పోతున్నదని చెప్పడం ఈ కవిత్వంలోని మరొక మౌలిక భావన. ఇందులో ప్రపంచీకరణలో భాగంగా తీసుకువచ్చిన విద్యుత్ రంగ ప్రైవేటీకరణను వ్యతిరేకించడం కూడా కీలకంగా కనిపిస్తుంది.

18. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలోనే అతి కీలకమైన భాగం ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వం. ఇది కేవలం ప్రపంచీకరణ కాదనీ, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ అని చెప్పడం మౌలికమైన భావన. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ అన్న మూడు పనులను, ప్రపంచీకరణ అనే మృదుత్వం ఉన్న పేరుమీద జరిపారనీ, ఇది ప్రజా జీవన విధ్వంసక విధానమని చెప్పటం ఈ కవిత్వంలో కనిపిస్తుంది. అన్ని జీవన రంగాలను వ్యాపారమయం చేయడంతోపాటుగా, ఆ వ్యాపారానికి అనువైన మానవ చైతన్యాన్ని తయారు చేయడం కోసం సాంస్కృతిక విధ్వంసానికి కూడా పాల్పడిందని చెప్పడం ఈ కవిత్వంలో తీవ్రస్థాయిలో కనిపిస్తుంది. ఈ కవిత్వం ఎక్కువగా 1995 – 2009 మధ్య కాలంలో వచ్చినట్లు, అది కూడా మార్క్సిస్టు కవులు ఎక్కువగా రాసినట్లు తెలుస్తున్నది.

19. కరువు వలసలు, వాటి నేపథ్యం, పనిక్షేత్రాల్లో వలసజీవుల కడగండ్లు మొదలైనవాటిని గురించి కూడా ప్రత్యేక తెలంగాణ కవిత్వంలో విస్తృతమైన చిత్రణ ఉన్నది. ఇందులో కూడా తెలంగాణ కవులు భిన్నమైన పార్శ్వాలను కవిత్వీకరించారు. తెలంగాణలో ఉన్న కరువు సహజ కరువు (ప్రాకృతికమైనది) కాదని, సీమాంధ్ర పాలకుల పక్షపాత పాలనవలన ఏర్పడిందని, కొనసాగుతున్నదని చెప్పడం ఈ కవిత్వంలో ఒక భాగం. నిజానికి తెలంగాణలో ఉన్న జలసంపదను, తెలంగాణలో ఉత్పత్తి అయిన విద్యుత్తును, తెలంగాణకే చెందిన సారవంతమైన భూముల్ని తెలంగాణ వ్యవసాయానికి మిగిల్చి ఉండినట్లయితే తెలంగాణలో కరువు ఏర్పడి ఉండేది కాదని ఈ భాగంలో స్పష్టం చేశారు. వలసల కారణంగా ఊర్లకు ఊర్లే స్మశాన వాతావరణాన్ని తలపిస్తున్నాయని, మానవ సంబంధాల సమూహం (సమాజం) నిర్జీవమైపోతున్నదని చెప్పడం రెండవ అంశం. వలస వెళ్లినవారు వలస ప్రాంతాల్లో నిర్మాణ రంగంలోని దళారుల అమానవీయమైన వైఖరి కారణంగా కేవలం శ్రమదోపిడీకి మాత్రమే కాకుండా మానసిక హింసకు గురవుతున్నారనీ, మహిళలు లైంగిక దోపిడీకి కూడా గురవుతున్నారని, ఎంతోమంది వలస ప్రాంతాల్లోనే కనుమూస్తున్నా, వారి గోడును పట్టించుకునేవాడే లేడని చెప్పడం మూడవ అంశం. సీమాంధ్ర పాలక వర్గాలు తెలంగాణ పట్ల చూపుతున్న వివక్షను ఎదిరిస్తూ ఉద్యమాలు నిర్మాణం చేసినవాళ్లమీద మాత్రమే కాకుండా యువతరం మొత్తం మీద తీవ్రమైన నిర్బంధం అమలు చేయడం కారణంగా కూడా చాలామంది సొంత ఊర్లను విడిచిపెట్టి వెళ్లిపోవాల్సిన అగత్యం ఏర్పడిందని చెప్పడం నాల్గవ అంశం. స్థూలంగా సీమాంధ్ర పాలకుల వివక్షాపూరితమైన పాలనా విధానాలు, తీవ్రమైన నిర్బంధమే తెలంగాణలో నిరవధిక వలసలకు కారణమని చెప్పడం ఇందులోని సారాంశం.

20. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో తెలంగాణ విద్యారంగంలో జరిగిన విధ్వంసాన్ని శాస్త్రీయంగా చెప్పడం మరొక మౌలికమైన విషయం. భూస్వామ్య రాచరిక పాలనలో వందల సంవత్సరాలు మగ్గిన తెలంగాణలో అక్షరాస్యత శాతం చాలా తక్కువ. స్వయం పాలనలో విద్యావకాశాలు మెరుగవుతాయని భావించిన తెలంగాణ ప్రజలకు సీమాంధ్ర పాలకుల విధానాలు మొండి చెయ్యి చూపాయి. తెలంగాణ విద్యారంగానికి

కేటాయించవల్సిన నిధులను కేటాయించకపోవడం మాత్రమే కాదు, విద్యా ప్రైవేటీకరణ జరపడం మూలంగా విద్యను వ్యాపార సరుకుగా మార్చేశారని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో వసతులను కల్పించకపోవడం ద్వారా ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించారని చెప్పడం ఈ కవిత్వంలో కనిపిస్తుంది. అదే సమయంలో విశ్వవిద్యాలయాల స్థాపనలో కూడా తెలంగాణకు అన్యాయమే జరిగిందని, తెలంగాణలో ఉండవల్సిన అనేక విశ్వవిద్యాలయాన్ని అక్రమంగా, స్వార్థపూరితంగా సీమాంధ్రకు తరలించారని ఈ కవిత్వం స్పష్టం చేస్తుంది. ప్రపంచీకరణలో భాగంగా విద్యార్థుల్ని కేవలం సాంకేతిక రంగం వైపుకు మళ్లించారని, మనిషికి సంస్కారం, చారిత్రక నేపథ్యం, రాజకీయ దృక్పథం అందించే సామాజిక శాస్త్రాలను నిర్లక్ష్యం చేయడం ద్వారా బహుళజాతి కంపెనీలకు అవసరమయ్యే చవకైన మానవ వనరుల్ని, ఒకరకమైన మేధోబానిసల్ని తయారు చేశారని ఈ కవిత్వం నిర్ధారిస్తుంది.

21. ప్రపంచంలోని ఏ ప్రజాస్వామ్య పాలనలోనైనా విద్య, వైద్యం తప్పనిసరిగా ఉచితంగా అందించవల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. కానీ సీమాంధ్రుల పాలనలో అప్పటికే ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్ని నిర్వీర్యం చేయడం, తద్వారా బహుళ అంతస్తుల, మోయలేని ఆర్థిక భారాలు వేసే కార్పొరేట్ ఆసుపత్రుల్ని (వీటి యజమానులు సీమాంధ్ర ప్రాంతానికి చెందినవారే) ప్రోత్సహించడం, పేద, మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి ప్రజలకు వైద్యరంగాన్ని దూరం చేయడం లేదా అత్యంత ప్రియం చేయడం వంటివి జరిగాయని ఈ కవిత్వం వివరిస్తుంది.

22. ఆంధ్రప్రదేశ్‌లో భాగమైన తర్వాత తెలంగాణ ప్రాంత పారిశ్రామిక రంగం ఎంతటి విధ్వంసానికి గురైందో చెప్పడం ఈ కవిత్వంలో కనిపించే మరొక ముఖ్యమైన విషయం. ఇందులో అనేక పార్శ్వాలున్నాయి. నిజాం రాజుల ఏలుబడిలో తెలంగాణ పారిశ్రామిక రంగం అత్యంత అభివృద్ధికరంగా ఉన్నదని, సీమాంధ్ర పాలనలో అది పూర్తిగా దిగజారిపోయిందని చెప్పడం ఒక అంశం. ప్రభుత్వ రంగ పరిశ్రమలను అన్నింటిని మూసివేస్తూ, ప్రేవేటురంగ పరిశ్రమల్ని అభివృద్ధి చేయడం కారణంగా వేలాదిమందికి

ఉపాధి అవకాశాలు లేకుండా పోవడమే కాకుండా, ఉత్పత్తి మరింత ప్రియం అయిపోయింది, వినిమయ సామర్థ్యం తగ్గిపోయింది అని చెప్పడం రెండవ అంశం. తెలంగాణలో సీమాంధ్రులు స్థాపించిన పరిశ్రమల్లో తెలంగాణ నిరుద్యోగులకు అవకాశాలు ఇవ్వలేదు, పైగా వారిని నాన్‌లోకల్స్‌గా గుర్తించడం జరిగింది అని చెప్పడం మూడవ అంశం. తెలంగాణలో ఉన్న విలువైన సహజ వనరుల్ని చిన్నతరహా పరిశ్రమలు స్థాపించడం ద్వారా అనేకమందికి ఉపాధి అవకాశాలు కల్పించడం మాత్రమే కాకుండా ప్రాకృతిక వనరుల శాస్త్రీయ వినియోగం జరిగేది, తద్వారా పారిశ్రామిక రంగం అభివృద్ధి జరిగేది, కానీ సీమాంధ్రుల పక్షపాత పాలనా విధానాలు కేవలం ప్రైవేటు రంగాన్ని మాత్రమే ప్రోత్సహించాయని చెప్పడం నాలుగవ అంశం. పర్యావరణ విధ్వంసాన్ని పట్టించుకోకుండా సీమాంధ్ర బడా వ్యాపారవేత్తలు తెలంగాణ భూభాగంలో స్థాపించిన అనేక రసాయన పరిశ్రమల కారణంగా వాటి పరిసర ప్రాంతాల్లో వాయు, జల, భూ కాలుష్యం విపరీతంగా పెరిగిపోయి జనజీవితం క్లిష్టతరంగా మారిందని చెప్పడం ఐదవ అంశం. స్థూలంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడటం మూలంగానే తెలంగాణ పారిశ్రామిక రంగం పూర్వ వైభవాన్ని సంతరించుకోగలదు అని చెప్పడం ఈ కవిత్వ సారాంశం.

23. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో తరువాతి మౌలిక భావన తెలంగాణ ఉద్యోగ, నిరుద్యోగ సమాజ చిత్రణ. ఇందులోనూ విభిన్నమైన కోణాలు అంతర్భాగంగా కనిపిస్తాయి. నిజాం రాజు భారత సైన్యానికి లొంగిపోయిన తర్వాత తొట్టతొలి సాధారణ ఎన్నికలు జరిగే కాలం మధ్యలో వేలాదిమంది సీమాంధ్ర ఉద్యోగులు వలసవచ్చి తెలంగాణ ఉద్యోగాల్లో పాగా వేసింది మొదలు మలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వరకు అదే పరిస్థితి కొనసాగుతూ రావడాన్ని తెలంగాణోద్యమ కవిత్వం ఒక చారిత్రక డాక్యుమెంటుగా రికార్డు చేయడం మొదటి అంశం. స్థానికులకే ఉద్యోగావకాశాల కల్పన ఉండాలనే నిబంధన నిజాం పాలనా కాలం నుండే (1919) అమలులో ఉన్నప్పటికీ సీమాంధ్ర ఉద్యోగులు అక్రమ ముల్కీ సర్టిఫికెట్లతో తెలంగాణ ఉద్యోగాల్లో చొరబడ్డారనీ, ఆ తరువాత పదోన్నతులు కూడా వారే అనుభవించారనీ ఈ విషయం తెలియజేస్తుంది. పెద్దమనుషుల ఒప్పందంలో చేసుకున్న ఒప్పందాలను తుంగలో తొక్కి తెలంగాణ నిరుద్యోగితకు

అన్యాయం చేశారని చెప్పడం రెండవ విషయం. దాదాపు ఆరు దశాబ్దాలు తెలంగాణ ఉద్యోగాల్లో చొరబడింది కాక మళ్లీ ఆ చొరబాటును చట్టబద్ధం చేసుకోవడం కోసం హైదరాబాద్‌ను ఫ్రీజోన్‌గా ఉంచాలనే వాదన చేస్తున్నారని, దీనికి సీమాంధ్ర పాలకుల వెన్నుదన్నులు కనిపించని శక్తులుగా ఉన్నాయని చెప్పడం మూడవ విషయం. తెలంగాణ ఉద్యోగాల్లో సీమాంధ్రులు ప్రవేశించేటప్పుడు వేలాది, లక్షలాది రూపాయలు చేతులు మారాయని చెప్పడం నాల్గవ విషయం. స్థూలంగా తెలంగాణ ప్రాంతానికి దక్కవల్సిన ఉద్యోగావకాశాలన్నీ తెలంగాణ నిరుద్యోగులకు దక్కకుండా, బ్రిటిష్ పాలిత విద్యావంతులైన సీమాంధ్రులు కాజేసుకుపోయారని చెప్పడం ఈ కవిత్వంలోని మౌలిక తత్త్వం.

24. తెలంగాణ, సీమాంధ్రల మధ్య నడిచిన భాషారాజకీయాలను కేవలం భావోద్రేకంతోనే కాకుండా చారిత్రక దృష్టితో, భాషా శాస్త్ర పరిజ్ఞానంతో చెప్పడం మరొక మౌలికాంశం. తెలంగాణ ఉద్యమ సందర్భంలో సీమాంధ్రులను ఉద్దేశించి మీ భాష వేరు, మా భాష వేరు అని మోసపోయిన బాధలోంచి ధర్మాగ్రహ ప్రకటన చేసిన ఉద్యమకారులు, వాగ్గేయకారులు ఉన్నప్పటికీ కవులు మాత్రం భాషాశాస్త్రావగాహనతోనే కవిత్వం రాశారు. తెలుగు భాష ఒక్కటే అయినప్పటికీ, తెలంగాణ భాషమీద రెండున్నర జిల్లాల, రెండున్నర కులాల భాష ఆధిపత్యం చెలాయించడమేంటి అని ప్రశ్నించడం ఈ కవిత్వంలోని విశేషంగా చెప్పాలి. స్థూలంగా తెలంగాణ మాండలికం వివక్షకు గురికావడాన్ని నిరసిస్తూ, భాషాధిపత్యం వెనుక కనిపించని రాజకీయాల్ని బహిర్గతం చేస్తుందీ కవిత్వం.

25. ప్రత్యేక తెలంగాణోద్యమం, ఉద్యమ కవిత్వం చేసిన చాలా గొప్ప పనుల్లో సాహిత్యానికి సంబంధించిన శాస్త్రీయమైన చర్చను లేవనెత్తడం కీలకమైనది. తెలుగు సాహిత్య చరిత్రల్లో ఇప్పటిదాకా జానపద సాహిత్యానికి ప్రాధాన్యతను ఇవ్వలేదని, ఆ ఆధిపత్య భావన కలిగిన సాహిత్య చరిత్రకారులే తెలంగాణ సాహిత్యాన్ని కూడా చరిత్రలో లేకుండా చేశారని, తెలంగాణకు సంపద్వంతమైన సాహిత్య చరిత్ర ఉన్నదని చెప్పడం ఈ కవిత్వంలోని స్థూల సారాంశం.

26. తెలంగాణలోని పది జిల్లాల్లో అనేక రకాలైన కళా సంపద ఉన్నదనీ, దానిని ఉద్దేశ్యపూర్వకంగానే వివక్షకు గురిచేసి వెనుకపట్టు పట్టించారని చెప్పడం ఈ కవిత్వంలోని మరొక మౌలిక భావన. సినిమా రంగంలో మొత్తం సీమాంధ్రుల ఆధిపత్యాన్నే చెలాయిస్తూ వచ్చారనీ, తెలంగాణ కళలూ, భాష కేవలం హీనపాత్రలకు మాత్రమే ఉపయోగించారని, తద్వారా తెలంగాణ కళల్ని న్యూనపరిచారని చెప్పడం రెండవ విశేషం. 20వ శతాబ్ది మధ్య భాగంలో మొత్తం ప్రపంచం దృష్టిని ఆకర్షించిన తెలంగాణ రైతాంగ పోరాటం అద్భుతమైన ప్రజా కళారూపాల్ని సృష్టించి, ప్రజల్లోకి తీసుకెళ్లింది, కానీ కళారంగ చరిత్రలో దానికి స్థానం లేకుండా చేశారని చెప్పడం మూడవ విశేషం. చారిత్రకంగానే తెలంగాణకు అత్యద్భుతమైన నిర్మాణ కళ ఉన్నదని, దానికి ప్రభుత్వాలు సహకరించి ఉంటే ఇవాళ ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందడమే కాకుండా కళాకారులకు జీవనభృతి దొరికేదనీ, సీమాంధ్ర ప్రభుత్వాలు ఈ రంగాన్ని అసలు పట్టించుకోలేదని చెప్పడం నాలుగవ విశేషం. స్థూలంగా సీమాంధ్ర పాలకులు చారిత్రకంగా తెలంగాణ ప్రాంతానికి ఉన్న కళారంగ చరిత్రను ముందుకు తీసుకుపోలేదు, పైగా ఉన్నదానిని నాశనం చేశారు అని చెప్పడం ఈ కవిత్వంలో కనిపించే ముఖ్యమైన భావన.

27. ఆరు దశాబ్దాల ఉమ్మడి జీవనంలో తెలంగాణ సంస్కృతి దారుణంగా పరాయీకరణకు గురైందని చెప్పడం ఈ కవిత్వంలోని మరొక మౌలికాశం. ఏ ప్రజా సమూహానికైనా సంస్కృతే నడిపించే చోదక శక్తిగా పనిచేస్తూ ఉంటుందనీ, అటువంటిది ఆ సమూహానికి తనదైన సంస్కృతిని కోల్పోవల్సి రావడం కన్నా విషాదం మరొకటి ఉండదు అని చెప్పడం మొదటి అంశం. తెలంగాణలోని శ్రామిక ప్రజల పండుగల్ని ధ్వంసం చేసి సీమాంధ్ర పండుగల్ని ఉమ్మడి సంస్కృతి పేరుమీద తెలంగాణ ప్రజల మీద రుద్దారని చెప్పడం రెండవ అంశం. పాఠశాలల్లో, కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో తెలంగాణ విద్యార్థులు అనేక ఇతర భాషల మాదిరిగానే (ఆంగ్లం, హిందీ) అర్థంకాని (సీమాంధ్ర) తెలుగులో పాఠ్యాంశాలు చదువుకోవాల్సిరావడం శోచనీయమని చెప్పడం మూడవ అంశం. ప్రపంచీకరణ సంస్కృతిని ప్రవేశపెట్టడం ద్వారా మొత్తం తెలంగాణ సమాజ సంస్కృతిని నాశనం చేసి వ్యాపార సంస్కృతిని ప్రవేశపెట్టారనీ, దానివలన మొత్తం మానవీయమైన

విలువలకే మోసం వచ్చిపడిందని చెప్పడం నాలుగవ అంశం. స్థూలంగా ఈ ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వమంతా తెలంగాణ సాంస్కృతిక కోణాన్ని విశదీకరిస్తూనే, రాష్ట్రం ఏర్పడితే ఉండబోయే లేదా పునరుద్ధరించుకోబోయే సంస్కృతి గురించి కూడా చెప్తుంది.

28. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలోని మరొక మౌలిక భావన ఆదివాసుల పరిస్థితి చిత్రణ. ఇందులో కూడా భిన్నమైన అంశాలు అంతర్భాగంగా ఉన్నాయి. నిజాం కాలంలోనే తమ జీవనానికి అడ్డంకులు ఎదుర్కున్న ఆదివాసులు స్వయం పాలనలో ఆ పరిస్థితి మారుతుందనుకున్నారు, కానీ పరిస్థితి ముందటికంటే దయనీయంగా తరాయరైందని చెప్పడం ఒక అంశం. ఆదివాసులు నివసించే అడవీ ప్రాంతంలో భూగర్భంలో విలువైన ఖనిజాలు ఉండటం వల్ల, వాటని దోచుకోవాలనే కుట్రతోనే సీమాంధ్ర ప్రభుత్వాలు కవ్వాల్ వంటి అభయారణ్యాల ప్రకటనలు చేశారని, ఖనిజాల దాహంతోనే ఆదివాసుల్ని నిర్వాసితుల్ని చేస్తున్నారని చెప్పడం రెండవ అంశం. ప్రపంచంలోని ఏ ప్రజాస్వామిక ఉద్యమానికైనా పునాదులు వేసింది ఆదివాసులే అని చెప్పడం మూడవ అంశం. పోలవరం వంటి భారీ ప్రాజెక్టుల నిర్మాణం కారణంగా నష్టపోయేది మిగతా సమాజం కంటే ఆదివాసులే ఎక్కువ అని చెప్పడం నాల్గవ అంశం.

29. తెలంగాణలో ఉన్న ఖనిజ వనరుల దోపిడీని వివరించేది మరొక ముఖ్యమైన విషయం. ఇందులోనూ భిన్నమైన పార్శ్వాలు ఉన్నాయి. తెలంగాణ ప్రాంతంలో లభించే బొగ్గు, క్వార్ట్జ్, సీసం, రాగి, డోలమైట్, ఇనుము, గ్రానైట్, అభ్రకం వంటి ఎన్నో ఖనిజాలను సీమాంధ్ర ప్రభుత్వాలు అక్రమంగా దోచుకున్నాయని చెప్పడం ఒక అంశం. ఓపెన్ కాస్ట్ మైనింగ్ ద్వారా భూ, వాయు, జల కాలుష్యానికి పాల్పడి తెలంగాణ ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారని చెప్పడం రెండవ అంశం. సీమాంధ్ర ప్రయోజనాలకోసం ఉపయోగపడుతున్న సింగరేణి బొగ్గుగనుల్లో బొగ్గును వెలికితీయడంలో కార్మికులు చేస్తున్న త్యాగాల గురించి చెప్పడం మూడవ అంశం. ఈ ఖనిజ వనరుల దోపిడీ చేస్తున్న సీమాంధ్ర రాజకీయ వ్యాపారవేత్తలను నిలువరించే శక్తి కూడా తెలంగాణ ప్రజలకు ఉన్నదని తెలియజెప్పడం నాల్గవ అంశం. స్థూలంగా ఈ కవిత్వమంతా తెలంగాణ

ప్రాంత ఖనిజ నిక్షేపాల్ని తెలంగాణ ప్రజల ప్రయోజనాలకే వినియోగించాలని చెప్తున్నది.

30. తెలంగాణోద్యమ కవిత్వంలో కనిపించే ప్రధాన భావనల్లో హైదరాబాదుకు సంబంధించిన రాజకీయాల చర్చ ఒకటి. ఇందులోనూ భిన్నమైన కోణాలున్నాయి. భిన్న సంస్కృతుల సమ్మేళన జీవన విధానం హైదరాబాద్ సొంతమని, అందుకే అది భారతదేశంలోని ఏ ప్రాంత ప్రజల్నైనా ఆదరించి, అన్నంపెట్టే కన్నతల్లిగా కనిపిస్తుందని చెప్పడం ఒక అంశం. హైదరాబాద్‌లోని మంచినీటి జలాశయమైన హుస్సేన్ సాగర్‌ను మురికినీటి జలాశయంగా మార్చింది సీమాంధ్ర పెట్టుబడిదారుల పరిశ్రమల రసాయనాలు, ఐదు నక్షత్రాల హోటళ్ల వ్యర్థాలేనని చెప్పడం రెండవ అంశం. హైదరాబాద్‌లోనూ, పరిసర ప్రాంతాల్లోనూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి తెలంగాణ భూములు మొత్తం ఆక్రమించారని చెప్పడం మూడవ అంశం. ఇందులో భాగంగా భూ వ్యాపారంలో రింగురోడ్డు, ఫిల్మ్ సిటీలు, ఫామ్‌హౌస్‌లు, రిసార్ట్‌లు నిర్మించడం వ్యూహాలుగా అర్థం చేసుకోవాలని చెప్పడం అంతర్భాగంగా ఉన్నది. హైదరాబాద్‌లో వాతావరణ కాలుష్యం చేస్తున్నవారిలో ఎక్కువ భాగం సీమాంధ్రులే ఉన్నారని చెప్పడం నాల్గవ అంశం. హైదరాబాద్‌లోని చిరువ్యాపారుల నడ్డి విరుస్తూ షాపింగ్ మాల్స్‌ని నిర్మించింది సీమాంధ్ర బడా వ్యాపారవేత్తలే అని చెప్పడం ఐదవ అంశం. కళాసాంస్కృతిక రంగాల్ని వివక్షకు గురిచేయడంతోపాటుగా, తెలంగాణ భూముల్ని అక్రమంగా ఆక్రమించుకుని సినిమా నిర్మాణాల కోసం స్టూడియోలు (రామోజీ ఫిల్మ్ సిటీ, అన్నపూర్ణ స్టూడియో, పద్మాలయ స్టూడియో, రామానాయుడు స్టూడియో వంటివి) నిర్మించారు. ఈ నిర్మాణాలకు ఆక్రమించుకున్న భూమి మొత్తం తెలంగాణ మూలవాసులదే అని చెప్పడం ఐదవ అంశం. హైదరాబాద్ ఫ్రీజోన్ కాదని, తెలంగాణలోని ఆవర జోన్‌లో భాగమే అని తెలియజేయడం ఆరవ అంశం. ఇందులో భాగంగా కీలకమైన విషయాల్ని చర్చించారు. సీమాంధ్ర బడా పెట్టుబడిదారులు హైదరాబాద్‌ను ఫ్రీజోన్‌గా ఉంచాలనీ కొట్లాడటం, లేదా యూటీ చేయాలని అడగటం కానీ వీటి వెనుక ఉన్నది వేరే లక్ష్యం, సీమాంధ్ర అక్రమ భూ ఆక్రమణలు, అక్రమ భవన నిర్మాణ అనుమతులు, అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణ, ఫ్లోర్ స్పేస్ కండీషన్స్ వెసులుబాటు, మాస్టర్ ప్లాన్ ఉల్లంఘన వంటి స్వార్థ ప్రయోజనాలకు

రక్షణ కావాలి, కనుక హైదరాబాద్‌ను ఫ్రీజోన్‌గా ఉంచినా, యుటి చేసినా వారికి ఈ రక్షణ దొరకుతుంది, కనుకనే సమైక్యరాగంలో ఈ వివాదాన్ని ముందుకు తీసుకువచ్చారు అని చెప్పడం ఇందులో అంతర్భాగం. స్థూలంగా హైదరాబాద్ తెలంగాణ ప్రజలు తమ రక్తమాంసాలతో నిర్మించుకున్నది అనీ, హైదరాబాద్‌తో కూడిన తెలంగాణే మాకు కావాలి అని చెప్పడం ఈ కవిత్వంలో బలంగా కనిపిస్తుంది.

31. చరిత్ర రచనలో తెలంగాణకు అన్యాయం జరిగిందని చెప్పడం ఈ కవిత్వంలో కనిపించే మరొక మౌలిక భావన. ఇందులో భిన్నమైన దృక్కోణాలు ఉన్నాయి. క్రీ.పూ. 6వ శతాబ్ది నుండి తెలంగాణకు సంబంధించిన చారిత్రక ఆధారాలు ఇప్పటికే లభ్యమై ఉన్నా చరిత్ర రచనలో మాత్రం తెలంగాణకు తక్కువ ప్రాధాన్యతను ఇచ్చి, సీమాంధ్ర చరిత్రనే తెలుగు ప్రజల చరిత్రగా రాశారని చెప్పడం ఒక అంశం. తెలంగాణ సాహిత్యకారులకు సాహిత్య చరిత్రలో సముచిత స్థానం ఇవ్వలేదన్నది రెండవ అంశం. స్థూలంగా ఈ కవిత్వమంతా తెలుగు ప్రజల చరిత్ర పుస్తకాల్లో, తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ఎండగడుతూనే, తమ ప్రాంతానికి ఉన్న ప్రాచీన చరిత్రను కీర్తిస్తూనే, తమ చరిత్రను తామే రాసుకున్నప్పుడు మాత్రమే తెలంగాణ చరిత్రకు న్యాయం జరగుతుందని తీర్మాణించింది. ఇది ప్రత్యేక తెలంగాణ ఏర్పాటులోనే సులువుగా సాధ్యం అవుతుందని కూడా అంతర్గతంగా సూత్రీకరించింది.

32. తెలంగాణోద్యమ కవిత్వంలో మరొక మౌలిక భావన నిధుల కేటాయింపుల్లో అసమానతలు. ఇందులో భిన్నమైన దృక్కోణాలున్నాయి. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నాటినుండి ఏ ఒక్క సంవత్సరంలోనూ మొత్తం నిధుల కేటాయింపులలో తెలంగాణ జనాభా నిష్పత్తి ప్రకారం 40 శాతం వాటాగాని, విస్తీర్ణం నిష్పత్తి ప్రకారం 42 శాతం వాటాగాని, రెవెన్యూ వసూళ్ల ప్రకారం 40 శాతం వాటాగాని అందలేదు అని చెప్పడం ఒక అంశం. ఈ సందర్భంలో తెలంగాణ నుంచి వచ్చే ఆదాయపు మిగులును తెలంగాణలోనే ఖర్చు పెట్టాలని పెద్దమనుషుల ఒప్పందంలో రాసుకున్నప్పటికీ, ఆ ఒప్పదం అమలు కాలేదనీ, దీని కారణంగా స్వాంతత్ర్యానికి పూర్వం తెలంగాణ అభివృద్ధి ఎలా

ఉన్నదో, స్వాతంత్ర్యం వచ్చాక, భారత ప్రభుత్వ ప్రజాస్వామ్య పాలనలో కూడా తెలంగాణ పరిస్థితి అలాగే ఉండిపోయింది అని చెప్పారు. నీటిపారుదల విషయంలో జరిగిన అన్యాయం కారణంగా తెలంగాణ వ్యవసాయం దాదాపుగా వర్షాధారంమీదనే ఆధారపడవల్సి వచ్చిందనీ, ఇటువంటి సందర్భంలో ప్రభుత్వ బాధ్యత, రైతులకు రాయితీలు ఇవ్వాలనీ, కానీ తెలంగాణ వ్యవసాయానికి ఎటువంటి రాయితీలు లభించకపోవడం కారణంగా వందలాదిమంది అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడ్డారు, అయినా సీమాంధ్ర ప్రభుత్వాలు చలించలేదని చెప్పడం రెండవ అంశం. ఒకవైపు సీమాంధ్ర పాలకవర్గాలు తెలంగాణకు నిధుల కేటాయింపుల్లో వివక్ష చూపిస్తుంటే, ప్రశ్నించవల్సిన తెలంగాణ ప్రాంత ప్రజా ప్రతినిధులు చెంచాల పాత్ర నిర్వహించారని చెప్పడం మూడవ అంశం. స్థూలంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కాంక్షకు నిధుల కేటాయింపులో జరిగిన అన్యాయాలు కూడా ఒక మౌలికమైన కారణం అని ఈ కవిత్వం స్పష్టం చేస్తున్నది.

33. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో కనిపించిన మరొక మౌలిక భావన ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు సమయంలో చేసుకున్న ఒప్పందాలు ఉల్లంఘనకు గురికావడం, తెలంగాణ ప్రయోజనాలకోసం తీసుకువచ్చిన జీవోలు, హామీలు, కమిటీలు, కమీషన్‌లు ఏవీ తెలంగాణకు న్యాయం చేయలేకపోయాయని, పైగా ఇవన్నీ ఆయా సందర్భాల్లో ప్రత్యేక తెలంగాణ వాదాన్ని, ఉద్యమాన్ని నీరుగార్చడం కోసమే వచ్చాయని చెప్పడం.

34. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలోని మరొక మౌలిక భావన పాలకవర్గ రాజకీయాల్ని విమర్శకు పెట్టడం. ఇందులోనూ అనేక విభాగాలున్నాయి. 57 సంవత్సరాలు ఆంధ్రప్రదేశ్‌ను పాలించిన ముఖ్యమంత్రుల్లో సీమాంధ్ర పాలకుల ఆధిపత్యమే ఉన్నదని చెప్పడం మొదటి అంశం. ఇందులో భాగంగా 41 సంవత్సరాలు కాంగ్రెస్, 16 సంవత్సరాలు తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్‌ను పరిపాలించాయనీ, ఈ రెండు పార్టీలూ ఆంధ్రప్రదేశ్‌కు పరిచయం అయినప్పటి నుండే సీమాంధ్ర పార్టీలుగా పనిచేశాయనీ, రాష్ట్రంలోని ఇతర పెద్ద పార్టీలైన బీజేపీ, టీఆర్ఎస్, మజ్లిస్, సీపీఐ, సీపీఎం, లోక్‌సత్తా, వైఎస్ఆర్ కాంగ్రెస్‌లు ఎన్నిక సందర్భంలో కూటముల్లో భాగాస్వాములుగానో, ఒంటరిగానో

పోటీ చేస్తూ వచ్చాయిగానీ వాటికి ఏనాడూ పరిపాలనాధికారాలు చేజిక్కలేదనీ, అంటే మొత్తంగా ఆంధ్రప్రదేశ్ పరిపాలనాధికారాలు రెండు తెలంగాణ వ్యతిరేక పార్టీల చేతుల్లోనే ఉంటూ వచ్చాయని చెప్పారు. తెలంగాణ ప్రాంతం నుండి ముఖ్యమంత్రులు పనిచేసినా, వారు కూడా సీమాంధ్ర పెద్దల కనుసన్నల్లోనే మెలిగారని, తెలంగాణకు ఏం న్యాయం చేయలేని నిస్సహాయ స్థితిలోనే ఉండిపోయారని చెప్పడం రెండవ అంశం. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసినప్పుడల్లా, ప్రాంతీయ పార్టీలుగానీ, జాతీయ పార్టీలు గానీ కేంద్రం మీద ఆధారపడ్డాయి తప్పితే, స్వయంగా ఒక తీర్మానం చేసుకుని పనిచేసే స్వతంత్ర్యాన్ని ప్రదర్శించలేదని చెప్పడం మూడవ అంశం. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వచ్చినప్పుడల్లా రెండు తెలుగు ప్రాంతాల్లో ఉన్న రాజకీయ పార్టీల ప్రతినిధులు ద్విపాత్రాభినయం చేశారని చెప్పడం నాల్గవ అంశం. తెలంగాణకు అన్యాయం చేసి, స్థానిక ప్రజల మరణాలకు బాధ్యులైన ప్రభుత్వాలే మళ్లీ ఉపశమన చర్యలకు పాల్గొనడం ఒక కుట్రపూరితమైన వ్యవహారం అని చెప్పడం ఐదవ అంశం. సీమాంధ్ర అధిష్టానం నియంత్రణలో ఉన్న తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం, తెలంగాణ ప్రజల్ని తీవ్ర నిర్బంధానికి గురి చేసిందని చెప్పడం ఆరవ అంశం. ఉద్యమకాలంలో ప్రజలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా పాలకవర్గాలు ఏమాత్రం స్పందించలేదని చెప్పడం ఏడవ అంశం. స్థూలంగా ఈ కవిత్వంలో సీమాంధ్ర ప్రజాప్రతినిధులైనా, తెలంగాణ ప్రజాప్రతినిధులైనా వారు కేవలం సాధారణమైన పాలకవర్గ స్వభావాన్నే కలిగి ఉన్నారనీ, తెలంగాణకు ద్రోహమే తప్ప మేలు చేయలేదని చెప్పడం ఈ కవిత్వ సారాంశం.

35. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో కనిపించే మరొక మౌలిక భావన రాజ్యం ప్రయోగించిన నిర్బంధాన్ని, రాజ్యహింసను విమర్శనాత్మకంగా వ్యాఖ్యానించడం. ఇందులో భిన్నమైన కోణాలున్నాయి. సీమాంధ్ర పాలక వర్గాలు, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మీదనే కాకుండా అనేక అస్తిత్వ ఉద్యమాల, పౌర హక్కుల ఉద్యమాల నాయకత్వాలను కూడా చంపేస్తూ పోవడమో, అక్రమ కేసులు బనాయించి, నల్ల చట్టాలు అమలు చేసి జైల్లకు పంపడమో చేశారని చెప్పడం మొదటి అంశం. సీమాంధ్ర ప్రభుత్వాలు తెలంగాణలో ఏ ఉద్యమం వచ్చినా సమస్య మూలాల్ని అన్వేషించి, పరిష్కారాల్ని కనిపెట్టం అన్న పద్ధతి

మీద కాకుండా కేవలం అణచివేత ధోరణి మీదనే ఆధారపడిందని చెప్పడం రెండవ అంశం. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ తొలిదశలో పోలీసులే లాఠీచార్జీలు చేసి, కాల్పులు జరిపి ఉద్యమకారులను హతమార్చారనీ, మలిదశ పూర్వార్ధంలో కూడా బూటకపు ఎన్‌కౌంటర్‌లు చేసి, హత్యలు చేసి తెలంగాణ ఉద్యమకారుల్ని చంపేశారనీ, కానీ మలిదశ ఉత్తరార్ధ ఉద్యమంలో ఆత్మహత్యలు చేసుకునే విధంగా ప్రేరేపించారనీ, వీటిని ప్రభుత్వ హత్యలుగానే గుర్తించాలని తీర్మాణించడం మూడవ అంశం. తెలంగాణ ఉద్యమకారులను చంపడానికి సీమాంధ్ర ప్రభుత్వం వాళ్లకు పెట్టిన పేరు విప్లవకారులనీ, భారత శిక్షా స్మృతి ప్రకారం విప్లవకారులైనా, మరెవరైనా చంపడానికి పోలీసులకు అధికారాలు లేవనీ, వాళ్లను అరెస్టు చేసి న్యాయస్థానాల ముందు నిలబెట్టాలి, ఆ తర్వాత న్యాయాన్యాయాలు న్యాయస్థానాలు చూసుకుంటాయనీ, కానీ తెలంగాణలో న్యాయస్థానాల విధులను కూడా పోలీసులే చేతుల్లోకి తీసుకున్నారనీ, ఈ పోలీసులకు అండగా ఉన్నది సీమాంధ్ర ప్రభుత్వమే అని చెప్పడం నాలుగవ అంశం. పాలకవర్గాలు అనుసరించిన అణచివేత విధానాల కారణంగానే తెలంగాణలో విప్లవోద్యమం పురుడుపోసుకున్నదని చెప్పడం ఐదవ అంశం. తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో అందరు ఉద్యమకారుల మీద నిర్బంధం ప్రయోగించారని, మలిదశ పూర్వార్ధంలో ఎక్కువగా మేధావులు, కళాకారులనే లక్ష్యం చేసుకున్నారని, మలిదశ ఉత్తరరార్ధంలో మళ్లీ అందరిమీద నిర్బంధం ప్రయోగించారని చెప్పడం ఆరవ అంశం. ఇందులో భాగంగా మలిదశ పూర్వార్ధంలో ఉద్యమాన్ని వ్యాప్తి చేయడంలో మేధావులు, కళాకారులు ముందున్నారు కాబట్టే వారిని లక్ష్యం చేసుకున్నారని చెప్పడం ఉన్నది. మొత్తంగా చూసినప్పుడు ఈ కవిత్వం నిండా తెలంగాణలో సీమాంధ్ర పాలకులు ప్రయోగించిన హింసనూ, హింసా సాధనాల్ని తెలియజేయడంతోపాటు ప్రభుత్వ విధానాల పర్యవసానమే ఉద్యమాలు అని ప్రకటించడం కనిపిస్తుంది.

36. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కవిత్వంలో కనిపించే మరొక ముఖ్యమైన భావన హక్కుల ఉల్లంఘన గురించి చెప్పడం. ఇందులో అనేక దృక్కోణాలు ఉన్నాయి. భారత రాజ్యాంగం భారత ప్రజలందరికీ కల్పించిన భావప్రకటనా హక్కు, జీవించే హక్కు, సభలూ, సమావేశాలూ నిర్వహించుకునే హక్కు మొదలైన హక్కుల్ని తెలంగాణ ప్రజలకు లేకుండా

చేశారని చెప్పడం మొదటి అంశం. ఈ హక్కుల గురించి మాట్లాడినవారిని కూడా హతమార్చారని చెప్పడం రెండవ అంశం.

37. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో ఉన్న మరొక మౌలిక భావన అస్తిత్వ పరివేదన. ఇందులో భాగంగా తెలంగాణోద్యమ కవులు అనేక కోణాల్ని నిక్షిప్తం చేశారు. సీమాంధ్ర పాలకవర్గాలే ప్రపంచీకరణను తీసుకువచ్చి తెలంగాణలోని అనేక సామాజిక రంగాల్ని పరాయీకరణకు గురిచేశారని చెప్పడం ఒక అంశం. ఈ క్రమంలో తెలంగాణ కవులు ప్రపంచీకరణ విధానాల్ని లోతుగా, శాస్త్రీయంగా విమర్శిస్తూ కవిత్వం వెలువడినట్లు తెలుసుకోవచ్చు. తెలంగాణ సాహిత్యం, భాష, రాజకీయాలను విస్మరణకు, వివక్షకు గురిచేయడాన్ని నిరసించడం, స్థానిక చరిత్రను ఎలుగెత్తి చాటడం రెండవ అంశం. తెలంగాణ అస్తిత్వాన్ని, పోరాట వారసత్వాన్ని చారిత్రక కోణంలో కీర్తించడం మూడవ అంశం. స్థూలంగా తెలంగాణ అస్తిత్వాన్ని నిలబెట్టుకునే ప్రయత్నం ఈ కవిత్వంలో కనిపిస్తుంది.

38. తొలిదశ నుండి మలిదశ ఉత్తరార్ధం వరకు నడిచిన, నడుస్తున్న ఉద్యమ గమనాన్ని వివరించడం మరొక మౌలిక భావన. ఇందులో తొలిదశ ఉద్యమం నుండి తీసుకోవల్సిన స్ఫూర్తిని, మలిదశ పూర్వార్ధంలో తెలంగాణ వీరులు చేసిన త్యాగాల్ని, ఉత్తరార్ధంలో నడుస్తున్న ఉద్యమంలోని సృజనాత్మకతనూ, నవీన సంప్రదాయాల్ని ఎత్తిపట్టడం కనిపిస్తుంది. భవిష్యత్తు సామాజిక ఉద్యమాలు నిర్వహించడానికి ఎత్తుగడల్నీ, వ్యూహాల్నీ, అనుసరించవల్సిన రాజకీయ కార్యక్రమాల్ని నూరిపోసే పని చేసింది.

39. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వంలో మరొక మౌలిక భావన అమరుల కీర్తన (ఎలిజీలు రాయడం). పత్యేక తెలంగాణ ఉద్యమంలో కూడా సుమారు రెండువేల మందికి పైగా అమరులయ్యారు. వారి త్యాగాల్ని కీర్తిస్తూనే, ఆ అమరత్వం సాధించబోయే భవిష్యత్తు సాకారాలను కూడా ఎత్తి పట్టింది.

40. అనేక చేదు అనుభవాలను ఎదుర్కొన్నాం, ఇక వేరు తెలంగాణ తప్ప తెలంగాణ ప్రజలకు ఇతరేతర పరిష్కారాలేవీ న్యాయం చేయలేవని చెప్పడం మరొక మౌలిక భావన.

41. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వం ప్రజాస్వామిక తెలంగాణను కోరుకున్నది.

42. ప్రత్యేక తెలంగాణోద్యమ కవిత్వ లక్షణాల్లో ముఖ్యమైనవి అమరవీరులను స్మరించుకోవటం, నాస్టాల్జియాతో రాయటం.

43. వచన కవిత్వం ప్రధానంగా చదువుకున్న మధ్యతరగతి బుద్ధిజీవుల సాహిత్య ప్రక్రియ. ఈ భావనను స్వీకృత కవిత్వం కొంతమేరకు పూర్వపక్షం చేసే ప్రయత్నం చేసింది. నందిని సిధారెడ్డి, వంశీకృష్ణ, కాశీం, సుంకిరెడ్డి నారాయణ రెడ్డి లాంటి సీనియర్ కవులతోపాటు ఉద్యమంలోనే రూపుదిద్దుకున్న ప్రతిభావంతమైన కవులు చాలామంది పుష్కలమైన కవితా విలువలతో రాసిననప్పటికీ, అద్భుతమైన టెక్నిక్‌ను ప్రయోగించినప్పటికీ వీరి కవిత్వం కవితా పామరులను కూడా ఆకర్షించగలిగింది.

## 10. అనుబంధం(Annexure) – I

మొదటి అనుబంధంలో ప్రత్యేక తెలంగాణోద్యమ ఛాయాచిత్రాలను పొందుపరిచాను. ఇందులో మూడు విభాగాలున్నాయి.

1. తొలిదశ ఉద్యమ చిత్రాలు
2. మలిదశ పూర్వార్ధ ఉద్యమ చిత్రాలు
3. మలిదశ ఉత్తరార్ధ ఉద్యమ చిత్రాలు

## 11. అనుబంధం(Annexure) – II

ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక భాగస్వాములవుతూ, నాయకత్వం

వహిస్తూ, ప్రజారాశుల్ని చైతన్యం చేసి ఉద్యమంలోకి కదిలిస్తూ, కవిత్వం రాస్తూ, తెలంగాణ సాహిత్య చరిత్ర నిర్మాణంలో విశేషమైన కృషి చేస్తూ ఉన్న ప్రముఖమైన ముగ్గురు వ్యక్తుల ముఖాముఖి సమావేశాల (ఇంటర్వ్యూ) పూర్తి పాఠాలను రెండవ అనుబంధంగా చేర్చాను. వారి ఇంటర్వ్యూలు చేయడం కోసం తయారు చేసుకున్న ప్రశ్నావళిని కూడా ఇందులో జతపరిచాను. ఇందులో సంగిశెట్టి శ్రీనివాస్, డా॥సి.కాశీం, డా॥ పి.వరవరరావుల ఇంటర్వ్యూలు ఉన్నాయి.

## 12. సంక్షిప్త ఉపయుక్త గ్రంథసూచి(Bibliography)

ఈ పరిశోధనలో రాసిన ఉపయుక్త గ్రంథసూచి కూర్పులో 'అమెరికన్ సైకలాజికల్ అసోసియేషన్' (American Psychological Style sheet) శైలిని అనుసరించాను.


1. అయిలయ్య, బన్న. 2006. **తెలంగాణ సాహిత్య సాంస్కృతిక చైతన్యం.** వరంగల్. నానీ ప్రచురణలు. ప్రథమ ముద్రణ.
2. కాశీం. 2015. **తెలంగాణ సాహిత్యం. హైదరాబాద్.** స్నేహ ప్రచురణలు. ప్రథమ ముద్రణ.
3. గుడిపాటి. 2006. **అభివ్యక్తి.** హైదరాబాద్. స్పృహ సాహితీ సంస్థ. ప్రథమ ముద్రణ.
4. చంద్రశేఖరరెడ్డి, రాచపాళెం. 2016. **కవుల తెలంగాణం.** హైదరాబాదు. నవచేతన పబ్లిషింగ్ హౌస్. ప్రథమ ముద్రణ.
5. జయశంకర్, కొత్తపల్లి. 2015. **తెలంగాణ రాష్ట్రం ఒక డిమాండ్.** హైదరాబాద్. సంగం మీడియా గ్రూప్. తృతీయ ముద్రణ.
6. నారాయణరెడ్డి, సుంకిరెడ్డి. 2012. **తెలంగాణ సాహిత్య చరిత్ర.** హైదరాబాద్. తెలుగు అకాడమి. ప్రథమ ముద్రణ.
7. ప్రతాపరెడ్డి, కాసుల. 2002. **కొలుపు.** హైదరాబాద్. శైలీ పబ్లికేషన్స్. ప్రథమ ముద్రణ.

8. వేణుగోపాల్, ఎన్. 2010. **లేచినిలిచిన తెలంగాణ.** హైదరాబాద్. స్వేచ్ఛా సాహితి. ప్రథమ ముద్రణ.

9. శోభాగాంధీ. 2010. **ప్రత్యేక తెలంగాణ ఉద్యమాల చరిత్ర.** హైదరాబాద్. గాంధి పబ్లికేషన్స్. నాలుగవ ముద్రణ.

10. శ్రీధరరావు, దేశ్‌పాండే. 2008. **తెలంగాణ రాజకయ ఆర్థిక సామాజిక వ్యాసాలు.** హైదరాబాద్. తెలంగాణ విద్యావంతుల వేదిక. ప్రథమ ముద్రణ.

11. శ్రీనివాస్, సంగిశెట్టి(సంపా). 2009. **1969 – 1973 తెలంగాణ ఉద్యమ కవిత్వం.** హైదరాబాద్. సింగిడి తెలంగాణ రచయితల సంఘం. ప్రథమ ముద్రణ.

12. శ్రీహరి, రవ్వా (సంపా). 2016. **తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర.** హైదరాబాద్. తెలుగు అకాడమి. ప్రథమ ముద్రణ.